
రామాయణం

# రామాయణం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

**http://ebooks.tirumala.org**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# రామాయణం

ఉషశ్రీ



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# రామాయణము

ఉషశ్రీ

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2008

**RAMAYANAM** (Telugu)

by
**Ushasri**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 15

| | | |
|---|---|---|
| First Edition | : | 1973 |
| Second Edition | : | 1982 |
| Third Edition | : | 1990 |
| Re-Prints | : | 2002,2003,2004,2006, 2008 |

Copies 10 000

Published by:
**Sri A.P.V.N. Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

Printed at : Students Offset Printers
Tirupati

# ముందుమాట

రామచరితం రసభరితం. రామాయణంలాగ లోక వ్యవహారాన్ని విస్పష్టంగా బోధించే కావ్యం మరొకటి లేదు. ఆదికవి వాల్మీకినుంచి నేటివరకూ రమణీయమైన రామకథ పలుభాషలలో, పలురీతులలో రూపుదిద్దుకుంటూ, భారతావనిలోనే కాకుండా భారతీయుల సంస్కృతి ప్రసరించిన అన్యదేశాలలోనూ ప్రచార ప్రశస్తి పొందింది.

రామాయణం ఆదికావ్యం. వాల్మీకిమహర్షి ఈ మహాకావ్యాన్ని రచించడానికి కారణం బ్రహ్మానుగ్రహం. ఆ తపస్వి తమసానదికి స్నానానికి వెళ్ళగా ఆ నదీతీరాన ఒక కరుణదృశ్యం కంటబడింది. ఎదురుగావున్న చెట్టుకొమ్మమీద క్రీడిస్తున్న క్రౌంచమిథునంలో మగపక్షి, కిరాతకు డొకడు కొట్టిన బాణం దెబ్బతో నేలమీదపడి విలవిల తన్నుకొని ప్రాణాలు విడిచింది. ఆడపక్షి విలపిస్తున్నది. దాని ఆక్రందనానికి మహర్షి హృదయం కరుణార్ద్రమయింది. ఆకస్మికమైన ఆయన హృదయశోకం శ్లోకరూపంగా వెలువడింది.

మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీస్సమాః।
యత్ క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్ ॥

"ఓ నిషాదుడా! కామమోహితమైన క్రౌంచపక్షుల జంటలో ఒక్క దానిని చంపిన నీవు ఎక్కువ సంవత్సరాలు జీవించలేవు సుమా." ఇది కిరాతుడి కిచ్చిన శాపం మాత్రమే కాదు. ఈ శ్లోకంలో రామాయణ కథాసూచకమైన మరో అర్థంకూడా ఉన్నది. అప్పుడాయనకు బ్రహ్మ ప్రత్యక్షమై "నీ నోటినుంచి సరస్వతి వెలువడింది. ఇది నా సంకల్పం. ఇక నీవు రామాయణం వ్రాయి. అది భూతలంలో శాశ్వతంగా ఉంటుంది." అని దీవించి అంతర్హితుడయ్యాడు.

వాల్మీకిమహర్షి ''మా నిషాద'' అనే శ్లోకం ఉచ్చరించేవరకూ వైదిక వాఙ్మయంలోనే కాని లౌకిక వాఙ్మయంలో ఛందోబద్ధమైన వాణి లేదు. రామాయణ కావ్యావతరణకు ఈ క్రౌంచమిథున కథ హేతుభూతమయింది. ఆదికవిగా వాల్మీకి వన్నెకెక్కాడు. మనోహరమైన కవిత్వానందమే కాకుండా మహిమసిద్ధి కూడా ప్రసాదించే మహాగ్రంథం రామాయణం.

తెలుగుదేశంలోనూ, తెలుగువాఙ్మయంలోనూ సీతారాములు ప్రత్యణువులో, ప్రత్యక్షరంలో ప్రకాశించే దైవదంపతులు. రామాయణం చదవడంవల్ల తల్లిదండ్రులపట్ల భక్తి, సోదరప్రీతి, జ్యేష్ఠానువర్తనం, లోకమర్యాదానుసరణం, ప్రతిజ్ఞాపాలనం, ఆశ్రితవాత్సల్యం, స్వామికార్యనిర్వహణం, స్వార్థపరత్వనివృత్తి, చిత్తశుద్ధి, పరోపకారబుద్ధి వంటి అనేక సద్గుణాలు అలవడడానికి అవకాశం ఉన్నది.

సులభసుందరాలూ, భక్తిరసబంధురాలూ అయిన వాక్యాలలో సాగిన ఉషశ్రీ రామాయణం ఆకాశవాణి శ్రోతల నెందరెందరినో ఆకర్షించింది. అత్యుత్తమ భక్తిసాహిత్యాన్ని అందరికీ అందజేయాలనే పథకంలో భాగంగా గతంలో ఈ గ్రంథాన్ని ప్రచురించడం జరిగింది. దృశ్యశ్రవ్యధర్మం కలిగిన ఈ చక్కని వచనరచన సహృదయ హృదయాలను రంజింపచేయగలగడం సహజమే. పునర్ముద్రణ పొందుతున్న ఉషశ్రీ రామాయాణాన్ని పూర్వంలాగే ఆంధ్రపాఠక మహాశయులు ఆదరించగలరని ఆశిస్తున్నాము.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# రామాయణం జరగలేదు!

శతాబ్దులయినవో సహస్రములే సాగినవో రామకథను మహర్షి వాల్మీకి వినిపించి -

ఆ వినిపించిన మహర్షి ఈ లోకంలో ఉన్న మహోదాత్తపురుషుని గాథను గానం చేస్తున్నానని చెప్పాడు. అదిమొదలుగా సీతారాములు సర్వభారతీయులకూ ఆరాధ్య దంపతులయి, దాంపత్యజీవితానికి పర్యాయపదమయినారు. సర్వ పశు పక్షి జాతులనుంచి విడివడి విలక్షణమూ, విశిష్టమూ అయిన జీవితపథాన్ని ఏర్పరచుకున్న మానవజాతికి లభించిన వరం దాంపత్యజీవనం. ఈ జీవనమార్గానికి ఆదర్శంగా నిలిచిన సీతారాములను అందించాడు వాల్మీకి. ఆ జీవనరహస్యాన్నే ఆయన రామాయణం నిండా నిక్షేపించిన అంశాన్ని విస్మరించిన పెద్దలు కొందరు రామకథ జరిగిందా! జరిగితే ఏ శతాబ్దంలో! ఏ ప్రాంతంలో! అనే మీమాంసలతో తమవంటి మేధావుల మనస్సులకు ఉల్లాసం కలిగించే ప్రదర్శనలు కొన్ని జరుపుతున్నారు. పరమసంతోషంతో వారికి చేతులు జోడించి, మహర్షి వాల్మీకి తన కావ్యంలో ఈ దాంపత్యజీవన విశేషాలు ఎలా నిర్దేశించాడో చూద్దాం..

## సీత — తార — మండోదరి

రామాయణంలో ప్రముఖంగా కనిపించే గృహిణులు ఈ ముగ్గురూనూ వీరిలో సీతను అనేకు లెరుగుదురు. తారను కొందరు చూచివుంటారు. మండోదరిని గూర్చి తెలిసినవారు అల్పసంఖ్యాకులే. అయితే ఈ ముగ్గురిలో మన కీ నాడు ప్రపంచంలో కనిపించే గృహిణులందరి ప్రకృతినీ ప్రదర్శించాడు వాల్మీకి.

రాముడు వనవాసానికి వెడుతూంటే ఆ క్లేశాలు అనుభవించడానికి ఆయన వెంట నీడలా వెళ్ళిన సీత భారతీయనారీలోకానికి పతివ్రతాశిరోమణిగా ఆరాధ్యురాలయి పూజామందిరంలో దేవతామూర్తిగా నిలిచింది.

## ఇక తార

నాగరకత పెరిగిన మహానగరాలలో ఈ తార విశ్వరూపము మనకు గోచర మవుతుంది.

వానరరాజుగా ఉన్న వాలికి మహారాణిగా జీవితం గడిపిన తార వాలి మరణించా కేసుకునివచ్చి సింహాసనం ఎక్కిన సుగ్రీవునికి ప్రియురాలుగా హాయిగా జీవితం గడిపింది. తిరిగి వాలి సింహాసనము ఎక్కగా ఆయనతోనే మళ్ళీ శయ్యా సుఖం, రాజభోగాలు అనుభవించింది. వాలి నేలకూలినాడు. సుగ్రీవుడు రాజయాడు. ఆయన అంతఃపురం చేరిందితార సంపద, అధికారం ఉన్న వారివెంట హాయిగా తిరిగే నారీమణులందరికీ తార ప్రతినిధి. భోగాలు అనుభవించడమే వారి జీవితపరమావధి. అవి లేకపోతే వారు జీవించలేరు. ఇటువంటి 'తార' లను ఎందరినో ఈనాడు మనం చూడగలం.

ఇక - రావణగృహిణి ఉన్నది. పతివ్రతలలో ఆవిడ ఆరాధనాపీఠం మీదనే ఉన్నది. కారణం! రావణుడు తీవ్రకాముకుడు, వివిధదేశాలనుంచి లోకాలనురచి సుందరీమణులను బలాత్కరించి తెచ్చి వివిధ విధ మద్యాలు సేవించి, ఈ యువతీమణులతో నిర్విరామంగా జీవితం నడిపే రాక్షసప్రకృతికల రావణుని గృహిణిగా ఎన్నడూ తన ధర్మపథం వీడని యిల్లాలు మందోదరి.

నేటికీ ఎందరో రావణప్రకృతికల త్రాగుబోతులూ, వ్యభిచారులూ అయిన భర్తలను సేవించి బ్రతుకుతున్న మందోదరివంటి అబలలు కనిపిస్తారు. వీరందరి ప్రతిబింబంగా మందోదరిని యిచ్చాడు వాల్మీకి. ఇలా ముగ్గురు స్త్రీలలో మానవ మహిళా ప్రకృతిని అందించిన దార్శనికుడు వాల్మీకి.

ఇలానే భారతీయ సాంసారికజీవితాన్ని ధర్మసంపన్నం చేసుకోవడానికి మార్గదర్శకంగా ఆయన సీతారాములను రామలక్ష్మణులను రామాయణంలో నిక్షేపించగా ఈధర్మానికి ఆ సౌహార్దానికి భయపడి మేధావులమనుకునే మహామహులు ఆ వాల్మీకి కవిచంద్రుని దర్శించలేక విషఫూత్కారాలతో రాహుకేతువులవలె ఆక్రమించజూస్తె ఆ గ్రహణం శాశ్వతమా చంద్రుడు శాశ్వతమా !

ఆ చంద్రకాంతిని దర్శింపజేయడమే మా లక్ష్యం.

ఉ ష శ్రీ



# రామాయణ విశేషాలు

శ్రీ మద్రామాయణంలో ప్రధాన మయిన సీతా రామలక్ష్మణులు మన మనస్సులలో ఎంతగా స్థిరపడ్డారో అంతటి ముద్రనూ వేసినవాడు హనుమంతుడు.

ఈ ప్రముఖపాత్రలేకాక క్షణాలవ్యవధిలో ప్రవేశించి నిష్క్రమించే పాత్రలు సైతం తమ రూపాన్ని మన కనులముందు సాక్షాత్కరింపజేస్తూనే ఉంటాయి. అదీ వాల్మీకి మునిచంద్రుని ప్రత్యేకత. ఏ పాత్ర అయినా సరే తన విలక్షణ స్వరూపంతో దాని స్వభావాన్నికూడా మనం మరిచిపోని రీతిలో వచ్చి వెడుతుంది.

అంతకంటె కూడా—

ఏ పాత్ర ఎప్పుడు రావాలో దాని ప్రయోజనం ప్రధానగాథకు ఎంత వరకూ ఉంటుందో అంతమాత్రమే ఉండి మళ్ళీ మనకు కనిపించదు. విశ్వామిత్రుని వంటివాడుసైతం సీతాకళ్యాణం అయిన ఉత్తరక్షణంలో కనిపించడు.

అలాగే అయోధ్య దాటగానే మళ్ళీ పట్టాభిషేకపర్యంతం సీతా రామ లక్ష్మణులు తప్ప మిగిలిన రాణివాసం మాట ఉండదు. అరణ్యం దాటితే మహర్షుల ప్రస్తావనలేదు.

అలా కొన్ని కొన్ని పాత్రల ప్రవేశ నిష్క్రమణలు అల్పవ్యవధిలో జరిగినా మనలను వెన్నాడుతుండేటట్లు చిత్రించడం మహర్షి వాల్మీకికి కైవసమయిన విద్య. కనకనే రామకథ నేటికీ మన కనులముందు జరుగుతున్నట్లే ఉంటుంది, చదువుతూంటే.

అటువంటి మహత్తర కావ్యం పూర్తిగా చదివారు తెలుగు వచనంలో మీరు. అందులో చిన్నపాత్రల పరిశీలనం చెయ్యబోతున్నాం. చూడండి!

ఏ ది క వి త్వం ?

అనే మీమాంస యీనాడు కొంచెం పరిహాసాస్పదంగా కనిపించవచ్చు. కాని —

కవిత్వం పేరిట యిటీవల అమ్ముడవుతూన్న సరుకును చూసి —

'ఇ దా క వి త్వం!

అని ముక్కున వేలు వేసుకువే వారిసంఖ్య పెరిగి పేరుకుంటున్న తరుణంలో ఈ మీమాంస అనాలోచిత రమణీయం కాదు.

నిన్న మొన్నటివరకూ దేశంలో కవులేకాని, మహాకవులు లేరు ఈ నాడు కవి కనిపించడమే లేదు. ఇంత ప్రజాస్వామ్యదేశంలో. అందరూ మహాకవులే, కవిచక్రవర్తులే.

తిరుపతి వెంకటకవుల ధర్మమా అని కవిత్వం రాజవీధులు వదిలి ఇరుకు సందులవరకూ చేరాక,

గిడుగు రామమూర్తి పంతులు పుణ్యాన గ్రాంథికవాసనా, జ్ఞానమూ లేని వ్యావహారికం రచనారంగానికి ప్రధానభూమి అయాక రచయితల కలాలు నల్లేరుమీద బండిలా సాగిపోతున్నాయి.

ఇలా సాగే వారందరికీ "ఉత్తి కవి" అనిపించుకోవడంకంటె ఒక విశేషణం (భావకవి, అభ్యుదయకవి, దిగంబరకవి, విప్లవకవి, వచనకవి, యుగకవి ఇలా ఎన్నెన్నో) తగిలించి మునుముందుకు పోవాలని అనిపించింది. ఇన్ని బిరుదాలలోనూ "మహాకవి" శబ్దం కొందరికి అత్యంతప్రీతిపాత్ర మయింది. ఇంతతో అసలు కవి తెరమరుగునపడి విశేషణకవులు తెర కెక్కారు. దానితో కవిత్వంపోయి "విశేషణాలు" మిగిలాయి, మూల విరాట్టులేని ఆలయాల్లా :

మూడు, నాలుగు కావ్యాలూ, మూడు నాటకాలూ వ్రాసిన కాళిదాసు వంటివాడు నయితం :

మందః కవియశః ప్రార్థీ

అన్నాడు. (కవిని కావాలనుకునే మూర్ఖుణ్ణి.) అంతే తప్ప మహాకవిని కాలేక పోయాను, అని చింతించలేదు.

ఈనాటికీ తెలుగు పల్లెలలో ఆ బాలవృద్ధపర్యంతం చేత తన పద్యాలను పలికించుకునే పోతన్నగా రయినా

నన్నయ్యతిక్కనాదికవులీయుర్విన్........

అని కవిత్రయం వారిని కవులుగానే ప్రశంసించి జోడించారు కరకమలాలు, మహాకవులని పొగడకుండా!

ఇక్కడొక చమత్కారం ఉంది....

కాళిదాసు దృష్టిలో కవి శబ్దం ఒక్క వాల్మీకికే వర్తిస్తుంది. అలానే పోతన్నగారికి నన్నయ తిక్కనలే కవి శబ్దవాచ్యులు.

ఇలా కవిత పలికి అసంఖ్యాకజనం ఆదరణ పొందిన అక్షర పరబ్రహ్మోపాసకు లందరూ తమ పూర్వులను కవులుగా ఆరాధించుకున్నవారే తప్ప "మహా" "మహా" బిరుదులు తగిలించాలని తాపత్రయపడలేదు.

తెలుగుజాతి ప్రతిష్ఠను భారతజ్ఞానపీఠంమీద నిలిపిన కల్పవృక్ష కవి సైతం తన బిరుదాలేవీ గ్రంథాలమీద ముద్రించుకోలేదు.

ఆయనకూడా :

"ఒక్క వాల్మీకికాక
వేరొక్క డెవడు
సుకవి శబ్ద వాచ్యుడు"

అన్నారు అంతే—

ఇలా చూస్తూ వస్తే ఇందరికీ వాల్మీకి ఒక్కడే కవి.

ఆయనకు అంజలి ఘటించకుండా శ్రీకారం చుట్టిన కవులులేరని అనలేం.

ఉన్నవారు రామాయణం చదవక పోవచ్చునుకాని రామకథ ఎరగని వారు లేరు.

## కవితాప్రస్థానం

సర్వ భారతీయ సారస్వతోపాసకులకు కవితామార్గం చూపినవాడు ఆయనే. అదే చక్కని రాజమార్గం; సర్వప్రక్రియలకూ అందులో బీజాలు వున్నాయి.

శబ్దంతో గారడీచేసే వర్తమాన "మహాప్రస్థాన కవులకు" సైతం రామాయణంలో సుందరకాండ ఆధారభూమి. అక్కడి చంద్రోదయ వర్ణనలో అంత్యప్రాసలనర్గ యీ ప్రాసక్రీడాకారుల రంగస్థలం. అది విష యాంతరం.

వాల్మీకి తన రామాయణంలో ఏ విషయాన్ని ఎంత వివరించాలో, ఎలా ప్రదర్శించాలో, ఎక్కడ ఒక పాత్రను ప్రవేశపెట్టి, ఎప్పుడు నిష్క్ర మింపజెయ్యాలో చూపించి, ఏ సన్నివేశంలో ఏం మాట్లాడాలోకూడా విశదం చేసిన తీరును చూస్తే కవితాసామగ్రి అందుతుంది. ఆ తరువాత కవి కావడం అనేది వారి వారి పురాకృతం. కాదంటే కృషి.

వాల్మీకం అంతా చదివిన వారికీ, చదవగలవారికీ యీ ప్రసంగాలు అవసరంలేదు. ఆ అవకాశం లేనివారికీ ఆసక్తికలవారికీ మాత్రమే.

## మ ం థ ర

బాలకాండలో అత్యంత ప్రముఖపాత్ర విశ్వామిత్రుడు. సీతా కళ్యాణం అయిన మరుక్షణంలో ఈయన నిష్క్రమిస్తాడు. అంటే బాలకాండ

ముగియకుండానే అదృశ్యమయినా మనం రామాయణం పూర్తిచేసినా ఈయన మనను వెంటాడుతూనే ఉంటాడు.

అయోధ్యాకాండలోని మంథర, కైక, కౌసల్య, సుమిత్ర సుమంత్రాదులతో భరతశత్రుఘ్నులు సైతం ఆ కాండ చివరివరకూ రాకపోయినా వారూ మనలను వీడరు.

అరణ్యంలో ఎందరో ఋషులు, ఋషిపత్నులు....వీరి ప్రస్తావన మళ్ళీ ఉండదు.

రామకథ యింత కావడానికి ప్రధానకారణం శూర్పణఖ. అది కూడా ఒకే ఒక్క సన్నివేశంలో ప్రవేశించి విక్రమిస్తుంది.

ఆరుకాండల గ్రంథం. ఇరవయినాలుగువేల శ్లోకాల కథ. ఇంత బృహత్కథలో అయిదారు నిమిషాలు మాత్రం మనకు కనిపించిన ఈ శూర్పణఖ పేరు చెపితే నేటికీ పసిపాపలతోపాటు శిలసంపన్నులు సైతం భయపడుతారు.

అది ఎవరి కొంప కూల్చడానికి వస్తున్నదో అని.

ఇంతకంటె బహు స్వల్పవ్యవధిలో ముగిసినపాత్ర మరొకటి ఉంది. అది మంథర.

మానవజాతి ఉన్నంతకాలం పచ్చని సంసారాలలో చిచ్చుపెట్టే ప్రకృతి కల స్త్రీ లందరికీ వీరిద్దరే ప్రతినిధులు.

వీరిలో కుటుంబనాశనానికి దారితీసింది మంథర. దీన్ని దాసీ స్థానంలో ఉంచి, భార్యాభర్తలకు వియోగం తెచ్చిపెట్టిన శూర్పణఖను రాక్షసిగా నిలబెట్టాడు, వాల్మీకి.

ఈ మంథర కేకయరాజుగారి అంతఃపురంనుంచి కైకేయితో వచ్చిన దాసి. వట్టి దాసీకాక చెలికత్తె వంటిదాసి. ఈ పిల్ల నడిపింది రామకథను

అరణ్యం వరకూ. అరణ్యంలో అందుకున్న శూర్పణఖ యుద్ధం వరకూ సాగదీసింది.

అంతటివాళ్ళు వీళ్ళు.

అందుచేత మంథర లేకపోతే రామాయణం లేదు. అనుకున్న ప్రకారం రామపట్టాభిషేకం జరిగి ఉంటే రామాయణమే లేదుకదా!

పట్టాభిషేకభంగానికి ప్రధానహేతువు మంథర.

అభిషేకం ఆగిపోయే ఆలోచన మంథర తలలో పుట్టింది.

పుట్టినగ్రుడ్డును కైకచేత పొదిగించింది.

దానికి రెక్కలు విప్పి విడిచింది.

అది దశరథుని కన్నులలో దుమ్ము రేపింది.

చక్రం తిరిగింది. చతురంగబలాలు వెంటరాగా

చతురంతయానంమీద చక్రవర్తిగా చరించవలసిన-

రాముడు పాదచారియై వల్కలాలతో వనవాసానికి వెళ్ళాడు.

ఆ తరువాయి మంథర మన కంటబడదు.

పడింది శత్రుఘ్నుని ఎదుట

పడగానే కరవాలం తీశాడు. కాని నరకనివ్వలేదు భరతుడు. శత్రుఘ్నుడే కాదు, మన మయినా కత్తి తీస్తాం, అటువంటి పనిచేసిన మంథర కనిపిస్తే....

కాని కాంతలమీద కత్తి దుయ్యరాదు అన్నాడు వాల్మీకి.

ఈనాటికీ కైకవలె గారాబంగా పెరిగిన సంపన్న గృహాల వారీ మణులు తమ దాసీజనం చెప్పచేతలలో వారి వక్రబుద్ధులకు లొంగి సంసారాలు కూల్చుకునే వారుండకపోరు. అయితే ఆ కథలు పైకి తెచ్చి పలికేవారు లేరు.

లేకపోయినా యిందరి కథలకూ వాల్మీకమే మూలం.

# శూర్పణఖ

రాజభోగాలు విడిచి, ఘోరారణ్యంలో పటకుటీరంలో రోజులు గడుపుతున్న దంపతులు సీతా రాములు.

వారి అన్యోన్యంచూసి కన్నుకుట్టిన శూర్పణఖ ఆ దంపతులను విడదీయడానికి ప్రయత్నించి విఫలమై లంకానగరంచేరి అన్నగారయిన రావణుని చేరి :

అన్నయ్యా ! ఎందుకురా ? ఈ చతుర్దశభువనాధిపత్యం ! దిక్పాలకులను గజ గజ లాడించావు. దేవేంద్రుని పాదాక్రాంతుని చేసుకున్నావు. ఇదేం ప్రయోజకత్వం !

నీ సౌందర్యానికి, వీరత్వానికి, సామ్రాజ్యభోగానికి యోగ్యురాలయిన పట్టమహిషి అవసరంకాదా !

అది దండకారణ్యంలో తిరుగుతోంది. దాన్ని నీ పట్టమహిషిగా తీసుకురావాలని నేను వెడితే ఈ పరాభవం చేశాడు దాని భర్త.

రాముడట ఎవడో.

దశరథుడి కొడుకట....ఆ తండ్రి అడవికి తోలితే ఈ సౌందర్య రాశిని వెంటతెచ్చి నానాక్లేశాలపాలు చేస్తున్నాడు. ఆమె బాధ చూడలేక నేనువెడితే ఆ రాముని తమ్ముడు నాకీ పరాభవం చేశాడు.

ఇందుకు ప్రతీకారంగా నువ్వు వెళ్ళి ఆ అన్నదమ్ములను కడతేర్చి సీతను తెచ్చుకో—అంది.

అంతే, అదీ శూర్పణఖ ప్రకృతి.

తాను వలచిన అందగాడు తనకు దొరకకపోతే ఆడది ఎంతటి దారుణానికి ఒడిగడుతుందో తెలుపుతుంది రామాయణంలో ఈ పాత్ర.

అయితే మంథర శూర్పణఖ వంటి దుష్టపాత్రలను కొద్దిక్షణాలకంటె మన ముందుంచక, కుండెడు పాలలో ఒక్క విషబిందువు చాలు అన్నట్టు చూపించి విడిచేశారు.

అది వాల్మీకికవి శిల్పచమత్కారం.

ఆయన పాత్రచిత్రణ ప్రతిభఅది :

## మా రీ చు డు

బాలకాండలో విశ్వామిత్రుని యాగమంటపందగ్గర ప్రవేశించిన మారీచుడు అక్కడ రామబాణఘాతంతో సముద్రతీరానపడి తపస్సు చేసుకుంటున్నాడు.

అనంతరం అరణ్యకాండ సగం నడిచాక రావణుడు సీతాదేవిని అపహరించడానికి బయలు దేరుతూ దారిలో మారీచుని ఆశ్రమానికి వచ్చి, సీతను అపహరించాలంటే రామ లక్ష్మణులు వారి ఆశ్రమపరిసరాలలో వుండకుండా చెయ్యాలి అంటాడు. ఆమాట విన్నాడు మారీచుడు. వింటూనే-

రకారాదీని నామాని
రామ త్రస్తస్య రావణ
రత్నాని చ రథాంశ్చైవ
సంత్రాసం జనయంతి మే.

అలనాడు విశ్వామిత్ర యాగసంరక్షణ వేళ:

పదహారేళ్ళు నిండని వయసులో, పూర్తిగా శస్త్రాస్త్రవిద్యా కుశలుడు కాని రోజులలో, మానూగు మీసాలతో వున్ననాడే నావంటి మాయావిని సముద్రాలు పట్టించిన వీరుడు, రాముడు.

అప్పుడే అంతటివాడు.

ఇప్పు డెంత పెరిగి, అనుభవం విద్యాకుశలత సాధించి ఉంటాడో ఆలోచించావా!

జనస్థానంలో మన మూలబలం ఖరదూషణులను వారి సేనావివహంతో నేలకూల్చినవాడు, ఒక్కడుగా ధనుర్ధారియై నిలబడి, విన్నావుకదా!

ఇది తెలిసికూడ ఎందుకీ దురాలోచనతో వచ్చావు. హాయిగా యింటికిపో! నీ కామవాంఛతో లంకానగర సర్వనాశనానికి సాహసించకు, అని పరి పరివిధాల బోధించినా వినకుండా నిలబడడం చూసి :

రాముడంటే నేనెంత భయపడుతున్నానో తెలుసా! రత్నం, రథం అని 'ర' కారంతో ఆరంభించే శబ్దం వినిపించిందంటే గుండె దడ దడలాడు తోంది అంటాడు.

దేశ కాల భేదం లేకుండా ఏ మానవ ప్రాణి అయినా తన భయాన్ని సూచించడానికి దాని తీవ్రతను తెలపడానికి యింతకంటె మార్గం ఏమిటి?

ఒకానొక క్రూరుడిని గురించి మాట్లాడుతూ :

వాడి పేరు చెపితే పిట్టలు నీళ్ళు తాగవు పై ప్రాణాలు పైనే పోతాయి అంటారు. అంతకంటే కూడా ఆ శబ్దంతో ఆరంభమయే మాట వినిపిస్తే చాలు అని ఎంత వున్నతంగా పలికాడు వాల్మీకి.

అందుకే ఆయన కవి.

మనమంతా మహా కవులం!

## కుంభకర్ణుడు

అతి విలక్షణమూ విచిత్రమూ అయిన ఈ పాత్ర ప్రవేశ నిష్క్రమణలు రెండూ ఒక్క పూటతో ముగిసినవే. అయినా కుంభకర్ణునికి లభించిన ప్రచారం రాక్షస మహాయోధు లెవరికీ లేదు.

గాఢంగా నిద్రపోయే ఏ ప్రాణి కయినా కుంభకర్ణ బిరుదం యివ్వ కుండా వుండం. అలా యిన్ని తరాలవారికీ బిరుదంగా మిగిలిన కుంభ

కర్ణుడు కనులు తెరిచి మనకు కనిపించిన సాయంకాలానికే శాశ్వతంగా కన్ను మూశాడు.

ఇంద్రజిత్తు మహేంద్రజాలం కూడా విఫలమయింది.

అకంపన, ధూమ్రాక్ష, ప్రహస్తాది రాక్షస మహాయోధులు నేల కూలారు. రావణుడు రణరంగానికి వచ్చాడు. రామబాణం వాని రత్న కిరీటాన్ని నేలకూల్చింది.

పరాభవంతో వెనుదిరిగి పోయి కొలువుకూటం చేరి ఇప్పుడింక కుంభ కర్ణుని నిద్రలేపాలి, గత్యంతరం లేదు, అన్నాడు.

నిద్ర లేవడానికి రాక్షస వీరులు పడిన తావత్రయం కళ్ళకు కట్టిం చాడు వాల్మీకి.

నిద్ర లేచాడు, రావణ సోదరుడు.

లేస్తూనే విషయం అడిగాడు.

మంత్రులు చెప్పారు; విన్నాడు.

వింటూనే యుద్ధ భూమికి నడవబోగా మంత్రులు: స్వామీ, మీ అన్న గారిని చూసి వెళ్ళడం మర్యాద, అన్నారు.

కొలువుకూటానికి వచ్చాడు.

విషయం చెప్పి "తమ్ముడూ రామ లక్ష్మణులను సంహరించి తీనుకు రావాలి" అన్నాడు, రావణుడు.

అన్నగారికి రాజనీతి బోధించబోయాడు.

వినకపోగా రావణుడు — "వింటే నా మాట విను. లేదా హాయిగా నిద్రపో", అని గర్జించాడు.

యుద్ధభూమికి శూలపాణియై వచ్చాడు కుంభకర్ణుడు. వానర సేనను చిత్రహింస చేశాడు. సుగ్రీవుని బంధించి లంకానగరంలో ప్రవేశిస్తూండగా సుగ్రీవుడు ఆ మహాయోధుని ముక్కుకొరికి, చెవులు పీకి తప్పించుకు వచ్చేశాడు.

ఆగ్రహం హెచ్చింది.

ఆహవ భూమికి మళ్ళీ వచ్చాడు.

రామబాణ ఘాతంతో నేలకూలాడు.

అంతే !

ఇదీ కుంభకర్ణుని పాత్ర.

ఇంత స్వల్ప వ్యవధిలో ప్రవేశించి విక్రమించిన యీ కుంభకర్ణుడు నేటికీ గాఢ నిద్రా ముద్రితులకు బిరుదం అవుతూనే వున్నాడు.

అదీ వాల్మీకి కవి ప్రతిభ.

* * * * *

అటు రామ భక్తులకు—

ఇటు రామాయణ విరక్తులకు చేతులు జోడించి, దూరంగా నిలబడి జీవన రసాస్వాదనాయత్త చిత్తులకు రెండు మాటలు.

వాల్మీకి తన రచనా ప్రణాళికలో—

రా మ క థ

రా వ ణ వ ధ

మ హ త్త ర మయిన సీ త చరిత్ర

వ్రాస్తున్నానన్నాడు.

అంటే మానవజాతికి ఆదర్శంగా రాముడు, సతీత్వానికి ప్రతినిధిగా సీత, దుర్మార్గులకు జరిగే ప్రాయశ్చిత్తంగా రావణవధ చూపదలుచుకున్నాడు.

అదీ ఆయన ఆశయం.

ఇందులో ఆయన సీత చరిత్రకు మాత్రం "మహత్" అని వాడాడు. అంటే మనం చదివే రామాయణం ప్రధానంగా సీత కథ.

సీత లేకపోతే రామాయణం లేదు.

ఈ సీత ఎటువంటిది.

ఈ నాటికీ భారతజాతికి గర్వకారణమూ.

సర్వ దేశాలకూ ఈ జాతి అందించే ఆదర్శమూ అయిన దాంపత్య జీవన, పాతివ్రత్య ధర్మాలకు ప్రథమ ప్రతినిధులయిన అనసూయ, అరుంధతి ప్రముఖ నారీ శిరోభూషణాలకు ఆనందాశ్చర్యాలు కలిగించిన బాల.

పరమ ప్రశాంత తపోవన భూములలో, పటకుటీరాలలో, కఠోర నియమ నిష్ఠా గరిష్ఠుల సన్నిధానంలో ఉన్న మహిళా మతల్లులు అనసూయ, అరుంధతి ఆదిగాగలవారు.

మరి జానకి!

విదేహాధీశుడయిన జనకుని అంతఃపురంలో, మణిరత్నఖచిత ఆసనాల మీద, హంసతూలికాతల్పాలమీద పెరిగిన కన్య, ఎండ కన్నెరుగని సుకుమారి. దాసదాసీజన పరివృతమయిన అయోధ్యాధీశుల రాచనగరులో కోడలుగా- పెద్దకోడలుగా - పన్నెండేళ్ళు రామభద్రుడితో దాంపత్యసుఖం అనుభవించిన యిల్లాలు—

అటువంటి సుకుమారి—

వనవాసక్లేశాలను వరించి వచ్చింది భర్తతో. కైకకోరిన వరంలో రామ వనవాసమే ఉన్నది. కాని, సీత ప్రమేయం లేదు.

అయినా అడవికి రావడానికి సన్నద్ధమయింది.

అరణ్యంలో అడుగడుగునా ఎదురయే ప్రమాదాలు, కష్టాలు వివరించి చెప్పాడు రాముడు.

అయినాసరే—

కష్టమయినా సుఖమయినా భర్తతో ఉండవలసిందే— అంది. అరణ్యానికి వచ్చింది.

అరణ్యంలో మహామునుల భార్యలందరూ తమ తపఃఫలంచేరంగా అనుగ్రహిస్తామన్నారు.

అప్పు డా జనకరాజనందన రామ ధర్మపత్ని :

అమ్మా! నేను స్వయంగా తపస్సుచేసి ఆఫలం సాధించుకునే అవకాశం అనుగ్రహించండి. అన్నది, అంతే!

అంతటి క్లేశంలోనూ ఎవరి దయా దాక్షిణ్యాలనూ అర్థించలేదు. చివరకు లంకానగరంలో పదిమాసాలు రాక్షసజనమధ్యంలో- మానసికక్లేశాలు అనుభవించినా తనధర్మనిష్ఠను వీడలేదు.

రావణుడు పరిపరివిధాల అర్థించాడు.

పట్టమహిషి పదవిని యిచ్చి, ఆమె బంధుమిత్రులకుకూడా రాజభోగాలు సమకూరుస్తా నన్నాడు. ఆమె కనుసన్నలలో లంకానగరం యావత్తూ కదులుతుం దన్నాడు.

ఇంత చెపితే గడ్డిపరకలా తీసి పారేసింది.

అదీ సీతా స్వరూపం.

అందుకే అనసూయ, అరుంధతి, ప్రముఖ పతివ్రతాశిరోమణులు ఆనందాశ్చర్యాలతో ఆ యిల్లాలిని దగ్గరగా తీసుకుని ఆశీర్వదించారు.

ఇదీ ప్రధానంగా రామాయణంలో వాల్మీకి చెప్పదలచినది. ఇందు కోసమే శ్రీమద్రామాయణాన్ని యింతకాలంగా యీ జాతి అధ్యయనంచేసి ఆరాధనామందిరంగా చేసుకొన్నది.

## హనుమంతుని విశ్వరూపం

శ్రీమద్రామాయణంలో ప్రధాననాయకుడు రాముడు.

అనంతరం అంతటి విశిష్టస్థానాన్ని పొందినవాడు హనుమంతుడొక్కడే.

బాల, అయోధ్య, అరణ్యకాండలలో సర్వకథా సన్నివేశాలూ రాముని చుట్టూ పరిభ్రమిస్తాయి. ఆ మూడు కాండలలో హనుమంతుని ప్రస్తావనలేదు.

కిష్కింధలో ప్ర వేశించినహనుమంతుడు సుందర, యుద్ధకాండలు ముగిసి పట్టాభిషేకం అయేవరకూ మన కనులముందు సాక్షాత్కరిస్తూనే వుంటాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ మూడు కాండలలో హనుమంతుని విశ్వరూపాన్ని సాక్షాత్కరింప జేశాడు వాల్మీకి కవి.

యత్ర యత్ర రఘునాథకీర్తనం
తత్ర తత్ర కృత మస్తకాంజలిం
బాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాంతకం.

(ఎక్కడెక్కడ రామనామం వినిపిస్తూంటుందో అక్కడక్కడ అంజలి బద్ధుడై ఆనంద బాష్పావృతనయనుడై వుండే, రాక్షససంహార సమర్థుడయిన మారుతికి నమస్కారం.)

ఇదీ హనుమంతునిగూర్చి యిటివలి భక్తుల భావన. కాని - రామాయణంలో కనిపించే హనుమంతుని రూపం వేరు. ఆయన సాహస, పరాక్రమ, ధీశక్తులు వేరు.

## ప్రతిభా సంపన్నుడు

రావణుడు అపహరించిన సీతను అన్వేషిస్తూ రామ-లక్ష్మణులు కిష్కింధ చేరారు.

దూరాన ఋష్యమూక పర్వతంమీద తలదాచుకున్న సుగ్రీవుడు వీరిని చూశాడు.

చూడగానే ఆశ్చర్యం కలిగింది.

అంతకు మించి భయం కలిగింది.

భయంతో పరుగు ప్రారంభించాడు.

వెంట అనుచరులు కూడా విక్కబలం చూపుతున్నారు. గుట్టలు, మిట్టలు, కొండలు దూకుతున్నారు. అక్కడ వారిని ఆపి హనుమంతుడు:

ప్రభూ! ఎక్కడికీ వరుగు, అన్నాడు.

అప్పుడు సుగ్రీవుడు:

మారుతీ! వారినీ వారి చేతులలోని కోదెంద్రాచులవంటి కరవాలాలనూ, తాళప్రమాణ ధనుస్సులనూ చూశావా! వారు మనలను సంహరించడానికే వస్తున్నారు. మాసోదరుడు వాలి పంపి ఉంటాడు. అన్నాడు.

ప్రభూ! అనుమానమేతప్ప అసలు విషయం తెలియకుండా ఏవిటీ ఆందోళన, నేను విషయం తెలుసుకువస్తా, అని రామలక్ష్మణులను సమీపించి, వినయంగా:

అయ్యా! దివ్యదీప్తులలో విరాజిల్లే మీ శరీరకాంతి, చతుర్దశ భువనాలనూ గజగజలాడించగలిగిన మీ ధనుర్బాణ, కరవాలాలూ చూస్తూంటే ఆశ్చర్యం కలుగుతోంది. రాజవీర పురుష లక్షణాలతో అలరారే మీరు ముని బాలకులవలె ఈ జటాజూటాలూ, నార చీరలు ధరించడం ఆశ్చర్యంగా ఉంది. తమరెవరు? ఏ పనిమీద యిలా వచ్చారు. అని క్షణం ఆగి, క్షమించండి, నా గురించి నేను తమకు చెప్పలేదు.

నన్ను హనుమంతుడంటారు. ఈ కిష్కింధాధిపుడయిన వాలి తన తమ్ముడయిన సుగ్రీవుని మీద కోపగించి తరిమి, అవస్థలపాలు చేశాడు. నేను సుగ్రీవుని సచివుడను, అన్నాడు.

వినగానే రాముడు పరమానందభరిత హృదయుడై, లక్ష్మణునివైపు తిరిగి:

> నా నృగ్వేద వినీతస్య
> నా యజుర్వేద ధారిణః
> నా సామవేద విదుషః
> శక్య మేవం విభాషితుం.

అని ప్రశంసా పూర్వకంగా పలికాడు.

అంటే తమ్ముడూ! ఈ కపిప్రవరుడు మాట్లాడిన తీరు చూశావా!

వేదత్రయం అధ్యయనం చేసి, శాస్త్రాలు అవలోకించి, నవ వ్యాకరణాలూ కంఠపాఠం చేసినవాడు తప్ప యిలా మాట్లాడలేడు.

పయిగా మాట్లాడుతున్నప్పుడు కనుబొమలు ఎగరవేయడం, తల త్రిప్పడం వంటి అవలక్షణాలేమీ లేవు.

మరో ముఖ్యాంశం.

అవిస్తరం అసందిగ్ధం
అవిలంబితం అవ్యధం.

చెప్పవలసింది ఎంత క్లుప్తంగా చెప్పాలో అంతే చెప్పాడు. అలా అని- అందులో సందిగ్ధం లేదు, సాగతీతలు లేవు. గొంతు చించుకుని మనచెవులు చిల్లులు పడేలా మాట్లాడలేదు. (మాట్లాడే మానవులందరికీ అవసరమయిన సూత్రా లివి.)

ఈ విధమయిన చాతుర్యంకల సచివుడుంటే ముల్లోకాలూ మన పాదాల ముందు వ్రాలాలి, అన్నాడు.

ఇంతటి ధీమంతునితో చాలా జాగ్రత్తగా తూచి తూచి మాట్లాడాలి సుమా అని హెచ్చరించాడు రాముడు.

తనంతవాడయిన లక్ష్మణస్వామిని రాముడు హెచ్చరించిన సన్నివేశం యితఃపూర్వంకాని తరువాతకాని కనపడదు.

అన్నిటినీమించి రామాయణం మొత్తంమీద రాముడు తనకు తానయి ఒకరిని ప్రశంసించడం వుండదు. ఈ ఒక్కచోటే ఆయననోట ప్రశంస వినిపిస్తుంది.

హనుమంతుడు వచ్చి మూడుముక్కలు మాట్లాడితే ఆ మాటలతో ఆనందపరవశుడై అంతగా అభినందించాడంటే, ఆ పాత్రను మనముందు ఏ దృష్టితో వాల్మీకి ప్రవేశ పెడుతున్నాడో చూసుకోవాలి.

మాట్లాడడం అనే విద్య హనుమంతుడికే తెలుసు అని రామునిచేత అనిపించాడంటే, ఆ విద్యను హనుమంతుని ద్వారా రామాయణ పాఠకు లందరూ గ్రహించాలి అని భావించి ఉంటాడు, ముని వాల్మీకి.

ఈ దృష్టితో హనుమంతుని పాత్రను ఉన్మీలింప జేయదలుచుకున్నా రాయన, అని మరువరాదు.

అది మనసులో ఉంచుకుని రామాయణంలోని హనుమంతుని వెంట మన మనస్సును నడిపితే ఆ వైశిష్ట్యం అర్థమవుతుంది.

## ర మ ణీ తా ర

భూమండలంలోని సర్వవానర సంఘాలకూ అధిపతి వాలి. ఈ కపీశ్వరుడు మహా బలిష్ఠుడు. ఎంతటి బలవంతుడంటే చతుర్దశ భువనాలనూ అల్లల్లాడించిన దశకంఠ రావణునివంటి మహావీరుని తన చంకలో యిరికించి సప్తసముద్రాలలో ముంచి వదిలిన బలవంతుడు.

అటువంటి వాలి రాముడు విడిచిన ఒకే ఒక్కబాణంతో నేలకూలి నాడు. అది చూసిన వానరసేనాపతులు నల, నీల, గజ, గవయ, గవాక్ష మైంద, ద్వివిదాది మహాయోధులందరూ తెల్లబోయి భయచకిత హృదయులై చూస్తూ నిలబడిపోయారు.

ఎవరికీ నోటమాటలేదు. ఊపిరికూడా పీల్చడంలేదు. అటు వానర వీరుడు వాలినీ, యిటు ధనుష్పాణి అయిన రామునీ చూస్తూన్నారు.

వాలి నేలకూలిన వార్త అంతఃపురంలో అందింది.

పిన్నక్షణంలో తార బయలుదేరింది. మూర్తీభవించిన శోక దేవతలా వస్తున్నది.

తీవ్ర గమనంతో వస్తూంటే వాలి అనుచరులెందరో ఆమెకు ఎదురు వచ్చి ముందుకు పోవద్దని వారించారు.

వినిపించుకోలేదు.

చకచక సాగివచ్చి ఎవరినీ కన్నెత్తి చూడకుండా భర్తదేహం మీద పడి గోలుగోలున ఏడిచింది. భర్తతో ఏమేమో మాట్లాడింది.

అందరూ మౌనంగా చూస్తున్నారు తారను.

తారను ఎలా పలకరించాలో, ఏం మాట్లాడాలో ఎవరికీ తోచడంలేదు.

నిశ్శబ్దం తాండవిస్తున్నది.

అప్పుడు హనుమంతుడు వినయంగా ఆమెను సమీపించి :

మహారాణీ! జగదేక మల్లుడయిన వానరేశ్వరుని పట్టమహిషివి, నువ్వు శోకిస్తున్నావా! ఈ కిష్కింధ, సర్వవానరయోధగణం నీ కను సన్నలలో నడిచింది యింతకాలం. ఇక ముందుకూడా అది అలానే సాగుతుంది. నువ్వు గుండె నిబ్బరం చేసుకుని నీ బిడ్డ అంగదుని సింహాసనం ఎక్కించు. నీ ధీశక్తి వానర రాజ్యానికి పెట్టని కోట, అని ఆరంభించాడు.

అదీ హనుమంతుని ధీ చాతుర్యం.

అంగదునికి సింహాసనం, అన్నాడు.

అంతే!

తెరవెనుకనుండి కిష్కింధను ఏలిన పట్టమహిషి తార.

భర్త మరణశోకం ఎంతగా ఉన్నా ఆమె మనసులో శోకాన్నిమించి ఎంత క్రోధం సెగలు జిమ్ముతూంటుందో తెలుసుకోగల వివేకం కలవాడు హనుమంతుడు.

కనకనే - ఆమె కొడుకుని రాజ్యాభిషిక్తుని చెయ్యమన్నాడు.

ఆ మాటతో తార హృదయం ఎటువంటి పరిణామం పొందుతుందో ఎరిగినవా డాయన.

అంతేనా!

రాముడు వాలిని హతమార్చినది, అంగదుడికి రాజ్యం ఇవ్వడానికా!

కాదు—

సుగ్రీవుని పట్టాభిషేకం జరపడానికి.

అయినా, ఇది తెలియకనే అన్నాడా హనుమంతుడు.

కాదు—

మరిదేనికి—అంటే:

అంతవరకూ వాలివెంట ఉన్న వానర యోధులందరికీ పట్టమహిషి తార మీద గౌరవం. ఆవిడ ఏం చెపితే అది చెయ్యడానికి వారందరూ సన్నద్ధులయి వుంటారు. అటువంటప్పుడు ఆవిడ క్రోధాన్ని శాంతింపజేసి, వారందరినీ యిటు త్రిప్పుకోవాలి. అదీ ఆయన యోచన.

వివేకవతి అయిన తార అందుకు సమ్మతించదని కూడా ఎరిగిన వివేకం కలవాడు. కనుకనే ఆ మాట పలికి ఆ సన్నివేశాన్ని శాంతియుతం చేశాడు.

ఈ మాట హనుమంతుడనగానే తార:

హనుమా! ఈ రాజ్యం సుగ్రీవునిదయ్యా! ఆయనకే పట్టాభిషేకం జరపాలి, అంది.

అది, ఆవిడ నోటపలికితే కిష్కింధలో సుగ్రీవునికి ఎదురులేదు. అంత ఆలోచించాడు మారుతి.

అది పలికించగల చాతుర్యం హనుమంతునిదే.

## లంకానగరంలో

సుగ్రీవుడు రాజయాడు.

వర్షాకాలం వెనుకబడగానే సీతాన్వేషణకు వానరులందరినీ పంపుతానని రామునికి వాగ్దానం చేసి అంతఃపురం చేరాడు.

వానలు వచ్చాయి, గాలిరేగింది.

వర్షాలు ముదిరాయి, గాలివిసిరింది.

నాలుగునెలలు కుండపోతపోశాయి మేఘాలు.

ఏరులు వాగులయ్యాయి.

వాగులు నదులయ్యాయి.

నదులన్నీ సముద్రాన్ని చేరుతున్నాయి.

వానలు వెనుక బడ్డాయి.

గాలి విసురు సన్నగిల్లింది.

వరదల నీటిబురద విరిగి నదులు స్వచ్ఛజలాలతో ఉన్నాయి. సెలయేళ్ళు సన్నబడ్డాయి.

స్వాదుజలాలతో చెరువులు కలకలలాడుతున్నాయి.

శరత్కాలపు వెన్నెలలు తొంగిచూస్తున్నాయి.

మేఘాలలో నలుపువిరిగి దూదిపింజలయ్యాయి.

రాజ్యాధిపత్య భోగాలు....

మదిరాపానం

మదవతీ పరీరంభణం

ఈ రెండింటితో మైమరచి ఉన్నాడు, సుగ్రీవుడు.

అప్పుడు రాముడు లక్ష్మణుని పంపాడు.

కిష్కింధ కోటగుమ్మంలో లక్ష్మణుడు నారిసారించి వదిలాడు.

ఆ ధనుష్టంకారానికి కిష్కింధ దద్దరిల్లింది.

సుగ్రీవుని మత్తువదిలింది.

వానర వీరులందరినీ సీతాన్వేషణకు పంపుతున్నాడు.

దక్షిణ దిశగా వెళ్ళే వానరసంఘంలోని హనుమంతుని చేరబిలిచి రాముడు తన అంగుళీయకం ఇచ్చి, సీతాదేవికి గుర్తుగా చూపమన్నాడు.

అందరూ సముద్రతీరం చేరారు.

శతయోజన విస్తీర్ణమయిన సాగరాన్ని లంఘించగలవాడు హనుమంతుడే అని జాంబవంతుడు నిర్ణయించాడు.

బయలుదేరాడు హనుమంతుడు.

దారిలో మైనాకుడు అతిథిమర్యాదలు జరుపుతానంటే కార్యార్థి అయినవాడు సత్కారాలతో కాలక్షేపం చెయ్యరాదని ముందుకు సాగాడు.

సురసను యుక్తితో దాటాడు.

సింహికను సంహరించాడు.

లంకిణిని హతమార్చాడు.

లంకానగరం మూలమూలల తిరిగాడు.

వెదకివెదకి వేసారి సీత కనిపించక అశోకవనానికి వచ్చాడు.

వస్తూ ఆలోచించాడు.

సీతను చూడకుండా వెడితే శిరశ్ఛేదం చేస్తాడు సుగ్రీవుడు, సర్వ వానరులకూ.

అది సుగ్రీవాజ్ఞ.

సుగ్రీవాజ్ఞ-అంటే చెప్పిన పని చెయ్యకపోతే, కారణం ఏదయినా సరే తల తీసేయడమే.

అందువల్ల తనుతిరిగి వెళ్ళి సీత కనిపించడంలేదని చెపితే సర్వవానర సమూహానికీ తలలు తరిగేస్తాడు ప్రభువు.

అంతకుముందే సీతజాడ తెలియలేదంటే రాముడు ప్రాణం వదిలేస్తాడు. అంతతో లక్ష్మణుడు ఆత్మత్యాగం చేస్తాడు. ఈవార్త విని అయోధ్యలో భరత, శత్రుఘ్నులు వారి తల్లులు....అందరు ప్రాణత్యాగం చేస్తారు.

తను తిరిగి వెళ్ళకుండా యిక్కడ ప్రాణత్యాగం చేస్తే వారందరూ బ్రతుకుతారు, తనరాకకు ఎదురుచూస్తూ.

అలా నిశ్చయించుకుని అశోకవనానికి వచ్చాడు.

అక్కడ కనిపించింది సీత.

అదీ వాల్మీకి రచనా వైశిష్ట్యం

ఒకానొక మహత్కార్యాన్ని తలపెట్టినపుడు ఎన్ని అవరోధాలు, అవాంతరాలు వచ్చినా, స్థిరసంకల్పంతో ఉంటే ఆ కార్యాన్ని సాధించగలరు. ఇదీ ఆయన సందేశం.

ఆ సందేశాన్ని హనుమంతుని ద్వారా వ్యక్తం చేశాడాయన.

వ్యక్తం చేశాడే తప్ప, వాచ్యంగా నినాదం చెయ్యలేదు. కనకనే ఆయన కవి అయాడు.

కవి కనుకనే మనకు దారి చూపగలిగాడు.

సరే!

అశోకవనంలో శింశుపావృక్షం నీడను కూర్చున్న సీత దగ్గఱకు తెల తెలవారుతూండగా వచ్చిన రావణుడు అనేక విధాల బ్రతిమాలాడు. సర్వ లంకానగరం ధారపోసి, పట్టమహిషిగా చేసి పాదాక్రాంతుడి నవుతానన్నాడు.

అలా తనమాట విని అంతఃపురానికి రాకపోతే ముక్కముక్కలు చేయించేస్తానన్నాడు.

అంతావిని సీతాదేవి గడ్డిపరక అడ్డంగాపెట్టి వెనుదిరిగేసింది.

రావణుడు వెళ్ళాడు.

ఇంక ప్రయోజనం లేదని సీతాదేవి ఆత్మహత్యకు సన్నద్ధురాలయి, తన కేశపాశం మెడకు చుట్టుకుని రోదిస్తున్నది.

అప్పుడామెను ఆ ప్రయత్నం నుండి విరమింపజేసి, ఆమెతో తన రాక విషయం చెప్పి, రామలక్ష్మణుల క్షేమ సమాచారాలు అందించాలి. లేకపోతే యింతవరకూ తాను చేసిన కృషి అంతా బూడిదలోపోసిన పన్నీరే! అందుకే ఎంతో యోచనచేసి:

రాజా దశరథో నామ

రథ కుంజర వాజిమాన్.

అయోధ్యానగరాన్ని పాలించే దశరథుడు చతురంగబల సమిపేతుడు. అంటూ మొదలుపెట్టి అంతవరకూ జరిగిన రామకథ అంతా మూడు నాలుగు ముక్కలలో చెప్పి, ఆమెకు విశ్వాసం కలిగించాడు.

ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎంతమాట్లాడాలి అనే విషయం ఇక్కడ బోధపరిచాడు.

ఇలానే లంకానగరం అంటించి, సముద్రందాటి తిరిగి వచ్చాక, అక్కడి వానర వీరులందరి ముందూ తన ప్రతాపగాథను రెండువందల శ్లోకాలతో హాయిగా చెప్పాడు. అంతాచెప్పి సీతాదేవి రామునికిచ్చిన సందేశాన్ని మాత్రం వారి దగ్గర విప్పలేదు.

కిష్కింధకు చేరాక రామలక్ష్మణ సుగ్రీవులముందు ఈ ప్రతాపగాథ పలకకుండా తన సముద్ర తరణ, లంకాదహన వివరాలు మూడు ముక్కలలో వివరించి, సీతాదేవి అందించిన సందేశాన్ని, చూడామణినీ రాముడికే యిచ్చాడు.

అదీ ఆయన ప్రతిభావిశేషం.

ఇలా ఎక్కడికక్కడ ఎలామాట్లాడాలో, ఏపని ఎప్పుడు చెయ్యాలో వివరించే ధీరశక్తి సంపన్నుడు హనుమంతుడు.

## కల్పవృక్షం

ఇంతటి వాడయిన హనుమంతుని విషయంలో కల్పవృక్ష కవి విశ్వనాథ మరొక్కటి కల్పించి వాల్మీకి కవి వేసిన బాటను మరింత విశాలం చేసిన సన్నివేశం చూడాలి.

రావణ సంహారం అయింది.

విభీషణ పట్టాభిషేకం జరిగింది.

అందరూ పుష్పక విమానం మీద అయోధ్యకు బయలుదేరారు. దారిలో భరద్వాజ మహర్షి ఆశ్రమం దగ్గర ఆగారు.

ఒక్కొక్కరే ఆ మునీశ్వరునికి అభివాదాలు చేశారు. ఆయన ఆశీర్వచన హస్తం అలానే ఉంచాడు. చిట్టచివరకు హనుమంతుడు ఆయన పాదాల మీద వ్రాలి చేతులు జోడించగా:

మునియున్ —
మారుతి కౌగలించుకొని
నమ్మోదంబు దీపింప
అంతన అబ్ధిన్ విపదబ్ధి
దాటితివి నిన్ దాటించితన్నన్
మహాముని! అప్డప్పుడు
మీరు మీర్మనలు అంభోయానపాత్రీ కృతాత్మ
నితాంతోగ్రతపశ్చటా వితతి
పంపన్ నేను గుర్తించితిన్.

అంటాడు వినయంగా.

స్వామీ! మీ మునిచంద్రుల తపశ్శక్తి నాకు వెనుకండగా ఉండి ముందుకు నడిపితే నేనింత చెయ్యగలిగాను కాని, ఇది నాశక్తి కాదు. అని పెద్దలముందు చూపవలసిన మర్యాద కూడ మనకు నేర్పాడు కల్పవృక్షంలోని హనుమంతుడు.

ఈ ధర్మదృష్టితో చదవండి రామాయణం. అప్పుడు తెలుస్తుంది. అది మానవ జాతికి ఎంతమేలు చేయగలదో!

## నాగరక స్త్రీ తార

రామకథలో ప్రముఖంగా కనబడక పోయినా అత్యంత శక్తిమంత మయిన పాత్రలు తార — మండోదరి.

ఈ యిద్దరూ విలక్షణమూ విశిష్టమూ అయిన వ్యక్తిత్వంకల నారీరత్నాలే.

వాల్మీకంలో తార మూడు సన్నివేశాలలో కనిపిస్తుంది. అందులో మొదట —

సుగ్రీవుడు రెండవసారి యుద్ధానికి వచ్చి సింహగర్జన చేసినపుడు వాలి బయలుదేరుతుండగా అడ్డంగా నిలబడి:

ఏమయ్యా! వాడు నిన్ననేకదా! చావుతప్పి కన్ను లొట్టపోయి వెళ్ళాడు. ఇంతలో మళ్ళీ వచ్చాడంటే అది వాడి శక్తి కాదు. ఏదో ఆధారం వుంది. నేను విన్నదానిని బట్టి ఎవరో రఘువంశీయులు అన్న దమ్ములిద్దరు ధనుర్బాణధారులు, ఖడ్గపాణులు, ఆజానుబాహులు మన కిష్కింధ చేరారని వారితో మీ తమ్ముడికి స్నేహం కుదిరిందనీ తెలిసింది. వారి సాయంతో వచ్చి ఉంటాడు. ఇప్పుడు నువ్వు వెళ్ళకు అంది.

ఒకానొక పాత్రను ప్రవేశపెడుతూనే ఆ పాత్రయొక్క జీవనాడిని పాఠకుని ముందుంచడం వాల్మీకి కవికి మాత్రమే సాధ్యమయిన విద్య.

సన్నివేశాన్ని గ్రహించగానే మనను వికసించి, బుద్ధివదునుతేరి దాని పూర్వాపరాలు వివేచనచేసి, పరిష్కారాన్ని ఊహించగల ప్రతిభానంపత్తి కలది తార.

ఆ విషయాన్నే చూపించిం దిక్కడ.

వానరాధీశ్వరుడయిన వాలి మహాబలుడు. అంతే! బలం ఉన్నదే కాని ధీశక్తి లేదు. ధీశక్తి కలది తార. రాజ్యనిర్వహణకు సేవాబలం ఎంత అవసరమో మేధాశక్తి కూడా అంత అవసరం.

వాలి భుజబలం

తార బుద్ధిబలం.

ఈ రెండూ వానర రాజ్యాన్ని నడిపాయి. అందుకే వాలి మరణిస్తూ తార ప్రతిభను జాగ్రత్తగా వినియోగించుకోమని సుగ్రీవుడికి చెబుతాడు.

అనంతరం హనుమంతుడు కూడా ఆవిడ వివేకాన్ని ప్రశంసిస్తాడు.

సరే!

శరీరబలాన్నే నమ్ముకున్న వాలి వినలేదు. తారయిచ్చిన సలహాను వినకుండా వెళ్ళాడు.

వెళ్ళి రామబాణ ఘాతంతో నేల కూలాడు.

వాలి మరణవార్త వింది తార.

వింటూనే శోక దీనవదనంతో బయలుదేరింది.

దారిలో సేనాపతులెందరో వారించారు.

కోట తలుపులు బిగించి లోపలనుంచి సలహాలిస్తే యుద్ధం కొనసాగిస్తామన్నారు.

వినలేదావిడ, దాని పర్యవసానం తెలుసును కనుక.

చకచక వాలి పడివున్న చోటికి వచ్చింది. వస్తూనే ఆయన మీద పడి గోలుగోలున ఏడిచింది.

యోధుడయిన వాడికి ఎవడూ పిల్లనిచ్చి పెళ్ళి చెయ్యడు. ఎందుకంటె దానికి వైధవ్యం తప్పదు

అయినా నాకర్మ యిలా ఉంది.

ఒక్కవిషయం ఇప్పుడు తేలిపోయింది.

ఇంతవరకూ నీ అనురాగం అంతా నామీదనే అనుకున్నాను. కాని నాకంటే నీకు ఈవేళ ప్రియమయినది. అందుకే నేనువచ్చినా నువ్వు నన్ను చేరపిలవడంలేదు.

అంటూ సామాన్య స్త్రీవలెనే విలపిస్తుంది.

రక్తమాంసాలుండి వివేకంకల ఏప్రాణి అయినా అనురాగబంధం సడలినప్పుడు ఎలా శోకిస్తుందో అలానే శోకించింది తార.

అక్కడింక తారతమ్యాలు లేవు. ఆ క్షణంలో వివేకం పనిచెయ్యదు. హృదయమే మేలుకుంటుంది. దీనికి ఏడవడం, నవ్వడం తెలుసు. మనస్సు పనిచెయ్యదు.

అదే చేయించాడు రామాయణకవి.

అంతవరకూ ఆవిడ సామాన్యస్త్రీ.

ఎదురుగా రాముడు కనిపించాడు.

ఏమయ్యా! ధర్మపాలనకు పేరుగాంచిన రఘువంశంలో పుట్టిన వాడవు కదా! నాభర్తను కడతేర్చావు. ఆయన అక్కడ నాకోసం బాధతో ఎదురుచూస్తూంటాడు. నన్నుకూడా ఆయన దగ్గరకు పంపించవయ్యా అంటుంది వీరపత్నిలా.

అనంతరం అంగదునివైపు తిరిగి:

నాయనా! నువ్వు తండ్రిలేని బిడ్డవయ్యావుగా, అని వాపోతూ

ఏమయ్యా! ఇదుగో నీకొడుకు వీడితో మాట్లాడు — అని విలపిస్తుంది.

ఈ సన్నివేశం రామాయణంలో చూస్తున్నప్పుడు, కోడెవయసులో వున్న ఒక్క కొడుకుతో వున్నతల్లి — ఆబిడ్డ తండ్రి మరణిస్తే ఎంతగా రోదిస్తుందో ఎంత వ్యథ పడుతుందో కళ్ళకుకట్టి కన్నీరు విడుస్తాం తప్పదు.

ఇక్కడ ఆవిడ వాలి భార్య.

రాకుమారుడయిన అంగదుని తల్లి.

కాని అసలుతార ఆవిడకాదు.

కిష్కింధా సామ్రాజ్యాన్ని నడిపిన యిల్లాలు వేరే వుంది.

వాలి ఒకానొక రాక్షసునితో యుద్ధానికి వెళ్ళాడు. వాడు కొండ గుహలో దూరాడు. వాలికూడా అనుసరించాడు. అన్నగారితో వెళ్ళిన సుగ్రీ

వుడు గుహద్వారంలో వుండిపోయాడు. రోజులు గడిచాయి, గుహలోనుంచి రక్తప్రవాహం వస్తున్నది.

రాక్షసుని హస్తాలలో అన్నగారు మరణించారనుకుని ఆ గుహకు అడ్డంగా బండరాయిపెట్టి సుగ్రీవుడు తిరిగివచ్చి అంత్యక్రియలుజరిపి సింహాసనం ఎక్కాడు.

తార సుగ్రీవుని ప్రియురాలయి రాజభోగాలనుభవించింది.

వాలి తిరిగి వచ్చాడు.

సుగ్రీవుని రాజ్యభ్రష్టుని చేశాడు. సింహాసనం ఎక్కాడు. తార వాలితో కాపరం చేసింది. రాజ్యచక్రం తిప్పింది. ఇప్పుడు వాలి నిజంగా మరణించాడు. ఏడిచేసింది. సుగ్రీవుని అంతఃపురం చేరింది తార. మళ్ళీ హాయిగా అంతిపురిలో రాజభోగాలనుభవిస్తూ సుగ్రీవుని ప్రియురాలుగా జీవితం గడుపు తున్నది:

అదీ తార ప్రకృతి.

స్త్రీ ప్రకృతిలో ఉండే సర్వసామాన్య దౌర్బల్యాలన్నీ ఉన్నాయి తారలో.

ఆ దౌర్బల్యాలలో ప్రధానమయినది – ఎవరు సంపన్నులయితే, ఎవరు అధికారప్రముఖులయితే వారివెంట మందహాసంతో తిరుగుతూ సుఖమయ జీవితం గడపగల నాగరిక స్త్రీలందరికీ ప్రతినిధి, ప్రతిబింబం తార.

## పతాక సన్నివేశం

వాలికి సోదరుడయిన సుగ్రీవుడుకూడా శూరుడే తప్ప ధీమంతుడు కాదు.

కిష్కింధలో ధీ, ధీరశక్తి సంపన్ను లిద్దరే.

ఒకడు వృద్ధుడు - జాంబవంతుడు.

మరొకడు నవయువకుడు హనుమంతుడు.

ధీమంతుడు కానందువల్లనే సుగ్రీవుడు సింహాసనం లభించగానే మదిరాపాన, మదవతీభోగమత్తుడై రామకార్యం విస్మరించారు.

విస్మృతిఫలంగా—

సత్యవాక్పాలన పరాయణుడయిన రాముడు తమ్ముని పిలిచి సుగ్రీవుని విషయం కనుక్కు రమ్మన్నాడు.

ఏక ఏవ రణే వాలీ
శరేణ నిహతో మయా
త్వాంతు సత్యా దతిక్రాంతం
హనిష్యామి సబాంధవం.

అలనాడు అక్రమంగా వ్యవహరించినందుకు వాలిని ఒక్కడినే సంహరించాను.

ఈనాడు ఆడినమాట తప్పిన ఫలంగా నీబంధుకోటితోసహా సర్వ నాశనం చేస్తానని చెప్పు అన్నాడు.

అదీ రాముడి మాట.

అసత్యవాదిని క్షమించలేదు, సహించలేదు రాముడు. ఆ దోషం తన తండ్రికి రాకూడదనే ఊహతోనే, వారసత్వంగా తనకు సంక్రమించవలసిన సామ్రాజ్యాన్ని తృణప్రాయంగా వదలివచ్చిన మహామహుడాయన. అదీ ఆయన సర్వప్రాణికీ ఆచరించి బోధించిన న్యాయం, చూపించిన మార్గం.

వచ్చాడు లక్ష్మణుడు.

కిష్కింధకోట దాటాడు.

అంతఃపురం చేరాడు.

ద్వారంలోనిలబడి ధనుష్టంకారం చేశాడు.

అలనాడు వాలి సంహారసమయంలో విన్న ధనుష్టంకారధ్వని వినబడి సర్వవానర యోధులూ భయకంపితులై గర్జించారు.

ఆ యీధ్వమలతో సుగ్రీవునికి తెలివివచ్చింది.

లక్ష్మణుడు సింహద్వారంలో వున్నట్టు మంత్రులు చెప్పారు.

వింటూనే తారను పంపాడు, పంపుతూ :

తీవ్రక్రోధంతో వుంటాడు లక్ష్మణుడు : అయినా ఇక్ష్వాకువంశీయులు స్త్రీలముందు క్రోధంతో వుండరని పంపాడు.

వస్తున్నది తార.

ఎలా ఉన్నది ఆవిడ వాల్మీకి రామాయణంలో.

సా ప్రస్ఖలంతీ మదవిహ్వలాక్షీ
ప్రలంబ కాంచీగుణ హేమదామ్నా.

అంటే—

తప్పతాగిన మైకంలో కన్నులు మూతలు పడుతున్నాయి. వడ్డాణం జారుతున్నది. వెన్ను నిలబడడం లేదు.

అటువంటి దశలో వచ్చింది.

అయినా ఆవిడ మనస్సు వశం తప్పలేదు. బుద్ధిసక్రమంగా పనిచేస్తున్నది. అంత మైకంలో మనస్సును పట్టుతప్పనివ్వదు.

అదీ తారస్వరూపం,

ఎంత తాగినా, మరెంతగా కామవశచిత్త అయినా మనస్సు స్వాధీనం తప్పదు. ఆవిడ ప్రతిభ అంతటిది. అప్పుడు లక్ష్మణుని తీవ్రక్రోధాన్ని శాంతింపజేసి సుగ్రీవుని దగ్గరకు తీసుకువెళ్ళి కార్యం సానుకూలం చేస్తుంది.

ఇంత ఉంది తారకథ. ఇదంతా కొద్ది క్షణాలలోనే ముగుస్తుంది.

కిష్కింధలో మూడు సన్నివేశాలలో ఇంతనూ నిక్షేపించిన వాల్మీకి కవి ఆధునికయుగంలో యిలా అధికారులవెంట, సంపన్నులవెంట, తిరిగే ఎందరో స్త్రీలకు ప్రతినిధిగా నిలబెట్టాడు-తారను. దేశకాలాలు ఎంతగా మారినా

నజీవంగా వుండే పాత్రలతో వున్నందువల్లనే రామాయణం నేటికీ జీవ స్రవంతి.

అంతేకాని - అల వైకుంఠ పురంబులో నగరిలో ఆమూల సౌధంబు దాపల లక్ష్మీదేవితో సంసారంచేసే ఆయన అవతరించడంవల్ల కాదు. కాదు గాక కాదు అని రామాయణం చదివిన వారికి తెలును.

## సూక్ష్మంలో మోక్షం

అయోధ్యానగరాన్ని పాలించే దశరథుడనే మహారాజుకి ముగ్గురు భార్యలు, నలుగురు కొడుకులు.

వారిలో పెద్దవాడు రామభద్రుడు. భార్యసీతతో తమ్ముడు లక్ష్మణునితో వనవాసానికి రాగా అక్కడ రావణుడు సీతను అపహరించాడు.

సీతజాడ తెలియక రామలక్ష్మణులు ఆమెకోసం వెదకుతూ కిష్కింధ చేరి సుగ్రీవునితో స్నేహంచేసి వాలిని చంపి వానరులను సీతాన్వేషణకు పంపారు. ఇక్కడికి బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ కాండలు అయాయి.

దక్షిణదిశగా వెళ్ళిన వానరులు తిరిగివస్తూ తరతరాలుగా ఎవరూ అడుగుపెట్టకుండా రక్షించుకునే మధువనంలో దిగి స్వేచ్ఛగా మధుపానం చేసి ఒళ్ళుతెలియకుండా క్రీడిస్తున్నవార్త ఆ వనపాలకుడు సుగ్రీవునికి తెలియజేశాడు.

అదివిన్న సుగ్రీవుడు రామునివయిపు తిరిగి.

> జాంబవా న్యత్ర నేతాస్యాత్
> అంగదశ్చ బలేశ్వరః
> హనుమాం శ్చా వ్యధిష్ఠాతా
> న తస్య గతి రన్యథా.

అంటాడు.

జాంబవంతుడు నాయకుడు. అంగదుడు బలాధిపుడు.

హనుమంతుడు అధిష్ఠాత....అటువంటవ్వాడు కార్యం సఫలంకాక పోవడంలేదు.

ఒక్క ముక్కలో తన అనుచరుల శక్తి సామర్థ్యాలను వాచ్యంగా వ్యక్తం చేయడంతో ఆగకుండా వ్యంగ్యమర్యాదలో వారు సీతనుచూసి వచ్చారని కూడా తెలియజెప్పాడు.

ఈ ముక్కలో తన పరిజనులలో ఎవరెవరు ఎంతటివారో తనకు తెలుసుననీ, ప్రభువు ఆజ్ఞను పాలించకుంటే వారు మధువనంలో ప్రవేశించ లేరనీ, అంతటి వివేకం కలవాడు సుగ్రీవుడనీ చెప్పకుండానే చెప్పాడు వాల్మీకి.

ఒక్క శ్లోకంలో అటు ప్రభుశక్తినీ, యిటు ప్రభుభక్తినీ వ్యక్తంచేసి ఊరుకోలేదే, మరొక ఆలోచనా రమణీయ విషయంకూడా యిందులోవుంది.

జాంబవంతుడు నాయకుడు అన్నాడు. ఇతఃపూర్వం ఎక్కడా ఈ భల్లూకపతి నాయకత్వ విషయం ప్రస్తావించలేదు. ముందు ముందు కూడా ఆయన నాయకత్వం మనకు కనిపించదు.

అయినా ఎందు కిలా అన్నాడు—

అంటే—

జాంబవంతుడు లేకపోతే సముద్రం దాటడం లేదు.

సీతా సందర్శనం లేదు; తిరిగిరావడం లేదు.

మరికొంత వివరణ అవసరం యిక్కడ.

వానరులందరూ దక్షిణ సముద్రతీరం చేరారు.

శతయోజన విస్తీర్ణమయి, తిమి, తిమింగిల, మహామకరాలతో నిండిన ఆ సాగరాన్ని చూశారు.

కళ్ళు తేలవేశారు.

నీరు కారిపోయారు.

ప్రాయోపవేశానికి సన్నద్ధులయారు.

సీతను చూడకుండా వెడితే తలలు తరిగేస్తానని సుగ్రీవుని మాట.

అది సుగ్రీవాజ్ఞ:

అక్కడకుపోయి తలలు నరికించుకోవడంకంటె యిక్కడే ప్రాణత్యాగం చేసుకుందాం అనుకున్నారు.

అప్పుడు జాంబవంతుడు అందరినీ ఆపి మీలో ఎవరెవరు ఎంతెంత దూరం దూకగలరు—అన్నాడు.

అందరూ తమ తమ లంఘనశక్తి చెప్పుకున్నారు.

ఒక్కరూ సముద్రందాటి రాలేరు.

అప్పుడు జాంబవంతుడు లేచి, మౌనంగా ఒకవారకూర్చున్న హనుమంతుని సమీపించి

"నాయనా! ఏమిటిలా కూర్చున్నావు. ఈ మహాకార్యానికి నువ్వే సమర్థుడవు" అని ప్రోత్సహించి పంపించారు.

అదీ నాయకత్వ లక్షణం.

తన సహచరులలో ఎవరెంతటివారో గ్రహించి వారి చేత ఏపని చేయించాలో తెలిసినవాడే నాయకుడు.

విషమ సన్నివేశంలో వివేకం కోల్పోకుండా గుండె నిబ్బరంతో కార్య సాధన మార్గం గ్రహించగలవాడే నాయకుడు.

ఆ శక్తిని జాంబవంతునిలో ముందుగా చూపించి అప్పుడు సుగ్రీవుని చేత ఈ మాట పలికించి మళ్ళీ మనదృష్టిని అటు మళ్ళించి జరిగిన కథను మననం చేయించడంలో వుంది కవి శక్తి.

దీనినే ఆలోచనామృతం అని, ఆలోచనారమణీయం అనీ కావ్యతత్త్వ వేత్తలు వ్యాఖ్యానించారు. ఈ దృష్టితో మరోమారు రామకథ చదివితే జాంబవంతుని నాయకత్వ లక్షణాలు మరెన్నో గోచరిస్తాయి.

సీతను చూచి తిరిగి వస్తున్నాడు హనుమంతుడు లంకానగరం నుండి. ఈవలి ఒడ్డున వానరులందరూ ఆ మహామహుని రాకకోసం నిన్న ఉదయం నుంచి ఎదురు చూస్తున్నారు, ప్రాణాలు అరచేత పట్టుకుని

ఆయన సీతను చూసివస్తే యిందరి ప్రాణాలు దక్కుతాయి. హాయిగా తిరిగివెళ్ళి ఎవరి భార్యాబిడ్డలను వారు చూసుకుని సుఖంగా వుంటారు. అలా కాకపోతే అందరికీ ఆనాటితో జీవితం ఆఖరు. అందుచేతనే వారందరూ హనుమంతుని రాకకోసం అలా నిరీక్షిస్తున్నారు.

అటువంటి సన్నివేశంలో తిరిగి వచ్చే హనుమంతుడు సముద్రతీరం చేరడానికి కొన్ని నిమేషాల ముందుగానే మహాధ్వని చేశారు తన రాకను సూచిస్తూ ఆ ధ్వని విని వానరులంతా అయోమయంగా జాంబవంతుని చుట్టూచేరి బిక్కు బిక్కుమంటూ చూస్తున్నారు. అప్పుడాయన:

న హ్యస్యాకృత కార్యస్య
నాద యేవం విధో భవేత్.

అన్నాడు.

నాయనా!

కార్యసాధకుడు కానివాడు అంత తీవ్ర నాదం చెయ్యలేడు అని దాని భావం. అంటే-మన మారుతి సీతాదేవిని చూసి వస్తున్నాడు. నిర్భయంగా ఉండండి అని ఆశ్వాసించాడు.

దీన్నిబట్టి నాయకుడయిన జాంబవంతునికి ఏ ధ్వని, ఏ సమయంలో పుడుతుందో తెలును. దానిని బట్టి కార్యసాఫల్యం గ్రహించగల శక్తివుంది అని మనం గ్రహించగలం. ఇది కూడా నాయకలక్షణమే. హనుమంతుడు వానర సమూహ మధ్యంలో దిగి వారందరి అభినందనలూ అందుకున్నాడు.

అప్పుడు జాంబవంతుడు చిరునవ్వుతో:

నాయనా! సముద్రం ఎలా దాటావు? లంకానగర విశేషాలేమిటి? ఆ నగరాధిపతి అయిన క్రూరకర్ముడు దశకంఠుని వర్తమానం ఏమిటి? అన్నీ వివరంగా చెప్పు, అన్నాడు.

ఒకానొక మహత్కార్యసాధనకు ఒకరిని వియోగించినప్పుడు ఆ ఒకడు తనపని సాధించుకురాగానే వాని ఉత్సాహాన్నీ శక్తినీ అభినందించి ఆ సాధనలో వాని కష్ట సుఖాలన్నీ వినే అవకాశం వానికి కలిగించాలి. అప్పుడు ఈ సర్వశ్రమనూ విస్మరించి ఆనందించగలుగుతాడు. ఆ విషయాన్ని బోధించడానికే జాంబవంతుడు ఈ ప్రశ్న వేస్తాడు.

మరొక్క సన్నివేశంతో యీ నాయకత్వ లక్షణ వివరణ ముగిస్తాము.

సంగ్రామం సాగుతోంది.

ఇంద్రజిత్తు కొంతసేపు రణక్రీడ సాగించి బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్ర శక్తికి రామలక్ష్మణులు సైతం తల వాల్చక తప్పలేదు.

వానరసేన సర్వ శక్తులూ కోలుపోయి సమ్మూర్ఛితమయింది. విభీషణుడొక్కడే నిలబడి వున్నాడు. ఆయన నెమ్మదిగా హనుమంతుని సమీపించి మేలుకొలిపి నాలుగడుగులు వేసి జాంబవంతుని దగ్గరకు చేరాడు. ఆ వృద్ధ నాయకుడు కూడా బ్రహ్మాస్త్ర బలానికి కన్నులు మూతపడి వున్నాడు.

విభీషణుడు "తాతా" అనడంతో, నాయనా! కన్నులు విడదం లేదు—గొంతును బట్టి నువ్వు విభీషణుడి వనుకుంటున్నా. ఇంతకీ మన మారుతి కుశలమా! అన్నాడు.

అనగానే విభీషణుడు: తాతా! రామలక్ష్మణు లేమయారని కాని, మీ ప్రభువు సుగ్రీవు డేమయాడని కాని అడగకుండా ఒక్క హనుమంతుని విషయం అడుగుతున్నావేమయ్యా, అన్నాడు.

అప్పుడంటాడు జాంబవంతుడు:

నాయనా! వాడొక్కడు జీవించి ఉంటే సర్వమూ భద్రమే. వాడు లేకపోతే యింకేమీ లేదు—అని.

అదీ జాంబవంతుని నాయకత్వ విశేషం.

తన వారిలో ఎవరి శక్తి ఎంతటిదో తెలుసుకుని వారి యోగ క్షేమాలు నిరంతరం చూసుకుంటూ ఉన్నంతకాలమే సర్వులకూ భద్రం.

అలా కాక అభిమాన ద్వేషాలతో సమర్థులను వదులుకుని, ఆశ్రయించి అడుగులకు మడుగులొత్తే అసమర్థులను అందలాలెక్కించే నాయకులు ఏ దశకు చేరేదీ ఈనాడు మనం చూస్తున్నాం.

అటువంటి నాయకులందరికీ జాంబవంతుడు పాఠాలు నేర్పుతాడు—ఆయన మీద గౌరవంతో ఆయన పాత్రను అవగాహన చేసుకుంటూ రామాయణం చదవగలిగితే!

* * * * *

రామ రావణ సంగ్రామం తీవ్రంగా సాగుతోంది. కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, మహాకాయ, విరూపాక్ష, యూపాక్ష, మకరాక్ష, ప్రహస్తాదులందరూ నేలకూలారు.

రావణుడు రథారూఢుడై రణరంగంలో ప్రవేశించాడు.

రోజులు గడుస్తున్నాయి.

జయాపజయాలు తేలడం లేదు.

ఇటు వానర వీరులు — అటు హత శేషులయిన రాక్షసులు విస్తుపోయి చూస్తున్నారు.

జరుగుతూన్న రామ రావణ సంగ్రామ తీవ్రతను సూచించడానికి వాల్మీకి మునిచంద్రుడు ఒక్క ఉపమానం కూడా వాడకుండా ఆ యుద్ధ తీవ్రతను ఆ యుద్ధ తీవ్రంతోనే వర్ణించాడు. ఎంత చిత్రమయినదో చిత్తగించండి.

గగనం గగనాకారం
సాగరం సాగరోపమం
రామరావణ యోర్యుద్ధం
రామరావణ యోరివ!

ఆకాశం ఆకాశం వలెనే ఉంటుంది.

(అనంత విశాలాకాశాన్ని దేనితో పోలుస్తాం)

అత్యంత గంభీరమయిన సముద్రానికి సముద్రమే ఉపమానం.

అలానే రామ రావణ యుద్ధం రామ రావణుల వలెనే ఉన్నది.

అంటే అంతకు ముందెన్నడూ అటువంటి తీవ్ర సంగ్రామం జరుగ లేదు; ఆ తరువాయి జరిగే అవకాశం లేదు.

అదీ కవి లక్షణం. కవిత్వపు జీవనాడి తెలిసిన ప్రయోగం అది. కాళిదాసాదులందరికీ ఉపమాన బిక్ష పెట్టిన వాల్మీకి ఈ సన్నివేశంలో ఉపమాన రహితంగా అందించడమే ఆయన రచనకు పరాకాష్ఠ.

ఈ సమయంలోనే—

వానర యోధాగ్రేసరులందరూ తెల్లబోయి చూస్తున్న వేళ, సంగ్రామ పర్యవసానం ఎటు సాగుతుందో తెలియక ఆందోళన పడుతున్న వేళ:

ఎందుకీ ఆందోళన!

దేనికి వారి ఆతురత!

అంటే—

లంకేశ్వరుడయిన రావణుని, చతుర్దశభువనాలనూ గజగజలాడించి దేవేంద్రాదులను పాదాక్రాంతులను చేసుకున్న రావణుని, సప్త సముద్రాలలో ముంచి ముప్పు తిప్పలు పెట్టి విడిచిన వాలిని ఒకే ఒక్క బాణంతో నేల కూల్చిన రాముడు రావణునితో యిన్ని రోజులు యుద్ధం నడుపుతున్నాడే! అంటే ఈ రావణుడసలు నేల కూలేనా! అవే శంక వారి మనస్సులలో మనలు

తూస్నట్టు పసిగట్టినాడు కాబోలు రాముడు, ఆనాడు యుద్ధానికి బయలు దేరుతూ :

> అద్య పశ్యంతు రామస్య
> రామత్వం మమ సంయుగే!

ఈనాటి యుద్ధంలో రాముడంటే ఏవిటో చూస్తారు.

> అ రావణ మరామం వా
> జగద్ద్రక్ష్యథ వానరాః

ఈనాటితో రాముడో రావణుడో ఒకడే మిగులుతారు, అన్నాడు.

ఎంతటి ఆవేశంలోనూ వివేకం కోలుపోని వీరుడయినవాడు ఎలా మాట్లాడుతాడో చూపించాడు.

ఒక అలంకారం లేదు, సమాసం లేదు, శబ్దాడంబరం లేదు.
రామాయణం పుట్టింది మొదలు నాటికీ, నేటికీ యిదేమాట
వాడో . .నేనో.... ఒకడే మిగలాలి ...అంటాడు, ఎవడయినా.

ఒకానొక సన్నివేశంలో ఏ పాత్ర మనఃస్థితి ఎలా ఉంటుంది, ఆ స్థితిలో ఎలా మాట్లాడాలి, ఏం మాట్లాడాలి? అనేది తెలుసుకోగలవాడే పది కాలాలపాటు బతికే కావ్యం వ్రాయగల కవి అవుతాడు.

ఆ విద్య అందని వారందరూ మహాకవులుగా ప్రచారం చేయించుకుంటారు వారు జీవించినంతకాలం, అనంతర విషయాన్ని గురించి చెప్పడం న్యాయమా!

మహాకవి కాదు కవకనే వాల్మీకి కవి మాత్రుడుగా మనతో వస్తూనే ఉన్నాడు. మన జీవన మార్గదర్శకుడుగా, జీవితమాధుర్య ప్రదర్శకుడుగా.

# రావణ రాజనీతి

[మన జాతికి మొదటి కావ్యం రామాయణం. దీని రచనకు మూలకారణం క్రౌంచపక్షి వియోగం. దాని శోకం వాల్మీకిముని గుండెను కదిలించగా ఆ ముని శోకం శ్లోకం అయింది. అలా ఆ పిట్ట కథను పుట్టముని నారదమునీంద్రుని ప్రేరణతో శ్రీమద్రామాయణంగా అందించాడు. ఆ పుట్టముని (వల్మీక భవుడు) ఇచ్చిన పట్టతేనె ఆస్వాదించినవారు కోట్ల సంఖ్యలో వుండగా ఒకరిద్దరికి మరికొన్ని "పిట్ట కథలు" కట్టాలనిపించింది. అలా వచ్చిన కథ పరమార్థ పరిశీలనతో ఈ వ్యాస పరంపర ముగుస్తున్నది.]

భారత రామాయణాల కున్నంత ప్రఖ్యాతి ప్రచారం ఈ దేశంలో ఈ నాటికీ మరే గ్రంథానికీ లేవు.

వేదాలనూ, ఉపనిషత్తులనూ, కనులకద్దుకుని దూరంనుంచే చేతులు జోడించే వారున్నా వీరెవరికీ వాటిలో ఉన్నదేమిటో తెలియదు.

కాని—

ఈ వేదాలలోని, ఉపనిషత్తులలోని ధర్మబీజాలను గ్రహించి విశ్వ మానవ కళ్యాణ దృష్టితో భారత, రామాయణ మహావటవృక్షాలుగా పెంపొందించారు వ్యాసవాల్మీకులు. ఈ తరుచ్ఛాయలలో ఎందరో సేదదీర్చుకుని తమ జీవితాలను తీర్చి దిద్దుకుని మనస్సును వికసింప జేసుకుంటున్నారు. నేటికీ, కొందరు ఈ వృక్షాలకు తమతమ భాషలలో అంట్లుకట్టి అందించారు (అనువాదాలుగా.)

ఈ అంటు తొక్కడంలో వారి మనోవికారాలు చేరి కొన్ని కొమ్మలకు పిట్టకథల కుక్కమూతి పిందెలు దింపారు. కొందరికి ఈ పడగొట్టు పిందెలే రుచికరాలు కావడం విచారకరం.

ఇందుకు కారణం కొంతవరకూ అనువాదకులు కాగా—పూర్తి బాధ్యతను పౌరాణికులు, హరిదాసులు, నాటకకర్తలు, చివరకు సినిమావారు వహించారు.

రామాయణంలో వాల్మీకికి కూడా తెలియని కథలూ, సన్నివేశాలూ వీరు కనిపెట్టారు.

అందులో మొదటిది,

ఇంద్రజిత్తు భార్య సులోచన అనే అమ్మాయి రణరంగంలో కూలిన భర్త దగ్గరకు రావడం.

రావణుని కొడుకుల భార్యల పేరులేమిటి? అనేది వాల్మీకం తల క్రిందులుగా చదివినా కనపడదు. అందాకా ఎందుకు కుంభకర్ణుడి భార్యకీ పేరులేదు, ఆ దశలో ఈ "పిల్ల" కథ ఎలా వచ్చిందో తెలీదు.

ఇటీవలి ధోరణులు చూస్తూంటే ఒక్కటి తెలుస్తుంది. అంత ఉదాత్తంగా నాయక ప్రతి నాయక సృష్టిచేసి, సర్వప్రజల ఆరాధనలూ అందుకునే ఆదికవి రచనకు ఇంత మసిపూసి చప్పట్లు కొట్టాలనే ఊహ అలనాటినుంచీ వస్తున్నదని, ఆ దురూహ కాకపోతే రామ కథను దేశదేశాలవారు అలా మసిపూసి వ్రాసుకొనేవారు కాదు.

అందులో ఓ పూత ఈ సులోచన.

మరో అవివేక సన్నివేశం—

నేలకూలిన రావణుని వద్దకు రాముడు తన తమ్ముని పంపి రాజనీతి నేర్చుకు రమ్మన్నాడట:

వాల్మీకిముని రచించిన రామాయణం ఒక్కమారు చదివిన వారికయినా రాముని స్వరూపస్వభావాలతోపాటు రావణుని ప్రవృత్తి కూడా తెలిసి తీరుతుంది.

విశ్వామిత్ర యాగరక్షణవేళ రామబాణంతో సముద్రం ఒడ్డునపడ్డ మారీచుడు ఆ తరువాయి ఇరువది అయిదు సంవత్సరాలు గడిచాక రావణునితో అంటాడు.

రామో విగ్రహవాన్ ధర్మః
సాధు స్సత్య పరాక్రమః.

అంటే —

రాముడు రూపు దాల్చిన ధర్మమూర్తి, పరమ సజ్జనుడు, సత్య పరాక్రముడు అని శత్రువునోట అంతటి ప్రశస్తిపొందినవాడు రాముడు.

ఆ రాముడు రాజనీతి తెలియక తన తమ్ముని ఎవరి దగ్గరకు పంపాడు ?

రావణుని సన్నిధానానికి

ఎవడీ రావణుడు :

స్వ ధర్మో రక్షసాం భీరుః
సర్వథైవ న సంశయః
గమనం వా పరస్త్రీణాం
హరణం సంప్రమథ్య వా.

అని తననోటితో తాను చెప్పుకున్న ప్రబుద్ధుడు.

పితా ! ధర్మనిర్వహణలో మేమెప్పుడూ పొరబాటుపడం.

మాధర్మం ఏమిటో తెలుసా !

పరదారగమనం

అపహరణం, బలాత్కారం.

అది ఆ లంకేశ్వరుని ధర్మనిష్ఠ.

అటువంటి ధర్మాత్ముడి దగ్గరకు రాజనీతి నేర్చుకురమ్మని పంపుతాడా రాముడు అని ఆలోచించలేక పోయారు వీరు.

పయిగా —

రాముడు రణరంగంలో ఎలా వదగొట్టాడు ? రావణుని, బ్రహ్మాస్త్రంతో ఈ అస్త్రలక్షణం ఏమిటి ?

దాని లక్ష్యం వేల కూల్చడం, మళ్ళీ ఊపిరి నలపనివ్వకుండా

వేల కూలుతూవే ఆ ప్రాణి అంతిమ శ్వాసవిడవడం తప్ప దారిలేదు. అంతశక్తివంతమయిన అస్త్రంతో రావణుడు నేలకూలాడు. పచ్చిమంచినీళ్ళు కూడా అడగకుండా ప్రాణం వదిలాడు.

రావణుడే కాదు రామబాణఘాతం తగిలిన ఎవడయినా ఆ దశలోనే పడతాడు.

అలాకాక మాట్లాడినవాడు — వాలి ఉన్నాడు.

దానికి కారణం వాలిని అస్త్రంతో సంహరించలేదు. మామూలు శస్త్రంతో కొట్టాడు. అస్త్రఘాత, శస్త్రఘాతాలకున్న భేదం అది.

అందు చేత —

బ్రహ్మాస్త్రంతో పడి శవమైన రావణుడు వేర్పే రాజనీతి ఏమిటో వివేకం కలవారు ఊహించాలి. ఈ కథ కట్టినవారి అవివేకం ఎంతటిదో బోధపడాలంటే,

వీరి

రావణుని కడుపులో అమృతభాండం వుంది.

అది పగిలితే కాని చావడట.

రావణుని ఎరిగిన వారెవరయినా ఆ లంకేశ్వరుడు, ఖాళీకుండలు మ్రింగి మోళీకట్టేవాడు కాడని గ్రహించగలరు. అయినా ఎందుకు పుట్టిందీ కథ?

వాల్మీకి చెప్పిన రామకథ తెలియక ఏవేవో కాలక్షేపం కథలు వినడం వల్ల పెరిగిన బుర్రలలో యింతకంటే ఏం పుడుతుంది!

## ఉపేక్ష

వీరి కంటె కొంచెం వివేచన కలవారు మరికొన్ని కావ్యాలు సృష్టించారు.

ఆయన వుపేక్షించిన పాత్రలకు ప్రాణం పోద్దామనుకున్నారు వీరు.

మహామహుడయిన వాల్మీకి తన కావ్యంలో ఏ పాత్ర ఎంతవరకూ వుండాలో, ఏ క్షణంలో నిష్క్రమించాలో చూపించిన విధానం చూశారు. ఆమాత్రంకూడా అవసరం లేదనుకున్నవారికి పేరుకూడా పెట్టకుండా వదిలి పెట్టాడు.

ఈ పరమరహస్యం తెలియక కొందరు ఈ ఉపేక్షితలమీద కావ్యాలు వ్రాసి కొంతకీర్తి సంపాదించుకున్నారు. వారికీర్తి మిగిలిందే తప్ప ఆ పాత్రలకు ప్రాణం రాలేదు.

వాల్మీకి వలెనే భారతంలో వ్యాసుడుకూడా కొందరిని నామరూపాలు లేకుండా వదిలాడు. వీరిని ఆశ్రయించి మరికొందరు పెరిగారు. అది వేరే కథ.

పర్యవసానంగా ఈ పిట్టకథలూ, ఈ కావ్య ఇతిహాసాలకు వ్రాసిన వ్యాఖ్యలు చదివి మూర్ఛపో నవసరంలేదు.

ఆ మునిచంద్రులు అందించిన మూలగ్రంథాలు చూడవచ్చు. అది అందనివారికి వారిభాషలో పద్యకావ్యాలున్నాయి. అదీ అందుకోలేని వారికి వచనంలో దొరుకుతున్నాయి. రామాయణ, భారతాల పరమార్థం విడవకుండా సారంగ్రహించి శిష్టవ్యావహారికంలో నేనుకూడా వాటిని అందించాను. అది చదివితే చాలు ఆ మునిచంద్రులు తమజాతికి ఎలా మార్గదర్శకులయారో బోధపడుతుంది. అప్పటికీ సందేహాలుంటే ఓ కార్డు వ్రాయండి.

మానవజాతికి జ్ఞాననేత్రాలు భారత, రామాయణాలు. జీవితరథానికి ఉక్కు చక్రాలు. దేశ, కాలభేదం లేకుండా అవి మార్గదర్శకత్వం వహిస్తాయి. మతంతో కూడా నిమిత్తం లేదు, భారత, రామాయణాలను. చదవండి, మళ్ళీచదివి, చదివించండి.

( ఈ వ్యాసాలు ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో
ఇతఃపూర్వం ప్రచురితమయినవే. )

---

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్ ।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్ ॥

# బాలకాండ

## యజ్ఞరక్ష

శ్రీనముపేతమయిన అయోధ్యానగరంలో దశరథనందనులు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు బాల్యక్రీడలు ముగించి సర్వశాస్త్ర ధనుర్వేదవిదు లవుతున్నారు. ఆరోజులలో యజ్ఞ విధ్వంసనానికి ఉపక్రమించే రాక్షససంహారార్థం విశ్వామిత్రుడు అయోధ్యకు చేరి రాజ సభాభవన ద్వారందగ్గర నిలబడి మహారాజుకు తనరాక ఎరిగించమన్నాడు. వార్త వింటూనే దశరథుడు మంత్రి, పురోహిత, దండనాథాది అనుచరవర్గంతో క్షణకాలంలో ఎదురేగి స్వాగతమర్యాదలు నిర్వర్తించి, లోపలికి కొనివచ్చాడు. మహర్షి విశ్వామిత్రుడు వారికుశలం అడిగాడు. కొంతసేపు కుశలప్రశ్నలు నడిచాక ఆయనతో దశరథుడు :

బ్రహ్మర్షీ! మీరు అడుగుపెట్టడంతో మాగృహం పావనమయింది మా జన్మ ధన్యమయింది. తాము ఏపనిమీద దయచేశారో ఆజ్ఞాపిస్తే అదినెరవేర్చడానికి అంజలి బద్ధుడనై ఉన్నాను, అని వినయంగా చూస్తూ నిలబడ్డాడు.

విశ్వా : ఉత్తమవంశంలో జన్మించిన మహాపురుషుడికి ఉండవలసిన వినయ సౌశీల్యాలు మూర్తీభవించిన నిన్ను చూస్తుంటే నాకు చాలా ఆనందంగావుంది. వసిష్ఠులవారి శిష్యుని కుండవలసిన ధర్మపరాయణత్వం నీలో గోచరిస్తున్నది, అని ప్రశంసించి :

మహారాజా! పరమనిష్ఠతో నేనొక యజ్ఞం తలపెట్టాను. మారీచ సుబాహులనే రాక్షసులు దానికి విఘ్నం కలిగిస్తున్నారు. వారు పరాక్రమవంతులు, కామరూపులు, సుశిక్షితులు. యజ్ఞం ప్రారంభించగానే అనుచరసహితులైవచ్చి రక్తమాంసాలతో యజ్ఞవేదికను ధ్వంసం చేస్తున్నారు. యజ్ఞవేళ క్రోధం దరిజేరకూడదు కదా! అందుచేత వారిని శపించడంలేదు. ఇక వారినుంచి ఈ క్రతురక్ష జరగాలంటే నీ జ్యేష్ఠుడు రాముడు నాతో రావాలి. వయసున చిన్నవాడయినా మీ రాముడు సత్యపరాక్రమంతో మారీచ సుబాహులను నిగ్రహించగలడు. అందువల్ల ముల్లోకాలలో రాముని యశశ్చంద్రికలు వ్యాపిస్తాయి.

నీ క్షేమయినా సందేహాలుంటే మీ కులగురువులు వసిష్ఠులవారితో సంప్రదించు. యజ్ఞ ప్రారంభానికి పదిరోజుల వ్యవధి ఉంది. త్వరగా నిర్ణయించు, అన్నాడు.

వింటూనే నిశ్చేష్టుడయిన దశరథుడు కొంతసేపటికి తేరుకొని, బ్రహ్మర్షీ: పదహారే ళ్లు నిండలేదే నా పసివాడికి. వాడు రాక్షసులతో యుద్ధమా! నాకు అక్షౌహిణీ సైన్యం వుంది. శస్త్రాస్త్రప్రయోగ నిపుణులయిన యోధులున్నారు వారితో వచ్చి నేను రాక్షస సంహారం చేస్తాను. అంతేగాని పసివాడయిన రాముడెందుకు! నా శరీరంలో ప్రాణం వున్నంతవరకూ మీ యజ్ఞానికి విఘ్నం వుండదు. మాయాజాలంలో ఆరితేరిన రాక్షసుల మధ్యకు రాముని పంపి నేను జీవించలేను. కాదు, రాముడే రావాలన్నా నేనూ చతురంగ బలాలతో తోడువస్తాను. జీవితమంతా సంతానంలేక యిప్పటికి కలిగిన యీ బిడ్డలలో నాకు వీడంటే పరమప్రీతి. ఇంతకూ ఆ మారీచ సుబాహు లెవ్వరు? వారి శక్తిసామర్థ్యా లెట్టివి? అని కంపిత హృదయంతో అంజలిబద్ధుడై అడిగాడు.

విశ్వా: మహారాజా! బ్రహ్మ అనుగ్రహించిన వరాలతో ముల్లోకాలనూ ఆడించే రావణునిపేరు విన్నావుగా! వాడు పౌలస్త్యుడు, కుబేరుని సోదరుడు. ఆ రావణుని బంధువులు. వాని ఆజ్ఞానుసారం, యజ్ఞ విధ్వంసన ప్రాణంగావుంటారు వీరు. వీరి తల్లి తాటక. అది సుందుని భార్య, అన్నాడు.

దశరథుడు మరింత భయభ్రాంతుడై:

అనేక దేవాసురసంగ్రామాలలో కత్తిపట్టి నిలిచిన నేనే రావణుని ఎదుట నిలవలేనే. ఇక ఈ బాలుడు, అకృతాస్త్రుడు-నా రాముడు....ఆ మారీచ సుబాహులముందు నిలవ గలడా! ఈ పసికందును ఆ రాక్షసులకు బలియివ్వలేను, అన్నాడు.

విశ్వా: మహారాజా! ఏం కోరినా యిస్తానన్నావు. రఘువంశీయులు ఆడితప్పు తారని వినలేదయ్యా మేము. సరే, యిదే నీ నిశ్చయమైతే నేను వచ్చినదారినే వెడు తున్నాను. నువ్వూ నీ కొడుకూ సుఖంగా వుండండి, అన్నాడు.

ఆ స్థితిలో విశ్వామిత్రుని చూచిన, భూతపంచకం గజగజలాడింది. సృష్టికి ప్రతి సృష్టిచేసిన విశ్వామిత్రునిశక్తి ఎరిగిన వసిష్ఠులు: మహారాజా! ఇక్ష్వాకువంశంలో పుట్టి, ధర్మప్రభువుగా కీర్తిపొందావు. అటువంటి నువ్వు ఆడినమాట తప్పడం పాడిగాదు. ఈ విశ్వామిత్రుని శక్తి మీకు తెలిసినట్లులేదు. రూపుదాల్చిన ధర్మమూర్తి. నిర్వక్రపరాక్రముడు మహాతపశ్శాలి. దివ్యాస్త్రాలన్నీ ఆధీనంలో వున్నవాడు. కృశాశ్వమహర్షి ప్రసాదించిన

జృంభకాద్యస్త్రాలు ఈయన స్వాధీనంలో వున్నాయి. అవి సర్వరాక్షస సంహార సమర్థాలు. అందుచేత రామచంద్రుని ఆయనతో పంపడానికి సంకోచించనవసరం లేదు. అది నీ రాముడికి సర్వవిధాలా శ్రేయోదాయకం, అన్నారు.

కులగురువుల మాటలతో ధైర్యంచిక్కిన దశరథుడు రామ లక్ష్మణులను సభాస్థలికి రప్పించాడు. వస్తూనే వారు తండ్రికి పాదాభివాదం చేశారు. వారిని లేవనెత్తి, గాఢా లింగనంతో, మూర్ధాఘ్రాణంచేసి విశ్వామిత్రునికి అప్పగించాడు.

విశ్వామిత్రుడు బయలుదేరాడు.

రామ లక్ష్మణులు అనుసరిస్తున్నారు.

సరయూతీరంవెంట సాగుతున్నవారిని చూస్తే మూడుపడగల కోడెనాగు పరుగు పరుగున సాగుతున్నట్లుంది.

ధనుష్పాణులు, ఖడ్గాలంకృతదేహులు, తేజస్సౌందర్యధనులు రామలక్ష్మణులు వెనుక వస్తూంటే అశ్వనీ దేవతలముందు సాగుతున్న ప్రజాపతిలా వున్నాడు విశ్వామిత్రుడు.

అలా అర్ధయోజనదూరం నడిచేవరకూ వెనుదిరిగి చూడలేదు విశ్వామిత్రుడు. అక్కడ ఆగి వెనుదిరిగి వాత్సల్య మధురస్వరంతో.

రామా! కాలాతిక్రమం కాకుండా ఈ పవిత్ర సరయూజలాలలో ఆచమనం చేసి నిలబడు. నీకు బల, అతిబల విద్యలు యిస్తున్నాను. ఇవి జ్ఞాన మాతృస్థానాలు, ఈ విద్యలు కలవారికి ఆకలిదప్పు లుండవు. ఏపనిచేసినా శ్రమ ఉండదు. ఏవ్యాధీ సోకదు. నిద్రా జాగ్రదవస్థలలో ఏరాక్షసశక్తీ దరిజేరదు. ఈ విద్యవల్ల నువ్వు సౌభాగ్యశ్రేయస్సులు పొందినట్లే, నిన్ను ఆశ్రయించి ఈ విద్యలు రాణిస్తాయి, అనగానే రాముడు నదీజలాలు స్పృశించి నిలిచాడు. విశ్వామిత్రుడు విద్యలు అనుగ్రహించాడు.

ఆ రాత్రి అక్కడే విశ్రమించారు. మహర్షి ఏవేవో చెపుతూంటే రాజ పుత్రులు తృణశయ్యమీద సుఖనిద్ర కుపక్రమించారు.

రాత్రి గడిచింది. తెలతెలవారుతుండగా:

కౌసల్యా సుప్రజారామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే।
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవ మాహ్నికమ్॥

మధురగంభీరస్వరంతో మహర్షి మేలుకొలిపాడు. అన్నదమ్ములులేచి కాల కృత్యాలతో, విధ్యుక్తకర్మలు నిర్వర్తించారు.

మళ్ళీ నడక సాగుతూండగా సరయూ గంగా సంగమప్రాంతం చేరారు. అక్కడ అత్యంత మనోహరంగా కనపించిన ఆశ్రమం చూసి రాముడు :

మహర్షీ! ఈ ఆశ్రమం ఎవరిది? అని అడిగారు.

విశ్వా : చాలాకాలం క్రితం కద పరమశివుడు తపోదీక్షలో వున్నారు. ఆయన మనస్సును చలింపచెయ్యడానికి మన్మథుడు ప్రయత్నించి, ఆ శివక్రోధాగ్నికి భస్మమై యిక్కడ పడ్డాడు. అదిమొదలుగా వాడు అనంగుడయాడు. ఇది అంగదేశమై, ఈ ఆశ్రమం కామాశ్రమం అయింది, అన్నాడు

కామాశ్రమవాసులు విశ్వామిత్రుని చూస్తూనే ఎదురువచ్చి ఆయనకూ, రామ లక్ష్మణులకూ అతిథిపూజ జరిపారు. ఆ రాత్రి అక్కడ గడిపి, ఉదయమే నావమీద నదీతరణంచేస్తుండగా మధ్యలో నీరు ఉవికి విరిగిపడేధ్వని వినిపించి రాముడు మహర్షివైపు తిరిగాడు.

విశ్వా : బ్రహ్మసృష్టించిన మానససరోవరం తెలుసుకదా! ఆ సరస్సు నుండి వెలువడే నది సరయూనది. అది, యిక్కడ గంగతో సంగమిస్తుంది. ఆ సంగమ సంరంభంఅది అన్నాడు.

నావ అవ్వలి ఒడ్డుచేరింది. అడుగులు సాగుతున్నాయి. ఎదురుగా మహారణ్యం కనిపించింది అప్పుడు రాముడు :

పట్టపగలే చిమ్మచీకట్లున్నాయి. సింహ, వ్యాఘ్ర, వరాహధ్వానసంకులంగా వుంది. చూడడానికే భయంగావున్న ఈ అరణ్యం పేరేమిటి మహర్షీ, అని అడిగాడు.

విశ్వా : దాశరథీ! ఒకనాడిది అత్యంత సుఖప్రదమయిన మలదకారూషజనపదం. వృత్రాసురసంహార పాపకాలుష్యాన్ని భరించిన ఈ జనపదాలను దేవేంద్రుడు సస్యశ్యామలం చేశాడు. కొద్దికాలంక్రితం ఇక్కడకు తాటక అనే రాక్షసి చేరింది. అది యక్షిణి. దానికి వెయ్యేనుగుల బలంవుంది. నరమాంసం అంటే దానికి ప్రీతి. ఆ ప్రీతితో ఈజనపదం నిర్జరారణ్యం అయింది. ఆ యక్షిణికి భయపడి యిటు ఎవ్వరూ రారు. ఇప్పుడు దాన్ని సంహరించి నువ్వు ఈ అరణ్యాన్ని వాసయోగ్యం చెయ్యాలి, అనగా రాముడు :

మహర్షీ! యక్షులు అంతటి బలవంతులని వినలేదే! ఆమెకి శక్తి ఎక్కడిది? అని ప్రశ్నించగా :

నాయనా! సుకేతుడనే యక్షుడు సంతానార్థియై ప్రజాపతిని మెప్పించే తపస్సుచేసి ఈమెను వరంగా పొందాడు. బ్రహ్మవరప్రభావంవల్లనే దీనికి వెయ్యి ఏనుగులబలం వచ్చింది. జంబుడికొడుకు సుందుడికి దీన్నిచ్చి పెళ్ళిచేశాడు సుకేతుడు. వారి దాంపత్య ఫలం మారీచుడు. కాలక్రమాన సుందుడు కన్నుమూశాడు. ఒకనాటిది అగస్త్యమహర్షిని ఆరగించడానికి వెళ్ళగా ఆయన ఆగ్రహంతో:

"భయంకరరూపంలో పురుషమాంసం తిని బ్రతుకు" అని శపించి వెళ్ళిపోయాడు.

అది మొదలుగా యిది అగస్త్యుని ఆశ్రమప్రాంతాన్ని సర్వనాశనంచేస్తూ బ్రతుకుతున్నది. దుష్టపరాక్రమంకల తాటకను స్త్రీఅని సంకోచించకుండా లోకరక్షణ ధర్మబుద్ధితో సంహరించు. అధర్మనాశనార్థం చేసే ఏపని అయినా ధర్మమే అని రాజలోక సనాతన ధర్మం చెప్పారు.

నృశంస మనృశంసం వా ప్రజారక్షణకారణాత్
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సదా ।
రాజ్యభారనియుక్తానాం ఏష ధర్మ స్సనాతనః
అధర్మ్యం జహి కాకుత్స్థ ధర్మోహ్యస్యా న విద్యతే ॥

అధర్మమార్గానసాగే విరోచనపుత్రి మంథరను పురుహూతుడు కడతేర్చాడు. విష్ణువు భృగుపత్నిని సంహరించాడు. అధర్మబద్ధలయిన దుష్టచారిణులను సంహరించేవేళ ధర్మాధర్మ విచారణలేదు. పైగా నువ్వు నామాట పాలించాలి, అన్నాడు.

రాముడు చేతులు జోడించి: మహర్షీ! మా నాన్నగారు మమ్ము మీవెంట పంపుతూ మీరేంచెపితే అది చెయ్యమన్నారు. పితృవాక్పాలన నా వ్రతం, మీ శాసనానుసారం విద్వాంసులైన విప్రుల, సాధువులైన గోవుల, సర్వప్రజల రక్షణకోసం ఆ రాక్షసిని వధిస్తాను. అని ధనుష్టంకారం చేశాడు. అరణ్యమంతా అది ప్రతిధ్వనించింది. ఎక్కడోవున్న తాటక చెవిని పడిందీధ్వని. అది ఉగ్రరూపిణియై శబ్దధ్వనివచ్చిన దిశగా వచ్చింది. రాముడు దాన్ని చూస్తూనే తమ్ముడా! చూశావా, ఎంతవికారంగా మరెంత భయంకరంగా వున్నదో, ఇది కంటబడితేచాలు మూసినకన్ను తెరవడు సామాన్యుడు. అయినా ఆడదాన్ని చంపడానికి నా మనస్సు అంగీకరించటంలేదు. దీనిముక్కూ, చెవులూకోసి వదిలేస్తాను, అంటూండగానే ఆమె రామునిమీదికి దూకింది.

విశ్వామిత్రుడు హుంకారంతో తాటకను నిలువరించి రామలక్ష్మణులకు మంగళాశాసనం చేశాడు.

తాటక తన విద్యతో పరిసరమంతా ధూళిమేఘం క్రమ్మించింది. శిలావర్షం కురిపించింది. రాముడు శిలావర్షాన్ని నిరోధించగా అది తీవ్రక్రోధంతో విశాలబాహువులు చాచి మీదిమీదికి రాబోయింది. రాముడు చేతులురెండూ ఖండించాడు. లక్ష్మణుడు దాని ముక్కూ, చెవులూ కోసేశాడు. అది మరింత క్రోధంతో మళ్ళీ రాళ్ళవాన కురిపించింది.

చూశాడు విశ్వామిత్రుడు: రామా! ఏమిటి నీ సందేహం? ఈ దుష్టురాల్ని త్వరగా సంహరించు. సంధ్యాసమయం సమీపిస్తున్నది. అప్పుడు దీనిబలం మరీ పెరుగుతుంది, సంకోచించకు, అనడంతో రాముడు శబ్దవేధితో తాటక మాయాజాలాన్ని ఛేదించి ఒకేఒక్క నిశితశరంతో దానిగుండె ఛిన్నాభిన్నం చేశాడు. అది మహావృక్షంలా నేల కూలింది.

విశ్వామిత్రుడు రాముని దగ్గరగా తీసుకొని, మూర్ధాఘ్రాణం చేశాడు. ఆరాత్రికి అక్కడే విశ్రమించారు. తెల్లవారింది.

తాటకసంహారంతో సర్వప్రాణికోటికి సుఖశాంతులు ప్రసాదించిన రాముని ప్రశంసించి విశ్వామిత్రుడు:

రాఘవా! నిన్న నువ్వుచేసిన ప్రజాకళ్యాణ కార్యానికి నాకెంతో సంతోషం కలిగింది. తత్కార్యఫలంగా నీకు నాదగ్గరున్న అస్త్రాలన్నీ అనుగ్రహిస్తున్నాను, ఈ అస్త్రబలంతో నువ్వు త్రిలోకైకవీరుడి వవుతావు, అని స్నానపవిత్ర శుచీభూతగాత్రుడయిన రామునికి దండచక్ర, ధర్మచక్ర, కాలచక్ర, విష్ణుచక్ర, ఇంద్రచక్ర, ఐషీక, బ్రహ్మాస్త్ర, ధర్మపాశ, కాలపాశ, వరుణపాశ, ఆగ్నేయ, వాయవ్యాది దివ్యాస్త్రాలన్నీ ఉపదేశించాడు. మంత్రరూపంలో మహర్షి అస్త్రప్రదానం చెయ్యగానే అవన్నీ తమతమ రూపాలతో రామచంద్రుని ఎదుట నిలిచి:

రామభద్రా! ఈక్షణంనుండీ మేము నీ కింకరులం, అనగా, రాముడు అన్నిటినీ చేతితో స్పృశించి మనసులో సమాహితం చేసుకొన్నాడు.

అనంతరం రామచంద్రుడు: మహర్షీ! ఈ దివ్యాస్త్రాలను అనుగ్రహించిన మీరు ఉపసంహారక్రమంకూడా బోధించండి, అని వినయంగా అంజలిఘటించాడు.

సత్యవంత, సత్యకీర్తి, ధృష్ట, రభస, పరాఙ్ముఖ, అవాఙ్ముఖ, లక్ష్య, అలక్ష్య, సునాభ, దృఢనాభ, దశాక్ష, శతవక్త్ర, దశశీర్ష, శతోదర, పద్మనాభ, మహానాభ, ఆది గాగల ఉపసంహారాస్త్రాలను ఉపదేశించాడు మహర్షి విశ్వామిత్రుడు.

ప్రయాణం సాగుతున్నది. కొంతదూరం నడిచాక రాముడు: మహర్షీ! మనం తాటకావనం అతిక్రమించినట్టున్నాం. ఇక్కడ సుందరమృగసందోహం, మనోహర శకుంత సంతానం, లతాతరుగణాలూ కనిపిస్తున్నాయి. మీ యజ్ఞశాల ఎక్కడ? అన్నాడు.

విశ్వా: రాఘవా! నువ్వు చూస్తున్న ఈ మనోజ్ఞవనంలోనే సిద్ధాశ్రమం ఉన్నది. ఇక్కడే మహావిష్ణువు చిరకాలం తపోదీక్షలో వున్నాడు. కశ్యపప్రజాపతి, అదితిసహితుడై యిక్కడే సంతానార్థియై తపస్సు చేశాడు. ఇక్కడే బలి నూరు అశ్వమేధాలు చేశాడు. ఇంద్రపదవిని కోరి అదితి కశ్యపులకు మహావిష్ణువు వామనుడుగా పుట్టినదీ యిక్కడే. దాతృత్వానికి పర్యాయపదంగా నిలిచిన బలిని మూడడుగులు యాచించి వామనుడు త్రివిక్రముడైన దిక్కడే. ఇందరికీ వాంఛాసిద్ధి కలిగించి యిది సిద్ధాశ్రమం అయింది.

ఇక్కడే నేను లోకకల్యాణ కాంక్షతో యజ్ఞం తలపెట్టాను, అంటూ ఆశ్రమంలో అడుగుపెట్టాడు.

అక్కడి మహర్షులందరూ వారికి స్వాగతమర్యాదలు నడిపారు. ముహూర్తకాలం విశ్రాంతి తీసుకుని రాముడు:

మహర్షీ! మీరు యజ్ఞదీక్షితులు కావచ్చు. దీనికి సిద్ధాశ్రమం అన్న పేరును నిలబెడదాం, అన్నాడు.

విశ్వామిత్రుడు యజ్ఞదీక్షితు డయ్యాడు.

మహర్షీ! అసురులు యజ్ఞవిధ్వంసనానికి ఎప్పుడు ఉపక్రమిస్తారు, అనగా అక్కడి మునులు: దాశరథీ! కౌశికులు మౌనంలో వుంటారు, ఇది మొదలు ఆరురాత్రులు మీరీ సవనకర్మ రక్షించాలి, అన్నారు.

క్రతువు సాగుతోంది. అయిదు రాత్రులు నడిచాయి. నిద్రాహారాలులేకుండా రామ లక్ష్మణులు రక్షణదీక్షలో వున్నారు. యజ్ఞవేది జాజ్వల్యదీప్తులతో వుంది. ఆజ్యధారలతో విశ్వామిత్రుడు అగ్నిహోత్రునికి తృప్తికలిగిస్తున్నాడు. నిర్విరామంగా వేదఘోష వినిపిస్తున్నది.

అంతవరకూ నిర్మలంగా, ప్రశాంతంగావున్న ఆకాశంలో కారుమేఘాలావరించాయి గర్జనలు ఆరంభమయాయి. మారీచ సుబాహులు అనుచరవర్గంతో గగన వీధినిచేరి రక్తమాంస వర్షం ఆరంభించారు. మేఘగర్జన వింటూవే రాముడు:

లక్ష్మణా! అదుగో అసురులు. చూస్తూవుండు, అంటూ ఆగ్నేయాస్త్రం సంధించారు. అది సుబాహుని గుండెచీల్చి నేలకూల్చింది. ఉత్తరక్షణంలో రామధనుర్విముక్తమయిన వాయవ్యాస్త్రం అసురసేనను విగతజీవులను చేసింది. అనంతరం: తమ్ముడూ! ఇంక తాటకకొడుకు మారీచు డున్నాడు. వీడికి నా అస్త్రబలం చూపిస్తాను, అంటూ విడిచిన శాశేమవుతో మారీచుడు సిద్ధాశ్రమానికి శతయోజనాల దూరంలోవున్న సముద్రంలో పడ్డాడు. విశ్వామిత్రుని క్రతువు నిర్విఘ్నంగా సాగింది. అక్కడనుంచి బయలుదేరి మిథిలా నగరాభిముఖంగా సాగుతున్నారు, రామలక్ష్మణులు విశ్వామిత్రునితో

## అ హ ల్య

రామలక్ష్మణులు విశ్వామిత్రసహితులై మిథిలానగరంవైపు సాగుతున్నారు. సాయంత్రానికి శోణభద్రానదీతీరంచేరి అక్కడ సాయంసంధ్యను ఉపాసించి, విశ్రమించారు. విశ్వామిత్రుడు వారికి తమ వంశ వృత్తాంతం వివరించాడు. మరునాడు ఉషఃకాలంలో విధ్యుక్తకర్మను నిర్వర్తించి ప్రయాణం ప్రారంభించారు. విశ్వామిత్రుడు ఎన్నెన్నో కథలు చెబుతూంటే మార్గాయాసం తెలియకుండా వారు నడక సాగిస్తున్నారు.

మిథిలానగరానికి అల్లంతదూరంలోవున్న అడవిలో ప్రవేశించగానే రాముడు:

మహర్షీ! ఈ అడవి నిర్జనంగావున్నా ప్రశాంతరమణీయంగా ఉంది. ఆశ్రమంలో ఎవరూ వుంటున్నజాడ కనిపించదు. ఏమిటి దీనికథ, అని కుతూహలంగా అడిగాడు.

విశ్వా: నాయనా, ఇది గౌతమమహర్షి ఆశ్రమం. మహాతపస్సంపన్నుడైన మహర్షి ఆశ్రమపరిసరాలలోకి ఎవరూ కన్నెత్తి చూడలేకపోయేవారు. ఆయన పత్ని అహల్య. వారుభయులూ తపోదీక్షలో ఉంటున్న రోజులలో.... నిఖిలలోకాశ్చర్యకర సౌందర్యంతో విరాజిల్లే అహల్యమీద మనసుపడ్డ దేవేంద్రుడు ఒకనాటి తెల్లవారు జామున, ఆశ్రమంలో మహర్షి లేనిసమయంలో మునివేషధారియైవచ్చి: ఓ సుందరాంగీ! భోగార్థులైన వారు ఋతుకాలంవరకు నిరీక్షిస్తూ ఉండరు కనుక నా వాంఛను తిరస్కరించకు, అని అర్థించాడు.

వచ్చినవాడు వాసవుడని తెలిసికూడా అహల్య, దేవేంద్రునంతటివాడు తనమీద వ్యామోహంతో వచ్చాడని ఉప్పొంగి ఆ సురపతితో సమాగమానికి అంగీకరించింది.

మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన! ।
మతిం చకార దుర్మేధా దేవరాజ కుతూహలాత్ ॥

శయ్యాసుఖం అనుభవించిన అనంతరం ఓ సురేశ్వరా! నాకు చాలా తృప్తి కలిగింది. నువ్వు వెంటనే వెళ్ళిపో, మహర్షి వచ్చేవేళ అవుతున్నది. త్వరగా వెళ్లు. అది మనిద్దరికీ శ్రేయస్కరం అంది.

కృతార్థాస్మి సురశ్రేష్ఠ! గచ్ఛ శీఘ్రమితః ప్రభో ।
ఆత్మానం మాం చ దేవేశ! సర్వథా రక్ష గౌతమాత్ ॥
ఇంద్రస్తు ప్రహసన్ వాక్యం అహల్యా మిద మబ్రవీత్ ।
సుశ్రోణి పరితుష్టోఽస్మి గమిష్యామి యథాగతమ్ ॥

సుశ్రోణి! నేనుకూడా సంతుష్టుడినయాను వచ్చినదారినే వెడుతున్నాను, అని పర్ణశాల దాటుతూండగా, రానే వచ్చాడు గౌతముడు

వచ్చిన మహర్షికి అవగతమయింది జరిగిన కథ.

అగ్నిహోత్ర సదృశకాంతితోవున్న గౌతముడు: ఓరి దుర్మతీ! కపట వేషంతో అకృత్యానికి తలపడ్డ నువ్వు విఫలుడి వవుతావు, అని శపించిన ఉత్తరక్షణంలో దేవేంద్రుడు అండహీనుడయాడు.

అలానే ఆశ్రమంలో ప్రవేశించి ఓసీ బుద్ధిహీనురాలా! నువ్వుచేసిన అకార్యానికి ప్రాయశ్చిత్తంగా గాలి ఆహారంగా ఈ బూడిదలో పడివుండు. ఏ ప్రాణీ కంటపడకుండా యిలా ప్రాయశ్చిత్తం చేసుకో. రఘువంశీయుడూ, పుణ్యాత్ముడూ అయిన రామచంద్రుడు ఈ ఆశ్రమంలో కాలుపెట్టిన క్షణంలో నువ్వు పవిత్రురాలివవుతావు. ఆ రాఘవుడికి ఆతిథ్యమిచ్చి మోహ లోభ దూరురాలివై నన్ను సమీపించు, అని ఆయన ఆశ్రమం వదలి వెళ్ళాడు.

" ఇహ వర్షసహస్రాణి బహూని నివసిష్యసి ।
వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ ॥
అదృశ్యా సర్వభూతానాం ఆశ్రమేఽస్మిన్ వసిష్యసి। "

అని విశ్వామిత్రుడు రామలక్ష్మణ సహితుడై ఆశ్రమంలో అడుగుపెట్టాడు.

ధూమావృతమయిన అగ్నిశిఖవలె, తుషారాచ్ఛాదితమైన చంద్రప్రభవలె, నీటిలో ప్రతిఫలించే సూర్యబింబంవలెవున్న అహల్య మీద రాముని దృష్టి పడింది. అంతే! అహల్య పూర్వరూపంతో లేచి నిలబడింది. రామ లక్ష్మణు లిద్దరూ ఆ ఋషిపత్ని పాదాలకు నమస్కరించారు, ఆవిడ వారినిద్దరినీ లేవనెత్తి, స్వస్థచిత్తంతో అర్ఘ్యపాద్యాదు లర్పించి అతిథిపూజ జరిపింది, ఆ సమయంలో ప్రకృతి పులకించినట్లు పూలవాన కురిసింది, సరిగా అదేసమయానికి గౌతమమహర్షికూడా అక్కడకు విచ్చేసి రామలక్ష్మణులతో విశ్వామిత్రుని ఆదరించి అహల్యా సహితుడై తపోమయ దాంపత్య జీవన దీక్షితుడయ్యాడు.

విశ్వామిత్రుడు మిథిలవైపు అడుగువేశాడు, రామలక్ష్మణులు అనుసరిస్తున్నారు.

(ఈ ప్రకరణాన్ని చాలా సంక్షిప్తం చేశాం. కుతూహలం కలవారు వాల్మీకం చదివించుకోవడం ఉచితం.)

## వి శ్వా మి త్రు డు

బ్రహ్మర్షి విశ్వామిత్రుడు మిథిలానగర సమీపంలోని ఋషివాటికకు చేరినట్లు వార్త అందిన క్షణంలో జనకుడు తన కులపురోహితుడైన శతానందునితో వెళ్ళి అతిథిపూజ జరిపి : మహర్షీ! అశ్వినీదేవతా సదృశులుగా వున్న ఈ రాకుమారు లెవరు? అని అడిగాడు.

విశ్వా : విదేహాధిపతీ! వీరు దాశరథులు. రామలక్ష్మణులు. మా సిద్ధాశ్రమంలో అశాంతి కలిగించే రాక్షసులను సంహరించి, గౌతమాశ్రమంలో అహల్యను ఉద్ధరించారు. అహల్యా గౌతములు మళ్లీ తపోదీక్షలో వున్నారు. ప్రస్తుతం వీరు శివ ధనుస్సును చూడాలనే కుతూహలంతో వచ్చారు, అన్నాడు.

తనతల్లి అహల్య శాపవిముక్తు రాలయిందని విన్న శతానందుని గుండె సంతోష సాగర తరంగాలలో తేలియాడింది. కొన్నిక్షణాలు శతానందుడు విశ్వామిత్రుని విడవకుండా తనతల్లి యోగక్షేమాలే అడిగి రామునివైపు తిరిగి :

ఓ రఘువంశదీపమా! నువ్వు అదృష్టవంతుడవయ్యా, విశ్వామిత్రుని రక్షణవల్ల. ఈ విశ్వామిత్రు డెంతటివాడో ఎరుగవు, ఆ కథ వినాలి నువ్వు.

బ్రహ్మపుత్రుడు కుశుడు. ఆయన కుమారుడు కుశనాభుడు పుత్రకామేష్టిచేసి "గాధి" ని కన్నాడు. గాధేయుడు ఈమహర్షి. గాధి అనంతరం ఈయన సింహాసనం అధివసించి ప్రజలను కన్నబిడ్డలవలె పాలించాడు.

ఆ రోజులలో ఒకనాడు వేటకువెళ్ళి అక్కడ సర్వప్రాణికోటికి ఆహ్లాదం కలిగించే ఆశ్రమంలో వశిష్ఠులను దర్శించాడు.

వచ్చిన చక్రవర్తికి అర్ఘ్య, పాద్యాలు యిచ్చి కుశలప్రశ్నలు వేశాడు మహర్షి వశిష్ఠుడు. అనంతరం విశ్వామిత్రునికీ, ఆయన పరివారానికీ ఆతిథ్యం ఇవ్వడానికి సంకల్పించాడు.

రాజపరివారం నదీస్నానానికి వెళ్ళింది.

వశిష్ఠుడు ఆశ్రమంలో వున్న గోవు శబల దగ్గరకు వెళ్ళి మహారాజుకీ, పరివారానికీ ఉచితరీతిని ఆతిథ్యం సమర్పించాలి, అన్నాడు.

విశ్వామిత్రునికీ, ఆయన సేనాపరివారానికి పంచభక్ష్యాలతో విందు జరిగింది. అందరూ తృప్తిగా భుజించిలేచారు. శబల శక్తి విశ్వామిత్రుని మనస్సును హరించగా :

మహర్షీ ! మీ అతిథి మర్యాదలు మాకు సంతుష్టినిచ్చాయి, మీ ధేనువుప్రభావం మాకెంతో ఆశ్చర్యం కలిగించింది. ప్రభువులు రత్నహారులని మీరెరుగుదురు. కనుక ఈ గోరత్నాన్ని మాకు అర్పించి పరిహారంగా లక్షగోవులు తీసుకోండి, అన్నాడు.

వశిష్ఠుడు : మహారాజా ! కోట్లగోవులిచ్చినా శబలను వదలలేను. నా జీవ యాత్రకు ఈధేనువే పరమాధారం. నా సర్వస్వమూ ఈ గోవు. దీనిని విడిచి నేను క్షణం ఉండలేను, అన్నాడు.

శతవిధాల ప్రయత్నించాడు విశ్వామిత్రుడు. సహస్రవిధాల తన అనంగీకారం తెలిపాడు వశిష్ఠుడు. శబలను బంధించి తీసుకు నడవమన్నాడు, విశ్వామిత్రుడు సైన్యంతో. సైన్యం సమీపించబోగా శబల తన యజమానిని చేరి : స్వామీ నన్ను విడిచి పెడుతున్నారా ? అని అడిగింది.

శబలా ! నేను నిన్ను విడుస్తానా ! అధికార, బల, మదగర్వంతో మహారాజు నిన్ను తీసుకుపోతున్నాడు. నేనేం చెయ్యగలను, అన్నాడు మహర్షి.

మహర్షీ ! క్షాత్రంకంటె బ్రాహ్మ్యం బలిష్ఠమైనది. బ్రహ్మబలాన్ని మించిన బలం లేదని మీరెరుగనిది కాదు. దానితో మీరు విశ్వామిత్రుని విరోధించడానికి అంగీకరించక పోతే నాకు ఆజ్ఞ ఇవ్వండి నన్ను నేను రక్షించుకుంటాను, అంది.

మహర్షి అంగీకారం తెలపడంతో శబల శరీరంనుండి వేల, లక్షల సంఖ్యలో వనచర సైనికులు ప్రభవించి విశ్వామిత్రుని సేనను నిహతం చేస్తున్నారు. విశ్వామిత్రుడు సైనికు

లందరినీ తన శస్త్రాస్త్రాలతో సంహరిస్తున్నాడు. శబల మళ్ళీ సృష్టిస్తున్నది. విశ్వా మిత్రుని సైన్యం పూర్తిగా నేలకూలింది.

మిగిలిన ఒకేఒక్క కుమారునితో విశ్వామిత్రుడు వెనుదిరిగాడు. కొడుకును సింహా సనం ఎక్కించి హిమవత్పర్వత భూమికిపోయి తపోదీక్ష వహించాడు. మహాదేవుడు ప్రసన్నుడు కాగా ధనుర్వేదం సాంగోపాంగంగా అనుగ్రహించమన్నాడు. పరమశివుడు దరహాసంతో అస్త్రవిద్యా రహస్యాలన్నీ అనుగ్రహించాడు.

ఆ దర్పంతో వశిష్ఠుని సమీపించి ఆగ్నేయాది అస్త్రాలు ప్రయోగించడం మొదలు పెట్టాడు. ప్రతి అస్త్రాన్ని భస్మంచేస్తూ వశిష్ఠుడు: ఓ దుష్టుడా! కన్నబిడ్డలా చూసు కుంటున్న ఆశ్రమాన్ని సర్వనాశనంచేసిన నిన్ను కనికరించలేను. నీ వంటి క్రూరుడు భూమిమీద ఉండకూడదు, అని బ్రహ్మదండం పైకెత్తాడు.

వారుణ, రౌద్ర, ఇంద్ర, మానవ, మోహన, స్వాపన, సంతాపన, జృంభణ, పైశాచ, కాలచక్రాద్యస్త్రాలు ప్రయోగించాడు విశ్వామిత్రుడు. అన్నీ బ్రహ్మదండఛాయలలో పరాస్తము లవుతున్నాయి. విశ్వామిత్రునికి బ్రహ్మబలం అవగతమైంది. తన క్షాత్రాన్నీ, అస్త్రశక్తినీ నిందించుకుంటూ దక్షిణదిశగా పోయి తపోదీక్ష వహించాడు. వెయ్యి సంవ త్సరాలు గడిచాయి. ప్రజాపతి ప్రత్యక్షమై: విశ్వామిత్రా! నువ్వు రాజర్షివయావు అన్నాడు.

ఇంతకాలం తపస్సు చేసింది రాజర్షిని కావడానికా! అని మళ్ళీ తపోదీక్ష వహించాడు.

ఆ రోజులలో ఇక్ష్వాకు వంశీయుడైన త్రిశంకువు సశరీర స్వర్గకాంక్షతో యజ్ఞం తల పెట్టి కులగురువు వశిష్ఠులను అర్థించాడు. ఆయన అందులకు అంగీకరించలేదు. ఆయన కుమారులను ప్రార్థించి తిరస్కృతుడై త్రిశంకువు విశ్వామిత్రుని అర్థించగా ఆయన అంగీక రించి విప్రశ్రేష్ఠులందరినీ ఆహ్వానించాడు. వశిష్ఠుడూ, ఆయన కుమారులు తప్ప అందరూ యజ్ఞానికి వచ్చారు.

యజ్ఞం ఆరంభమైంది. హవిర్భాగాలు స్వీకరించడానికి దేవతలను ఆహ్వానించాడు. ఒక్కరూ రాలేదు. దానితో విశ్వామిత్రుడు కుపితుడై స్రువం ఎత్తిపట్టి త్రిశంకూ! నా తపోబలంతో నిన్ను స్వర్గానికి పంపుతున్నాను అన్నాడు.

త్రిశంకువు స్వర్గాభిముఖంగా వస్తూండడం చూసి, దేవేంద్రుడు: తుచ్ఛుడా! గురుధిక్కారం చేసిన నీకు స్వర్గప్రవేశార్హత లేదు, అనగా త్రిశంకువు నేలకూలుతూ:

విశ్వామిత్ర మహర్షీ! అని ఆక్రోశించగా వింటూనే విశ్వామిత్రుడు అక్కడే ఆగు. నీకోసం మరొకస్వర్గం సృష్టిస్తున్నాను. అని గ్రహ నక్షత్ర మండలాలను కల్పించి, దేవేంద్రుని నాశ నానికే సంకల్పించగా మహర్షులందరూ ముక్తకంఠంతో ఆప్రయత్నంనుండి విరమింప జేశారు.

అయితే నేను సృష్టించిన స్వర్గం అలానే వుంటుంది త్రిశంకువు అక్కడే వుంటాడు. అన్నాడు విశ్వామిత్రుడు.

మహర్షులందరూ అంగీకరించి, తమ ఆశ్రమాలకు వెళ్ళారు. క్రోధం కారణంగా తపస్సు భంగమైనందుకు చింతిస్తూ విశ్వామిత్రుడు పశ్చిమదిశకు వెళ్ళి తపోదీక్ష వహించాడు.

ఆ తపోదీక్షకు భయకంపితుడై దేవేంద్రుడు మేనకను పంపాడు. మేనకా సౌందర్యవంచితుడైన విశ్వామిత్రుని శృంగార తపస్సులో శకుంతల పుట్టింది. అప్పటికి విశ్వామిత్రుని జ్ఞాననేత్రం తెరుచుకుంది. మళ్ళీ తపస్సు ప్రారంభించగా దేవేంద్రుడు రంభను పంపాడు. కామాన్ని జయించినా, క్రోధాన్ని వీడని విశ్వామిత్రుడు రంభను రాయివి కమ్మని శపించి, మరో పర్వతంమీదా తపస్సు ప్రారంభించాడు.

ఆ తీవ్ర తపస్సుకి సంతుష్టుడయి ప్రజాపతి ప్రత్యక్షమై బ్రహ్మర్షీ! అని సంబో ధించినా విశ్వామిత్రుడు తృప్తి పొందలేదు. అప్పుడు వశిష్ఠులవారు వచ్చి బ్రహ్మర్షీ! అని ముమ్మారు పిలవడంతో ఈయన ఆనందతరంగితస్వాంతుడయాడు. అదీ ఈ మహాత్ముని కథ అని శతానందుడు వివరించాడు.

( సీతాకళ్యాణఘట్టం అయోధ్యాకాండ చివర ఉంది )

మిథిలానగరంలో సీతాకల్యాణం వైభవోపేతంగా జరిగింది. జనకమహారాజు సముచిత సత్కారాలు జరిపించాడు. దశరథుడు సంతుష్టుడై కొడుకులతో, కోడళ్ళతో అయోధ్యకు బయలుదేరాడు. రథాలు సాగుతుండగా ఆ మహారాజుకి దుశ్శకునాలు గోచ రించాయి. పక్షుల ఆర్తస్వరాలు, మృగాల అప్రదక్షిణాలు, తీవ్రవేగంతో ప్రభంజనం ఇవి చూసి దశరథుడు తన కులగురువునుచేరి కారణం అడగగా ఆయన: ప్రభూ! దుశ్శ కునాలతో శుభసూచనలూ కానవస్తున్నాయి. కనక ఏదో మహావిపత్తు రాబోయి వైదొలగు తుంది. మీరేమీ భయపడ నవసరంలేదు, అంటున్నాడాయన. అంతలోనే, పర్వత శిఖరోత్తుంగ దేహంతో, భస్మపూరిత గౌరదేహంతో, బద్ధజటా జూట మండిత శిరస్సుతో కాలాగ్నిజ్వాలాసదృశలోచనాలతో, నిప్పులుజిమ్మే పదునువున్న పరశువును భుజానవూని, చేతవైష్ణవధనువుపట్టి, తన రాకకారణంగా రేగిన సుడిగాలిని నిరోధిస్తూ, త్రిపురాసుర సంహారదీక్షతోవున్న పినాకపాణివలె వచ్చి నిలిచాడు భార్గవరాముడు.

తన తండ్రిని వధించిన కార్తవీర్యార్జుని మీద క్రోధంతో సర్వరాజలోకాన్ని పరాభూతం చేశాడే, మళ్ళీ ఈయనకు క్రోధం కలిగించిందెవరు? అని వశిష్ఠాదులు అర్ఘ్య, పాద్యాదులతో ఆయనకు ఎదురువెళ్ళి రామునిచేత అర్చింపజేశారు.

ఆయన అతిథిసత్కారాలను పొంది: దాశరథీ! నీ పరాక్రమం శివధనుస్సును భిన్నంచేయగలిగినంతటిదని విన్నాను. విని నీ పరాక్రమ పరీక్షకు మరొక ధనుస్సు తెచ్చాను, ఇదిగో! దీన్ని సంధించి బాణం తొడిగితే నీవంటి పరాక్రమునితో యుద్ధం చెయ్యాలని వుంది, అన్నాడు.

ఆమాట వింటూనే దశరథుడు విషాదభరిత హృదయుడై, చేతులు జోడించి! ఓ భార్గవవంశీయుడా! క్షత్రియజాతిమీద నీ క్రోధం తగ్గిందని విన్నానే, విప్రశ్రేష్ఠా: మహాతపస్వీ: నిన్ను శరణువేడుతున్నాను. నా కుమారులతో యుద్ధం మొదలుపెట్టకు. శస్త్రం చేతపట్టనని దేవేంద్రునికి వాగ్దానం చేశావు. భార్గవులు ఆడిన మాట తప్పుతారా!

సర్వ భూమండలాన్ని కశ్యపప్రజాపతికి ధారవోసి మహేంద్రగిరిమీద తపోదీక్షలో వున్న నువ్వు ఇక్కడకు ఎందుకు వచ్చావయ్యా. నన్ను కనికరించి నా బహిఃప్రాణ మయిన రాముని విడవవయ్యా, అని దీనంగా పలుకుతున్నా వినకుండా జామదగ్న్యుడు:

ఓ రామా! ఇవి రెండూ దివ్య ధనువులు. ఒకటి త్రిపురాంతకుడికీ, మరోటి మురాంతకుడికి యిచ్చాడు విశ్వకర్మ, అందులో శివధనస్సు నీ చేతులలో విరిగింది. ఇది వైష్ణవధనువు. శివధనువు దేవరాతునినుంచి జనకునియింట వున్నది. ఇది మా తాత ఋచీకులవారినుంచి మాకు వచ్చింది. దీనితో సర్వక్షాత్రమండలాన్ని నిర్జించి, ప్రశాంతంగా మహేంద్రగిరిమీద తపస్సు చేసుకుంటున్న నాకు శివచాపభంగవార్త తెలిపింది, వచ్చాను. ఇదిగో, ఈ ధనుస్సు చేబూని శరసంధానంచెయ్యి. చెయ్యగలిగితే నీ వీరత్వాన్ని మెచ్చి నీతో ద్వంద్వ యుద్ధం చేస్తాను. అన్నాడు.

అప్పుడు రాముడు: ఓ బ్రహ్మవిదుడా, మీ పితృభక్తికి చాలా సంతోషంగా వుంది. అందుకు వందనం చేస్తున్నాను. అయితే నా క్షాత్రాన్ని పరిహసిస్తే సహించను. నా పరాక్రమం చూడాలనికదా తమవాంఛ, అంటూ జామదగ్న్యుని చేతులనుండి ధనువు అందుకుని, అల్లెత్రాడు బిగించి, ఆశుగం తొడిగి: ఇప్పుడుచెప్పండి మీరు విప్రులు. మా గురువులు విశ్వామిత్రులకు బంధుకోటిలోవారు మీరు, కనక అమోఘమయిన ఈ శరాన్ని మీమీద ప్రయోగించడంలేదు అయితే శస్త్రం సంధించాక లక్ష్యభేదనం చెయ్యాలి,

చెప్పండి : తపఃఫలంతో ఆర్జించిన మీ పుణ్యలోకాలు కొట్టనా? మీ గమనశక్తిని నిరోధించనా, అన్నాడు.

వైష్ణవధనువుతో మహా చైతన్యస్రవంతిలా రాముడొకప్రక్క, మహోన్నత నగాకృతిలో జడస్వరూపుడై పరశురాముడీవంక, సర్వ భూతకోటికీ ఆ దృశ్యం ఆనందామృతవర్షం అయింది, కొద్దిక్షణాలకు తేరుకున్నాడు పరశురాముడు.

రామచంద్రా ! ఈ భూమండలాన్ని కాశ్యపులకు ధారవోసిన కారణంగా నే నిక్కడ వుండడానికి వీలులేదు. కనక నా గమనశక్తిని ఛిన్నం చెయ్యకు. నేను మనోవేగంతో మహేంద్రాద్రికి వెడుతున్నాను. నా పుణ్యలోకాలు కొట్టెయ్యి. మళ్ళీసాధించుకుంటాను. వైష్ణవధనువుతో నిన్ను చూస్తూంటే సాక్షాత్తూ నారాయణ స్వరూపునిలా వున్నావు. ఇటువంటి నీచేతిలో పరాజయం నాకు ఆనందసంధాయకం. వదిలెయ్యి బాణాన్ని, నేను వెడుతున్నాను, అంటూనే కదిలాడు. ఆయన వెనుదిరుగుతూండగా రామబాణం ధనుర్విముక్తమయింది. అప్పటికి దశరథుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. రథాలు అయోధ్యాభిముఖంగా సాగుతున్నాయి.

**(ఉపాఖ్యానాలు సంక్షిప్తంగానే యిచ్చాం. రామజననగాధ అరణ్యకాండలో జటాయువు చెపుతాడు.)**

**బాలకాండ సమాప్తం.**

కచ్చిత్ తే దయితాః సర్వే కృషి గోరక్ష జీవినః ।
వార్తాయాం సంశ్రిత స్తాత లోకోఽయం సుఖమేధతే ॥

# అయోధ్యాకాండ

## యువరాజు

శ్రీ సమృద్ధమూ శీలసంపన్నమూ అయిన నర నారీజనంతో అలరారే అయోధ్యా నగరం సర్వశోభాయమానంగా వుంది. రాజవీధులలో పన్నీటి జల్లుల వానసలు. ఆ వానసలతో మంగళవాద్య ఘోష. శ్రవణ సుభగంగా వైదికస్వస్తిగానం.

కోసలదేశ మందిర, భవన, సౌధాగ్రాలు వివిధవర్ణమయ పతాకాలతో కన్నుల పండువవుతూవుంటే పౌర జనపదవానులందరూ నూత్న వినూత్న వస్త్రాలంకారాలతో, సంతోషభరిత వదనాలతో నగర సింహద్వారంనుండి రాజసౌధంవరకూ బారులు తీర్చి వున్నారు. గృహద్వారాలు, గవాక్షాలు, మేడల ముందుభాగాలు, లాక్షారుణరంజిత పదాలతో తాంబూలరాగపూరితాధరాలతో, కజ్జలాలంకృత నయనాలతో, కస్తూరీతిలకాంచిత వదనాలతో, స్మితశ్రీ సంపన్నములై పూలదోసిళ్ళతో నిండివున్నాయి.

కులగురువులు వశిష్ఠులు, ఆ వెనుక దశరథ మహారాజు, ఆయన వెంట సీత, ఆమె పాణిని బంధించి శ్రీరామచంద్రుడు, ఆ అడుగులలో లక్ష్మణుడు ఊర్మిళాసహితుడై, అనంతరం భరత శత్రుఘ్నులు మాండవీ, శ్రుతకీర్తులతో........ఆనంద సముద్రతరం గాలలో అయోధ్య ఓలలాడుతున్నది.

మిథిలానగరంనుండి వస్తున్న పెళ్లి వారందరికీ సత్కారాలు సాగుతున్నాయి.

లక్ష్మీదేవి నాలుగు మూర్తులతో అవతరించి నట్లుంది నలుగురు కోడళ్లనూచూస్తున్న దశరథుని పట్టమహిషి కౌసల్యకు.

రాజసౌధద్వారంలో కౌసల్య, సుమిత్ర, కైకేయి నిలిచి కోడళ్లనూ కొడుకులనూ లోపలకు తీసుకువెళ్ళి కులగురువు వశిష్ఠులవారి ఆదేశానుసారం జరిపించవలసిన విధ్యుక్తాలన్నీ యథావిధి జరిపించారు.

పౌరులందరూ ఉత్సవాలు జరుపుకుని సంతోషసాగర తరంగాలలో తేలియాడారు. వధూసహితులయి రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు తల్లిదండ్రులను సేవించి (ప్రమత్తత లేకుండా) వారికి ఆనందం కలిగిస్తూ, ప్రజలందరి సుఖశాంతులకూ అవసరమయిన కార్య క్రమాలు జరుపుతూ, సాంసారిక జీవితం నడుపుతున్నారు.

అలా రోజులు సాగుతూండగా ఒకనాడు దశరథమహారాజు కుటుంబజనులతో యిష్టసల్లాపాలు నడుపుతూ, భరతుని దగ్గరగాతీసుకుని, వెన్నుదువ్వుతూ: నాయనా! మీ తాతగారు నిన్ను చూడాలనే కోరికతో వున్నట్లు కబురు తెచ్చిన మీ మేనమామ యుధాజిత్తు వచ్చి చాలా రోజు లయింది. ఇంకా ఆయనను యిక్కడే ఆపడం మరియాద కాదు. అందుచేత నువ్వు ఆయనతో కలిసివెళ్ళి, కొంతకాలం తాతగారిని సేవించి, ఆయన ఆశీర్వాదాలు పొందిరావయ్యా, అన్నాడు.

తండ్రి ఆజ్ఞానుసారం భరతుడు తన మేనమామ యుధాజిత్తుతో బయలుదేరాడు. క్షణం కూడా భరతుని విడిచివుండని శత్రుఘ్నుడు కూడా కేకయదేశానికి వెళ్ళాడు.

కాలచక్రం తిరుగుతున్నది.

రామ లక్ష్మణులు దశరథమహారాజు ఆజ్ఞలను పాలిస్తూ గురుసేవలో, మాతృ పూజలో, ప్రజాభిమానసాధనలో కాలాన్ని గడుపుతున్నారు. వారి గుణశీలాలు కోసల ప్రజలకు తృప్తి కలిగిస్తున్నాయి. రాజపరివారానికి రాముడు దైవంగా కనిపిస్తుంటే, ప్రజా వళికి వరదైవం అనిపించాడు.

సాంసారిక జీవితంలో సీతా రాముల అన్యోన్యం ఎందరికో ఆదర్శం అయింది. ఆయన మీద ఈవిడకు అనురాగం ఎక్కువో, ఈవిడ మీద ఆయన రాగబంధం బలిష్ఠమో చెప్పటం కష్టం. అయోధ్యానగరవాసులకు వారు లక్ష్మీ నారాయణులే. ఉలా కొన్ని సంవత్సరాలు గడిచాయి.

అక్కడ మేనమామల యింట సర్వ సుఖభోగాలూ లభించినా, భరత శత్రుఘ్ను లకు నిరంతరం తండ్రి దశరథుడు స్మరణకు వస్తూనేవున్నాడు. అలానే యిక్కడ దశరథ చక్రవర్తి కూడా కొడుకులను తలుచుకుంటూనే వున్నాడు.

ఆయనకు నలుగురు కొడుకులూ సమానులే అయినా, రాముని మీద ప్రేమ కొంచెం హెచ్చుగానే వుంది. దేవేంద్రుని ప్రసవించి లోకంలో అదితి ప్రఖ్యాతి పొందినట్లు రాముని కన్న కౌసల్య ప్రజాగౌరవం పొందింది.

తన ప్రజలందరూ రామచంద్రుని గుణగణాలను పొగుడుతూంటే దశరథుని హృదయం సంతోషసాగర మయేది. సత్యపరాక్రముడు, దయా వినయశీలి, మృదుమధుర భాషి, జితక్రోధుడు, ధర్మవిదుడు, క్షత్రియకులాచారనిరతుడు, పరేంగితావగాహి, దేశ కాలజ్ఞుడు - ఏవంవిధప్రశంసలు వినవస్తున్నాయి, రాముని గురించి.

ధనుర్వేదవిదుడై శస్త్రాస్త్రకుశలుడయి, మహారథికశిరోభూషణుడనే కీర్తిని పొందిన రాముని ప్రజలందరూ తమ ఆత్మీయదైవంగా కొలుచుకుంటున్నారు. అటువంటి త్యాగ హృదయుడయిన మహావీరుని రాజ్యలక్ష్మి స్వయంగా వరించడం ఆశ్చర్యం కాదు.

ఆ రోజులలో ఒకనాడు దశరథుడు మంత్రి, సామంత, పురోహిత, దండనాథులతో, కొలువుతీర్చి పౌర, జానపద ప్రముఖులనూ వైశ్యప్రముఖులనూ, కర్షకశ్రేష్ఠులనూ చూస్తూ:

కోసల ప్రజానాయకులారా! ఈ రాజ్యాన్ని ఇంతవరకూ ఇక్ష్వాకువంశీయులు ప్రజాభిమతం గ్రహించి వారందరికీ అనురక్తి కలిగేటట్లు పాలించారు. నేను కూడా మా పితృ పితామహులు నడిచినదారినే ధర్మబద్ధంగా నడిచాను. ప్రజాశ్రేయస్సు పరమావధిగా యింతకాలం రాజ్యభారం వహించిన నా దేహమూ, మనస్సూ జరాభారంతో కృంగు తున్నాయి. ఇప్పుడింక ఈ సింహాసనం రామచంద్రునికి అప్పగించి వానిని రాజ్యాభిషిక్తునిచేసి విశ్రాంతి తీసుకోవాలని వుంది. మీరందరూ అనుమతిస్తే త్వరలోనే పట్టాభిషేకం జరిపించాలి అని ఆశాపూరితనయనాలతో సదస్యులను అవలోకించారు.

ఆయన నోట ఆ మాటవిన్న సదస్యులందరూ ఆనందపులకితదేహులై ప్రభూ! రామచంద్రుడు రాజుకావాలని మా అందరి మనసుల్లోవున్నదే. మా మనసులోని మాటనే మీరూ చెప్పారు, అన్నారు.

వారి మాటలు విన్న దశరథుడు అమాయకునివలె నవ్వుతూ: మీ రందరూ నా మనసును కష్టపెట్టడం యిష్టంలేక యిలా అంటున్నారా? నిజంగా మీ గుండెలో వున్నమాట చెప్తున్నారా? అని రెట్టించగా—

ప్రభూ! సర్వప్రజనూ కన్నబిడ్డలవలె చూచే రాముడు, ప్రజారక్షణకై శత్రు సంహా రానికి వెళ్ళి తిరిగిరాగానే మా అందరి యోగక్షేమాలూ విచారించే రాముడు, తన రాజ్యంలో ఎవరికి కష్టం వచ్చినా స్వయంగా వచ్చి వారి కుశలం చూచేరాముడు రాజు కావడం కంటె మేము కోరేదిలేదు.

తం దేవ దేవోపమ మాత్మజం తే
సర్వస్య లోకస్య హితే నివిష్టమ్।
హితాయనః క్షిప్ర ముదారజుష్టం
ముదాభిషేక్తుం వరద త్వ మర్హసి॥

అనడంతో, మహారాజు వారందరికీ అభివాదాలు చేసి, వశిష్ఠ వామదేవులవైపు తిరిగి చేతులు జోడించి :

కులగురువులకు నమస్సులు. ప్రకృతి అంతా పులకించి పరవశంతో ప్రసవించిన ప్రసవసౌరభంతో వసంతం మందమధుర వాయువులతో ఆశ్వాసన యిచ్చే యీ చైత్ర మాసంలోనే పట్టాభిషేకం జరిపించాలి అన్నారు.

సభాసదుల హర్షధ్వానాలలో, గురువుల ఆశీస్సులలో సభ కలకలలాడుతూండగా వశిష్ఠులు ముహూర్తం నిశ్చయం చేస్తూ, మరునాడే అభిషేకం జరగాలనీ, అందుకు తగిన ప్రయత్నాలు తెల్లవారేలోగా జరపాలనీ, అవసరసంభారాలన్నీ . అగ్నిహోత్రగృహానికి చేరాలని ఆజ్ఞాపించారు.

తక్షణం రామచంద్రుని సభావదనానికి కొనిరమ్మని సుమంత్రుని పంపిన క్షణంలో కౌసల్యానందవర్ధనుడు వచ్చి చక్రవర్తి పాదాలకు అభివాదం చేశాడు. ఉత్తరక్షణంలో మహారాజు తనకొడుకును గాఢంగా ఆలింగనం చేసుకొని తన సరసన కూర్చుండబెట్టు కున్నాడు. మేరువుమీద ఉదయభానునివలె ప్రకాశిస్తున్నాడు రాముడు.

రామచంద్రుని తదేకంగా ఆలోకించే దశరథునికి అద్దంలో తన ప్రతిబింబం చూచు కుంటున్నట్టు అనిపించింది. తన అదృష్టఫలాన్ని తనే అభినందించుకుంటూ :

నాయనా రామచంద్రా! కౌసల్యానందవర్ధనా, నా వంశజ్యేష్ఠుడివయిన నువ్వు నీ గుణశీలాలతో ప్రజాహృదయాలను రంజింపజేసి, వారి గౌరవాభిమానాలు సంపాదించావు. ఇప్పుడింక నిన్ను సింహాసనాధిష్ఠితుని చేసి నేను విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను. పౌరులందరూ ఆ మాటనే చెపుతున్నారు. అందుచేత నువ్వు ధర్మ తత్పరుడవయి రాజ్య భార నిర్వహణకు సన్నద్ధుడవు కావాలి, అనగా - రాముడు తలవంచి తండ్రికి నమస్కరించి, అందరి అనుమతితో సభాస్థలిసుండి తన భవనానికి చేరాడు. సభ చాలించాడు రాజు.

వార్త కౌసల్యాదేవి చెవిని పడింది; పడీ పడగానే ఆవిడ పట్టరాని ఆనందంతో పరిజనానికీ, వారి ఆప్తులకూ అందరికీ కానుకలు పంచిపెట్టింది.

మహారాజు తన మందిరానికి వెళ్ళి సుమంత్రుని పంపి రాముని రప్పించి :

నాయనా! చిరకాలం రాజ్యభారంతో, ధర్మబద్ధ క్రతునిర్వహణంతో నా శరీరం అలసివుంది. ఇంక ఈ ధర్మాన్నీ రాజ్యాన్నీ నువ్వు రక్షించాలి. నీ తండ్రి యింతగా ఎందుకు తొందర పడుతున్నాడో చెప్పాలి, నీకు.

ఇటీవలికాలంలో నాకెన్నో దుఃస్వప్నాలు వస్తున్నాయి. గ్రహాలు కూడా నాకు అనుకూలంగా లేవని సిద్ధాంతులు అంటున్నారు. నా మనస్సు స్వస్థంగా వుండగా నిన్ను సింహాసనం మీద చూడాలని వుంది. ఈ మనస్సు వున్నదే, యిది చాలా చంచల మయినది. ఎప్పటికెలా తిరుగుతుందో తెలియదు. అందుచేత ఈ ఏర్పాటు యింత అవ్యవధానంగా జరిగింది.

ఇప్పుడు చంద్రుడు పునర్వసు నక్షత్రంలో వున్నాడు, రేపు పుష్యమిలో వుంటాడు. రాజ్యాభిషేకానికి అది అత్యంత శుభప్రదమయినది. అందుచేత రేపే ముహూర్తం. కనక నువ్వు సీతాసమేతం ఈ క్షణంనుండీ ఉపవాసవ్రతం అవలంబించి, రాత్రి దర్భప్రస్తరం మీదనే శయనించాలి. నీ వ్రతనియమం భగ్నం చేయడానికి దుష్టశక్తులు ప్రయత్నిస్తాయి, అందుచేత ఆత్మీయులయిన మిత్రులనే నీ రక్షణలో వుంచు.

మరొక్కమాట! భరతుడు నగరంలో లేనప్పుడే యిది జరగాలనుకున్నాను. వాడికి నీ మీద అపారమైన గౌరవ ప్రేమాభిమానాలున్నా, వాడు ధర్మశీలుడైనా, నిర్మలచిత్తుడైనా, నాయనా! ఈ మనస్సు వున్నదే....ఎప్పుడెలా మారుతుందో తెలీదు. మహామహులనే వంచనచేసిం దీ మనస్సు. ఇక మనమెంత? అందుచేత ఇంతత్వరలో యిది ఏర్పాటు చేశాను. ఇక నువ్వువెళ్ళి నియమవ్రతనిష్ఠలో వుండు, అన్నాడు.

రాముడు తలవంచి పాదాభివాదంచేసి, కౌసల్యాదేవి అంతఃపురానికి వెళ్ళాడు. అప్పటికే ఆవిడ పూజాగృహంలో యిష్టదేవతా ఆరాధనం చేస్తున్నది. అక్కడే సుమిత్ర, లక్ష్మణుడు, సీత వున్నారు.

రాముడు తల్లిపాదాలకు నమస్కరించి :

అమ్మా! రేపు నన్ను యువరాజపీఠం ఎక్కించనున్నారు. అందుకని ఈక్షణంనుండీ నీ కోడలూ, నేనూ వ్రతదీక్షలో వుండాలని గురువులు ఆదేశించారు. మా చేత ఈ దీక్ష నువ్వు జరిపించాలమ్మా! అన్నాడు.

ఆత్మనందనుని నోట ఆ మాట విన్న కౌసల్యాదేవి ఆనందతరంగిత హృదయంతో:

- నాయనా! ఇంతకాలానికి మన శత్రుకోటి నిహతమైంది. నా బంధు, పరివారంతో సుమిత్ర పరిజనంకూడా సుఖశాంతులతో జీవితం గడుపుతారు, అని అందరి వైపూ చూచింది.

రామచంద్రుడు మందహాసంతో - తమ్ముని చూచి: లక్ష్మణా! నేనే కాదురా, రేపటినుండి నువ్వూ రాజువే. నన్ను వరించే యీ రాజ్యలక్ష్మి నా బహిఃప్రాణాని వైన నిన్నుకూడా వరించి తీరుతుంది. ఈ రాజ్యభోగాలు మనిద్దరం సమంగా అనుభవించాలి, రా అని దగ్గరగా తీసుకున్నాడు.

ఇక్కడ అంతఃపురంలో యీ సంరంభం సాగుతూంటే, అక్కడ దశరథమహారాజు విధ్యుక్తంగా రామునిచేత వ్రతదీక్ష నిర్వహింప చేయించవలసిందిగా కోరినాడు, కులగురువులను.

వశిష్ఠులు బ్రహ్మరథంమీద బయలుదేరి వచ్చారు. క్షణాల వ్యవధిలో రామచంద్రుడు రథందగ్గరకు వచ్చి గురుపూజ్యుల పాదాలకు అభివాదంచేసి, మందిరంలోపలకు తీసుకు వెళ్ళాడు.

కులగురువులు వేదవిహితంగా ఉపవాసదీక్ష ప్రారంభింపజేసి, సభాసదనానికి తిరిగి వచ్చి, అంతా మహారాజుకు నివేదించి, స్వగృహానికి వెళ్ళారు.

దశరథుడు కొలువుచాలించి సౌధాంతర్భాగానికి విజయంచేశాడు. అప్పటికే మలయ మారుతంలో పూలవాసనలా పట్టాభిషేకవార్త రాజధానీనగరం అంతా వ్యాపించి, జనపదాలలో గుబాళించింది. ఆ చల్లని కబురు చెవినిబడ్డ మరుక్షణంలో అయోధ్యానగరం మహోత్సవ సంరంభంలో మునిగింది. కోసల దేశీయ పౌర, జానపదులందరూ అభిషేక దర్శనో త్కంఠతో ఎలా వున్నవారు అలా ప్రయాణ సన్నాహాలు ఆరంభించారు.

ఆబాల స్త్రీ వృద్ధజనులందరూ రామనామ సంకీర్తన పరాయణులయారు. తాను జీవించివుండగానే కుమారుని పట్టాభిషిక్తునిచేసే దశరథుని అభినందనగానంతో ముఖరిత మయింది కోసలదేశం.

ఈరాత్రి యింత దీర్ఘమవుతున్నదేం! ఎప్పటికి తొలివెలుగురేకలు వస్తాయి? ఎప్పుడు రామచంద్రుని పట్టాభిషేకం....అవే ఆసక్తి అందరిగుండెలలో సుడులుతిరిగి, కనులలో సాక్షాత్కరిస్తున్నది. ఆరాత్రి కోసలదేశం నిద్రపోలేదు, రామపట్టాభిషేక దర్శనాభిలాషా సంవృతమనస్కయై.

## కై క - దా సి

కైకేయి అంతఃపుర సౌధాగ్రంమీద చల్లగాలి పీలుస్తున్న మంథర, నగరంలో ఉత్సవ సంరంభం చూసి ఆశ్చర్యపడి ప్రక్కనున్న పరిచారికను పిలిచి 'ఏమిటి విశేషం' అంది.

పట్టలేని సంతోషంతో ఆ పరిచారిక :

నీకింకా తెలియదా! రేపు రామచంద్రుని యువరాజ పదవికి అభిషేకిస్తున్నారు, అంది. మంథర గుండె అసూయాగ్నిజ్వాలలతో నిండింది. చరచర మేడమెట్లుదిగి కైకేయి పరున్న శయన మందిరానికి వచ్చి ఆవేదన నిండిన ఆవేశంతో :

ఓసి మూర్ఖురాలా, ఓవక్క కొంపలంటుకుపోతూంటే నీకు నిద్ర ఎలావడుతున్నదే నాతల్లీ! నీ సౌభాగ్యం మంటగలిసిపోతున్నది, అని కన్నుల నీరు నింపుకు నిలిచింది.

దాసినోట వెలువడ్డ అమంగళవాక్యాలు వింటూ కైకేయి కలవరహృదయంతో లేచి :

ఏమిటే మంథరా! నీ ముఖం వాడివుంది. కళ్ళనీళ్లు జారుతున్నాయి. ఏం ప్రమాదం జరిగిందే, అని అడిగింది.

ఇంకా ఏంజరగాలి? సర్వనాశనం నీనెత్తిమీద కూర్చున్నది. తెల్లవారిందంటేచాలు, రాముడు రాజు కాబోతున్నాడు. ఈ వార్త విన్న క్షణం నుంచీ నాగుండె కుతకుత లాడి పోతున్నది. కణకణలాడే నిప్పులమధ్య పడినట్లుంది. ఇంతకంటె నీకు దుఃఖకారణం వుండదు. నీ సుఖమే నా భాగ్యంగా భావించి బతుకుతున్న నాకు నీ దుఃఖంకంటె బాధ కలిగించేది లేదు.

ఉత్తమరాజవంశ సంజాతవైన నువ్వు అభిమానహీనవై బ్రతకలేవు కదా! ధర్మప్రభువులా నటించిన నీభర్త ఎంతమోసం చేస్తున్నాడో చూశావా! తెల్లనివన్నీపాలే అనుకునే నిన్ను ఎంతగా అన్యాయంచేశాడో! నాగుండె తరుక్కుపోతుంది. కాకోలవిషంకక్కే కాల సర్పాన్ని భర్త అని కౌగలించుకున్నావు. నీకంటె అమాయకురాలు లేదే తల్లీ!

రేపు రాముడే రాజైతే యింక నీకూ నాకూ దిక్కేమిటి? ఇంతకూ నామాట నీ చెవినిపడిందా! ఇంకా మొద్దునిద్రలోనే వున్నావా! అని :

కన్నులూ, ముక్కూ తుడుచుకుంటూ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో శోకసముద్రాన్ని పొంగించింది.

నెమ్మదిగా పక్కమీద కూర్చున్నది కైకేయి. ఆమె కన్నులలో సంతోషం ముఖ మంతా వ్యాపించింది. ఆనందతరంగిత హృదయంతో మంధరను దగ్గరగా తీసుకుని ఇంతటి శుభవార్తను చెప్పినందుకు నిన్ను ఎలా సంతోషపెట్టాలో తెలియడంలేదు. ఇదిగో ఈ ముత్యాలహారం తీసుకో.

అని మెడలోంచి హారం తీసి అందిస్తూ :

మంధరా! రామచంద్రుడు సింహాసనాసీనుడైతే, నాకంటె సంతోషించేవారులేరు. నాకు రాముడూ, భరతుడూ సమానులే. నా దృష్టిలో వారిమధ్య భేదంలేదు.

రామో వా భరతో వాఽహం విశేషం నోపలక్షయే ||
తస్మాత్తుష్టాస్మి యద్రాజా రామం రాజ్యేభి షేక్ష్యతి ||

అని కైకేయి అంటూంటే మంధర గుండె మండిపోయి ఆమె యిచ్చే హారాన్ని విసరికొట్టి :

గోలుగోలున ఏడవవలసిన సమయంలో నీకు నవ్వు ఎలావస్తున్నదే. విపరీత విపత్సా గరంలో మునగబోతున్న నీకు ఇప్పుడు ఎలాచెప్పాలో! నీకు పరమశత్రువైన కౌసల్యకొడుకు రేపు రాజు కాబోతున్నాడు. అదే జరిగితే నీ మృత్యువు నీ గుమ్మంముందు నిలిచినట్లే.

లక్ష్మణుడెప్పుడూ రాముడి నీడలానే బతుకుతాడు. భరతు డొక్కడే రాజ్య విషయంలో రామునికి శత్రువు, అందుచేతనే నీ కొడుకును దూరంగా పంపించారు.

అని దీర్ఘంగా నిశ్వసించి, ఊపిరి పీల్చుకుని :

రేపు రాముడు అభిషిక్తుడవుతాడు. ఇక చూడు. రాజ్యచక్రాన్ని కౌసల్య తిప్పు తుంది. ఆవిడనుమించిన అదృష్టవంతులు ఉండరు. ఇంతవరకూ ఆవిడను ద్వేషించిన వారందరినీ నేలమట్టం చేసి తీరుతుంది.

కైకేయి దాసీపని చెయ్యాలి కౌసల్య అంతఃపురంలో, ఇంక మాగతి ఏమిటి? భర తుడు రాముని పరిచారకుడు కావాలి. అంతేగా! అని బుసలుకొడుతూ నిలబడింది.

మంధరా! రాముడంటే ఏమనుకున్నావే! ధర్మ నిష్ఠాగరిష్ఠుడు. సత్యవ్రతపరాయ ణుడు. నిర్మలమనస్కుడు. శమ దమాది సద్గుణసంపన్నుడు. ఇవన్నీ అలావుంచి జ్యేష్ఠుడు సింహాసనం ఎక్కడం ఈ సూర్యవంశంలో అనూచానంగా వస్తున్న ఆచారం. పైగా రామ చంద్రుడు తన తమ్ముళ్ళని తండ్రిలా చూసుకుంటాడే. ఎటు చూసినా నీ ఏడుపుకి కారణం కనిపించడంలేదు. సీతకూడా నన్ను కౌసల్యకంటె ఎక్కువగా గౌరవిస్తుంది, అని అగడంతో, మంధర మరింత ఆయాసపడుతూ :

నీ మూర్ఖత్వానికి ఏడవక ఏంచెయ్యను? రాముని అనంతరం నీ కొడుకు రాజు కాగలడను కొంటున్నావేమో, పిచ్చిదానా! రాముడి అనంతరం ఆయన కొడుకే రాజవుతాడే! ఇక నీ భరతుడికి ఆ సింహాసనం ఎక్కే అవకాశమే లేదే.

జ్యేష్ఠుడే సింహాసనాసీనుడుకావడం ధర్మమే, కాని చిన్నవాడు అంతకంటె యోగ్యుడైతె ఆ అధికారం వానికి లభించిన సన్నివేశాలు లేకపోలేదు: కానీ ఇక్కడ ఆ అంశం పొసగదు.

తరతరాలా నీ కొడుకుతోపాటు మనుమలూ మునిమనుమలూ అందరూ రాముని సంతానాన్ని సేవిస్తూ జీవించాలి. ఇంతకంటె ఏం కావాలి ఏడవడానికి. ఇంతచెప్పినా నీకు తలకెక్కకపోతే. యింకా విను.

రాముడు రాజుకాగానే రాజ్యాన్ని నిష్కంటకం చేసుకుంటాడుకదా! అందుకుగాను ముందుగా భరతుని దేశాంతరమో, లోకాంతరమో పంపుతాడు.

మరొకమాట, అన్నదమ్ములయినా మరెవరయినా కలసిమెలసి వుంటూంటే స్నేహ బంధం వృద్ధిపొందుతుంది కాని, దూర దూరాలలో వుంటే వాత్సల్యం ఎలా వస్తుంది; నీ కొడుకు ఎప్పుడూ మేనమామల యింటిదగ్గరే వుంటాడు. అర్థమవుతున్నదా! చెట్టుని నరకా లంటే ముందు దానిచుట్టూవుండే మొక్కల్ని ఛేదించాలి. అందుకని రాముడు నీ కొడుకును అడ్డం తొలగించుకుంటాడు.

అమ్మా, కైకమ్మా! భరతుడు రాజయితే నీ పుట్టింటికి కూడా మేలు. అందుకయినా ఆయనను సింహాసనం ఎక్కించాలి.

లక్ష్మణుడు రామునికి బహిఃప్రాణంకనక, ఆయన విషయంలో ఈయన మరో యోచన చెయ్యనవసరంలేదు. మిగిలిన భరత శత్రుఘ్ను లిరువురి విషయంలో దోషాన్వే షణచేసి తగిన చర్యతీసుకోవడం తప్పదు. అందుచేత అది జరగకుండా మనం మన ప్రయత్నం చెయ్యాలి, అని క్షణం ఆగి:

శ్రీ వశిష్ఠులు పెట్టిన పట్టాభిషేక ముహూర్తంవేళకే రాముడు రాజసౌధంనుండి అడవికి వెళ్ళాలి. ఇది నా బుద్ధిని పుట్టిన ఆలోచన. ఇంతకంటే నీకు హితవులేదు.

బాల్యంనుండీ సర్వస్వతంత్రంగా బ్రతుకుతున్న భరతుడు ఈనాడు రాముని కను సన్నలలో బ్రతకడమా! అది అసంభవం, స్వేచ్ఛగా అడివిలో తిరిగే గజేంద్రం భరతుడు, అటువంటివాణ్ణి రామకేసరి హింసించబోతున్నది.

అదీకాక ఇంతవరకూ సౌభాగ్యదర్పంతో నువ్వు కౌసల్యను అంతదూరంలో నిల బెట్టావు. ఈనాడు ఆ స్థితిని ఆవిడ నీకు కలిగిస్తున్నది. అందుచేత ఆ దయనీయ దశ రాకుండా ఆవిడకొడుకుని రాజ్యబహిష్కృతుని చేయించాలి, మంథర మాట్లాడుతూనే వుంది.

కైకేయి తీవ్రక్రోధంతో బరిమీద తాచు బుసలుకొడుతున్నట్లు నిట్టూర్పులు నిగుడిస్తూ :

అయితే మంథరా! రాముడు అడవికి పోవడానికీ, నా కొడుకు సింహాసనం ఎక్క డానికి ఉపాయం ఏమిటి :

అనగానే పరమానందంతో మంథర :

తల్లీ! ఆమాత్రం తెలివిలేదా! పిచ్చితల్లి: అప్పుడే మరచిపోయావా! నిజంగా నీకు గుర్తులేదా! నువ్వేకదా నాకు చెప్పావు, అని గికురించగా కైకేయి దిండుమీద మోచెయ్యి పెట్టి మంథర ముఖంలోకి చూస్తూ :

చెప్పు, త్వరగా చెప్పు ఏది ఏమయినాసరే, రాముడు అడవికి వెళ్ళాలి, భరతుడు రాజు కావాలి, అంతే! అని బరువుగా గాలిపీల్చింది.

అయితే విను, అని మంథర చిరునవ్వు పెదవులు కదిలిస్తూ :

దేవాసుర సంగ్రామాలు జరుగుతున్న రోజులలో మీ ఆయన దేవతలకు తోడు వెళ్ళేవాడు. ఆరోజులలో దండకారణ్యప్రాంతంలో వైజయంతీ నగరానికి 'తిమిధ్వజుడు' రాజుగా వుండేవాడు. వాడు అసురుడు, ఆసురీమాయలన్నీ ఎరిగినవాడు. వాణ్ణి శంబరు డని అనేవారు. వాడితో యుద్ధం వచ్చినప్పుడు దేవేంద్రుడు మీ ఆయన సహాయం అర్థిం చాడు. అప్పుడు నువ్వుకూడా వెళ్ళావు.

ఆ యుద్ధంలో ఒకనాడు రాత్రి యుద్ధానికి దిగాడు శంబరుడు. ఆ సమయంలో నీ భర్త అలసిపోగా నువ్వే సారథ్యం వహించి ఆయన ప్రాణాలు కాపాడావు. అందు కాయన సంతోషించి నీకు రెండువరాలిచ్చాడు. అవి అప్పటినుంచీ అడగవలసిన అవ సరమే రాలేదని నువ్వే చెప్పావు. ఆ విషయం నువ్వు మరచిపోయినా నీ శ్రేయస్సుకోరే నేను మరచిపోలేనుగా, అని ఒక్క నవ్వు నవ్వి :

ఇప్పుడు ఒక వరం రాముడు అడవికి వెళ్ళడం, మరొకటి భరతుడు పట్టాభిషిక్తుడు కావడం. ఈ రాముడు తన గుణగణాలతో ప్రజాభిమానం పొంది వున్నాడు. కనక యిక్కడ ఆయన వుండగా భరతుడు శాంతంగా పాలించలేడు. అందుచేత రాముణ్ణి ప్రజలు మరచిపోవడానికి వీలుగా పద్నాలుగు సంవత్సరాలు వనవాసనియమం పెట్టు. ఆ కాలంలో మన భరతుడు స్థిరపడతాడు ప్రజాహృదయాలలో.

ఇంక నువ్వు మారుమాటాడక కోపగృహానికి నడు. ఈ అలంకారాలన్నీ విడిచి, కటిక నేలమీద పడుకో, మీ ఆయన వచ్చి ఎన్ని విధాల అర్థించినా చలించకు.

ఆయనకు నీమీద వున్న అనురాగంతో నీకోసం నిప్పులో దూకమన్నా దూకుతాడు. నీ ఉపేక్షను ఆయన భరించలేడు. రత్నభూషణాలు, చీనిచీనాంబరాలు ఎన్ని ఎరవేసినా కదలకు. ఒక్కటేమాట.

అంతే! పదునాలుగేండ్లు దాటాక రాముడు తిరిగి వచ్చినా అప్పటికి ప్రజలు భరతునిమీదనే విశ్వాసం పెంచుకుంటారు కనక రాజ్యం మనచేతులనుంచి జారిపోదు అని స్మితశ్రీ రోచులు నిండిన కన్నులు కైకేయి వదనంమీద నిలిపింది.

## రామవనగమనం - పట్టాభిషేకం

మంథర మాటలు కైకేయి మనసును మార్చాయి. ఆమెకు ఆశ్చర్యం కలిగింది. తన పరివారంలో వుండే కుబ్జలందరిలానే మంథర కూడా మూర్ఖురాలనీ, దాని మనసు ఎన్నడూ దురాలోచనలే చేయగలదని ఎరిగిన కైకకు ఇంతటి వివేకం, వివేచనాశక్తి దానికి ఎలా వచ్చాయో అర్థంకాలేదు. ఇంతగా తన శ్రేయస్సుకోరే మరో ప్రాణి వుంటుందని పించలేదు. ఆ క్షణంలో కైక పరమ సంతోషంతో మంథర సౌందర్యాన్నీ, వివేకాన్నీ పరిపరివిధాల ప్రశంసించి, యీ పన్నాగం ఫలించిన ఉత్తరక్షణంలో మణి, రత్న, భూష ణాలతో బహుకృతులిస్తానని వాగ్దానం చేసింది.

హంసతూలికాతల్పం దిగింది. అలంకారాలు తీసేసింది. చీనాంబరం విడిచే సింది. వేణీబంధం విప్పి విరబోసింది.

దాసి దుర్బోధలతో ఆమె కోపగృహంలో అడుగుపెట్టింది. కటిక నేలమీద నడ్డివాల్చి:

మంథరా! రాముడు అడవులకువెళ్ళి భరతుడు సింహాసనం ఎక్కేవరకూ ఈ గడపదాటను, ఈ వేషం మార్చను, మారు మాటాడను, చాలా! అంది.

> ఉదీర్ణసంరంభ తమోవృతాననా
> తదావముక్తోత్తమ మాల్యభూషణా ।
> నరేంద్రపత్నీ విమనా బభూవ సా
> తమోవృతా ద్యౌరివ మగ్నతారకా ॥

రామాభిషేకానికి అవసరమయిన ఏర్పాటులు పూర్తిచేసి దశరథుడు తన కత్యంత ప్రియురాలయిన కైకకు తన నోటితో శుభవార్త చెప్పాలని వచ్చాడు.

భవనద్వారంలో అడుగుపెట్టిన చక్రవర్తికి అక్కడి స్థితిగతులన్నీ విపరీతంగా కనిపించాయి.

శుక, మయూర, క్రౌంచ, హంసాదుల కలస్వనాలు లేవు. వాటిని గికురించి పలికించే కుబ్జల సందడిలేదు. వీణా, వేణుగానమాధురి లేదు. సుగంధధూమం లేదు. రాహుగ్రస్తమయిన చంద్రబింబంలా వుంది ఆ భవనం. అటు తిరిగాడు. ఉద్యాన వనంలో లతాగృహాలు, అక్కడి చంద్రకాంత శిలావేదులు శూన్యంగా వెలవెల బోతున్నాయి పాకశాలలో వంటచేసేవారేలేరు. అంతా అమంగళంగా కనిపించింది.

శయనాగారానికి వెళ్ళాడు. అదీ శూన్యంగావే వుంది. అక్కడవున్న ప్రతీహారిని అడిగాడు, రాణీగారు ఎక్కడ, అని.

ప్రభూ, రాణి అమ్మవారు కోపగృహంలో వున్నారు, అని సమాధానమిచ్చింది అది.

ఆమాట విన్న క్షణంలో మహారాజు మనస్సు వ్యాకులమయింది. అంతలోనే ఆ మనస్సు కామవశీభూతమయింది. ఏకాయెకి కోపగృహానికి వెళ్ళాడు. మందిరం అంతా అస్తవ్యస్తంగా వుంది.

భవనమధ్యంలో మాసిన చీరతో, చెదరిన కేశపాశంతో, కనుబొమలు ముడివేసి, బుసకొడుతున్న పాములా ఉచ్ఛ్వాస, నిశ్వాసలు సాగిస్తున్న ప్రియురాలు కనిపించగానే ఆయన గుండె ఆందోళనాభరమయింది.

శాపవశాన, స్వర్గపరిభ్రష్ట అయిన అప్సరసలా, బోయవాడు పన్నిన ఉచ్చులలో చిక్కుకున్న లేడిలా, వేటగాని శూలపుదెబ్బతిన్న ఏనుగు గున్నలా, జీవంలేని లతలా పడివున్న ప్రియురాలిని చూచిన దుఃఖంతో, ఆయన అక్కడే కూలబడి:

దేవీ! నీ కోపకారణం ఏమిటి? ఈ రాజ్యంలో నీ మాటకు తిరుగులేదే! నిన్ను తిరస్కరించినవాడికి శిరశ్ఛేదమేకదా శిక్ష. అదికాక ఆరోగ్యం బావులేదా! మన రాజ వైద్యులు క్షణాలలో ఎటువంటి వ్యాధినయినా ఎడంచేత్తో తీసి పారేయగలవారే.

కాక బంధితుడెవడయినా ముక్తుడుకావాలా! ఉరిశిక్ష షడ్డవాడి నెవడినయినా విడుదలచేయాలా! ఈ రాజ్యంలో నాతోసహా అందరూ నీ కనుసన్నలలో పడిచేవారే. నీకేది కావాలన్నా అది సమర్పించడానికి సిద్ధంగా వున్నాను. కోపం విడిచి ప్రసన్న వదనంతో యిటుచూసి నీకు కావలసింది కోరుకో, అని పరిపరివిధాల అర్థించాడు.

ఈక్షణం వరకూ నాకు ఎదురుతిరిగినవారు లేరు. ఇప్పటికి నాకు కావలసింది తీర్చగలనని ముందుగా ప్రతిజ్ఞచేస్తే తప్ప నేను చెప్పను, అని కేకయ రాజనందన అనగానే, అపరిమిత సంతోషంతో దశరథుడు ఆమెకు మరింత దగ్గరగావెళ్ళి ఆమె జుట్టులోకి వేళ్ళు నడిపి దువ్వుతూ:

ఓసి పిచ్చిదానా! ఈ ప్రపంచంలో ఒక్క రాముడు తప్ప నీకంటే నాకు ప్రియ మయిన వారెవరే! పురుషోత్తముడయిన ఆ రాముడు ప్రమాణంగా చెపుతున్నాను. ఒక్క ముహూర్తకాలమయినా నేను రామచంద్రుని చూడకుండా వుండలేను కదా! అటువంటి రామచంద్రునిమీద ఒట్టు. నీ కోరిక చెప్పు, అన్నాడు.

కైకేయికి విశ్వాసం కలిగి మహారాజును చూస్తూ :

మహారాజా! నువ్వు సత్యవాక్పాలకుడివే అయితే, సూర్య చంద్రులు, త్రింశత్కోటి దేవతలు ద్యావా పృథ్వులు, అహోరాత్రాలు, సర్వగృహదేవతలూ సాక్షిగా నా మాటలు విను. ధర్మజ్ఞుడవూ, సత్యవ్రత పరాయణుడవూ, మహాపరాక్రమశాలివీ అయిన నీ ప్రతిజ్ఞకు సర్వ చరాచర ప్రాణకోటి సాక్షీభూతంగా వున్నదని విస్మరించకుండా విను.

చాలాకాలంక్రితం.... దేవాసుర సంగ్రామసమయం.... రాత్రివేళ యుద్ధం.... ఆ ఆసురీమాయ నిన్ను మూర్ఛితుని చేసి, మృత్యుగహ్వరంలోకి నడుపుతోంది. అప్పుడు నిన్ను నేను రక్షించినప్పుడు, మహారాజా! గుర్తున్నదా! రెండు వరాలిచ్చావు. ఇంతవరకూ ఆ వరద్వయం నే నడగనూలేదు, నువ్వు ప్రస్తావించనూలేదు, ఇప్పుడు నేనడిగిన తరువాయి తీర్చకపోతే నాకు మరణమే శరణ్యం, వింటున్నావా మహారాజా, అని క్షణం ఆగి :

రామపట్టాభిషేక సుముహూర్తానికి సమకూర్చిన సాధనసామగ్రితో నా కొడుకు భరతుడు పట్టాభిషిక్తుడు కావాలి.

ఇక రెండవది - రాముడు జటావల్కలధారియై పదునాలుగేండ్లు అడవులలో తపస్విగా తిరగాలి అంతే!

మహారాజా! మీ వంశప్రతిష్ఠ, తమ సత్యసంధత లోకవిఖ్యాతం కావాలంటే ఈ రెండు కోరికలూ నెరవేర్చండి, అని ఆయనవైపే చూస్తూ ఆగింది.

నెత్తిమీద పిడుగు పడినట్లయింది, మహారాజుకి. కలగంటున్నానా! మతిభ్రమించ లేదు కదా! అనుకున్నాడు.

కొన్ని క్షణాలు నోట మాటలేదు. కనురెప్పలు బరువుగా వాలిపోయాయి. కొంత సేపటికి కనులు తెరిచాడు.

ఆడుపులిని చూసిన లేడిలా బెదురుగా కన్నులు ప్రియురాలివయిపు నడిపాడు. నడిపినక్షణంలో మహామంత్రబద్ధమయిన నాగేంద్రునివలె కుప్పకూలిపోయాడు.

అంతలో ఆయన హృదయం క్రోధాగ్నిని నిశ్వసించింది. ఆ నిట్టూర్పు వేడికి కైక కంపించి వుంటుందనిపించింది. అచంచలంగా అలానేవుంది కైక.

ఓసీ పాపిష్టిదానా! ఇలా సర్వనాశనానికి తలపడ్డావేమే, నా రామచంద్రుడు ఎప్పుడూ నిన్ను కన్నతల్లికంటె ఎక్కువగానే చూసేవాడుకాదటే. వాడు నీకు ఏం చేశాడని యీ దారుణానికి తలపడ్డావే!

ఉత్తమవంశంలో జన్మించిన రాచబిడ్డవని నిన్ను నా యింటికి తెచ్చానే! కాలసర్పానివై యిలా ఘోరదంష్ట్రలతో నా వంశాన్నే కాటేయగలవని ఊహించలేకపోయాను.

నా రామచంద్రుడు నీకు చేసిన కీడేమిటి? వాడు ఏ దోషం చేశాడని రాజ్యబహిష్కృతునిచేసి అడవులపాలు జెయ్యమంటావే!

సర్వసంపదలనూ, ఆఖరుకు కౌసల్యనూ, సుమిత్రనూ అయినా విడిచిపెట్టగలను కాని నా బహిఃప్రాణం- రాముడు- వాణ్ణివిడువలేను.

అహింసావ్రతుడు, క్షమాశీలుడు, ఋషితుల్యజీవితం గడిపేవాడు, అటువంటి రామచంద్రుని కారడవులకు ఏకారణంచేత పంపగలను; పంపి నేను బ్రతకగలనా! రెండు చేతులూ జోడించి అర్థిస్తున్నాను; నీ పాదాలు పట్టుకుంటున్నాను. నా సర్వ రాజ్యసంపదలు నీకు ధారవోస్తున్నాను. నా బిడ్డను అడవులపాలు చేసి యీ యిక్ష్వాకువంశాన్ని నాశనం చెయ్యకు, అని కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ పడ్డాడు. చలించలేదు కైకేయి; దీర్ఘంగా నిశ్వసించి :

ఓహో! సత్యవ్రతపాలన తత్పరులని పేరుపడ్డ ఇక్ష్వాకువంశంలో యింతకాలానికి అడినమాట తప్పినవాడొకడు పుట్టాడని లోకం వేలెత్తి చూపుతూంటే భరించగలిగితే నాకు బాధలేదు. రాజర్షిలోకం ముందు నీ యీ అధర్మవర్తనకు సమాధానం చెప్పుకోగలిగితే సంతోషం.

నేనుమాత్రం అడుగు వెనక్కువెయ్యను, రామవనవాసం, భరతుని పట్టాభిషేకం... ఈ రెండూ జరగకపోతే నేను విషంత్రాగి యిక్కడే చస్తాను. కౌసల్య ముందు చేతులు జోడించి తలవంచి నిలబడడం కైకేయి చేసేపనికాదు, అసలా ఆలోచనే రానివ్వను, అన్నది కైకేయి.

దశరథుని కనులలో దైన్యం తాండవించింది. రెప్పవెయ్యకుండా ఆమెనేచూశాడు, చలింపలేదు కైక. ఆమె దృఢసంకల్పం ఎరిగిన దశరథుడు గొడ్డలిదెబ్బతిన్న చెట్టులా పడి క్షణంలో తేరుకుని,

ఓసీ! నా వంశనాశనీ! నీ తలలో ఈ దుర్బుద్ధిబీజం ఎవరు వేశారే! ఇంతకుపూర్వం ఎన్నడూ యిటువంటి దుష్సంకల్పాలు చేసిన దానివికాదే. నా రామచంద్రుడు రాజయితే నీకొచ్చిన ముప్పేమిటి? బాగా ఆలోచించు.

కట్టుకున్నభర్త, కన్నకొడుకు, మన దేశప్రజలు, అంతేకాదు, నువ్వూ నీ శ్రేయస్సు.... ఇన్నింటిని ఆలోచించగలిగితే నీ వరాలు ఎంత ఉపద్రవం కలిగిస్తాయో తెలుస్తుంది.

నా రామభద్రుడు సింహాసనం అధివసిస్తే నీకూ, నీ కొడుక్కీ ఏవో ప్రమాదాలు వస్తాయనుకోవటం నీ భ్రమ. పయిగా, ధర్మపరుడయిన భరతుడు తన అన్నగారిని కాదని రాజ్యం తీసుకోలేడు. అప్పుడు నీ క్షుద్రబుద్ధీ, రాక్షసప్రవృత్తీ లోకానికి తెలుస్తాయి. ఇప్పటికయినా నీ దుస్సంకల్పానికి నీళ్ళు వొదులు.

సింహాసనం ఎక్కవలసిన కొడుకుని అడవులకు పొమ్మని ఏముఖంపెట్టుకుని చెప్ప గలను:

మంత్రి, సామంత, దండనాథ సమక్షంలో కోసల ప్రజాసదస్సులో పురోహితుల ముందు చెప్పివచ్చాను, రాముణ్ణి రేపు రాజ్యపీఠం మీద అభిషేకించాలని.

రేపు వారందరికీ ఏం చెప్పను? ఎలా చెప్పను? అదెలావున్నా నా బహిఃప్రాణ మయిన రామచంద్రుడు తలవంచుకుని అడవులపాలయితే చూస్తూ నేనింకా ఊపిరి పీల్చ గలనా!

కొలువుకూటంలో ప్రముఖులూ, ప్రాజ్ఞులూ నన్ను నిలబెట్టి కారణం అడిగితే "కైక వరం కోరింది" అని చెపితే నమ్ముతారా!

కౌసల్య యింతకాలంగా నా సేవలో ఏ క్షణమూ ఏమరుపాటు ఎరుగదే! అయినా యిన్నాళ్ళూ ఆమెను ఉదాసీనంగానే చూశాను. ఇప్పుడు ఆమె బిడ్డను అడవులకుతోలి యింకా ఆవిడముఖం ఎలా చూడగలను! నీ కోరిక తీరుస్తే సుమిత్ర నాముఖం చూస్తుందా!

ఓసి మూర్ఖురాలా! నా రామభద్రుడు అడవికి వెళ్ళిన ఉత్తర క్షణంలో నా ప్రాణాలు కూడా వాడితోనే వెడతాయి.

విదేహరాజనందన జానకి తన భర్తనువిడచి క్షణం జీవించగలదా!

ఇన్నీ జరిగాక నువ్వు విధవవై నీ కొడుకు రాజ్యం పాలిద్దువుగాని.

నేను ఏజన్మలో చేసిన పాపమో యిప్పుడిలా కట్టికుడుపుతోంది. తప్పటడుగులువేసే పసివాడు తాచుపామును తాడనుకొని పట్టుకున్నట్టు, నా పాలిట మృత్యుదేవతవని తెలియక నిన్ను కౌగిలించుకున్నాను.

తీవ్రకాముకుడై దశరథుడు పరమపురుషుడయిన కుమారుని కారడవులకు తోలాడని లోకం అంతా వేలెత్తిచూపుతుంది. ఈ అపకీర్తి దేశదేశాలకూ వ్యాపించి తీరుతుంది.

ఈనాటివరకూ గురుకులంలో నానా క్లేశాలూ అనుభవిస్తూ వేదశాస్త్రాలు అభ్యసించాడు. ఇప్పుడింక రాజభోగాలు అనుభవించే వయసు వచ్చిందనుకుంటే నీ పుణ్యమా అని అడవుల పాలవుతున్నాడు.

పితృవాక్పాలన పరాయణుడయిన నా రామచంద్రుడు నా మాట వింటూనే అడవులు పట్టిపోతాడు. వాడు రాజభవనం వీడిన క్షణంలో నేను ఆఖరిశ్వాస విడిచిపెడతాను; ఉత్తరనిమేషంలో కౌసల్య, సుమిత్ర ప్రాణత్యాగం చేస్తారు. అప్పుడింక లక్ష్మణ, శత్రుఘ్నులూ వుండరు. ఇందరూ కన్నుమూశాక హాయిగా నువ్వు రాజభోగాలు అనుభవిద్దువుగాని.

ఒకవేళ భరతుడు కూడా రామవనవాసం అంగీకరించి, రాజ్యం ఏలదల్చుకుంటే వాడితో ఒక్కమాట చెప్పు: ఈ దశరథుడికి అపరకర్మ చేసే అధికారం వాడికిలేదు, అంతే!

రాజయోగ్యమయిన రథాలమీద, ఉత్తమజాతి అశ్వాల మీద సాగే నా రామచంద్రుడు కర్కశ శిలలతో నిండిన, కంటకావృతమయిన అరణ్యాలలో పాదచారియై ఎలా నడవగలడే!

ఈ ఇక్ష్వాకుల మహానసాలలో (వంటింట) పాకకళానిపుణులు పోటీలుపడి వివిధ రుచులతో వండే వంటకాలు ఆరగించే రామచంద్రుడు - నా రామచంద్రుడు - ఆ అడవులలో కటు, తిక్త, కషాయభరాలయిన కందమూలఫలాలు ఎలా తింటాడే! అత్యంత మృదువులయిన పీతాంబరాలు ధరించేవాడే, వాడు వనవాసులయిన తపస్వులు కట్టే నారచీరలు కట్టుకు తిరగగలడా!

ఇవన్నీ ఆలోచించావా! అసలు ఈ బుద్ధి నీకే పుట్టిందా? ఇది మొదలుగా నీ మూలాన స్త్రీజాతి మూర్ఖత్వానికి స్వార్థానికి పర్యాయపదం అవుతుందే, కాని, అందరి తల్లులూ భరతుని తల్లులు కారులే.

ఇంతకాలంగా నువ్వు రామభద్రుని గురించి ఎన్నెన్నో చెపుతూంటే, చెప్పి సంతోషపడుతూంటే వాడిమీద నీకెంత ప్రేమవున్నదో అనుకున్నానే కాని ఆ మాటల మమకారంలో యింత విషం వున్నదనుకోలేదు.

ఒక్కనాడు ఒక్కరిని పన్నెత్తి పరుషంగా పలకని పరమ శాంతుడయిన రామచంద్రునిమీద నీకెందుకింత పగ? వానిమీద యింత పగబూనిన నీకంటె వాకు శత్రువులెవరే?

నీ కోరిక తీరిననాడు యీ లోకం నిన్నూ, నన్నూ ఆ చంద్రతారార్కం ఆడిపోసు కుంటూనే వుంటుంది. ఈ కోరిక నీ తలలో పుట్టగానే అది ఎందుకు బద్దలు కాలేదో, నువ్వు నిలిచిన భూమి బీటలు వారి నిన్నెందుకు కబళించలేదో.... అంటూ, యిక నోట మాట రాక మొదలునరికిన చెట్టులా ఆమె పాదాలమీద పడ్డాడు.

ఓ ఇక్ష్వాకువంశీయుడా ! సత్యవాదులూ, దృఢప్రతిజ్ఞులూ అని పేరుపడ్డవారే మీ వారందరూ, నే నడిగిన రెండు చిన్నకోరికలు తీర్చలేనివాడివి ఎందుకన్ని డంబాలు పలికావు, అన్నది అచంచలంగా కైక.

దశరథుని ముఖం క్రోధ ఘూర్ణితమైంది.

ఓసి పాపిష్టిదానా ! నా రామచంద్రుడు అడవికీ, నేను స్వర్గానికీ వెళ్ళాక నీవు సర్వసుఖాలూ అనుభవించు. అమరావతిలో దేవగణాలు నన్నుచేరి రాముడి కుశల వార్త లడిగితే నేనేం చెప్పకోను ?

చిరకాలం సంతానంలేక బాధలుపడ్డాను. ఇప్పుడింతటి విద్యాసంపన్నుడూ, శూరశిరోమణీ, దయా శాంతహృదయుడూ అయిన కొడుకుని దండకారణ్యానికి పంపానని ఎలా చెప్పగలను. ఇంతటి అపకీర్తిని ఎలామూటగట్టుకోను. ఇది నీకు దేశదేశాలలో ఎటువంటి అపఖ్యాతిని తెచ్చిపెడుతుందో ఆలోచించు, అంటూ మూర్ఛపోయాడు.

రాత్రి గడిచిపోయింది. తెలతెలవారుతున్నది.

ఆవిడ మనసు మార్చుకుంటుందేమోనని ఆశగా అర్థించాడు. ఆవిడ సత్య వాక్పాలనలోని ప్రాముఖ్యాన్ని వివరిస్తూనే వుంది. ఆడినమాటను తప్పని ధర్మపరుడుగా కీర్తిపొందాలంటే రాముని అడవికి పంపితీరా లంది. పంపకపోతే ఆత్మహత్య చేసుకుంటానంది.

ఆవేదననిండిన గుండెలలో ఆగ్రహం ప్రవేశించింది దశరథునికి.

ఓసి మూర్ఖురాలా ! అగ్నిసాక్షిగా నిన్ను పెండ్లాడి నేను మహాపాపాన్ని వరించాను. ఈక్షణంలో నిన్ను వదిలేశాను. నీ కోరిక తీరడంతో నేను భూలోకాన్ని వదులుతాను. నీకూ, నీ భరతుడికీ ఏమీ మిగలనివ్వను. నాకు తిలాంజలికూడా నారామచంద్రుడే వదలాలి. పట్టాభిషేకానికి తెచ్చిన పవిత్రనదీజలాలతో రామచంద్రుడే ఉదకక్రియలుకూడా నిర్వర్తించి వెడతాడు. ఇక నీమొహం నాకు చూపించకు, ఫో : అన్నాడు.

బుసలుకొడుతూ కైక : మహారాజా ! మీమాటలు సన్నిపాతరోగి ప్రేలాపనలా వున్నాయి. అవి చాలించి రాముడికి కబురుచేయించి, భరతుణ్ణి రప్పించి నావరాలకు

ఆచరణరూపం కల్పించండి. నిష్కపటంగా నాభరతుడు రాజ్యం ఏలేటట్లు చేయడం నీ బాధ్యత. ఈ బాధ్యతను విస్మరించడం ఎవరితరమూకాదు, అంది.

కొరడాదెబ్బతిన్న గుర్రంలా పడ్డాడు దశరథుడు.

సూర్యభగవానుడు ఉదయాద్రినుండి రథం ముందుకు సాగించాడు.

అప్పటికే వశిష్ఠమహర్షి శిష్యసమేతం అభిషేకభవనం చేరాడు. రాజ్యాభిషేకానికి అవసరమైన సామగ్రి అంతా అక్కడ సమాయత్తంచేసి ద్వారంలో వున్నాడు సుమంత్రుడు.

సుమంత్రా! సుముహూర్తం సమీపిస్తున్నదని మహారాజుకు నివేదించు. మే మిక్కడ ఉన్నామనికూడా చెపుతావుగా! అన్నారు శ్రీ వశిష్ఠులు.

పవిత్రగంగాజలంతో సాగరోదకంతో బంగారు కలశాలు రెండు, ఔదుంబర భద్ర పీఠం, నానావిధ రత్నాలు, సుగంధద్రవ్యాలు, సర్వధాన్యాలు, పంచగవ్యాలు; లాజలు, దర్భలు, పూలసజ్జలు అన్నీయథాస్థానాల్లో వున్నాయి.

భద్రగజం, నాలుగుగుర్రాలను పూన్చిన రథం, శ్వేతఛత్రం, స్వచ్ఛందధవళ చామరం, కనులు మిరుమిట్లుగొలిపేఖడ్గం, ధనుస్సు, సువర్ణరజ్జుబంధితమైన శ్వేతవృషభం, నాలుగుదంతాలుకల సింహం, వ్యాఘ్రచర్మం అలంకరించిన సింహాసనం, ఎనిమిదిమంది కన్యలు, సర్వాంగాలంకృతులైన వారనారీజనం, పసిడికాంతు లీనే పసుపుపూసిన పాదాలపై పారాణితో, చిరునవ్వులుజల్లే వదనాల కుంకుమ శోభతో ముత్తయిదువలు, పౌర జానపదులు సామంత దండనాధులు, ఋత్విజులు అందరికీ ఆహ్లాదం కలిగిస్తూ మంగళవాద్య ఘోష, అన్నీ పరిశీలించి వశిష్ఠులు, అందరి ముఖాలలో రాజ్యాభిషేకాలోకనోత్కంఠ గోచరించగా, సంతుష్టహృదయుడై సుమంత్రుని తొందరగా వెళ్ళమని ఆజ్ఞాపించారు.

శ్రీవశిష్ఠుల మాటకంటె వేగంగా సుమంత్రుడు అంతిపురివైపు నడిచి, ఇక్ష్వాకువంశీ యుల కీర్తిగానంతో శయ్యాగృహద్వారం సమీపించి :

మహారాజా! స్వస్తి! బాలభానుడు తన శతసహస్రకిరణాలతో కోసల ప్రజా హృద యాలను అలరిస్తున్నాడు. మనప్రజలు మీ దర్శనంకోసం ఎదురుచూస్తున్నారు

శ్రీ వశిష్ఠులు తమ శిష్యసమూహంతో అగ్నికార్యం నిర్వర్తించివచ్చి, మీ కోసం వేచివున్నారు. సుముహూర్తం సమీపిస్తున్నదని నివేదించమన్నారు. అని తలవంచి

అప్పనచివుడు పలికిన పలుకుకెల్లి విషంపూసిన ములుకులా గుచ్చుకున్న దశరథుడు, ఎర్రవారివ కమలెత్తి చూచి :

ఎందుకు నన్ను హింసిస్తావు సుమంత్రా! అన్నాడు. మహారాజు నోట వెలువడ్డమాట విని భయంతో రెండడుగులు వెనక్కువేశాడు, మంత్రి.

అది చూచి కైక : రామరాజ్యాభిషేక హర్షంతో ఆయనకు రాత్రి కన్ను మీద రెప్పవాలలేదు, ఇంకా నిద్రలోనే వున్నారు. నువ్వు వెళ్ళి రాముణ్ణి క్షణం ఆలస్యంలేకుండా యిక్కడకు తీసుకురా, అంది.

అమ్మా ! ఇది మహారాజు ఆజ్ఞా? అన్నాడు.

రాముణ్ణి చూడాలి, తక్షణం తీసుకురా అన్నాడు రాజు.

అంతఃపురంనుండి ఒంటరిగా వస్తున్న సుమంత్రునివైపు అందరూ ఆశ్చర్యంగా చూశారు. అందరివైపూ నవ్వుతూ చూచి రాముని మందిరానికి చక చక పొగాడు.

అంతిపురి కక్ష్యలు గడిచి, రథంమీద రామమందిరం చేరి, అక్కడ గుమిగూడిన ప్రజాసందోహాన్ని తప్పించుకొని, లోపల అడుగుపెట్టాడు.

ద్వారంలోవున్న ప్రతీహారిణులు దిగ్గునలేచి అంజలిబంధంతో మంత్రికి స్వాగతం పలికారు. తనరాక రామునికి నివేదించమన్నాడు.

రాముడు ఆయనను లోపలికి కొనిరమ్మన్నాడు హంసతూలికాతల్పం మీద కూర్చున్న రక్తచందనాలంకృతుడైన రామచంద్రునికి సీత వింజామరం వీస్తున్నది.

చిత్రానక్షత్రంతోకూడిన చంద్రునివలెవున్న రామభద్రునికి వందనంచేసి :

కౌసల్యానందనా! కైకేయీసన్నిధానంలోవున్న దశరథ ప్రభువు నిన్ను చూడాలను కుంటున్నారు, అనగా ఆమాట వింటూనే రాముడు పర్యంకం దిగి :

జానకీ! ఎప్పుడూ నా శ్రేయస్సునూ, మహారాజు హితవునూ కోరే మాపిన్నిగారు రాజ్యాభిషేకవిషయంలో ఏవో ముఖ్యాంశాలు ముచ్చటించడానికి కబురుచేసివుంటారు. క్షణంలో నేను తిరిగివస్తాను. ఈలోపున యిక్కడ పనులన్నీ పూర్తిచేయించు, అని గడపదాటాడు.

ద్వారంవరకూ వెంటవచ్చిన జానకి తన భర్తను సర్వవిధాలా కాపాడమని దేవత లందరికీ మనసా నమస్కరించింది.

అక్కడికే ఎదురువచ్చిన లక్ష్మణుడు అన్నగారిని అనుసరించాడు.

ఇరువంకల బారులుతీరివున్న స్నేహితులనూ, పరిజనులనూ చిరునవ్వుతో తిలకించి, కక్ష్యాంతరాలు దాటి సజ్జితమైవున్న రథాన్ని అధిరోహించినాడు. మణి కాంచన శోభితమైన, మేరుశిఖరంలా వున్న ఆ స్యందనం మేఘగంభీరధ్వానంతో సాగింది.

సాగి, సాగి రాజమందిరం చేరింది. ఛత్ర, చామరాలతో లక్ష్మణుడే రామరక్షలో వున్నాడు.

రంగు రంగుల వస్త్రాలు ధరించిన పౌర జానపదులూ, ఖడ్గాయుధధారులైన సైనికులూ జయ జయ ధ్వానాలు చేస్తున్నారు. రాజమార్గాని కిరువంకలావున్న సౌధ, భవనాలలోని నారీమణు లందరూ, శుచిస్మితవదనాలతో,

"రామచంద్రా! నిన్ను ప్రసవించి కౌసల్య ధన్యురాలైంది. నిన్ను సింహాసనంమీద చూసినప్పుడు ఆ తల్లికి కలిగే ఆనందానికి హద్దు లుండవు. ఏజన్మలోచేసిన పుణ్యఫలమో నిన్ను భర్తగా పొందగలిగింది జానకీదేవి. నువ్వు చక్రవర్తివి కావడం మా అదృష్టం, అను కుంటూ సంతోషించారు

రాముని స్నేహితులందరూ అపరిమితోత్సాహంతో స్వాగత గీతాలు జయ జయ సల్లాపాలూ సాగించారు.

రామగుణ శ్రవణమూ, రామరూప దర్శనమూ ఈరెండే అయోధ్యపౌరులకు క్రతువు లయాయి. రాముని దర్శించనివాడు ఆనాడు అదృష్టహీనుడే. రాముడు సర్వవర్ణాశ్రమ ధర్మరక్షకుడు కాగలడని వారందరూ విశ్వసించారు.

రామభద్రుడు కైకేయి భవనంలో అడుగుపెట్టాడు. వివర్ణవదనుడై శోకసముద్రంలో మునిగిన తండ్రిని చూశాడు. ఆయన పాదాలకు వందనంచేసి, కైకేయికి నమస్కారం చేశాడు. అక్కడి స్థితిగతులు, తండ్రిదశ చూచేసరికి త్రాచుపతొక్కిన సామాన్యునివలె భయపడ్డాడు. బాధనిండిన గుండెతో, వేడినిట్టూర్పులు విడిచే దశరథుని చూస్తూన్న రాముని హృదయం కల్లోలితసాగరం అయింది అసత్యం పలికిన మహర్షిపడే వేదన తండ్రిముఖంలో కనిపించింది. పాదాభివాదం చేసినా ఆయన ఆశీర్వచనం పలకలేదు. ఏ ఆవేశంతో వున్నా కంటబడితే పరవశించి, ఆలింగనం చేసుకునే అలవాటు. ఇప్పుడాయన నోట పలుకే లేదు.

కొన్నిక్షణాలూ అలానే అచేతనంగానిలబడి, పినతల్లివైపు తిరిగి :

అమ్మా ! నాన్నగారు యింత విషాదంలో వున్నారు, నేనేమయినా కూడనిపని

చేశానా? కాక వారికి మా న సి క ం గా కాని, శారీరకంగా కాని ఏమయినా అనారోగ్యం ఏర్పడిందా? భరత, శత్రుఘ్నులకుగాని, నాకు గాని, పూజ్యులయిన మా మాతృమూర్తు లకు గాని అశుభసూచన లేమయినా తెలిశాయా?

మానవుడికి జన్మమ అనుగ్రహించే ప్రత్యక్ష దైవమయిన తండ్రి క్లేశాలుపడుతూంటే చూస్తూ ఊరుకునేవాడు తనయుడేకాదు, నామీద కోపంవచ్చి ఆయన యీస్థితిలో ఉంటే నేను క్షణంకూడా ప్రాణాలతోఉండను.

అమ్మా! ఆయన మనసుకు బాధకలిగే మాటలు మీరేమి అనలేదుకదా! ఇంతకూ ఏం జరిగిందో త్వరగా చెప్పవమ్మా, అని ప్రార్థించాడు.

రామా! మీ నాన్నగారికి ఏవిపత్తులు నెత్తిమీద పడలేదు. దుఃఖానికి కారణాలు లేవు, నీమీద కోపమూలేదు. అయితే మనసులోని మాట నీతో చెప్పటానికి భయపడు తున్నారు. నీకు అయిష్టం కలిగించే మాటలు ఆయన నోటితోచెప్పటానికి బాధపడుతున్నారు. ఆయన దుఃఖం తగ్గించాలంటే నువ్వు ఒకపని చెయ్యాలి సావధానంగా విను, అని కైకేయి పరమగంభీరంగా, అచంచలంగా:

చాలారోజులక్రితం మాట: దేవాసుర సంగ్రామంలో మీ నాన్నగారు దేవతల సహాయంగా వెళ్ళినపుడు ఆయనకు నేనొక మేలుచేశాను. అందుకు సంతోషించి నాకు రెండు వరాలిచ్చారు. ఆ యిచ్చిన వరాలు తీర్చవలసివచ్చేసరికి బాధ కలిగింది పాపం:

సమస్తధర్మాలకూ సత్యం మూలం కదా! క్రోధావేశంతో మీ నాన్నగారు సత్య వ్రతాన్ని విడిచిపెట్టబోతున్నారు. నీమీద ప్రేమవల్ల: ఆయన చెప్పకపోయినా ఆయన సహధర్మిణిగా నేను చెపుతాను. అది మంచికావచ్చు, చెడయినా అవవచ్చు. నువ్వు నెరవేర్చగలనని మాటయిస్తే నేనే చెపుతాను, అంది.

రామచంద్రుడు వినయంగా, చేతులు జోడించి:

అమ్మా! ఇంతకాలంగా నన్నెరిగిన మీరే ఇలా మాట్లాడుతూంటే నాకుచాలా భయంగావుంది. నా స్వభావం మీకు తెలియందికాదే. పితృపాదులు ఆజ్ఞాపిస్తే అగ్ని గుండంలో దూకమన్నా, సముద్రంలో మునగమన్నా, కాకోలవిషం మింగమన్నా, క్షణం కూడా సంకోచించనే! మహారాజు మనసులోని మాట ఏమిటో చెప్పండి, ఈ రాముడు తక్షణం నెరవేరుస్తాడు, వీడికి రెండు నాలుకలు లేవు. 'రా మో ద్వి ర్నా భి భా ష తే', అని తలవంచి నిలబడ్డాడు.

ఆ మాటలు కైకను విశ్వసింపజేసాయి : అయితే వినవయ్యా! ఈనాడు నేనడిగిన వరాలలో మొదటిది, భరతుడు సింహాసనము ఎక్కాలి. రెండవది, నువ్వు ఈ సుముహూర్తంలోనే బయలుదేరి పదునాలుగేళ్ళు అడవులలోఉండాలి ఇది ఆయన నోటితో చెప్పలేక.... అని ఆగింది.

ఆ మాట వినవప్పుడున్న నిబ్బరంతోనే రాముడు :

"అమ్మా....! ఇప్పుడే జటావల్కలాలు ధరించి నేను అడవికి వెడతాను. గురువు, శ్రేయోభిలాషి అయిన తండ్రిమాటను పాటించడం కంటే, తనయుడికి కావలసిన దేమున్న దమ్మా? దీనికోసం ఆయన అంతగా బాధపడడం అనవసరం. భరతుడికి రాజ్యం యివ్వ డానికి నేను సంకోచిస్తానా? నా ప్రాణాలయినా భరతుడికి సంతోషంగా అర్పించగలనే.

ఇప్పుడే శీఘ్రవేగంతో వెళ్ళే గుర్రాలమీద భరతుడికి కబురువెడుతుంది. ఈ లోపునే నేను అడవికి ప్రయాణమవుతాను. అని రాముడు అనడంతో కైక, ఇంకఆలస్యం చెయ్యకు బయలుదేరు. భరతుని కోసం దూతలువెడతారు. నువ్వు ఎక్కువ సేపు ఇక్కడ ఉండటం మంచిది కాదు. ఆయన మనస్సును మరల్చటం నాకు తెలుసు. అయితే ఆ పని నువ్వు ఎదురుగావుండగా కష్టం. నువ్వుండగా అన్నపానాలుకూడా ఆయన ముట్టడు, అంటూంటే దశరథుడు ఛీ... ఛీ....అని మాత్రం అన్నాడు.

ఆయనమాటలు రామునికి కొరడాదెబ్బల్లా అయాయి, అయినా గాంభీర్యం సడలనివ్వ లేదు.

అమ్మా! నన్ను మీరెరుగుదురు. పవిత్రధర్మపాలనమే నా నియమం. అర్థానికి దాసుడినికాదు. ఈ క్షణంవరకూ పితృవాక్పాలనంలో ప్రమత్తుణ్ణి కాలేదు. ఆయన నోటితో చెప్పకపోయినా, మీ మాటమీద అరణ్యానికి వెడుతున్నాను. పదునాలుగేండ్లు కాదు, అనలింక అయోధ్యకే రాను.

ఇప్పుడేవెళ్ళి మా అమ్మకూ, సీతకూ యీ విషయం చెప్పి బయలుదేరుతాను. నేను వెళ్ళగానే భరతుడు సింహాసనం అధివసించి, తండ్రిగారి సేవలో ఉండేటట్లుచూడండి, అని రామచంద్రుడు అంటూంటే విన్న దశరథుని గుండెలో పొంగే దుఃఖాన్ని ఆపుకోలేక భోరున విలపించాడు

రాముడు తండ్రికి ప్రదక్షిణంచేసి, కైకేయికి పాదాభివాదం చేసి మందిరం విడిచాడు. వెనుకనే వున్న లక్ష్మణస్వామి క్రోధవిషాదమూర్తియై అన్నను అనుసరించాడు.

రాముడు కైకేయి భవనానికి వెడుతున్నప్పుడు ఎలావున్నాడో, రాజ్యాభిషేక భంగ వార్త విన్నా అలానే వున్నాడు. చకచక సాగుతున్నాడు. ఛత్ర, చామరాది రాజ లాంఛనాలు పరిత్యజించాడు. ప్రశాంతవదనుడై కౌసల్యాదేవి మందిరానికి వెడుతున్నాడు.

ఇక్కడ జరిగిన కథ క్షణాలలో, అంతఃపురం అంతటా అభివ్యాప్తమయింది, రాణి వాసం ఒక్కపెట్టున విలపించింది. అది చెవినిపడ్డ దశరథుని గుండె మరింత వేదనాభార మయింది.

కౌసల్యమందిర ద్వారం చేరిన విప్ర, బాల, స్త్రీ, వృద్ధులందరూ జయజయధ్వానాలతో రామునికి దారియిచ్చారు. పూజామందిరంలో ఆనందవల్లిలా వున్న తల్లి కౌసల్య రాత్రి జాగరణంచేసి కొడుకు శ్రేయస్సు కోసం విష్ణుదేవుని ఆరాధించి, మంత్రసహితంగా అగ్నికి హోమం జరుపుతున్నది.

ఆత్మనందనుని చూస్తూ మహానందంతో ఎదురువెళ్ళింది. రాముడు తల్లిపాదాలకు అభివాదం చేశాడు. ఆమె కొడుకును గాఢంగా ఆలింగనం చేసుకుంది. ఎన్నెన్నో ఆశీ ర్వచనాలతో ముంచెత్తింది.

రామచంద్రుడు తలవంచి ఆవిడచేతులుపట్టుకుని : అమ్మా, ఈవార్త నీ కింకా అందివుండదు.

రాజాజ్ఞానుసారం నేను ఈనాడే దండకారణ్యానికి వెడుతూ నీ సెలవుకోసంవచ్చాను. అడవిలో దర్భాసనంమీద కందమూల ఫలాలు భుజిస్తూ పదునాలుగేండ్లు గడిపిరమ్మని రాజాజ్ఞ. నీకూ, విదేహరాజనందనకూ, లక్ష్మణుడికీ మంచిరోజులు కావివి. ఈ సింహా సనం భరతుడి కిస్తున్నారు మహారాజు అన్నాడు.

మొదలునరికిన అరటిబోదెలా కూలిపోయిందా తల్లి. నెమ్మదిగా ఆమెను లేవదీసి దగ్గరగా కూర్చోబెట్టాడు రాముడు. కొద్దిక్షణాలలోనే అయోమయావస్థలోనుండి తేరుకుంటూ కౌసల్య :

నాయనా! నువు నాకడుపున పడకపోయినా ఈ అవస్థలుండేవికావురా ! గొడ్రాలినవే బాధ ఒక్కటే. పట్టమహిషినైవుండీ యింతకాలం సామాన్యస్త్రీవడే యాతనలు పడ్డాను. : సవతుల తిరస్కారాలతో ఎంతగా కుమిలిపోయానో.

నిన్ను కన్న క్షణంనుంచి సర్వబాధలూ విస్మరించి, నీ మీదనే నా ఆశలన్నీ పెంచుకుంటున్నాను. ఇప్పుడు నువ్వు నన్ను వదలి పోతున్నావు. ఇంతవరకూ కైకేయి

పరిజనం నన్నెన్నివిధాల హింసించారో నువ్వెరుగవు. నువ్వులేకపోతే నాకు మరణమే శరణ్యం.

మాత్సర్యం మూర్తీభవించిన కైక ముఖం చూడలేను. నువ్వు రాజువి అవుతావని నా బాధలన్నీ వదిలిపోతాయనీ అనుకుంటూ ఇంతవరకూ బతికాను, గుండెరాయిచేసుకొని ఆ ఆశతోనే నేటివరకూ ఊపిరిపీలుస్తున్నాను. ఇప్పుడు నువ్వు అడవికి వెడుతున్నానని చెప్పినా బద్దలవనంత పాషాణదశలో వుంది నా గుండె.

ఇటు పుత్రవియోగం. అటు సవతి మాత్సర్యం, నేటివరకూ నేను చేసిన వ్రత దానాల ఫలం యిదేనా ! అని విలపిస్తూ తల దించుకుంది.

అంతవరకూ క్రోధాన్ని దిగమింగుతూ బుసకొడుతున్నట్టు శ్వాసవిడిచే లక్ష్మణస్వామి :

అమ్మా ! రామచంద్రుడు రాజ్యం విడిచి అడవికి వెళ్ళడం నాకెంతమాత్రం యిష్టంలేదు.

వయసువండి, వార్ధక్యం వంచించినా, కామవశంవదుడై, విషయలాలసుడై చరించే చక్రవర్తి ఏం మాట్లాడినా మాట్లాడుతాడు. ఈ నా అన్న ఏఅపరాధం చేశాడని అడవికి పంపుతాడు. గర్భశత్రువుకూడా వేలెత్తి చూపడానికి ఈయన చేసిన దోషం లేదే. అదీ కాక మహారాజు ద్వితీయ బాల్యంలో ఉన్నాడు. బాలుడి మాటను లెక్కచేయ నవసరం లేదు, అని అన్నగారివైపు తిరిగి :

రామచంద్రా ! ఈ లక్ష్మణుడుండగా ఎవరిభయం లేదు. నీవయిపు కన్నెత్తిచూడ గలవాడు లేడు. నీఏలుబడినికాదంటే ఈఅయోధ్యనే సర్వనాశనం చేస్తాను. భరతుని పరిజనం తిరగబడితే వారందరూ యమసదనం చేరవలసిందే.

మంచివాళ్ళే లోకంలో పరాభూతు లవుతుంటారు. కైకేయి మాటలవల్ల మహారాజు యింత అఘాయిత్యానికి తలపడ్డాడు. ఆయన మనస్సులోనే ఈదురూహవుడితే ఉత్తర క్షణంలో వధించవలసిందే. విచక్షణ నశించిన గురువువైనా దండించవలసిందే అని ధర్మ శాస్త్రం ఘోషిస్తున్నది.

గురోర వ్యవలిప్తస్య కార్యాకార్య మజానతః ।
ఉత్పథం ప్రతిపన్నస్య ! కార్యం భవతి శాసనం ॥

మహారాజు ఏ అండచూసుకుని నీరాజ్యం కైకేయికి దారపోయదలంచిందీ తెలియడం లేదు. నిన్నూ, నన్నూకాదని రాజ్యాన్ని భరతునికిచ్చేశక్తి ఎవరికుంది? అని తల్లివైపు తిరిగి:

అమ్మా ! సత్యమే ప్రమాణంగా, ఈ ధనుస్సు సాక్షిగా చెపుతున్నాను. నేను సర్వాత్మనా నా అన్నగారికే బద్ధుడుని. రాముడెక్కడవుంటే లక్ష్మణుడూ అక్కడే; అది అడవైనా, అగ్నిగుండమైనా సరే. ప్రభాకరుడు తమఃపటలాన్ని ఛేదించేటట్లు నేను మీ దుఃఖాన్ని హరిస్తాను. ముసలితనంలో మతితప్పి కైకేయిమీద మనసు తిప్పుకోలేని తండ్రిని తెగటారుస్తాను, అంటూన్న సౌమిత్రివలుకులు విని, కన్నీరాగని కౌసల్య :

రామభద్రా ! విన్నావా తమ్ముడి మాటలు! సవతితల్లి అధర్మానికి ఒడిగడితే, దానికి తలఒగ్గి, కన్నతల్లిని దుఃఖసాగరంలో విడవడం న్యాయమేనా ? ధర్మపథానువర్తనమే నీ లక్ష్యమైతే మాతృసేవాపరాయణుడవై యిక్కడేవుండు. నిన్ను విడిచి క్షణం నేను జీవించలేను. నువ్వు అడవికివెళ్ళిన క్షణంలో ప్రాణంవిడుస్తాను. మాతృహత్యాదోషం నిన్ను చుట్టుకుంటుంది, అని విలపిస్తుంటే రామచంద్రుడు :

అమ్మా ! నాన్నగారి ఆజ్ఞను ఉల్లంఘించేశక్తి నాకులేదు. అందుకే నాప్రార్థన మన్నించు. పితృవాక్యపాలనం పరమోత్తమ ధర్మం, కనకనే పరశురాముడు కన్నతల్లినే ఖండపరశువుకి ఎరచేశాడు. ఇలా ఎందరో మహాపురుషులున్నారు. వారిని ఆదర్శంగా ఉంచుకుని నడవడమే నాకు శరణ్యం, అని రామచంద్రుడు తమ్ముని వైపు తిరిగి :

లచ్చీ ! నామీద నీకున్న గౌరవ ప్రేమాభిమానాలు అనన్యమైనవి. నీశక్తి,సాహసం, తేజస్సు ఎంతటివో ఎరుగుదును. అమ్మగారి దుఃఖతీవ్రత తెలును. ఐనా సత్యాన్నీ, శాంతాన్నీ విస్మరించి నువ్వు మాట్లాడటం న్యాయంకాదు. ధర్మాన్ని మించిం దేమీలేదని ఎరుగుదువాః సత్యాన్నిమించిన ధర్మంలేదు, కనుకనే నాన్నగారి సత్యవ్రతనిర్వహణకు నేను దీక్షవహిం చాను. ఐతే ఈమాట నాన్నగారిది కాదనీ, కైకమ్మదనీ అంటావేమో: కాని ఆయన మనసులో వున్నదే యిది, అందుచేత నువ్వుకూడా నేను ఆలోచించే దారినే సక్రమంగా మనసును నడుపు. అని తల్లివైపుతిరిగి :

అమ్మా ! పదునాలుగేండ్లంటే ఎంతమ్మా! క్షణాలలో పూర్తిచేసివస్తా! ఆశీర్వదించి పంపవమ్మా, దుఃఖం విడిచి శ్రద్ధతో మహారాజుని సేవించు, ఆయన నీభర్త. వారి ఆజ్ఞా పాలనం మనకు పరమధర్మం, అన్నాడు.

కౌసల్యదుఃఖం తోనే నేనుకూడా అడవికి వస్తానంది లక్ష్మణుడి కన్నులలో ఎర్ర జీరలు ప్రవహిస్తూనే ఉన్నాయి.. ఇద్దరినీచూసిన రాముని గుండె సంకటంలోపడింది.

అమ్మా ! అర్థకామాలు రెండూ ధర్మబద్ధంగా ఉండాలి. తద్భిన్నంగావుంటే నేను సహించను. మహారాజు నాతండ్రి, గురువు, సర్వదా పూజ్యుడు. ఆయన ఏదృష్టితో, ఏఊహతో ఏమాట అన్నా నేను పాటించకతప్పదు. అని తమ్మునిచూసి: లచ్చీ, ధర్మపురుషుడైన భర్త జీవించి ఉండగా పతివ్రతాధర్మపరాయణురాలయిన ఈవిడ అనాథవలె నావెంట అడవికిరావడం అనుచితం. తన అమృత హృదయంతో నన్ను ఆశీర్వదించి పంపాలి. అదే నాకు శ్రేయస్సు. తుచ్ఛమైన రాజ్య కాంక్షతో జీవనధర్మాన్ని విడుచుకుంటారా! అని నిశ్చలంగా నిలబడ్డాడు.

ఆ మాటలకు కూడా లక్ష్మణుని మనసు మారలేదు. రోషపూరితాలైవున్నాయి ఆయన నయనాలు కుపితభుజంగం బుసకొడుతున్నట్టున్నాడు. చూసిన రామచంద్రుడు మెల్లగా - తమ్ముడూ ! రోషం, శోకం మీవంటివాడి దరిదాపులకు రాకూడదు. ధైర్యం, నిగ్రహం ఉండాలి పట్టాభిషేకంకోసం సమకూర్చిన ఈ సర్వసంభారాలూ పక్కకు పెట్టించు. ఇవి కంటబడుతూంటే నీ హృదయం మరింతగా రోషవశీభూత మవుతున్నది.

ఇక్కడ ఇంకా ఆలస్యం అయితే కైకమ్మ నన్నే శంకించగలదు. అదినేను సహించలేను. ఎవరూ నన్ను అనుమానించరాదు.

నాన్నగారు సత్యపరాక్రముడూ, సత్యసంధుడూనూ. ఈ వ్రతం చెడితే పరలోకాలు చెడతాయికదా ఆయనకి. ఈ వార్ధక్యంలో అటువంటిస్థితి కొడుకులు కలిగించకూడదు.

నేను అడవికి వెళ్ళగానే భరతుడికి పట్టాభిషేకం జరిపించి పిన్నిగారు ఆనందిస్తారు. సముచితసంకల్పంతో వివేకవంతురాలైన పిన్నిగారిని దోషిగా భావించడం న్యాయంకాదు. భరతుడికంటె ఆప్యాయంగా నన్నే చూచే కైకమ్మను నిందించడం అన్యాయం. ఈనాడు ఆవిడ తనకొడుకుని సింహాసనం యెక్కించి, నన్ను అడవికి పంపుతున్నదంటే అదేదో దైవసంకల్పమేతప్ప మరొకటికాదు. అలా కాకపోతే భర్త ఎదురుగా ఉండగా ఆవిడ పరమ ప్రాకృతస్త్రీవలె మాట్లాడి నన్ను అంతగా బాధపెట్టేదికాదు.

అందుచేత విధిని ఎదిరించడానికి సాహసించకు. మహామహులే విధికితలవంచి వెళ్ళిపోయారు. మనమెంత ! అభిషేకభంగానికి నేను చింతించను. నువ్వు క్రోధాన్నివిడిచి నావలె ఆలోచించు

రాజ్యం వా వనవాసో వా।
వనవాసో మహోదయః॥

రాజ్యంకంటె వనవాసమే నాకు శ్రేయస్కరం అని ఎంతచెప్పినా లక్ష్మణుని కోపం తగ్గలేదు. కనుబొమలు మరింత ముడిపడ్డాయి. పుట్టలోనిపాములా బుసకొట్టి, కుపితమృగేంద్రంలా ముఖం ఎర్రజేసి, మత్తేభశుండాల సదృశమైన దక్షిణహస్తం పైకెత్తి తలపైకెత్తి పక్కకు తిప్పి :

రామచంద్రా ! నీవంటి పౌరుషశాలి, క్షత్రియయోధుడు పలకవలసిన మాటలుకావివి. దుర్బలుడూ, దీనుడూ, అశక్తుడూ మాట్లాడాలి ఈమాటలు. ధర్మపరాయణుడవైన నువ్వు అధర్మవర్తనుల ఎత్తులు గ్రహించలేక పాపబుద్ధులను విశ్వసిస్తున్నావు.

పోనీ నువ్వు అన్నట్లే వారు సుగుణసంపన్నులూ, సచ్చరిత్రులూ, ధర్మపరులూ అనుకుందాం. ఈ వరాలు ఎప్పుడో యిచ్చినవే అని అంగీకరించినా, నిన్నుకాదని ఈ రాజ్యాన్ని ఎవరికో యివ్వడం ద్రోహచింతకదా! నువ్వు ధర్మాన్ని గురించి చాలా చెప్పావు. ధర్మం నీబుద్ధిని వంచించిందని మరిచిపోయావు. కైకమ్మకు లొంగి, వార్ధక్యంతో వివేచన కోల్పోయిన మహారాజు ధర్మవిరుద్ధంగా చరిస్తుంటే దాన్ని నువ్వు అంగీకరించడంకంటె దోషం లేదు. నువ్వు కర్మవీరుడవని మరచిపోతున్నావు. మాతా పితృరూపంలోవున్న శత్రువులకు అనుకూలంగా నడుస్తున్నావు.

నువ్వన్నట్లు ఇది దైవప్రేరణే అయినా లక్ష్యం చెయ్యవలసిన పరాక్రమశూన్యుడవు కావే. ఆత్మగౌరవంకల వీరుడు దైవానికి తలవొగ్గడు. పురుషకారం దైవాన్ని ఎదిరించి నిలబడుతుంది. దైవంగా భాసించే విధి, పురుషపౌరుషం ఈరెండింటిలో ఏది బలిష్ఠమైనదో యిప్పుడు తేలాలి. పౌరుషం అనే అంకుశంతో దైవమనే మత్తేభాన్ని వశంచేసుకుని ఈ పట్టాభిషేకం జరిపించి చూపుతాను. లోకాలూ, లోకపాలకులూ అందరూ నాముందు తలవాల్చాలి. ఇక ఈ దశరథమహారాజెంత !

కుట్రపన్ని నిన్ను అడవులకు పంపడానికి ప్రయత్నించినవారే అడవులపాలవుతారు. పైగా ఈ వాంఛ నాన్నగారిదికాదు, ఇది అవివకలలో పుట్టింది. అవివనే ఈ కాలితో తొక్కి అణచిపెడతాను.

నువ్వు సింహాసనం అధివసించి, రాజ్యంపాలించి, వార్ధక్యంలో వనవాసంచెయ్యాలి కాని యిప్పుడుకాదు. ఇది సనాతన రాజర్షి ధర్మం, భరతుడికి రాజ్యం ఇవ్వకపోతే కల్లోలాలు రేగుతాయనుకుంటావేమో! సముద్రుడిని చెలియలికట్ట రక్షించేటట్లు నిన్ను సర్వఉపద్రవాలనుంచీ నేను రక్షిస్తాను.

నా భుజాలు, ధనుస్సు, ఖడ్గమూ అన్నీ అలంకారార్థం కాదు; వజ్రాయుధంకూడా ఈ ఖడ్గధారలముందు నిలవదు సారి సారించి బాణం సంధించి నిలబడ్డ నాముందు ముల్లోకాలూ తలవంచక తప్పదు, దశరథుని పదభ్రష్టుచేసి రామశాసనం అమలుజరుపు తాను. అందుకు అనుజ్ఞ వేడుతున్నాను అన్నాడు.

రామచంద్రుడు చలించలేదు. కౌసల్యపరిపరివిధాల కొడుకు సంకల్పం మార్చ డానికి యత్నించి: నాయనా! నువ్వు అడవికి వెడితే ఈ సవతులమధ్య బ్రతుకలేను. నన్నుకూడా తీసుకుపో, అని దీనంగా అడుగుతుంటే:

అమ్మా! నేను నీకు పాతివ్రత్యధర్మం బోధించడానికి తగను. నీ వంటిదియిలా మాట్లాడకూడదు. పాపబుద్ధులుతప్ప భర్తను విడిచే వా రెవరమ్మా నువ్వూ, నేనూ లేకపోతే ఆయనకు సేవలు చేసే వా రెవరమ్మా. క్షణాలలో పదునాలుగేండ్లు నడిపిస్తాను.

ఇంకా, భరతుడు కూడా ధర్మపరుడే. వాడు నిన్ను సేవించగలడు. ఇక్కడ దైవ, బ్రాహ్మణ, అగ్నిపూజలు నాకు బదులు నువ్వు జరపాలి. ఈ బాధ్యతలు విడచి అడవికి వస్తావా, అని తల్లిని ఓదార్చి ఆమె ఆశీర్వాదాలు అందుకున్నాడు. కౌసల్య తన కొడుకును రక్షించవలసిందిగా దేవకోటికి అర్చనలు జరిపించి కన్నీరు తుడుచుకుని:

నాయనా! దేవతలూ, ధర్మము, విశ్వామిత్రమహర్షి అనుగ్రహించిన దివ్యాస్త్రాలూ నిన్ను రక్షించుగాక! సర్వభూతాలూ, వన్యమృగాలూ నిన్ను రక్షించుగాక! సమస్త గ్రహ నక్షత్రాలూ నీ శ్రేయస్సును కోరుగాక, అంటూ మంత్రపూరితమైన రక్షాబంధం యిచ్చింది. రామభద్రుడు తల్లి పాదాలమీద వాలాడు. ఆవిడ కొడుకును లేవనెత్తి, గాఢంగా కౌగ లించుకుని, శిరసు ముద్దాడి పంపింది. ఆయన సీతాదేవి భవనానికి నడుస్తున్నాడు.

## వై దే హి

రాజభవనంలో జరిగే విషయాలేమి యిక్కడ సీతకు తెలిసినట్లులేదు. రాజ్యాభిషేక యోగ్యమైన లాంఛనాలతో రానున్న భర్తకు స్వాగతమర్యాదలు జరపడానికి సన్నద్ధురాలై వుంది; కాని వస్తూన్న భర్తముఖం మ్లానంగా అవనతమై ఉండడంచూసి, ఆశ్చర్యభయచకిత అయింది. వణికే అడుగులతో ఎదురు వెళ్ళింది.

ప్రాణంకంటె ప్రియమైన సీతను చూచేవరకూ గంభీరంగానే వుండగలిగాడు రామ చంద్రుడు, కాని ఆ క్షణంలో అంతటి రాముడూ తలదించుకుని, కంట తడిపెట్టాడు.

అప్పుడు సీత: ఆర్యపుత్రా! అభిషేకముహూర్తం అతిక్రమిస్తున్నది. మీరేమో విచారవదనులై కనిపిస్తున్నారు. ఫేననిభమూ, స్వర్ణశలాకాంచితమూ అయిన శ్వేతఛత్రం. జ్యోత్స్నాసదృశమైన వింజామరలూ, మంగళవాద్యాలూ, వైతాళిక గానాలూ, అభిషేకవేళ వేదమంత్రపూతంగా శిరసుపైవుంచే దధి, క్షీరాలూ కనిపించడంలేదు. ప్రకృతిజనం లేరు. పౌర, జానపదు లెవ్వరూ పరివేష్టించిరాలేదు. నీలాంబుద సన్నిభమైన భద్రగజం ముందు నడుస్తూంటే, అశ్వచతుష్టయంతో అలంకృతమైన బంగారురథం మీద కదా పట్టాభిషిక్తులు రావాలి. అదీ గోచరించదు. మీ ముందు ప్రతీహారి తన దోయిలిలో మీ బంగారు ప్రతిమతో సాగిరాలేదు. రాజ్యాభిషేకానికి సర్వప్రయత్నాలూ చేశారుకదా! అవన్నీ ఏమయాయి? మీ ముఖంలో ఈ శోకం ఏమిటి? అని ప్రశ్నించింది.

రామచంద్రుడు గుండె బిగబట్టి: జానకీ! నాన్నగారు నన్ను అడవికి వెళ్ళమన్నారు. ఎప్పుడో మా పినతల్లి కైకేయి కిచ్చిన వరాలు ఆవిడ యిప్పుడు కోరుకున్నది. ఆవిడ కోరిక ననుసరించి ఈ కోసలరాజ్యాన్ని భరతుడు పాలిస్తాడు. నేను పదునాలుగేండ్లు దండకారణ్యంలో గడిపివస్తాను. ఆమాట నీకు చెప్పి వెడదామని వచ్చాను.

ఈ రోజునుంచీ నువ్వు జాగ్రత్తగా మసలుకోవాలి. సంపన్నులైనవారు ఇతరుల ప్రశంసలు వినలేరు. కనుక రాజ్యసంపన్నుడైన భరతుని సమక్షంలో నన్ను గురించిన ప్రసంగాలు రానివ్వకు. రాజుకి ఎప్పుడూ అనుకూలంగా ఉండడం ప్రజలధర్మం.

ఇంకా నువ్వు అనుదినం ఉదయం లేవగానే దేవపూజలు జరపగానే వెళ్ళి మా నాన్నగారినీ, మా అమ్మను చూస్తూ వుండాలి. మా అమ్మతో సమానులైన నా పినతల్లులను కూడా సేవించాలి. భరత, శత్రుఘ్నులిద్దరినీ కన్నబిడ్డలకంటే ఎక్కువ వాత్సల్యంతో చూసుకోవాలి.

రాజసేవలో ప్రమత్తత సహించరానిది; అటువంటి పొరపాటు జరిగితే కన్నకొడుకునైనా వారు శిక్షించక విడిచిపెట్టరు; అని చెపుతూంటే వినలేక సీత:

ఆర్యపుత్రా! అస్త్రవిద్యావిదుడూ, వీరుడూ అయిన రామచంద్రుడేనా ఈ మాట్లాడుతున్నది. ఇక్ష్వాకువంశం రాజనందనుడేనా ఇలా పలుకుతున్నది. నన్ను విడిచి ఒంటరిగా అడవికి వెడతానని కదూ అంటున్నారు. ఎంతమాట అది.

తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ, కొడుకులూ కోడళ్ళూ వీరంతా తమతమ పుణ్యకర్మలను అనుసరించి తత్ఫలాలు అనుభవిస్తారు. కాని భర్తృభాగ్యానికి సమ భాగ

స్వామ్యం భార్యకే వున్నది. ఇక్కడ అయోధ్యలో నీతో ఏ భోగభాగ్యాలు అనుభవించానో ఇకముందు అడవిలో నీతోనే ఆ సుఖదుఃఖాలు పంచుకుంటాను.

ఆడదానికి భర్తకంటె ఆప్తులులేరు, మిత్రులులేరు. అందుచేత అడవిలో నేను ముందు నడుస్తూ దారిలో ముళ్ళూ రాళ్ళూ తొలగిస్తాను.

మహర్షితుల్యులైన మా జననీ జనకులు నాకు చిన్ననాటినుండి ధర్మవిషయాలు చెపుతూనే వున్నారు. అందులో పత్నీధర్మాలు బాగా తెలుసుకున్నాను. ఆ విషయంలో నేను కొత్తగా నేర్చుకోవలసింది లేదు. అడవిలో క్రూరమృగాలుంటాయని భయపడేదాన్ని కాదు. రాజభవనంలో ఎలావున్నానో ఘోరారణ్యంలోనూ అలానే ఉండగలను. అక్కడ కందమూలఫలాలు తింటూ, బ్రహ్మచర్యనియమంతో గడుపుతాను. ఇది నా నిశ్చయం. దీనికి తిరుగులేదు.

ఆ అడవులలో వివిధజాతుల మృగ, పక్షి, వృక్షజాలాలు, కొండలు, సరోవరాలు, నదులు.... ఆ ప్రకృతిని చూస్తూ నీ సన్నిధానంలో పధ్నాలుగేళ్ళేకాదు, వేలసంవత్సరాలు గడపగలను. నువ్వు దగ్గరలేకపోతే స్వర్గమైనా నాకు అవసరం లేదు. ఇన్ని చెప్పినా వినక నన్నువిడిచి వెళ్ళడానికే సంకల్పిస్తే మరణమే నాకు శరణ్యం, అని ఆగిన భార్యను చూచి :

ఉత్తమవంశంలో, ధర్మతత్పరుల యింటినుండి వచ్చిన నీకు మరొకరు ధర్మోపదేశం చెయ్యనవసరం లేదు. అయితే ధర్మాచరణకోసం అడవికి రానవసరం లేదు. అయోధ్య లోనే ధర్మపాలనం చేయవచ్చు.

అడవులు బహుదోషభరితాలు. కొండగుహలలో, సెలయేటితీరాలలో, సింహ వ్యాఘ్ర, భల్లూకాది క్రూరజంతువు లుంటాయి. రాత్రింబవళ్ళు వాటి గర్జాఘీంకారాలే చెవులలో పడతాయి. సరోవరాలలో ఘోరదంష్ట్రల మకరాలుంటాయి. ఇక, రాళ్ళ బండలమధ్య, ఆకుల శయ్యమీద శయనించాలి. జటా వల్కలాలతో, కందమూల ఫలాలతో గడపాలి. దారులవెంట, చెట్లకొమ్మలమీద విషసర్పాలు, వృశ్చికాలు, మశకాలు....

అటువంటి భీకరారణ్యాలలో లోభ క్రోధాలు విడిచి, తపోదీక్ష వహించాలి. ఇవన్నీ నీవంటి సుకుమారికి తగినవికావు. అందుచేత నువ్వు నీ మనసు మార్చుకో, అని రాముడు మౌనం వహించాడు. సీత కన్నుల నీరు తిరిగింది, ఆవేదనతో :

రఘువంశవీరుడా ! అడవిలో ఎన్ని క్లేశాలున్నా నీతో నిశ్చింతగా అనుభవించగలను. ఇక క్రూరమృగాలంటావా ? ఈ మహావీరుడు కనిపించనంతవరకే వాటి విహారం. నిన్ను

చూచిన ఉత్తరక్షణంలో అవి కనుమరుగవుతాయి. మీ రక్షణలో వున్న నా వంక సురేశ్వరుడు కన్నెత్తి చూడలేడు.

నా చిన్నప్పుడు సాముద్రికులు చెప్పారు, నాకు వనవాసయోగం వున్నదని. అది మొదలుగా ఆ సుముహూర్తంకోసం ఎదురుచూస్తూవేవున్నాను. చాలసార్లు మీతో ఈ మాట చెప్పాను. అగ్నిసాక్షిగా ఉదకధారతో నన్ను మీకు దానంచేసిననాడే నా సర్వస్వమూ మీరే అని మా జనకులు చెప్పారు. అందుచేత మీరు నన్ను విడిచి పెడితే విషం తాగుతాను, అగ్నిలో పడతాను, అంటూండే రామచంద్రుడు అనునయించడానికి మరింత దగ్గరగా వెళ్ళబోయాడు, ఆవిడ ఆయనను చేతులతో త్రోసి :

ఓ రఘువంశీయుడా ! మా తండ్రి నిన్ను మహావీరుడవని పొరబడి నన్నిచ్చి పెళ్ళి చేశాడు. పురుషాకృతిలోవున్న అబలవని తెలునుకోలేకపోయాడు. లోకంకూడా నిన్ను చూచి దివాకర నమతేజస్సంపన్నుడ వనుకుంటున్నది. పతిసేవాపరాయణురాలనైన నన్ను అడవికి తీసికెళ్ళడానికి భయపడుతున్న మిమ్మల్ని ఏమనాలి ?

ద్యుమత్సేన రాజనందనుడైన సత్యవంతుని అనుసరించిన సావిత్రివలె నేను నీ వెంట రాదలుచుకున్నాను.

యౌవనంలో వున్న పతివ్రత అయిన భార్యను పరుల పంచన విడిచే నటకుడిలా వుంది మీ వ్యవహారం. మననులోకూడా నే నెన్నడూ మరొకరిని గురించి ఆలోచించనని మరువవద్దు. అందుచేత అడవికైనా, తపోదీక్షకైనా, స్వర్గానికికానీ, నరకానికి కానీ నేను నీ వెంట ఉండితీరుతాను. కాదంటే ప్రాణాలు విడుస్తాను, అని రాముని పాదాలమీద వ్రాలింది.

రామచంద్రుని గుండె కదిలింది. కన్నులు తడిశాయి. రెండుచేతులతో లేవనెత్తి ఆమె కన్నులు తుడిచి :

దేవీ ! నీకు బాధకలుగుతుందంటే నేను స్వర్గంకూడా విడిచి పెడతాను. నిన్ను రక్షించుకోలేననే భయం ఎన్నడూ లేదు. నాతోపాటు వనవాసానికి పుట్టిన నిన్ను విడిచి వెళ్ళడం నా అభిమతం కాదు. నీ మనస్సు తెలియాలికదా నాకు.

మహాపురుషులందరూ దాంపత్య ధర్మాన్ని ఎలా ర్వర్తించారో నేనూ అలానే నడుపుతాను.

ఇప్పుడీ వనవాసం నాకు నేనుగా నియమించుకున్నది కాదు. పితృవాక్పాలనం కోసం వెడుతున్నాను. గురువు మాట శిష్యుడికెంత ఆచరణీయమో తల్లిదండ్రుల ఆజ్ఞ సంతానానికీ అంతే! ప్రత్యక్షదేవతామూర్తులయిన మాతాపితరులను కాదని పరదైవాన్ని అర్చించడం నామతం కాదు. ఇక నువ్వు వనవాసానికి అవసరమయిన సన్నాహాలు ఆరంభించు. నీ అమూల్యాభరణాలూ, వస్త్రాలూ, ధన ధాన్యాలూ యోగ్యులయిన విప్ర వరులకు, యాచకులకూ, దానం చెయ్యి అన్నాడు.

వారి మాటలు వింటున్న లక్ష్మణుడు రామభద్రుని పాదాలమీద వ్రాలి: అన్నా! వనవాసమే నిశ్చయమయితే నేనూ మీ వెంట ఉంటాను. ధనుర్బాణధారినై, నిరంతరం మిమ్మ రక్షిస్తూ వుంటాను. మీరులేని స్వర్గంకూడా నాకు అవసరంలేదు అన్నాడు.

రామచంద్రుడు నవ్వుతూ: తమ్ముడూ! నువ్వు నాకంటే ముందే బయలుదేరే వూహలో వున్నావు. నీకంటే ఆప్తమిత్రుడు నా కెవడున్నాడు. అయితే నువ్వుకూడా వస్తే యిక్కడ మాతృదేవి కౌసల్యనూ, సుమిత్రనూ సేవించే వారెవరు? కామవశహృద యుడయిన మహారాజు వీరిని గురించి ఆలోచించరు. ఈర్ష్యా మాత్సర్యాలతోవున్న కైకేయి వీరిని సక్రమంగా చూడదు.

తల్లిమాటను జవదాటలేక భరతుడుకూడా వీరిపట్ల ఉదాసీనుడవుతాడేమోతెలీదు. ఏమయినా నువ్విక్కడ వీరి రక్షణలో ఉండక తప్పదు, అన్నాడు. అప్పుడు లక్ష్మణుడు:

రామభద్రా! భరతుడు నీ భయంతో అయినా వీరిని ఉచితంగా సేవిస్తాడు. కాక అటూ ఇటూ జరిపినాడో, యిదిగో యీ కరవాలానికి పని తగులుతుంది.

అమ్మ కౌసల్యాదేవి పోషణ అంటావా! ఆవిడను ఒకరు పోషించనవసరం లేదు. వెయ్యిగ్రామాలకు ఆవిడ అధికారిణి; ఆవిడే వేలమందిని పోషించగలదు. మా అమ్మ కూడా ఆవిడపోషణలోనే ఉంటుంది. అందుచేత నేను నీతో అడవికి రావడం తప్పదు.

మీకు కందమూల ఫలాలు తెచ్చి యిచ్చి, అగ్నికార్యానికి అవశ్యమయిన సమిధలు సమకూరుస్తూ మీరుభయులూ, నదీతీరాలలో, గిరికందరాలలో విహరించే వేళల జాగరూ కుడనై రక్షణభారం వహిస్తా, అన్నాడు.

ఇదే నీ నిశ్చయమయితే వరుణదత్తాలయిన ధనుస్సు, తూణీరం, అభేద్యకవచం తీసుకువచ్చి సిద్ధంగా ఉండు, అన్నాడు రామచంద్రుడు.

లక్ష్మణుడు గురువుగారి యింటనున్న ఆయుధాలతోపాటు, గురుపుత్రుడయిన సుయజ్ఞునికూడా తోడ్కొని వచ్చాడు.

వచ్చిన ప్రియమిత్రునికి రాముడు తన వస్త్రాభరణాలు దానం చెయ్యగా, ఆయన భార్యకు తన నగలూ, చీనాంబరాలూ యిచ్చింది సీత. రామలక్ష్మణులు తమదన ధాన్యాలన్నీ కౌసల్యాదేవి పురోహితుడయిన తైత్తిరీయునకు ధారవోశారు. కోశాగారంలో వున్న తమ సంపదలన్నీ పరివారానికి ధారవోసి తాము తిరిగివచ్చేవరకూ గృహరక్షణభారం అప్రమత్తంగా సాగించమన్నారు, రామలక్ష్మణులు.

అన్నీ అయ్యాక త్రిజటుడనే విప్రవరుడు చినిగిన బట్టలతో వచ్చి రామునిముందు దోసిలివొగ్గి నిలిచాడు. దానమివ్వడానికి సంపద లేక రాముడు: ఓ విప్రోత్తమా! మీ చంకనున్న కర్ర ఎంతదూరం విసరగలిగితే ఆ మేరలోవున్న గోవులన్నీ మీకు ధారవోస్తా నన్నాడు.

అది ఆవులమందను దాటి వృషభసమూహం వరకూ వెళ్ళి పడింది. ఆ గోవులను త్రిజటుని ఆశ్రమానికి తోలించాడు.

అలా అన్నీ ధారపోసి ఆయుధపాణులయి రామ లక్ష్మణులూ, ఆ వెనుక సీతాదేవి పాదచారులై వస్తూవుంటే రాజమార్గంలో ప్రజలందరూ కనులనీరు నింపుకున్నారు, ఘంటాపథాని కిరువంకలావున్న సౌధాలన్నీ కన్నీటిని వర్షిస్తున్నాయి

చతురంగబలాలతో అనుసరించవలసిన లక్ష్మణుడు పాదచారియై వెంట వస్తున్నాడు; ఎండకన్నెరుగని సీతమ్మ రాజవీధిలో కాలినడకన వస్తున్నది.

కోసల పౌరులందరి గుండెలూ శోకసాగరాలయాయి. అందరూ ముక్తకంఠంతో మహారాజును నిందిస్తున్నారు:

కొడుకు దుష్టబుద్ధి అయినా తల్లిదండ్రులు వదులుకోలేరే, అటువంటిది సద్గుణసంపన్నుడు, సచ్చరిత్రుడు, సర్వ ప్రజావశవర్తి అయిన కుమారుని ఎలావిడువగలిగాడు మహారాజు! ఏ భూతమో ఆయనను ఆవేశించి వుంటుంది. అనుకుంటూ ప్రజలు అందరూ మండుటెండలో నీరింకిపోయి విలవిలలాడే జలప్రాణికోటిలా విలపిస్తున్నారు. ఫల పుష్పాలతో చిగురుటాకులుకూడా రాలిపోయిన చెట్లవలె వున్నారు.

మన సమాజ వృక్షానికి తల్లి వేరువంటి ధర్మమూర్తి రామచంద్రుడు లేని నగరంలో మనం ఉండలేం, మనం కూడా లక్ష్మణుని అనుసరించి పోదాం. జనశూన్యమయిన ఈ

శ్మశానాన్ని కైక ఏలుకుంటుంది. జననమ్మర్దమయితే అరణ్యమే మహానగరం అవుతుంది, అనుకుంటూ ఆవేదన నిండిన గుండెలతో వున్నారు వారందరూ.

ప్రజలందరి మాటలూ చెవినిబడ్డా పడనట్లే రామభద్రుడు సాగి సాగి కైకేయి మహారాజ్ఞి మందిరద్వారం సమీపించి, మహారాజుకి తమరాక నివేదించమని సుమంత్రునితో చెప్పాడు.

రాహుగ్రస్తుడయిన సూర్యునివలె, నీటి చుక్క లేకుండా ఎండిన సరోవరంలావున్న మహారాజును చూసి సుమంత్రుడు:

ప్రభువులకు జయము. రామభద్రుడు సీతా లక్ష్మణ సహితుడై తన సర్వసంపదలూ ధారవోసి, వనవాస సన్నద్ధుడయి మీ దర్శనంకోసం ద్వారంలో నిలబడ్డాడు, అని దోయిలించి నివేదించాడు.

వినిన దశరథుడు: సుమంత్రా! రాణివాసం అందరికీ కబురుచెయ్యి. వారందరితో కలిసి చూస్తాను రాముణ్ణి, అన్నాడు.

మూడువందల యాభైమంది రాణులూ కౌసల్యను ముందుంచుకుని కన్నీరు ఒత్తుకుంటూ వచ్చి మహారాజు సన్నిధానంలో నిలిచారు. సుమంత్రుడు వారి రాకను నివేదించగా, రాముని ప్రవేశపెట్టమన్నాడు దశరథుడు.

సుమంత్రుడు ద్వారందగ్గరకు వచ్చాడు. సీతా రామలక్ష్మణులు మంత్రిని అనుసరించి మహారాజు దగ్గరకు వస్తున్నారు. అల్లంతదూరాన, రాముని చూచి, దశరథుడు అకస్మాత్తుగా లేచి ఎదురువెళ్ళడానికి యత్నిస్తూ దారిలోనే మూర్ఛపోయాడు. రామలక్ష్మణులు ఆయనను లేవనెత్తి తెచ్చి శయ్యమీద పరుండబెట్టారు. అంతఃపుర స్త్రీల ఆక్రందనధ్వనులు మందిరమంతా వ్యాపించాయి.

పుత్రగాత్రస్పర్శతో చైతన్యంపొందిన మహారాజుకు నమస్కరించి రామచంద్రుడు:

ప్రభూ: మీ ఆజ్ఞానుసారం దండకారణ్యానికి వెడుతున్నాను. ఎంతవారించినా వినకుండా, సీత, లక్ష్మణుడు కూడా నా వెంట బయలుదేరారు. వారికి కూడా అనుమతి యివ్వండి. ప్రజాపతితో సమానులైన మీరు శోకాన్ని దరిజేరనివ్వకూడదు. మాకు సెలవిప్పించండి, అన్నాడు.

దశరథుడు బాష్పపూర్ణ నయనాలతో, రుద్ధ కంఠంతో: రాఘవా! ఈ దశరథుడు కైకేయీ వశవర్తుడయివున్నాడు. వీణ్ని నిగ్రహించి నువ్వు రాజ్యం స్వాధీనంచేసుకో, అన్నాడు

ఈ రాజ్యాన్ని చిరకాలం మీరే పాలించాలి. నాకసలు రాజ్యకాంక్ష లేదు. పదునాలుగేండ్లు పద్నాలుగు క్షణాలుగా గడుపుతాను, అంటున్న రాముని దగ్గరగా తీసుకుని:

నాయనా! సత్య ధర్మబద్ధమైన నీ మనస్సును నేను మార్చలేను. నీకు వనవాసం సుఖప్రదంగా సాగుగాక. అయితే ఈ ఒక్కరోజు యిక్కడ నాతో గడిపివెళ్ళు. అలనాడు కైకకిచ్చిన వరాలు నన్నింతగా యిప్పుడు వంచిస్తాయని ఊహించలేదయ్యా. అని బ్రతిమాలు తూన్న తండ్రి మనసు గ్రహించిన రామచంద్రుడు:

పితృపూజ్యా! నేటికీ, రేపటికీ ఎంతతేడా! ఈ మోహపాశం ఎంత తొందరగా తెంచుకోగలిగితే అంత శ్రేయస్కరం. అరణ్యంమీద లగ్నమైన నా మనస్సును వెనుకకు మరల్చను. కైకమ్మ మోసం చేసిందనుకోవడం కూడా న్యాయంకాదు. రాజ్యం భరతుని అధీనం చెయ్యండి. అప్పుడే మీ సత్యవాక్పాలనం నిలబడుతుంది. మీ ఆజ్ఞాపాలనమే నా విధి. అది రాజ్యమైనా, అరణ్యమైనా తేడాలేదు; సుకృతాన్నీ, సత్యాన్నీ ప్రమాణంగాఉంచి చెపుతున్నాను. నాకు వనవాసమే సంతోషప్రదమైనది. మా పినతల్లి కూడా నన్ను అరణ్యానికి వెళ్ళమంటున్నది. అత్యంతప్రశాంతప్రదేశం, బహువిధవర్ణ శోభితాలైన పశు, పక్షి సంతతులతో అడవులు ఎంతో సుఖాన్నిస్తాయి. ఇన్నిటికి మించి సర్వదేవతలకంటె అధికుడైన తండ్రిమాటను మన్నించడంకంటె పుత్రుడికి కర్తవ్యం లేదు, అంటూంటే దశరథుడు నిరుత్తరుడై కొడుకును గాఢంగా కౌగిలించుకొని, విషాదసాగరంలో మునిగాడు. అంతఃపురస్త్రీల రోదనధ్వానాలు పెల్లుబికాయి.

ఆ సన్నివేశం సుమంత్రుని గుండెను సమూలం కదిలించింది. దీర్ఘంగా నిట్టూర్చి, తలవిసిరి, చేతులురెండూ ఒకదానిలో ఒకటి బిగించి, దంతాలు పటపటలాడించి ఎర్రవారిన కనులతో:

ఓ కైకమ్మతల్లీ! నీ వరాలతో జగత్ప్రభువైన భర్తనే పరిత్యజించిన నువ్వు చెయ్యలేని అకార్యం ఏముందమ్మా. ఈ కోరికతో వంశనాశనానికే సాహసించిన విన్నేమనాలి. సర్వసాధారణంగా స్త్రీకి సంతానంకంటె భర్తమీద అనురాగం అధికంగా ఉంటుంది. కాని నువ్వు దానికి విపరీతంగా భర్తను కొడుకుకోసం త్యాగం చేస్తున్నావు.

నువ్వు కోరినట్లు నీ కొడుక్కే రాజ్యం పట్టంగట్టుకో. మేమందరమూ మా రామ భద్రునివెంట అడవులకే పోతాం. ఈ దేశంలో వేదవిదుడైన విప్రుడొక్కడూ వుండడు. విప్రశూన్యమూ, బంధుహీనమూ అయిన దేశాన్ని ఏలుకో, అని క్షణం ఆగి:

అమ్మా! ఎవరెన్ని నిందించినా చలించని నీ గుండెకు చేతులు జోడిస్తున్నాను. ఈ భూమి బద్దలై నిన్నెందుకు కబళించడంలేదో తెలీడంలేదు. తల్లీ! మధురఫలాలిచ్చే రసాల వృక్షాన్ని పడద్రోసి నువ్వు వేపచెట్టుకు ప్రోది చేస్తున్నావు.

ఈ బుద్ధి నీ తలనే పుట్టలేదు; నీ వంశంలోనే వున్నది. మీ అమ్మకూడా యిలానే తనభర్తను హింసించిందని విన్నాము. ఆ తల్లి బిడ్డవు నువ్వు!

కైకమ్మా! వేపచెట్టు తియ్యనిపండ్లు యివ్వగలదా! నీ పట్టుదల నీదేతప్పు ఆపట్టు నీ భర్తను బలిగొంటుందని తెలిసినా విడిచిపెట్టవు. మీ అమ్మకూడా మీనాన్నమరణాన్ని లక్ష్యపెట్టని పట్టునేపట్టింది. అందుకే ఆయన ఆవిడను పరిత్యజించాడు. లోకంలో కొడుకులు తండ్రిగుణాలనూ, కూతుళ్ళు తల్లి లక్షణాలనూ పుణికి పుచ్చుకుంటారు.

ప్రజారంజకుడు, గుణసంపన్నుడు, సర్వప్రాణి రక్షకుడు, అన్నిటినీ మించి వంశ జ్యేష్ఠుడూ అయిన రామభద్రుని అడవులపాలుచేయడం ఉచితంకాదు. త్రికాలాలవ్రజలూ నిన్ను ఆడిపోసుకుంటారు. ఆ అపఖ్యాతిని నెత్తికెత్తుకోక నీ వరాలను వదులుకొని మా అందరిమన్ననలూ అందుకో, అని చిరకాలం మంత్రిగాఉన్న అనుభవంతో నయానా, భయానా ఆమె మనసు మార్చడానికి యత్నించాడు.

చలించలేదు కైక మనసు.
ఆమె కనులలో తీక్ష్ణత నడలలేదు.
పెదవుల బిగి రవంత చెడలేదు.
తదేకదృష్టితో అచంచలంగా నిలబడి వుంది.

చూసిన దశరథుడు: ఓ నూతవృద్ధుడా! ఈ రాజ్య కోశాగారాన్ని చతురంగ బలాలతో రాముని వెంట అడవికి పంపించు. సేనారక్షణలోనే రూపాజీవులైన వేశ్యాజనం, వ్యాపారకుశలు లయిన వర్తకశ్రేష్ఠులూ, అరణ్యరహస్యాలెరిగి జంతువులను వేటాడడంలో నిపుణులైన బోయలూ రావాలి. నా రాముడు అడవిలోనే యజ్ఞ, యాగాది క్రతువులు నిర్వహించి మహర్షులకు తృప్తికలిగిస్తాడు. భరతుడిక్కడ రాజ్యం ఏలుకుంటూంటే రాము డక్కడ హాయిగా వుంటాడు—అన్నాడు.

ఆ మాటలు విన్నకైక: ఏమిటి మీ ఆలోచన. కోశాగారం అంతా తరలిస్తే శూన్యమైన సురాభాండంలా తయారవుతుంది రాజ్యం. అదెవరికికావాలి. కోశాగారంమీద చెయ్యి వెయ్యడానికి వీలులేదు, అంది ఆగ్రహనయనాలతో

వింటూన్న దశరథుడు : ఓసీ పాపబుద్ధీ! ఇప్పటికే నాగుండె క్రోధభరమైవుంది. దీన్నింకా రెచ్చగొట్టకు. నువ్వు తలపెట్టిన ఈ దుష్కర్మ యింతవరకూ ఎవరూచెయ్యలేదు, ఇకముందు చెయ్యరు. అంటూంటే కైక :

మీరు మరచినట్టున్నారు. మీ ప్రపితామహుడు సగరుడు తన జ్యేష్ఠపుత్రుడైన అసమంజసుని రాజ్యంనుంచి బహిష్కరించాడు, అలానే మీ పెద్దకొడుకునూ పంపాలి- అంది.

దశరథుని ఆగ్రహం హద్దులుమీరింది. ఛీ! ఛీ! అని గొణుక్కున్నాడు. అక్క డున్న జనసమూహం కూడా ఆమె మాటలను అసహ్యించుకున్నారు.

మంత్రులలో వృద్ధుడైన సిద్ధార్థుడు ముందుకువచ్చి: అసమంజసుడితో రాముడికి పోలిక తెస్తున్నావా! వాడు పసిపిల్లలను ఎత్తుకుపోయి సరయూనదిలో ముంచి వారు ఉక్కిరి బిక్కిరై మునిగిపోతూంటే సంతోషంగా చూస్తూ నిలబడే మూర్ఖుడు. వాడికది క్రీడగా మారితే సహించలేని ప్రజలు రాజునుచేరి వాణ్ణి బహిష్కృతుని చేయించారు. పరమపాపబుద్ధికల అసమంజసుడితో పోల్చడానికి నీకు నోరెలా వచ్చింది. ప్రజా శ్రేయస్సుకోసం ఎటువంటి క్లేశమైనా అనుభవించగల మా రామచంద్రుని అడవికి పంపడం ఏం న్యాయం? సత్పురుషు లకు హాని తలపెడితే దేవేంద్రుడైనా శిక్షార్హుడేనని శాస్త్రఘోష! అని ఎంతగా చెప్పినా చలించలేదు కేకయ రాజనందన.

దశరథుని గుండె దుఃఖంతో నిండింది :

ఓసీ! నీకు ఆత్మహితం పరహితం కూడా తెలియడంలేదు. ఇప్పుడింక నేనుకూడా రాజ్యం విడిచి అడవికి పోవడమే శరణ్యం. నువ్వూ, నీకొడుకూ ఈ రాజ్యం ఏలుకోండి- అన్నాడు.

సిద్ధార్థుని మాటలు వింటూ రామచంద్రుడు :

మహారాజా! సర్వసంగపరిత్యాగినైన నాకు ధనధాన్యాలూ చతురంగబలాలూదేనికి? మత్తేభాన్ని వదులుకున్నవాడు దాన్ని బంధించే కట్టుగొయ్యకోసం తాపత్రయపడతాడా! నా కిప్పుడు కావలసినవి వల్కలాలు తెప్పించండి-అన్నాడు. అనగానే కైక స్వయంగావెళ్ళి నారచీరలు తెచ్చి రాముని కిచ్చింది.

రాముడు లక్ష్మణునికీ, సీతకూ వాటిని అందించి తను ఒకటి కట్టుకున్నాడు. లక్ష్మ ణుడు కూడా చీనాంబరాలు విడిచాడు. సీత ఆ నారచీరలు ఎలా కట్టుకోవాలో తెలియక

భర్తదగ్గరకు సిగ్గుతోవెళ్ళి నిలబడింది. అది గ్రహించిన రామభద్రుడు ఆమె కట్టుకున్న కౌశేయవసనంమీదనే నారచీర చుట్టబెట్టాడు.

ఆ సన్నివేశం అంతఃపురస్త్రీలందరి గుండెలూ పిండింది. వారంతా ముక్తకంఠంతో: సీత అడవికి వెళ్ళ నవసరంలేదు: మేమందరం ఆమె యోగక్షేమాలు చూసుకుంటాం- అన్నారు.

అంతవరకూ మౌనం వహించిన కులగురువు వశిష్ఠులు - ఓ కులమాతకీ! మహారాజును వంచించిన నీకు న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు తెలియడంలేదు. నీకోరిక ప్రకారం రాముడే అడవికి వెళ్ళాలి కాని సీత వెళ్ళనవసరంలేదు: ఆయన వచ్చే వరకూ సింహాసనం మీద సీత కూర్చుంటుంది. అలాకాక ఆమెకూడా అడవికి వెళ్ళడానికే నిశ్చయించుకుంటే మేమందరం ఆమె వెంటనే వెడతాం. భరత, శత్రుఘ్నులుకూడా ఈ నారబట్టలతో అడవులకే వస్తారు. అప్పుడు సర్వశూన్యమైన ఈ రాజ్యాన్ని నువ్వే ఏలుకొనవచ్చు.

రాముడు లేకపోతే భరతుడు సింహాసనం ఎక్కుతా డనుకుంటున్నావేమో! వాడికి వాడి వంశప్రతిష్ఠ తెలియనిదికాదు. అందుచేత వాడూ అడవికే నడిచాక, ఈ అపకీర్తిని నెత్తిమీద పెట్టుకుని పశు పక్షులుకూడా ఉండని ఈ శ్మశానరాజ్యం ఏలుకుందువులే.

అడవులకు వెడుతున్నా సీత తన ఆభరణాలతో చీనాంబరాలతో వెడుతుందే కాని ఈ వల్కలాలతో కాదు. వాహనాలూ పరిచారికాగణం ఆమెవెంట వెళ్ళాలి, అన్నాడు.

చలించలేదు కైకమనను.

దశరథుడు వేడినిట్టూర్పులు విడుస్తూ:

మానవుడికి ధర్మం, యశస్సూ ఎందుకూ కొరగానివే అనిపిస్తున్నది. జీవితమంటేనే నాకు అసహ్యం కలుగుతున్నది- అని క్షణం ఆగి.

జానకి నారచీరలు కట్టనవసరములేదు. పరమ సుకుమారి అయిన యీ జనక రాజనందన అడవికి వెళ్ళవలసిన పనేమిటి? ఎవరికీ ఏ అపకారమూ తలపెట్టని యీ బాల అంతఃపురం వీడి వెళ్ళనవసరంలేదు. కైకా! నీకిచ్చినవరంలో సీతలేదు. ఒకవేళ సీత వెళ్ళదలిస్తే ఆమె రాజపుత్రిక వలె చీని చీనాంబరాలతో సర్వాభరణాలతో వెడుతుంది. ఓసీ పాపిష్ఠిదానా! ఇప్పటికైనా నీ పాతకాలకు స్వస్తి చెప్పవే, అని విలపిస్తున్నాడు.

రామచంద్రుడు ప్రయాణసన్నద్ధుడై దశరథుని సమీపానికి తల్లిని తీసుకొనివెళ్ళి:

నాన్నగారూ! ఈవిడ మా అమ్మ కౌసల్యాదేవి. నిర్మల చరిత్రతో మీ సేవలో వృద్ధురాలయింది! ఇంతవరకూ మీరు ఎలాచూచినా, ఏంచేసినా సహిస్తూనే వుంది. నేను అడవులకు వెళ్ళినప్పుడు ఆవిడకు అవమానబాధలేకుండా చూడండి. కన్న కొడుకు దగ్గరలేని బాధకు అవమానాలు తోడయితే ఆవిడకు జీవితం మరీ క్లేశం అవుతుంది-అన్నాడు.

ఈ మాటలు చెవిని బడడంతో దశరథుని గుండె జారిపోయింది. చైతన్యం సన్నగిల్లింది, కొంతసేపటికి తేరుకుని: "కన్నుగానక ఏనాడు ఏతల్లి దండ్రుల వాత్సల్యానికి వారి సంతానాన్ని దూరంచేసిన పాపఫలమో ఇప్పుడు అనుభవించవలసివచ్చింది. ఈకైక కారణంగా ఇందరు విచారసాగరంలో మునిగారు. ఈ స్థితిలో నేనింకా జీవించి వున్నానంటే నా పాపం పండలేదు. రామా, హా రామా అంటూ మూర్ఛితుడయ్యాడు.

మరి కొంతసేపటికి లేచి : సుమంత్రా ! మంచి గుర్రాలనుకట్టి రథంతీసుకొచ్చి వీరిని జనపదాలు దాటేవరకూ తీసుకువెళ్ళు, అని ఆజ్ఞాపించాడు.

కోశాగారాధిపతిని పిలిచి : ఈ పదునాలుగు సంవత్సరాలకూ అవసరమయిన ఆభరణాలూ, వస్త్రాలూ జానకి రథంలోపెట్టించు, అన్నాడు.

సింహద్వారంలో రథం సిద్ధంగావుంది, సీతాదేవికి అవశ్యమయిన వస్త్రభూషణాలతో.

ఆ సమయంలో కోడలి సమీపానికి వచ్చి, కౌసల్య దగ్గరగా తీసుకొని : అమ్మాయీ ! సిరిసంపదలతో తులతూగుతున్నపుడు భర్తను సుఖపెట్టడం విశేషంకాదు. సంపదలుపోయినా భర్తను సేవించడంలోనే వుంది స్త్రీధర్మం. వంశం, విద్య, గుణం యివికూడా పురుషుని సంపదలే. అయితే శీలహీనలూ, హృదయ రహితలూ అయిన దుష్టస్త్రీలు పురుషుని ధన ధాన్యాలే సంపదలనుకుంటారు. నువ్వు వారి దారినపోక సాధ్వులయిన మహిళామతల్లుల మార్గం అనుసరించు. ధనహీనుడయినా, నిర్వాసితుడయినా భర్తను సేవించడంవల్ల భార్యకు మంచిగతులు సిద్ధిస్తాయి, అంది.

అదివిని జానకి తలవంచి : మీరు నాకు ఇంతగాచెప్పాలా ! భార్యాభర్తలధర్మాలను నాకు చిన్ననాడే మా వారు ఉపదేశించారు. చంద్రునితో వెన్నెలవలె ధర్మంతో నేను కలిసి వుంటాను. తీగలేని వీణ మ్రోగుతుందా, చక్రంలేని రథం వుంటుందా ?

స్త్రీకి తండ్రిగాని వందమంది కొడుకులుగాని, భర్తకంటె ఎక్కువకారు. భర్తృసన్నిధిలో లభించే సుఖశాంతులు ఎవరిదగ్గరా దొరకవని ఎరుగుదును.

మితం దదాతి హి పితా మితం భ్రాతా మితం సుతః ।
అమితస్యతు దాతారం భర్తారం కా న పూజయేత్ ॥

అందుచేత భర్తృసేవా ధర్మాన్నే నేను అనుసరిస్తాను అని చేతులు జోడించింది.

కౌసల్యకు కన్నీరు మున్నీరయింది.

రాముడు తల్లిదగ్గరకు వెళ్ళి: అమ్మా నువ్వు ఈ దుఃఖంలో మునిగివుంటే తండ్రి గారిని సేవించే వారెవరమ్మా, ఏముందమ్మా, నువ్వు నిద్రపోయి లేచినట్లుగా నేను పధ్నాలు గేళ్ళు గడిపి వచ్చేస్తానమ్మా – అన్నాడు.

ఆమాటలతో అంతఃపురం అంతా ఆర్తనాదాలతో నిండింది.

సీతా రామ లక్ష్మణులు దశరథునికీ కౌసల్యకూ సుమిత్రకూ పాదాభివాదం చేశారు. తన పాదాలకు నమస్కరించి లేచిన కొడుకును దగ్గరగా తీసుకొని సుమిత్ర :

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం ।
అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్ ॥

నాయనా! నువ్వు అన్నయ్య సేవకోసమే పుట్టావు. ఆ సేవలో అప్రమత్తుడవయి వుండు. అగ్రజుని అనుసరించడం అనుజులందరికీ అనూచాన ధర్మం. ఇది మొదలుగా నీకు రాముడే తండ్రి, జానకి తల్లి, అడవి అయోధ్య. సుఖంగా వెళ్ళిరా, అని ఆశీర్వదించింది.

ద్వారంలో రథం నిలిపివచ్చిన సుమంత్రుడు సాభిప్రాయంగా రామచంద్రుని చూశాడు.

అందరూ రథం సమీపించారు. సీతకు అవసరమయిన వస్త్రాలూ ఆభరణాలూ రామ లక్ష్మణుల ఆయుధ, కవచాలూ రథం మీద వున్నాయి.

జానకి ముందుగా రథం అధిరోహించింది. అనంతరం రామ లక్ష్మణులు ఎక్కారు. సుమంత్రుడు అశ్వాలకళ్ళాలు సడలించాడు. గుర్రాలు కదలబోతున్నాయి. అక్కడ మూగిన జనసమూహం కన్నులు విషాదాంధకారబంధురా లయాయి. దాహపీడితుడు స్వాదు జలాల కోసం పరుగు పెడుతున్నట్లు జనం రథం వెంటబడి :

సుమంత్రా : ఒక్కసారి పగ్గాలు బిగించు. మా రామచంద్రుని తనివితీరా చూసు కోనియ్యి. అని ఏడుస్తూ, ఉత్తరీయాలతో, పైట చెంగులతో కన్నులు ఒత్తుకుంటూ సాగుతున్నారు.

అప్పటికి స్మృతివచ్చిన దశరథుడు రెండడుగుల్లో వెలుపలకు వచ్చాడు, కొడుకును చూడటానికి.

సంపూర్ణంగా రాహుగ్రస్తమయిన చంద్రబింబంలా వుంది మహారాజు ముఖం.

రథాన్ని త్వరగా నడుపు – అన్నాడు రాముడు. గుర్రాలను కదలనివ్వకు అంటున్నారు జనం. అడకత్తెరలో పడ్డాడు సుమంత్రుడు.

రేగినధూళి జనం కన్నీటితో అణగారుతున్నది. రథం కదిలింది. దశరథుడు మొదలునరికిన చెట్టులా కూలిపోయాడు.

జనం హా హా రవాలు మిన్నుముట్టుతున్నాయి. రథం వెంట శోకసంతప్తహృదయంతో, పాదచారియై వచ్చే కౌసల్యను చూసిన రాముని గుండె చెరువయింది.

ఒకవంక ధర్మం, మరొకవంక మాతృవాత్సల్యం ఊగిసలాడిపోయి రాముడు ధర్మ నిర్వహణ దృష్టితో :

సుమంత్రా రథాన్ని తీవ్రవేగంతోసాగించు, అన్నాడు. సూర్యుడులేనిపగలు, చంద్రుడులేని రాత్రి అయింది అయోధ్య.

శూన్యదృక్కులతో ఉండిపోయా రందరూ, నగరమంతా నిర్మానుష్యమయినట్టు నిశ్శబ్దంగా వుంది. ఎవరూ ఏపనీ చెయ్యరు : అందరూ రాముని గురించి యోచించేవారే. ఇళ్ళలో అగ్నిహోత్రాలు లేవు, గోశాలలో దూడని దరిజేరనివ్వడంలేదు గోమాత. అంతటా చీకటి, కాళరాత్రి, రేఖామాత్రమయినా కాంతిలేదు.

రథధూళి కనిపిస్తున్నంతవరకూ అటే చూసిన దశరథుడు తల దించుకుని నేలకూలుతుండగా కౌసల్య ఆయనదగ్గరగా వచ్చి పడకుండా ఆపింది. అదే సమయానికి కైకవచ్చి సాయం చెయ్యబోయింది. ఆమె చెయ్యి తగలగానే దశరథుని శరీరమంతా మంటలు పుట్టాయి. ఒక్కసారి తిరిగిచూసి, ఆమె చెయ్యి విసిరి :

నీ గాలి తగలనివ్వకు నాకు, నీ ముఖం చూపించకు, ధర్మంవిడిచి పాపబుద్ధితో వున్న నీకూ, నాకూ ఏ సంబంధం లేదు. ఈ రాజ్యంమీద మనసువుంటే భరతుడు నా కొడుకే కాడు. నాకు ఉత్తరక్రియలు జరిపే అధికారమూ లేదు వాడికి, అని ఆవేశపడుతూండగా, కౌసల్య ఆయన చేయి పుచ్చుకొని తన మందిరానికి నడిపించింది.

అక్కడ శయనించిన మహారాజు క్షణ క్షణం పెరిగే దుఃఖాన్ని ఆపుకోలేక మూర్ఛపోయాడు. నా కొడుకుని ఈకైక అడవులలో ఘాతుకమృగాలపాలుచేసింది, అను

కుంటూ కౌసల్య పరిపరివిధాల విలపించింది. తనకొడుకూ, కోడలూ, లక్ష్మణుడూ తిరిగి వచ్చేవరకూ తను బ్రతుకుతాననే ఆశకూడా లేదనుకుంది.

ఆవిడ దుఃఖం చూస్తూ సుమిత్ర: అక్కా! సత్యంకోసం, ధర్మంకోసం మహా త్యాగం చెయ్యనున్న రాముడు పురుషోత్తముడు. రామభద్రుడు ఈనాడు చేసినత్యాగం యింతకుముందు ఎవరూ చెయ్యనిదీ, భావిలో చేస్తారనే ఊహరానిదీనూ. దీనితో నీ బిడ్డ శాశ్వతమయిన యశస్సు సంపాదిస్తాడు. సూర్యచంద్రులుభయులూ నీ బిడ్డకు సేవకులుగా వుంటారు. దివ్యాస్త్రాలను సముపార్జించిన రాముడు నిశ్చింతగా వనవాసం పూర్తిచేసివచ్చి ఈ రాజ్యాన్ని పాలిస్తాడు; లక్ష్మీదేవివంటి నీకోడలు సీతతో అయోధ్యాప్రజలకు ఆనంద ప్రదమయిన పరిపాలన అనుగ్రహిస్తాడు. ఖడ్గధారియైన ధనుర్బాణాలు చేబూని నిలిచి అన్నగారిని సేవించడములో కనురెప్పవాల్చని లక్ష్మణుడుండగా వారికే ఆపదలూరావు. పదునాలుగేండ్లూ యిట్టే గడిచిపోతాయి, నీ కొడుకూ, కోడలూ తిరిగివచ్చి నీ పాదాభివాదం చేస్తుంటే వారిని ఆనందతరంగిత హృదయంతో గాఢంగా ఆలింగనం చేసుకుంటావు.

రాముడికి అశుభమనేది వుండదు. అంతా మంగళప్రదమయిన జీవితమే. పది మందిని ఓదార్చవలసినదానివి నువ్వు, ఈ శోకాన్ని విడిచి స్వస్థచిత్తంతో వుండు.

నార్హా త్వం శోచితుం దేవి
యస్యాస్తే రాఘవః సుతః ।
న హి రామాత్ పరోలోకే
విద్యతే సత్పథే స్థితః ॥

అలా సుమిత్ర ఓదార్చగా, ఓదార్చగా కొంతసేపటికి కౌసల్య గుండె కుదుటపడింది.

## వనగమనం

సీతా లక్ష్మణసహితుడై రాముడు రథంమీద సాగుతుంటే అయోధ్యాపురవాసు లనేకులు దానిని వెంబడించారు. అందరినీ తిరిగి వెళ్ళమని పదేపదే ప్రార్థిస్తున్నా వారు వస్తూనే వున్నారు. మళ్ళీ రావలసిన స్నేహితునీ, బంధువునీ ఎక్కువదూరం సాగనంప డానికి వెళ్ళరాదనే నియమం తెలిసికూడా వారు వస్తూనే వున్నారు.

ఓ మహామహులారా! మీ అందరికీ నామీదగల గౌరవాభిమానాలు యీ నాటి నుంచీ భరతునిమీద చూపండి. వాడు మీ అందరి శ్రేయస్సునూ, ప్రియాన్నీ ఎరిగిన

వాడు. వయసులో చిన్న అయినా జ్ఞానవృద్ధుడు. అడవికి వెళ్ళాక మా తండ్రి గారికి ఎటువంటి క్లేశమూ కలగకుండా మీరు చూసుకోవాలి, అని అంటూంటే, ఆ రాముని సత్య, ధర్మప్రియత్వం వారిని మరింతగా ఆకర్షించింది. వారందరూ ఆ రథాన్నిలాగే గుర్రాలను ప్రార్థించడం మొదలుపెట్టగా రాముడు రథం దిగి వారివెంట నడవడం ఆరంభించాడు. సీతా లక్ష్మణులుకూడా రాముని అనుసరించారు.

అది చూసిన వృద్ధబ్రాహ్మణులు :

రామభద్రా! వేదనంపదను మా మనస్సీమలో దాచుకొని, దారా పుత్రాదులను విడిచి నీతో మేం కూడా వస్తాం. అలా అంగీకరించినా సరే లేదా వెనుదిరిగిరా. అదిగో ఈ కోసలంలోని జంగమ స్థావర ప్రాణికోటి అంతా నీ మీద ప్రేమతో, భక్తితో ఎలా చూస్తున్నదో! నువ్వు అడవికి వెళ్ళడం ఎవరికీ యిష్టంలేదు, అని వారు మాట్లాడుతుండగానే తమసానది సమీపించింది.

సుమంత్రుడు రథం ఆపి గుర్రాలకు నీళ్ళు పడుతున్నాడు, అప్పటికే సూర్యుడు అస్తాద్రికి చేరాడు. నదికి అటూ ఇటూ వున్న అడవులు చీకటితో రోదిస్తున్నాయి.

అందరూ నదిఒడ్డున విడిదిచేశారు. నగరంలో తనతల్లీ తండ్రీ ఏం బాధపడు తుంటారో అని కొంతసేపు చింతించాడు. కాని భరతుడు ధర్మపరుడే కనక వారికి ఏక్లేశమూ రాదని నిశ్చయించుకున్నాడు రాముడు.

సుమంత్రుడు లక్ష్మణసహితుడై సీతారాములకు శయనం ఏర్పాటుచేశాడు.

సీతారాములు పక్కమీద వెన్నువాల్చారు.

వచ్చిన పౌరులందరూ ఆ నదీతటాన తరుచ్ఛాయల్లో విశ్రాంతి తీసుకున్నారు.

సుమంత్ర లక్ష్మణులు మాత్రం రాముని గుణగణాలు కీర్తించుకుంటూ మేల్కొని వున్నారు.

కొంతరాత్రి గడచింది. ప్రజలస్థితిని తలుచుకునే రామచంద్రునికి నిద్రపట్టక మెల్లిగా లక్ష్మణ, సుమంత్రులను చేరి - ఈ ప్రజలు మనలను విడిచేలా లేరు. వీరు నిద్రలో వుండగానే మనం నది దాటాలి, అన్నాడు.

సుమంత్రుడు రథం సిద్ధంచేశాడు. మెల్లగా వారు నది ఎగువకు వెళ్ళి, రథాన్ని దారి మళ్ళించారు. రాత్రికి రాత్రి నది దాటేశారు.

తెల్లవారి, పౌరులులేచి చూడగా సుమంత్రుడూ కనపడలేదు. తమ నిద్రను తామే నిందించుకున్నారు. ఏ ముఖాలతో వెనక్కి వెళ్ళడం అని విచారంలో మునిగారు. చేసేదిలేక, స్వగృహాలు చేరిన వారందరినీ యిళ్ళలోని స్త్రీలు రాముని కొనిరాకుండా వచ్చినందుకు నిందించారు.

ఆరోజు రోజంతా నగరంలో ఎవరిమనస్సూ మనసులో లేదు. అంతటి గుణ సంపన్నుడయిన కొడుకును సాగనంపి దశరథుడింకా జీవించి వున్నందుకు బాధపడ్డారు. ఏ యింటా పొయ్యిలో నిప్పు రాజలేదు, కంటనీరు ఆరలేదు, ఏమనిషికీ అయోధ్యలో.

ఇక్కడ సీత రామలక్ష్మణులు రాత్రంతా చాలాదూరం ప్రయాణంచేసి, కోసలదేశపు పల్లెలకు పక్కపక్క బాటలపై సాగి సాగి, ఉదయం సంధ్యోపాసన పూర్తిచేసి అరణ్యంవైపు వెడుతున్నారు.

ఆ వార్త ఎలా ప్రాకిందో-పరిసరగ్రామల ప్రజలు తండోపతండాలువచ్చి రాముని ప్రశంసిస్తూ దశరథుని నిందిస్తూ వెంటబడ్డారు. వారందరినీ ఆశ్వాసించి సెలవిచ్చి ముందుకు సాగుతూ వేదశ్రుతి అనే నదిని దాటి కొంతదూరం ఉత్తరంగావెళ్ళి గోమతీనదిని దాటి హంసలతో, మయూరాలతో అలరారే స్యందికానదిని తరించి సాగుతున్నారు.

కోసలదేశపు సరిహద్దులు దాటగానే ఆగి రామభద్రుడు: 'ఇదివరలో ఈ అడవులలో వేటకు వచ్చేవాడిని. మళ్ళీ ఎన్నాళ్ళకో ఆ అవకాశం – అని తనవెంటవస్తున్న ఆయా ప్రాంతాల ప్రజలకు కృతజ్ఞతా పురస్సరంగా అభివాదాలు చేసి, దేవతానిలయమూ, కకుత్థ్సవంశపాలితమూ అయిన తన జన్మభూమి అయోధ్యకు చేతులుమోడ్చి ముందడుగు వేశాడు.

ధన ధాన్య సమృద్ధములూ, శత్రుభయ రహితములూ, నయన మనోహరములూ గోగణయుతములూ, రసాలవనభరితములూ, స్వాదుజలసంపన్న సరోవర సంయుతములూ అయిన కోసల గ్రామాలలో ఆరోగ్య భాగ్యవంతులై త్యాగశీల బుద్ధులయిన జనులందరినీ స్మరించి అటువంటి పాలన అనుగ్రహిస్తున్న తన యిక్ష్వాకువంశాన్ని తలుచుకుని సంతోషించాడు రామభద్రుడు.

గంగానది ఒడ్డునే సాగుతున్నది రథం. తీరప్రాంతమంతా కన్నులపండువయిన వృక్షాలతో, లతలతో, మహర్షుల ఆశ్రమాలతో, జలాశయాలతో, దేవ, గంధర్వ, కిన్నరగణ క్రీడాస్థలాలతో అలరారుతున్నది.

చల్లగా వీచేగాలికి కదిలే తరంగాల ధ్వనులు శ్రవణసుభగంగా వినిపిస్తున్నాయి. ఒడ్డునుతాకి నురుగులు జిమ్ముతున్న గంగ హాయిగా నవ్వుతున్నట్లుంది. ఒక్కచోట ప్రవాహం సన్నగాసాగి జడలా కనిపిస్తున్నది. సుళ్లుతిరిగేచోట గంభీరావర్తనాభీ సదృశంగా వుంది.

హంస, సారసనంకులమై చక్రవాక శోభితమై వికసిత పద్మభాసురమై, ఉత్పల రమణీయమై, నానా సుమరజవాసితమై, శృంగార నాయికవలె వున్నది గంగాస్రవంతి.

విష్ణుపాదోద్భవ, మహాపాతకనాశని అయిన ఆ మందాకినీ నది భగీరథ తపఃఫలంగా శివజటాజూటం నుండి భువికి దిగింది. అది ఒక్కోచోట ఎంత మనోహరంగా వున్నదో! అంతకంటె భయంకరంగా వున్నది మొనళ్ళతో, శింశుమారాలతో నిండినచోట. సాగి, సాగి రాముడు తమ్ముడూ! ఈ భాగీరథీ తీరంలో ఈ రాత్రికి విశ్రమిద్దాం— అన్నాడు.

ఆమాట చెవినిపడగానే సుమంత్రుడు రథం నిలిపాడు. అందరూ క్రిందికిదిగారు.

అయోధ్యావతి కుమారుడు రామభద్రుడు గంగాతీరానికి వచ్చిన వార్త ఆప్రాంతానికి ప్రభువయిన గుహునికి చేరగావే, తనవంశవు పెద్దలందరితో కలిసి స్వాగతమర్యాదలు జరపడానికి వచ్చాడు. అల్లంతదూరంలో వారినిచూచిన రాముడు తమ్మునితో ఎదురేగి వారికి స్వాగతం పలికి గుహుని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. గుహుని కన్నులు ఆనందబాష్పాలతో నిండాయి.

తెచ్చిన కానుకలన్నీ అందించి : రామభద్రా! ఈ రాజ్యం నీది. నీకేం కావలసినా క్షణాలలో నెరవేర్చడానికి మా పరిజనం ఎదురుచూస్తున్నారు, అని వినయంగా దోయిలించి నిలబడ్డాడు గుహుడు.

రాముడు సంతోషంతో : బాల్యమిత్రుడా! నిన్నుచూడటం కంటె నాకేం కావాలి? నీకూ నీ ప్రజలకూ కుశలమేకద. ఇప్పుడు నాకేమీ అవసరంలేదు. పేనువధ్నాలుగేళ్లు వనవానం చెయ్యాలి. ఆ వ్రతపాలనలో వున్ననాకు ఈ కానుకలు స్వీకరించే అర్హతలేదు. అయితే ఈ రథాన్ని కొనివచ్చిన గుర్రాలకు కావలసిన మేత వేయించు— అన్నాడు.

సూర్యభగవానుడు అస్తాద్రికి చేరాడు. అందరూ సంధ్యను ఉపాసించారు. సీతారాములకు పర్ణశయ్య ఏర్పాటుచేయించాడు గుహుడు. వారుభయులూ విశ్రమించారు. లక్ష్మణసహితుడయి గుహుడు వారికి రక్షగా అప్రమత్తుడై ఆ రాత్రి కంటిమీద రెప్ప వాలనివ్వలేదు.

కోసల రాజనందనుడు లక్ష్మణుడుకూడా నిద్రాదూరుడు కావడం బాధకల్గించగా గుహుడు :

అయ్యా! నేనూ నా బంధుకోటీ యీ రాత్రి మీకెవరికీ ఏ ఆపదా రాకుండా కాపాడగలం. ఈ ప్రాంతంలో ఎక్కడ ఏ మృగం వున్నదీ, ఏ పక్షివున్నదీ నాకుతెలును. అందుచేత నువ్వు నిశ్చింతగా పడుకో, అన్నాడు.

అదివిని లక్ష్మణస్వామి : నాకు తెలుసునయ్యా, మా అన్నయ్యతో నీకుగల స్నేహ బంధం. కాని అన్నయ్య ఈ గడ్డిమీద వరుండవలసివచ్చింది, ఇక అయోధ్యలో మా నాన్నగారు, మా పెద్దతల్లి కౌసల్య, మా అమ్మ సుమిత్ర ఈపాటికి ఏ దశలోవుంటారో! ప్రాణసముడయిన రాముని విడిచి మహారాజు బ్రతకలేడు. ఒక్కగాను ఒక్కకొడుకును విడిచి కౌసల్యాదేవి జీవించదు. శత్రుఘ్నుడి ఆశ్వాసనతో మా అమ్మ జీవించవచ్చు. మహారాజు మరణంతో కోసలదేశమే శ్రీ హీనమవుతుంది. మా తల్లులు అనాథలవుతారు.

ఈ వనవాసవ్రతం పూర్తిచేసి మేము అయోధ్య చేరగలమా? చేరినా మాతా పితరులను చూడగలమా? అని సౌమిత్రి దుఃఖసాగరంలో మునిగాడు. గుహుని గుండె చెరువయింది.

అంతలో కోకిల కూసింది, నెమలి క్రేంకారం ప్రతిధ్వనించింది. తూర్పుకొండ మీద వెలుగులు విరిశాయి. రామభద్రుడు కనులు విచ్చి, కాలకృత్యాలు నిర్వర్తించి, గంగదాటడానికి ఏర్పాటు చేయమన్నాడు.

చక్కగా అలంకరించిన నావను క్షణాలలో రప్పించాడు గుహుడు. సీతారామ లక్ష్మణులు నావ దగ్గరకు నడిచారు. అప్పుడు సుమంత్రుడు దోసిలిపట్టి నిలిచాడు. రామభద్రుడు వాని వెన్నుతట్టి :

సుమంత్రా! నువ్వు త్వరగా రాజధానికి వెళ్ళి మహారాజు రక్షణభారం వహించు. ఇక మేము కాలినడకనే వనవాసం సాగించాలి, అన్నాడు.

సుమంత్రుని నెత్తిమీద పిడుగు పడినట్టయింది. క్షణం ఆగి : రామభద్రా! నీవంటి సుగుణశాలికి, సత్యవ్రతునికి ఈ అవస్థ పట్టిందంటే విధి ఎంత బలీయమైనదో బోధపడుతున్నదయ్యా! నువ్వు ఎక్కడయినా సంతోషంగానే వుండగలవు. దీనితో నీ కీర్తి ముల్లోకాలలో వ్యాపించగలదు. ఇంతకూ మేమే దురదృష్టవంతులం, అని గోలుగోలున విలపిస్తుంటే, ముందడుగు వెయ్యబోయిన రాముడు వెనుదిరిగివచ్చి, అతని కన్నీరు తుడిచి : మహామతీ! మా ఇక్ష్వాకులకు నీవంటి ఆప్తుడెవడయ్యా! అందునా మహారాజుకు నిన్ను మించిన హితుడులేడు. ఆయన దుఃఖాన్ని ఉపశమింపచేయడానికి నువ్వు దగ్గరవుండాలి ప్రస్తుతం ఆయన జరాభారపీడితుడు, దానికితోడు శోకసహితుడయి వున్నాడు.

కామవశులు కావడం రాజులకు సామాన్యం. ఆ సామాన్య హృదయంతో ఆయన కైకేయికి ప్రీతి కలుగుతుందని ఈ పనిచేశాడు. ఆ హృదయంతో ఆయన ఏమయినా చేయగలడు. కాని అసత్యదోషం ఆయనను బాధించరాదుకదా!

నువ్వు త్వరగావెళ్ళి మేము రాజ్యభ్రష్టుల మయినందుకు చింతించటం లేదనీ, సంతోషంగా వనవాసకాలం పూర్తిచేసి వస్తామనీ చెప్పి, ఆయనకూ, మా తల్లులకూ ప్రణామాలు చెప్పు. కైకేయికి కూడా మా వందనాలు అందించి ఆవిడక్షేమం మేము కోరుతున్నామని చెప్పడం మరచిపోకు.

త్వరలో భరతుని రప్పించి, యువరాజపీఠం ఎక్కించమని నా మాటగాచెప్పు. భరతుడు సింహాసనాసీనుడయితే వారి దుఃఖం ఉపశమిస్తుంది. భరతుడు రాగానే:

తల్లులందరూ నీకు సమానులే అయినా కైకేయిని చూసినట్లే సుమిత్రనూ, అంత కంటె ఆదరంతో మా అమ్మ కౌసల్యనూ చూచుకోవాలని విశదం చేయి. పితృపాదుల ఆజ్ఞలు అక్షరశః పాలించి, మాతృదేవులను గౌరవంగా చూచేవాడికి ఇహపరాలలో క్లేశాలు రావని చెప్పటం మరువకు, అన్నాడు.

సుమంత్రుడు కలకదేరిన మనస్సుతో: రామభద్రా!

పుత్రశోకంతోవున్న తల్లిలా ఉంటుంది నువ్వులేని అయోధ్య. ఆ నగరాన్ని నేను చూడలేను. ఈ రథాన్ని మొన్న రామభద్రునితో తెచ్చాను, ఇప్పుడు రాముడు లేకుండా దీన్ని తీసుకువెడితే పౌరుల గుండెలు బ్రద్దలవుతాయి. ఈ రథం నగరవీథులలో కనిపించ నంతవరకూ వారంతా నువ్వు తిరిగివస్తావనే ఆశతో వుంటారు.

నువ్వు లేకుండా వెళ్ళి నేను కౌసల్యాదేవిని ఏ మొహంపెట్టుకు చూడను, ఆవిడకు ఏమనిచెప్పను? నీ మేనమామల యింటిదగ్గర దింపివచ్చానని చెప్పనా? నానోట అబద్ధంరాదు, ఆవిడకు అప్రియవార్తను వినిపించనూలేను. రోజూ నువ్వు అధిరోహించే రథాన్నిలాగే ఈ గుర్రాలుకూడా తిరిగివచ్చేలా లేవు. అందుచేత నన్ను కూడా నీతో ఈ అడవిలో ఉండనియ్యి. కాదంటే ఈ రథంతో నేనుకూడా అగ్నిప్రవేశం చేస్తాను. వధ్నాలుగేళ్ళ అనంతరం ఈ రథంమీద నీతోనే అయోధ్యకు వెడతాను అని ప్రార్థిస్తుండగా, రామభద్రుడు:

సుమంత్రా! నువ్వు తిరిగివెళ్ళకపోతే మా పినతల్లి కైకేయికి నమ్మకంకుదరదు. నేను వనవాసదీక్షలో వున్నాననే భావం లేకపోతే భరతుని పట్టాభిషేకం ఆవిడకు తృప్తి

నివ్వదు. అందుచేత నువ్వు వెళ్ళకతప్పదు, అని గుహునివైపు తిరిగి: చెలికాడా! ఇక వనవానయోగ్యంగా జటాధారులం కావాలి, మర్రిపాలు తెప్పించు, అన్నాడు.

సమీపంలోవున్న న్యగ్రోధక్షీరం తెప్పించాడు గుహుడు. జటాధారులయారు రామ లక్ష్మణులు. పడవదగ్గరకు నడిచి రాముడు: మిత్రమా! కోశ, దుర్గ, బలరక్షణతో జనపదాల్ని అప్రమత్తతతో చూసుకో, అన్నాడు.

అన్నగారి ఆజ్ఞ ననుసరించి లక్ష్మణుడు సీతాదేవిని నావ ఎక్కించి తనూ ఎక్కినా. అనంతరం రాముడు ఎక్కాడు. ఎక్కుతూనే ప్రయాణవేళ అవశ్యమైన బ్రాహ్మ, క్షత్ర మంత్రజపం చేశాడు.

గుహుని ఆజ్ఞానుసారం తెరచాపలెత్తి, పడవను నడుపుతున్నారు అనుచరులు. నదీప్రవాహాన్ని చీల్చుకుంటూ పడవ సాగుతున్నది. నదీమధ్యానికి వెడుతూండగా సీత చేతులు జోడించి.

ఓ భాగీరథీ! ఈ పధ్నాలుగేళ్ళూ వనవాసం ముగించి నాభర్త తన సోదరునితో తిరిగివచ్చేటప్పుడు ఇక్కడి దేవతలకు పూజలు జరిపించి, నీకు బలులిచ్చి, వేదవిదులను సమారాధనలతో సంతృప్తిపరుస్తాను, అని మొక్కుకున్నది.

గంగా దక్షిణతీరానికి నావ చేరింది. ముగ్గురూ దిగారు. గట్టున కాలుపెడు తూనే రామభద్రుడు: సౌమిత్రీ! ఇది మొదలుగా మనం జానకి రక్షణలో అప్రమత్తత వహించాలి. నువ్వు ముందునడు. నీ వెనుకనే జానకి ఉంటుంది. ఆ వెనుక నేను నడుస్తాను. అని క్షణం ఆగి: ఈ నిర్జనారణ్యభోగం ఎలావుంటుందో ఇప్పుడు సీత చవిచూస్తుంది అన్నాడు.

వారు ముగ్గురూ కనుమరుగయ్యే వరకూ సుమంత్రుడు ఈవలిఒడ్డునుంచి కన్నీరు మున్నీరు చేసుకుంటూ నిలబడి తల ఎత్తలేక వెనుదిరిగాడు. సీతా రామ లక్ష్మణులు వత్స దేశప్రాంతం సమీపించేసరికి పొద్దువాలింది. సంధ్యను ఉపాసించారు. పెద్ద చెట్టునీడను ఆ రాత్రి గడపడానికి నిశ్చయించుకున్నారు.

ఒక అడవిపందినీ, దుప్పినీ, నల్లదుప్పినీ, ఎనుబోతునూ వేటాడి నిప్పులో కాల్చి ఆ రాత్రికి ఆరగించి విశ్రమించారు.

రామభద్రునికి కునుకురాక: తమ్ముడూ! మనం ఎంతో జాగ్రత్తతో జానకిని రక్షించు కోవాలినుమా! హంసతూలికాతల్పాలమీద శయనించవలసిన మనం ఈ కటికనేలమీద

వరుండవలసివచ్చింది. అక్కడ అయోధ్యలో నాన్నగా రెలా ఉన్నారో, ఆయనకు నిద్ర పడుతుందా. ఒక్క కైకమ్మ మాత్రం హాయిగా నిద్రపోగలదు, తన కొడుకు రాజ్యాధికారం పొందినందుకు. ఆ ఉత్సాహంలో ఆవిడ ఏ సాహసానికి తెగిస్తుందో అని అనుమానంగా వుంది.

ఈ ప్రపంచంలో అర్థ కామాలే సర్వోత్కృష్టమైనవిగా కనిపిస్తున్నాయి. కాకుంటే నావంటి కొడుకును వదులుకోగలడా ఏ తండ్రి అయినా. రేపటినుండి కోసల దేశాధిపత్యం వహించే భరతుడే అదృష్టవంతుడు. గుణవతి అయిన భార్యతో సుఖంగా వుంటాడు వాడు.

ధర్మార్థాలనువిడిచి కామోపభోగమే పరమార్థంగా భావించే ఎవడైనా మన నాన్నగారుపడే అవస్థలు పడక తప్పదు. నన్ను అడవికిపంపి, భర్త అంతంచూసి, కొడుకును రాజును చెయ్యడానికే కైకేయి కోసలదేశం వచ్చింది. సౌభాగ్యమద గర్వంతో ఆవిడ మీ అమ్మనూ, మా అమ్మనూ ఎన్ని హింసలుపెడుతుందో! అందుచేత నువ్వు రేపే అయోధ్యవెళ్ళి వారి రక్షణ చూడు. నీచజాతులలో స్త్రీలు తమ సపతులకు మందులుపెట్టి చంపుతారని విన్నాను. నీచబుద్ధికల కైక కూడా అటువంటి దుస్సాహసానికి ఒడిగడు తుందనే భయం కలుగుతున్నది.

ఎన్నో క్లేశాలుపడి కనిపెంచిన కన్నతల్లికి దుఃఖంకలిగించే కొడుకు లోకనింద పాలవుతాడు. అంటూ విలపించడం మొదలుపెట్టగా లక్ష్మణుడు పరిపరివిధాల ఓదార్చి:

రామభద్రా! నిన్ను విడిచి నేనూ, జానకీకూడా ఉండలేం. నీకంటే నాకు ఆప్తులూ, ఆత్మీయులూలేరు. అందుచేత నన్ను ఇంటికి వెళ్ళమని అనకు, అన్నాడు,

అలా కొంతసేపయాక రాముడు నిద్రలోపడ్డాడు.

తెల్లవారింది, సూర్యుని ఉపాసించి సాగి, సాగి గంగా యమునా సంగమ ప్రాంతం చేరారు. కొద్దిదూరంలో యజ్ఞధూమం గోచరించింది అది ప్రయాగగా వారు గ్రహించారు. ఈవైపున అనతిదూరాన భరద్వాజాశ్రమం ప్రత్యక్షమైంది. సూర్యాస్తమయవేళకు ఆ ఆశ్రమ సమీపానికి చేరారు.

దివ్యజ్ఞానసంపన్నుడైన ఆ మహర్షి తపోఽగ్నిదీప్తితో వెలుగుతున్నాడు. కులగోత్రాలు చెప్పుకుని ఆమహర్షికి పాదాభివాదంచేసి తమరాకకు కారణం చెప్పారు. భరద్వాజుడు వారికి అర్ఘ్య, పాద్యాదు లిప్పించి, అడవిలోదొరికే మూలఫలాలు ఆహారంగా యిచ్చి, వారి శయనానికి ఏర్పాట్లు చేయించి, ఓ ఇక్ష్వాకువంశీయుడా! నీకు నిష్కారణంగా

వనవాసయోగంవట్టిన వార్త మేము విన్నాము. నువ్వు యిటువస్తావనీ తెలును : ఈ ప్రాంతం పవిత్ర గంగా యమునాతరంగిణీ సంగమ ప్రాంతం. ఇది వాసయోగ్యమైనది; నీకు ఉండాలని కోరిక కలిగితే యిక్కడ ఆశ్రమం నిర్మించవచ్చు. అనగా రాముడు :

మహర్షీ ! ఇది వాసయోగ్యమేకాని కోసలానికి సమీపంలో వుంది. జనపదాలు మరీ దగ్గరగా వున్నాయి. ఇక్కడ మేము ఉన్నట్లుతెలిసి, ప్రజలు తండోపతండాలుగా వచ్చి మీ ప్రశాంతతకు భంగం కలిగిస్తారు. అందుచేత మరొక ప్రాంతం చెప్పండి, అన్నారు.

రామభద్రా ! ఇక్కడకు పది క్రోసులదూరంలో చిత్రకూటం వుంది. అక్కడ ఎందరో మునులున్నారు, నువ్వు ఇక్కడవున్నా, చిత్రకూటానికి వెళ్ళినా సంతోషమే, అని చిత్రకూటమార్గం వివరించాడు భరద్వాజుడు.

## వా ల్మీ కి - చి త్ర కూ టం

ఆ రాత్రి వారు సుఖంగా నిద్రించి మరునాటి ప్రభాతంలో చిత్రకూటానికి బయలు దేరారు. ఒక్కరాత్రి అక్కడవుండి వారు వెడుతూంటే భరద్వాజుని మనసు చింతాక్రాంత మైంది. కన్నీటిధారలతో వారికి వీడ్కోలిచ్చాడు.

వారు కాళిందీనదిని సమీపించారు. మహర్షి చెప్పినట్టుగా అక్కడ లక్ష్మణుడు వెదురుబొంగులు చేర్చికట్టి తెప్పతయారుచేశాడు. వానిమీద మెత్తగావుండే ఆకులూ కొమ్మలూ పరిచాడు. రాముడు చెయ్యిచ్చుకుని సీతను దానిమీద కెక్కించాడు. ఆవిడ వస్త్ర, భూషణాలను భద్రంగా ఆ తెప్పమీద ఉంచారు. లక్ష్మణుడు తెప్పనడుపుతున్నాడు నదిమధ్యకు రాగానే సీత :

ఓయమునా ! నీకు నమస్కారము. ఇంత సుఖంగా మేము వనవాసం పూర్తి చేసి అయోధ్య తిరిగిచేరగానే నీకు బలులిచ్చి సురా ఘటాలు అర్పించుకుంటామ, అనిమ్రొక్కు కుంది.

దక్షిణతీరం చేరి, భరద్వాజుడు చెప్పినట్టు సాగి, వేలసంఖ్యలో ఊడలుదిగిన మహావటవృక్ష సమీపానికి రాగానే సీత దానికి నమస్కరించి ఆశీర్వాదాలు కోరింది.

ముందుకు సాగుతూ రాముడు : తమ్ముడూ ! ఇక్కడ మీవదినకు అన్నీ అద్భు తంగానే కనిపిస్తున్నాయి. ఆవిడ ఏం కోరితే అవి యిస్తూండాలిసుమా, అని దారిలో వివి

త్రంగా, విమాతనంగా కనిపించే ఫల, పుష్ప, వృక్ష లతాదులను గూర్చి ఆమెకు చెప్తూ, కోరినవి తెచ్చిపెడుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

సాయంసంధ్యాకాంతులు జాలువారేవేళ ఒకచోట విడిదిచేసి, తెలతెలవారుతూండగా లేచి ప్రయాణం ఆరంభించారు.

ఫల పుష్ప భరితమూ, మధుకర సంభరితమూ, మృగ పక్షి గణయుతము అయిన నీలవనం దాటి చిత్రకూటం చేరారు.

వరవశింపజేసే ప్రకృతిశోభతో అలరారే ఆ చిత్రకూటంలో మహర్షి వాల్మీకిఆశ్రమం సమీపించి ఆయనకు పాదాభివాదం చేశారు. ఆయన చిన్న చిరునవ్వుతో వారికి వాసస్థానం చూపించాడు. లక్ష్మణుడు ఆశ్రమనిర్మాణానికి అవసరమైనసామగ్రితెచ్చి శాలనిర్మాణంచేసి అగ్నివేది ఏర్పరచి, వాస్తుపూజకు లేడినిచంపి తెచ్చాడు.

రాముడుస్నానంచేసివచ్చి వేదోక్తంగా అగ్నిని ప్రజ్వలింపజేసి, కృష్ణమృగమాంసం అందులోవ్రేల్చి, వైశ్వదేవ బలులిచ్చి రౌద్ర, వైష్ణవ యజ్ఞాలతో పర్ణశాలలో ప్రవేశించారు. మాల్యవతీతటాన చిత్రకూటప్రాంతాన ఆ ఆశ్రమం వారికెంతో సంతోషాన్ని కలిగించింది.

సురమ్య మాసాద్యతు చిత్రకూటం
నదీం చ తాం మాల్యవతీం సుతీర్థామ్
ననంద హృష్టో మృగపక్షి జుష్టాం
జహౌచ దుఃఖం పుర విప్రవాసాత్ ।

# అయోధ్య

సుమంత్రుని వెంటబెట్టుకుని గుహుడు తన యింటికి చేరాడు. వారిద్దరూ సీతా రామ లక్ష్మణులను గురించే చెప్పుకుంటూ గడిపారు. భరద్వాజాశ్రమానికి వారు వెళ్ళిన వార్తవిన్నాక, సుమంత్రుడు గుహునివద్ద సెలవుతీసుకుని అయోధ్య ప్రవేశించాడు. అంతా శూన్యంగా కనిపించింది. నగర సింహద్వారంలో రథంప్రవేశించగానే ప్రజానమూహం చుట్టుముట్టి: సుమంత్రా! రాముడేడయ్యా? ఏడయ్యా మా రామభద్రుడు, అని అడగ్గా, గంగానదినిదాటి అరణ్యంలో ప్రవేశించారని చెప్పడంతో అందరూ గోలుగోలున విలపిస్తూ-

ఇక మన గృహాలలో జరిగే శుభకార్యాలలో, యజ్ఞయాగాది శుభకార్యాలలో రామ భద్రుని దర్శనం మనకుండదు, అని నగర నారీజనంకూడా విలపిస్తుంటే వారిని చూడలేక ఉత్తరీయంతో ముఖం కప్పుకుని రాజవీథిదాటి రాజభవనం ప్రవేశించాడు.

ఏడు గడపలుదాటి వచ్చాడు. అక్కడ స్త్రీలందరూ శోకావిలహృదయులైవున్నారు. ఒంటరిగా సుమంత్రుడు కనిపించడంతో వారి దుఃఖప్రవాహాలు కట్టలు తెంచుకున్నాయి.

లేకలేక కలిగిన కొడుకుకు దూరమైన కౌసల్య దుఃఖాన్ని ఎలా వారిస్తా డీ సుమం త్రుడు? ఆవిడ ముఖంచూచి ఏం మాట్లాడతాడు, అని వారిలోవారు గుసగుసలు ఆడుకుం టూంటే, మరింతభారంతో ఎనిమిదవ కక్ష్యదాటి శోకతప్తుడై, చేష్టలుడిగివున్న మహారాజుకి అభివాదం చేసి, విషయాలన్ని వివరించాడు.

విన్న దశరథుడు మాటా, పలుకూలేక మూర్ఛితుడయ్యాడు. అంతఃపురం ఆర్తస్వరంతో నిండింది. కౌసల్య, సుమిత్ర ఆయనను లేవదీసి కూర్చోబెట్టారు కొంతసేపాగి కౌసల్య :

మహారాజా! అతి క్లిష్టమైన పని నిర్వర్తించి వచ్చిన సుమంత్రునితో మాట్లాడండి. మీ కొడుకును అడవికి పంపుకున్నారు, అందుకోసం ఇప్పుడెందుకు ఏడవగం? ఇక్కడ మీకు కైకమ్మ భయంలేదు. లేచి మాట్లాడండి. అంటూనే నేలమీద వ్రాలి గోలు గోలున ఏడ్చింది.

అప్పటికి దశరథునికి స్మృతివచ్చింది. అతి ప్రయత్నం మీద గొంతువిచ్చి నా రాముడు - మందిరం వీడితే చతురంగబలాలు ముందువెనకల సాగుతూండగా కదిలే రామ భద్రుడు-కాలినడకను, కంటకశిలాభూయిష్ఠమైన అరణ్యాలలో నిర్జన ప్రాంతాలలో, భయంకర మృగసమూహాలలో తిరిగే అవస్థలపాలయాడా! సరే....! వారు రాజధాని విడిచింది మొదలు నువ్వు తిరిగివచ్చేవరకూ ఏం జరిగిందో చెప్పు. నా రామభద్రుడు ఏమన్నాడో వినిపించు, అన్నాడు.

ప్రభూ! ముందుగా మీపాదాలకు అభివాదాలు అందించమన్నాడు. అంతఃపుర స్త్రీలందరి క్షేమమూ, తన తల్లి క్షేమమూ అడిగాడు. ఆవిడ అప్రమత్తతో అగ్నిగృహాన్నీ మీ పాదపద్మాలనూ ఆరాధిస్తూ వుండాలని మరీ మరీ చెప్పాడు. ఈదశలో అభిమానానికి లొంగక కైకమ్మ అభిమానం పొందడానికి ప్రయత్నించాలన్నాడు. భరతుని రాజుగా సేవించి, ఆయనను ప్రసన్నుని చేసుకోవాలనీ, అనుజులు సింహాసనాసీమలయిన విషయాలు స్మరించుకుని సంతృప్తిగా వుండమనీ వివరించాడు.

భరతుడికి రెండుమాటలు చెప్పాడు: ఇక్ష్వాకువంశ గౌరవం విస్మరించకుండా తండ్రినీ, మాతృదేవతలనూ సముచితంగా సేవించుకోమని అంటూ, కన్నులనీరు నింపా డయ్యా రామభద్రుడు.

మహారాజా! లక్ష్మణుడు తీవ్రక్రోధంతో కోడెత్రాచులా బుసకొడుతూ: నేను తల్లిగా, తండ్రిగా మా అన్ననే సేవిస్తాను. ఏ అపరాధంచేశామని మమ్మి అడవుల పాలుచేశారు? ఆవిడలోభం ఇంతకూ కారణం. ఈ పాపఫలం అనుభవించకపోదు. సర్వజన ప్రియు డైన రాముని అడవులకు తోలిన ఆయన రాజపదవికి అనర్హుడని దూషించాడు.

జానకీదేవి శోకసంతప్త హృదయంతో, కన్నీరు విడుస్తూ ఏ మాటా చెప్పకుండా నిలిచింది, అని సుమంత్రుడు దుఃఖం దిగమ్రింగుతూ, ప్రభూ! రామాదులను విడిచి శూన్యరథంతో తిరిగివస్తూ, రెండునాళ్ళు గుహునివద్ద ఆగాను, రామభద్రుడేమైనా సందేశం పంపుతాడేమో అని. కాని ఏం రాలేదు.

తిరిగి వస్తూండగా మన రాజ్యభూభాగమంతా చూశాను. అంతా శూన్యం, శోకం. దారిపొడవునా తోటలలో, వనాలలో ఆకులున్న చెట్లులేవు, పువ్వులున్న లతలులేవు. సరో వరాలలో జలపక్షుల కూతలులేవు, చెట్లమీద శుకపిక సంతతుల కలరవాలులేవు.

అయోధ్యలో ప్రవేశించింది మొదలు - ప్రతి గృహం శోకమందిరమే.... అందరూ వేడినిట్టూర్పులు విడిచేవారే. స్త్రీ, పురుషులందరూ కౌసల్యాదేవిలా శోకవదనాలతోనే వున్నారు, అని ఆగాడు.

సుమంత్రా! పాపం రూపందాల్చిన కైక మాటవిని నేను మంత్రులతోకూడా యోచించకుండా యీ దుష్కార్యం చేశాను. ఇది వంశనాశనానికే వచ్చింది. నువ్వు తక్షణంవెళ్ళి రాముణ్ణి తీసుకురా, లేదా నన్నుతీసుకుపో! వారులేకుండా నేను క్షణం జీవించలేను.

లోహితాక్షం మహాబాహుం ఆముక్త మణికుండలం।
రామం యది న పశ్యేయం గమిష్యామి యమక్షయం॥

హా రామా, లక్ష్మణా, జానకీ ! అంటూ గోలుగోలున విలపిస్తూ! ఓ కోసల రాజపుత్రీ! నేను నా కొడుకునీ కోడలినీ విడిచి బ్రతకలేను, అని మళ్ళీ మూర్ఛలోపడ్డాడు.

అంతలో కౌసల్య దుఃఖం కట్టలు తెగింది. ఆవిడ శోకంతోనే; సుమంత్రా! తక్షణం రథం సిద్ధంచెయ్యి. నా కొడుకునీ, కోడల్నీ చూడకుండా క్షణం జీవించను. నన్నుకూడా ఆ అడవికి తీసుకుపో, అంది.

సుమంత్రుడు ఓదారుస్తూ; అమ్మా ! నువ్వు శోకంలోపడి అలా మాట్లాడకూడదు. రాముడులకూ, జానకికీ అక్కడ ఏక్లేశమూలేదు. సౌమిత్రి జితేంద్రియుడై అన్నగారిసేవలో వున్నాడు. ఇక జానకమ్మ, భర్త మీదనే మనసుంచి యిక్కడవున్నట్లే సుఖంగావుంది. విచిత్రమేమిటంటే జానకికి వనవాసంలో కొత్తదనమేమీ లేదు. మన నగరంలోని ఉద్యాన వనాలలో తిరిగినట్లే విహరిస్తున్నది. అడవిలో మృగాలనూ, పక్షులనూ చూచి కుతూహలంతో వాటి విశేషాలు తెలుసుకుంటున్నది.

జానకీదేవి ఒక్కమాట అన్నదమ్మా కైకనుగురించి- అని తన తెలివితక్కువకు నాలుక కొరుక్కుని, అంతలోనే మాట మళ్ళించి : అమ్మా ! ఆ అడవిగాలిగానీ, అక్కడి చలికానీ, వేడికానీ ఆవిడకేమీ బాధగాలేదు. ఆ ముఖంలో వెన్నెలలకాంతి వసివాడలేదు. అక్కడ వారంతా ఋషులవలె వున్నారమ్మా, నువ్వువిచారించవలసిన పనిలేదు. మీవంశం శాశ్వతయశస్సు ఆర్జించుకుంటున్నది - అని ఉపశమన వాక్యాలు పలుకుతూనేవున్నాడు.

> శోకో నాశయతే ధైర్యం శోకో నాశయతే శ్రుతమ్ ।
> శోకో నాశయతే సర్వం నాస్తి శోకసమో రిపుః ॥

ఆవిడగుండె పుత్రశోకాన్ని విడవలేక :

మ హా రా జా! మీరు దయాధర్మపరులనీ, ప్రియవాదులనీ చెప్పుకుంటున్నారే ప్రజలు. ఆ కీర్తిపొందిన మీరు ఆగర్భశ్రీమంతులయిన కొడుకునీ, కోడల్నీ అడవులకు పంపారే, అక్కడిక్లేశాలు వారు అనుభవించగలరనే భావించారా ! హంసతూలికా తల్పాల మీద మంగళగీతాలు వింటూ నిద్రించి, వైతాళికగానాలతో మేల్కొనవలసిన జానకి సింహ, వ్యాఘ్ర గర్జనల మధ్య రాత్రులు గడపగలదనే అనుకున్నారా!

బ్రహ్మదేవుడు నాగుండెను వజ్రంతో చేసివుంటాడు, కాకపోతే యీ బాధకు అది బ్రద్దలవకపోయేదా!

నా రాముడు అడవినుంచి తిరిగి వచ్చాక కైకకొడుకు తన ఆధీనంలోవున్న రాజ్యాన్నీ, కోశాగారాన్ని వదులుకుంటాడా? వాడు వదులుకున్నా నా కొడుకు దాన్ని

స్వీకరించగలడనుకుంటున్నారా! శ్రాద్ధభోజన శేషాన్ని శిష్టులు ముట్టుకోరు. అలాగే నా రాముడు ఈ భరతోచ్ఛిష్టాన్ని మూ జూడడు.

శార్దూలం తన తిండిని తనే వేటాడుకుంటుంది: మరోజంతువు చంపి విడిచిన దానిని ముట్టదు. నా రాముడు నరశార్దూలం. మహా వీరుడు, సింహబలుడు. వాడు పరాభవానికి తల వొగ్గడు. వాడు ధర్మరక్షకుడు. అటువంటి నాబిడ్డను వంచించారు: ఆ ధమర్ధరుడు ఘోరారణ్యాలలో బ్రాహ్మణధర్మాన్ని అవలంబించవలసి వచ్చింది.

ఈ ప్రపంచములో స్త్రీకి భర్త మొదటిరక్షకుడు, ఆ రక్ష ఆదిలోనే లేదు. రెండవ గతి కన్నకొడుకు — వాడు అడవులపాలయ్యాడు. ఇక బంధుజనాశ్రయం అధమగతి....

అని విలపిస్తుంటే, ఆమాటలవాడికి దశరథుని హృదయం తీవ్రంగా గాయపడింది. కొంతసేపటికి తేరుకొని కౌసల్య ముఖంలోకి చూశాడు. అప్పుడాయనకు పుత్రవియోగశాప కథ గుర్తుకు వచ్చింది.

ఆయన కౌసల్యాదేవి చేతులు రెండూ పుచ్చుకుని :

ఓ మహారాజ్ఞీ! గుణవంతుడైనా, గుణహీనుడైనా భర్త భార్యకు పరదైవమే. నేను నిన్ను ఇంతకాలంగా అనాదరంతో చూసినా నువ్వునామీద భక్తితో సేవిస్తూనే వున్నావు ఈనాడు నీకు కలిగిన దుఃఖం నీ ఒక్కదానికే కాదు, అంతకంటే దుఃఖంతో బద్ధలవుతున్నది నా గుండె. నన్ను ఇంకా నీమాటల శూలాలతో పొడిచి హింసించకు, అని కన్నీరు విడిచాడు.

కౌసల్యాదేవి గుండె నీరయింది, ఆయన అంజలి బంధాన్ని తన నెత్తిమీద ఉంచుకున్నది. ఆవిడ పెదవులు వణుకుతున్నాయి. నోటమాట రావడం కష్టమయింది.

ప్రభూ! మీ కాళ్ళుపట్టి వేడుతున్నాను. పుత్రశోకంతో నేను నాధర్మాన్ని మరచి మిమ్మల్ని హింసించాను. మనిషి వివేకాన్ని ధైర్యాన్ని నాశనం చేస్తుంది శోకం; అందుచేతనే కాబోలు శోకాన్ని పరమశత్రువన్నారు. అప్పుడే అయిదు రోజులయింది నా బిడ్డ అడవికి వెళ్ళి. ఈ అయిదురాత్రులూ నాలో కుములుతున్నశోకం నన్ను వంచించి యిన్ని దుర్భాషలాడించింది. నన్ను మన్నించండి అనివేడుకుంది. మహారాజుగుండె కొంత తేరుకున్నది. అంతలో పొద్దుగ్రుంకింది. బాధతో నిద్రకు ఉపక్రమించాడు.

ఎంతోసేపు నిద్ర నిలవలేదు.

శయ్యదిగి కౌసల్యను పిలిచి, దగ్గరగా కూర్చోబెట్టుకుని :

కోసలరాజపుత్రీ! మానవుడు తాను చేసిన మంచి చెడ్డల కర్మఫలం అనుభవించక తప్పదు అని తెలుసుకోలేకపోవడం కంటే అవివేకం లేదు. మామిడిచెట్టు నరికి మోదుగ చెట్టునాటి దాని పువ్వులుచూసి మురిసిపోతూ దాని పళ్ళుకూడా అలాగే ఉంటాయనుకోవడం కంటే మూర్ఖత్వం వున్నదా! ఇప్పుడు నాస్థితి అలా వుంది. రసాలాన్ని ఛేదించి పలాశ వృక్షాన్ని పెంచుకున్నాను. దానిఫలం తెలుస్తున్నది.

చాలా రోజుల క్రితం విషయం....అప్పటికింకా మన పెళ్ళి కాలేదు. నేను యువ రాజుగా వున్న రోజులు. సూర్యుడు కర్కాటకంలో ప్రవేశించాడు. వేడితగ్గి, కారుమేఘాలు కమ్మి, వానలు కురుస్తున్నాయి. నదీ నదాలు వరదలలో వున్నాయి. ఆ రోజులలో సరయూ నదీతీరాన వేటకు వెళ్ళాను. నేను శబ్దవేధి నేర్చుకున్న క్రొత్తరోజులవి. ధ్వనిని విని బాణం సంధించి విడిచేవాడిని. అక్కడ రేవుకి అడవి దున్నగాని, ఏనుగు గున్నగాని దాహశాంతికి వస్తుందని ఎదురు చూస్తుండగా, చీకటి ముదిరిన వేళ, ఏనుగు తొండంతో నీరుత్రాగుతున్న ధ్వని వచ్చింది. శబ్దం వచ్చిన దారినే బాణం వదిలాను. అంతే! మానవ విషాదధ్వని వినబడింది. 'తాపస జీవితం గడిపే నేను చేసిన అపరాధం ఏమిటి? నన్నెందుకుచంపినట్టు? నామృతికి నేను బాధపడటంలేదు. వృద్ధులూ, అంధులూ ఐన నా తల్లిదండ్రులు దిక్కులేనివారయారు. ఈ ఒక్కబాణం మూడు ప్రాణాలు తీసింది' - అన్న మాటలు వినవడ్డాయి. నాచేతిలో ధనుస్సు జారింది. నాగుండెదడదడలాడింది. వాలు గడుగుల్లో వానిని సమీపించాను. నాపొరపాటు చెప్పాను. ఆ యువకుడు తక్షణం తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి వారికి విషయం నివేదించమన్నాడు. విపరీతంగా బాధి స్తున్న బాణం పీకెయ్య మన్నాడు. తియ్యగానే ప్రాణాలు వదిలేశాడు.

అతడు తెచ్చిన నీటికడవతో నేను జంకుతూ ఆ వృద్ధులను సమీపించగానే వారు తమ కుమారుడే అనుకున్నారు. అప్పుడు నాకులగోత్రాలు చెప్పుకుని జరిగిన తప్పిదం తెలిపి, క్షమించినా, శపించినా సిద్ధంగా వున్నానన్నాను. వారుభయులూ మొదలునరికిన చెట్టులా కూలిపోయారు, కొంతసేపటికి స్మృతివచ్చాక పరిపరివిధాల విలపించి, తమబిడ్డకు నాచేత దహనక్రియలు పూర్తిచేయించారు. వారిని నాతో అయోధ్యకు రమ్మన్నాను. కాని వారుకూడా ప్రాణత్యాగం చేయడానికే నిశ్చయించుకుని చితి పేర్పించి :

మాకు పుత్రశోకం కలిగించిన నీకు కూడా పుత్రశోకం తప్పదని శపించారు. వారికి దహనక్రియలు పూర్తిచేసి వచ్చాను.

ఆ పాపఫలం శాపపరిణామం యిలా వేధిస్తున్నది. కన్నతండ్రి ఎవడూ చేయని పాపం చేశాను. ఈ శోకం నాప్రాణాలను తోడుతున్నది.

ఇంద్రియజ్ఞానం పోతున్నది. కంటికి ఏమీ కనపడడంలేదు. చెవులకు శబ్దంవిన వడడంలేదు. స్పర్శజ్ఞానం కూడా వున్నట్లులేదు.

హా రామా ! పితృవాక్యపాలకా ! మహావీరుడా ....

ఓ కౌసల్యా ! రామజననీ ! సుమిత్రా .... !

ఓ కైకా....కులపాంసనీ....అని పిచ్చిగా అరుస్తూండగానే ఆయన ప్రాణవాయువు చల్లారింది.

తెల్లవారుఝామున వందిమాగధ బృందం యథాప్రకారం రాజమందిర ప్రాంగణ ద్వారంలో వైతాళిక గీతాలావనం చేస్తున్నారు. పరిచారికాగణం గృహసమ్మార్జనం చేసి, మంగళస్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యుడు తూర్పు కొండమీంచి ముందుకు సాగాడు.

అంతిపురిలోని స్త్రీలు రాజశయనాగరం చేరి మేల్కొలుపు మాటలు పలికినా రాజు కదలకపోవడంతో వారికి అనుమానం కలిగింది. అదేగదిలో నిద్రలోవున్న కౌసల్య, సుమిత్రల వదనాలలో శోభనకాంతులు కనిపించక మరీ ఆందోళనవడ్డారు. మగఏనుగు అండలేని కరేణుబృందంలా వారంతా ఆర్తనాదాలు ఆరంభించారు. ఆధ్వనికి మెలుకువ వచ్చిన రాణులిద్దరూ భర్త శరీరం స్పృశించి : హా ! మహారాజా ! అంటూ మూర్ఛపోయారు.

క్షణాలలో అయోధ్య శోకసాగరంలో మునిగింది. కైక వచ్చే సమయానికి సుమిత్ర, కౌసల్య లేచారు.

కైకను చూస్తూనే కౌసల్య :

ఓసీ రాక్షసీ! నీ కడుపు నిండిందికదా! హాయిగా ఏలుకో రాజ్యాన్ని. మేంకూడా అనాథులమయ్యాం. కొడుకులు ముందే అడవులపాలయ్యారు. నీ పుణ్యమా అని నా కోడలు జానకికూడా కారడవుల పాలబడింది. తన కూతురుకి కలిగినకష్టంవిని జనక మహారాజు కూడా ప్రాణాలు వదులుతాడు. నేను మా ప్రభువుతో అగ్నిప్రవేశం చేస్తాను, అని గోలుగోలువ భర్తశవంమీదపడి విలపిస్తున్నది.

అప్పటికి వచ్చిన సుమంత్రుడు పరిచారికలను పిలిచి కౌసల్యను దూరంగా తీసుకు వెళ్ళమన్నాడు. అంతఃపురం రోదనసాగరమయింది. కొడుకు లెవరూ దగ్గర లేనందున మహారాజు శరీరాన్ని తైలద్రోణంలో భద్రపరిపించారు.

కోసలదేశం ఒక్కపెట్టున రోదిస్తున్నది. ఆరోజు గడిచింది. కోసలరాజ్య మంత్రాంగంలో ప్రముఖులయిన మార్కండేయ, మౌద్గల్య, వామదేవ, కశ్యప, కాత్యాయన, జాబాలి, గౌతములూ, విజయ, సుమంత్రులూ వశిష్ఠులవారితో, యితర పురోహిత మంత్రి జనంతో సమాలోచనలు జరిపి :

వశిష్ఠమహర్షీ! సింహాసనంమీద రాజులేకుండా ఒకరోజు గడిచింది. పట్టాభిషిక్తుడు కావలసిన జ్యేష్ఠుడు అడవులలో వున్నాడు. తేజశ్శాలి లక్ష్మణుడూ అక్కడే వున్నాడు. భరత శత్రుఘ్నులు మాతామహులయింట వున్నారు. మా రాజ్యం అరాజకంగా ఒక్క క్షణం వుండరాదు, తక్షణం ఇక్ష్వాకులలో ఎవరినో ఒకరిని అభిషిక్తులను చెయ్యాలి.

రాజు లేకపోతే వానలుసక్రమంగా పడవు, రైతు విత్తనం జల్లడు. ప్రజాధనానికి రక్షణవుండదు. స్త్రీలకు గౌరవస్థాన ముండదు. ప్రజలు సుఖంగా మాట్లాడుకోలేరు. యజ్ఞయాగాది సత్కార్యాలు సాగవు. సంగీత, నృత్య కళాకోవిదులు తమ తమ విద్యా ప్రదర్శనంతో ప్రజలకు ఉత్సాహం కలిగించరు. ఉద్యానవనాలు, క్రీడాస్థలాలు భద్రత లేనివై పోతాయి. కర్షకులకు సుఖంవుండదు. వ్యాపారులు వాణిజ్యం చేయలేరు.

రాజు వుంటేనే సంసారులు సుఖంగా గుండెమీద చేతులుంచుకుని నిద్రపోతారు. లేకపోతే చిన్న చేపను పెద్దచేపలు మింగేటట్లు బలవంతులు బలహీనులను కబళిస్తారు. సత్యం, ధర్మం మచ్చుకి వుండవు.

రాజు సత్ప్రవర్తకుడయితేనే ఇంద్ర, యమ, వరుణ కుబేరులు ఆ రాజ్యంలో సుఖభోగా లుంచుతారు. ఇవన్నీ మీ రెరుగనివి కావు. మహారాజు ఏలుబడి సాగించే రోజులలోనే మీ మాట వేదవాక్యం. ఇప్పుడు మీరు ఎవరినో ఒకరిని సింహాసనం ఎక్కించాలి, అన్నారు.

భరత శత్రుఘ్నులకోసం దూతలను పంపడానికి వశిష్ఠులు నిశ్చయించి, విజయ, జయంత, నందన, అశోక సిద్ధార్థులను రావించి వారికి పుష్కలంగా దారిబత్తెం ఇచ్చి కేకయ దేశానికి వెళ్ళి భరత శత్రుఘ్నులను తీసుకురమ్మని వశిష్ఠాది మంత్రులు ఆదేశించారని చెప్పండి. మహారాజు మరణవార్తకానీ మరేవిషయంకానీ అక్కడ తెలియడానికి వీల్లేదు. రాజమర్యాదానుసారం వారికి అందజేయవలసిన కానుకలు తీసుకువెళ్ళండి. క్షణాలలో మీరు తిరిగిరావాలి, అని ఆజ్ఞాపించాడు.

ప్రలంబ ప్రాంతం మీదుగా మాలినీ నదినిదాటి హాస్తినాపుర సమీపంలో గంగదాటి పాంచాలం గడిచి కురుజాంగలాలు నడచి బాహ్లీక దేశంమీదుగా సుదామా పర్వతందాటి అయిదవనాటి రాత్రికి కేకయరాజధాని గిరివ్రజం చేరారు దూతలు.

ఆ రాత్రి భరతునికి దుస్స్వప్నాలు ఎన్నోవచ్చి మనస్సు వికలంకాగా స్నేహితు లందరూ చేరి హాస్యప్రసంగాలతో, వినోద ప్రదర్శనాలతో మనస్సు స్వస్థం చెయ్యడానికి యత్నించారు. కాని ఆ మనసు వ్యాకులంగావే వుంది.

దశరథమహారాజు తనజుట్టంతా విరజిమ్ముకుని పర్వతశిఖరనుండి గోమయ హ్రదంలో దూకుతున్నట్టు, నూనె తాగుతున్నట్టు, నువ్వుల అన్నం తింటున్నట్టు, నవ్వుతున్నట్టు కనిపించారు. సముద్రం ఎండిపోయింది, చంద్రుడు భూమిమీద పడ్డాడు. ప్రపంచమంతా చీకట్లతో నిండింది, భద్రగజం దంతం విరిగింది. మండుతున్న అగ్ని ఒక్కసారి చల్ల బడింది. భూమి బీటలు వారింది. పర్వతాలు పొగతో నిండిపోయాయి. మహారాజు గాడిదల రథంమీద దక్షిణదిశగా సాగుతున్నాడు. రక్తాంబరాలతో, వికృతాకారంతో ఒక రాక్షసి నవ్వుతూ వస్తున్నది. ఏవంవిధ స్వప్నాలు అశుభసూచకాలేకదా! తండ్రి గారికో, అన్న రామభద్రుడికో, లక్ష్మణుడికో విపత్తు వచ్చివుండాలి. ఇప్పుడు మీరెంత యత్నించినా నా మనస్సు శాంతపడదు, అన్నాడు భరతుడు.

ఇలా వీరు మాట్లాడుకుంటూ ఉండగా, అయోధ్యనుండి దూతలు వచ్చారని వార్తరాగావే వారిని తక్షణం రప్పించి విశేషా లడిగాడు.

కులగురువులు వశిష్ఠులూ, మంత్రులూ తమ ఆజ్ఞగా మిమ్ము తక్షణం తీసుకు రమ్మన్నారు. ఇవిగో ఇక్కడి ప్రభువులకు కానుకలు, అని నిలబడ్డ దూతలతో;

మా నాన్నగారు కుశలమేనా? రామ లక్ష్మణులు క్షేమమేకదా? కౌసల్యా, సుమిత్రలకు ఏక్లేశాలూ రాలేదుకదా. స్వార్థం, అహంకారం మూర్తీభవించిన క్రోధ రూపిణి మాఅమ్మ కైక సుఖంగా వున్నదా, అని గుక్కతిప్పకుండా ప్రశ్నలవర్షం కురిపిం చగా, ఆ దూతలు: రాజపుత్రా! ఎవరి కుశలాన్ని మీరు కోరుతున్నారో అందరూ కుశలమే, మీ అభ్యుదయాకాంక్షులై మిమ్మల్ని తక్షణం రమ్మన్నారు, అన్నారు.

తక్షణం తాతగారికీ, మేనమామలకూ నమస్కరించి వారిచ్చిన కానుకలన్నీ తీసుకొని భరతుడు తమ్మునితో రథం ఎక్కాడు.

రథం వాయువేగంతో సాగుతోంది. రాకుమారులవెంట అవసరమైన సేనా బలం వస్తున్నది. ఏడురోజులు ప్రయాణంచేసి అయోధ్య చేరారు. నగరం పొలిమేరలలో అడుగు పెడుతూండగానే భరతునికి అనుమానం కలిగింది. ఉద్యానవనాలు, క్రీడాసరో వరాలు అన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. భోగలాలసులైన వ్యక్తులు నిరంతరం విలా

సాలతోవుండే ప్రదేశాలు శూన్యంగా ఉన్నాయి. లతలు, చెట్లు దోహదంలేక వాడి వున్నాయి.

వేణు, వీణా, మృదంగవాద్యాలతో గానగోష్ఠులతో అలరారే ప్రాంతాలలో నిశ్శబ్దం తాండవిస్తున్నది. చందనాగరు వాసనలతో విరాజిల్లేప్రాంతం ఏ వాసనాలేకుండా ఉంది. రాజమార్గంలో ఒక్కవ్యక్తిలేడు. ఎవరూ తనవైపు చూడడంలేదు. ఒకవేళ ఎవడోఒకడు చూచినా తక్షణం తల తిప్పుకుంటున్నాడు.

సౌధాంగణాలలో, గృహ ప్రాంగణాలలో సమ్మార్జనాలు లేవు. రంగవల్లులులేవు. ధూళీ ధూసరితగృహద్వారాలు భరతునికి మరింత భీతి కలిగించాయి.

త్వరత్వరగా రాజభవనం చేరాడు. మహారాజు కనపడలేదు. కైకేయీ భవనానికి వెళ్ళాడు. బంగారు ఆసనంమీద కూర్చున్న కైక కొడుకును చూస్తూనే అతనికి ఎదురువెళ్ళింది. భరతుడు ఆవిడకు పాదాభివాదం చేశాడు. ఆవిడ ప్రేమతో లేవదీసి, గాఢంగా కౌగలించుకుని, తన పుట్టింటి వారందరి కుశలమూ పేరు పేరునా అడిగింది.

అప్పుడు భరతుడు: అమ్మా! ఈ శయనమందిరంలో మహారాజు కనిపించరేం. ఆయనపాదాలకు నమస్కరించాలి, ఆయన కౌసల్యా భవనంలోఉన్నారా, అని ఆందోళనతో అడిగాడు.

నాయనా! సర్వప్రాణికోటీ చివరికి ఏగతిపొందుతుందో మీ నాన్నగారు అదేగతి పొందారు. అని సమాధాన మిచ్చింది.

వార్తవిన్న భరతుడు గుండెలు బాదుకుంటూ విలపించి, తలమొత్తుకొని, తండ్రి శయనించే తల్పంచూచి, ఉత్తరీయంతో కళ్ళుమూసుకుని, నేలమీదపడ్డాడు.

కైక వెమ్మదిగా లేవదీస్తూ : నాయనా! గతానికి శోకించడం వివేకి లక్షణంకాదు. పైగా యిది నీకు మంచికాలం. మహానభలో గౌర వాదరాలు పొందుతూ నీబుద్ధి సూర్య తేజస్సులా ప్రకాశించవలసిన రోజులివి: ఇప్పుడు శోకం పనికిరాదు, అంటూంటే భరతుడు: అమ్మా! అన్నకు రాజ్యాభిషేకమో, లేక నాన్నగారు మరో మహాయజ్ఞమో ఆరంభించి రప్పించారనుకున్నాను. కాని ఈదురదృష్టం ...ఇంతకూ ఆయన ఏ రుగ్మతతో మరణించారు. వారికి అంత్యక్రియలుజరిపిన రామలక్ష్మణులు ధన్యులు....అని కొంతసేపు విచారించి :

అమ్మా! ఈపాటికి మహారాజు నా ఆగమనవార్తవిని నా రాకకోసం ఎదురు చూస్తూం టారు. వారిపాదాలకు నమస్కరించి ఆశీస్సులు పొందాలి. నాకు అన్న మాత్రమేకాక పితృతుల్యుడు, ఆప్తబంధువు అయిన రామచంద్రుని చూడనిదే నాకు మనశ్శాంతిలేదు. ధర్మ, సత్యవ్రతులైన నాన్నగారు చివరిక్షణాల్లో నాకేం చెప్పమన్నారు, అని అడిగాడు.

నాయనా! ఆయన హా రామా, సీతా, లక్ష్మణా అంటూ కన్నుమూసారు. అదృష్టవంతులైన జనులే సీతతో తిరిగివచ్చిన రామలక్ష్మణులను చూడగలుగుతారని అన్నారు, అని కైక అంటూంటే.

అమ్మా! సీతారామలక్ష్మణు లెక్కడికి వెళ్ళారమ్మా! అని ప్రశ్నించగా, ఆవిడ అచంచలంగా: జటావల్కలాలు ధరించి వారు దండకారణ్యానికి వెళ్ళారు, అంది.

భరతుని మనస్సు స్వాధీనం తప్పింది. అమ్మా! ఏ అపరాధానికిది శిక్ష? బ్రాహ్మణద్రవ్యం అపహరించాడా! పరదారపైచెయ్యివేశాడా? నిష్కారణంగా ఎవరినైనా బాధించాడా? ఈ పనులేవీ ఆయన చెయ్యడే. మరి ఆయనకు ఈ శిక్షదేనికమ్మా! అన్నాడు.

నాయనా! రాముడు అటువంటి అకృత్యా లెందుకుచేస్తాడురా. పరస్త్రీని కన్నెత్తి చూడడం, పరధనాన్ని అందునా బ్రాహ్మణద్రవ్యం ముట్టడం వాడుచేస్తాడా! నువ్వు సావధానచిత్తంతో విను.

రాముడిని రాజ్యాభిషిక్తుని చెయ్యడానికి ప్రయత్నాలు ఆరంభించారు. నీకు సింహాసనం యివ్వాలనీ, రాముడు అడవికి వెళ్ళాలనీ నేను వరాలు కోరాను. సత్యవ్రతు డైన నీతండ్రి అంగీకరించాడు. అంగీకరించి, ఆత్మనందన వియోగం భరించలేక అసువులు విడిచాడు. ఈరాజ్యం నిష్కంటకంగా నీ అధీనమైంది. నువ్వుశోకం విడిచి, పితృకర్మ పూర్తిచేసి కులగురువుల ఆశీస్సులతో కోసలదేశానికి ఆధిపత్యం వహించు, అంది.

ఓసీ పాపిష్ఠీ! తండ్రితరువాయి అంతటివాడైన అన్నగారులేని రాజ్యం నాకెందుకే! నాతండ్రిని చంపి, అన్నను అడవులపాలు చేసింది చాలక పుండుమీద కారంజల్లినట్లు నన్ను సింహాసనం ఎక్కమంటావా! నీ ప్రకృతి తెలియక నిప్పులాంటి నిన్ను కొంగున కట్టుకున్నాడు మానాన్న. మా వంశానికి కాళరాత్రివినువ్వు. కౌసల్య, సుమిత్ర నీవంటి తల్లులుకారా! వారిగుండెలు ఎంతగా విలవిలలాడుతాయి పుత్రవియోగంతో.

కన్నతల్లికంటె నిన్ను ఎక్కువగా చూసేవాడే రాముడు. తోడబుట్టిన చెల్లెల్ని చూసినట్లు నిన్ను చూసేది కౌసల్య. అటువంటి తల్లి కొడుకుని వల్కలాలతో అడవికి పంపాలనే పాపపు తలంపు ఎలా పుట్టింది నీతలలో. మా వంశానికి ప్రళయం

పురుషోత్తములైన రామలక్ష్మణులు లేకుండా రాజ్యం ఏలేశక్తి నాకెక్కడిది. రాజ్య భారం వహించగల సామర్థ్యం, ఓజస్సు నాకెక్కడివి! ఒకవేళ ఉన్నా నీవంటి పాపిష్ఠిదాని కోరిక నెరవేర్చడానికి నామనస్సు అంగీకరించదు.

మా రాముడు నిన్ను తల్లిలా చూస్తూండడంవల్ల యింతవరకూ ఆగాను. లేకపోతే ఏనాడో నిన్ను విడిచేవాణ్ని.

జ్యేష్ఠుడు సింహాసనం ఎక్కడం ఇక్ష్వాకుల ఆచారం. ఆ ఆచారాన్నిత్రోసి రాజయే పాపినికామ. నీకు రాజధర్మం ఎలా తెలుస్తుందిలే. ధర్మరక్షణకే జీవితాలను అంకితంచేసే ఇక్ష్వాకుల సంప్రదాయం సర్వనాశనం చేయాలనుకున్నావు. అందుకు నేను తోడుపడతాననుకున్నావు. కాని అది సాగదు. ఇదిగో ఇదే నా ప్రతిజ్ఞ,

సర్వజనప్రియుడైన మా అన్నగారిని అడవినుంచి తీసుకొనివచ్చి సింహాసనం ఎక్కిస్తాను. లేకపోతే ఆయన పాదసేవతోనే జీవితం గడుపుతాను, అని తీవ్ర క్రోధంతో బుసకొడుతున్న పాములా శ్వాసవిడుస్తూ: ఓసీ దుష్టురాలా! ఇంతవరకూ ధర్మభ్రష్టురాలి వయావు. ఇప్పుడు నిన్ను రాజ్యభ్రష్టురాలిని చేస్తున్నాను. ఇక నీకు విషాదమే. భర్తృమాతుకీ! ఈ పాపాల ఫలాన్ని మహానరకాలలో అనుభవిస్తావు. శాశ్వతమైన అప కీర్తిని మూటగట్టుకున్న నీతో మాట్లాడినా పాపమే! నిన్ను చూచినా మహాపాతకం చుట్టుకుంటుంది.

కౌసల్య, సుమిత్ర యిద్దరే మాకు తల్లులు, నువ్వు లేవింక. నీవల్ల నీ పుట్టింటికి కూడా కళంకం వచ్చిపడింది. ధర్మపరుడయిన నీ తండ్రి అశ్వపతికూడా లోకనిందపాల యాడు. నీ కొడుకు మీద ప్రేమతో ఎదుటితల్లి గుండె చూడలేకపోయావు. అంగాంగాల నుండి హృదయం నుండి ఉద్భవించే బిడ్డమీద తల్లికిగల వాత్సల్యం ఎరుగవు నువ్వు.

"అంగాదంగాత్ సంభవసి హృదయా దధిజాయసే"

ఆవిడకు ఒక్కగా నొక్క బిడ్డ. వాణ్ణి దూరంచేశావు. ఆవిడకు కలిగించిన యీ దుఃఖానికి ఫలం అనుభవించక తప్పదు.

నేను నాన్నగారి అంత్యక్రియలు నిర్వర్తించి, అడవికివెళ్ళి రామభద్రునితెచ్చి సింహాసనం ఎక్కించి, వనవాసానికి పోతాను. నువ్వు వనవాసం చేస్తావో, ఆత్మహత్య చేసుకుంటావో అది నీయిష్టం, అని వేడినిట్టూర్పులు విడుస్తున్నాడు.

భరతునిరాక విన్న అమాత్యులందరూ అక్కడచేరి నిలవగా: ఆర్యులారా! నాకు రాజ్యవాంఛలేదు. నేను శత్రుఘ్నునితో మాతామహుల యింట వుండడంవల్ల యిక్కడి వార్తలేమి తెలియలేదు, అని తలవంచాడు

భరతుడు వచ్చాడని విన్న కౌసల్య, సుమిత్రతో అక్కడకు బయలుదేరుతూండగా, భరతుడే ఎదురయాడు. ఆవిడ మందిరద్వారంలో, శత్రుఘ్నసహితుడై.

వారినిచూచిన క్షణంలో కౌసల్యమూర్ఛపోగా వారిద్దరూ ఆమెను లేవనెత్తి గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. కొంతసేపటికి తేరుకొని కౌసల్య: నాయనా! మీ అమ్మదయవల్ల నీకు నిష్కంటకమయిన రాజ్యం లభించింది. నాబిడ్డ నారచీరలతో అడవులపాలయ్యాడు. నన్నుకూడా ప్రవాసం చెయ్యమంటే సుమిత్రతో కలిసివెడతాను. ధనధాన్యసమృద్ధమూ, గజ, రథ, అశ్వసంయుతమూ అయిన ఈరాజ్యం నీకు మీ అమ్మ సంపాదించిపెట్టిందయ్యా అని ఆవిడ నిష్ఠురంగా మాట్లాడుతూంటే భరతునిగుండె సూదులతో గుచ్చినట్లయింది.

ఆమె పాదాలమీద వ్రాలి: అమ్మా! నే నేపాపం ఎరుగను.
నాకున్న గౌరవప్రేమలు నువ్వెరుగవా? ఈవిషయం నాకే తెలిసివుంటే ఇంతవరకూ రానిచ్చేవాడినా, ఇది నా ఎరుకలోజరిగితే, తల్లీ! విను:

శాస్త్రమర్యాదను అతిక్రమించేవాడూ, విశ్రాంతిలోవున్న గోవును కాలితో తన్నేవాడూ, సేవకులచేత దుష్టకార్యాలు చేయించేవాడూ, ప్రజలనుండి పన్నులు పిండుకొని వారిని రక్షించలేని రాజూ, యజ్ఞంచేశాక ఋత్విక్కులకు దక్షిణలివ్వనివాడూ, యుద్ధభూమిలో వీరధర్మం ప్రదర్శించనివాడూ, ఏ గతులపాలవుతారో నేనూ అదే దుర్గతి పొందుతాను.

పరదారాసంగమం చేసేవాడు, సంధ్యాకాలంలో నిద్రించేవాడూ, భ్రూణహత్య చేసేవాడూ, వేదవిదులను హింసించేవాడూ, నిరంతరం ఆయుధధారియై అమాయకులను బాధించేవాడూ, అయోగ్యులకు దానం చేసేవాడూ, యిళ్ళు తగులబెట్టేవాడూ, తల్లిదండ్రులను నిందించేవాడూ, ఏ నరకయాతనలు అనుభవిస్తారో అవే నేనూ అనుభవిస్తాను, అని మళ్ళీ ఆవిడ కాళ్ళమీద పడ్డాడు.

భరతుడు నిర్దోషి అని ఆవిడకు బోధపడింది.

నాయనా! నా శోకంలోనేను నిన్ను అనకూడనిమాటలన్నాను, అని ఒడిలోకితీసుకుని ఓదార్చింది.

ఆరాత్రి గడిచింది. తెల్లవారేవరకూ ఆవిడ ఒడిలో నిద్రించిన భరతుని లేపి వశిష్ఠులవారు ఉత్తరక్రియలు నిర్వర్తించడానికి తీసుకువెళ్ళారు. తైలద్రోణంలోవున్న మృత దేహాన్ని రత్నపీఠం మీద ఉంచారు దాన్ని చూడగానే భరతుడు దుఃఖసాగరంలో మునిగాడు. నెమ్మదిగా తేరుకున్నాక, మృతదేహానికి స్నానాదులు పూర్తిచేసి, దశరథుని అగ్నిగృహం నుండి తెప్పించిన అగ్నితో హెూమాదికాలు నిర్వర్తించి, శరీరాన్ని శిబి కపైవుంచి, రాజలాంఛనాలతో శ్మశానానికి తీసుకువెళుతూ, దారిపొడుగునా వస్త్రాలూ, బంగారునాణెములూ వెదజల్లుతూ, గమ్యస్థానావచందన, దేవదారుకాష్ఠాలతో చితిపేర్చి, వేదవేత్తలు సామపఠనం సాగిస్తూండగా నిప్పు ముట్టింపించారు. ప్రేతం పూర్తిగా దహనం కాగానే అందరూ, అంతఃపుర స్త్రీలతోసహా, సరయూనదికివెళ్ళి నివాపాంజలు లిచ్చారు.

పదిరోజులూ యథావిధి కర్మలుజరిపి, పన్నెండవనాడు గోదానాలు, భూదానాలు, హిరణ్యదానాలతో విశేషంగా అన్నదానం జరిపి, పదమూడవరోజున శోధనకార్యం పూర్తి చేసి, అక్కడే విలపిస్తూ; తండ్రీ! నన్ను ఏకాకినిచేశావు, అన్నయ్య అడవికి వెళ్ళాడు. అమ్మ, కౌసల్యతోపాటు ఈ అయోధ్యావాసులందరినీ అనాథలను చేశావు, అంటూ నేలవాలాడు.

శత్రుఘ్నుడూ అదే దశలోపడగా, మంత్రులందరూవెళ్ళి వారిని లేవనెత్తారు. భరతుడింకా అదే దశలోఉండగా వశిష్ఠులవారు వెళ్ళి: నాయనా! ఇంకా అస్థి నిమజ్జనం వుంది, ఈరోజు అది పూర్తికావాలి. పుట్టిన ప్రతిప్రాణికీ తప్పని యీస్థితికి విచారం దేనికయ్యా, నడు. నడు విధ్యుక్తం పూర్తిచెయ్యాలి, అన్నారు.

శోకసంతప్తుడయివున్న శత్రుఘ్నుని ఓదార్చాడు. సుమంత్రుడు. కర్మపరిపూర్తి కాగానే అందరూ రాజమందిరం చేరారు. అప్పుడు శత్రుఘ్నుడు :

మహారాజు మరణం సహజం. కాని సమర్థుడయిన అన్నగారు అడవులకు వెళ్ళ టం, నిగ్రహించగలిగిన లక్ష్మణుడు మౌనం వహించడం నాకు నచ్చలేదు. అంటూండగా, సువర్ణాభరణాలతో, చీనిచీనాంబరాలతో, మంచి గంధపు పూతతో ద్వారంలో నిలబడింది మంథర, బంగారుతాళ్ళతో కట్టబడిన కోతిలా వున్న ఆమెను ముందుకుతోసి ద్వారపాలకుడు :

ఈ దారుణానికి మూలకారణం యిదిగో ఈ పాతకి, అన్నాడు.

మంథర జుట్టుపట్టి శత్రుఘ్నుడు నేలమీద పడగొట్టి శోకావేశంలో పాదతాడనం చేస్తుంటే భయత్రస్తలయిన పరిచారికలందరూ కౌసల్యచాటున చేరారు. కైకకూడా గజగజ లాడుతూ భరతునివెనుక చేరింది. అప్పుడు భరతుడు :

తమ్ముడూ! ఎన్నిపాపాలుచేసినా అబలను చంపరాదని శాస్త్రమర్యాద. పైగా వీరిద్దరినీ, మనం వధిస్తే అన్నయ్య మనలను స్త్రీఘాతుకులనీ, మాతృఘాతుకులనీ నింది స్తాడు, అనటంతో శత్రుఘ్నుడు మంథరను రెక్కపుచ్చుకుని విసిరేశాడు. అది వెళ్ళి కైక పాదాలమీద పడింది.

మరునాడు రాజ్యాధికారులందరూ భరతుని సమీపించి : ఆర్యా! సర్వప్రజారంజ కుడయిన రామచంద్రుని అడవులకుపంపి మహారాజు స్వర్గంచేరాడు. క్షణంకూడా సింహా సనం రాజశూన్యంగా ఉండరాదు. కనుక దాన్ని అధివసించడానికి అర్హులయిన మీరు పట్టాభిషిక్తులు కావాలి. అందుకవసరమైన ప్రయత్నాలన్నీ పూర్తిచేశాం, అనగానే వారి వెంటనడిచి భరతుడు అభిషేక కలశానికి ప్రదక్షిణించి :

జ్ఞానమాన్యులయిన మీరు నా స్వభావం ఎరుగనివారు కారు. ఈ సింహాసనం రామభద్రుడే అధివసించాలి. నేనువెళ్ళి ఆయనను తీసుకొనివచ్చి పట్టాభిషేకం జరిపించి, వనవాసం నేను చేస్తాను. తక్షణం యాత్రామార్గం సరిచేయించండి, అన్నాడు.

భరతుని త్యాగబుద్ధిని కొనియాడి వారందరూ తిరిగివెళ్ళి చెట్లునరికి బాటలు సరిచేసి కనక స్థపతులకు, భరతుని ఆజ్ఞ అందించారు. అయోధ్యనుండి చిత్రకూట పర్యంతం అయోధ్యఅంతా తరలడానికి అనువుగా మార్గం సుగమం చేస్తున్నారు.

వేకువవేళ వంది మాగధులు భరతుని సౌధద్వారంలో మంగళగీతాలు పాడు తున్నారు. కనులువిచ్చి భరతుడు శత్రుఘ్నునిచేరి : తమ్ముడూ! యిద్దరు స్త్రీలదుర్బుద్ధి ఎటువంటి విపత్తులు తెచ్చిపెట్టిందో! రాజ్యలక్ష్మి అనాథయింది, అని విలపించాడు.

ఆ ఆర్తనాదం అంతఃపురం అంతనూ శోకసాగరంలోముంచింది. అదివిని వశిష్ఠులు రాజసభాభవనం తెరిపించి. తన స్వర్ణపీఠం అధివసించి, అమాత్యులతో రాజ భృత్యులందరినీ రమ్మని ఆజ్ఞాపించాడు. భరత శత్రుఘ్నులు సుమంత్రసహితులై సభా భవనం ప్రవేశించారు. అందరూ రాజోచితప్రశంసలతో భరతుని కీర్తించారు.

కులగురువులు వశిష్ఠులు లేచి :

నాయనా! మహారాజు దివంగతుడయాడు. సింహాసనాధికారి రామభద్రుడు పితృ వాక్పాలనకు అడవికి వెళ్ళాడు. ఇప్పుడీ సింహాసనం నువ్వు అధివసించాలి, ఈ ప్రజా రక్షణభారం వహించాలి, అన్నారు.

భరతుని గుండె శోకభారంతో కుంచించుకుంది. కన్నులుమూసి, సర్వాత్మనా రాముని స్మరించి : వశిష్ఠమహర్షీ! బ్రహ్మచర్యవ్రతంతో, సర్వవిద్యాపారంగతుడై, ధీశాలిగా ప్రజా హృదయాలను ఆకర్షించిన రామచంద్రుని రాజ్యం హరించమని ఆదేశిస్తున్నారా! దశరథుని కుమారుడైన భరతుడు ఈ అకార్యం చేస్తాడనే అనుకుంటున్నారా! ఈ రాజ్యమూ, నేనూ రామచంద్రుని కన్నుసన్నలలో నడవ వలసిన వారము. దశరథమహారాజు పాలించిన ఈ రాజ్యాన్ని రాముడే పాలించాలి. దిలీపాది మహామహులతో సమానుడైన రాముడే రాజు కావాలి. నాతల్లిచేసిన పాపానికి నన్ను కర్తను చెయ్యకండి. అడవిలోవున్న రామచంద్రునికి యిక్కడనుండి నమస్కరిస్తున్నాను, అన్నాడు.

సభాసదులందరూ భరతునిమాటలతో ఆశ్చర్యచకితులై, ఆనందబాష్పావృత నయను లయారు. అప్పుడు భరతుడు:

నేను బయలుదేరి అడవికివెళ్ళి రామచంద్రుని తీసుకొనివస్తాను. ఆయన రాకపోతే నేనుకూడా అడవిలోనే ఉంటాను. చతురంగబలాలతో అయోధ్యావాసులందరూ ప్రయాణా నికి సిద్ధంకావాలి. అందరం వెళ్ళి ఆయనను తీసుకువద్దాం, అని సుమంత్రునివైపు తిరిగి అంతఃపురజనం ప్రయాణం చెయ్యడానికి అవసరమైన వాహనాలు పంపించండి, అన్నాడు.

తెల్లవారుతూండగా భరతుడు తనరథం ఎక్కాడు. చతురంగ బలాలూ ప్రయాణ సన్నాహంలో వున్నాయి. కౌసల్య, కైకేయి, సుమిత్ర సముచితవాహనా లధిరోహించారు.

జాబాలి, వామదేవ, వశిష్ఠాది గురువులందరు వచ్చారు. మంత్రి సామంతజనం వాహనాలమీద సిద్ధంగా వున్నారు. సుమంత్రుడు గుర్రాలను అదిలించాడు. రథం కదిలి, ప్రొద్దు గ్రుంకుతూండగా గంగ ఒడ్డుకు చేరింది. ఆరాత్రికి అక్కడ అందరూ విశ్రమించడానికి నిశ్చయించుకున్నారు.

చతురంగబలాలు వస్తుంటే రేగినధూళిని చూచి గుహుడు, తనజనం అందరినీ అప్రమత్తులుగా ఉండవలసిందనీ, గంగాతీరం అంతా నావలతో ఆయుధాలతో ఉండాలనీ చెప్పి, తన ఆత్మీయులు కొందరిని వెంటబెట్టుకుని భరతుడు విడిదిచేసిన ప్రదేశానికి చేరి, అక్కడ ద్వారపాలకునితో :

ఓయీ! నువ్వువెళ్ళి భరతుడితో యిలాచెప్పు. మీ రామభద్రుడి ప్రాణమిత్రుడు గుహుడు కానుకలు తెచ్చి ఆజ్ఞకోసం వేచివున్నాడు, అని అనగా వాడువెళ్ళి అనుమతి తెచ్చాడు.

గుహుడు లోపలకువెళుతూనే భరతునికి రాజమర్యాదలన్నీ జరిపి: ప్రభువులు. ఈ కానుకలు స్వీకరించండి. మాకు ఒక్కముక్క కబురుచేస్తే మీకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసేవారం. ఇక్కడ దారులన్నీ కంటకాలతో, రాళ్ళతో వుంటాయి. మీరు ఈరాత్రి కిక్కడ విశ్రమించండి. ఉదయం గంగ దాటవచ్చు, అన్నాడు.

గుహుని పలుకులలోనే వాని గుండెలోతు పసిగట్టిన భరతుడు: ఓ నిషాదచక్రవర్తీ! నాకు పరమపూజ్యుడైన రామభద్రుని ఆప్తమిత్రుడవు. మేమందరమూ నీసాయంతో గంగ దాటి భరద్వాజులవారి ఆశ్రమం చేరాలి. ఇక్కడకది ఎంతదూరం ఉండవచ్చు, అని అడిగాడు.

గుహుడు: ప్రభూ! మాకీ అడవిఅంతా కొట్టినపిండి. నా అనుచరులతో నేను కూడా నీవెంట ఉండి తీసుకువెళ్ళగలను. అయితే ఒక్కమాట, ఈ సేనలూ, ఈ జనం అంతా చూస్తూంటే నాకు సందేహం కలుగుతోంది.

భరతుడు: మిత్రమా! నువ్వుకూడా శంకించడం నాకు చాలా బాధగాఉంది. నాకు పరమగురువు పితృతుల్యుడు రామభద్రుడు. ఆయనను అయోధ్యకు తీసుకువెళ్ళ డానికి వస్తున్నాను.

గుహుడు: అయాచితంగా లభించిన రాజ్యాన్ని వదులుకోగల గుండె నీలోనే ఉంది. నీవంటి తమ్ముడు ప్రపంచంలో ఉండడు. నీకు నమస్కారం.

ఇలా వారు ప్రసంగించుకుంటుండగా చీకటి దట్టమైంది. భరత శత్రుఘ్నులు గుహునితోకలిసి ఒక్క మారు తాము విడిదిచేసిన ప్రదేశంఅంతా తిరిగివచ్చి విశ్రమించారు. పరివారమంతా ప్రయాణశ్రమతో గాఢంగా నిద్రిస్తున్నది. భరత, శత్రుఘ్నులను కంటిమీద రెప్పవాలలేదు. వారిద్దరూ గుహునిదగ్గరకు వెళ్ళారు.

సీతారామలక్ష్మణులు వనవాసానికి వచ్చినవాటిరాత్రి ఎక్కడ పరున్నదీ, ఎలా గడిపినదీ, ఆరాత్రి లక్ష్మణుడు నిద్రపోకుండా తనతో మాట్లాడిన విషయాలూ చెప్పి, మరునాడు వారు జటాధారులైన సన్నివేశాన్ని వివరిస్తుండగా భరతునిగుండె అంకుశంపోటు తిన్న మత్తేభంలా విలవిలలాడింది. ఆస్థితిచూసిన గుహుడు భూకంప వేళ మహావృక్షంలా

ప్రకంపించాడు. శత్రుఘ్నుడు భరతుని కౌగలించుకొని గుండె బద్దలయేలా విలపించాడు. అది విని స్త్రీలందరూ విచారంతో పరుగు పరుగున వచ్చారు. దుర్భరవిషాదంతో స్మృతి తప్పిన భరతుని తనఒడిలోకి తీసుకుంది కౌసల్య. లేగదూడను పాకేగోవులా కౌసల్య భరతునివెన్ను నిమురుతూ: ఏవిరా! ఏమైందిరా నాయనా! మాకూ, ఈ రాజవంశానికీ నువ్వేదిక్కు. నీమీదే మా అందరి బ్రతుకులూ వున్నాయిరా. మీ నాన్నగారిలా నువ్వు కూడా మమ్మ గంగలో ముంచిపోకు అని విచారిస్తున్నది.

నెమ్మదిగా భరతుడు కోలుకుని లేచి, గుహునిచేరి, ఆరాత్రి యింకా ఏమి జరిగింది, అని అడిగాడు.

అప్పుడు గుహుడు: ప్రభూ! వారికోసం మంచిరుచిగల ఫలాలూ, ఆహారం సిద్ధంచేయించాను. కాని రామభద్రుడు వనవాసవ్రతాని కిటువంటి ఆహారం నిషిద్ధం అని, లక్ష్మణునిపంపి గంగాజలం తెప్పించాడు. ఆ పూటకు సీతారాములు గంగాజలమే తీసుకున్నారు. లక్ష్మణుడూ అంతే. అనంతరం ఈ ఇంగుదీవృక్షం నీడలో పర్ణశయ్య సమకూర్చాడు లక్ష్మణుడు వారికి. ఆరాత్రి తెల్లవారేవరకూ లక్ష్మణస్వామి ఇక్కడే బాణంసంధించి వారి రక్షణభారంతో కన్నుమూయ్యకుండా వున్నారు. ఆయనతో నేనూ మాపరిజనం జాగరూకులమై వున్నాం. అని చెపుతూంటే, భరతుడు ఆ పర్ణశయ్యను చూసి కంటతడి పెట్టాడు.

హంసతూలికాతల్పాలమీద, చందనాగరుధూపవాసనలలో, శీతాతపబాధలేని మందిరంలో నిద్రించవలసిన ఇక్ష్వాకువంశీయుడు ఈ కటికనేలమీద పరుండవలసి వచ్చింది. ఈస్థితి తలుచుకుంటే తలతిరుగుతోంది. విధి ఎంతబలీయమైనదో! విదేహ రాజపుత్రి, దశరథుల కోడలు, ఈ గడ్డిమీద పరున్నది. ఇదిగో ఈ పరకలమీద పట్టుదారాలు.

మా వదిన ఆరాత్రి తనఆభరణాలు తీసినట్లులేదు. ఆవిడ నగలగుర్తులివిగో. ఎంతటి దయనీయదశ. ఇంతకూ నేను కారణం. అన్నగారిని సేవించే అదృష్టం లభించిన లక్ష్మణుడు ధన్యుడు.

మహారాజు దివంగతుడయాడు. రాజుకావలసిన రాముడు అడవికి వెళ్ళాడు. అయినా శత్రురాజు ఒక్కడూ ఈ రాజ్యం ఆక్రమించడానికి రాలేదు అంటే ఎంతవిపరీత దశలోవున్నదో ఈరాజ్యలక్ష్మి! శత్రువుకూడా కోరనిదయింది అయోధ్యానగరం అని భరతుడు కొంత సేపు ఏడ్చి,

ఓ పౌర జానపదులారా! ఇదే నా ప్రతిజ్ఞ. ఇది మొదలుగా నేను జటాధారినై నారచీరలుకట్టి, గడ్డిపరకలమీదనే శయనిస్తాను. కందమూలఫలాలు ఆరగిస్తూ వనవాస దీక్షతో ఉంటాను. రామభద్రుని అయోధ్యాధీశునిగా పంపుతాను. అందుకు ఆయన అంగీకరించకపోతే ఆయనతో నేనూ అడవిలోనే గడుపుతాను, అన్నాడు.

క్రమంగా చీకటి జారుకుంది, వేకువవెలుగులు గంగాతరంగాలలో రజితకాంతు లీనుతున్నాయి. రాత్రి కన్నుమూతపడని శత్రుఘ్నుడు గంగాతరణానికి గుహుని తొందరపెట్టాడు.

అయిదువందలనావలు గంగఒడ్డున అలంకృతములై వున్నాయి. అన్నిటిమీద స్వస్తికచిహ్నాలు, వివిధవర్ణశోభితపతకాలు, గణగణధ్వనుల ఘంటలు, ధవళవర్ణ కాంతులీనే తెరచాపలు. అందులో రాజకుటుంబానికి ప్రత్యేకం సిద్ధంచేయించి నావ దగ్గర గుహుడు నిలబడి భరత, శత్రుఘ్నులనూ, కౌసల్యాది అంతఃపురజనాన్నీ ఎక్కించాడు. నావలు బయలుదేరేవేళకే గుర్రాలూ, ఏనుగులూ నదిలో ముందుకు సాగుతున్నాయి. గుహుని ఆజ్ఞతో నావలు కదిలాయి. అవ్వలిఒడ్డుకు చేరాయి. అందరూ ముందుకు సాగుతున్నారు.

## భ ర ద్వా జు ల వి ం దు

భరద్వాజమహర్షి ఆశ్రమం అల్లంతదూరంలో ఉండగానే, సేనలనూ, పరిజనులనూ, ఆపి, శత్రుఘ్నునితో కొందరు మంత్రులను వెంటబెట్టుకుని భరతుడు ఆశ్రమద్వారం చేరి, అక్కడ మంత్రులను నిలిపి, కులగురువులు శ్రీవశిష్ఠులను ముందుంచుకొని భరద్వాజుల సమీపానికి వెళ్ళాడు.

వశిష్ఠులవారిని చూస్తూనే భరద్వాజుడు సంతోషంతో ఎదురువెళ్ళి, శిష్యులు కొని వచ్చిన ఆర్ఘ్య, పాద్యాదు లర్పించి, ఆయనకు సుఖాసనం చూపించాడు. భరతుడు కుల గోత్రాలు చెప్పుకు నమస్కరించాడు. వానికికూడా అర్ఘ్య, పాద్యాదులూ, ఫల, పుష్పాలూ యిచ్చి, కుశలప్రశ్నలు అడిగాడు. దశరథుని ప్రస్తావన రాకుండా ఆ ప్రసంగం ముగిసింది. భరతుడుకూడా వారి కష్టసుఖాలన్నీ అడిగాడు. అనంతరం భరద్వాజుడు :

నాయనా! రాజ్యపాలనంవిడిచి యిలా వచ్చావేం! కౌసల్యా నందనుడు సర్వప్రజా హృదయ రంజకుడు. అయినా కామమోహితుడైన తండ్రి నిష్కారణంగా వానిని వన వాసానికి పంపించాడు. రాజ్యం నిష్కంటకంగా వుంటుందని వారిని వధించడానికి నువ్వు వెళ్ళడం లేదుకదా? అని ప్రశ్నించాడు.

మహర్షినోట ఆమాట వెలువడడంతో భరతునికన్నులు అశ్రుపూరితాలయాయి. గొంతు గద్గదమై, గుండె జివ్వునలాగింది. కొద్దిక్షణాలు దించిన తలయెత్తలేక, అలావే వంగి నిలబడి :

మహర్షీ! మీరుకూడా నన్ను శంకిస్తున్నారా? అనుశాసింపవలసిన మీరు అను మానిస్తున్నారా? ఈ విపరీతం అంతా నా పరోక్షంలో నాకు తెలియకుండా జరిగింది: మా అమ్మచేసిన నేరానికి నేను బాధ్యుడినా? ఆ పాపానికి ప్రాయశ్చిత్తంగా నేను రాముణ్ని ప్రార్థించి అయోధ్యకు తీసుకురావడానికి వెడుతున్నాను. ప్రస్తుతం మా అన్నగారు ఎక్కడ ఉన్నారో చెపితే....అని ఆగాడు.

వశిష్ఠులవారుకుడా భరతుని నిర్మలహృదయాన్ని వివరించిన అనంతరం భర ద్వాజులు: రఘువంశీయుడవు అనిపించుకున్నావు. సంతోషం. ప్రస్తుతం రామభద్రుడు చిత్రకూటంమీద నివసిస్తున్నాడు. మీరు ఈరాత్రికి ఇక్కడఆగి, ఉదయం వెళ్ళవచ్చు, అన్నారు.

మహర్షీ! ఫలపుష్పాలతో మీరిచ్చిన ఆతిథ్యం మాకు తృప్తికలిగించింది. అని భరతుడు చేతులుజోడించగా భరద్వాజుడు: నువ్వు అల్పసంతుష్టుడవని నాకు తెలుసునయ్యా! నీతోవచ్చిన పరివారానికీ, సేనకూ భోజనం పెట్టాలనివుంది. నువ్వు వారందరినీ తీసుకు రాక ఒంటరిగా వచ్చావేం!

భరతుడు : మహర్షీ! ఆశ్రమపరిసరాలకు సేనలనూ, యోధులనూ ప్రవేశించనివ్వ రాదుకదా! నావెంట చతురంగబలాలతో అయోధ్యాపౌరులందరూ వున్నారు.

భరద్వాజుడు : అందుకేనయ్యా! ఆతిథ్యం యిస్తానన్నాను, రప్పించు సేనలు.

భరతుడు వార్త పంపాడు. భరద్వాజుడు అగ్నిహోత్రశాలలో ప్రవేశించి, ఆసనం మీద కూర్చుని, ఆచమనం చేసి, ప్రశాంత మనస్కుడై విశ్వకర్మనూ, ఇంద్రాదిపాలకు లనూ, ఘృతాచి, విశ్వాచి, హేమ, సోమ ఆదిగాగల అప్సరసలనూ, గంధర్వ గాయకు లనూ ఆహ్వానించాడు.

మహర్షి ఆజ్ఞానుసారం విశ్వకర్మ కోసలసేనలకూ, రాణివాసానికీ యోగ్యమయిన భవనాలు నిర్మించాడు. ఆ భవనాలకు అవసరమయిన క్రీడావనాలు, సరోవరాలు కల్పిం చాడు, నదీదేవతలను ఆహ్వానించి మధు, క్షీర, ఇక్షురసపాత్రలు భవనాలలో ఉంచాడు, కుబేరుని కనుసన్నతో భూషణాలూ, చీనాంబరాలూచే రాయి. సోముడు పంచభక్ష్యాలూ

సంపన్నంచేశారు. ఎవరి రుచికి తగినట్లు వారికి మాంసభోజనాలు ఏర్పాటయ్యాయి. ఉచ్చారణదక్షుడయిన భరద్వాజుడు అగ్ని గృహంలో ప్రాఙ్ముఖంగా పద్మాసనాసీనుడై మంత్రజపం సాగిస్తుండగా సర్వదేవతలూ అవశ్యకార్యాలన్నీ నిర్వర్తించారు: వాయువు సేనానివహానికి సుగంధపవనాలతో సేవచేయించాడు. ఆ గాలిలో పూలవాన కురిసింది.

గంధర్వగానంతో అప్సరోభామలు నృత్యంచేస్తూ అతిథులకు శ్రవణ, నయన తర్పణం కలిగిస్తున్నారు. అయిదు యోజనాల విస్తీర్ణంలో మహానగరం వెలిసింది. వరి నరాలన్నీ పచ్చికబయళ్ళతో, మామిడితోటలతో, బారులుతీర్చిన రమణీయ వృక్షపంక్తులతో, అశ్వ, గజశాలలతో, నున్నని బాటలతో, తోరణాలంకృత సౌధాలతో, అన్నిటిమధ్య కల ధౌత కాంతులతో రాజమందిరంతో అమరావతి వంటి మహానగరంగా మారింది, మహర్షి తపోవనం

భరత, శత్రుఘ్నులు మంత్రిసహితులై రాజమందిరం ప్రవేశించారు. ఆ భవన మధ్యంలో సభారంగం, అక్కడ సింహాసనం, ఛత్ర, చామరాలు, ఆ ఆసనం రామునిదిగా భావించి భరతుడు దానికి నమస్కరించి పక్కగా నిలబడ్డాడు చతుర్ముఖ ప్రజాపతి. సమక్షంలో నాట్యంచేసే ఘృతాచి, హేమ, ఆదిగాగల భరతశాస్త్ర కళాకోవిదుల గజ్జెల ధ్వనులు, తుంబుర, నారదుల వీణానాదం....అన్నీ సాగుతుండగా సేనలకు సురాభాండాలు, భోజనపాత్రలు సన్నద్ధం అయ్యాయి. అందరూ అన్నీ మరిచిపోయి, భరద్వాజులవారి ఆతిథ్యంలో అలసి, సొలసి: మనం ఇక్కడే వుండి పోదాం. అయోధ్యా వద్దు, దండ కారణ్యమూ వద్దు, అంటూ పాటలు మొదలు పెట్టారు.

ఇదే స్వర్గం. మనం స్వర్గంలో వున్నాం-అంటూ ప్రలాపించి, విహరిస్తున్నారు.

పాయస సరోవరాలు, మైరేయస్రోతస్వినులు, ఇక్షురసఝురులు, అన్నపర్వతాలు, క్షీరవర్షధారలు....అందరూ త్రేనుపులు వచ్చేవరకూ ఆరగించి, ఎవరి శయ్యలపై వారు విశ్రమించడానికి ప్రయత్నించారు. శయ్యలమీదనే విశ్రమించారో, క్రిందనే దొర్లినారో....

వేకువ వెలుగులు వస్తుండగా వారికి దంతధావనసామగ్రి సన్నద్ధమయింది. కల గని మేల్కొన్నట్లు కనులు నులుముతూ లేస్తున్నారు. రాత్రి ధరించిన వస్త్రాభరణాలూ, అంగరాగాలూ అలానే వున్నాయి. గంధర్వగానం, అప్సరసలనాట్యం.... అంతా కలలా వుంది. వారెవరూ లేరు, భవనాలు లేవు. అంతా స్వప్నం అయింది వారికి.

తన దర్శనానికి వచ్చిన భరతునితో భరద్వాజుడు : నాయనా! మీ అందరికీ మా ఆతిథ్యం తృప్తి కలిగించిందా? అని ప్రశ్నించాడు.

భరతుడు : మహర్షీ ! మీ అనుగ్రహంవల్ల మావారందరూ సర్వశ్రమలూ మరచి పోయి రాత్రి హాయిగా గడిపారు. మాకు సెలవిస్తే వెళ్ళి అన్నగారి దర్శనం చేసుకుంటాం. మేం ఏదారిన వెళ్ళాలో చెప్పండి.

భరద్వాజుడు : నాయనా! ఇక్కడకు మూడున్నర యోజనాల దూరంలో మందాకిని ఒడ్డున చిత్రకూటం వున్నది. సుందరమయిన వనాలు, స్వాదుజలపూరితమయిన సెలయేళ్ళు. అక్కడ వుంటారు సీతారామలక్ష్మణులు.

మహర్షి వద్ద సెలవుతీసుకుని భరతుడు వెళ్ళబోతుండగా, కౌసల్య, సుమిత్ర వచ్చి మునికి ప్రదక్షిణంచేసి నమస్కరించి నిలబడ్డారు. అనంతరం కైకేయి వచ్చి పాదాభివాదం చేసి తలవంచుకు వెళ్ళి భరతుని ప్రక్కగా నిలబడింది.

భరద్వాజుడు : నాయనా! ఈ మాతృమూర్తులెవరో చెప్పావుకాదు.

భరతుడు : మహాత్మా ! నిరాహారదీక్షతో కృశించి, శోకభరహృదయంతో నిలచిన యీ దేవి దశరథుల పట్టమహిషి, పురుషసింహుడయిన రామభద్రుని కన్న తల్లి. ఆవిడకు ఎడమప్రక్కన నిలిచిన తల్లి, పూలురాలిన కర్ణికారవృక్షశాఖవలె నున్న ఆవిడ మా లక్ష్మణ, శత్రుఘ్నుల మాతృదేవి. ఇక ఈవిడ : పుత్రవియోగ దుఃఖంతో మహారాజు దివంగతుడుకావడానికీ, పురుషశ్రేష్ఠుడయిన రామభద్రుడు అడవులపాలవడానికీ, కోసల రాజ్యం అనాథ అవడానికీ కారణభూతమయిన పాపిష్ఠి వాంఛలుకల మూర్ఖురాలు కైకేయి - నా తల్లి.

భరద్వాజుడు : నాయనా ! ఎందుకంతగా నిందిస్తావు. కంటతడి పెట్టకు. రామభద్రుని వనవాసం దేవతలకూ, మునులకూ కల్యాణప్రదం.

అనంతరం అందరూ మహర్షి అనుమతితో ఆశ్రమం విడిచి రామదర్శనార్థం బయలుదేరారు.

వర్షావేళ వినీల మేఘాలు ఆకాశాన్ని అలుముకొన్నట్లు భరతుని సేనలు ఆ మహారణ్యాలను ఆక్రమించుకు వెడుతున్నాయి. భరద్వాజుల సంకేతానుసారం నడిచి నడచి చిత్రకూటగిరిని దూరాన చూస్తూనే, భరతుడు కులగురువులతో : మహర్షీ ! అదే చిత్రకూటంవలె వున్నది. అదిగో మందాకిని, దానిప్రక్కనే నీలమేఘసదృశంగా వనం. పూల వానసలు, మయూర క్రేంకారాలు, చల్లగాలులు, మహర్షి మండలానికి స్వర్గతుల్య మయిన ప్రాంతం. మన సేనలలో నిపుణులయినవారు వెళ్ళి ఈ పరిసరాలలో రామభద్రు డెక్కడ వున్నది చూసివస్తారు, అన్నాడు.

భరతుని నోటిమాట వింటూనే పరిజనం అన్వేషణకు బయలుదేరారు. అందులో కొందరు తిరిగివచ్చి : ప్రభూ ! అదిగో అటుచూడండి, ఆకాశంలో ధూమ రేఖలు, ఆశ్రమ వాసులు వెలిగించిన అగ్నినుండి వెలువడే పొగఅది. ఆ పరిసరంలో ఋషివాటిక ఉండ వచ్చు, అన్నారు.

భరతుడు శత్రుఘ్నసహితుడై సుమంత్రుని వెంటబెట్టుకుని ఆ పొగవచ్చే దిక్కుగా సాగివాడు.

ఆ సమయానికి చిత్రకూటగిరిమీద విహరించే రాముడు: జానకీ ! ఆకాశాన్నితాకే ఆ శిఖరం, దానిమీద బారులుతీర్చినట్లున్న వృక్షాలు, వాటికొమ్మలపై కలకూజితాలతో పక్షులు, మామిడి, నేరేడు, పనసచెట్లు ఫలభారంతో ఎలా వంగివున్నాయో.... ఈ గిరి సానువులమీద కిన్నెర, విద్యాధర దంపతులు విలాసక్రీడలు సాగిస్తారు. ఈ పరమ రమణీయ ప్రాంతంలో లక్ష్మణుడు మనకు తోడుగా ఉంటే అయోధ్యకు వెళ్ళాలనే అనిపించడం లేదు. ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా యిక్కడ సుఖంగా గడపగలను. ఈ వనవాసంవల్ల పితృఋణం తీరుతుంది. భరతునికి ప్రీతినికలిగించిన వార మవుతాం. అంతకంటే నీతో స్వేచ్ఛగా ఈ మనోహర ప్రకృతి రామణీయకాన్ని తిలకిస్తూ విహరించే అదృష్టం లభించింది. నడు, మందాకినీ సికతా తలాల మీద సాగుదాం.

చూశావా ! జల పక్షులతో, వివిధ వర్ణాల పుష్పశోభతో కుబేరుని ఉద్యానవనంలోని సరోవరంలా వుంది. ఆ ఎగువన చూశావా, మృగయూధాలు విహరించి కల్లోలం చేశాయి. నీరంతా బురదయింది, ఇటుచూడు, మహర్షులు పరిశుద్ధస్నాన శుభ్రులై చేతులు పైకెత్తి సూర్యోపాసన చేస్తున్నారు. జానకీ ! రంగురంగుల పూలతో నిండిన చెట్లు, ఆ చెట్లను ఆధారమయిన చిత్రకూట పర్వతశ్రేణి ప్రక్కగా ఈ మందాకిని, ఇక్కడ నీతో వనవిహారం, అయోధ్యకంటే ఇక్కడ ఎంత హాయి. కొంచెం ముందుకు నడు, అక్కడ నీరు స్వచ్ఛంగా వుంది. అక్కడ మనం స్నానం చేద్దాం, అని పంచె పై కెగగట్టి నదిలో అడుగుపెట్టాడు.

స్నానానంతరం ఉభయులూ ధౌతవస్త్రాలు ధరించారు. అక్కడే ఒక కొండరాతి మీద కూర్చుని, అగ్ని వ్రేల్చిన మాంసఖండాలు సీతకు రుచిచూపించి, తను కూడా ఆరగిస్తున్నాడు.

సరిగ్గా అదేసమయానికి భరతుని సేనలు ప్రవేశంతో చెల్లాచెదరయిన వన్యమృగాల పరుగులతో సైనికుల పదాఘాతాలతో రేగిన ధూళి ఆకాశాన్ని ఆవరించింది. అశ్వ, గజ పదధ్వని రాముని చెవి సోకగా :

లక్ష్మణా! మేమగర్జనలా మృగసమూహాలు ధ్వనిచేస్తున్నాయి. మృగరాజు విజృంభించగా ఏనుగులూ, అడవిదున్నలూ భయంతో రోదనంచేస్తూ పరుగుపెడుతున్నాయను కుంటాను. లేకపోతే మహారాజో. రాజపుత్రుడో వేటకు వచ్చివుండాలి. విషయమేమిటో చూపిరా, అన్నారు.

లక్ష్మణుడు సమీపంలో వున్న సాలవృక్షం చివరకొమ్మ ఎక్కి పరికించి దిగివచ్చి రామభద్రా! ఉత్తర దిక్కునుండి చతురంగబలాలతో ఎవరో వస్తున్నారు. తక్షణం అగ్నిని చల్లార్చి, మావదినగారిని ఈ గుహలో వుండమను, అనగా తమ్ముడూ! ఎందు కంత తొందర, ఆ సేన లెవరివో గుర్తుపట్టు, అన్నారు,

లక్ష్మణుడు నిశితంగా చూచి; అన్నా! అనాయాసంగా లభ్యమైన కోసల రాజ్య లక్ష్మిని అనుభవించడంతో తృప్తిపడలేదు కాబోలు ఆకైకకొడుకు. మనల్ని వధించడానికి సేనాసమూహంతో వస్తున్నాడు.

సేనాముఖంలో రథంమీద కోవిదారధ్వజం, ఆ రథం వెనుక అశ్వబలం, దాని వెనుక గజయూథం, ఆ వెనుక రథసమూహం హుఁ....మనం ధనుస్సులు ధరించి నిలబడి వాణ్ణి నేలకూలుద్దాం. భరతుణ్ణి వధించడం దోషంకాదు. వీడు కన్నుమూస్తే కైక ఏలుకుంటుంది రాజ్యం. వాడి సేనలలో మంటలు పుట్టించి, బూడిదచేస్తాను. అన్నాడు.

రాముడు : తమ్ముడూ! ఎందుకంత ఆవేశం. పితృవాక్యపాలనకోసం అడవికి వచ్చిన నేను భరతుని చంపి రాజ్యం ఎవరికివ్వను? నా తమ్ముళ్ళకు సుఖంకానిది ఏదీ నేను స్వీకరించను. ముల్లోకాలూ నాకు ధారవోసినా తృణప్రాయంగా వదలగలను.

అయితే భరతుడు మనకుకలిగిన క్లేశం విని చూడడానికి వస్తున్నాడనుకుంటా. వాడికి కష్టంకలిగే పనిచేయడం నాకిష్టంకాదు. ఎటువంటి విపత్తులు వచ్చినా కన్నతండ్రినీ, తోడబుట్టినవాళ్ళనీ చంపుకునే మానవు లుంటారా!

లచ్చీ! నీకు రాజ్య వాంఛవుంటే చెప్పు, భరతుడితోచెప్పి నీకే యిప్పిస్తాను.

ఈ మాటతో లక్ష్మణునిగుండె సిగ్గుతో ముడుచుకుపోయింది మళ్ళీ సైన్యం వైపు చూచి :

అన్నా! నాన్నగారుకూడా వస్తున్నట్టున్నారు. అదిగో ఆ రథం ఆయనదే.

రాముడు : మనకు నచ్చజెప్పి అయోధ్యకు తీసుకువెడదామని అందరూ వస్తున్నా రేమో. అదిగో మేలుజాతి గుర్రాలు రెండు ముందు, ఆ వెనకవే పితృపాదుల మత్తగజం శత్రుంజయం. తమ్ముడూ! దానిమీద శ్వేతచ్ఛత్రం లేదురా. నాకు సందేహంగా ఉంది - అని నిలబడ్డాడు. లక్ష్మణుడుకూడా రామునివక్కనిలిచాడు.

ఇక్కడ భరతుడు, నలుగురినీ నాలుగువైపులా వెదకమని తనుకూడా రాముని ఆశ్రమంకోసం వెదకుతూ వస్తున్నాడు. పర్ణశాల సమీపిస్తుండగా చెట్లకొమ్మలమీద నార చీరలు కనిపించాయి. దగ్గరగా వెళ్ళి పర్ణశాల చూసాడు. శత్రుఘ్నుడు, గుహుడు ఆదిగాగల వారందరూ అక్కడకే వచ్చారు. పర్ణశాల ప్రాంగణంలో విశాలమైన వేదిక, చుట్టూ కార్ముకాలు. భోగవతిలోని కోడెత్రాచులవంటి విచ్చుకత్తులు, చర్మకవచాలు, కుశాస్తరణం.

కృష్ణాజినం ఉత్తరీయంగా జటాధారియై రాముడు.

ఆ స్థితిలో రామునిచూసిన భరతుడు పట్టలేని ఆవేశంతో వెళ్ళి కాళ్ళమీదపడ్డాడు. శత్రుఘ్నుడూ అంతే చేసాడు. రాముడు వారిద్దరినీలేవదీసి గాఢాలింగనం చేసుకున్నాడు. వారిని తిలకించే గుహుడూ, సుమంత్రుడూ : ఓహో! సూర్యచంద్రులు శుక్ర బృహస్పతులను కలుసుకున్నా రనుకున్నారు.

రామచంద్రుడు భరతుని తనదగ్గరగా కూర్చుండబెట్టుకుని : తమ్ముడూ! నాన్నగారు కుశలమా? నువ్వు యిలా అడవికి వచ్చావేమిటి? నిన్నుచూసి చాలారోజులయింది. మహారాజును సేవిస్తూ అక్కడ వుండవలసినవాడివి, ఇలా ఎందుకు వచ్చావు?

ధర్మనిరతుడు, విద్వాంసుడు అయిన మన కులగురువులు వశిష్ఠులవారిని సేవిస్తూ వారి ఆదేశానుసారం వుంటున్నావా? నాన్నగారు క్షేమంగా వున్నారా? మా అమ్మ కుశలమా? పిన్ని సుమిత్ర క్షేమమేనా? మీ అమ్మ కైకేయి సుఖంగా వుందికదా? మన వంశహితవుకోరే పురోహితులను మర్యాదగా చూసుకుంటున్నావా? సేవకులను, వైద్యులను, వేదవిదులను అభిమానంతో ఆదరంగా గౌరవిస్తున్నావా? అస్త్రవిదుడు, అర్థశాస్త్రకోవిదుడు అయిన సుధన్వాచార్యులను ఉచితరీతిని సమ్మానిస్తున్నావా?

శూరులు, జితేంద్రియులు, వేద వేదాంగవిదులు, ఇంగితజ్ఞానులు అయిన వారితోనే మంత్రాలోచనం నడుపుతున్నావా? నిద్రనుంచి సకాలంలో మేలుకొని విధ్యుక్తాలు నెరవేర్చుకుంటున్నావా? రాజ్యవిషయాలలో నీ ఒక్కడి ఆలోచనే ఎంత అనర్థమో

అనేకులతో సంప్రదించడమూ అంతే ప్రమాదం. నీ మంత్రాలోచనం యితరుల ఊహకూ, అనుమానానికీ. వారి ఇంగితజ్ఞతకూ అందడంలేదుకదా. మూర్ఖులను చేరదీసి విద్వాంసులను దూరం చేసుకొవడంలేదుకదా. లక్షలాదిగా మనచుట్టూ మూర్ఖులు చేరుతారు. వీరెవరూ విషమదశలో మనవెంట వుండరు. శాస్త్రవిదుడయిన ధీరుడే నీ మంత్రాలోచనకు అవసరం.

సేవకులలో ఉత్తమ, మధ్యమ, అధమవర్గాల వా రుంటారు. అదికని పెట్టి వారిని ఆయా యోగ్యకర్మలలో ఉంచుతున్నావా. విశ్వాసనీయులనూ, పితృపితామహ పరం పరగా మనసేవలో ఉండేవారినీ ఉన్నతస్థానాలలో ఉంచాలి. ఆచారభ్రష్టుడైన యజమానిని ఋత్విజుడూ, బలాత్కరించిన పురుషుని స్త్రీ, ద్వేషభావంతోనే చూస్తారు. అలానే విపరీతంగా పన్నులుపిండే ప్రభువును ప్రజలు పరమ శత్రువుగా చూస్తారు.

కుటిలనీతి తెలిసి, సేవకులలో దోషాలేవడుతూ, నిరంతరం సంపదలకోసమే కృషి చేసేవారికి శిరశ్ఛేదం చేసెయ్యాలి. ధీమంతుడు, ధైర్యశాలి, కులీనుడు అయిన వాడే సేనాధిపతి కావాలి. ఆ సేనాపతి నీయందు అనురక్తితో ఉంటున్నాడా? యుద్ధకుశలురు, శూరులు అయి యిదివరలో తమ శక్తిసామర్థ్యాలు వినియోగించిన వారిని అవసరానుసారం సత్కారాలతో సన్మానించాలి సుమీ.

సేనలో అందరికీ సకాలంలో జీతభత్యాలు అందకపోతే చాలా ప్రమాదం సుమీ.

దూతలవిషయంలో చాలా జాగ్రత్తలుండాలి. వాడు మన దేశీయుడే కావాలి, విద్వాంసుడూ, ప్రతిభావంతుడూ, భరతశాస్త్రవిదుడూ కావాలి. మంత్రి, పురోహిత, యువరాజులనుతప్ప మిగిలిన ధర్మాధ్యక్ష, నగరాధ్యక్ష, ప్రాడ్వివాక, సేనానాయక, దండపాల, దుర్గపాల, కర్మాంతిక (రాజ్యభృతులకు జీతాలిచ్చేవాడు) కార్య నియోజక, (రాజాజ్ఞలను దేశమంతా ప్రచారంచేసేవాడు) దౌవారిక అంతర్వంశిక (అంతఃపుర నిర్వాహకుడు) ఆదిగాగల వారందరి ప్రవృత్తులనూ కనిపెట్టడానికీ చారులను నియోగించావా?

వేద వేదాంగజ్ఞానం లేక తర్కమే ప్రమాణంగా సాగేవారిని దరిజేరనివ్వకు. వ్యవసాయం, పశుపోషణ, వాణిజ్యం ప్రధానంగా జీవయాత్రసాగించే వైశ్యశిఖామణుల కష్టసుఖాలు స్వయంగా చూసుకుంటున్నావా? కేవలం వర్షంమీద ఆధారపడిన క్షేత్రాలేకాక నదీజల పరిపోషితాలైన భూముల పరిసరాలలో క్రూరమృగపీడ లేకుండా అక్కడి జానపదుల రక్షణ చూస్తున్నావా?

మత్తేభాలను పట్టడానికీ, జాత్యశ్వాలను ఆకర్షించడానికీ ఆడు ఏనుగులనూ ఆడగుర్రాలనూ జాగ్రత్తగా సమకూర్చుకుంటున్నావా?

విభూషితగాత్రుడవై, ప్రసన్నవదనంతో ప్రజానముదాయానికి అనుదినం ఉదయ కాలం దర్శనం యిస్తున్నావా?

రాజ్యంలో దుర్గాలన్నీ ధన, ధాన్య, సమృద్ధితో ఉంటున్నాయా? శిల్పకారులు. యంత్రనిర్మాతలు, ధనుర్ధారులు అసంతుష్టులుకాకుండా ఉంటున్నారా? వారిని యథో చితంగా సత్కరిస్తున్నావా? ధనాగారం అపాత్రులచేతులలో పడనివ్వకూడదు సుమా. ఆదాయాన్ని మించి వ్యయం పెరగకూడదని తెలుసుగా!

నీ రాజ్యంలో పవిత్రులూ, పూజ్యులూ, నిర్దోషులూ నిష్కారణంగా దండితులు కావడంలేదుకదా? దోషం నిరూపితమయాక సకాలంలో దోషిని దండిస్తున్నావా? ఏ ప్రలోభానికో లొంగి దండనీతికి దూరుడవవుతున్నావా? దోషిని సకాలంలో శిక్షించక పోయినా, నిర్దోషిని కారాగారం పాలుచేసినా అది రాజునీ, రాజవంశాన్నీ నాశనం చేస్తుంది.

పసివారినీ, వృద్ధులనూ, వైద్యులను ప్రేమ, స్నేహ, దానాలతో తృప్తిపరుస్తూ, గురువృద్ధ తాపస అతిథి దేవతా జనులకు తలవంచి చరించాలి.

ధర్మకార్యాలు ఉదయం సాగించాలి, అది విస్మరించి, ధనార్జనకోసం ధర్మం విడవడం మంచిదికాదు సుమా. అలాగే అర్థాన్ని సాధించవలసిన మధ్యాహ్నవేళ ఆ దృష్టి విడిచిపెట్టవుగా?

సుఖాభిలాషతో రాత్రులు చేయవలసిన కామోపసేవనానికి దివావేళ ఉపక్రమించ రాదని ఎరుగుదువుగా?

వేద వేదాంగవిదులైన విప్రులు పౌరజానపదులతోకూడి నీ శ్రేయస్సుకు కృషి చేస్తున్నారా? అన్నృతప్రియుడవై నాస్తికభావాలతో దీర్ఘ సూత్రతతో జ్ఞామల సాంగత్యం విడిచి, ఇంద్రియలోలుడవై చరించకూడదని గ్రహించావా. రాజకార్యాలను గురించి హీనబుద్ధులతో చర్చించడం లేదుగా. నిశ్చయించిన కార్యాలను ఎప్పటి కప్పుడు జరిపించాలి. నీ కోసం ఎవరువచ్చినా ప్రత్యుత్థానంచేసి ఆదరించాలి, స్వాదు, మధుర భోజనం మిత్రులతో కలిసి ఆరగించాలి.

శ్రద్ధగా అధ్యయనంచేసిన వేదాలను అగ్నిహోత్రాది కర్మలమూలాన సఫలం చేసుకోవాలి. మనకున్న జ్ఞానాన్ని శీలంతో సఫలంచేసుకోవాలి, ఇది ఇనకులాచారం. దండధరుడై ధర్మమార్గానసాగే ప్రభువును ప్రజలు మన్నిస్తారు. వానికే ఇహపరాలు కరతలామలకాలు, అని రాజధర్మం బోధించి, తమ్ముడూ! నువ్వు యిలా రావడం మంచిది కాదురా, అన్నాడు.

దుఃఖమగ్నహృదయుడైన భరతుడు అంజలిబంధంతో: ఆర్యా! నాన్నగారు పుత్రశోకంతో పరలోకగతు లయారు. తన పాపఫలం కారణంగా మాఅమ్మ కైకేయి వైధవ్యం అనుభవిస్తున్నది. నేను నీసేవకోసం వచ్చాను. నిన్ను తీసుకు వెళ్ళి సింహాసనం ఎక్కించడానికి వచ్చాను. నాతోపాటు కోసలపౌరులూ, అంతఃపురవాసులూ వచ్చారు. రాకాచంద్రశోభితమైన శారదాకాశంవలె నీ పట్టాభిషేకంతో కోసలం ప్రకాశిస్తుంది.

నేను నీ తమ్ముణ్ణి మాత్రమే కాదు. దాసుడను, శిష్యుడను. నీపాదాలుపట్టి వేడుతున్నాను. వచ్చి అయోధ్యను పాలించు, అంటూ తనశిరను రాముని పాదాలపై ఉంచాడు. వానిని లేవనెత్తి రాముడు: తమ్ముడూ! ఇక్ష్వాకువంశీయుడనైన నేను రాజ్యకాంక్షతో నియమభంగం చేసుకోనా! నువ్వునిర్దోషివని నాకు తెలుసు. ఇప్పుడు మీ అమ్మను నిందించడమూ మంచిదికాదు. రాజశాసనం ప్రజానీకానికి ఎలా శిరోధార్యమో, అలా నే రాజవంశానికీ అనుసరణీయం. అందుచేత నన్ను సింహాసనం ఎక్కించడానికి ఆయనకున్న అధికారం అడవికి పంపడానికీ వుంటుందని గ్రహించు. మరొక్కమాట. తండ్రిని ఎంతగౌరవించామో తల్లినీ అంతకంతా గౌరవించాలి.

మహారాజు నన్ను జటావల్కలాలు ధరించి వనవాసానికి వెళ్ళమన్నారు. నిన్ను సింహాసనం అధివసింపజెయ్యమన్నారు. అంతే! అది జరగాలని ఈశ్వర సంకల్పం, అన్నాడు.

భరతుడు: ఆర్యా! నువ్వు రాజధర్మం చెప్పావు. కాని ధర్మమే లేనివానికి రాజధర్మం ఎక్కడిది. జ్యేష్ఠుడుండగా కనిష్ఠుడు సింహాసనం ఎక్కరాదని యుగయుగాల ధర్మం ఘోషిస్తున్నది. కనక నువ్వు తిరిగివచ్చి సింహాసనం అధివసించు. ధర్మార్థాలు తెలిసిన ఉత్తమ చరిత్రుడైన ప్రభువు దైవస్వరూపుడు. నీ వియోగంతో దివంగతుడైన మహారాజుకి నువ్వు పరలోకక్రియలు నిర్వర్తించాలి.

ఈ మాట వినగానే రామునిగుండె ద్రవించింది. గండ్రగొడ్డలి దెబ్బతిన్న చెట్టులా కూలిపోయాడు. అదిచూసిన తమ్ములు ముప్వురూ కన్నీటివాన కురిపించారు. జానకి కంటికీ మంటికీ ఏకధారగా శోకించింది, కొంతసేపటికి రాముడు తేరుకొని: తమ్ముడూ! వనవాసం ముగించి అయోధ్యకు రావాలనుకున్నాను. కాని తండ్రి మరణాని" కారకుడనైన నేను ఎలా రాగలను. అంతిమఘడియలో ఆయన దగ్గరవుండి దహనక్రియలుకూడా చెయ్యలేని దురదృష్టవంతుణ్ణి. ఏ సత్కార్యం చేసివచ్చినా నా వెన్ను తట్టి సంతోషించే ప్రభు వింకలేరు.

జానకీ! మీ మామగా రింకలేరు. లక్ష్మణా! నువ్వు తండ్రిలేనివాడ వయ్యావు. అని శోకంతో మాటరాక, కొంతసేపు ఏడ్చి పితృదేవతకు ఉత్తరక్రియలు జరిపే స్నానాలు చెయ్యమని లక్ష్మణుడితో చెప్పి, సుమంత్రసహితుడై మందాకినీ తీరానికివెళ్ళి విధ్యుక్తంగా పితృకర్మలు నిర్వర్తించి ఉదకప్రదానంచేసి ఆశ్రమానికి చేరినవేళకు మిగిలిన జనులందరూ రామదర్శనానికి వచ్చారు. వచ్చేవారికి ఎదురువెళ్ళి స్వాగతంవలికి కుశల ప్రశ్నలు వేశారు. ఆ సమయంలో రేగిన సంతోష శోకసమ్మిళిత ధ్వనులు చిత్రకూట గిరిగుహాంతరాలలో ప్రతిధ్వనించాయి.

అప్పటికి శ్రీవశిష్ఠులు అంతఃపురజనంతో కౌసల్యాది రాజపత్నులతో చిత్రకూట ప్రాంగణానికి వస్తూండగా మందాకిని ఒడ్డున ఆగినకౌసల్య :

సుమిత్రా! చూశావా! రాజ్యంవిడిచిన రాజపుత్రులు స్నానాలుచేసే రేవు. ఈ రేవునుంచి నీబిడ్డ నాబిడ్డకోసం మంచితీర్థం తీసుకువెడతాడు. ఇదిగో దక్షిణాగ్రంగా వుంచిన దర్భలమీద రేగువండ్లు. ఇవి మహారాజుకి పిండప్రదానంగా వదిలారు వీరు. నాలుగు సముద్రాలమధ్య భూమండలాన్ని దేవేంద్ర వైభవంతో పాలించిన మహారాజుకి. అర్పించిన ఆరగింపులు, అని దుఃఖిస్తూ అడుగులువేసే మహారాణిని మిగిలినవారంతా అనుసరించి ఆశ్రమప్రాంతానికి వచ్చారు.

అల్లంతదూరంలో తల్లినిచూసిన రామచంద్రుడు ఎదురేగి తల్లులు ముగ్గురికీ పాదాభివాదం చేశాడు. వారు సుతిమెత్తనివేళ్ళతో రాముని వీపు నిమురుతూ లేవనెత్తారు. అదే రీతిగా లక్ష్మణుడు, సీత కూడా వారి చరణాలమీద వ్రాలారు.

తన పాదాలమీద వ్రాలిన సీతను లేవనెత్తి కౌసల్య : విదేహుల ఇంటిబిడ్డకు, కోసలాధీశుల కోడలికి అరణ్యమే అంతఃపురం అయింది. మండుటెండతగిలిన పద్మంలా, ధూళికప్పిన సువర్ణంలా, కారుమేఘం కమ్మిన చంద్రబింబంలా వున్న నీ ముఖం చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది, అని కన్నీరు మున్నీరు చేసింది.

ఇక్కడ రామభద్రుడు కులగురువుల పాదాలకు అభివాదంచేసి ఆయనకు ఉచితాసనం చూపించాడు. అందరూ కూర్చున్నారు.

భరతుడు తన అన్నగారిని ఎలా సుముఖం చేసుకుంటాడు, అని ఆసక్తితో చూస్తున్నా రందరూ. రామ లక్ష్మణ భరతులు ఆ మహాజనమధ్యంలో యజ్ఞశాలలో త్రేతాగ్నులవలె వున్నారు.

రామ భరతులు ఒకరినొకరు చూచుకుంటున్నారేకాని పదవి విప్పడంలేదు. అంతలో సంధ్యాకాల మయింది. విధ్యుక్తధర్మనిర్వహణకు లేచారందరూ అగ్నిహోత్రాదికాలు పూర్తిచేసుకొని మళ్ళీ ఆశ్రమప్రాంతం చేరారు.

భరతుడు : ప్రభూ! ఇప్పుడు మా అమ్మ మనసు మారింది. నాకిచ్చిన రాజ్యాన్ని నీకు సమర్పిస్తున్నాను. నువ్వే దీన్ని పాలించాలి. గాడిదకు అశ్వగమనంరాదు. మామూలుపిట్ట గరుత్మంతునివలె ఎగరలేదు. అదీ మనిద్దరి సామ్యము! ఇతరుల సుఖ సంతోషాలే జీవితధ్యేయంగా గలవారే ఉత్తములు. అలాకాక పరులమీద ఆధారపడేవాడి జీవితం దుర్భరం. మానవుడు తాను నాటినమొక్కను సంరక్షించుకొని మహావృక్షం అయాక పూలతో, పండ్లతో నిండినప్పుడు అనుభవించాలనుకుంటాడు. అంతేకాని పువ్వూ, కాయలేకుండా పోవాలనుకోడు. ఈనాడు రాజ్యవృక్ష రక్షణభారం నువ్వు వహించాలి. ఈ మహాజనులందరి అభిప్రాయమూ ఇదే. అంటూంటే అందరూ తమ అంగీకారం తెలిపారు.

రాముడు నిశ్చలంగా తమ్మునిచూసి : నాయనా! మానవుడు దేనికీ సమర్థుడుకాడు. కుడియెడమల ఉచ్చులువన్నీ యముడు నడుపుతూంటాడు. మనం చేసేవన్నీ ఉత్తర క్షణంలో క్షయ మవుతాయి. మిగలముగ్గినపండు నేలరాలినట్లు కాలం తీరగానే మానవుని దేహయాత్ర ముగుస్తుంది.

పునాది ఎంత కట్టుదిట్టంగావేసినా, మరెంతదృఢమైన కలపతోకట్టినా మన గృహాలు జీర్ణదశకు రాకపోవు. నదీ ప్రవాహం సముద్రంలో పడకతప్పదు. అలానే ఈ దేహమూ మృత్యువశంకాక తప్పదు. ఈ మృత్యువుందే-యిది మన వెంటనంటి ఉంటుంది. మనం ఊపిరి ఆపగానే అది వెళ్ళిపోతుంది. సూర్యోదయ, అస్తమయకాంతులు చూచి ఆనం దించేవేళ మన జీవిత యాత్రలో మరొకరోజు వెనకబడిందని గ్రహించడంలేదు.

ఈ సంసారం, భార్యాపుత్రులు, అన్నదమ్ములు, చుట్టాలు - వీరు జీవితప్రవాహంలో కొంతదూరం కలిసి ప్రయాణించేసే కట్టెలవంటివారు. ఈ యాత్రలో ఒకడుముందు వెడితే, మరొకడు వెనుకవాడికోసం ఆగినట్టు కనబడతాడు. మొత్తం మీద అందరూ వెళ్ళవలసిన వారే. మన మహారాజు సత్కర్మలతో. అన్నదానాలతో ప్రజాభిమానం పొంది పితృ పితామహులు నడిచినదారినే వెళ్ళారు. దానికి శోకం ఎందుకురా. ఆయన మన కప్ప గించిన విధులు మనం నిర్వర్తించాలి.

నాకు వనవాసం-నీకు రాజ్యపాలన. ఆ శాసనాన్ని అక్షరం విడవకుండా పాలించాలి మనం, అన్నాడు.

భరతుడు : రామభద్రా! నీకు నువ్వేసాటి, దుఃఖసాగరతరంగాలు ముంచెత్తినా. ఆనందమందాకినికి ఆహ్వానించినా నిశ్చలంగా నిలబడగలవు· కాని నేను అతి సామాన్యుడను. క్షుద్రబుద్ధితో మా అమ్మ ఈదురవస్థలు తెచ్చిపెట్టింది. ఆ కడుపున పుట్టిన నాకూ ఆ పాపం అంటక తప్పదు. దశరథమహారాజు బిడ్డనుకనుక మాతృహత్యాపాపానికి సాహసింపలేకపోయాను. అయినా నాన్నగారు మాత్రం ఏంచేశారు, ఒక స్త్రీ కోసం, ఆ స్త్రీ సంతోషంకోసం ఎంతటిపనిచేశాడాయన. ఆడదాని ఆహ్లాదంకోసం ధర్మార్థాలు విడిచేశా డాయన మృత్యువు సన్నిహితమయినప్పుడు మనిషికి వివేకం నశిస్తుం దనేమాట నిజం: వివేకం కోలుపోయి నాన్నగారు చేసిన పనిని నువ్వు సరిచేయవచ్చు. తండ్రి నడిచిన తప్పుదారిని కొడుకు నడవాలని లేదే!

ఉత్తమక్షత్రియ వంశీయుడవైన నువ్వు జటావల్కలాలు ధరించి వనవాసం చెయ్యడం ధర్మంకాదే. సింహాసనం అధివసించి ప్రజాహృదయరంజకంగా పరిపాలించాలి. ఆశ్రమాలలో ఉత్తమమైన గృహస్థాశ్రమాన్ని అనుసరించాలి. అన్నిటా నీ కంటె అల్పుడినైన నేను నువ్వుండగా సింహాసనం ఎక్కడంకంటె ధర్మవైపరీత్యం లేదు.

ఇదుగో కోసలప్రజలు. మంత్రి. సామంత, పురోహిత, దండనాథులు. వీరంతా నిన్ను రాజుగా అభిషేకించడానికి వచ్చారు.

రామ : తమ్ముడూ! నాన్నగారు వివాహవేళ తనరాజ్యాన్ని కైకేయీసుతునికి యిస్తానని మీతాతగారికి వాగ్దానం చేశారు. అనంతరం దేవాసురసంగ్రామవేళ మీ అమ్మగారికి రెండువరాలిచ్చారు. ఆ వరాలు-నా వనవాసం, నీ రాజ్యాభిషేకం. ధర్మపరుడైన మన తండ్రికీర్తి నిలబడడానికి ఆయన మాటప్రకారం నేను అడవికి వచ్చాను. నువ్వు వెళ్ళి సింహాసనం అధివసించు. ఇందులో మీ అమ్మకాని, మహారాజుకాని దోషులుకారు. పున్నామనరకంనుండి తరింపజెయ్యడానికి పుత్రులను కంటారు మానవులు. మనం నలుగురం వుండీ మననాన్నగారిని ఆ నరకయాతనలనుండి రక్షించలేక పోవడంకంటె అన్యాయంలేదు. అందుచేత మనం ఆయనమాట నెరవేర్చాలి.

## జా బా లి

ఈ ప్రసంగం వింటున్న జాబాలి : ఓ రఘువంశీయుడా! ఈషణ్మాత్ర వివేకంలేని సామాన్యునివలె నీ బుద్ధి నిరర్థకం అవుతున్నదయ్యా! ఎవడికి ఎవడు బంధువు? తల్లి ఎవరు? తండ్రి ఎవడు? ప్రాణి తనంతటతాను పుడుతున్నది: అలాగే మరణిస్తున్నది.

గినికి తల్లీ తండ్రీ అని విచారించేవాడు మతిహీనుడు. గ్రామాంతరం వెళ్ళి అక్కడ పని చూసుకుని కొన్నాళ్ళకు తిరిగివస్తాం. వచ్చాక మనయింట మనమేవుంటాం. అంతే. ఈ తల్లిదండ్రులూ, యిల్లూ వాకిలీ మన అవసరాలకోసమే యివన్నీ. ఇందులో శాశ్వత బంధా లేమీలేవు. ఇప్పుడు నువ్వు ఎవరిమాటకోసమో రాజ్యాన్నివిడిచి రావడం వివేకంకాదు. దేశాంతరగతుడైన భర్తకోసం ఏకవేణియై వుండే స్త్రీవలె అయోధ్య నీకోసం నిరీక్షిస్తున్నది. నువ్వువచ్చి సర్వసమృద్ధితోవున్నరాజ్యం పాలించు. దశరథుడు నీ తండ్రి అనీ, ఆయనకు నువ్వు కొడుకువనీ అనుకోకు. ఋతుకాలంలో స్త్రీ పురుషుల సంయోగవేళ శుక్రశోణిత మేళనం ప్రాణి ఆవిర్భావానికి ఆధారం. అంతమాత్రాన వారు మన జీవనశాసకులుకారు. అయినా ఇప్పుడా తండ్రి లేడు.

పుట్టిన ప్రతిప్రాణి చచ్చితీరుతుంది. చచ్చాక అది ఏమవుతుందో తెలీదు. తెలియనిదానికి విచారించడం వివేకంకాదు, వారు పరకాలకు పోతారనీ, శ్రాద్ధకర్మలతో వారిని తరింపజేయవచ్చుననీ భావించడం అవివేకం. ఎవడో భోజనంచేస్తేమన ఆకలి తీరుతుందనుకోవడం భ్రమ. ఈ దాన ధర్మ విషయాలన్నీ బుద్ధిమంతుల కల్పనలు. యజ్ఞయాగాలూ, తపోదీక్షలూ వీటివల్ల పరమగతులేవో వస్తాయనుకోకు. ఏది నీ కనుల ఎదుట వున్నదో అదే సత్యం. పరోక్షంలో వున్నదాన్ని పరిగణించకు. భరతు డిచ్చే రాజ్యాన్ని హాయిగా స్వీకరించు, అన్నాడు.

జాబాలిచేసిన నాస్తికవాదధోరణి విని, రాముడు గంభీరంగా: స్వామీ! మీరు నా మేలుకోరి చెప్పిన మాటలన్నీ చాలావిచిత్రమైనవి మర్యాద విడిచి, పాపాచార నిరతుడై చిత్తచాంచల్యం కలవాడు సత్పురుషుల అభిమానానికి అర్హుడుకాడు. పురుషుని కులీనతను నిర్ణయించేది వాని శీలం. మీ ఉపదేశాన్ని నేను ఆచరిస్తే నాకంటె దుశ్శీలుడు లేడు. ఇంతకంటె అపవిత్రమూ, అనార్యమూ, అధర్మమూ ఉండబోదు. వివేకులందరూ నన్ను అసత్యవ్రతపరాయణుడుగా వేలెత్తి చూపుతారు.

యద్వృత్తాః సంతి రాజానః
తద్వృత్తాః సన్తిహి ప్రజాః॥

శాసనాధికారి ఏ దారిని వెడితే ప్రజలందరూ ఆబాటనే పడిపోతారు. సత్యం, అహింస ఈరెండే రాజవంశానికి ప్రధానమార్గాలు. సత్యమే ఈ లోకానికి ప్రాణాధారం. అబద్ధాలాడేవాడికీ విషసర్పానికీ సమానస్థానం యిచ్చి ప్రజలు భయపడతారు.

హోమం, హోమద్రవ్యం, హోత, తపస్సు, సత్యం అన్నీ సత్యమయాలు. సత్యం ఒక్కటే లోకాన్ని రక్షించగలదు.

ఇంతతెలిసి నేను మా నాన్నగారి ఆదేశానుసారం చరించక ఏప్రలోభానికో లొంగి రాజ్యం స్వీకరించడంకంటె అక్రమంలేదు. ఇటువంటి అక్రమానికి ఉత్తమజాతి క్షత్రియు డెవడూ సాహసించడు, పైగా గర్హిస్తాడు. మనోవాక్కాయాలతో దేవితోమా అనృతాన్ని ఆరాధించకూడదు. అందుచేత మీరు చేసిన యుక్తి యుక్తమైన బోధలకు నమస్కరించి, అవి మీకే విడిచిపెడుతున్నాను.

నా యీ వనవాసదీక్ష మా పినతల్లికికూడా ఎంతో సంతోషం కలిగించింది. నేను పుట్టింది కర్మభూమిలో. ఈ భూమిలో మానవుడు నిష్కపటంగా చరించాలి. ఇంద్ర, అగ్ని, వాయు, సోములు, మహాతపస్వులు సాక్షిగా నేను ఈ పదునాలుగేళ్ళు వనవాసం చేస్తాను.

మహర్షీ! మరొక్కమాట. సత్యం, ధర్మం, భూతదయ, ప్రియభాషణం, పరాక్రమ ప్రదర్శనం, దైవబ్రాహ్మణపూజ, అతిథిసేవ-ఇవి ఇహ పరసాధనాలు. ధర్మసంపన్నుడైన విప్రవరుడు తన ఆశ్రమ ధర్మాచరణరతుడై ఉత్తమలోకాలు పొందుతాడు. ఈ విషయం తెలిసిన మా నాన్నగారు మిమ్ము ఎందుకు చేరదీశారో తెలీడంలేదు. చోరుడికీ, నాస్తికుడికీ భేదంలేదు. వేదవిరుద్ధమైన మీ నాస్తిక వాదాన్ని గర్హిస్తున్నాను. మీ తర్కాన్ని కట్టి పెట్టండి, అన్నాడు.

జాబాలి: రామభద్రా! నేను నాస్తికుడను కాను. ఈ రాజ్యం నాయకరహిత మయినందువల్ల నేను నాస్తికవాదం చేశాను. ఇప్పుడు నీ సత్యనిష్ఠ నన్ను ఆస్తిక్యంవైపు మరల్చింది. అవసరం కలిగితే మళ్ళీ నాస్తికవాదం చేపడతాను అన్నాడు.

శ్రీ వసిష్ఠకులగురువులు: రామచంద్రా! జాబాలి లోకరీతి తెలియనివాడుకాడు. నిన్ను మరలించడానికే ఈవాదం చేశాడు. ఈ సందర్భంలో నేను చెప్పవలసిన మాటలు కొన్ని వున్నాయి. ఈ రాజ్యాన్ని ప్రాచీనకాలంనుంచీ పాలించే ఇక్ష్వాకువంశంలో జ్యేష్ఠుడే సింహాసనం అధివసించి ప్రజాపాలనం చేస్తున్నాడు.

సృష్టిప్రారంభవేళ స్వయంభూబ్రహ్మ, అనంతరం మరీచి, కశ్యప, వివస్వంతులు. ఈ వివస్వంతుని పుత్రుడు వైవస్వతుడు మనువు. మనువు పెద్దకొడుకు ఇక్ష్వాకువు. ఆయన అయోధ్యాధిపతి. ఆ వంశంలో కుక్షి, వికుక్షువు, బాణుడు, అనరణ్యుడు, పృథువు, త్రిశంకువు, ధుంధుమారుడు, యువనాశ్వుడు, మాంధాత, సుసంధి, ధ్రువసంధి, భరతుడు, అసితుడు, సగరుడు, అసమంజసుడు, అంశుమంతుడు, దిలీపుడు, భగీరథుడు, కకుత్థ్సుడు, రఘువు, మదానుడు, శంఖణుడు, సుదర్శనుడు, అగ్నివర్ణుడు, శీఘ్రగుడు, మరువు, ప్రశుశ్రువు, అంబరీష, నహుష, నాభాగ, అజమహారాజులు ప్రభవించారు.

మీతాతగారు అజమహారాజు. ఆయన కుమారుడు మీ తండ్రి దశరథుడు. వీరందరూ సింహాసనం ఎక్కిన జ్యేష్ఠులు. అలాగే దశరథనందనులలో జ్యేష్ఠుడవైన మవ్వే రాజ్యాధికారం వహించాలి. కులధర్మాన్ని విడవడం ఉచితంకాదు, అయితే పితృశాసనాన్ని వమ్ముచేసినట్లు అవుతుందనే అనుమానం నీ కవసరంలేదు, ఎలాగంటావా!

మానవుడికి తల్లిదండ్రులతోపాటు ఆచార్యుడుకూడా గురువే. తల్లిదండ్రులు జన్మదానం చేసిన గురువులు కాగా ఆచార్యుడు బుద్ధికి జ్ఞానప్రదానం చేసినవాడు. అందుచేత గురువు ఆజ్ఞ విశిష్టమైనది. ఇంకా ఈ కోపలపౌరులు, మంత్రి, సామంత, దండనాథులు అందరూ నిన్ను మహారాజుగా రమ్మంటున్నారు. అందుచేత మవ్వు అయోధ్యకు రా! అన్నాడు.

రామభద్రుడు: గురువరా! మాతాపితృఋణం తీర్చగలవారులేరని మీ రెరుగరా! దశరథమహారాజు నాకు జన్మను అనుగ్రహించడమేకాదు, పెంచి పెద్దచేసి నన్ను ఇంతవాణ్ణిచేసింది ఆయన. ఆయన మాటమ అక్షరః పాలిస్తానని వాగ్దానంచేసి మాట తప్పమంటారా, అన్నాడు.

భరతుడు: సుమంత్రా! ఈఆశ్రమప్రాంగణ వేదికమీద దర్భాసనంవేయించు. రామభద్రుడు తిరిగివచ్చేవరకూ నేనిక్కడే ప్రాయోపవేశం చేస్తాను అన్నాడు.

సుమంత్రుడు నిశ్చేష్టుడై, దీనదృక్కులతో రాముని చూస్తున్నాడు. భరతుడు స్వయంగా దర్భాసనం వేసుకున్నాడు. చూచిన రాముడు దగ్గరగావెళ్ళి తమ్ముడూ! ఏమిటిది? పట్టాభిషిక్తుడయే ప్రభువు దీనుడైన విప్రునివలే యిలా కూర్చోకూడదురా. లేచివెళ్ళు అయోధ్యకు చేరాలిమవ్వు. అనగా: భరతుడు తనచుట్టూ జనాన్నిచూచి, ఆర్యులారా! మీరయినా ఈయనను అయోధ్యకు రమ్మని చెప్పండయ్యా, అన్నాడు.

అప్పుడు వారందరూ: ఆర్యా! రామభద్రుడు పితృవాక్పాలన నిష్ఠలో వున్నాడు. ఆయన సంకల్పాన్ని మరల్చడం ఎవరితరమూకాదు, అన్నారు.

వారిమాటలు విని రాముడు: తమ్ముడూ! ధర్మపరిషత్తు ధర్మచక్షువుతో పరిశీలించి చేసిన నిర్ణయం విన్నావుకదా. ఇక నీ పట్టు విడిచిపెట్టు, అన్నాడు.

భరతుడు ఉదకం స్పృశించి: ఓ ధర్మపరిషత్ సభ్యులారా! నేను మా నాన్నగారి రాజ్యంకాని, మా అమ్మగారి రాజ్యంకానీ కోరలేదు. ధర్మబద్ధుడైన రామభద్రుని వనవాసం నాకు తెలిసి జరిగిందికాదు. ఒకవేళ వనవాసం అవశ్యమైతే మా అన్నకు బదులు నేనే వనంలో ఉంటాను-అంటూండగా రాముడు.

పితృపాదులు నాకు అరణ్యవాసం విధించారు. ఇప్పుడు దానికి వ్యతిక్రమం చేసి ఆయనకు అనృతదోషం కట్టిబెట్టలేను. మా భరతుడు కూడా యీ విషయంలో నాన్నగారి శాసనం తిరస్కరిస్తాడని భావించను. మీరందరూ యింతదూరంవచ్చి పడినశ్రమ వృథా కాదు. అరణ్యవాసం పూర్తికాగానే వచ్చి భరతునితో కలిసి రాజ్యం పాలిస్తాను. అంత వరకూ భరతుడే రాజు. అదే మా నాన్నగారిమాట. మా అమ్మ కైకేయి వరాలు అవే. మా యిద్దరికీ అవి శిరోధార్యాలు, అన్నాడు.

అక్కడ చేరిన మహర్షులందరూ ఆ అన్నదమ్ముల ధర్మపరాక్రమాన్ని అభినందించి, భరతునివైపు తిరిగి : నాయనా! ఉత్తమవంశంలో జన్మించిన ప్రాజ్ఞుడవు. మీ అన్నగారు చెప్పినట్లు నువ్వు మీ పితృపాదుల ఉత్తమగతులకు అనుకూలంగా నడుచుకోవాలి. రాముడు పితౄణవిముక్తుడు కావాలి. కాకపోతే దశరథుడికి సత్యవాక్పాలనఫలం ఉండదు,

రాముడు వారందరినీ కృతజ్ఞతాపురస్సరంగా ఆరాధించాడు. భరతుని దుఃఖం పెల్లుబికింది, తేరుకున్నాక రామభద్రా! మనయింటికి జ్యేష్ఠుడివి నువ్వు. నువ్వే ఈరాజ్యం పాలించాలి. మా అమ్మ అభిప్రాయమూ అదే. ఎందుకంటావా! ఈకోసలాన్ని పాలించే శక్తి నాకు లేదు. పోగా ఉత్సాహమూలేదు నాకు. సర్వప్రజా హృదయ రంజకంగా రాజ్యం నడపగల నువ్వు సింహాసనం ఎక్కక తప్పదు, అన్నాడు.

అలా పలుకుతూ పాదాలమీదపడ్డ భరతుని లేవలెత్తి చిరునవ్వుతో వెన్ను నిమిరి : తమ్ముడూ! నువ్వు సహజంగా ధీశాలివి. ఆ శక్తికి వసిష్ఠాది కులగురువులు మంచిపదును పెట్టారు. దానికితోడు మన మంత్రులందరూ రాజ్యతంత్రనిపుణులు : మన వంశాన్ని నువ్వార్భావంతో ఆదరిస్తున్నవారు. నీకేం భయం అవసరంలేదు. నువ్వు చక్కగా రాజ్యం పాలించగలవు. చంద్రుడు తనకాంతిలక్ష్మిని కోలుపోయినా హిమవంతుడు హిమాన్ని విడిచినా, సముద్రుడు చెలియలికట్ట దాటినా రాముడు తన మాటను తప్పడు. మరొక్క మాట. మీఅమ్మ ఏకారణంచేత ఈకోరికకోరినా అందుకు ఆగ్రహం అనవసరం. అది మనసులో ఉంచుకుని ఆవిడపట్ల అనాదరం వహించకు. ఆవిడ మాతృమూర్తి. అలాగే ఆవిణ్ణి గౌరవించు, అంటున్నప్పుడు రామభద్రుని ముఖం సూర్యకాంతితో భాసించింది.

భరతుడు రామునిపాదుకలు ముందుపెట్టి : ఆర్యా ! ఒక్కమాట నీపాదాలతో పీటిని పవిత్రంచెయ్యి. ఇవే ఈ పధ్నాలుగేళ్ళు కోసలం పాలిస్తాయి. నేను జటావల్కలాలు ధరించి వాటిని పూజిస్తాను, అన్నాడు.

భరతుడు చెప్పినట్టుచేశాడు రాముడు. అప్పుడు భరతుడు: రామభద్రా! నేను రాజధాని వెలుపలవుండి సర్వరాజకార్యాలూ ఈ పాదుకలకు నివేదిస్తాను. ఫలమూలాలే ఆహారంగా వుంటాను. పదునాలుగేండ్లు పరిసమాప్తమైన మరునాటి ప్రభాతకాంతులలో నీదర్శనం కాకపోతే అగ్నిప్రవేశం చేస్తాను. ఇది నా ప్రతిజ్ఞ, అన్నాడు.

రాముడు అన్నిటికీ అంగీకరించి, భరత శత్రుఘ్నులను కౌగిలించుకుని : అమ్మ కైకేయిని ఆదరప్రేమతో చూడాలినుమా. ఆవిడను ఏ మాత్రం అగౌరవంగా చూసినా నామీద ఒట్టు. మీ వదినమీదఒట్టు-అని నొక్కి చెప్పాడు.

సాలంకృతమైన పాదుకలను భద్రగజంమీదవుంచి అభిషేకించి, ప్రదక్షిణంచేసి తిరుగుప్రయాణానికి సన్నద్ధుడయాడు భరతుడు.

గురువులకు మంత్రులకు నమస్కరించి, పరిజనానికి వీడ్కోలుపలికి, గద్గదగాత్రంతో మాతృదేవతలకు పాదాభివాదంచేసి రాముడు పర్ణశాల ప్రవేశించాడు.

అభిషేకించిన పాదుకలను శిరస్సుపై వుంచుకుని భరతుడు రథం ఎక్కాడు. వసిష్ఠ, వామదేవాదులు ముందు సాగుతున్నారు. జానపదులతో పౌరులూ, ఆ వెనుక సేనలు నడుస్తున్నాయి. భరద్వాజాశ్రమం సమీపించగానే దిగి మహర్షికి పాదాభివాదం చేశాడు. మహర్షి ప్రసన్నవదనంతో: ఏమన్నాడయ్యా మీ అన్నయ్య అని ప్రశ్నించగా, మహర్షీ! శ్రీవసిష్ఠులుకూడా అర్థించినా రామభద్రుడు పితృవాక్పాలన దీక్షను వీడలేదు, అన్నాడు.

అప్పుడు వసిష్ఠులు : అదిగో అయోధ్యావాసుల యోగక్షేమాలు విచారించడానికి ఆయన పాదుకలు అనుగ్రహించాడు, అన్నాడు.

భరద్వాజుడు భరతుని భ్రాతృభక్తిని పరిపరివిధాల ప్రశంసించాడు. భరతుడు మహర్షి అనుజ్ఞతో అయోధ్యాభిముఖుడయాడు.

రాజధానిలో అడుగుపెట్టింది మొదలు భరతుని మనస్సు మరింత శూన్యమై, కుల గురువులను సమీపించి : వసిష్ఠమహర్షీ! నేనిక్కడ ఉండలేను. పితృపాదులులేరు, అన్నయ్య అడవిలో ఉన్నాడు. నా కిక్కడ మనశ్శాంతి వుండదు. నేను నందిగ్రామంలో వుంటాను, అన్నాడు.

ఆ నిర్ణయాన్ని మంత్రిమండలి ఆమోదించిన అనంతరం, తల్లులవద్ద అనుజ్ఞ తీసుకుని శత్రుఘ్నసహితుడై నందిగ్రామం చేరుకున్నాడు. శిరస్సుపై పాదుకలతో వెళ్ళే అతనిని మంత్రులూ, గురువులూ, సేనలూ అనుసరించాయి.

## చి త్ర కూ ట ం

సీతారామలక్ష్మణులు మందాకినీ స్నానంచేస్తూ, చిత్రకూటంమీద విహరిస్తూ కాలం గడుపుతున్నారు. ఆ రోజులలో అక్కడి మునులలో ఏదోభయమూ, అనుమానమూ రేగుతున్నట్లు గ్రహించి వారి కులపతి దగ్గరకు వెళ్ళి: మహర్షీ! మా తమ్ముడు కాని, విదేహ రాజనందనకాని మీ వారిని గౌరవంగా చూడడం లేదా? ఏదైనా అపచారం చేశారా? మీవారందరూ మమ్ముచూసి వెనకవెనకకు వెడుతున్నారు. మా వల్ల ఏదైనా అపరాధం జరిగిందా, అని అడిగాడు.

రాఘవా! జనకులయింటిబిడ్డ అపరాధం ఎందుకు చేస్తుందయ్యా. మీతమ్ముడు రఘువంశీయుడు. ఆయన మమ్మల్ని మహోన్నతస్థానంలోనే వుంచి ఆరాధిస్తాడు. మా వారి భయ, సంకోచాలకు కారణం విను.

జనస్థానంలో రావణసోదరుడైన ఖరుడు తనపరివారంతోచేరి మా ఋషులను నానా హింసలూ పెడుతున్నాడట. యజ్ఞయాగాలు ధ్వంసం చేయడం, బాలురనూ, వృద్ధులనూ అధికంగా బాధించడం, వికృతరూపాలతోవచ్చి భయపెట్టడం....ఇలా వారి ఘాతుకాలు నానాటికీ మితిమీరుతున్నాయి, క్రమక్రమంగా వారు ఇటుకూడా వచ్చి మా ప్రశాంతిని భగ్నంచేస్తారని భయపడుతున్నాం. అది జరగకుండానే మేము సురక్షిత ప్రాంతానికి తరలివెడదా మనుకుంటున్నాం.

ఇక్కడకు సమీపంలో అశ్వమహర్షి ఆశ్రమం వుంది. అక్కడకు వెడతాం. ఖరుడు పరమక్రూరుడు. వాడు నిన్ను కూడా బాధలు పెడతాడు. అందుచేత మీరు కూడా మాతోరండి, అన్నారు.

రాముడు వారికేమీ సమాధాన మివ్వలేక ఆశ్రమానికి వచ్చాడు. కొద్దిమంది ఋషులు వినా మిగిలిన అందరూ చిత్రకూటం విడిచేశారు.

రాముని మనసు ఆలోచనలో పడింది, మునులందరూ వెళ్ళారు. ఇక్కడ భరత, శత్రుఘ్నులు కలిసిన ప్రదేశాలు ఆ స్మృతులతో వేధిస్తున్నాయి. తల్లులు నిలిచిన ప్రాంతం మరీ వ్యధ కలిగించగా చిత్రకూటం విడిచి అత్రిమహర్షి ఆశ్రమ ప్రాంతానికి వెళ్ళారు సీతా రామ లక్ష్మణులు.

పాదాభివాదంచేసే సీతారామలక్ష్మణులను ఆశీర్వదించి అత్రిమహాముని తన భార్య అనసూయకు వారినిగురించి చెప్పి: అమ్మా! సీతా! ఈ ముసిలి వున్నదే అనసూయ

దీని సంగతి నీకు తెలియదు. అనావృష్టితో కొన్నిసంవత్సరాలు భూమి బీటలువారింది. అప్పుడీవిడ తపశక్తితో జాహ్నవీనదిని ప్రవహింపజేసి, దుర్భిక్ష బాధ తగ్గించింది. అంతటి తపశ్శక్తిగల పతివ్రత. ఆవిడ మీకు తల్లివంటిది. అందుకని ఆవిడను సేవించి అనుగ్రహం పొందు, అన్నాడు.

సీత రామునివైపు చూసింది. రాముడు అంగీకారదృక్కులు ప్రసరించాడు వెండిలా తెల్లగాపండిన జుట్టుతో, ముడతలుపడ్డ శరీరంతోవున్న అనసూయాదేవిని నమస్కరించి సీత తన గోత్రనామాలు చెప్పుకుని పాదాభివాదంచేసి "అమ్మా ! కుశలమా" అని అడిగింది.

వాత్సల్యం నిండిన కన్నులతో, చిరునవ్వుజల్లుతో అనసూయాదేవి రాఘవుల యింటి కోడలిని దగ్గరగా తీసుకుని : ధర్మబుద్ధితో వర్ధిల్లుతల్లీ ! అని ఆశీర్వదించి యోగక్షేమాలడిగి :

పిల్లా ! నువ్వు అదృష్టవంతురాలివే. కట్టుకున్న భర్తసంపదలతో, సమ్మానాలతో సంతోషించడమే సామాన్యస్త్రీలకు అభ్యాసం. వాటినిమిత్తంలేకుండా అన్నీ విడిచి నువ్వు అడవికి వచ్చావు. సౌఖ్యాలనూ, బంధుజనాన్ని విడిచివచ్చి క్లేశాలు పడుతూ ధర్మచారిణి వయావు. దుస్స్వభావాన్నీ కామాన్నీ విడిచి, భర్తృసేవచేసే స్త్రీకి ఇహపరాలు రెండూ దొరుకుతాయమ్మా. భర్తనుమించిన బంధువూ, ఆయన సేవనుమించిన తపస్సూ లేవు. ఈ మాత్రం తెలియక కామభావగ్రస్తలైనవారు స్వైరిణులై అపఖ్యాతి పాలవుతారు. ఈ ధర్మమార్గం విడవక శాశ్వతయశస్సు సంపాదించుకోతల్లీ, అని వెన్నునిమిరింది.

అమ్మా ! మీ మాటలు కొత్తవి కాకపోయినా సంతోషం కలిగించాయి. పురుషుడు ధర్మబాహ్యంగా అనార్యకర్మలు చేసినా వానిని విడవకూడదనీ ఎరుగుదును. అటువంటప్పుడు ధర్మమూర్తీ, జితేంద్రియుడూ, మృదువర్తనుడూ, స్థిరానురాగి నా భర్త. తల్లివలె ప్రేమతో, తండ్రివలె నా శ్రేయోభిలాషియై వుంటున్నప్పుడు ఆయనను వేను మరోదృష్టితో చూడటం అసంభవం.

ఆయన కౌసల్యాదేవిని చూసినట్లే పరదారలను చూస్తాడు. రాజవంశం స్త్రీల ముందు తాను పట్టమహిషి కొడుకుననే అహంకారం ప్రదర్శించలేదు. పాణిగ్రహణ సమయంలో మాఅమ్మ, వనవాసానికి బయలుదేరేవేళ మాఅత్తగారు చెప్పినమాటలు నా మనసులో ముద్రితమై వున్నాయి. పతిశుశ్రూషతో పరమోత్తమస్థానం పొందిన సావిత్రికథ ఎరుగుదును. ఇక ప్రత్యక్షంగా మీరున్నారు. మహిళాలోకం మీ ఉభయులనూ సర్వ

వేళలా స్మరించుకుంటూ ఉంటుంది అని జానకి వినయంతో అనగా, అనసూయాదేవి ఆనందతరంగిత హృదయంతో తల్లీ! నీమాటలు నాకెంతో సంతోషం కలిగించాయి. ఆ సంతోషంతో నీకేమైనా యివ్వాలని ఉంది. అడుగు అంది.

అమ్మా! మీమాటలతోనే అన్నీ నాకు యిచ్చారు-అంది సీత. అనసూయ మరింత పొంగిపోయి : ఇదిగో ఈ దివ్యమాల్యాలు. వస్త్రాభరణాలు, అంగరాగాను లేపనాలు తీసుకో. ఈ పువ్వులు వాడవు. ఈ బట్టలు మాయవు. వీటితో నువ్వు నీభర్తయెదుట శచీదేవిలా వుంటావు, అని చేతికందిచ్చింది.

## సీ తా క ల్యా ణ ం

అనంతరం ఆ మునలితపస్విని : అమ్మాయీ! నువ్వు మా రామచంద్రుణ్ని స్వయం వరంలో చేపట్టావని విన్నాను. ఆ కథ చెప్పవే, వినాలనివుంది, అని దగ్గరగా తీసుకుని అడిగింది.

సీత లజ్జావినయ విభూషితాంగియై : అమ్మా! మానాన్నగారు మిథిలాధిపతి జనకులు. న్యాయధర్మబద్ధులై రాజ్యపాలనం చేస్తూ ఒకప్పుడు యజ్ఞంచేయ తలపెట్టారు. యజ్ఞభూమిని నాగలితో దున్నుతూండగా ధూళిధూసరితాంగంతో నేను దొరికాను. ఆయనకు సంతానం లేదప్పటికి. అపరిమితానందంతో నన్ను గుండెలకు హత్తుకుని అంతఃపురానికి తీసుకువెళ్ళి పట్టమహిషికి అందించారు. ఆవిడ మాతృవాత్సల్యంతో నన్ను పెంచి పెద్దచేసింది. నాకు పెళ్ళిఈడు వచ్చింది. దేవేంద్రుడైనాసరే ఆడబిడ్డతండ్రి అయితే, అమ్మా! ఆమె పెళ్ళి విషయం చింతాభరమేకదా. యోగ్యుడైన వరుని అన్వేషణ మాటలా! స్వయంవరం ప్రకటించారు వీరత్వం శుల్కంగా.

దక్షయజ్ఞవిధ్వంసం అయాక పరమశివుడు తన ధనుస్సు దేవరాతుని దగ్గర వుంచాడు. ఆ తరువాయి అది దేవతలకుచేరి, తిరిగి దేవరాతునికి చేరింది. అది మాయింటనే వుంది నాటినుంచీ. ఆ ధనుస్సును ఎవరు ఎక్కుపెడితే వారికి నన్నిచ్చి వివాహం జరుపుతామన్నారు.

ఎందరెందరో రాజపుత్రులు వచ్చారు. ఒక్కరూ ఆ ధనుస్సును కదలించ లేక పోయారు. దానితో వారు కోపంతో మా రాజ్యంమీద దాడిచేసి నానాక్లేశాలూ కలిగించారు. అందులో సాంకాశ్యనగరాధిపతి సుధన్వుడు ప్రాణాలే కోలుపోగా. ఆ నగరానికి మా పినతండ్రి కుశధ్వజులు పాలకులయారు.

అలా కొంతకాలం నడిచింది. ఎందరెందరో వస్తున్నారు, వెడుతున్నారు. ఒక్కరూ ఆ ధనుస్సును ఎత్తలేదు. అలావుండగా ఆ రోజులలో మానాన్నగారు యజ్ఞం తలపెట్టారు. ఆ సమయంలో విశ్వామిత్రమహర్షి వచ్చినవార్త విని మా నాన్నగారు తమ కులగురువులు శతానందులతో ఎదురువెళ్ళి అర్ఘ్యపాద్యాలిచ్చి, వారిని ఆహ్వానించారు. ఆయనవెంట ధనుర్ధరులై యిద్దరు రాజపుత్రు లుండడం చూసి 'వీరెవరు' అని మా నాన్నగారు అడిగారు. అప్పుడా మహర్షి :

ఓ రాజర్షీ ! వీరు అయోధ్యాధీశుని బిడ్డలు రామ లక్ష్మణులు, నేను తల పెట్టిన యజ్ఞాన్ని మారీచ, సుబాహులు ధ్వంసం చేస్తూంటే వీరిని తెచ్చాను. వచ్చే దారిలో తాటకను సంహరించి, సుబాహుణ్ని బూడిదచేసి, మారీచుని పరాజితునిచేసి నా యాగం నిర్విఘ్నంగా జరిపించారు. పెద్దవాడైన రామభద్రుడు, వచ్చేదారిలో గౌతమపత్ని అహల్యను ఉద్ధరించాడు, అని ఆయన చెపుతూంటే మా కులగురువులు శతానందులు అపరిమితానందం పొందారు. వారితల్లిగదా అహల్యాదేవి.

మా నాన్నగారు విశ్వామిత్రులకూ, దాశరథులకూ శివధనుస్సుకథ చెప్పి, దానిని రాముడు ఎత్తితే నన్ను కళ్యాణవేదికమీద స్వీకరించవచ్చు నన్నారు. మరునాడు సభాస్థలిలో మా శతానందులు, విశ్వామిత్రులు యింకా ఎందరెందరో మహర్షులూ వున్నారు. శివధనుస్సు తెచ్చారు. ఎనిమిదిచక్రాల బండిమీద ఉక్కుతోచేసిన పెట్టెలోవున్న ధనుస్సును అయిదు వేలమంది తీసుకువచ్చారు. మా నాన్నగారు మళ్ళీ దానికథ వినిపించి : 'మీ రాజపుత్రులు ప్రయత్నించవచ్చు' అన్నారు. చిరునవ్వుతో విశ్వామిత్రమహర్షి రామచంద్రునివైపు చూశారు.

ఆయనలేచి ధనుస్సువున్న మంజూషదగ్గరకువచ్చి, తలుపు తెరిచి చూసి : మహర్షీ ! ఆజ్ఞయా, అన్నారు. విశ్వామిత్రులు మా నాన్నగారిని చూశారు. ఆయన కన్నులు అనుమతి యిచ్చాయి. అంతే !

ఆయన ధనుస్సు మధ్యభాగం అవలీలగా అందుకొని పైకెత్తారు. అందరూ చూస్తూనే వున్నారు. ధనుస్సు నిలబడింది. అల్లెత్రాడు బిగిసిందో, లేదో, పిడుగులు పడుతున్న ధ్వనితో ఆ విల్లు రెండుముక్కలైంది. పర్వతాలు భిన్నమైనట్లు, భూమి కంపించినట్లు అనిపించింది. అందరూ ఆశ్చర్యంతో అలసటపడ్డారు. కొంతసేపటికి కాని వారెవరికీ స్మృతిరాలేదు. అప్పుడు మా నాన్నగారు లేచి : విశ్వామిత్ర మహర్షీ ! ఈ దాశరథుల పరాక్రమం యిక్కడివారందరూ తిలకించారు. ఈ వయసులో ఇంత

పరాక్రమం ప్రదర్శించిన వీరుడు మరొకడుండడు. అటువంటివానిని భర్తగా పొందిన నా బిడ్డ మావంశపుకీర్తిని దిశాంతవ్యాప్తం చేయగలదు. నాప్రాణంగా చూసుకుంటూన్న మా సీతను ఈయనకిచ్చి వివాహం జరపాలి. మీరు ఆజ్ఞయిస్తే యిప్పుడే అయోధ్యాధిపతికి సందేశం పంపుతాం, అన్నారు.

ఆయన చిరునవ్వుతో ఆమోదించడం మా దూతలు అయోధ్యకు వెళ్ళడం, వారి ముఖాన సమాచారంవిన్న దశరథమహారాజు తమ కులగురువులైన వసిష్ఠ వామదేవులతో మిగిలిన మంత్రులతో చతురంగబలాలు వెంటరాగా. మంత్రి, సామంత, పురోహితులను తోడుకొని నాలుగురోజుల వ్యవధిలో విదేహకు వచ్చారు.

మానాన్నగారు, కులగురువులు శతానందులతో ఎదురేగి స్వాగతమిచ్చి ఉచిత భవనాలలో విడిదిచేయించారు, సాంకాశ్యనగరంనుండి మాపినతండ్రి కుశధ్వజులు కూడా వచ్చారు, పిలుపునందుకొని.

ఆ మరునాడు మంత్రి, పురోహితులతో సంప్రదించి రఘువంశ ప్రభువులను వారి ఆత్మీయులతో, ఆప్తులతో మా సభాభవనానికి ఆహ్వానించారు. మా మంత్రి సుధాముల వారు సగౌరవంగాతోడ్కొని తెచ్చారు. అప్పుడు దశరథమహారాజు సంతోషంతో :

విదేహాధిపతీ! శ్రీవసిష్ఠులు మా పురోహితులు మాత్రమే కాదు, మా ఇక్ష్వాకుల దైవం. వారిమాట మాకు శిరోధార్యం. విశ్వామిత్రులతో సంప్రదించి వారు మాకు ఆజ్ఞయిస్తారు, అని మౌనంవహించారు.

అప్పుడు వసిష్ఠులులేచి ; శాశ్వతుడూ, అవ్యక్తుడూ అయిన పరబ్రహ్మనుండి బ్రహ్మ ప్రభవించాడు. ఆ ప్రజాపతికి మరీచి ఉద్భవించాడు. ఈయనకు కశ్యపుడు, కశ్యపునికి వివస్వంతుడు, ఈయనకు మనువు పుట్టాడు. మనువుపుత్రుడు ఇక్ష్వాకువు. ఆయన తొట్టతొలి అయోధ్యాధిపతి. ఆ వంశంలో అంశుమంతుడు, దిలీపుడు, భగీరథుడు,కకుత్థ్సువు అలా ఒకరితరువాయి ఒకరు పాలించారు. అనంతరం రఘువు, అంటూ వారి ప్రవర సాగించి, జనకభూపాలా! అంబరీష, నాభాగుల అనంతరం అజమహారాజు, ఆయన కుమారుడు మా దశరథప్రభువు. ఈ ప్రభువుబిడ్డలు రామలక్ష్మణులు, మా రాజ నందనులకోసం ఓ మహారాజా! అసదృశశీల, రూప, లావణ్య వయస్వినులైన నీ కుమార్తెలను అర్థిస్తున్నాను, అని కన్యావరణ కర్తవ్యం నిర్వర్తించారు.

అప్పుడు మా నాన్నగారు : ధర్మ కర్మా చరణంతో ముల్లోకాలలో ఖ్యాతిపొందిన నిమి మా వంశానికి మూలపురుషుడు. ఆయన కొడుకు మిథి, ఈయన కుమారుడు

జనకుడు. ఈయనవల్ల మా వంశం జనకవంశంగా ప్రఖ్యాత మయింది. అలా వర్ధిల్లిన మావంశంలో కీర్తిరాతుడు, మహారోముడు ప్రభవించారు. ఈయనకు స్వర్ణరోముడు, ఆయనకు హ్రస్వరోముడు. ఈయనే మా పితృదేవులు. మేమిద్దరం అన్నదమ్ములం. నన్ను సీరధ్వజుడంటారు. మా తమ్ముడు కుశధ్వజుడు. నన్ను సింహాసనం ఎక్కించి మా పితృపాదులు వానప్రస్థాశ్రమం స్వీకరించారు. ఇదీ మా వంశగాథ. అటువంటి వంశంలో పుట్టిన నేను నాకుమార్తె సీతను రామునికీ, ఊర్మిళను లక్ష్మణునికీ యిచ్చి వివాహం జరిపిస్తాను, అన్నాడు.

అమ్మా అనసూయాదేవీ! విశ్వామిత్రులవారు వసిష్ఠులవారితో సంప్రదించి అప్పుడ న్నారుగదా:

మీ ఉభయ వంశాలూ విఖ్యాతమైనవి. మీ ఉభయుల సంబంధం మా అందరికీ ఆనందప్రదం, మరొక్కమాట, కుశధ్వజునికి యిద్దరు బిడ్డలున్నారుకదా. వారిని భరత శత్రుఘ్నులకు యివ్వవలసిందిగా నేను అర్థిస్తున్నాను, అంటూంటే మానాన్నగారి హృదయం ఆనంద తరంగిణి అయింది. ఆననందిగి: మునిలోక పూజ్యులయిన మీమాట మాకూ, వారికీ శిరోధార్యమే. మా మాండవిని భరతునికీ, శ్రుతకీర్తిని శత్రుఘ్నునికీ యిచ్చి వివాహం జరిపించడంకంటె అదృష్టమేముంది, అని అంజలి బంధంతో విశ్వామిత్రులనూ, వసిష్ఠుల నూ, చేరి ఈ రాజ్యసర్వస్వం మీది. మీ శాసనం మాకు అనుసరణీయం. ఉత్తర ఫల్గుణీనక్షత్రంలో ప్రజాపతి భగుడు ప్రవేశించే సుముహూర్తం వివాహానికి శుభప్రదం అంటారు. ఆ ముహూర్తంలో ఈ కన్యాదానాలు మా చేత జరిపించండి అన్నాడు.

వారు వారి విడిదిమందిరాలకు చేరారు. బంగారు తొడుగుల కొమ్ములుగల గోవు లను భూరిదక్షిణలతో వేదవిదులకు దానంచేయించారు వారు. ఆ రోజునే మా భరతుని మేనమామ యుధాజిత్తు వచ్చారు. వారికి జరగవలసిన మర్యాదలు జరుపుతున్నారు.

దాశరథులు ఉపవాసవ్రతం పూని, ఆ రాత్రి గడిపారు. తెలతెలవారుతూండగా విధ్యుక్తక్రియలు నిర్వహించి సుముహూర్తవేళకు యజ్ఞవేదిక దగ్గరకువచ్చారు. పెళ్ళివారిని ద్వారంలో నిలబెట్టి శ్రీవసిష్ఠులు మా నాన్నగారి దగ్గరకువచ్చి: జనకరాజర్షీ! మా మహారాజు మంగళప్రదమయిన ముహూర్తం సమీపిస్తున్నదని వచ్చి, యిక్కడ నిలబడ్డారు. కన్యా దాతగా నువ్వు నీ ధర్మాన్ని నిర్వహించి కల్యాణంజరపాలి. దాతృ ప్రతిగ్రహీతల మనో భీష్టసిద్ధికోసం అన్నారు.

అప్పుడు మా నాన్న : బ్రహ్మర్షీ! ఇక్కడ దాత ఎవరు? ప్రతిగ్రహీత ఎవరు? ఇదంతా మీదే అని మనవి చేసుకున్నాను. మీ యింట్లో యేం జరగాలో అది జరిపించుకోండి. నాదేముంది, మాబిడ్డలు మంగళక్రియలన్నీ పూర్తిచేసి, అరుగో! యజ్ఞవేదిక దగ్గరే వున్నారు. శుభకార్యం జరిపించండి, అన్నారు.

శ్రీవసిష్ఠులు తమ మహారాజునూ, వారి కుమారులనూ, మహర్షులనూ, ఇతర ఆత్మీయులనూ లోనికి తీసుకువచ్చారు. శతానంద, విశ్వామిత్ర పురస్సరులయి మా నాన్నగారు వచ్చి శుభకార్యం నడిపించమన్నారు.

యజ్ఞశాలామధ్యంలో కల్యాణవేదిక, దాన్ని గంధ పుష్పాక్షతలతో అలంకరించారు. చుట్టూ రక రకాల ధాన్యాల మొలకలతో పాలికలు. వేదికమీద లాజపాత్రలు స్రుక్ స్రువాలు. అగ్రాలుకల పవిత్రదర్భలు....

అగ్ని వ్రేల్చారు.

సర్వాభరణాలతో అప్పటికే నన్ను అలంకరించారు. అగ్నికి అభిముఖంగా దాశరథులలో జ్యేష్ఠునికి ఎదురుగా నన్ను నిలబెట్టి, మా నాన్నగారు :

ఇయం సీతా మమ సుతా
సహధర్మచరీ తవ।
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే
పాణిం గృహ్ణీష్వ పాణినా॥
పతివ్రతా మహాభాగా
ఛాయే వానుగతా సదా....

అంటూ మంత్రపూతజలాలతో కన్యాదానం చేశారు. మహర్షులు, దేవతలు అందరూ మంగళాశీస్సులు పలికారు.

ఆ విధంగానే మా ఊర్మిళకూ, మాండవికీ, శ్రుతకీర్తికీ పాణిగ్రహణం జరిపించారు.

శ్రీవసిష్ఠుల ఆదేశానుసారం మేమందరం ముందుగా అగ్నిహోత్రునకూ, అనంతరం దశరథ ప్రభువుకీ, తదుపరి మహర్షి సంఘానికీ నమస్కారపూర్వకంగా ప్రదక్షిణం చేశాం. మే మందరం వారి విడిదిభవనాలకు వెళ్ళాం.

ఆ మరునాడే విశ్వామిత్రులు తమ ఆశ్రమానికి వెళ్ళారు. మా మామగారి వెంట మేమంతా అయోధ్య వెళ్ళాం, అని సీతాదేవి సిగ్గుతో తలవంచుకుంది.

అనసూయాదేవి నిండుగా నవ్వి :

అమ్మా ! నాకు తెలిసిన కథే, నువ్వు చెపుతూవుంటే ఎంత ఆనందం కలిగిందేతల్లీ, అని వెన్ను దువ్వి :

అమ్మాయీ ! సంధ్యాకాలం అయివట్టుంది, పక్షులు గూళ్ళకి చేరుతున్నాయి. అప్పుడే మహర్షులు స్నానార్ద్రవల్కలాలతో వస్తున్నారు.

అగ్నిశాలలనుంచి చూశావా! పావురాలు ఎగురుతూన్నట్లు హోమధూమం లేస్తున్నది. సూర్యుడు అస్తమించడంతో, కొద్ది కొద్ది ఆకులున్న చెట్లుకూడా గుబురులతో ఉన్నట్లున్నాయిగా. తపోవన మృగాలప్పుడే నడివాలుస్తూ వున్నాయి. వెన్నెలవలిపం మేలిముసుగుగా చంద్రోదయ మవుతున్నది. ఇకనువ్వు వెళ్ళిరా తల్లీ. ఒక్కమాట. వెళ్ళబోయేముందు ఈ అంగరాగాలు అలంకరించుకుని నే నిచ్చిన చీరకట్టుకో అమ్మా. చూడాలనివుంది, అని మురిసిపోయింది.

అనసూయాదేవి ఆదేశాన్ని అక్షరాలా పాటించి సీత ఆవిడ పాదాలకు మ్రొక్కింది. ఆ ముదునలి ఆశీర్వదించింది. సీత రామచంద్రుని చేరింది. ఆయనతవ భార్యలో క్రొత్త అందాలు చూసి; ఏమిటిది ? అనగా కథ అంతా చెప్పింది సీత.

రాత్రి తప్పుకుంది. తెల్లవారింది. రామలక్ష్మణులు ఉదయ సంధ్యాకృత్యాలు నిర్వర్తించి అత్ర్యాది మహర్షుల సెలవుకోరగా :

రాజనందనులారా ! మీరు వెళ్ళే దారిలో వరమాంసం తినే రాక్షసులు వున్నారు. క్రూరమృగాలు కూడా విచ్చలవిడిగా తిరుగుతూంటాయి. అక్కడ తపస్విజనాన్ని ఈ బాధలనుండి రక్షించండి. అన్నారు వారు.

రాముడు వారిమాటలకు తలవూపి ముందుకు సాగాడు.

ఇతీరితః ప్రాంజలిభి స్తపస్విభిః
ద్విజైః కృతస్వ్యస్త్యయనః పరం తపః ।
వనం స భార్యః ప్రవివేశ రాఘవః
సలక్ష్మణః సూర్య ఇవాభ్రమండలమ్ ॥

ఇది అయోధ్యా కాండ.

# అరణ్యకాండ

## దండకారణ్యం

వేదవిద్యాశ్రీయుతమై, మధ్యాహ్న సూర్యబింబ సమంగా వెలుగొందే ఆశ్రమాలతో అలరారే దండకారణ్యంలో సీతా రామ లక్ష్మణులు ప్రవేశించారు. పరిశుభ్రంగాఉన్న ముంగిళ్ళు, ముంగిళ్ళన్నీ ముగ్గులతో వున్నాయి. నానావిధములైన మృగజాతులకు, పక్షిసమూహాలకు, ఆశ్రయమిచ్చే లతలువిండిన మహావృక్షాలు నయనమనోహరంగా, శ్రవణ సుభగస్వనాలతో ఆహ్వానం పలుకుతున్నాయి.

లేడిచర్మాలు, పవిత్రములైన దర్భలు, స్రుక్ స్రువాలు, పావన నదీజల పూర్ణ కలశాలు, కందమూలఫలాలు, 'ఆవువేయి వ్రేల్చిన అగ్నికుండంనుండి వ్యాపించే సుగంధ ధూమం, ఏకాగ్రచిత్తంతో సాగే వేదగానం .... ఇన్నిటితో నిండిన ఆశ్రమాలు, ఆశ్రమ పరిసరాలలో వికసిత కమలశోభతో సరోవరాలు, తపోదీక్షితులై, నియమిత ఆహార, విహారులై పరతత్వాన్ని ఉపాసించే మహర్షులు వైశ్వానరతేజో మూర్తులవలె గోచరిస్తున్నారు. అది చతుర్ముఖప్రజాపతి ఆవాసంలా ఉన్నది.

జ్ఞాన సంపన్నులైన ఆ మహామునులందరూ రామచంద్రుడు తన పత్నితో, తమ్మునితో వస్తున్నాడని తెలిసి, ఎదురేగి ఆనందపూర్ణహృదయంతో మంగళవాక్యాలతో స్వాగతం పలికారు.

బ్రహ్మవిద్యను ఉపాసించే ఆ మునులందరూ సీతా రామ లక్ష్మణులను చూచి ఆశ్చర్యంతో మాటా పలుకూ లేకుండా రెప్పవాల్చకుండా నిలబడి, కొంతసేపటికి కర్తవ్యం స్మరణకురాగా, అర్ఘ్య పాద్యాది అతిథి సత్కారాలతో పర్ణశాల లోపలికి తీసుకువెళ్ళి స్వాదుజలాలూ, మధురఫలాలూ అర్పించారు.

చిరునవ్వుతో రామచంద్రుడు వారి సత్కారాలన్నీ స్వీకరించి, విశ్రాంతితీసుకునే వేళ, ఆ మునులు,

ఓ రఘువంశీయుడా! నువ్వు మాకు మాన్యుడవు, పూజ్యుడవు, చక్రవర్తివి. ఇంద్రుని అంశతో ప్రభవించే చక్రవర్తి సర్వప్రజారక్షకుడై, వారందరికీ పూజార్హుడవుతాడు. మేమందరం నీ రాజ్యంలో నీ రక్షణలో వున్నవారము. నువ్వు రాజధానిలోవున్నా, అడవిలోవున్నా మాకు రక్షకుడివే. ఇంద్రియ నిగ్రహంతో జితక్రోధులమై శాప దండాన్ని విడిచి తపోధనార్థులమై ఈ అరణ్యంలోవున్న మాకు నువ్వే శరణ్యుడవు, అన్నారు.

వారిందరివద్ద ఆరాత్రి గడిపి మరునాడు సీతా లక్ష్మణ సహితుడై అడవి మధ్య భాగానికి ప్రయాణం సాగిస్తున్నాడు. సాగుతున్నకొద్దీ అరణ్యం భయానకంగా వున్నది. ఎటుచూచినా వ్యాఘ్రగర్జనలు, భల్లూకధ్వానాలు, రేవులేని మహాతటాకాలు, చిందరవంద రయిన తీగలతో, విరిగిన చెట్లకొమ్మలతో, కిమ్మనకుండా కూర్చున్న పక్షిసంఘాలతో, నిర్విరామంగా కీచురాళ్ళ ధ్వనులతో నిండిన ఆ ప్రాంతంలో నడుమ్మొండగా ఎత్తయిన కొండవంటి దేహంతో విరాధుడు ఎదురువడ్డాడు. లోతుగావున్న కళ్ళు, విశాలమైన నోరు, ఎదరకు పొడుచుకొచ్చిన పొట్ట, ఇంకా నెత్తురుఓడుతున్న పెద్దపులిచర్మం చుట్టబెట్టుకుని వికృత రూపంతో బీభత్సదేహంతోవున్న వాడి భుజం మీద ఇనవశూలం వుంది. ఆ శూలానికి, మూడుసింహాలు, నాలుగు శార్దూలాలు, పది అడవిపందులు, రెండుతోడేళ్ళు ఒక ఏనుగుతల వేళ్లాడుతున్నాయి.

సీతా రామ లక్ష్మణులు కంటబడడంతో వాడు ఒక్క అరుపు అరిచి వారి మీదికి లంఘించాడు. లంఘిస్తూనే ఒకచేతితో సీతను పట్టుకుని: ఎవరురా మీరు? ఆయువు మూడినవారుకాని ఈ ప్రాంతంలో గాలిపీల్చరు. ఇంతకూ మీ వేషాలేమిటి? చేతిలో శరచాపాలున్నాయి, నడుమున కత్తులు మెరుస్తున్నాయి. మరి మహామునులవలె నారచీర లుకట్టి, జడలు వేసుకున్నారేమిటి? నేనెవరినో తెలుసా! విరాధుడనే రాక్షసుడను రోజూ ఋషులమాంసమే ఆహారంగా తీసుకుంటాను. ఈ సుందరిని నా భార్యగా గ్రహించి పాపకర్ములైన మీ రక్తం త్రాగుతాను, అని ఒక్కపాలికేక వేశాడు.

జానకి గజగజ లాడింది. ఝంఝామారుతంలో అరటిమొవ్వలా చలించింది. సీతనుచూచే రాముని గుండె వణికింది. తమ్ముడూ! విదేహాధీశుని యింటి ఆడుబిడ్డకు ఎటువంటి క్లేశాలు తెచ్చిపెట్టాం. కైకెయి తనకొడుక్కి రాజ్యంకోరి వూరుకోక ఈ వనవాసం నా కెందుకు విధించిందో యిప్పుడు తెలుస్తున్నది. ఆవిడకోరిక పూర్తిగా నెరవేరింది.

కన్నతండ్రి కన్నుమూసినా కాళ్ళముందు కొచ్చిన కోసల రాజ్యలక్ష్మి కాకుండా పోయినా నాకు గుండె జారలేదు. ఇప్పుడీ దుష్టుడిచేతిలో జానకి చిక్కుబడేసరికి....అంటూ గద్గద గాత్రుడుకాగా లక్ష్మణుడు కోడెత్రాచులా బుసకొట్టి: అన్నా! దేవేంద్రసముడవయిన నువ్వేనా మాట్లాడుతున్నది, నావంటి సేవకుడుండగా నీకెందుకు బాధ. ఇదిగో బాణం సంధిస్తున్నాను. ఇది వాడి శిరస్సును నరికి రక్తపావం చేసి నేలకూలుస్తుంది. నాక్రోధాగ్ని వజ్రాయుధంగా సాగి వీణ్ని భూపతితుని చేస్తుంది. అన్నాడు.

విరాధుడు హుంకరించి: ఇంతకీ మీరెవరు? ఎక్కడకు ప్రయాణం? అనగా రాముడు: మేము ఇక్ష్వాకువంశ క్షత్రియులం. అరణ్యవాసానికి వచ్చాం. ఇంతకీ నువ్వెవడవు? ఇక్కడెందుకుంటున్నావు అన్నాడు.

రాక్షసకోటి నన్ను విరాధుడని పిలుస్తుంది. నేను శతహ్రద కొడుకుని : జవుడు నా తండ్రి. నా తపోదీక్షకు బ్రహ్మ ప్రసన్నుడై శస్త్రాలతో అచ్ఛేద్యుడవూ, అవధ్యుడవూ అవుతావని వరమిచ్చాడు. అందుచేత మీరు అనవసరశ్రమ పడకుండా ఈ పిల్లను వదిలి పొండి. మీప్రాణాలు మీకు దక్కుతాయి, అన్నాడు.

ఆ మాటలు వింటున్న రామచంద్రుని కన్నులలో విస్ఫులింగాలు రేగాయి : ఓరి దుష్టుడా! నీకు కాలం సమీపించడంవల్లనే సీతను పట్టుకున్నావు. రా, బ్రతుకు కడతేర్చు కుందువుగాని-అంటూ బాణం సంధించి విరాధుని శరీరానికి గురిపెట్టి కొట్టాడు. రాముడు విడిచిన ఏడుబాణాలు విరాధుని శరీరంనుంచి దూసుకుపోయి నేలలో దిగాయి. కుపితుడై విరాధుడు సీతను విడిచి, శూలం ముందుకుపెట్టి భీకర గర్జనచేస్తూ వికృతవదనంతో రాము నిమీదకి నడుస్తున్నాడు. రామ లక్ష్మణులు శరవర్షంతో వాని గమనవేగాన్ని అరికట్టారు. ఎన్నిబాణాలు తగిలినా వాడు చలించకుండా శూలం విసరడమూ, రాముడు దానిని మధ్య లోనే రెండుముక్కలుగా ఖండించడమూ ఏకకాలంలోనే జరిగాయి. రామ లక్ష్మణులు వాడి కత్తులతో వాని భుజాలు నరకడం మొదలుపెట్టారు. వాడు వారిద్దరినీ చెరొక చేత్తో బంతుల్లా పట్టుకుని పైకెత్తి అడవిలోకి పరుగు ప్రారంభించాడు.

అప్పుడు రాముడు : తమ్ముడూ! ఈ రాక్షసుడు మనకు మంచి సాయంచేస్తున్నాడు ఈ అడవిలో దారితెలియక అవస్థపడుతున్న మనకు వీడి భుజాలమీంచి అంతా చూచే అవ కాశం దొరికింది, అన్నాడు.

ఇక్కడ సీత భయభ్రాంతయై : ఓ రాక్షసుడా! పవిత్రశీలుడూ సచ్చరిత్రుడూ సత్య వ్రతపరాయణుడూ అయిన నాభర్తను విడిచి నన్ను చంపెయ్యి అని రోదించ సాగింది.

ఆమె ఆర్తనాదం విన్న రామ లక్ష్మణులు నిశితంగా యోచించి, యిద్దరూ ఏకకాలంలో వాడిచేతులు నరకడంతో వాడు మూర్ఛితుడై నేలకూలాడు. నేలకూలిన ఆ రాక్షసుని తమ పాదాలతో ముష్టిఘాతాలతో ఎంతగా హింసించినా వాడు అంతిమశ్వాస విడువలేదు. అది చూచి రాముడు ;

తమ్ముడూ వీడు ఇలా చావడు, నేను నా కాలితోతొక్కి వుంచుతాను. నువ్వు గొయ్యి తవ్వు అందులో పూడ్చేద్దాం, అనగా విన్న విరాధుడు : ఓ ఇక్ష్వాకువంశీయుడా! ఇప్పటికి తెలిసింది నాకు నువ్వెవరివో. నా మోహం తొలగిపోయింది, నువ్వు కౌసల్యా సుతుడవనీ ఈ చిన్నవాడు నీ తమ్ముడనీ తెలిసింది. నేను తుంబురుడనే గంధర్వుడను. కుబేరశాపంవల్ల ఈ అవస్థపాలయ్యాను. నీ చేతులలో నాకుశాపవిమోచనం అనుగ్రహిం చాడు ఆయన.

ఓ పరంతపా! నన్ను ఆ గోతిలో పాతిపెట్టండి. అదే నాకు మృత్యుమార్గం. ఇక మీరు ఇక్కడనుంచి కొద్దిదూరం వెడితే అక్కడ శరభంగ మహర్షి ఆశ్రమం వున్నది. ఆయన మీకు సర్వశుభాలూ అనుగ్రహిస్తాడు, అన్నాడు.

విరాధుడు చెప్పినట్లే రామ లక్ష్మణులు వానిని ఖననంచేసి, వెనుదిరిగి జానకిని సమీపించారు. ఆమెను దగ్గరగా తీసుకుని జరిగిన కథ అంతా చెప్పి శరభంగ మహర్షి ఆశ్రమంవైపు వెళ్ళారు. ఆ ఆశ్రమాన్ని సమీపించేవేళకు ప్రజ్వలితవహ్నిద్యుతులతో ఒకానొక దివ్యపురుషుడు రథంతో వున్నాడు. రథం ఆకాశవీథిలోనే వున్నది. ఆ పురుషుడు దిగివచ్చాడు. ఆయన పాదాలు నేలను తాకడంలేదు. స్వచ్ఛవస్త్రధారియై దివ్యమాల్యాను లేపనాలతో శరద్రాకాచంద్రబింబసదృశఛత్రంతో వున్నాడు. ఇరువంకలా చామర ధారిణులున్నారు. అదిచూచి రాముడు:

తమ్ముడూ! చూశావా! అంతరిక్షంలో ఆదిత్యమండలంలా ఆ రథం. ఆ రథానికి పూన్చిన అశ్వాలు! మనం చిన్ననాడువిన్న దేవేంద్రుని రథాశ్వాలవలెవున్నాయి. దాన్ని పరివేష్టించి వున్నవారంతా ఎర్రనిబట్టలతో ఖడ్గపాణులై, నడివయస్సులో వున్నారు. ఆ మహాపురుషుడు మహర్షితో ఏమో మాట్లాడుతున్నాడు. నువ్వు సీతతో యిక్కడేవుండు! నేను వెళ్ళి వివరం తెలుసుకు వస్తాను, అని ఆశ్రమప్రాంగణం సమీపించాడు. అది గమనించిన దేవేంద్రుడు ఆ సమయంలో అక్కడ వుండరాదు అనుకుని అంతర్హితుడయాడు. సీతా, లక్ష్మణులతో రామచంద్రుడు ఆశ్రమంలో అగ్నిశాలవద్ద శరభంగుని దర్శించి పాదాభివాదం చేశారు, వెంటవున్నవారు కూడా మహర్షికి అభివాదం చేశాక, రాముడు సాభిప్రాయంగా చూడగా శరభంగమహర్షి చిరునవ్వుతో: దేవేంద్రుడు స్వయంగావచ్చాడు నన్ను తీసుకువెళ్ళడానికి. నా తపోదీక్ష నాకు బ్రహ్మలోకప్రాప్తిని అనుగ్రహించింది, నువ్వు వస్తున్నావని తెలిసి నిన్ను చూడకుండా వెళ్ళరాదని ఆగిపోయాను. తపశ్శక్తితో నేను సాధించిందంతా నీకు అర్పిస్తాను, అనగా రాముడు:

మహర్షీ! నన్ను స్వశక్తితో వాటిని సాధించుకోనివ్వండి. ఈ అడవిలో మాకు వాసయోగ్యమైన స్థానం ఏదో చెప్పండి, అని అడిగాడు.

రామచంద్రా! ఇక్కడకు సమీపంలోనే సుతీక్ష్ణమహర్షి ఆశ్రమం వున్నది. ఆయన నీకు అన్నివిషయాలూ చెపుతాడు. ఇక్కడ మరొక్కక్షణం నిలబడు. నా దేహాన్ని విసర్జించేస్తాను, అని ఆజ్యధారతో అగ్నిని ప్రజ్వలితంచేసి అందులో ప్రవేశించాడు. అలా ఆయన బ్రహ్మలోకంచేరిన అనంతరం, ఆ పరిసర ప్రాంతాల మునులందరూ రామ చంద్రునిచేరి:

దాశరథీ! ఈ పృథివిలో నీఅంతటి వీరుడులేడు. నువ్వు సర్వజగన్నాథుడవు, పృథివీపతి తన పాలితుల సంపదలో ఆరవభాగం పన్నుగా గ్రహించి వారి రక్షణభారం వహించాలి. ఇక మావంటి తపస్వుల తపఃఫలంలో నాల్గవవంతు ప్రభువుకి లభిస్తుంది. అందుచేత మా రక్షణభారం కూడా నువ్వే వహించాలి. చిత్రకూటం నుండి పంపాతీరం వరకూ వున్న మా మునిజనాన్ని రాక్షసులు విపరీతంగా హింసిస్తున్నారు. ఈ రాక్షసబాధ మాకు తొలగించగలవాడవూ తొలగించవలసినవాడవూ నువ్వే, అన్నారు.

మహామునులారా! మీ ఆజ్ఞ నాకు శిరోధార్యం. పితృవాక్పాలనకే నేను అడవికి వచ్చాను. ఇప్పుడు మీ ఆదేశంకూడా నాకు అవశ్యం అనుసరణీయం. మీకు క్లేశాలు కలిగించే రాక్షసు లందరినీ సంహరిస్తాను, అని వారికి అభయం యిచ్చాడు.

అనంతరం సుతీక్ష్ణమహర్షి ఆశ్రమంవైపు సాగారు సీతారామ లక్ష్మణులు. నదీతీరం వెంట నడిచి నడిచి మహర్షి ఆశ్రమాన్ని చేరి, కులగోత్రాలు చెప్పుకొని పాదాభివాదం చేశారు. ఆయన రాముని దగ్గరకు తీసుకొని: రామభద్రా! మీరు అడవిలో అడుగు పెట్టింది మొదలు మీ వార్తలు ఎప్పటికప్పుడు మాకు అందుతూనే వున్నాయి. చిరకాల తపఃఫలంగా నేను సాధించిన పుణ్యలోకాలూ, తపశ్శక్తి నీకు ధారపోస్తాను, అన్నాడు.

రాముడు వినయంగా: మహాత్మా! ఆ శక్తులను స్వయంగా సాధించే అవకాశం నాకు అనుగ్రహించండి: మీ భూతదయాదృష్టినీ, తపశ్శక్తినీ శరభంగమహర్షి మాకు వివరించారు. మేం ఎక్కడ నివసించాలో మీరే చెపుతారని ఆయన అన్నారు. మీ ఆదేశంకోసం ఎదురుచూస్తున్నాం, అన్నాడు.

రామభద్రా! మీరు ఇక్కడే వుండవచ్చు. ఈ పరిసరాలలో కొన్ని మృగాలు న్నాయి. అప్పుడప్పుడవి వచ్చి మన తపోదీక్షకు విఘ్నం కలిగిస్తాయి. అంతే, అవి క్రూరమృగాలు కావు, అనగా, రాముడు:

ఆ మృగాలను వేటాడడం మాకంత పెద్దపనిగాదు. అయితే అది మీ అభిమతం కాదనుకుంటాను. అయినా మీ ఆశ్రమంలో వుండవలసినదిగా మమ్మ నిరోధించవద్దు అన్నాడు.

పొద్దు గ్రుంకింది. అందరూ సంధ్యోపాసన చేశారు. రాత్రిగడిచింది. ఉదయ సంధ్యావందనాలు ముగించి, మళ్ళీ మహర్షికి అభివాదంచేసి: మాకు అనుజ్ఞఇవ్వండి, అన్నాడు రాముడు.

రామభద్రా! ఈ దండకారణ్యంలోని మహాత్ముల ఆశ్రమాలన్నీ మీరు దర్శించాలి. సుగంధభరితాలైన పూలతో నిండిన చెట్లు, అత్యంత స్వాదువులయిన మూలఫలాలు, ప్రశాంత వాతావరణం, కలస్వనాలతో పక్షులు, రుచిగావుండే జలాలు, నిండిన కొలనులు, చక్కని సెలయేళ్లు, హాయిగా నర్తనంచేసే మయూరాలు....ఇవన్నీ చూసి మళ్ళీ నా ఆశ్రమానికి రావాలిసుమా! అన్నాడు మహర్షి.

రామ లక్ష్మణులు ఆయనకు ప్రదక్షిణంచేసి, ప్రయాణ సన్నద్ధులయారు. జానకి వారికి బాణ, తూణీర, ఖడ్గాలు అందించింది. యాత్ర ఆరంభమైంది.

ఆమాటా ఈమాటా చెప్పుకుంటూ వెడుతున్నారు. ఆ సమయంలో జానకి: ఆర్యపుత్రా! అధర్మం పున్నదే అది ఏదో సందుచూచుకొని మహామహులను కూడా వంచిస్తుందని విన్నాను. అసత్యభాషణం, పరదారాభిగమనం, వైరంలేని హింస — ఈ మూడూ అధర్మ పదాలు. ఇందులో మొదటి రెండూ మీదరిజేరవు. మూడవదివున్నదే వైరం లేని హింస. అదొక్కటే మనల్ని బాధించేలావుంది. మహర్షిగణరక్షణార్థం రాక్షస సంహారం చేస్తానంటున్నారు. రాక్షససంహారానికే మీరు దండకారణ్యానికివచ్చినట్లు వీరు అనుకుంటున్నారు. మనకు రాక్షసులతో వైరం లేదు. వారిమీద బాణప్రయోగం దేనికి? అందుచేత మనం ఈ అడవిలో వుండవద్దు. మీరిద్దరూ ధనుర్బాణధరులై సాగుతూ ఎదురైన రాక్షసులమీద శరవర్షం కురిపిస్తారు. రాజపుత్రుడికి ధనుస్సు అగ్నిహోత్రుడికి ఇంధనం వంటిది.

నాకో కథ గుర్తుకువస్తోంది. పూర్వకాలంలో ఒకమహర్షి తపస్సును భగ్నం చెయ్యడానికి మార్గాంతరంలేక దేవేంద్రుడు సైనికరూపంలోవచ్చి తన ఖడ్గాన్ని ఆయనదగ్గర దాచిపెట్టమన్నాడు. ఆ మహర్షి దానిని రక్షించడంకోసం నిరంతరం తనతో ఉంచుకు తిరుగుతున్నాడు. అంతతో ఆయన మనస్సు ఆ ఖడ్గాన్ని వినియోగించడానికి అలవాటుపడి క్రూర కర్మలకూ, అధర్మానికీ లొంగి నరకానికి తీసుకువెళ్ళింది. మీకు హితోపదేశం చెయ్యగల శక్తి నాకులేదు. కాని మనతో ద్వేషంలేని వారిమీద కత్తిదుయ్యడం దేనికి? తపోవనాలలో శస్త్రంతో పనేమిటి? ఇక్కడ క్షాత్ర ధర్మపాలన అవసరమనుకోను. అయోధ్యకు వెళ్ళాక ఆ బాణాసనంతో శిష్టరక్షణ చేయవచ్చు. ఇక్కడ మునివృత్తిలో వుండవచ్చు. ధర్మమే సర్వార్థ కామాలకూ మూలమనీ, అదే యీ జగత్తుకు శ్రేయస్కరమనీ విన్నాను. కనుక ఈ అరణ్యంలో వున్నంతకాలం వనవాసధర్మం ఆచరించండి. ఈ మాటలు నా మనస్సులోని చాంచల్యంవల్ల చెప్పాను. వీటి మంచి చెడ్డలు మీ అన్నదమ్ము లిద్దరూ యోచనచేయండి అంది.

రాముడు: జానకీ! స్నేహస్నిగ్ధాలూ, హితసంభరితాలూ అయిన నీమాటలు జనక రాజనందనగా చక్కగా చెప్పావు. అడవిలోవున్నా, అయోధ్యలోవున్నా క్షత్రియధర్మం క్షత్రియధర్మమే. శిష్టులనూ, ఆర్తులనూ రక్షించడానికే రాజవంశీయులు ఖడ్గం ధరిస్తారు ఈ అరణ్యంలో ప్రశాంతంగా తపోదీక్ష వహించిన మునిజనాన్ని హింసించే దుష్టులను సంహరించడం నా ధర్మం.

జానకీ ! నిన్నూ, లక్ష్మణునీ విడిచిపెట్టడానికి కూడా సంకోచించను కానీ, ధర్మ మార్గాన్ని విడవడం అనే మాటకే అవకాశంలేదు. ఈ జీవితాన్ని తృణప్రాయంగా వదల డాని కయినా అంగీకరిస్తానుకాని చేసిన ప్రతిజ్ఞను, ఆడిన మాటను తప్పను, అని సమా ధానపరిచాడు.

యాత్ర సాగుతున్నది.

ముందుగా రాముడు ఆ వెనుక సీత, ఆమెను అనుసరించి లక్ష్మణుడు, శైల సానువులు, పద్మసరోవరాలు, వనవరాహాలు, అడవిదున్నలు, చీకటికొండలవలె ఏనుగులగుంపులు, అన్నిటినీ చూస్తూ సంధ్యాసమయానికి ఒక సరోవరతీరానికి చేరారు. స్వచ్ఛజలాలమధ్య ఎర్రని, తెల్లనిపద్మాలు, జలపక్షుల కలస్వనాలు, వీటన్నిటినీమించి కమ్మని గీతాగానానికి అనుగుణంగా వాద్యఘోష వినరాగా ఆశ్చర్యంతో అక్కడి ధర్మ భృతమహర్షిని సమీపించి, ఆ విశేషం ఏమిటని అడిగారు.

మాండకర్ణి అనే మహర్షి యిక్కడ దీర్ఘకాలం వాయుభక్షణతో తపస్సుచేస్తుంటే దేవతలు భీతులై అయిదుగురు అప్సరసలను పంపించారు. ఆయన కామవశు డయ్యాడు. వారు ఆయనను భర్తగా సేవించడం మొదలుపెట్టారు. వారికోసం ఈ సరోవరంలో ఒక భవనం నిర్మించా డాయన. తన తపఃప్రభావంతో ఆయన నిత్య యౌవనుడయాడు. మీకు వినిపించే నృత్త గీతాలన్నీ ఆ భవనంనుంచి వచ్చేవే, అన్నాడాయన.

అదివిని ఆశ్చర్యపడ్డారువారు. నెమ్మదిగా ముందుకు సాగిసాగి ఆ ప్రాంతాల మునిచంద్రులను దర్శించి, ఒక్కోచోట కొంతకాలం వుంటూ క్రమంగా పదిసంవత్సరాలు గడిపారు. అనంతరం సుతీక్ష్ణమహర్షి ఆదేశానుసారం తిరిగి ఆయన ఆశ్రమానికిచేరి :

మహర్షీ ! ఈ అరణ్యంలో ఎక్కడకు వెళ్ళినా అగస్త్యమహాముని ప్రశంసలే వినిపిస్తున్నాయి. వారిని దర్శించాలని వుంది. మీరు దారిచెపితే వెళ్ళి వారి ఆశీర్వాదాలు పొందుతాం, అనగా, రామభద్రా ! నేనే చెప్పాలనుకుంటున్నాను మీరే అడిగారు. దక్షి

ణంగా నాలుగుయోజనాలదూరం వెడితే అగస్త్యభ్రాత ఆశ్రమం. అక్కడ దట్టంగా రావిచెట్లు, సరోవరాలు. రాత్రికి అక్కడ గడిపి మరునాడు ఉదయమే బయలుదేరి దక్షిణంగానే మరొకయోజనం వెడితే అగస్త్యుల ఆశ్రమం, అన్నాడు.

ఆయన అనుజ్ఞపొంది వారు ప్రయాణం సాగించి, దట్టంగా పెరిగిన రావిచెట్ల నీడలలో ఉన్న అగస్త్యభ్రాత ఆశ్రమానికి చేరుతున్నారు.

అగ్నికార్యానికి అవసరమైన కట్టెలమోపులు, వైడూర్యకాంతులతో దర్భలప్రోవులు, యజ్ఞశాలలనుండి శ్వేతధూమం, నదీజలాలలో స్నానంచేసి సంధ్యనుపాసించే బ్రహ్మవాదులు. అలా ఆ మహారణ్యాన్ని వానయోగ్యంచేసిన అగస్త్యుని ప్రభావం గుర్తుకురాగా, రాముడు:

లక్ష్మణా ! వాతాపీ, ఇల్వలుడు అని యిద్దరు రాక్షసులు ఉండేవా రిక్కడ. వారికి విప్రమాంసంకాని రుచించేదికాదు. అందుకని వారుభయులూ బ్రాహ్మణవేషం ధరించి, దారికాని అటుపోయే విప్రులను భోజనానికి ఆహ్వానించేవారు. వారువచ్చాక వాతాపి మేకగా మారేవాడు, ఇల్వలుడు వానిని నరికి మాంసంవండి వడ్డించేవాడు. వారు తృప్తిగా భుజించి కూర్చున్నవేళ :

వాతాపీ!....రా....రా....అనేవాడు ఇల్వలుడు, వాతాపి ల అతిథిపొట్టనుచీల్చి వచ్చేవాడు. అనంతరం వారిరువురూ ఆ విప్రుని ఆరగించేవారు. వారి కదొక వేడుకగా చిరకాలం సాగింది. అది తెలిసి అగస్త్యమహర్షి స్వయంగా అక్కడకువచ్చి, వారి ఆతిథ్యం స్వీకరించి, హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. అలవాటుప్రకారం ఇల్వలుడు పిలచాడు. అదివిని అగస్త్యమహర్షి :

ఇంకా ఎక్కడ వాతాపి ? ఈపాటికి వాడు యమసదనం చేరివుంటాడు, అన డంతో ఇల్వలుడు తీవ్రక్రోధంతో ఆ మహర్షి మీదికి రాబోగా ఆయన కన్నులెర్రజేసి వానిని బూడిదచేశాడు. అని కథ చెపుతూంటే వారు మార్గాయాసం లేకుండా ముందుకు నడిచారు.

అగస్త్యభ్రాత ఆశ్రమంలో ప్రవేశించారు. వారి అభివాదా లందుకుని ఆయన వారికి అతిథిమర్యాదలు నిర్వర్తించాడు. ఆ రాత్రికి అక్కడ శయనించి మరునాడు తెల్లవారుతుండగా ఆ మహర్షి ఆజ్ఞ పొంది ప్రయాణం ఆరంభించారు.

పనస, సాల, మధూక, బిల్వ, వృక్షసమూహాలతో, ఫల పుష్ప శోభిత కానన తరువులతో, లతలతో అలరారే ప్రకృతి శోభను తిలకిస్తూ రాముడు వాటి విశేషాలు సీతకూ, లక్ష్మణునికీ వివరిస్తూ !

తమ్ముడూ ! చూశావా, ఈ పరిసరాలలో మృగాలు ప్రశాంతంగా చరిస్తున్నాయి. పక్షుల కలస్వనాలే వినవస్తున్నాయి. స్నిగ్ధపత్రాలతో లతా, తరువులు ప్రకృతిసౌందర్యం ఇనుమడింపజేస్తున్నాయి.

రాక్షసభీతి కారణంగా ఒకనాడు ఈ దక్షిణదిశవైపు ఎవరూ కన్నెత్తిచూడనేలేదు. అటువంటిది అగస్త్యమహర్షి ప్రభావంవల్ల ఎంత ప్రశాంతంగా వున్నదో! ఆ రోజులలో మేరువుతో స్పర్ధకలిగి వింధ్యపర్వతం సూర్యమండలపర్యంతం వ్యాపించగా ఆయన తన శాసనంతో దీన్ని యిలా వుంచాడు. అంతటి మహత్తర తపశ్శక్తిశాలి అయిన పురాణపురుషుడాయన. మనం యింక మిగిలిన కాలాన్ని ఈయన ఆశ్రమసమీపంలో గడుపుదాం. ధర్మబద్ధులూ, సత్యబద్ధులూ, అయిన వా రెందరో ఈయన ఆశ్రమంలో వుంటున్నారు, అని రాముడు చెపుతూండగానే ఆశ్రమం సమీపించింది.

సీతా రామ లక్ష్మణులు ఆశ్రమం సమీపించాక అక్కడున్న శిష్యునితో : మేము దశరథనందనులం. రామలక్ష్మణులం. ఈమె నాయిల్లాలు జానకి. మేము మహర్షిదర్శనానికి వచ్చాం, అన్నాడు రాముడు. శిష్యుడువెళ్ళి చెప్పగా మహర్షి : ఎంతకాలానికి, ఎంతకాలానికి ! రాఘవులను చూడాలని అనుకుంటూనే వున్నాను. తక్షణం తీసుకురా, అన్నాడు.

బ్రహ్మచారి తిరిగివచ్చి : ఎవరయ్యా రాముడు ! మా గురువులు వారినిచూడాలని కుతూహలపడుతున్నారు, అని దారి చూపించాడు.

వానివెంట వారు అగస్త్యుని అగ్నిశాల చేరారు. అక్కడ ఎన్నో హరిణాలు కనిపించాయి.

అగ్ని, వాయు, విష్ణు, ఇంద్ర, భగ, వివస్వాన్, సోమ, కుబేర, ధాత, విధాత, వరుణ, గాయత్రీ, వాసుకి, గరుడ, కార్తికేయ, ధర్ములతో, వసువులకుకూడా బలిభోజన స్థానాలున్న అగ్నిశాల ప్రవేశించారు. వారినిచూచి అగస్త్యుడు శిష్యసమేతం ఎదురువచ్చి స్వాగతం పలికాడు. రామచంద్రుడు ఆయనకు పాదాభివాదంచేశాడు. ఆయన రాముని లేవనెత్తి దగ్గరగా తీసుకున్నాడు. సీత, అనంతరం లక్ష్మణుడూ ఆయనకు అభివాదం చేశారు.

వారికి అర్ఘ్య పాద్యాదు లిచ్చాక, ఫలమూలాలు ఆరగింపజేసి మహర్షి :

రామభద్రా ! అగ్నిహోత్రుని అర్చించిన అనంతరం అతిథిపూజ జరపనివాడున్నాడే వాడు కూటసాక్ష్యాలు చెప్పేవాడిలా తనమాంసం తనే తింటాడు—అని శాస్త్ర ఘోష. ధర్మజ్ఞుడవైన నువ్వు వా ఆతిథ్యం స్వీకరించడం మా అదృష్టం అని కొంత ప్రసంగం సాగాక :

రామా ! వజ్రఖచితమూ హేమనిర్మితమూ అయినది ఈ ధనస్సు. ఇవిగో అక్షయతూణీరాలు. వీటిని తీసుకో, ఈ రజతఖడ్గం నీదగ్గర వుంచుకో. ఇవి విశ్వకర్మ నిర్మితాలు, వీటితోనే శ్రీమన్నారాయణుడు దేవతలను సర్వశుభాలూ సమకూర్చాడు. వీటిని దేవేంద్రుడు నాదగ్గర వుంచాడు. ఇవి నీకు అలంకారాలు. వీటితో ఇంద్రసమ పరాక్రముడవై విజయశ్రీ విరాజితుడవు కాగలవు, అని వారిముగ్గురినీచూచి :

నామీద మీకున్న ఆదరాభిమానాలకు ఆనందిస్తున్నాను. ఎంతో శ్రమపడి నన్ను చూడాలని వచ్చినందుకు సంతోషంగా వుంది. ప్రయాణంలో బాగా అలిసి నట్లున్నారు. ఈ జనకరాజనందన మరీ సుకుమారి, కనక మరింత అలసినట్లుంది. నీమీది గాఢాను రాగంతో ఈ అరణ్యక్లేశాలనుభవించడానికి వచ్చింది. ఈ లోకం వున్నదే, ఇది చాలా విపరీతమైనది, భర్త శ్రీమంతుడైతే ఆ సుఖభోగాలు అనుభవించడానికే స్త్రీలు ఇష్టపడతారు. పరిస్థితులు తారుమారైతే ఆ భర్తను విడవడానికయినా వెనుకాడరు: స్త్రీహృదయం వున్నదే అది ప్రవాహోదకంవలె చంచలమైనది. నిశితశస్త్రంవలె పదునైనది. గరుత్మంతునివలె వేగంగా సాగగలది. కాని నీ జానకి తద్భిన్నంగా వుంది. నిన్నే పరమంగా చూసుకునే ఈమెకు మనఃక్లేశం కలగకుండా చూసుకోవాలయ్యా ! అరుంధతివంటి సచ్చరిత్ర ఈమె. ఆమె కోరిక సమయానికి తీరుస్తూ వుండాలి, అన్నాడు.

రాముడు : మహాత్మా ! మీ అనుగ్రహానికి నోచుకున్న మా కంటె అదృష్టవంతులులేరు. మాకు ఈ పరిసరాలలో వాసయోగ్యస్థానం నిర్దేశించండి, అని వినయంగా అడిగాడు.

## పం చ వ టి

గృహీత చాపౌతు నరాధి పాత్మజౌ
విషక్త తూణీ సమరే ష్వకాతరౌ ।
యథోపదిష్టేన పథా మహర్షిణా
ప్రజగ్మతుః పంచవటీం సమాహితౌ ॥

మహర్షి అగస్త్యుడు క్షణకాలం నిమీలితాక్షుడై :

రామభద్రా! ఇక్కడకు రెండుయోజనాల దూరంలో రుచిపూర్ణములయిన జలాలతో నిండిన సరోవరాలతో, మధురములైన ఫలాలతో నిండిన వృక్షాలతో పయన మనోహరంగా వుండే జంతువులతో పక్షులతో అలరారే పంచవటి వున్నది. అది మీకు వాసయోగ్యంగా వుంటుంది.

మీరు నా ఆశ్రమంలో వుందామని వచ్చారు. కాని సీతకు పంచవటి ప్రాంతం సుఖంగా ఉంటుంది కనుక అక్కడకు వెళ్ళమంటున్నాను. పవిత్రగోదావరి అక్కడకు అతిసమీపంగా వున్నది. అక్కడవుండి ఈ మునిజనాన్ని రక్షించు.

అదిగో ఆ కనిపించేది మధూకవనం. అది దాటి ఉత్తరంగా వెడితే అయిదు మర్రిచెట్లు. అక్కడే ఒకపర్వతం. దానినే పంచవటి అంటారు అని ముని మౌనం వహించాడు.

సీతా రామలక్ష్మణులు ఆ మహాముని ఆదేశానుసారం ప్రయాణం ప్రారంభించారు.

పంచవటిముఖంగా సాగుతూండగా వారికి భీమపరాక్రమ సంపన్నుడయిన మహా కాయుడు జటాయువు కనిపించగా రాముడు: నువ్వెవరవు? అని ప్రశ్నించాడు. జటాయువు: నేను మీ తండ్రి దశరథునికి మిత్రుడను. నన్ను జటాయు వంటారు. కశ్యపప్రజాపతికి వినతవల్ల కలిగినవాడు గరుత్మంతుడు. ఆయనకు అన్నగారు అనూరుడు. ఆ అనూరునికి శ్యేనివల్ల యిద్దరు బిడ్డలు. అందులో పెద్దవాడు మా అన్న సంపాతి.

దేవాసుర సంగ్రామాలలో దశరథునితో నాకు మైత్రి. ఆయన పుత్రకామేష్టి తలపెట్టినప్పుడు చూశాను, కడసారి: మిమ్ము బిడ్డలుగా పొందడానికి ఆయన ఎటువంటి క్లేశాలు పడ్డాడో. పాపం పుత్రశోకంతోనే కన్నుమూశా డాయన.

## రా మ జ న న ం

సర్వమానవరాజ్యాలకు మూలపురుషుడు మనువు, ఆయనే ఇక్ష్వాకువంశకర్త. శత్రుదుర్భేద్యంగా రాజధానిని నిర్మించి దానికి అయోధ్య అని పేరుపెట్టాడు. ఆవంశంలో సగరాది మహామహుల కోవలో దశరథుడు జన్మించాడు. ధర్మపథంతప్పకుండా పాలించే ఆయన వర్ణాశ్రమాచారాలను పాటిస్తూ సర్వకోసలానికీ ప్రభువు అయాడు. వారి పురోహితులు శ్రీవసిష్ఠులు. ఇంకా వామదేవ, కాశ్యప, సుయజ్ఞ, గౌతమ, జాబాలి ప్రభృతులు వారి ఋత్విజులు.

దృష్టి, విజయ, జయంత, సురాష్ట్ర, రాష్ట్రవర్ధన, అశోప, ధర్మపాల, సుమంత్రులు ఆయనకు సచివులు. ఆయన ఏలుబడిలో అన్యాయానికీ, అక్రమానికీ తావులేదు, నాస్తికుడికీ కోసలంలో చోటులేదు. ప్రజలందరూ సర్వభోగాలతో అలరారేవారు. అన్నార్తుడు మందుకు లేడు.

ఎక్కడచూచినా వేదఘోష, ఈ విధంగా ఆయన దిశాంతకీర్తి సంపాదించాడు. ఇన్ని సంపదలున్నా, అంతకీర్తిలభించినా సంతానంలేని బాధ ఆయనకు తప్పలేదు. చిరకాలానికి పురోహిత, మంత్రిమండలంతో సంప్రదించి అశ్వమేధానికి సంకల్పించాడు.

వసిష్ఠులవారు యాగశాలా నిర్మాణానికి సరయూనది ఉత్తరతీరాన స్థలనిర్దేశంచేశారు. సర్వప్రయత్నాలూ సక్రమంగా సాగిన అనంతరం పురోహితుల ఆదేశానుసారం అశ్వాన్ని విడిచారు. క్రతువు నిర్విఘ్నంగా సాగడానికి సచివమండలి సర్వ రక్షలూ చేసింది.

ఛిద్రం లభిస్తే సర్వనాశనం చెయ్యడానికి ఎదురుచూచే వేదవేదాంగవిదులైన బ్రహ్మరాక్షసుల నిరోధానికి తగిన ఏర్పాట్లు చేశారు. అన్నీఅయాక అంతఃపురానికి వెళ్ళి భార్యాత్రయాన్ని క్రతుదీక్ష వహించమన్నాడు. వారు ఆనందపులకిత హృదయులయి వ్రతదీక్ష వహించారు.

ఆ సమయంలో ఏకాంతాన సుమంత్రుడు : ప్రభూ! చిరకాలంక్రితం సనత్కుమారుడు మహర్షిగణానికి చెప్పినకథ గుర్తుకు వస్తున్నది.

కశ్యపవంశీయుడైన విభాండకునికి ఋశ్యశృంగుడని కుమారుడు. విభాండకుడు తన కుమారుని ఆశ్రమపరిసరాలు దాటనివ్వకుండా పెంచి పెద్దచేసి వేద వేదాంగవిదుని చేశాడు. ఋశ్యశృంగునికి చెట్లూ, చేమలూ, పక్షులూ, జంతువులూతప్ప మరేమీ తెలీదు. స్త్రీ, పుంభావ విభేదం లేదాయనకు. తండ్రినీ, తన ఆశ్రమాన్నీ, ఆశ్రమ పరిసరాలనూ తప్ప ఎరుగడు.

ఆరోజులలో అంగరాజ్యాధిపతి రోమపాదుడు ధర్మమార్గం విడిచి నడవడంవల్ల అనావృష్టి సంక్షోభం దేశాన్ని చుట్టుముట్టింది. ప్రజలందరూ ఆకలి దప్పులతో అలమటిస్తూంటే చూడలేక మహారాజు తన సచివ, విద్వాంసులతో సంప్రదించగా బ్రహ్మవేత్త అయిన ఋశ్యశృంగుని అంగరాజ్యానికి రావిస్తే చక్కని వానలు పడతాయన్నారు.

అయితే విభాండకుని తపశ్శక్తి నెరిగిన వారెవరూ ఆ శౌర్యానికి సాహసించక గునుసుల్లు పడుతూంటే, వారి పురోహితుడు నిశితంగా యోచించి, విద్యా, వయో, లావణ్య రూపశ్రీయుతలయిన వారనారీజనాన్ని పంపితే, వారు తమ చాతుర్యంతో ఆ ఋషిని తీసుకురాగలరని సూచించగా, మంత్రులందరూ ఆమోదించారు.

అంగ రాజ్యంలోని అతిలోక సుందరీమణులు బయలుదేరి, విభాండకుని ఆశ్రమానికి అల్లంతదూరంలో విడిదిచేసి, సమయంకోసం ఎదురుచూసి ఋశ్యశృంగుడు ఫల పుష్పాల కోసం వచ్చిన వేళలో వారు నృత్త, గీత గోష్ఠి ఆరంభించారు.

హృదయాహ్లాదకరంగా గానం, నయనపర్వంగా అలంకరణం, శ్రవణేంద్రియ తర్పణంగా శింజినీస్వనం, మనోజ్ఞమైన సౌందర్య ప్రదర్శనం. అపరిచితమైన ఈ నన్ని వేశాన్ని చూస్తు నిలబడ్డ విభాండకనందనుని సమీపించి వారు :

ఓ బ్రహ్మవేత్తా! తమరెవరు? ఈ నిర్జనారణ్యంలో తోడులేకుండా ఎలావుంటున్నారు? మీ కుల గోత్రాలేమిటి? అంటూ ప్రశ్న పరంపర నడిపారు.

మా ఆశ్రమం యిక్కడకు చాలా దగ్గరలోవుంది. విభాండకముని మాపితృ పాదులు, మీరు మా ఆశ్రమానికివచ్చి, అతిథిసత్కారాలు స్వీకరించండి. అనగా వారందరూవెళ్ళి ఆతిథ్యం స్వీకరించి తాము తెచ్చిన మధురభక్ష్యాలు వానికిచ్చి తినిపించారు. ఋశ్యశృంగుడు ఆ పిండివంటలుకూడా ఫలాలే అనుకొని ఎంతోతృప్తిగా ఆరగించాడు. ఆ వారకాంతలలో వెలజాణలు వానిని గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. రాగం ఎరగని మునిబాలుడు వారిని స్నేహంతో కౌగిలించుకున్నాడు.

విభాండకుడు ఆశ్రమానికి వచ్చేవేళ అయిందని, భయంతో వారు : స్వామీ! మాకు కర్మాచరణ సమయం ఆసన్నమైంది. సెలవిప్పించండి అని నిష్క్రమించారు.

వారు వెళ్ళినప్పటినుంచీ మునిబాలుని హృదయం అవ్యక్త వేదనలో పడింది. మరునాడు త్వర త్వరగా బయలుదేరి వారి ఆశ్రమప్రాంతం చేరాడు, అందుకే ఎదురుచూస్తున్న వారకాంతలు పరమానందంతో :

స్వామీ! మా ఆశ్రమానికి దయచేసి ఆతిథ్యం స్వీకరించండి అంటూ తియ్య తియ్యని పలుకులతో మధుర మధుర భక్ష్యాలతో తృప్తిబరుస్తూ నెమ్మదిగా అంగరాజ్యానికి తీసుకువెళ్ళారు.

రాజ్యసీమలో ఋశ్యశృంగుడు పాదంపెట్టాడు. పెట్టగానే ఆకాశం కారుమేఘాలతో నిండి కుండపోతగా వాన ప్రారంభించింది.

పరమసంతోషంతో రోమపాదుడు తన పరిజనంతో ఎదురేగి వారిని మర్యాదలతో తీసుకువచ్చి, రాజమందిరంలో ఉచిత మర్యాదలు నడిపి, తరువాయి తన కూతురు శాంత నిచ్చి ఆయనకు వివాహం జరిపించాడు. అని సనత్కుమారమహర్షి కథ కొనసాగిస్తున్నాడు.

అంగరాజ్యంలో ఋశ్యశృంగుడు శాంతతో సర్వభోగాలు అనుభవించే రోజులలో.... దశరథుడు, సంతానంకోసం తలపెట్టిన క్రతువుకు ఋశ్యశృంగుని ఋత్విజునిగా వరించితెచ్చి, విధ్యుక్తంగా క్రతువు సమాప్తంచేసి, తత్ఫలితంగా వంశప్రతిష్ఠనిలిపే మహా వీరులూ, ధర్మాత్ములూ అయిన నలుగురు కొడుకుల్ని కనే అదృష్టవంతుడవుతాడు, అన్నారాయన.

మహారాజా! ఇది ఎప్పుడో వేమ విన్నకథ. అందుచేత మీరు ఋశ్యశృంగులను రావించండి-అన్నాడు సుమంత్రుడు.

దశరథుడు పరమానందంతో కులగురువులను చేరి ఈ విషయం వినిపించి వారి ఆదేశానుసారం అంతఃపురజనంతో బయలుదేరి అంగరాజ్యానికివెళ్ళి రోమపాదుని సత్కారాలుపొంది, తనువచ్చిన పనిచెప్పి, ఆయన అనుమతితో, స్వయంగా ఋశ్యశృంగునిచేరి, తమ అభీష్టం విశదంచేసి శాంతా సమేతంగా వారిని వెంటబెట్టుకుని అయోధ్య చేరాడు.

శాంతాఋశ్యశృంగులకు అంతిపురిలో ప్రత్యేకం విడిది ఏర్పాటుచేసి, వారి సుఖశాంతులకు అవసర సామగ్రి అంతా సమకూర్చారు. శాంత రాక వారందరికీ అమితానందం కలిగించింది. అడుగడుగున ఆమెకు మడుగు లొత్తుతూ అంతఃపురజనం ఆమెను సేవిస్తున్నారు.

వసంతం అడుగుపెట్టింది. ఋశ్యశృంగముని ఆదేశానుసారం యజ్ఞశాలలో సర్వసంభారాలూ సన్నద్ధమయాయి. ఆయనే బ్రహ్మపీఠం అధివసించాడు. కులగురువులు వసిష్ఠులు ఆధ్వర్యులుగా సుయజ్ఞ, వామదేవ, జాబాలి ప్రముఖులు ఋత్విజులుగా విఘ్నశాంతి క్రియలు ఆరంభమయాయి.

అనుభవంతో తలలుపండిన స్థపతులూ, శిల్పకళావిదులూ, ఖనకులూ అందరూ కులగురువుల ఆదేశానుసారంగా యథావిధిగా యజ్ఞశాల నిర్మించారు.

యజ్ఞదర్శనానికివచ్చే పౌర జానపదులకూ ఆహ్వానాలంది వచ్చే రాజపురుషులకూ విద్వజ్జనులకూ ప్రత్యేకంగా ఏర్పాట్లుచేశారు. సంవత్సరం సాగే ఆ మహా క్రతువులో ఎవరూ ఏక్లేశమూ పడవసరంలేకుండా ధనధాన్య వస్త్ర సమృద్ధం చేశారు. అన్న దానాదులు చూచే కార్యంలో క్షమామూర్తులనే నియోగించారు.

శాలానిర్మాణం కాగానే స్థపతులనూ శిల్పకారులనూ సముచితంగా సత్కరించారు.

విదేహాధీశుడు జనకుడు, పుత్రసమేత కేకయదేశాధీశుడు అశ్వపతి, అంగ విష యాధిపతి రోమపాదుడు, మిత్రదేశాల రాజులూ, బంధువులూ విచ్చేశారు. వీరందరినీ సుమంత్రుడు స్వయంగా పిలిచాడు.

వచ్చినవారందరికీ ఉచితరీతిని సత్కారాలు సాగుతున్నాయి. వారు తెచ్చిన మణిరత్న హేమరాసులతో కోసలకోశాగారం లక్ష్మీనిలయం అయింది.

అవజ్ఞయా న దాతవ్యం కస్యచి ల్లీలయాపి వా ।
అవజ్ఞయా కృతం హన్యాత్ దాతారం నాత్ర సంశయః ॥

చూస్తూండగా గ్రీష్మ వర్షా శరత్ హేమంత, శిశిరాలు తిరిగి మళ్ళీ వసంతం వచ్చింది. నాటికి తిరిగివచ్చింది సవనాశ్వం. ప్రాతస్సవన మాధ్యందిన సాయాహ్నిక సవనాలు సాగుతున్నాయి. యజ్ఞశాలాసీమలు వేదగాన ముఖరితములై కల్పసూత్రానుసారం క్రతుకర్మలన్నీ నడుస్తున్నాయి.

ఆ సమయంలో నిర్విరామంగా అన్నదానం చేస్తున్నారు. పాకకళాకోవిదులు అలసట ఎరుగకుండా పంచభక్ష్యాలూ అందిస్తున్నారు, ఆకలిబాధ అనే మాట వినపడకుండా సమారాధనలు సాగుతున్నాయి.

తృప్తిగా వడ్డించండి, వడ్డించండి. వారికి వస్త్రదానం. వీరికి ధనదానం. అదిగో వారికి రత్నకుండల దానం....ఎక్కడవిన్నా అవేమాటలు. చాలు బాబూ చాలు, తృప్తిగా భుజించాం, చాలు చాలు అనే వాక్కులే....

నానా ప్రాంతాలనుండి వచ్చిన విద్వాంసులు మహర్షులు అపరాహ్ణవేళ దర్శన సిద్ధాంతాలమీద చర్చలు సాగిస్తూంటే సరస్వతీదేవి సాక్షాత్కరించినట్లనిపించేది. బహుశ్రుతుడు షడంగయుత వేదవిదుడూకాని విప్రుడే లేడు ఆ యజ్ఞశాలలో. వేద వేదాంగ వేత్తల గోష్ఠులతో వేద మంత్రోచ్చాటనతో నిండింది యజ్ఞశాల.

ఆరు బిల్వయూపాలు, ఆరు ఖదిరయూపాలు, పలాశయూపాలు రెండు, మొత్తం ఇరవైయొక్క యూపస్తంభాలు నిలిపారు. ఇరవైనాలుగు అంగుళాల ఎత్తులో చెయ్యిచాపితే అందే దూరంలో వాటిని కల్పశాస్త్రానుసారం నెలకొల్పారు. అష్టకోణాలుకల ఆ యూపస్తంభాలను గంధ, పుష్పాలతో అలంకరించి, నూతన వస్త్రాలతో ఆచ్ఛాదించారు. వెండిరెక్కల గరుత్మంతునివలె అగ్నికుండం తీర్చి దిద్దారు. యూపస్తంభాలకు ఆ యా దేవతాప్రీతి పాత్రాలయిన పశు ఉరగ పక్షులను బంధించారు. శామిత్ర కర్మవేళ మూడువందల పశువులతో సవనాశ్వాన్ని వధించారు. ఆ అశ్వానికి ప్రదక్షిణంచేసి బంగారు మొనలుగల మూడుకత్తులతో దాన్ని విశసనంచేసింది పట్టమహిషి. ధర్మసిద్ధికై స్థిరచిత్తంతో ఒకరాత్రి ఆ అశ్వంతో గడిపింది ఆవిడ.

అధ్వర్యుడు వపాహోమం చేశాడు. యజమాని ఆ వపాధూమం ఆఘ్రాణించిన అనంతరం పదునాలుగురుఋత్విజులు ఆ సవనాశ్వాంగాలను హోమంచేశారు. మొదటి

నాడు అగ్నిష్టోమం, రెండవరోజు జ్యోతిష్టోమం మూడవనాడు అతిరాత్రమనబడే సర్వస్తోమం జరిపారు. హోతకు తూర్పుదిక్కునూ, అధ్వర్యునికి పశ్చిమదిక్కునూ, బ్రహ్మకు దక్షిణదిశనూ, ఉద్గాతకు ఉత్తరదిశనూ దక్షిణగా ధారపోశాడు. దశరథుడు. దేశరక్షణ తపోధనుల పనికాదని తిరిగి వారు ప్రభువుకే యిచ్చి యితరేతర వస్తుసామగ్రిని స్వీకరించారు. పదికోట్ల బంగారు ముద్రికలు, నలభైకోట్ల వెండినాణెములు వారి కిచ్చాడు దశరథుడు. యజ్ఞదర్శనానికి వచ్చిన వేదవిదులకూ, యాచకులకూ తృప్తిగా భూరిదానాలు చేశాడు. అసంఖ్యాక జనాన్ని అన్నదానంతో, వస్త్రభూషణ దానాలతో సంతుష్టులనుచేసి, పుత్రకామేష్టి ఆరంభించాడు. ఆ యజ్ఞంలో సర్వదేవతలూ తృప్తులయారు. అగ్నికుండం నుండి బల, వీర్యసంపన్నమూ, సింహ కేసర సదృశజటామండితమూ, మహోన్నతగిరి శృంగనిభమూ, సూర్యప్రభాభాసితమూ అయిన ఒక మహారూపం కృష్ణాంబరంతో దుందుభి స్వనంతో ప్రత్యక్షమై :

ఓ రాజా ! నేను ప్రాజాపత్యపురుషుణ్ని, అభ్యాగతుడుగా వచ్చాను, అనగా దశరథుడు తలవంచి స్వాగతం పలికాడు.

రాజా ! ఇదిగో ఆరోగ్య శ్రీసమృద్ధమైన ఈ పాయసపాత్ర స్వీకరించు, ఇది నీభార్యలు ఆరగించి ఉత్తమసంతానం పొందుతారు, అని అదృశ్యమయాడు.

పరమానందంతో దశరథుడు ఆ పాత్ర స్వీకరించి, అంతఃపురంచేరాడు. ఆ పాత్ర లోని పాయసంలో సగం కౌసల్య కిచ్చి, మిగిలినదానిలో సగం సుమిత్రకిచ్చి, ఉన్నదానిని రెండుభాగాలుచేసి కైకకూ, సుమిత్రకూ యిచ్చాడు.

ఇష్టిపూర్తి అయిన సంవత్సరానికి నలుగురు బిడ్డలు కలిగారు.

* * *

రామభద్రా ! నా ప్రాణస్నేహితుని మరణవార్త నాకెంతో ఖేదం కలిగించింది. ఇప్పుడు మిమ్మలి చూస్తుంటే నా బాల్యసఖుని చూచిన ఆనందం కలుగుతోంది, అని క్షణంఆగి, జటాయువు :

ఈ అరణ్యం బహుక్రూరమృగాలతో, రాక్షసులతో భయానకమైనది. ఇక్కడ జానకీదేవిని రక్షించుకోవడంలో అప్రమత్తంగా వుండాలి. ఇక్కడ వున్నంతకాలం నేనుకూడా రక్షణభారం వహిస్తాను, అన్నాడు.

రామచంద్రుడు సంతోషంతో జటాయుసహితుడై పంచవటిచేరి :

లక్ష్మీ! అగస్త్యమహర్షి నిర్దేశించిన ప్రాంతం చేరాం. ఇక్కడ మనకు వాస యోగ్యమైన స్థావం ఈ జనకరాజనందనకు జలాశయం దగ్గరగావుండేటట్టుచూడు. అక్కడ మనకు ప్రకృతి సౌందర్యంతో కుశ, కాష్ఠాలుకూడా అందుబాటులోవుండాలి అన్నాడు, రాముడు.

ఆర్యా ! నీ ఆదేశాలను ఆచరించడం తప్ప స్వతంత్రించి నేనేమీ చెయ్యనని తెలిసి ఎందుకిలా అంటారు, అని సౌమిత్రి వినయంగా నిలబడ్డాడు.

రామచంద్రుడు ఆ పరిసరప్రాంతమంతా తిరిగి :

తమ్ముడూ ! ఇదిగో, యిక్కడ తరు, లతలన్నీ పూలతో నిండివున్నాయి. సమీ పంలోనే, అదిగో చూశావా ! సూర్యకిరణాలవలె వికసించిన దళాలునిండిన పద్మాలతో సరోవరం, మహర్షి అగస్త్యులు చెప్పినట్లు పవిత్ర గోదావరి మనకు అల్లంతదూరంలో ప్రవహిస్తున్నది. మయూరక్రేంకారాలతో ముఖరితములయిన గుహలతో పర్వతాలు. ఇంతకంటె వాసయోగ్యస్థలం వుండదు, అన్నాడు.

## ప ర్ణ శా ల

లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. గోదావరీనదీస్నానంచేసి పవిత్రజలాలు, పుష్పాలు తెచ్చి గృహదేవతాపూజ జరిపి సీతారాములను శాలలోకి ఆహ్వానించాడు. లక్ష్మణుని విజ్ఞతకు పరమప్రీతుడై గాఢాలింగనం చేసుకున్నాడు రాముడు.

నీవంటి ధర్మబుద్ధికల పరేంగితావగాహిని నాకుదయచేసి నాన్నగారు స్వర్గస్థులయారు, నువ్వే లేకపోతే రాముడే లేడు, అన్నాడు.

కాలచక్రం తిరుగుతోంది.

శరత్కాలం వెనకబడి హేమంతం ప్రవేశించింది. చలిగాలి ముదిరింది. మంచు కురుస్తున్నది. ఆ రోజులలో ఒకనాడు, సీతా రామ లక్ష్మణులు అరుణోదయ వేళ గోదావరీ స్నానానికి వెడుతున్నారు. నడిచే లక్ష్మణుని మనసులో ఏవేవో స్మృతులు తిరుగుతున్నాయి.

అన్నయ్యా ! సస్యశ్యామలమైన భూమిని ఈ మంచుపొరలు ఎలా ముంచెత్తుతున్నాయో ! ఈ చలిలో జలాశయాల దరిదాపులకే వెళ్లాలనిపించడంలేదు. గోగణాలు

క్షీరధారలతో జానపదులకు తృప్తినిస్తున్నాయి. తేజోమయుడైన సూర్యభగవానుడు దక్షిణ దిక్కాంతతో అనురక్తుడై వుండడంవల్ల ఉత్తరదిశాభామిని వదనం తిలకశూన్యంగా వుంది. సూర్యుడు దూరంకావడంతో హిమవంతుడు సార్థకనామడవుతున్నాడు. చల్లగాలులు, మంచుతుంపరలు, మంచుకి ఆగలేక ఆకులురాల్చినచెట్లు, ఇక ఈ పుష్యమాసపు దీర్ఘ రాత్రుల చలిబాధ. తుషారావృతమైన చంద్రమండలం పౌర్ణమినాడుకూడా నిట్టూర్పు గాలితో మలినమైన దర్పణంలా కాంతిహీనంగావుంది. గోధుమ వరిచేలు విండుకంకులతో కొద్దిగావంగి ఎంత రమణీయంగా వున్నాయి. ఆ పొలాలమీద క్రౌంచపక్షులు బారులుతీరి ఎలా వెడుతున్నాయో. ఉదయిస్తున్న సూర్యుడు చంద్రబింబంలా వున్నాడు.

అదిగో దప్పిగొన్న ఆ ఏనుగును చూశావా, నీటిలోకి తొండం ముంచుతూనే చలికి తట్టుకోలేక ముడిచేసింది. జలపక్షులు కూడా ఒడ్డునే నిలబడిపోయాయి. కలకలలాడే కమలాలతో నిండి కనులకింపుగా వుండే కొలనులన్నీ మంచుబాధతో మాడిపోయి, ఎండిన తూడులతో వున్నాయి. మంచువానలో తడిసిన ఈ గోదావరీ సికతా తలాలమీద కాలు మోపడమే కష్టంగా వుంది.

ఈ హేమంతంలో యిక్కడ నీలానే అక్కడ భరతుడు యిలానే తపోదీక్షతో వుంటాడు. ఈ ప్రభాతంలో సరయూనదికి వెడుతూంటాడు. ఈ కఠోరశీతలాన్ని ఎలా భరిస్తాడు ఆ రాజనందనుడు? లోకంలో పిల్లలు సాధారణంగా తల్లిబుద్ధితో వుంటారంటారు. కాని భరతుడు ధర్మజ్ఞుడై ఆ తప్పుదారిని పడలేదు.

నాకు ఒక్కటే సందేహం కలుగుతున్నది అన్నయ్యా! మహానుభావుడయిన దశరథునివంటి భర్త, సాధుపుంగవుడయిన భరతునివంటి కొడుకు! కైకేయి యింతక్రూరబుద్ధి ఎలా అయింది, అన్నాడు.

ఆ మాటలు వింటూనే రాముడు : లచ్చీ! ఎందుకలా ఆవిణ్ణి ఆడిపోసుకుంటావు. అంతకంటె భరతుని మంచిగురించి ఏమైనా చెప్పు. చిత్రకూటం దగ్గర వాడాడిన మాటలు యిప్పటికీ నన్ను పులకింపజేస్తున్నాయి. భరత, శత్రుఘ్ను లిద్దరినీ చూడాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది, అని మాట్లాడుకుంటూ నదిలో అడుగుపెట్టారు. స్నానంచేసి విధ్యుక్త కర్మలు నిర్వర్తించి ఆశ్రమానికి వెళ్లారు. సూర్యబింబం పైకి సాగింది. పర్ణశాలాప్రాంగణంలో ముగ్గురూ కథలు చెప్పు కుంటున్నారు.

## శూ ర్ప ణ ఖ

ఆ సమయంలో రాగితీగలవంటి జుట్టు, భయంకరమైన నేత్రాలు, వికారవదనం, మహోదరం, భైరవస్వనంకల శూర్పణఖ అటు వచ్చింది. వస్తూ చూసింది రాముని. దివ్యతేజోవిరాజితమైన వదనం, పద్మదళవిశాలనయనాలు, ఇందీవరశ్యామదేహం, మన్మథావతారంగావున్న రాముని చూస్తూనే శూర్పణఖ :

ఎవరయ్యా నువ్వు? జటాజూటంతో తపస్విలావుండి ఈ ధనుర్బాణాలేవిటి? రాక్షసవిహారభూమికి ఎందుకువచ్చావు, అని ప్రశ్నించింది.

అయోధ్యాధీశుడైన దశరథుని పుత్రుడను, నన్ను రాముడంటారు. వీడు మా తమ్ముడు లక్ష్మణుడు. ఈమె నా భార్య జానకి. పితృవాక్పాలనకోసం అడవికి వస్తూంటే వీరిద్దరూ నామీద అభిమానంతో తోడువచ్చారు. ఇంతకీ నువ్వెవరవు? ఓ మనోజ్ఞాంగీ ! చూస్తే రాక్షసవనితలా వున్నావు. ఇక్కడ కెందుకు వచ్చావు, అని అడిగాడు.

రామా ! ఉన్నమాట చెపుతున్నాను. నాపేరు శూర్పణఖ. ఏకాకిగా నేను అడవిలో తిరుగుతూంటే సర్వప్రాణులూ గజగజలాడతాయి. వినేవుంటావు నువ్వు రావణుడని రాక్షసచక్రవర్తి. చిరనిద్రాశీలి కుంభకర్ణుడు, ధర్మపరుడు విభీషణుడు. ఈ ముగ్గురూ విశ్రవసుని పుత్రులు, నా సోదరులు. మహాపరాక్రమవంతులయిన ఖర-దూషణులు కూడా నాసోదరులే. అయినా నేను స్వేచ్ఛగా తిరగగలను. కామరూపశక్తి వుంది నాకు. నిన్నుచూసిన క్షణంనుంచి నా మనసు మనసులో లేదు. ఈ జానకిని విడిచి నన్ను భార్యగా గ్రహించు. ఇది నీకు జోడుకాదు. వీరిద్దరినీ నేను ఆరగిస్తాను. మనిద్దరం ఈ దండకారణ్యంలో స్వేచ్ఛగా విహరిద్దాం అంది.

రాముడు నవ్వి : బావుంది! నీవంటిదానికి సవతిపోరు బావుండదు. నావెంట నా భార్య వుందికనుక అదిగో నా తమ్ముడున్నాడు, వాడుకూడా ప్రియదర్శనుడు. వాడు అకృతదారుడు. మంచి వయసులో వున్నాడు. నువ్వు వాణ్ని స్వీకరిస్తే ఏబాధా వుండదు, అన్నాడు.

తక్షణం శూర్పణఖ లక్ష్మణునిచేరి తనవాంఛ వ్యక్తంచేసింది.

అమ్మాయీ! నేను జన్మతః సేవకుడిని. ఈ దాసుడితో వుంటే నువ్వూ దాసివే కావాలి. సర్వస్వతంత్రురాలివయిన నువ్వు నన్ను కట్టుకుని ఏం సుఖపడతావు. నువ్వు

సర్వవిధాలా ఆయనకే తగినదానివి. ఆ వికృతకరాళరూపిణి ఆయన భార్య. నీవంటి సౌందర్యవతిని మోహనాంగినికాదని సామాన్య మానవస్త్రీతోవుండే అవివేకి ఎవడు? అన్నాడు లక్ష్మణుడు.

ఆ మాటలలో పరిహాసం తెలియని రాక్షసి : రామా! ఈ వికృతరూపిణి అయిన వృద్ధజానకి నాకు సవతిపోరు తెస్తుందనికదా నీ భయం. ఇదిగో ఈ క్షణంలో దాన్ని అరగిస్తున్నాను. అని లేడిమీద పడనున్న పెద్దపులిలా దూకే శూర్పణఖను చూసి రాముడు: తమ్ముడూ! ఈ రాక్షసులతో పరిహాసా లేమిటి? దానిని విరూపను చెయ్యి అన్నాడు.

లక్ష్మణుడు చురకత్తితో దాని ముక్కూ, చెవులూ ఉత్తరించాడు.

ఆ బాధతో తీవ్రరోదనంచేస్తూ వెడుతూంటే అడవి అంతా దద్దరిల్లింది. అలా వెళ్ళి వెళ్ళి జనస్థానంలోవున్న తన సోదరుడయిన ఖరుని ముందు పడింది. పిడుగు పడ్డట్టు.

చూశాడు ఖరుడు. కన్ను లెర్రబడ్డాయి. కోరమీసం మెలితిరిగింది. జెబ్బ మీద కండరాలు పొంగాయి. ముక్కుపుటాలు ఉబ్బి శ్వాసపెరిగింది.

అక్కా! కాలపాశాన్ని మెడకు తగిలించుకొని మృత్యుమందిరద్వారం దగ్గర నిలబడ్డ అమూర్ఖుడెవడమ్మా? నిన్నింతగా పరాభవించినవాడు! కాలకూటవిషం కక్కే నల్లత్రాచు నివసించే పుట్టలో చెయ్యిపెట్టిన అవివేకి ఎవడూ? లోకవిద్రావణుడయిన రావణుని చెల్లెలిని, జగద్భయంకరులైన ఖర దూషణుల సహోదరిని అవమానించడం అంటే వాడిచేత్తో వాడు విషపాత్ర అందుకోవడమే అని ఎరగని బుద్ధిహీనుడెవడు?

బలం, దానికితగ్గ సాహసం వున్న నిన్ను యీస్థితికి ఎలాతెచ్చారమ్మా? దేవ గంధర్వగణాలు నిన్ను కన్నెత్తిచూడవు. ఇక మహర్షిసంఘాలకు నీ కనుచూపే ప్రాణాంతకం. నిన్నింతకు తెచ్చినవాడు, వాడు సహస్రాక్షుడయిన దేవేంద్రుడయినా ఈ విశితఖడ్గధారలను తప్పించుకోలేడు. వాడిరక్తం త్రాగి భూదేవి తృప్తి పడుతుంది. కాకులకూ గ్రద్దలకూ మంచి విందు దొరుకుతుంది. నువ్వు శోకం ఆపి విషయం చెప్పు, అన్నాడు ఖరుడు.

ఆమె దుఃఖం ఆపుకుంటూవే: ఇక్కడకు చాలాదగ్గరలో పంచవటి వుంది. ఎరుగు దువుగా. అక్కడున్నారు ఇద్దరన్నదమ్ములు. ఇద్దరూ మాంచివయసులో వున్నారు. ఎంతో అందంగా మరీ సుకుమారంగా కనిపిస్తారు. మహాబలిష్ఠులువారు. కన్నులు పుండరీకాలు విచ్చుకున్నట్లుంటాయి. నారబట్టలు కట్టుకున్నారు. దశరథుడి కొడుకులట. తపోదీక్షలో

బ్రహ్మచర్యనియమంతో ఫలమూలాలు తింటూ బ్రతుకుతున్నారు. వారితోపాటే మంచి వయసుకత్తెకూడా వుంది. అది చేయించింది నాకీ పరాభవం, మీరిందరు వుండీ నేను దిక్కులేనిదానిలా ఈ అవమానం పాలయాను, దేవ గంధర్వగణాలుకూడా ఆ యువకులను ఎదిరించి నిలబడలేరని అనిపిస్తుంది.

నీతిలేకుండా పాపాచారులై తిరిగే ఆ ముగ్గురి రక్తం త్రాగితేకాని నా గుండెమంట చల్లారదు. ఈరోజువరకూ నేనెవ్వరూ నిన్నేమీ కోరలేదు. ఈ ఒక్కకోరికా తీర్చు, అంది.

శూర్పణఖ మాటలు వింటూనే ఖరుడు, తనప్రక్కనే నిలబడివున్న మహావీరులైన పదునలుగురు అనుచరులను చూచి: మీరు తక్షణం వెళ్ళి పంచవటిలో మునిరూపాలతో వున్న ఆ యువకులను తెగనరికి ఆ రక్తంతెచ్చి మా అక్కకు యివ్వండి. క్షణాలలో రక్తపాత్ర రావాలి, అని ఆజ్ఞాపించాడు.

ఖరుని నోట మాట వెలువడిన క్షణంలో వారు యమకింకరులవలె ముందడుగు వేశారు. వారికి దారిచూపుతూ శూర్పణఖ నడుస్తున్నది. ప్రచండవాయు సహాయంతో పాగే కారుమేఘాలవలె వెడుతున్నారు వారు.

పర్ణశాల సమీపిస్తూనే శూర్పణఖ సీతారామ లక్ష్మణులను చూపించింది. రాముడు వారిని చూచి తమ్ముడూ! ఒక్కక్షణం యిక్కడేవుండు. నేను వీరి వ్యవహారం చూసి వస్తాను, అంటూ ధనస్సు చేబూని, వారి కెదురువచ్చి:

మేము దాశరథులం. ఈ దండకారణ్యంలో ప్రశాంతంగా తపస్సు చేసుకొనే మహర్షి సంఘాలను హింసించే రాక్షసులను సంహరించే దీక్షతో వున్నాం. మీరు మరి కొంతకాలం ఊపిరిపీల్చుకోవాలని వుంటే మీ నివాసానికి పొండి, లేదా యుద్ధసన్నద్ధులు కావచ్చు, అన్నాడు.

ఆ మాటలువిన్న వారు అట్టహాసంచేసి, శూలాలు ఆడించి; ఓ వెర్రివాడా! మా ఖరమహారాజుకి ఆగ్రహం కలిగించినవాడికి మరణమే శరణ్యం. యుద్ధం అంటున్నావు. నువ్వు చూస్తే ఒక్క మనిషివి. మేం పదునాలుగుమందిమి. మా శూలాయుధాలతో నువ్వూ నీ ధనస్సూ చూర్ణంకాక తప్పదు, అంటూనే వారు ఒక్కసారిగా శూలాలు విడిచారు. వారు శూలాలు ఎత్తేసమయానికే రాముడు వారి సారించి పదునాలుగు వాడిఅమ్ములతో వాటిని తునాతునకలు చేశాడు. మరుక్షణంలోనే ఆ ధనస్సునుండి వచ్చిన నిశితశరాలు

వారి గుండెలు చీల్చి వేల రాల్చాయి. రక్తపుమడుగులో వారు విలవిల తన్నుకుంటూంటే, చూడలేక శూర్పణఖ విపరీతరోదనతో వెనుదిరిగిపోయి, ఖరుని ముందు నిలబడగా:

ఏమమ్మా! ఇప్పుడేగదా మన సేనానులతో వెళ్ళావు. ఏమయిందని మళ్ళీఏడుస్తూ వచ్చావు, అనగా ఆ రాక్షసి కన్నీరు వొత్తుకుని : బావయ్యా నువ్వువంపావు, ఆయన చంపాడు, అందరినీ ఒక్క ధనుష్టంకారంతో. ఆ రాముడొక్కడి చేతులలో మన సేనా నులు వేలకూలడం చూస్తే ఈ దండకారణ్యంలో మనకు రక్షణపోయినట్లే, నువ్వేదో మహాబలుడవని అనుకుని ఈ జనస్థానంలో నిశ్చింతగా తిరుగుతున్న మా కెవరికీ యిక దిక్కులేదు. తక్షణం ఆ రాముడి ప్రాణాలు తియ్యి, అంది.

కన్నుల నిప్పులు కక్కుతూ : అక్కా ! ఇక వారి ఆయువు మూడినట్టే. నువ్వు నిశ్చింతగా వుండు. వారి రక్తంతో ఈపూట నువ్వు విందు చేసుకుందువుగాని. దేవాసుర సంగ్రామంలో ఆరితేరిన మనసేనలు ఆకలిగొన్న బెబ్బులులు, తోకత్రొక్కినసర్పాలు అని సేనానులకు ఆజ్ఞయిచ్చి, రథంమీద బయలుదేరాడు. ప్రచండ గ్రీష్మభానునివలె వున్నాడు ఖరుడు. దూషణ త్రిశిరులుకూడా అంత ప్రదీప్తంగానూ కనిపిస్తున్నారు. బయలుదేరేవేళ రథధ్వజంమీద గ్రద్ధ వ్రాలింది. పరిసరాలలో మృగాలూ, పక్షులూ ఆర్తనాదాలు చేశాయి. నక్కల మూలుగులు పెరిగాయి. ఆకాశం ఆకస్మికంగా మేఘా వృతమైంది. ఖరుని ఎడమభుజం అదిరింది. అప్రయత్నంగా కన్నీరుజారింది. అన్ని అవశకునాలు కనిపించినా చలించక ముందుకు నడిపాడు రథాన్ని. ఇవన్నీ దుర్బలులను భయపెట్టడానికేకాని, ఆకాశంలోని చుక్కలను వేల రాల్చగల నావంటివాడికా వీటిభయం! మృత్యువుకి మరణం అనుగ్రహించగలవాడు ఈ ఖరుడు అని సింహనాదం చేశాడు.

ఖర దూషణ త్రిశిరుల నాయకత్వాన రాక్షససేన పంచవటి చేరింది.

ప్రకృతిలో కనిపించే విపరీతాలను చూసి రాముడు : తమ్ముడూ ! చూశావా! రాక్షస వినాశన సూచనలెన్ని కనిపిస్తున్నాయో! అయితే యిక్కడి పక్షులరోదనలు వింటూంటే మనకుకూడా ఏదో విపత్తు రానున్నదనిపిస్తున్నది. నా దక్షిణబాహువు కంపించడం చూస్తూంటే ఈ రాక్షసులతో యుద్ధంలో విజయం మనదే అనే నమ్మకమూ కలుగుతున్నది. నీ ముఖంలో ఉత్సాహదీప్తి గోచరిస్తున్నది.

అదిగో కోలాహలం వినవస్తున్నది. ఆ భేరీఘాంకారాలు రణసన్నద్ధులైవచ్చే రాక్షసగణాలవే. ప్రమాదం రానున్నదని తెలిసినప్పుడు రక్షణకార్యాలు సాగించడం వివేకుల కర్తవ్యం. నువ్వు ధనుస్సును సజ్జితంచేసి సీతను ఆ గుహలోవుంచి, గుహ

ద్వారంలో నిలబడు. నువ్వే వారందరినీ కడతేర్చగలవు కాని, ఈ జనస్థాన రాక్షస గణాలను నా కోదండానికే ఆరగింపుగా యిద్దామని వుంది, అన్నాడు.

లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞ అక్షరాలా పాటించాడు. రాముడు సంతోషంతో కవచం ధరించాడు. ప్రజ్వలితవహ్నిలా వర్ణశాలా ప్రాంగణానికి వచ్చి నిలబడ్డాడు. ఆలీఢపాదుడై ఒక్కసారి ధనుష్టంకారం చేశాడు. దిశలు దద్దరిల్లినవి. పరమ సుకుమార సుందర సౌజన్యమూర్తి అయిన రాముడు అరిభయంకర భీషణాకృతిలోవున్నాడు. ఆ రూపం సర్వభూతకోటికీ భయానకంగా వుంది.

రణభేరీ ధ్వానం సమీపానికి వచ్చింది. పొంగుతున్న సముద్రతరంగాలవలె రాక్షససేనలువస్తున్నాయి వారిని చూచిన రాముడు మరింతక్రోధంతో ధనుస్సుఎక్కుపెట్టి ప్రళయకాల యమునివలె వున్నాడు. ఉదయభాను సదృశంగావున్న రాముని ముందు రాక్షసులు నీలజీమూతాలవలె వున్నారు.

రామభద్రుని చూస్తూనే తన అనుచరులను యుద్ధానికి పురిగొల్పి ధనుస్సంధించాడు ఖరుడు. గదా, ఖడ్గ, పరశ, పట్టిస, తోమరాలవర్షం కురుస్తున్నది. శరసహస్రం గుప్పతున్నాడు ఖరుడు. కాలమేఘాలు కుంభవృష్టి కురిపిస్తుంటే ఏ చలనం లేకుండా శిఖరాగ్రం గగనతలంలో ఉంచి నిలిచిన మహానగసన్నిభంగా వున్నాడు రాముడు. ఆయుధనదులతో నిండింది రామసాగరం. శరీరానికి తగిలిన గాయాలతో ఆయన అరుణ జలద మాలాశోభితుడైన సూర్యునివలె వున్నాడు. ఆ సంగ్రామం తిలకించడానికి కుతూహలంతో వచ్చిన దేవ, గంధర్వగణాలు విషాద చకితా లయాయి.

అంతే ! అంతలో రాముని ధనుస్సు మండలాకారంలో తిరిగింది. తిరగడం తడవు దానినుండి శతాధికసంఖ్యలో బాణాలు దూకుతున్నాయి. ఆ బాణాలు ఆయన పరిసర ప్రాంతమంతా కమ్ముకున్నాయి. ఏ లిప్తలో అవి వెలువడుతున్నాయో, ఏక్షణంలో శత్రుప్రాణాలను యమపురికి తీసుకువెడుతున్నాయో తెలియడంలేదు. రక్తరంజితములై అవి గగనసీమలో ఎగురుతూ అగ్నిజ్వాలలవలె గోచరిస్తున్నాయి.

రంగస్థలమంతా తెగిన కవచాలు, విరిగిన ధనుస్సులు, చెల్లాచెదరైన భూషణాలు, తునాతునకలైన పరశ శూలాద్యాయుధాలు, ముక్కలు ముక్కలైన రాక్షసశరీరాలు చెయ్యి తెగినవాడు, కాలుతెగినవాడు, విలవిలతన్నుకుంటూ రక్తప్లావితమైన దుమ్ములో పొర్లుతున్నారు. వేసవికి ఎండిన అడవిలో దావానలం విజృంభించి పెటపెటధ్వనులతో

అడవినంతనూ బూడిదచేసినట్లు రామకోదండ విముక్త బాణాగ్ని రాక్షసారణ్యాన్ని దహిస్తున్నది. హతశేషులు ఖరుని వెనుక తలదాచుకున్నారు.

సర్వసేనాని దూషణుడు తామ్రాక్షుడై ముందుకురాగా మిగిలిన రాక్షసగణం మళ్ళీ విజృంభించింది. రాముడు గంధర్వాస్త్రం ప్రయోగించాడు. అది సూర్యరశ్మిని ఆ ప్రాంతంమీద పడకుండా చేసి చీకట్లు క్రమ్మించింది. ఉత్తరక్షణంలో రాముని ఎదుటనున్న రాక్షసులందరూ రక్తప్రవాహంలో తేలుతున్నారు.

దూషణుని మూలబలం హుంకరించింది. రాముడు క్షురప్రయోగంతో ఆ సేనాని ధనుస్సు ఖండించి, వాడిబాణాలతో వాని అశ్వాలనూ, సారథినీ నేల కూల్చాడు. దూషణుడు దేవాసుర సంగ్రామంలో ప్రయోగించే పరిఘాయుధంతో నిలిచాడు. రాముడు విడిచిన రెండుబాణాలూ ఏకకాలంలో వాని రెండు భుజాలకూ విశ్రాంతినిచ్చాయి. వాడు నేలకూలాడు. పంచ భూతాలూ ఆనందించాయి.

మహాకపాల, స్థూలాక్ష, ప్రమాథి నామక రాక్షసయోధులు ఎదురురాగా మృత్యుముఖంలోకి స్వయంగావెళ్ళే అతిథులను చూచినట్లు రాముడు సంతోషించి మహాకపాలుని శిరస్సు మృత్యు దేవతకు ఆరగింపు చేసి, స్థూలాక్షుని రెండు కన్నులూ నివేదనచేసి, ప్రమాథి శరీరాన్ని భూదేవికి అర్పించాడు. మహాయోధుల మరణంతో మరింత క్రోధంవచ్చి ఖరుడు తన ప్రధానరక్షణదళాన్ని ముందుకు నడిపాడు. శ్యేనగామి, పృథుగ్రీవుడు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, పరుషుడు, కాలకార్ముకుడు, హేమమాలి, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు, యజ్ఞశత్రువు ఈ పన్నెండుగురు యోధులూ రాముని ఎదుటకు వస్తూనే ముగ్గిన తాటిపళ్ళలా నేలకూలారు. ఖరుడు కాల సర్పంవలె బుసకొడుతూ త్రిశిరునితో రాముని ముందుకు వచ్చాడు. ఖరుడే యుద్ధానికి తలపడబోగా త్రిశిరుడు: ప్రభూ! అనుచరులుండగా ప్రభువులు శ్రమపడనవసరంలేదు. నాకు అనుజ్ఞ యివ్వండి, తమ అనుచరునిచేతిలో రాముడు నేలకూలకపోతే ఈ ముఖం మీరు చూడరు, అంటూ రథాన్ని నడిపించాడు.

కుపితసింహంతో మత్తగజం పోరాడుతున్నట్లు రామునితో త్రిశిరుడు పోరు నడిపాడు. వాడు విడిచిన మూడు వాడిబాణాలకు రాముని నుదుట బొప్పి కట్టింది. ఉగ్రుడైన రాముడు వాని రొమ్మున విడిచిన నిశితశరం అక్కడ రక్తశిఖరం ఏర్పరచింది. మరు క్షణంలో త్రిశిరుని మొండెం నుండి మూడు రక్తధారలు, మహావృక్షంలా వాని శరీరం భూమిమీద వ్రాలింది.

జనస్థాన చక్రవర్తి ఖరుడికి ఆశ్చర్యంతో ఆవేదన కలిగింది. మనస్సు వికల మయింది. అయినా ధైర్యం విడవక రథాన్ని రామాభిముఖం చేశాడు. రక్తపాన కుతుకం కల బాణాలు వదులుతున్నాడు. రాముడు లీలగా వాటిని ఖండిస్తున్నాడు. అంతవరకూ రాక్షససేనామేఘావృత మయిన ప్రాంతమంతా గగనతలంలా స్వచ్ఛంగా వుంది. అంతలో బాణమేఘావృతమయింది. రాముడు కొంత అలసినట్లు కనిపిస్తున్నాడు. అప్పుడే రంగ భూమికి దిగిన ఖరుడు మహోత్సాహంతో వున్నాడు. అగ్నిగుండంలో దూకే శలభంలా వచ్చే ఖరుడు రాముని ధనుస్సు ముక్కలు చేశాడు. రాముని మర్మదేశాలను గురిపెట్టి బాణాలు విడిచి సింహనాదం చేశాడు. రాముని కవచం విచ్ఛేదమయింది. శరీరమంతా రక్తంతో తడిసి పొగలేని అగ్నిజ్వాలలా వుంది.

అగస్త్యమహర్షి అనుగ్రహించిన వైష్ణవధనువును అందుకొని రాముడు వారి సారించి, సారిస్తూనే ముందుగా రథధ్వజం కూల్చాడు. రథకేతనం భూపతనం కావడం ఖరుని క్రోధాగ్నికి యింధన మయింది. అంతలో రామ ధనుర్విముక్తశరాలు ఖరుని బాహుద్వ యాన్ని ఖండించి వక్షస్థలాన్ని ఛేదించి అశ్వాలనూ, సారథినీ అరగించి మరొక్కబాణం వాని దేహంలో నాటి చిరునవ్వుతో నిలబడగా వాడు గదా దండధారియై ఎదురు వస్తూంటే:

చతురంగబలాలతో నువ్వు సర్వలోకాలూ అసహ్యించుకునే దుష్టకర్మలుచేసి సర్వ ప్రాణికోటికి బాధాకరుడి వయ్యావు. ప్రాణిహింస చేసేవాడు ముల్లోకాలనూ జయించినా అది తాత్కాలికమే. ఆ జీవితం ఎంతోకాలం సాగదు. ఎంతటి దయార్ద్ర హృదయు డయినా నీవంటి దుష్టుణ్ణి ఉపేక్షించి విడిచిపెట్టడు. లోభ, కామ వశీభూతులు వడగళ్ళు తినే సర్పాలవలె చావక తప్పదు. ఈ దండకాటవిలో ప్రశాంత జీవనం సాగించే మహర్షి గణాలను హింసించిన పాపఫలం వూరికే పోదు. అది కట్టికుడుపుతుంది. ఇతఃపూర్వం నువ్వు దారుణంగా వధించిన మహామునులున్న ప్రాంతానికే నిన్ను పంపుతున్నాను. నువ్వు చేసిన దుష్కార్యాలకు దండన విధించ మని మా ప్రభువు నన్ను పంపించాడు. సర్వ భూతకోటి నీ మృత్యువుకోసం నిరీక్షిస్తున్నది. ఎలా రక్షించుకుంటావో చూసుకో అన్నాడు.

ఖరుడు: దాశరథీ! సామాన్య యోధులను నేలకూల్చి ఎంతో గొప్ప వాడి ననుకుంటున్నావు. పరాక్రమశాలియైన ఉత్తమ వీరునికి స్వీయ ప్రశంస మంచిపని కాదు, మృత్యువు అనన్నమై నిన్ను ఈ వైచ్యానికి దింపింది. కులాగ్నితప్తమయిన స్వచ్ఛ సువర్ణంలా గదాదండంతో కులగిరిలావున్న నన్ను సరిగా చూసినట్టు లేదు నువ్వు. అప్పుడే మార్యుడు అస్తాద్రికి చేరుతున్నాడు. నీకు చెప్పవలసింది చాలావుంది. కాని మాటలు దేనికి, మా రాక్షసవీరులందరికీ నీ రక్తంతో తర్పణాలు విడవాలి. ఇప్పటికే ఆలస్యమ

యింది అంటూనే గదాదండం విసరడమూ, అది రామబాణంతో ఛిన్నాభిన్నం కావడమూ ఏకకాలంలో జరిగాయి.

రాముడు మృదుహాసంతో: రాక్షసాధమా! నీ పరాక్రమం ఎంతటిదో చూసు కున్నావా! నీ పేవాసుల అనుచరుల కన్నీరు తుడుస్తావన్నావే, ఏదోచేసి ధూళి, ధూసరిత దేహంతో బారలుసాచిన చేతులతో దుర్లభమయిన ధరణీ ప్రమదారత్నాన్ని ఆలింగనం చేసుకో నీవంటి దుష్టుని భర్తగా వరించినందుకు నీ స్త్రీజనం అంతా అనాథలవలె తల బాదుకు ఏడుస్తారు, అంటూంటే ఖరుడు రోషారుణ నయనుడై:

ఓ రాచబిడ్డా! గర్వాంధకారంతో నీకు మన్నూ మిన్నూ కనిపించడంలేదు.

కాలపాశబద్ధుడైన వాడికి వాచ్యాఽవాచ్యాలూ కార్యాఽకార్యాలూ తెలియవు. అంటూ అటూ ఇటూ చూసి సమీపంలోవున్న సాలవృక్షం పెరికి రామునిపై విసిరాడు. రామబాణం దాన్ని మధ్యలోనే తునకలు చేసింది. రాముడు రక్తలోచనుడై విడిచిన బాణాలతో ఆ శరీరం తూట్లుపడి, ప్రస్రవణగిరిలా వుంది. తన దేహంనుండి ప్రవహించే రక్తపువానవతో మత్తెక్కి లంఘించాడు ఖరుడు, రామునిమీదికి.

రాముడు అస్త్రానుసంధానంకోసం రెండడుగులు వెనుకకువేసి బ్రహ్మదండతుల్య మైన ఇంద్రదత్తాస్త్రాన్ని ప్రయోగించాడు. అది ఖరుని గుండెలు ఛేదించి నేలకురాల్చింది. అంతలో గగనవీథినున్న సర్వ దేవ దేవర్షి రాజర్షి గణాలు ఆ మహాధానుష్కుని పరాక్ర మాన్ని అభినందించాయి.

ఈవిధంగా జనస్థానంలో నరమాంసప్రియులైన రాక్షసులందరినీ సంహరించిన రాముని అక్కడి మహర్షు లందరూ ఆనందాశీస్సులతో అభిషేకించారు.

సహస్రాధికసంఖ్యలలో వచ్చిన క్రూరరాక్షసులను ఏకైక వీరుడుగా నిర్జించిన భర్తను ఆలింగనంనుంచి విడువలేకపోయింది జనకరాజనందన.

## రా వ ణు డు

జనస్థానంలోని మహాయోధులందరూ నిహతులు కావడం చూచిన రావణదూత అకంపనుడు లంకానగరంచేరి తన ప్రభువుకు వృత్తాంతమంతా వివరించగా ఆ రాక్షస చక్రవర్తి కన్నులు అగ్నిసదృశాలయాయి.

ఓరీ అకంపనా! ఎవడురా వాడు, ప్రాణాలమీద ఆశ విడిచి నా జనస్థానంలో అడుగు పెట్టిన మూర్ఖుడు? దేవేంద్రుడు కూడా మనముందు తలవంచుతాడే! అగ్నికి అగ్నిని, యముడికి యముణ్ని, మృత్యువుపాలిట మృత్యువునే, వాయువుని బంధించగలనే, సూర్యుని మండించగలనే. అటువంటి మాకు ఆగ్రహం కలిగించిన అవివేకి ఎవడు? అని మండి పడుతూంటే అకంపనుడు ప్రకంపించి అభయం వేడుకొని:

ప్రభూ! ఆయన సింహవిక్రముడు, శ్యామవర్ణుడు, మహాశక్తిసంపన్నుడు, విశాల వక్షుడు దశరథనందనుడు అన్నాడు.

కోడెత్రాచు బుసకొట్టినట్టు రావణుడు నిట్టూర్చి: అయితే దేవతాసైన్యం తోడురాగా దేవేంద్రుని సాయంతో వాడీ కార్యం తలపెట్టాడా? అని ప్రశ్నించాడు.

అకంపనుడు: లేదుప్రభూ! ఆయన మహాధానుష్కుడు, దివ్యాస్త్రవిదుడు, రూపు దాల్చిన ధర్మమూర్తి. అన్నివిధాలా ఆయనను పోలినవాడు ఆయన తమ్ముడున్నాడు. రాముడు నీలమేఘంలా వుంటాడు, ఆ తమ్ముడు లక్ష్మణుడు శ్వేతాభ్రంలావుంటాడు. అంతే కాదు. రామధనుర్విముక్తశరాలు అయిదుతలల పాములవలె వచ్చి మన సేనలను సర్వనాశనం చేశాయి, అని వినయంగా నిలబడ్డాడు.

ఈక్షణమే నేను జనస్థానానికి వెళ్ళి వారిద్దరినీ సంహరించి వస్తాను, అని లేచాడు రావణుడు.

అకంపనుడు: ప్రభూ! మీరనుకున్నంత తేలిక కాదది. కుండపోతగా వానలు పడే కాలంలో ఉప్పొంగి ప్రవహించే మహానదికి తన బాణాలతో ఆనకట్ట వెయ్యగల ధామమ్ఘడాయన. విశ్వాంతరాళంలోని నక్షత్రగ్రహ మండలాలను కల్లోలం చెయ్యగలడు, సాగరాలు ముంచెత్తితే భూమిని పైకెత్తగలడు. చెలియలికట్టలు దాటించి, సముద్రాలు పొంగించి ధరణీమండలాన్ని గగ్గోలుపరచగలడు. ఈ సర్వసృష్టినీ ఉపసంహరించి పున స్సృష్టి చెయ్యగలడు. పాపాచారులు స్వర్గంచేరలేనట్లు మనం రాముని జయించలేం. అయితే ఒక్కదారి వుంది. ఆయనకు అతిలోక సౌందర్యవతి అయిన భార్యవుంది. దేవ గంధర్వలోకాలలో అంతటి సుందరీమణి కనిపించదు. ఆ కాంతామణిని అపహరించి తీసు కొని రాగలిగితే యిక రాముడుండడు, అన్నాడు.

రావణుడు ఆ ఆలోచనకు సంతోషించి మరునాడే జనస్థానానికి వెడుతూ దారిలో వున్న మారీచుని ఆశ్రమంచేరి స్వాగత సత్కారాలుపొంది ఆగమనకారణం చెపుతూ:

మారీచా! రాముడనే మానవమాత్రుని చేతులలో మన జనస్థాన రక్షకదుర్గంలోని యోధులందరూ నిహతులయారు. ప్రతీకారంగా నేను రా ము ని భార్యను అవహరించ సంకల్పించాను. అందుకు నీ సాయం కావాలి, అన్నాడు.

మారీచుడు: ఎవరయ్యా! నీ కీ ఆలోచన కల్పించినది? వాడు నీకేకాదు, సర్వ రాక్షసకులానికీ మిత్రరూపంలోవున్న మహాశత్రువు. కాలకూటవిషం కర్కోటకనాగు కోరలు నీచేత పీకించడానికి తలపెట్టిన ఆ మూర్ఖుడెవడు? హాయిగా ఆరగించి, సుఖంగా గుండెమీద చేతులుంచుకు నిద్రించే నీ కీ అశాంతి కలిగించిన దుష్టుడెవడు?

ఉత్తమ క్షత్రియవంశ సంజాతుడైన రాముడు గంధగజేంద్ర సదృశుడు. నిశిత శరాలే పంజాగాగల యోధసింహు డాయన. ఆ సింహాన్ని కావాలని మేల్కొలిపి రాక్షస సేనను లేళ్ళగుంపులా ఆయనకు బలియివ్వకు. ఆయనతో యుద్ధం ప్రచండవేగంతో వెళ్ళే మహానదీ ప్రవాహంలో పడిపోవడమే. నామాటవిని లంకానగరానికివెళ్ళు నీకు సుందరీ మణులకు కొదవలేదు. వారితో సుఖం చాలు ఎందుకీ అనవసరప్రయత్నం, అని హిత బోధచేయగా రావణుడు మారు మాటాడకుండా వచ్చినదారినే వెళ్ళాడు.

అప్పటికి లంకకుచేరిన శూర్పణఖ నిండుకొలువున వున్న రావణుని సమీపించింది. దేవ, గంధర్వ, మహర్షిగణాల పాలిట యమునివలె వెలుగుతూన్న రాక్షసచక్రవర్తి వక్షః స్థలంమీద యింద్రుని వజ్రఘాత చిహ్నాలూ, ఐరావతవిషాణాగ్రఘాతాలూ వున్నాయి. దేవాసుర సంగ్రామాలలో దేవతాప్రముఖుల ఆయుధఘాతాలెన్నో ఆయన వీరత్వలాంఛ నాలుగా గోచరిస్తున్నాయి. మహాపర్వత సన్నిభమైన శరీరంతో అద్భుతంగా వున్నాడు.

దివ్యాస్త్రకోవిదుడైన ఆ అసురేశ్వరుడు దశసహస్రవర్షాలు తపస్సుచేసి తనశిరస్సులు బలియిచ్చి, దేవ, దానవ, గంధర్వ, పిశాచ, నాగ జాతులనుండి మృత్యువులేకుండా వరం పొందినవాడు. యజ్ఞ విధ్వంసనం, పరదారాపహరణం, మహర్షి జనపీడనం నిత్యక్రీడలుగా కలవాడు. భోగవతీనగరానికి పోయి వాసుకిని జయించి అక్కడ తక్షకుని భార్యను బలా త్కరించి తెచ్చినవాడు, కైలాసానికి వెళ్ళి కుబేరుని పరాజితునిచేసి పుష్పకాన్ని తెచ్చు కున్న బలశాలి. నందనచైత్రరథవనాలను విధ్వంసం చేసిన వీరుడు. సూర్యచంద్రుల గతులు మార్చగలిగిన శక్తియుతుడైన అన్ననుచూచి శూర్పణఖ:

అన్నయ్యా! కామోపభోగాలలోపడి నీ నెత్తిమీద పడనున్న విపత్సాగరాన్ని కాన లేకపోతున్నావు. నీచమైన కామసుఖాలలో తేలియాడే ప్రభువును ప్రజలు మన్నించరని ఎరగని అవివేకివా? కాలానికి అనుగుణంగా ప్రవర్తించని ప్రభువు కాలచోదితుడవుతాడని తెలియని వాడవా?

దుర్లభుడై, వారి అభిమతాలకు స్వాధీనుడు కాకుండా అవాచారంతో సాగే ప్రభు వుకు ప్రజలందరూ బురదను చేరని ఏనుగులవలె దూరులవుతారు.

అయుక్తాచారం దుర్దర్శం అస్వాధీనం నరాధిపమ్।
వర్జయంతి నరా దూరా న్నదీపంక మివ ద్విపాః।

మానధనులైన దేవ గంధర్వగణాలతో ఎప్పుడో వైరంకొని తెచ్చుకున్నావు. అది చాలక చపలచిత్తుడవై, ప్రమత్తతతో రాజ్యంలో ఎక్కడ ఏం జరుగుతున్నదీ తెలుసుకోలేని స్థితిలో వడ్డావు. ఇంకెంతకాలం ఈ రాజ్యాన్ని కాపాడగలవు:

గూఢచారివర్గం కోశసమృద్ధి రాజనీతిజ్ఞతలేని ప్రభువుకీ, ప్రజాసామాన్యానికీ ఏమిటి తేడా! రాజంటే ఎవడు? చారచక్షువు. ఆ చారులు సక్రమంగా సమాచారం తెస్తున్నారో లేదో తెలుసుకోలేని మంత్రులతో వున్న నీతెలివిని చూసి నవ్వాలో ఏడవాలో తెలియడంలేదు.

జనస్థానంలో పదునాలుగువేల రాక్షసబలం ఖర దూషణ త్రిశిరులతో వేలకూలినట్లూ అదంతా రాముడనే ఒక్క నరుడిద్వారా జరిగినట్లు, ఆ జనస్థానం ఈనాడు మహర్షి విహార భూమి అయినట్లు, తెలుసా నీకు. దేశకాలాలు గుణదోషాలు తెలుసుకోలేని రాజు అచిర కాలంలో చ్యుతుడవుతాడు, అని గుక్కతిప్పకుండా ప్రసంగిస్తూంటే రావణుడు క్రోధచిత్తుడై:

ఆవు, ఎవడా రాముడు? వాడి గుణరూప కుల శీల వీర్యాలేమిటి? దండకారణ్యా నికి ఎందుకు వచ్చాడు? ఖరదూషణులతో వైరం ఎందుకు కలిగింది? నీకీ వికృతాకారం కలిగించిందెవరు? అన్నీ వివరంగా చెప్పు అన్నాడు.

శూర్పణఖ: ఎవరా! కోసలాధిపతి దశరథుడులేడూ ఆయన పెద్దకొడుకు. ఆజాను బాహువు, విశాలాక్షుడు, మన్మథ సదృశ సుందరాకారుడు, వల్కలాజినాలుకట్టి తిరుగు తున్నాడు, కాని ఆ చాపకళావైదగ్ధ్యం వున్నదే అది వేవింతవరకూ కన్నదికాదు. విన్నదియు కాదు. ఇంద్రధనుస్సులా పట్టి బాణం విడిస్తే అది కోడెత్రాచులా వచ్చి ప్రాణాలు హరిం చడమే. తూణీరం ఎప్పుడు తీస్తాడో, సంధించే దెప్పుడో, విడిచేదెప్పుడో కనిపించదు. మనవారు రక్తపు మడుగులో విల విలలాడడమే కనిపించింది. అర్ధముహూర్తకాలంలో ఖర దూషణ త్రిశిరులతోపాటు మనసేన నామరూపాలు లేకుండాపోయింది. ఆడదాన్నికనక నన్ను విడిచారు. నేను మిగిలాను. కనుక ఈ కబురైనా అందింది నీకు. దండకారణ్యంలో రాక్షసవాసన లేకుండాచేసి మహర్షి జన వాసయోగ్యం చేస్తానని వారికి మాటయిచ్చాడట. ఇచ్చాడోలేదో జరిగిందిమాత్రం అది.

అంతే అనుకున్నావేమో, అంతటివాడు ఆయన తమ్ముడున్నాడు. వాడికి అన్నగారే ప్రాణం. అన్నకు వాడు బహిఃప్రాణం. బుద్ధిలో, బలంలో అన్నకు వీసం తగ్గడు. ఆ రాముని భార్యకూడా వుంది, సీతట దానిపేరు.

చక్రాలవంటి కన్నులు, చంద్రునివంటి ముఖం, విశాల జఘనం, మేలిమి బంగారు దేహం, చక్కని ముక్కు, పొడుగాటి కేశపాశం.

కాంతు విస్తీర్ణజఘనాం పీనోత్తుంగ పయోధరామ్ ।
భార్యార్థేతు తవావేతు ముద్యతాహం వరాననామ్ ॥

ఆ సుందరాంగిని పొందనివాడి జన్మ వ్యర్థం. అటువంటి భార్య కలవాడిముందు దేవేంద్రుడు కూడా సామాన్యుడే, అని భావించి ఆమెను నీకు భార్యగా తేవాలని ప్రయత్నించి ఈ అవస్థపాలయ్యాను. ఆ లక్ష్మణుడు లేడూ! వాడు చేశాడీపని. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నువ్వు వెళ్ళు. మనవారిని సంహరించిన ఆ క్రూరులమీద ప్రతీకారం తీర్చుకో. సీతను తెచ్చుకో, అని నిట్టూర్చింది దీర్ఘంగా.

బాగా యోచించాడు రావణుడు. అతిరహస్యంగా వాహనశాలకు వెళ్లాడు. రథాన్ని సిద్ధంచేయించాడు. పిశాచ వదనాలుకల గార్ధభాలను పూన్చిన రథంమీద గగనమార్గాన సముద్రాభిముఖంగా సాగిసాగి దేవ, గంధర్వ విహార భూములు తిలకిస్తూ, అమృతంకోసం బయలుదేరిన గరుత్మంతుడు గజ, కచ్ఛపాలను ఆరగించడానికి వాలిన మహావటవృక్షాన్ని అవలోకించి, మారీచుని చేరగా, వాడు : ప్రభూ! ఇంతలోనే మళ్ళీ ఏం వచ్చిపడింది, లంకలో అంతా కుశలమేకదా! అని అడిగాడు.

రావణుడు : మారీచా! నేను నీ సాహాయ్యంకోరి వచ్చాను. ఈ విపత్సమయంలో నాకు నీకంటే ఆప్తుడు లేడు. జనస్థానదుర్గరక్షకులుగావున్న ఖరదూషణ త్రిశిరులు తమ సేనలతో అక్కడి మునిజనాన్ని హింసిస్తూ నాకు తృప్తికలిగించి సుఖంగా వున్నారింతవరకూ. అటువంటి వారిని రాముడనే మానవుడు, వట్టి పాదచారి మన చతురంగబలాలను నేలకూల్చి మహర్షి సంఘానికి దండకారణ్యం విహారభూమి చేశాడట.

తండ్రి కోపానికి గురియై రాజ్యభ్రష్టుడైన క్షత్రియకుల పాంసనుడు, అల్పాయుష్కుడు, మూర్ఖుడు, శీలహీనుడు, ధర్మరహితుడు విస్కారణంగా తన పరాక్రమ ప్రదర్శనకోసం మనవారిని నేలకూల్చి మనసోదరి శూర్పణఖకు ముక్కు చెవులుకోసి పరాభవించాడు. ఇంత జరిపిన వాడిమీద ప్రతీకారం తీసుకోక తప్పదు. వాని భార్యను

అపహరించడమే నా లక్ష్యం. ఇందులో నీ సాయం కావాలి. పరాక్రమ ప్రదర్శనలో మాయాజాలంలో నీఅంతటివాడు లేడు. అయితే నువ్వు చెయ్యవలసిందేమిటని అడుగుతావేమో! వెండిచుక్కల బంగారు కాంతుల చర్మంగల లేడిలా వెళ్ళి నువ్వు వారి ఆశ్రమ సమీపంలో తిరుగుతూవుంటే, ఆ రాముడిభార్య నిన్ను చూసి ముచ్చటపడుతుంది. ప్రియురాలి ఆనందంకోసం ఆయన నిన్ను బంధించడానికి తమ్ముడితో కలిసివస్తాడు. ఆ సందులో నేను సీతను అపహరిస్తాను. భార్యా వియోగవ్యధతో వానిబలం క్షీణిస్తుంది. అప్పుడు వానిని సంహరించడం సుకరం. విషయం తెలిసింది కదా, అన్నాడు.

ఆమాటలు వింటున్న మారీచుని ముఖం వివర్ణమైంది. నాలుక పిడచకట్టింది. ప్రాణాలు కడముట్టిచేరాయి. పెదవులు ఎండుతున్నాయి, కనురెప్పలు కదలలేదు. ఎట్టఎదుట మృత్యువు నిలబడినట్లనిపించింది. కొద్దిక్షణాలకు తేరుకొని :

లంకేశ్వరా!

సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః।

అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః॥

ఈలోకం అంతా చిత్రమైనది. మనమనసుకి వచ్చే ప్రియసల్లాపాలు సాగించే వారే చుట్టూచేరతారు. అయాచితంగా అప్రియమైనా హితవు చెప్పేవాడు దొరకడు, వాడు దొరికినా మనం వినలేం. కాకుంటే ఎందుకూ కొరగాని చారులతో అతిచంచల స్వభావుడవైన నువ్వు మహాపరాక్రమోపేతుడైన రామునిగూర్చి యింత తక్కువ అంచనా వెయ్యలేవు. వాడొక్కటే కోరిక. రాముడు క్రుద్ధుడై సర్వరాక్షససంహారానికి ఉపక్రమించకుండా పరమేశ్వరుడు అనుగ్రహించాలి. నిన్ను చూస్తూంటే ఆ జనక రాజనందన నీ నాశనానికే పుట్టినట్లనిపిస్తున్నది. నీవంటి కాముకుడు కారణంగా రాక్షసవంశంతో లంకానగరం భస్మంకాబోతున్నది. దుస్స్వభావుడు, విలాసపురుషుడు, పాపకర్మరతుడు అయిన ప్రభువు తన సర్వస్వాన్ని నాశనంచేస్తాడు.

ఇంతకీ ఎవరయ్యా నీకు రామునిగూర్చి యిన్ని అసత్యాలు తలకెక్కించినది! ఆయన పితృపరిత్యక్తుడా! లుబ్ధుడా! పాపాచారుడా! ధర్మహీనుడా!

కౌసల్యానందవర్ధనుడైన రాముడు దయార్ద్రహృదయుడు, సర్వభూత ప్రియుడు. పినతల్లివంచనవల్ల, తండ్రిమాట నిలపడానికి అడవికి వచ్చాడు. రాజ్యం రాజ్యభోగాలూ అన్నీ వదులుకొచ్చినవాడు లుబ్ధుడా!

రామో విగ్రహవాన్ ధర్మః
సాధుః సత్యపరాక్రమః।
రాజా సర్వస్య లోకస్య
దేవానా మివ వాసవః॥

అటువంటి మహనీయుని భార్యను అపహరించే ప్రయత్నం ఎంత తుచ్ఛమైనది. సూర్యతేజస్సును అపహరించడం సాధ్యమైతే యిది సాధ్యం. శరములే జ్వాలలుగా, చాపఖడ్గాలే ఇంధనాలుగా, భగభగమండే రామాగ్నిలో దూకడానికి ప్రయత్నించకు.

అపార పరాక్రమ తేజస్సంపన్నుడైన రాముడికి ప్రాణం జానకి. ఆయన అగ్ని హోత్రుడైతే ఆవిడ అనలశిఖ. అటువంటి అగ్నిశిఖవైపు వెళ్ళకు.

ధర్మపరాయణులైన విభీషణాదులతో ఆలోచించి ఎదిరిబలం గ్రహించి నిశ్చయానికి రావాలి. అది నీకు శ్రేయస్కరం. త్వరపడి అడుగు ముందుకువేశావో అది నీకూ, నీ వంశానికీ నాశనహేతువే.

ఇంతగా ఎందుకు చెపుతున్నానంటే, నాకు వేల ఏనుగుల బలం వుంది. అంతకు మించిన మాయాశక్తులున్నాయి. నాకుతోడు మా తమ్ముడు సుబాహుడు, తల్లి తాటక, కాక వేలాది అనుచరులు. ఇందరినీ చీకాకుపరిచినవాడు రాముడు. అప్పటికింకా పద హారేళ్లు లేవు ఆయనకు, అకృతాస్త్రుడు అప్పటికి.

వింటున్నావా! ఆరోజులలో మా బీభత్సాలకు అంతులేదు. యజ్ఞవిధ్వంసనమే మా లక్ష్యం. మహర్షి సంఘపీడనమే మా క్రీడ. అటువంటి మేము విశ్వామిత్రుని యజ్ఞవిధ్వంసనానికి పూనినప్పుడు మాకు జరిగిన పరాభవం. అదంతా ఆ రాముడొక్కడు చేసినదే. చెప్పానుగదా అప్పటికి పదహారేళ్ళు నిండనివాడు. ఇప్పుడింకా అనుభవం, అస్త్రవిద్యాకౌశలం వున్నాయి. పరశురామునివంటి మహాయోధుని నిలబెట్టిన రామునితో వైరం క్షేమంకాదు. ఆకాశాన్ని అంటే మేడలమీద హాయిగా జీవించే లంకాపురవాసు లందరినీ ఒక్క సుందరీమణికోసం బలిచెయ్యకు. మనం పాపం చెయ్యకపోయినా పాపం చేసేవారి స్నేహంచేసినా ఆ పాపఫలం అనుభవించక తప్పదనే మాట వాస్తవం. నీ వల్ల లంకానగరవాసులందరూ నాశనం కాబోతున్నారు. ఆత్మగౌరవం, వంశరక్షణ ఈ రెండింటికోసం నా మాట విను. మణి రత్న భూషణాలంకృతులై హంసతూలికాతల్పా లపై హాయిగా నిద్రించే లంకాపురవాసులకు కటికనేలపై శాశ్వతనిద్ర ప్రసాదించకు. వీరు

లంకా ఆ దురవస్థలో పడితే అది చూడలేక సౌభాగ్యహీనలై రాక్షసరమణీజనం రొమ్ములు బాదుకుంటూ ఆర్తనాదాలు చెయ్యవలసివస్తుంది. ఇదంతా నీ పరదారాభిగమనకాంక్షవల్ల కలగబోయే ఫలం. ఎందుకు నీకీ వాంఛ! వేలమంది వున్నారు. దేవ గంధర్వ భామామణులు. వారితో సుఖించు నామాట విను, అని ఊపిరి సలపకుండా బోధించాడు.

కదలలేదు రావణుడు. మారీచుడు మళ్ళీప్రయత్నిస్తున్నాడు.

లంకేశ్వరా! విశ్వామిత్ర యాగసందర్భంలో నా తల్లినీ, సోదరునీ కడతేర్చి ఎందువల్లనో దయతలచి నన్ను వదిలాడు. నాకుమాత్రం వానిమీద ద్వేషమంతగ్గక, దండకారణ్యంలో వారు ప్రవేశించినట్లు తెలియగానే యిద్దరుమిత్రులతో మృగరూపధారినై ఆ ఆశ్రమపరిసరాలలో విహరిస్తూ, అదునుచూసి వారిమీద పడబోయాను. అంతకుముందే ఆయన మార్జాడ పసిగట్టి, మేముదూకేలోగా మూడునిశితశరాలు సంధించాడు. ఆయన బాణపుదెబ్బ రుచిమెరిగిన నేను తెలివిగా తప్పించుకు పారిపోయివచ్చాను. వారిద్దరి సంగతీ చెప్పాలా! నాటి ఘటన తలపున కదలినప్పుడల్లా కంపం పుడుతూనేవుంది. అదిమొదలు ఎటుచూసినా రాముడే కనిపిస్తున్నాడు. కనులు తెరచినప్పుడే కాదు, మూసినా ఆయనే. ఏ వస్తువైనా రాముడే అనిపిస్తున్నది.

రకారాదీని నామాని రామ త్రస్తస్య రావణ ।
రత్నానిచ రథాశ్చైవ విత్రాసం జనయంతి మే ॥

మనమేకాదు, మనపూర్వులు బలి, నముచి వంటి మహామహులనుకూడా నిలబెట్టి తలతియ్యగల దాయవ. నా మాట విని సుఖంగా లంకకు పో. శూర్పణఖకు ముక్కు చెవులు కోసినా, ఖర దూషణులను వధించినా అది విప్కారణంగా జరిగిందికాదు, అదంతా దేనికి. నీ క్షేమంకోరి చెవుతున్నాను. ఈ ప్రయత్నం విడిచిపెట్టు అన్నాడు.

చవుడుభూమిలో వానకురిసినట్లు, మృత్యువు సన్నిహితమైనవాడికి ఔషధం రుచించనట్లు, రావణుడు ఆ హితోపదేశాన్ని పెడచెవినిబెట్టి: ఎందుకింత కంఠశోష! వాడు మూర్ఖుడు, పాపశీలి, పైగా సామాన్యమానవుడు. ఎవరో ఆడదాని మాటకోసం కన్నతల్లి దండ్రుల్నీ రాజ్యాన్నీ విడిచివచ్చినవాడూ పురుషుడేనా. నా సోదరుడైన ఖరుని వధించిన వాణ్ణి విడిచిపెట్టడమా. వాడి భార్యను అపహరించవలసిందే, ఆ వియోగంతో వాడు తనువు చాలించవలసిందే.

నీ దగ్గర హితోపదేశంకోసం రాలేదు. రాజుకోరితే తప్ప గుణదోషాలూ, అపాయ ఉపాయాలూ చెప్పవలసినపని విద్వాంసుడైన మంత్రికి ఉండదని ఎరగవా? అడిగినప్పుడైనా

ఎంత వినయంతో నివేదించాలి. ఇలాగేనా, రాజశ్రేయస్సు కోరేమంత్రి మాట్లాడడం. ఇంద్రుని విక్రమం అగ్నిహోత్రుని తేజస్సు, చంద్రునిసౌమ్యశీలత, వరుణుడి ప్రసన్నత, యముడి దండము యివన్నీ ప్రభువులో వుంటాయి. అటువంటి ప్రభువును ఎలా పూజించాలో తెలియక నోటికి వచ్చినట్లల్లా ప్రేలుతున్నావు. నీతో సలహా సంప్రదింపులకు రాలేదు నేను. నీ సాయంకోసం వచ్చాను. కాదనగలశక్తి నీకులేదు.

నువ్వు బంగారులేడివి. దానిమీద వెండిచుక్క లుంటాయి. వారి ఆశ్రమపరిసరాల నడయాడుతుంటావు. చూస్తుంది సీత. తెచ్చిపెట్టమంటుంది, రాముడు పట్టడానికి వస్తాడు. నువ్వు దొరకకుండా దూరంగా తీసుకుపోతావు. అక్కడనుంచి రాముడి కంఠస్వరంతో, హాసీతా! హాలక్ష్మణా! అని అరుస్తావు. అదివిని సీతభయంతో లక్ష్మణుని పంపుతుంది. అంతే! నేను నిశ్చింతగా సీతను అపహరిస్తాను. నువ్వు యథేచ్ఛగా వెడతావు. ఇందుకు నీకు అర్ధరాజ్యం. కాదన్నావా మృతి నీకు బహూకృతి అన్నాడు.

మారీచుడు : ఎవరయ్యా! నీ కీ విషబీజం వేసినారు. సర్వనాశనకరమైన ఈ మార్గం చెప్పినవారికి ఉత్తరక్షణంలో తలతిప్పక, వాతల తరుగుతానంటావు. విద్వాంసులైన సజ్జనుల మంత్రాంగం చెవికెక్కిన ప్రభువు ప్రజలను సుఖపెడతాడు. అంతేకాని దుర్వినీతులైన మంత్రులతో వున్నవాడు రాజ్యపాలనకే అనర్హుడు. మందబుద్ధికల సారథి విషమసన్నివేశంలో రథచోదకత్వానికి సమర్థుడుకాడు. అలానే అగ్రహోదగ్రస్వభావుడైనవాడు రాజు కారాదు.

ధర్మపరులూ, సాధుపురుషులూ అయిన మహనీయులు కూడా ఉగ్రస్వభావుడైన ప్రభువు ఏలుబడిలో ప్రాణాలు కోల్పోతారని విన్నాను. నీవంటి కర్కశ హృదయుడైన దుర్బుద్ధిని ప్రభువుగా గ్రహించిన లంకానగరవాసులందరికీ నాశనకాలం ఆసన్నమైంది.

నేను వెడతాను. రామదర్శనంతో ఊపిరి విడిచేస్తాను. ఆ తరువాత ఆ ధానుష్కుని చేతులలో నువ్వు ప్రాణాలు వదులుతావు. కాక జానకిని అపహరించగలిగితే నీతో బాటు లంకానగరం, రాక్షసవంశం సర్వనాశనం. నీ నెత్తిమీద వినాశనం కూర్చున్నది. నాహితవు నీకెక్కదు. నడు వెడదాం.

రాక్షసేశ్వరా! నీవంటి దురాత్ముని కొలువులో పనికి కుదిరినందుకు తగిన ప్రాయశ్చిత్తం అనుభవిస్తాను. రాముని ధనుస్సు రెండుమారులు నన్ను దయతలచింది. ఇక ఈమారు నా జీవితాన్ని బలికొని తీరుతుంది, నడు అన్నాడు.

రావణుడు పరమసంతోషంతో : ఇప్పటికి నువ్వు నరైన మారీచుడివయావు. ఎక్కు, రథం ఎక్కు బంగరులేడివై సీత మనస్సును ఆకర్షించు. చాలు. నేను మిగిలిన కార్యం చక్కబెట్టు కుంటాను, అని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

ఉభయులూ రథం ఎక్కారు. ఆ రథం విమానంవలె గగనమార్గానికి లేచింది. నదీ, నద, పర్వత, నగర, గ్రామారణ్యాలుదాటి పంచవటి చేరారు.

మణిమయశృంగాలతో ఎర్రని తామరపువ్వులవంటి ముట్టెతో ఇంద్రనీలమణిద్యుతుల చెవులతో, అదేకాంతిగల ఉదరంతో వైడూర్యకాంతుల గిట్టలతో, ఇంద్రచాపద్యుతులీనే తోకతో, నిగనిగలీనే బంగారుకాంతిదేహంతో, దానిపై రజతబిందువులతో పరమసుందరంగా తయారయాడు మారీచుడు.

అయితే లేడినడకను, చూపులను అనుకరించడానికి కొంతవ్యవధి పట్టింది. మునిపల్లెతో పచ్చికచిగుళ్ళను కొరకుతూ నెమ్మదిగా పర్ణశాలను సమీపించి, అక్కడి అరటి తోటలలో కొండగోగుమొక్కలమధ్యలో నడయాడుతున్నాడు. చెంగు చెంగున దూకుతూ పొదలచాటుకు పోతూ జానకిని ఆకర్షించే ప్రయత్నం ఆరంభించాడు.

అంతకు ముందెప్పుడూ చూడని ఆ వింతమృగాన్ని చూచిన జంతువులు దానిదగ్గరగా వెళ్ళి వాసనచూసి దూరంగా తొలగిపోతున్నాయి. సమీపంలో జంతువు కనిపించే సరికి దాన్ని సద్యఃకాలంలో ఆరగించే సంకల్పం కలిగింది మారీచునికి, కాని తన లేడిరూపం గుర్తుకువచ్చి వాంఛను అణచుకున్నాడు.

అంతలో సీత పూలు కొయ్యడానికి ఆశ్రమం వెలుపలకు వచ్చింది. కొండగోగు మొక్కల మధ్యలో గిరగిర తిరుగుతూ సీతకు ఆశ్చర్యం కలిగించాడు.

ఇన్ని సంవత్సరాలుగా యిన్ని అరణ్యాలు తిరిగినా ఎన్నడూ కని విని ఎరగని వింతమృగం కంటబడడంతో సీత :

ఇదిగో మిమ్మల్నే తొందరగా రావాలి ! ఇద్దరూ రండి. ఎంతబావుందో ఈ జంతువు, అని రామ లక్ష్మణులు తనదగ్గరకు వచ్చేవరకూ పిలుస్తూనేవుంది. వచ్చిన రామ లక్ష్మణులు చూచారు. చూచిన లక్ష్మణుడు ; అన్నా ! ఇది మృగంకాదు. వీడు వాడే. ఆ మారీచుడికే ఈ విద్య బాగాతెలుసు. వేటకువచ్చే రాజులను ఇటువంటి ఆకారాలతో మోసగించి తినేవాడని విన్నాం. కాకపోతే యింతకాలంగా యీ విచిత్ర వర్ణాలతో లేడి ఉంటుందని మనకు చెప్పినవారుకూడా లేరే, అన్నాడు.

సీత మధ్యలో అందుకుని : ఆర్యపుత్రా ! ఇంత సుందరమైన లేడి. నా మనస్సు అణే వెరుతున్నది. మన ఆశ్రమప్రాంగణంలో యిది వుంటే నాకెంతో సంతోషంగా ఉంటుంది. పట్టపగలే వెన్నెల వెలుగుతున్నట్టుంది. అది చెంగు చెంగున దూకుతూంటే నా మనస్సు పరుగులు పెడుతున్నది. ఇక్కడ ఉన్నన్నాళ్ళూ మనకు సంతోషం కలిగిస్తుంది. అయోధ్యకు వెళ్ళేటప్పుడు దీన్ని తీసికెడితే అక్కడ అత్తలూ, భరతుడూ మరింత సంతోషిస్తారు, మన అంతఃపురంలో యిది వుండాలి. ఒకవేళ అది బ్రతికివుండగా దొరకక పోతే, దాని చర్మాన్ని కుట్టి, అందులో గడ్డి గాదం పెట్టి ఆశ్రమద్వారంలో అలంకారంగా వుంచుదాం, అంది.

ఎదురుగా రంగు రంగుల కాంతులతో లేడి, దానిమీది మనసుపడుతున్న భార్య.... రాముడు ఆ మృగాన్ని తేవడానికే నిశ్చయించి :

తమ్ముడూ ! ఆ లేడిని చూచిన క్షణంనుంచీ సీత పసిపిల్లలా అయిపోయింది. నిజమే ! ఇటువంటి మృగం నందనవనంలో, చైత్రరథవనంలో వున్నట్టు వినలేదు మనం. ఎంతచిత్రంగా వున్నదో అది. అది ఆవులిస్తూంటే చూశావా ! మబ్బులో మెరుపులా దాని నాలుక. దాన్ని చూస్తూంటే నా మనస్సే నిలవడంలేదే. ఇక సీత విషయం చెప్పాలా. మనం రాజవంశీయులం. ఆహారార్థం మృగాలను వేటాడతాం. ఇది మృగరత్నం, సర్వరత్నాలూ రాజు ఆధీనంలో వుండాలి. అందుచేత యిది మనదగ్గరే వుండాలి. ఈ బంగారుకాంతుల చర్మంమీద సీతతో కలిసి కూర్చోవాలనిపిస్తోంది. ఇంత మృదువైన చర్మం మరొకటి వుండదు.

కాదయ్యా ! వీడు మారీచుడే అనుకుంటే ఇప్పటికే వీడు ఎందరినో హింసించి. భక్షించాడు. కనక వీణ్ణి వధించవలసిన బాధ్యతవుంది నాకు. అగస్త్యమహర్షివాతాపి, ఇల్వలులను సంహరించినట్టు నేను వీడిని యమపురికి పంపాలి. నువ్వు అప్రమత్తుడవై సీతను రక్షిస్తూవుండు. కొద్దిసేపటిలో జటాయువువస్తాడు. జాగ్రత్తసుమీ, అని రాముడు నడుమున కత్తిబిగించి, ధనుర్బాణధారియై ముందడుగు వేశాడు.

అంతే ! లేడి చెంగున దూకింది. రాముడు మరింత వేగంతో అడుగువేసి దానిని పట్టబోయాడు. అది పొదలమాటునుంచి సాగిపోతున్నది, రాముడు వెంటాడుతున్నాడు. ఆశ్రమద్వారంలో నిలిచిన సీతా లక్ష్మణులకు వారు కనుమరుగయారు. అది బహుదూరం సాగిపోయింది. రాముడు బాగా అలసి, ఇక దీన్ని వధించకతప్పదని నిశ్చయించుకుని బాణం సంధించి విడిచాడు. బుసలుకొట్టే పాములా అది మారీచుని శరీరంలో దూసుకు

పోయింది. వాడు తాడియెత్తున ఎగిరి నగం లేడిగా నగం రాక్షసుడుగా వేలకూలాడు. కూలుతూ హా సీత! హా లక్ష్మణా ! అని అరిచాడు. అరణ్యమంతా ప్రతిధ్వనించింది. అప్పటికి వాడి కామరూపం తొలగి పూర్తిగా రాక్షసుడై ప్రాణాలు వదిలాడు.

ఆ భీకరకాయం చూచిన రాముని మనస్సులో లక్ష్మణుని మాటలు మసలి చకిత మయింది. వాడి అరుపు ఏ భావాన్ని సీతా లక్ష్మణులలో కలిగిస్తాయో అని జంకుతూ వెనుదిరిగాడు.

అక్కడ మారీచుడు అరచిన అరుపుకు చెదిరినగుండెతో సీత, లక్ష్మణా! విన్నావా ఆ ఆర్తస్వరం. అది మీ అన్నగారి కంఠస్వరం. నువ్వు తక్షణంవెళ్ళి ఆయన ఏ ఆపదలో వున్నారో చూసిరా. ఇది పరమక్రూరులైన రాక్షసులతో నిండిన అడవి. ఆ రాక్షస వ్యాఘ్రాలకు చిక్కిన రాజవృషభు డయాడేమో ఆయన, అని భయంగావుంది. నువ్వు త్వరగా వెళ్ళాలి అని తొందరపెట్టింది. కదలలేదు లక్ష్మణుడు. వేటకు వెళుతూ అన్నచెప్పిన మాటలు గుర్తులోవున్న లక్ష్మణుడు నిశ్చింతగా కూర్చున్నాడు. జానకి మనస్సు క్షోభించింది.

దానితో కోపం వచ్చి :

సౌమిత్రీ ! నామాట నీ చెవిని పడలేదా ! అన్నగారి ఆర్తస్వరంవిన్నా కదలకుండా కూర్చున్న నిన్ను చూస్తుంటే నీ కంటె ఆయనకు శత్రువు లేడనిపిస్తున్నది. ఆయన మరణమే నీకు తృప్తిగా ఉంటుందని భావించక తప్పడంలేదు. అందుకోసమే నువ్వు అడవికి వచ్చి వట్టున్నావు. ఈక్షణంకోసమే నువ్వు ఇంతకాలం ఎదురుచూస్తున్నావు. అన్నగారియందుభక్తిపేరిట సేవపేరిట ఇన్నాళ్ళూ నాటకమాడింది యిందుకోసమే. ఆయన దేహయాత్ర చాలిస్తే అప్పుడు నన్ను పొందాలనే దుర్బుద్ధి నీ మనస్సులో గూడుకట్టుకుంది. ఒక్క విషయం మరచిపోకు, ఆయన ప్రాణహీనుడయినఉత్తరక్షణంలో నాప్రాణాలు అనంతవాయువులలో కలసిపోతాయి, అని గోలుగోలున విలపిస్తూంటే, లక్ష్మణుడు తలవంచి, దీనంగా :

తల్లీ ! విదేహరాజనందనా ! నీ భర్తకు ఆపద వస్తుందనే ఆలోచన ఎలా వచ్చిం దమ్మా నీకు. దేవ, దానవ, గంధర్వ, పన్నగజాతులు ఏకమైవచ్చినా మా అన్నగారిని ఏమీ చెయ్యలేవు. అటువంటి రామునిగూర్చి నువ్వు యిటువంటియోచన ఎందుకు చేశావు. ఆయన ఆ లేడిని హతమార్చి వస్తాడు. ఆ లేడిరాక్షసుడే అయినా ఆయన చేతులలో కడతేరక తప్పదు. ఆయన వెడుతూ నిన్ను ఒంటరిగా విడిచి రావద్దన్నాడు. ఆ వినిపించిన ఆర్త స్వరం కూడా స్పష్టంగా లేదు. అదేదో మాయావిచర్య. సందేహంలేదు. ఖర,

దూషణ సంహారంతో యిక్కడి రాక్షసగణాలతో శత్రుత్వం తెచ్చుకున్నాం. వారు మనలను వంచించడానికి యీ పన్నాగం వేసివుంటారు. అని ఎంతగాధైర్యం కలిగించడానికి ప్రయత్నించినా, ఆవిడ క్రోధం కొంచమయినా తగ్గలేదు.

ఓ పాపీ ! దయాహీనుడా ! కులపాంసనుడా ! నీమాటలు కట్టిపెట్టు. జ్ఞాతులమధ్య అందునా సవతి అన్నదమ్ముల మధ్య మైత్రి వుంటుందని ఎలా అనుకోను. నీవంటి ప్రచ్ఛన్నశత్రువును విశ్వసించడంకంటె అవివేకంలేదు. నీ మనసునాకు బోధపడుతున్నది. ఈ కుట్రలో భరతుడికికూడా భాగం వున్నదేమో ! చివరగా చెపుతున్నాను. రాముడు ఊపిరివిడిస్తే సీత జీవించదు. మరొకతుచ్ఛుడు సీత ఒంటి మీద చెయ్యివెయ్యలేడు, అని విలపిస్తూంటే,

అమ్మా ! నిన్ను పరదైవంలా చూచుకుంటున్న నేను ఏంమాట్లాడను ? ఇంతవరకూ ఎన్నడూ నీ యెదుట మాటకూడా ఆడలేదు. ఇప్పుడయినా నీ మాటలు కలిగించే బాధతో పెదవి విప్పుతున్నాను. సామాన్య స్త్రీ ఎటువంటి ఊహచేస్తుందో నువ్వూ అటువంటి యోచనేచేశావు. సాధారణంగా స్త్రీలు చంచలస్వభావంతో, చపలచిత్తంతో, ధర్మదూరులై ఉంటారని విన్నాను. నువ్వుకూడా యిప్పుడు వారిలానే కనిపిస్తున్నావు. విషజ్వాలా తప్తశూలాలవలె నీ మాటలు నా చెవులను వేధిస్తున్నాయి. ఇంత పరుషంగా నన్ను హింసించిన నీకు ఏదో విపత్తు సన్నద్ధమైంది.

ఓ వనదేవతలారా ! మీరే నాకు సాక్షులు. అన్నగారి ఆజ్ఞకు బద్ధుడనైన నన్ను యింతగా అవమానించి ఈ స్త్రీ తరిమికొడుతున్నది కనక వెడుతున్నాను.

అమ్మా ! వెడుతున్నాను. నీకు సర్వదేవతలూ రక్షగా ఉందురుగాక. నేను మా అన్నతో కలిసివచ్చి నిన్నుచూసే అదృష్టానికి నోచుకుందుముగాక ! అంటూ బయలుదేరాడు.

లక్ష్మణా ! రాముడు రాకపోతే నేను ఈ గోదావరిలో మునిగి ప్రాణత్యాగం చేస్తాను. ఉరిపోసుకుంటాను. విషం త్రాగుతాను. అగ్నిగుండంలో దూకుతాను, అని మరీ తీవ్రస్వరంతో విలపిస్తూంటే, లక్ష్మణుడు ఆమె పాదాలకు ప్రణమిల్లి అన్నగారు వెళ్ళినవైపు అడుగువేశాడు.

లక్ష్మణుడు అటు అడుగువేశాడు, యిటు వస్తున్నాడు రావణుడు.

కాషాయాంబరం, పాదుకలు, కమండలువు. ఆశ్రమముఖంగా రావణుడు వచ్చే వేళ చెట్ల ఆకులు కదలడం మానేశాయి, గాలి స్తంభించింది. గౌతమీప్రవవాహవేగం మందగించింది. సంధ్యావేళ చీకట్లు మునిరినట్లు దశకంఠుడు ఆశ్రమ ద్వారంలో అడుగు పెట్టాడు. శని చిత్రానక్షత్రాన్ని సమీపిస్తున్నట్టు రావణుడు సీత దగ్గరకు నడుస్తున్నాడు.

పద్మలోచన, చంద్రవదన. పీతకౌశేయవసన, సువర్ణకాంతిశోభితదేహ అయిన జానకిని చూస్తూనే :

ఓ సుందరీ! నువ్వెవరవు? భూలోకం చూడవచ్చిన రతీదేవివా! శ్రీదేవివా! మల్లెమొగ్గలవంటి దంతపంక్తి, విశాలవిమలలోచన ద్వయం, అతివిశాల జఘనం, తదనుగుణ ఊరుద్వయం, పీనోన్నత తాళఫలసదృశ కుచద్వంద్వం. ఓహో! ఈ సౌందర్యాన్ని దేవ, గంధర్వ లోకాలలో ఎరగను. నీ అందం, దానికి తగిన వయసు, వయస్సుకు అలంకారంగా సౌకుమార్యం .... ఇన్నిటితో మనిషి పొడలేని అడవిలో నిన్ను చూస్తుంటే నా మనసు మనసులో లేదే. రాజధానీనగరాలలోని ప్రాసాదోపరితలాలలో, వాటిపార్శ్వాలలోని ఉద్యానవనాలలో హాయిగా విహరించవలసిన నువ్వు ఈ అడవిలో, పర్ణశాలలో ఎందుకుంటున్నావు? దివ్యగంధమాల్యాను లేపనాలతో దివ్యవస్త్రాలతో వున్నావు. నీ భర్త కూడా దివ్యుడా! దివ్యులయిన గంధర్వవసువు లెవరూ ఈ రాక్షసాలయంలో వుండరే. ఇక్కడ సింహ, వ్యాఘ్ర, భల్లూకాది క్రూరజంతుధ్వానాలే వినిపిస్తున్నాయి. ఈ భీకరారణ్యంలో ఒంటరిగా ఎలా ఉండగలుగుతున్నావు, అని ప్రశ్నలవర్షం కురిపించగా, సీత: ఆర్యా! మా వారు ఇప్పుడే వస్తారు. ఈ అర్ఘ్య పాద్యాదులు స్వీకరించి, ఆ ఆసనం మీద కూర్చోండి, అంది.

అవన్నీ మాకు ముట్టినట్టే, అని అలానే నిలబడ్డాడు. సీత కొంతసేపు మౌనంగా నిలబడి : నేను విదేహుల ఆడబిడ్డను. ఇక్ష్వాకుల యింటికోడలిని. నాభర్త రాముడు, అని ఆరంభించి పట్టాభిషేకభంగగాథచెప్పి, పితృవాక్పాలనకోసం ఆయన అడవికి వచ్చారు. ఆయనతో మా మరిదీ, నేనూ వచ్చాం. వారిద్దరూ ఆహారం తేవటానికి వెళ్ళారు. వచ్చేవేళయింది. మంచి రుచికరమైన పదార్థాలు తెస్తారు, ఇంతకూ తమ రెవరు? ఈ మహారణ్యంలో మీరు ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నారు? అని ప్రశ్నించింది.

నేను రాక్షసచక్రవర్తిని. ముల్లోకాలూ గజగజలాడతాయి నాపేరు వింటే. నన్ను రావణుడని పిలుస్తారు. నీ బంగారుశరీరం చూస్తూంటే నా మనస్సు స్వాధీనం తప్పుతున్నది. నాకెందరో ఉత్తమస్త్రీలు భార్యలుగా వున్నారు. వారిలో ఒక్కరూ నిన్ను పోలరు.

సముద్రమధ్యంలో లంకానగరం ఉన్నది. ఒక మహాపర్వతంమీద నా రాజధానీనగరం. అక్కడ నువ్వు పట్టమహిషివై అందరు దాసీజనులమధ్యలో సర్వభూషణ భూషితాంగివై రాజభోగా లనుభవించాలి, అని చిరునవ్వుతో మాట్లాడుతూంటే.

ఎవడవురా నువ్వు? మహేంద్రసముడు మహోదధిసదృశ గంభీరుడు, మహానగ సన్నిభుడు, సర్వగుణసంపన్నుడు అయిన రామునిపత్నిని, నన్ను అవమానించడానికి సాహసిస్తున్నావా! నక్క సింహంతో పరిహాసానికి ఒడిగట్టిందా! సూర్యకిరణాలను గుప్పిట పట్టజూచే మూర్ఖుడుంటాడా! కాలకూటవిషాన్ని చేతులతోత్రాగి జీవించగలననుకునే దుర్బుద్ధి వుంటాడా! మెడకు బండరాయి కట్టుకుని మహాసముద్రంలో దూకడానికి ప్రయత్నించకు. మండుతున్న అగ్నిని ఉత్తరీయపు చెంగులో మూటకట్టడానికి ప్రయత్నించకు. నువ్వు కాకివి, నాభర్త వైనతేయుడు. నువ్వు పిల్లివి. ఆయన మత్తేభం. నువ్వు ఇనపముక్కవి. ఆయన కాంచనశలాక. నాభర్త ధనుస్సు సంధించి నిలబడితే మీరాక్షసబలగం అంతా దోమలగుంపుల్లా మాడిపోతారు, అంటూ పరుషంగా మాట్లాడుతూంటే రావణుడు కనుబొమలు బిగించి :

నేనెవరినో, నాశక్తి ఎటువంటిదో తెలుసుకోలేకపోతున్నావు. నేను దశగ్రీవుణ్ని. ఉత్తరదిక్పాలకుడయిన కుబేరుడు నాకు సవతిసోదరుడు. ప్రపంచంలోని ప్రాణికోటికి మృత్యువుకంటె నేనంటేనే భయం నేను కన్నులెఱ్ఱజేస్తే ఇంద్రాది దేవతలు గుండెజారి పారిపోతారు. నా ఆజ్ఞలేనిదే గాలి కదలదు. సూర్యుడు నాకోసం తన కిరణాలను చల్లబరుస్తాడు. అటువంటి ఈ రాక్షసేశ్వరుని రాజధానిలో హాయిగా సుఖభోగా లనుభవించు. అప్పుడు నీకు రాముడిపేరే గుర్తుండదు. నీభర్త పౌరుషహీనుడని తెలిసినందువల్లనే మీ మావగారు అడవులకు తోలి భరతుడికి రాజ్యం యిచ్చారు. అటువంటి భ్రష్టునితో ఏం సుఖపడతా విక్కడ! నా మనస్సు నీమీద లగ్నంకావడం నీ అదృష్టం. బాగా ఆలోచించుకో, అని మాట్లాడుతూంటే, సీత :

రావణా! నీకూ నీ వంశానికి వినాశనం దాపురించింది. లేకపోతే రామపత్ని ముందు ఇలా మాట్లాడేవాడివి కావు, అని తీవ్రంగా పలికింది.

లంకేశ్వరుని క్రోధం మింటికి చేరింది. సన్యాసివేషం విడిచి దశగ్రీవుడై నిలిచాడు పదితలల ఇరువదికన్నులలో విస్ఫులింగాలు జిమ్ముతూ :

సీతా! ఆవు. ఎంతనెమ్మదిగా చెప్పినా నీ తలకెక్కడంలేదు. నా బలపరాక్ర మాలు నీకు అర్థంకాలేదు, ఈ చేతులతో భూగోళం ఆకాశంలో ఆడుతుంది. ఈనోరు

తెరిస్తే సాగరజలాలు మిగలవు. ఖడ్గధారినై కదనభూమిలో కాలు పెడితే కాలపాశధారికూడా గడగడ లాడాలి. నీవంటి అతిలోకసుందరికి నావంటి జగదేకవీరుడు భర్తగావుండాలి. అంతేకాని మామూలుమనిషికి భార్యగా వుండడం నీకు న్యాయంకాదు. వాడికి రాజ్యంలేదు. రాజభోగాలులేవు. ఆడదాని మాటకోసం రాజ్యాన్ని ఆప్తబంధుజనాన్ని వదులుకొని నీ వంటి సుందర సుకుమార రమణిని అడవులలో తిప్పుతాడా — అంటూ ముందుకు నడిచి ఎడం చేత్తో ఆమె సిగపట్టి, కుడిచేత్తో ఊరుభాగాన్ని బిగించి ఒక్క అంగలో లేవనెత్తి రథంమీద ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. రథం గగనమార్గానికి సాగింది.

రామభద్రా ! లక్ష్మణా ! అని ఆర్తనాదం చేస్తూసీత :

స్వామీ ! ధర్మపాలనకోసం సర్వభోగాలూ విడిచి అడవికి వచ్చావే. ఈదుష్టుడు యింత అన్యాయానికి ఒడిగట్టినా ఎలా ఊరుకున్నావయ్యా ! ఈ పాపాత్ముని శిక్షించి నన్ను రక్షించు, అని గుండె లవిసేలా రోదిస్తూ :

ఓరీ పాపిష్టిరావణా ! నీతి తప్పి చరించేవారిని దానిఫలం కట్టికుడవకపోదు. కాలం పండుతుంది. అందుకే యింత దుస్సాహసం చేస్తున్నావు, అని పరిపరివిధాల నిందించి :

ఓ కొండగోగుపువ్వులారా ! మీరంతా చెప్పండి ఈ దుష్టుడు నన్ను హరించినట్లు. ఓ జనస్థాన మృగ పక్షి సంతతులారా ! నాభర్తతో చెప్పండి, నాకు జరిగిన ఈ అన్యాయాన్ని ! అని విలపిస్తూ వెడుతూండగా, ఒక మహావృక్ష శిఖరాగ్రాన జటాయువును చూచి ! తాతా ! నేను సీతను. రావణుడు నన్ను హరించుకువెడుతున్నాడు. తక్షణం వెళ్ళి రామ లక్ష్మణులను తీసుకురా, అంది.

విశ్రాంతిగా నిద్రిస్తున్న జటాయువు చెవులలో శూలాలు గుచ్చినట్లై కన్నులు విచ్చి చూచి, రెక్కలువిప్పి :

రే ! రావణా ! సనాతనధర్మరక్షణ రాజధర్మంరా ! దిక్పాలకుడుగా పేరుపొందిన కుబేరుని తమ్ముడవే ! నీకిటువంటి దుర్బుద్ధి ఎలా పుట్టిందిరా. ఎవరనుకుంటున్నావురా జానకి ! త్రిలోకసామ్రాట్టు కాదగిన రామభద్రుని ధర్మపత్నిరా. ధర్మరక్షణ చెయ్యడం కోసం సింహాసనం అధివసించిన చక్రవర్తివే నువ్వు. నువ్వే యింతటి నైచ్యానికి దిగుతావురా! రాక్షసలోకానికి ప్రభువువే, అటువంటి నువ్వే యిలా అయితే యింక నీ ప్రజలకు రక్షణ ఏదిరా ! వారిలో ధర్మదృష్టి ఎలా నిలబడుతుందిరా !

మా రామచంద్రుడు నీ కే అపకారం చేశాడని ఈ తప్పుదారి తొక్కావురా. శూర్ప ణఖ కారణంగా జనస్థానంలోని ఖరదూషణులను రాముడు సంహరించాడంటే అది నీ అను చరుల కండకావరానికి శిక్ష. అందుకని ఈ అమ్మను అపహరిస్తావా? తక్షణం విడిచి పెట్టు. విడిచిపెట్టవో కాలపాశాన్ని నీ అంతట నువ్వు మెడకు చుట్టుకున్నట్టే. యశో ధర్మ హానికరమయిన అకార్యం చెయ్యకు.

ఆగు! నామాటలు నీకు రుచించకపోతే, నువ్వు శూరుడివైతే, రా యుద్ధానికి, నా కంఠంలో ప్రాణంవుండగా నువ్వు సీతను తీసికెళ్ళలేవు, అంటూ తీవ్రవేగంతో రెక్కలు విసిరి రథానికి అడ్డంగా వెళ్ళాడు.

ప్రచండవాయువుతో కదిలే కాలమేఘాలవలె, రెక్కలున్న పర్వతాలవలె వారిద్దరూ ఒకరికొకరు ఎదురెదురుగా తలపడ్డారు. రావణుడు విడిచే బాణపరంపరను జటాయువు తన రెక్కల గాలివిసురుతో ఛిన్నాభిన్నంచేసి, కాలిగోళ్ళతో, ముక్కుతో దశకంఠుని శరీరం అంతా గీరి గాయాలతో చీకాకు పరిచాడు. రావణుడు వాడి బాణాలు వదులుతున్నాడు. జటాయువు దేహం రక్తసిక్తమయింది. తీవ్రవేగంతో ఒక్క తన్ను తన్ని వాని ధనుస్సు విరిచేశాడు వృద్ధజటాయువు. రావణుడు మరొక ధనుస్సు నంధించాడు అదీ విరిగింది. కామగమనంగల ఆ రథానికి పూన్చిన గార్దభాలను చీల్చి, రథాన్ని విరిచేశాడు. భగ్నచా పుడు, హతసారథి, విరథుడు అయిన రావణుడు నేలకుదూకి, ఖడ్గధారియై జటాయువుతో పోరుతున్నాడు. ఎంతోసేపు జటాయువు ఆగలేకపోయాడు. మరొక్కమారు హితబోధ చేసాడు. వినలేదు రాక్షస చక్రవర్తి. ఒకచేత జానకిని పట్టి రెండవచేతితో కత్తిదూశాడు. అలసినా లెక్క చెయ్యక జటాయువు తన నఖ ఖడ్గ ధారలతో రావణుని హింసిస్తున్నాడు. మత్తేభకుంభస్థలంమీద మావటీడు అంకుశంతో ప్రహరించినట్లు రావణుని మూపుమీద నిలచి ముక్కుతో తూట్లు కొడుతున్నాడు. సీతనుపట్టిన ఎడమచేతిమీద కాలిగోళ్ళతో గాయపరుస్తూంటే భరించలేక రావణుడు సీతను విడిచి ఒక్క ఉదుటునే తనచేతి కత్తితో రెక్కలు నరికి, పాదాలు ఖండించాడు. జటాయువు నిస్పృహ కోల్పోయాడు. సీత పరుగు పరుగున జటాయువు దగ్గరకువెళ్ళి గోలుగోలున ఏడుస్తున్నది.

రావణుడు ఆమెను నమీపించబోగా ఆమె తప్పించుకోబోయింది. కాని రావణుడు వదలలేదు. భుజంమీద వేసుకొని గగనవీథికి ఎగిరాడు. లంకానగరాభిముఖంగా సాగు తున్నాడు. సీత రోదిస్తున్నది. ఆమె సిగలోని పూలు రాలిపోయాయి. మెడలోని హారాలు తెగి రత్నాలు మణులు నేలకు జారుతున్నాయి. కన్నీరు ధారగా వడుతున్నది.

ఆ దృశ్యాన్ని చూడలేక ప్రకృతి కంపించింది.

రామునివంటి గుణవంతుని ధర్మచారిణిని క్రూరాత్ముడయిన రావణుడు అపహరిస్తున్నాడంటే ఈ ప్రపంచంలో ధర్మానికీ, సత్యానికీ, ఋజువర్తనకూ, భూతదయకూ స్థానంలేదని పించి ఆ అడవిలోని మృగాలూ, పక్షులూ, ఆర్తస్వరంతో కొంతదూరం ఆమె వెంట వెళ్ళాయి.

జానకి గోలు గోలున విలపిస్తూ : ఓరి నీచుడా ! ఇంతటి నీచకార్యానికి తలపడ్డ నీకు సిగ్గులేదురా. నాభర్త దగ్గరలేని సమయంలో వచ్చి అపహరించుకు వెడుతున్న నీకంటే పిరికివాడు ప్రపంచంలో వుండడు. మాయలేడిని పంపి వంచించావు, వృద్ధుడయిన జటాయువును చంపావు. పరస్త్రీని అపహరించటంకంటే నైచ్యంలేదంటారు, అటువంటి నీచకార్యానికి ఒడిగట్టిన నీ పరాక్రమానికి సిగ్గులేదూ ! ఇటువంటి నీచునివల్ల వంశమంతా కళంకిత మవుతుంది. అయినా అప్పుడే అంతా అయిందనుకోకు. నాభర్త ఆశ్రమానికి వచ్చి నన్ను అన్వేషించడానికి బయలుదేరుతాడు.

ధమర్ధరుడై ఆయన వచ్చాడో నువ్వూ నీ సర్వబంధుమిత్రులూ నశిస్తారు. వయస్సు నెత్తిమీది కొచ్చినా జ్ఞానంరాలేదు నీకు. ఒక్క ముహూర్తకాలంలో నీజనస్థాన రక్షణసేనను నేలమట్టంచేసిన కోదండు డాయన ఆయన నీ సర్వలంకానగరం క్షణంలో భస్మంచేస్తాడు. అప్పుడు అనుభవిద్దువుగాని సుఖం, అని విచారంతో దూషిస్తూంటే రావణుడు లంకాభిముఖంగా సాగిపోతున్నాడు.

సాగేమార్గంలో ఒకపర్వత శిఖరంమీద అయిదుగురు వానరులు కనిపించారు వారిని చూడగానే తన ఆభరణాలుతీసి ఉత్తరీయానికికట్టి వారిమధ్యకు విసిరింది. అది రావణుడు గుర్తించలేదు. ఆ కొండమీది వానరులు దశగ్రీవుడు మళ్ళీ ఎవరి ఆడబిడ్డనో అపహరించుకు వెడుతున్నా డనుకున్నారు

రావణుడు పంపామార్గానసాగి, సాగరందాటి లంకలో దిగి తనతో తెచ్చుకున్న మృత్యుదేవతను అంతఃపురంలో దింపి, పరిజనాన్ని ఆమె రక్షణలో నియోగించాడు. కాంచన మణి రత్నఖచిత భూషణాలూ, అమూల్యాభరణాలూ ఆవిడ ఎదురుగా వుంచి ఏవి కావాలంటే, అవి ఆవిడకు అర్పించండి అని, రహస్యమందిరానికివెళ్ళి గూఢచారులను ఎనమండుగురిని పిలిచి :

మీరందరూ జనస్థానానికి వెళ్ళండి. అక్కడ రామలక్ష్మణులనే యిద్దరు సామాన్య మానవులు తిరుగుతూంటారు. వారి ప్రవృత్తులు ఎప్పటి కప్పుడు నాకు తెలుస్తూండాలి. వీలయితే వారిని కడతేర్చి వచ్చినా సంతోషం, అని పంపించాడు. వారు కదిలి వెళ్ళారు.

రావణుడు తిరిగి వచ్చాడు అంతఃపురానికి. అప్పటికి ఆవిడ మనసు మారివుంటుం దనుకున్నాడు. కాని కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూవున్నది సీత రాక్షస కాంతలు పరిపరివిధాల ఆమె మనసు మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. అడవులుల మధ్య లేడిపిల్లలా వున్నదామె. ఆమెను తనవెంటబెట్టుకుని ముల్లోకాలలో తాను జయించి తెచ్చిన విచిత్రవస్తుజాలం చూపించాడు. కుబేరుని పరాజితునిచేసి తెచ్చిన పుష్పకవిమానం చూపించాడు. స్వచ్ఛజలాలతో నిండిన దిగుడుబావులూ. సరోవరాలూవున్న ఉద్యానవనా లన్నీ త్రిప్పాడు. త్రిప్పుతూనే :

వైదేహీ! ఎరుగుదువా నా సంపద ఎంతటిదో, నా సైన్యం కోట్లసంఖ్యలో వుంది. వారందరూ నా కోసం తమ ప్రాణాలు బలియివ్వడానికి సిద్ధంగా వుంటారెప్పుడూ. ఈ రాజ్యంలో నా నోటవెలువడిన మాటను ఆచరించడానికి వేలమంది ఎదురుచూస్తుంటారు. వీరేకాదు, సుందరీజనం వున్నది వేలసంఖ్యలో అందరూ మన అంతఃపురవాసినులే, నువ్వు నన్ను భర్తగా అంగీకరించిన క్షణంలో వారందరూ నీపాద సేవ చేస్తారు.

సముద్రపరివేష్టితమై, శతయోజనవిస్తీర్ణమై, సర్వభోగసమృద్ధమయిన యీ లంకా రాజ్యం నీ కనుసన్నలలో వుంటుంది. ఇంద్రుడు కూడా కన్నెత్తి చూడలేడీనగరం సరి హద్దులయినా. నావంటి వీరుడు చతుర్దశభువనాలలో లేడు.

ఇదంతా నీకళ్ళతో చూసికూడా నువ్వు సామాన్యుడూ, రాజ్యభ్రష్టుడూ, వన వాసీ అయిన మానవ ప్రాణికోసం బాధపడుతున్నావు. నిన్నుచూస్తే జాలివేస్తున్నది. పోనీ నువ్విక్కడవున్నట్టు తెలిసి రాముడు వచ్చి తీసుకెళ్ళగల డనుకుంటున్నావేమో! అది కలలో మాట. ముల్లోకాలూ ఏకమైనా లంకవైపు కన్నెత్తిచూడలేవు.

ఏజన్మలోనో చేసిన పాపకర్మఫలం యింత వరకూ అడవులపాలయి అనుభవించావు. ఇంక నన్ను పరిగ్రహించి ఈ లంకానగరానికి ఏలికగా అభిషేకంచేసుకో. అభిషేకార్ద్ర శరీరంతో తృప్తిగా సర్వభోగాలూ అనుభవించు. ఈ మలినవస్త్రాలు విడిచి, అమూల్య వస్త్రాభరణాలంకృతవై మన పుష్పకంమీద విహరించు, అని ఎన్నివిధాల ప్రలోభం కల్పించినా సీత కన్నీరు తుడువలేదు. తలపైకెత్తి చూడలేదు. అయినా తనప్రయత్నం మానలేదు రావణుడు.

జానకీ! నీకు ధర్మభీతి చాలా వున్నట్టుంది. వివాహాలలో రాక్షసవివాహంకూడా ఆర్షసమ్మతమే. కనక ఆ భయం లేదు. నీకాళ్ళమీద నాశిరసు పెట్టి ప్రమాణం చేస్తున్నాను.

నేను నీ దాసుణ్ని, నీసేవకు అవకాశం కోరుతున్నాను. ఎవడిముందూ తల వంచలేదు ఈ దశకంఠుడు. అందునా ఆడదానిముందు ఇంతదీనంగా ఎప్పుడూ నిల బడలేదు. నామీద దయవుంచు. నా మనస్సు ఎంతగా నీమీద అనురాగంతో వున్నదో గ్రహించి, కనికరించు, అని పరిపరివిధాల పలుకులు సాగిస్తూంటే జనకరాజపుత్రి ఒక గడ్డిపరక మధ్యగా వుంచి :

దశరథునివంటి ధర్మపరుని కుమారుడు, సర్వప్రజలచేత ధర్మవిష్ణుడుగా పేరు పడ్డవాడు, దీర్ఘబాహుడు, విశాలాక్షుడు, సింహస్కంధుడు అయిన సత్యవ్రతుడు రాఘవుడే నాభర్త. నీకు వినాశకాలం దాపురించింది. ఆయన తన తమ్ముడితోవచ్చి నిన్ను సర్వనాశనంచేస్తాడు. సర్వసర్పజాతులూ ఒక్క గరుత్మంతునిముందు వాలిపోయే టట్లు నీ సర్వరాక్షససేన ఆయనముందు తలవంచుతుంది. పరమశివుని ఫాలనేత్రాగ్నిలో మన్మథునివలె నువ్వు రామబాణాగ్నిలో మాడిపోతావు. ఆయన తలుచుకుంటే చంద్ర మండలాన్ని క్రిందికి దింపుతాడు. సాగరాన్ని ఎండగొట్టాడు. ఆయన ధనుష్టంకారంతో లంకానగరం వైధవ్యశోకసాగరంలో మునుగుతుంది. కాలవశులై నీవంటిపాపులు అడ్డూ ఆకా లేకుండా దుష్కార్యాలు చేస్తు సంతోషంతో వుంటారు. కాని ఆ పాపం కట్టికుడిపే రోజు సన్నద్ధం అయినప్పుడుకాని మీ ఆగడాలకు అంతంరాదు. కాలపాశాన్ని పూలహారంలా మెడకు చుట్టుకుంటారు. నీకిప్పుడు నా మాటలు రుచించవు.

పద్మాలు నిండిన సరోవరంలో విహరించే రాజహంస పచ్చగడ్డిలోని పురుగులను చూస్తుందా. అంతే ! నాదృష్టిలో నీ స్థితి. నాశరీరాన్ని ముక్కలుచేసినా నా మనసు మారదు, అంది.

రావణుని మనసు కామాగ్నిదగ్ధ మవుతున్నది. ఆమె పలికిన పరుషాక్షరాలేవీ లంకేశ్వరుని చెవికెక్కలేదు.

జానకీ ! నీ అవివేకానికి జాలిపడుతున్నాను. నీకు పన్నెండు మాసాలుగడువు ఈలోగా నీ మనసు మారితే మహారాణివి. మారదో మా వంటశాలలో ఉదయపు ఫలహా రంగా నిన్ను వండివడ్డిస్తారు నాకు, అని దాసీజనంవైపు తిరిగి : మీరు తక్షణం ఈమెను అశోకవనానికి తీసుకువెళ్ళండి. అక్కడ మీరందరూకూడి ఎలా అయినా ఆమె మనసు మార్చడానికి ప్రయత్నించండి, అని వెళ్ళిపోయాడు. వారు సీతతో అశోకవనానికి వెళ్ళారు.

## రా మ వి ర హ ం

రాముడు మారీచుని సంహరించి పర్ణశాలవైపు వస్తున్నారు. దారిలో అపశకునంలా నక్క అరిచింది. రాముని మనస్సు జంకింది. 'నా వైదేహి రాక్షసపీడ పొందకుండు గాక' అనుకున్నారు. ఈ మారీచుని అరుపువిని లక్ష్మణుడు సీతనువిడిచి రావడంలేదు గదా అనుకున్నారు. లక్ష్మణుడు ఆశ్రమం వీడివస్తే ఈరాక్షసులు సీతను భక్షించి తీరతారు. చూస్తుంటే ఈ మాయలేడి వెనుక ఏదో పన్నాగం వున్నదనిపిస్తున్నది. అను కుంటూ తొందరగా సాగుతున్నారు. అడుగు ముందుకు వడుతున్నకొద్దీ అక్కడి పశు, పక్షి సంతతులు దీనవదనాలతో ఆర్తస్వరంతో కనిపిస్తున్నాయి. ఏదో విషాదసూచన వినిపించింది. అడుగులు వేగంగా వేశాడు.

ఎదురుగా లక్ష్మణుడు కనిపించాడు. దగ్గరకు రాగానే :

సౌమిత్రీ ! మీ వదినెను విడిచి రావద్దన్నాను కదా ! ఎందుకిలా వచ్చావు రాక్షస గణం ఈపాటికి సీతను భక్షించకుండా వుంటుందా ! నేను నాకళ్ళతో సీతనుచూడగలనా!

ఈ అమాయకపక్షుల ఆర్తస్వరాలు వింటూంటే నా మనస్సు శంకలోపడింది. గుండెకుధైర్యం చిక్కడంలేదు. సీత ప్రాణాలు వదిలిందో, ఎవడేనా ఎత్తుకుపోయాడో అని నా మనస్సు ఆందోళన పడుతున్నది. ఎందుకొచ్చావు తమ్ముడూ! ఏమయిం దక్కడ ! అని ఎన్నిసార్లు అడిగినా లక్ష్మణుడు మాటలేకుండా దీనంగా నిలబడ్డాడు.

తమ్ముడూ ! రాజ్యం కోల్పోయినా నన్ను విడవకుండా ఈ క్లేశాలు అనుభవించ డానికి నావెంట వచ్చిన జానకిని ఒంటరిగా పర్ణశాలలో విడిచి ఎందుకొచ్చావు? జానకిలేని క్షణం జీవించలేనే. ఆమె ప్రక్కన వుండకపోతే అమరాధిపత్యంకూడానాకు అవసరంలేదు. నా సీత బ్రతికివున్నదా ! చెప్పు.... ఆమె లేకపోతే నేనుకూడా ప్రాణాలు వదులుతాను. కైకమ్మ నన్ను అడవికితోలిన లక్ష్యం నెరవేరుతుంది. ఒంటరిగా నువ్వు అయోధ్యకు వెడితే ఆవిడ ఆనందానికి అవధులుండవు. కన్న కొడుకును కోల్పోయిన మా అమ్మ కౌసల్య ఆ కైకేయి దాసిగా బ్రతుకుతుంది.

చెప్పు లక్ష్మణా ! జానకి బ్రతికివుంటేనే నేను ఆశ్రమానికివస్తాను. ఆశ్రమప్రాం గణంలో చిరునవ్వుతో సీత నాకు స్వాగతం పలకకపోతే నా ప్రాణాలు నిలబడవు.

దుఃఖమంటే ఎరగనిసీత నన్నువిడిచి జీవించలేదు. ఇంతకూ అజాగ్రత్తవల్ల ఈ రాక్షసు లెవరూ జానకిని భక్షించలేదుగదా. ఆ దుష్టమారీచుడి అరుపు నీకు కూడా భయం

కలిగించిందా! దానికి భయపడి సీత నిన్ను పంపించిందా! అంతే! నువ్వు యిటురాగానే అక్కడివారు ఆమెను తినేస్తారు. అంతేఅయితే నాకింక జీవితాశ లేదు, అంటూ త్వర త్వరగా ఆశ్రమంవైపు నడిచాడు. శూన్యద్వారం స్వాగతమిచ్చింది. రాముడు ధైర్యం నన్నగిల్లింది, కళ్ళనీరు జారింది

లక్ష్మణా! నిన్ను విశ్వసించి వెళ్ళాను. నామాటకాదని నువ్వెందుకువచ్చావు? ఏం జరిగింది? అని విచారంతో అడిగాడు.

గొంతునిండిన దుఃఖాన్ని అణుచుకుంటూ లక్ష్మణుడు :

ఆర్యా! నాకు వేపై రాలేదయ్యా! ఆ మారీచుడి ఆర్తస్వరం ఆవిడ చెవిని పడగానే నన్ను తరిమింది. అక్కడికీ నేను కదలలేదు. మాఅన్నకు ఏ విపత్తూరాదని, యిది రాక్షసమాయ అనీ పరిపరివిధాల చెప్పాను. మా అన్నగారు ధనుర్బాణధరుడై వుండగా ఒకరి సాయంకోసం ఆర్తితో అరవడని చెప్పాను. కానీ ఆవిడ వినలేదు. నాలో ఏదో పాపపు తలంపు వున్నదనీ, భరతుడూ నేమా కలిసి కుట్రపన్నామనీ యింకా ఏమేమో అన్నది. అయినా నేను పట్టించుకోలేదు. అనరాని మాటలతో నాగుండె తూట్లుపొడిచి, నన్ను తరిమింది. ఇకచేసేదిలేక.... అని లక్ష్మణుడు కన్నీరు తుడుచుకున్నాడు.

ఎంత పొరపాటు జరిగింది తమ్ముడూ! నాశక్తి ఎరుగుదువు. అయినా ఆడది బాధలో కోపంతో ఏమో అన్నదని విడిచివస్తావా! ఆవేశంవచ్చి అన్నగారి మాటను అతి క్రమించి ఎంతపనిచేశావు. నువ్వు ముందే చెప్పినట్టు ఆ లేడి మారీచుడే. వాడే మన మీది ద్వేషంతో యింతకు దిగాడు. వాడు నా బాణఘాతం తింటూ అరచినప్పుడే అను కున్నాను, ఇంత జరుగుతుందని, అంటూ ఆశ్రమప్రాంగణంలో కూలబడ్డాడు రాముడు.

కొంతసేపటికి తేరుకొని ఆశ్రమం అంతా కలయతిరిగాడు. కనబడలేదు సీత. తిరిగిన చోటనే తిరిగాడు. చూసిన చోటనే చూశాడు. పర్ణశాల పరిసరాలలోని చెట్లవెనుక, లతాకుంజాలలో చూశాడు. కనబడలేదు సీత. చెట్లు, తీగలు, పక్షులు, మృగాలు అన్నీ దీనంగా కనిపించాయి. పర్ణశాలలో లేడిచర్మం, కుశాస్తరణం, దర్భలు అన్నీ అస్తవ్యస్తంగా వున్నాయి.

సీతను ఏ రాక్షసుడూ భక్షించలేదుగదా! భీతితో సీత ఎక్కడా దాగివుండలేదు కదా! పద్మాలకోసమో, నీటికోసమో సరోవరానికి వెళ్ళిందేమో అని అటు తిరిగాడు. తిరుగుతున్నాడేతప్ప ఎక్కడా సీత జాడలేదు

తిరుగుతూ, తిరుగుతూ రాముడు : ఓ కదంబమా! మువ్వంటే ఎంతో వాత్సల్యంకల సీతజాడ చెప్పవా! ఓ బిల్వమా! నీ లేతచిగుళ్ళవంటి పీతకౌశేయ వసనం ధరించే నా సీత ఎక్కడుంది? శోకనాశకమయిన అశోకమా! నా ప్రియురాలి వార్త చెప్పి నాకు శోకంలే కుండా చెయ్యి. ఓ తాళవృక్షమా! ఓ జంబూవృక్షమా! మీరైనా చెప్పండి. ఓ కర్ణికా రమా! నిరంతరం నీ పువ్వులే అలంకరించుకుని మురిసిపోయే, మా జానకి ఎక్కడ? నీప, చూత, కురవక, వకుళ. పున్నాగ కేతకీతరులారా! మీరెవరూ ఎరగరా నా సీత ఏమ యిందో, అని ఉన్మత్తునివలె రోదిస్తూ, కనవడ్డ వ్యాఘ్రాన్నీ హరిణ, మత్తేభాలనూ అడు గుతూ తిరుగుతున్నాడు. సీత అందచందాలను స్మరించుకుంటూ విలపిస్తున్నాడు.

లక్ష్మణా! ఏది నా సీత అంటాడు సీతా! ఎక్కడికి వెళ్ళావు, అని కొండగుహలు అదిరేలా కేకలు వేస్తున్నాడు.

లక్ష్మణుని రెండుభుజాలు పట్టుకుని : నా సీత ఎక్కడికి వెళ్ళింది? ఏ రాక్షసుని పాలబడింది, అని ప్రశ్నించి, అంతలో పరుగు పరుగున చెట్ల వెనకకు, పుట్టలవెనుకకు వెళ్ళి వెదుకుతాడు.

ఆశ్రమప్రాంగణంలో దీనంగా చూస్తూ తిరిగే లేడిపిల్లలను దగ్గరగా తీసుకుని : సీతా, చూచావా నీకోసం ఈ లేడికూనలు ఎలా బెంగతో చూస్తున్నాయో : అని కొంత సేపు ఏడ్చి, అంతలో లక్ష్మణుని దగ్గరగా వెళ్ళి,

తమ్ముడూ! జానకి లేకుండా నేను క్షణం బతకలేనురా! సీతావియోగ దుఃఖంతో నాప్రాణాలు పోయేట్లున్నాయి. ప్రాణత్యాగంచేసి నేను పరలోకంవెడితే అక్కడ నాన్నగారు.... నాయనా! ప్రతిజ్ఞభంగంచేసి వచ్చావేమయ్యా అని ప్రశ్నిస్తే ఏంచెప్పను! నన్ను అసత్య వాదిగా భావించి ఆయన నా మొహం చూడకపోతే వేనేంకావాలి, అని మరింతసేపు విలపించి :

సీతా! విదేహరాజపుత్రీ : ఎక్కడున్నావు. నన్నేంచేసి పోయావు, అని దీనంగా తిరుగుతూంటే, లక్ష్మణుడు :

ఆర్యా! ఇంతలోనే అంతధైర్యం కోలుపోయి దైన్యంగా తిరుగుతావా. ఏ కొండ గుహలోనో, నదీతీరం దగ్గరో వుండవచ్చు. వెళ్ళిచూద్దాం, అన్నాడు.

కొండగుహలు, నదీతీరాలు, లతానికుంజాలు, అన్నీ గాలించారు. కనబడలేదు సీత. రామునిహృదయం శోకసంతప్తమవుతున్నది. లక్ష్మణుడు ఓదార్చడానికి యత్నిస్తున్నాడు. లక్ష్మణుడు ఓదారుస్తున్నకొద్దీ రాముని దుఃఖం పొంగుతున్నది.

రామునిమనస్సు శోకంతో స్వస్థతకోలుపోయింది. భ్రమించే మనస్సుతో పరి భ్రమిస్తూ: అశోకంలో దాగినావా! కదళీస్తంభాలలో ఊరువులు దాచినావా! కర్ణికారాలలో మందస్మితం నిక్షేపించుకున్నావా! లక్ష్మణా! చూడు. ఈ లేడి పిల్లలు ఎలా శోకిస్తున్నాయో: తమ వెచ్చెలిని ఏ రాక్షసుడో భక్షించాడని నోటితో చెప్పలేక విచారిస్తున్నట్లున్నాయి, అని శోకించి శోకించి:

జానకీ! నీతో అయోధ్యనుండి వచ్చాను. నువ్వులేకుండా ఎలా తిరిగివెళ్ళను. అంతఃపురంలో నువ్వులేకుండా ఒంటరిగా జీవించగలనా. ఇప్పటికి కైకమ్మ కోరిక పూర్తిగా నెరవేరింది. నువ్వులేకుండా అయోధ్యకు వెడితే, విదేహాధిపతి నీ క్షేమ సమాచారం అడిగితే ఏం చెప్పగలను. ఆయనకు నా ముఖం చూపగలనా! ఈవార్త తెలిసి, ఆయన స్మృతి హీనుడుకాడా! నేనింక అయోధ్యకే వెళ్ళను, అని విలపించి:

లక్ష్మణా! నువ్వు రాజధానికి వెళ్ళి శాశ్వతంగా భరతుణ్ణి రాజ్యం ఏలుకోమను. నువ్వు అక్కడేవుండి మా అమ్మా, మీ అమ్మా, సుఖంగా వుండేటట్టుచూడు. మాతల్లి కౌసల్యకు ఏక్లేశమూ కలగకుండా నువ్వేచూడాలి, అంటూంటే లక్ష్మణుని గుండె శోకసాగర మయింది

కట్టలుత్రెంచుకుని ప్రవహించే లక్ష్మణుని దుఃఖం రాముని మరింతగా వివశుని చేసింది. కన్నీరు మున్నీరయింది. పెదవులు నల్లబడ్డాయి. నిట్టూర్పులవేడి తీవ్రమయింది.

ఏ జన్మలోచేసిన పాపఫలమో యిది. రాజ్యం పోయింది. పితృవియోగంసంభ వించింది. మాతృదేవి శోకసాగరంలో వుంది. నేను అడవుల పాలయాను. అయినా ఈ క్లేశాలన్ని మరిచిపోయి యింతకాలం జానకితో గడిపాను. ఇప్పుడింక ఏ ఆశతో జీవించను. తమ్ముడూ! ఏరాక్షసుడో సీతను భక్షించడానికి తీసుకుపోయి వుంటాడు. ఆ సమయంలో సీత ఎంతదీనంగా దుఃఖించి వుంటుందో, ఆ రాక్షసుడు ఈ సుకుమారి కేశపాశం పట్టి లాగుతూంటే ఆమె ఎంతగా శోకించి వుంటుందో. రాహు గ్రస్తమయిన చంద్రబింబమై వుంటుంది నా సీత. అత్యంతమూ మృదువయిన ఆమె గళాన్ని తన కర్కశపాషాణహస్తాలతో మెలిత్రిప్పి ఆ రాక్షసుడు రక్తపానం చేస్తాడు.

చూడు తమ్ముడూ! ఇదిగో ఈ శిలావేదికమీదనే కొద్ది ఘడియలక్రితం సీత నాతో కూర్చుని పరిహాసాలాడింది. ఆమె చిరునవ్వులింకా వినిపిస్తూనే వున్నాయి. పోనీ, ఆమె నీరుతేవడానికి గోదావరీనదికి వెళ్ళిందేమో అనుకుంటే అలా ఎప్పుడూ ఒంటరిగా వెళ్ళేదికాదే! ఈ ఆశ్రమం విడిచి ఎప్పుడూ ఏకాకిగా వెళ్ళలేదే!

అని శోకంతో సర్వసాక్షి అయిన సూర్యభగవానుని చూస్తూ

ఓ జగచ్చక్షూ! నువ్వు చెప్పవయ్యా! ఏమయింది నా జానకి....అని అతి దీనంగా విలపిస్తూంటే, లక్ష్మణుడు ఓదారుస్తూ :

ఆర్యా! శోకం నీవంటివానికి తగినదికాదు. ధైర్యం ఉత్సాహం ఉండవలసిన హృదయం నీది. ధైర్యోత్సాహాలతో మనం సీతాన్వేషణ ఆరంభిద్దాం, ఉత్సాహశీలికి అసాధ్యం వుండదు, అని కొంత ఆశ్వాసన కల్పించాడు.

రాముడు గోదావరీనదీతీరానికి వెళ్ళి ఓ గౌతమీ! ఎక్కడమ్మా నా జానకి? అని ఆక్రోశించాడు. రాముని రోదనం అరణ్యమంతా ప్రతిధ్వనించింది. సమాధానంలేదు. రావణ భయత్రస్తములయిన భూతగణా లేవీ మాట్లాడలేదు.

వెనుదిరిగి వస్తూంటే దారిపొడవునా మృగాలు దీనంగా కన్నీరువిడుస్తూ కనిపించాయి. వాటిని నమీపించి చెప్పండి, నాసీత ఏమయింది? ఎవడెత్తుకుపోయాడు? ఎటుపోయాడు వాడు? అని అడుగుతూంటే అవన్నీ దక్షిణముఖంగా తలలు త్రిప్పాయి. ఆకాశంవంక చూశాయి. అదిచూసి లక్ష్మణుడు :

అన్నా! ఈమృగాల సంకేతాన్ని అనుసరించి మనం నైరుతిదిశగా వెళ్ళి వెదకాలి, అన్నాడు.

ఇద్దరూ నడకసాగించారు. కొంతదూరం వెళ్ళేసరికి వారికి నలిగిన పూలు కనిపించాయి. వాటిని తీసి రాముడు :

తమ్ముడూ! ఇదిగో ఇవే ఈరోజు నేను సీత సిగలో అలంకరించాను, అని గోలు గోలున విలపించాడు. మరికొంత ముందుకు సాగేసరికి విరిగిన ధనుస్సు, బాణాలు కనిపించాయి. బంగారువగలు కూడా చెల్లాచెదరయి వున్నాయి.

తమ్ముడూ! చూశావా, ఈ ధనుస్సు వైడూర్యాలతో పొదిగివుంది. ఇది దివ్యులదో రాక్షసులదో అయివుండాలి. ఈనేల చూడు, దుమ్మురేగి వుంది. ఇక్కడిద్దరురాక్షసులు జానకికోసం పోరాటం సాగించివుంటారు. బంగారుకవచాలు తొడిగిన పిశాచవదనాల గాడిదలు చచ్చిపడివున్నాయి. ఇదిగో ముక్కలయిన రథం, ములుకోల, కవచం, ఇక్కడ మహాసంగ్రామం సాగింది. నేను అర్చించే దేవతలుకాని, నా ధర్మకర్మలుకాని సీతను రక్షించలేకపోయాయి. శాంత, దయాశీలుడనైన నన్ను నిర్వీర్యుడుగా భావిస్తున్నట్లుంది ఈలోకం.

లక్ష్మణా! ఇక ఈ దుఃఖాన్ని భరించలేను. ఇంతటి మనఃక్లేశం కలిగించిన రక్కసితో సర్వప్రాణికోటినీ భస్మంచేసే అస్త్రం సంధించి విడుస్తాను, అంటూ కాలాగ్ని రూపుడై తమ్ముని చేతులనుండి ధనుస్సు అందుకుని అల్లెత్రాడు బిగించాడు.

అన్నగారి త్రిపురాంతకరూపం చూచిన లక్ష్మణుడు వినయంగా దోయిలించి:

ఆర్యా! సర్వభూతహితబుద్ధితో మృదుశీలివయిన నీకు ఈ క్రోధం తగునా! నీవంటి శాంతచిత్తుడు నిసర్గభూషణమయిన సహనం విడిచి క్రుద్ధుడుకావడం ఉచితమా! ఎవడో మూర్ఖుడుచేసిన దుష్కార్యానికి సర్వప్రాణికోటినీ హింసించడం నీవంటిధర్మపరుడికి న్యాయమా!

ఇక్కడ యుద్ధం జరిగిన మాట వాస్తవమే, కాని రెండవప్రాణి పాద చిహ్నాలులేవు. ఈ యుద్ధం ఎవరెవరికి జరిగిందో, ఎందుకు జరిగిందో నిశ్చయంగా తెలీదు. మనం అన్వేషణ సాగిద్దాం. వదినగారు కనిపించక, ఎవరూ ఆవిడజాడ వినిపించేవారు లేకపోతే అప్పుడు ఈ ధనుస్సు ఉండనేవుంది. అంతేకాని నీవంటి గుణసంపన్నుడు శోకవివశతతో క్రోధానికి లొంగిపోతే సామాన్యులకు మార్గదర్శకు డెవడుంటాడు? ఆపదలు ప్రాణికొటికి వస్తూనే వుంటాయి. ఆ ఆపదలో ధైర్యాన్ని వీడనివాడే ఉత్తమపురుషుడు. నీవంటి పురుషోత్తముడు శోకవశీభూతుడు కావడం మంచిదికాదు. బృహస్పతి సమధీసంపన్నుడవయిన నువ్వు శోకవంచితుడవయి యింతగా వంగిపోయావు. లేకపోతే నీకు నేను చెప్పవలసిన వాడినా! అని పరిపరి విధాల హితవుచెప్పగా, రాముడు శాంతించి, ధనుస్సు దించి:

తమ్ముడూ! అయితే సీత జాడ తెలుసుకొనే ఉపాయం ఏమిటి? అని అడిగాడు

రాక్షసావాసమైన జనస్థానం అంతా వెదకిచూద్దాం, అన్నాడు తమ్ముడు.

రామ లక్ష్మణులు ముందుకు సాగారు. నాలుగడుగులు వేసేసరికి విరిగిపడ్డ కొండలావున్న జటాయువు దేహం కనిపించగా, ఆ దశలో జటాయువును గుర్తుపట్టలేక రాముడు దూరం నుంచే:

తమ్ముడూ! అదిగో చూశావా! సీతను భక్షించిన రాక్షసుడు గ్రద్దరూపంలో ఎలా పడివున్నాడో! వీడి నిక్కడే వధిస్తాను, అంటూండగా, జటాయువు శోకగద్గదగళంతో:

రామా! నా ప్రాణాలనూ, సీతనూ హరించినవాడు రావణుడయ్యా. మీ రుభయులూ ఆశ్రమంలో లేని అదనులో వాడు సీతను అపహరించుకు వెడుతూ నా కంట బడ్డాడు. ఈవార్ధక్యంలో నేను వానిరథాన్నీ, సారథినీ చూర్ణం చెయ్యగలిగాను కాని,

వాడు కత్తితో నా రెక్కలు ఖండించి వెళ్ళిపోయాడు. నేవెవ్వరో చచ్చిపోయాను. నన్నెందుకు చంపుతావు, అంటూండగా రాముడు ధనుస్సు విడిచి, జటాయువు దగ్గరగా వెళ్ళి వెన్ను నిమురుతూ :

తమ్ముడూ! నా అంతటి దురదృష్టవంతు డుండరు. చూశావా, మన ఆప్తుడు జటాయువుకూడా నా కోసం ప్రాణాలు కోలుపోయాడు, అంటూ జటాయువును తన ఒడిలోకి తీసుకుని : తాతా! నా జానకిని ఎటుతీసుకుపోయాడు. నేనేంచేశానని వాడింత ఘోరం తలపెట్టాడు. వాని వాసస్థాన మెక్కడ? అని ప్రశ్నించగా, జటాయువు నోట రక్తం కక్కుతూ : రామా! వాడు విశ్రవసువు కొడుకు. కుబేరుని తమ్ముడు.... అంటూండగానే ప్రాణాలు అనంతంలో లీనమయ్యాయి.

రామ లక్ష్మణులు తమ ఆప్తుని మరణానికి యింతసేపు విచారించారు. అప్పుడు రాముడు :

తమ్ముడూ! ఇంతకాలంగా ఈ దండకారణ్యంలోని సర్వపక్షికోటికి ప్రభువుగా వున్న జటాయువు ఎంతటి దైన్యదశలో మరణించాడో చూశావా, కాలం ఎంత బలీయ మయినదో అర్థమవుతున్నది.

సీతావియోగంకంటె జటాయువు మరణం నాకు అధికదుఃఖం కలిగిస్తున్నది. ఈ ఆప్తుడికి దహనకర్మ నిర్వర్తించి మన విధిని పూర్తిచేసుకుందాం, అన్నాడు.

జటాయువుకు దహనక్రియలు ముగించి, తిలోదకాలు వదలి, పుణ్యలోకాలు పొందవలసిందని ప్రార్థించి, మళ్ళీ సీతాన్వేషణకు బయలుదేరారు.

సాగి సాగి ఒక కీకారణ్యంలో అడుగుపెట్టారు. ఆ దుర్గమారణ్యంలో బహు ప్రయాస పడి నడుస్తూ, దండకారణ్యం దాటి క్రౌంచాటవిలో అడుగుపెట్టారు క్రమంగా మతంగాశ్రమం వయిపు నడిచారు. అక్కడొక మహాపర్వతం, దానిలో ఒక గుహ. ఆ గుహదగ్గర విశాలకాయంతో వికృతాకారంతో ఒక రాక్షసస్త్రీ. పెద్ద బానవంటి కడుపుతో వున్న ఆ రాక్షసి ఎదురుగా సింహ, వ్యాఘ్ర, భల్లూకాల శరీరాలు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. అది ఒక్కొక్క జంతువునే గోళ్ళతోచీరి మాంసం చప్పరిస్తూ, రక్తం నాకుతూ సంతోషంగావుంది.

అది రామలక్ష్మణులను చూస్తూనే ఒక్క అంగలో వెళ్ళి లక్ష్మణుని చెయ్యి పుచ్చుకొని : ఇంత అందగాడిని నే నింతవరకూ చూడలేదు. నువ్వే నాకు తగిన భర్తవి.

వాపేరు అయోముఖి. రా! హాయిగా క్రీడిద్దాం. ఈ కొండగుహాలలో నదీ సైకతభూములలో సెలయేటిప్రాంతాలలో మనిద్దరం స్వేచ్ఛగా సంసారసుఖం అనుభవిద్దాం, అంటూ లాగింది.

వింటూనే లక్ష్మణుడు ఒరనుండి కత్తితీసి, దాని ముక్కు చెవులు, స్తనాలు నరికి పారేశాడు. ఆ బాధ భరించలేక అది విపరీతంగా రోదిస్తూ అడవిలోకి పారిపోయింది.

రామ లక్ష్మణులు ముందుకు సాగుతున్నారు, సీతకోసం అన్వేషిస్తూ.

## కబంధుడు

కొంతదూరం వెళ్ళేసరికి లక్ష్మణునికి ఎడమకన్ను అదిరింది. ఎడమభుజం స్పందించింది. మళ్ళీ ఏదో అశుభం రాబోతున్న దనుకున్నారు. అంతలో వంజులకపక్షి మృదువుగా కూసింది. ఇది శుభసూచకమే అనుకున్నాడు.

అడుగులు ముందుకు పడుతున్నాయి. పడుతుండగా పిడుగులు పడుతున్నధ్వని వినిపించింది. వినిపించిన క్షణంలో యిద్దరూ కత్తులుదూసి పైకెత్తి నడుస్తున్నారు. నాలుగడుగులు వేసేలోగా పర్వతాకారంకల రాక్షసుడు వారికనుచూపులో వున్నాడు వాడి మొండెం కనిపిస్తున్నదేకాని దానిమీద శిరస్సు లేదు. వాడిరొమ్ముమీద పెద్దనోరుంది. దేహమంతా నల్లని రోమాలతో అలుముకుని వుంది. వక్షఃస్థలంమీదనే ఒక కన్ను వున్నది. రక్తంతో తడిసిన కత్తిలా నాలుకజాపి వున్నాడు. దాని కిరువంకలా వంపుతిరిగిన చేకత్తులవలె కోరలున్నాయి. ఆ మహాకాయునిచేతులు బహుదూరానికి వ్యాపించి వున్నాయి. ఆ చేతులమధ్యలో పెద్దపులులు, సింహాలు, ఎలుగుగొడ్లు నలుగుతున్నాయి. వాటిని లుంగజుట్టి కొండగుహావంటి నోటిలో వేసుకుంటూ హుంకరిస్తున్నాడు. ఆ భయంకరాకారాన్ని చూస్తూనే వున్నారు వారు. చూస్తూండగానే ఆ ఇనపచేతులు వారిద్దరినీ పట్టుకుని వదనబిలద్వారం దగ్గరకు లాగుతున్నాయి.

ఈ ఆకస్మికచర్యతో వారికి ఏం చెయ్యాలో తోచలేదు. లక్ష్మణుడు కొద్దిగాజంకి:

అన్నయ్యా! ఈ రాక్షసుడు నన్ను భక్షించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇదేసమయంలో నువ్వు వీడిబారినుండి తప్పించుకుపో. త్వరలోనే నీకు జానకి దొరుకుతుంది. ఆవిడతో నువ్వు అయోధ్యకు వెళ్ళిపో, ఈ తమ్ముణ్ణి మరిచిపోకుసుమా, అన్నాడు దీనంగా,

తమ్ముడూ! నువ్వేం భయపడకు. ఈ రాక్షసుడికి మనం జంకవవసరంలేదు, అని రాముడు ధైర్యం చెపుతూండగా, ఆ రాక్షసుడు :

ఎవరయ్యా మీరు? వృషస్కంధులు, ఆజానుబాహులు నా అదృష్టంకొద్ది దొరి కారు. మంచి ఆకలిమీద వున్నాను, మీరు వృథా[ప్రయాస పడకండి. ఈ బాహు బంధంలోపడ్డ ప్రాణి బైటపడటం యింతవరకూ జరగలేదు, అని అట్టహాసంచేశారు. అడవి అంతా దద్దరిల్లింది.

తమ్ముడూ! కష్టాలమీద కష్టాలు ఎలా వచ్చుతున్నాయో చూడు. వనవాసం భార్యా వియోగం, ఇప్పుడీ రాక్షసబాహుపంజరం. ఎంతశూరులమూ, బలిష్ఠులమూ అస్త్ర విద్యావిదులమూ అయినా కాలవశులం కాక తప్పడంలేదు. అంటూండగా ఆ రాక్షసుడు:

దైవోపహతులయిన రాజపుత్రులారా! మీరెవరి బిడ్డలు? అన్నాడు.

అప్పటికప్పుడే ఆ మహాబాహువులు వారిద్దరినీ వదనగహ్వరం సమీపానికి తెచ్చాయి. అదిచూసి లక్ష్మణుడు :

అన్నయ్యా! క్షత్రియవీరుల మయిన మనం బలిపశువుల్లా ఈ రాక్షసుడికి భోజనం కారాదు. వీడిశక్తి అంతా ఈ బాహువుల్లో వుంది. ఈ రెండుచేతులూ నరికేద్దాం, అంటుంటే ఆ రాక్షసుడికి క్రోధంరేగి నోరు మరింతతెరచి యిద్దరినీ ఒకేమారు మింగే ప్రయత్నంలో వుండగా రాముడు కుడిచేతినీ, లక్ష్మణుడు ఎడమచేతినీ తెగనరికారు. అంతతో వాడు భయంకర రోదనస్వరంతో, నేలకూలి విలవిలతన్నుకుంటూ : ఆర్యా! మీరెవరు? అన్నాడు.

ఇక్ష్వాకువంశ క్షత్రియులం. ఈయన రాముడు. నేను ఆయన సోదరుడను, లక్ష్మణుడంటారు నన్ను, పితృవాక్పాలనకు అడవికి వచ్చాం. మావెంట మా వదినకూడా వచ్చింది. ఆమెను ఎవడో రాక్షసుడు అపహరించాడు. ఆమెకోసం అన్వేషిస్తూ వస్తున్నాం. ఇంతకీ నువ్వెవరవు? ఈ ఆకారం ఏమిటి? అని ప్రశ్నించాడు లక్ష్మణుడు.

ఆర్యా! నేను దనువు అను పేరుగల గంధర్వుడను. అత్యంత సుందరరూపం ఉండేది నాకు. కానీ వికృతరూపంతో సజ్జనులనూ, మహర్షులనూ హింసించే విలాసంలో ఈ వికృతదేహంతో ఒకసారి స్థూలశిరుడనే మహర్షిని హింసింపబోగా ఆయన కుపితుడై: నువ్వింక ఈ దేహంతోనే బ్రతుకు అన్నారు నేను విచారంతో ఆయన పాదాలు, పట్టి శాపవిమోచనం కోరగా, మీవల్ల నాకు ఈ వికారరూపం పోతుందన్నారు. అనంతరం

తీవ్రతపస్సుచేసి బ్రహ్మవరంవల్ల దీర్ఘాయువునై ఆ వరగర్వంతో దేవేంద్రునితో యుద్ధానికి వెళ్ళాను. ఆయన క్రోధంతో వజ్రాయుధంపెట్టి తలమీద కొట్టి నా తల యిలా రొమ్ము లోచేర్చినా కోపంతగ్గక కాళ్ళమీద కొట్టాడు. అవి పొట్టలో చేరుకున్నాయి. దీర్ఘాయువు కారణంగా, నా ప్రాణరక్షణకు రొమ్ముమీద నోరిచ్చాడాయన. ఈ సుదీర్ఘబాహువులు ఆహారసేకరణకు అనుగ్రహించాడు. అంతే :

అదిమొదలు దొరికినదాన్ని పడదింటూ మీ రాకకోసం ఎదురుచూస్తున్నాను. నాకు శాపవిమోచనం చేసిన మీకు ప్రత్యుపకారంగా నేను మాటసాయం చెయ్యగలను. ఇప్పుడు మీకు కలిగిన విపత్తు పైదొలగాలంటే మంచిమిత్రుడు కావాలి, అంటూండగా రాముడు: ఈ జనస్థానంలో రావణుడనే రాక్షసుడు మా జానకిని అపహరించాడని మా తాత జటాయువు చెప్పాడు. ఆ రావణుడి వివరాలు చెప్పు, అనగా కబంధుడు :

రామచంద్రా ! ఈ శరీరంలో నాకు జ్ఞానవాడి పనిచెయ్యదు. నన్ను గోతిలో పడ ద్రోసి నజీవదహనం చెయ్యి. అప్పుడు నా గంధర్వరూపం వస్తుంది. రాగానే నీకు ఉపాయం చెపుతాను, అన్నాడు.

కొండగుహలో చితిపేర్చి అగ్నిజ్వాలలు లేచేవేళకు కబంధుని దేహాన్ని దానిమీదికి దొర్లించారు. క్షణాల వ్యవధిలో ఆదేహం భస్మమయింది.

మరుక్షణంలో దివ్యాంబరాభరణ, చందనానులిప్తదేహంతో గగనవీధిని గంధర్వుడు గోచరించి :

రామా ! మానవుడు సంధి విగ్రహాది ఉపాయాలతో జీవితం సాగిస్తాడు. అయితే ప్రస్తుతం దశావిపర్యయంవల్ల మీకీ క్లేశాలు ప్రాప్తించాయి. దీనినుంచి బయటపడి సుఖ శాంతులు పొందాలంటే నీకొకమిత్రుడు అవసరం. ఇక్కడకు దగ్గరలో ఋశ్యమూకం అనే పర్వతంమీద సుగ్రీవుడనే వానరుడు, అన్న వాలి చేత పరాభూతుడై తనమంత్రులతో వుంటున్నాడు. వాడు మహాబలిష్ఠుడు, వినయ గుణసంపన్నుడు. వానితో అగ్నిసాక్షిగా మైత్రిబంధం ఏర్పరచుకో. ఆ సుగ్రీవుడు నదీ, పర్వత, సాగర మేఖలావలయిత భూమండలమంతా తిరిగివచ్చినవాడు. వాడికి తెలియనిచోటు ఈ గోళంలోలేదు, తన వానరసేనను పంపి సీతాన్వేషణం చేయించి నీకు సాయపడతాడు, అని క్షణం ఆగి :

ఇంక మీరు బయలుదేరండి. అదిగో అలా తూర్పుగా చూడండి. మనోహర పుష్పాలతో, ఫలాలతో వృక్షాలు కనిపిస్తున్నాయి. ఆ ఫలాలు ఆరగించి ముందుకుసాగితే మరొక సుందరవనం, అందులో అమృత మధురములయిన ఫలాలుకల చెట్లున్నాయి.

అక్కడే స్వాదు జల భరితమయిన పంపాసరోవరం వున్నది. ఆ పరిసరాలలో ఆవునేతి ముద్దలవలె రుచిగావుండే పిట్టలు దొరుకుతాయి అక్కడే మతంగమహర్షి శిష్యసమేతం దీర్ఘకాలం తపస్సుచేసి స్వర్గంచేరారు. ఆ మహర్షిసేవలో జీవితంగడిపిన శబరి వున్న దక్కడ, ఆమె నిన్నుచూసికాని స్వర్గానికి వెళ్ళనని కూర్చుంది. ఆ ముసిలిని చూచి ముందుకుసాగితే పశ్చిమంగా ఋశ్యమూకం. ఆ పర్వతాన్నిసామాన్యులెవరూ అధిరోహిం చలేరు. ఆ కొండకొమ్మమీద రాత్రి నిద్రించి, ఆ నిద్రలో కలగంటే కలగన్న వస్తువులన్నీ మరునాడు ప్రత్యక్షంగా పొందుతారని విన్నాను. అక్కడున్నాడు సుగ్రీవుడు. మీరు వెళ్ళండి, నాకు అనుజ్ఞ యివ్వండి, అని అంతర్ధాన మయాడు.

## శ బ రి

రామ లక్ష్మణులు కబంధుడు చెప్పిన దారినే పెడుతున్నారు. విచ్చిన పూలవానసలు సిండిన లతలతో, అరిముగ్గిన పండ్లబరువుతో వంగిన కొమ్మలుగలచెట్లతో, మహెూన్నత శిఖరాగ్రాలుకల కొండలతో వున్న అడవిలో వారి ప్రయాణం సాగుతున్నది. క్రమంగా పంపా తీరం చేరారు. దాని సమీపంలో అత్యంతరమణీయంగావున్న ఆశ్రమం వారి కంటబడింది, మెమ్మదిగా ఆశ్రమద్వారం దాటి ప్రాంగణంలో అడుగుపెట్టారు. ఆ ప్రశాంతవాతావర ణంలో ఒంటరిగావున్న శబరి వీరిని చూస్తూనే చేతులు జోడించి, పాదాభివాదంచేసి, అర్ఘ్య పాద్యాలిచ్చి ఆసనం చూపింది.

అతిథి సత్కారా లందుకుని రాముడు :

ఓ ధర్మతపస్వినీ! ఆహారనియమంతో, ధర్మనిష్ఠతో, క్రోధరహితురాలవై సాగించే నీ తపస్సు, నిర్విఘ్నంగా కొనసాగుతున్నదా! నీమనస్సు ప్రశాంతంగా తపోదీక్షలో లగ్న మయి వుంటున్నదా, నీ గురుశుశ్రూష ఫలించిందా! అనగా, శబరి :

రామచంద్రా! నీ దర్శనంతో నా తపస్సు ఫలించింది. ఈ జీవితంలోసాగించిన గురుసేవాఫలం పొందబోతున్నాను. ఈ చర్మచక్షువులతో నిన్ను దర్శించడం కంటె ఏం కావాలయ్యా మావంటివారికి నీ అనుగ్రహంతో అక్షయలోకాలు పొందగలను, నువ్వు చిత్రకూటానికి వచ్చినప్పుడే మా గురువులు దివ్యలోకాలు చేరారు. వారు వెడుతూ : శబరీ! త్వరలో రామభద్రుడు ఈ ఆశ్రమానికి రామన్నారు. ఆయనతోవారి తమ్ముడు లక్ష్మణుడు కూడా వస్తాడు. వారినిసేవించి నువ్వు ఉత్తమలోకాలుపొందు, అన్నారు.

మహర్షుల ప్రభావం, వారి లోకకల్యాణకామన, శబరి గురుపూజానిష్ఠ, వీటిని గురించే కొంతసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు రాముడు.

అనంతరం సప్తసాగరతీర్థంతో వారుభయులూ స్నానాలుచేసి, పితృదేవతలకు తర్పణాలు విడిచారు.

సౌమిత్రీ! ఇప్పుడు నా మనస్సు ప్రశాంతంగా వున్నది. మనకు చెడ్డరోజులు దాటినట్లే అనిపిస్తుంది. అద్యతనభావిలో శుభం కలగబోతున్నదని నా గుండె చెపుతున్నది. ఇక మనం పంపాసరోవరం వెంబడి నడిచి ఋశ్యమూక ప్రాంతానికి వెళ్ళాలి. అక్కడే కదా సుగ్రీవుడు మంత్రిమండలితో వున్నాడని కబంధుడు చెప్పాడు. అనగానే లక్ష్మణుడు ముందడుగు వేశాడు. రాముడు వెనువెంట సాగాడు.

సాగుతూ మార్గంలోని తీర్థాలలో స్నానంచేసి, పితృదేవతలను తృప్తిపరుస్తూ ఫల పుష్పభారావనత తరుశోభనూ, ఆ గాలిలో తిరిగే పక్షిసంతతుల కలస్వనాలనూ వింటూ సాగుతున్నారు. అల్లంతదూరంలో ఋశ్యమూకం దృగ్గోచరమయింది.

ప్రణష్ట మశుభం యన్మః
కల్యాణం నముపస్థితమ్ ।
తేన హ్యేతత్ ప్రహృష్టం మే
మనో లక్ష్మణ సంప్రతి ॥
హృదయే మే నరవ్యాఘ్ర
శుభ మావిర్భవిష్యతి ॥

అరణ్యకాండ సమాప్తం.

# కిష్కింధాకాండ

## సుగ్రీవ మైత్రి

శ్రీదేవి ముఖపద్మశోభతో ఉన్న వికసితకమలాలతో అలరారే పంపాసరోవరం చేరారు, రామ లక్ష్మణులు. ఆ సరస్సుమీదుగా వచ్చే గాలిసోకిన క్షణంలో రాఘవుల శరీరాలు పులకించాయి.

తమ్ముడూ! వైడూర్యకాంతితో ఆ సరోవరజలాలు ఎంత ఆహ్లాదం కలిగిస్తున్నాయో! ఉత్తుంగశిఖరాలతో ఆ పర్వతాలు, పర్వతశ్రేణిని ఆశ్రయించి మహోన్నతంగా పెరిగిన వృక్షాలు, వాటిని అల్లుకొన్న లతలు, అంతటా వెల్లివిరిసిన వసంతం.

అరుణారుణదళాలతో పద్మాలు, సరోవరతటంమీద పడగలువిప్పి ఆడుతున్న పాములు. అటుచూడు, ఆ పచ్చికబయళ్ళలో లేళ్ళు. కలస్వనాలతో రంగు రంగుల పక్షిసమూహాలు. ఈ పూలవాసనలు మత్తెక్కిస్తున్నాయి. ఆ చెట్లు చూశావా, ఆకు లేకుండా చెట్టంతా పువ్వులే. మంద మంద పవనచాలితములై ఆ పువ్వులు వానలా కురుస్తున్నాయి, గాలికి ఊగిసలాడే పూలలో తేనె త్రాగుతూ ఝుంకరిస్తున్న తుమ్మెదలు.

> పుష్పితాగ్రాంశ్చ పశ్యేమాన్ కర్ణికారాన్ సమంతతః।
> హాటకప్రతి సంఛన్నాన్ నరాన్ పీతాంబరానివ॥

ఆ కొండగోగుమొక్కలు చూశావా! బంగారునగలు, పీతాంబరం ధరించిన పురుషునివలె ఎలా వున్నవో. కోకిల కలస్వనాలు చెవికి ఎంత యింపుగా వున్నాయో, గుండెకు అంత బాధనూ కలిగిస్తున్నాయి, సీతా వియోగదుఃఖంలో.

పర్ణశాలలోవున్న రోజులలో జానకి ఈ మధురస్వరాలు వింటూ ఎంత ఆనందించేది. ఆ పక్షులు జంటలు జంటలుగా ఎంతఉల్లాసంగా క్రీడిస్తున్నాయో. అశోకంచూశావా నిండుగా పూసి మండుతూన్న అగ్నిగుండంలా వుంది. ఈ వసంతంలో వృక్షాల, లతల చివుళ్ళు జ్వాలాశిఖలుగా నన్ను దహిస్తున్నాయి.

వసంతం అంటే ప్రాణమైన జానకి దగ్గరలేకుండా ఈ వసంతాన్ని ఎలాగడపగలను. అదిగో ఆ మగనెమలి ఎంతరాజసంగా మెడనిక్కించి చూస్తున్నదో, దానిచుట్టూ తిరిగి

అడువెమలి మరెంత రమణీయంగా నాట్యం చేస్తున్నదో, ప్రియా ! వియోగవ్యధ తెలియదు దానికి. పురుషుడ నయిన నన్నే యీ వనంతం యింతగా బాధిస్తున్నదే ! పరమసుకుమారి సీత ఎంత తీవ్రవ్యధ పడుతూంటుందో. ఆ తుమ్మెద ఎంత తీవ్రవేగంతో పూలమీదికి పొగుతున్నదో. మొగ్గతొడిగిన మామిడి చూశావా, మంచిగంధం పూసుకున్న మగరాజులా వున్నది. హంసలూ, చక్రవాకాలూ....ఆ సరోవరంలో ఎంత విలాసంగా విహరిస్తున్నాయో.

ఎటుచూసినా నాకు జానకీ దర్శనమే, ఆ విరహవ్యథే. ఈ పద్మదళకోశాలు జానకీ ముకుళితనేత్రాలను స్ఫురణకు తెస్తున్నాయి. ఆ కొండగోగుపువ్వులు సీత చిరునవ్వును గుర్తుచేస్తున్నాయి. ఈ పరమరమణీయమయిన పంపాసరోవర పరిసరాలలో సుగంధవాయు సంసేవనంతో జానకీసహితుడనై తిరగలేని నా జన్మ వ్యర్థం.

లక్ష్మణా ! ఇంకా సీత జీవించి వుంటుందంటావా ! సత్యధర్మపరుడయిన జనక మహారాజుకి ఏమని చెప్పగలను. ఇంక నేను అయోధ్యకు తిరిగిరాను. నువ్వువెళ్ళిపో. తమ్ముడు భరతుడు నిన్ను ఆదరిస్తాడు, అని విషాదహృదయంతో వున్న అన్నను ఓదారుస్తూ...

ఇక్ష్వాకువంశీయుడా ! నువ్వే యింత శోకవ్యాకులచిత్తుడవైతే సామాన్యులేమవుతారయ్యా ! వివేకులు విషాదాన్ని దరిజేర నివ్వరాదని మన గురువులు చేసిన ఉపదేశం విస్మరించావా ! స్నేహం (నేతి) తో తడిసినవతి అగ్నిజ్వాలతో భస్మమయేటట్లు స్నేహమయ హృదయం విరహాగ్నితో దగ్ధమవుతుందయ్యా. మనం కర్తవ్యనిర్వహణకు ఉద్యుక్తులం కావాలేకాని యిలా అవివేకులవలె శోకంలో మునగకూడదు.

ఆ రావణుడు ముల్లోకాలలో ఎక్కడవున్నా వాడికి మరణమే శరణ్యం. వాడు ఎక్కడవున్నాడో మనకు తెలిసేవరకే ఊపిరిపీలుస్తాడు. ఉత్తరక్షణంలో జానకీదేవిని నీకు అప్పగించి పాదాలమీద పడ్డాడా, ప్రాణాలు రక్షించుకుంటాడు. లేదా, మరుక్షణమే యమపురి చేరుతాడు. వాడు దితిగర్భంలో దాగినా మృత్యువును తప్పించుకోలేడు. నువ్వు శోకాన్నివిడిచి, కర్తవ్యదీక్షితుడవు కావాలి. ఉత్సాహం సర్వకార్యాలనూ సాధిస్తుంది. దాన్ని మించింది లేదు.

ఉత్సాహశీలికి దుర్లభం లేదు. నీవంటి మహాపురుషుడు తన శక్తిని విస్మరించి దుఃఖసాగరంలో మునగకూడదు. అని పరిపరివిధాల ఆశ్వాసన వాక్యాలు పలికాడు రాముడికి కొంత ఉపశమనం కలిగింది.

అన్నదమ్ము లిద్దరూ ముందుకు సాగారు. పంపాసరోవరతీరం దాటి ఋశ్యమూక పరిసరాలను సమీపిస్తున్నారు.

ఋశ్యమూకంమీదవున్న సుగ్రీవుడు అల్లంతదూరంలో వారిని చూచి భయంతో నిశ్చేష్టుడై తేరుకుని వారి కంటబడకుండా వుండడానికి కొండవెనుకకు పారిపోయాడు. తమ ప్రభువు భయంచూసి అనుచరులుకూడా పరుగెత్తారు. తన మంత్రులు నలుగురినీ పిలిచి :

చూశారా, ఆ మహాధానుష్కులను. వారిని వాలి పంపివుంటాడు. మునివేషాలతో మనల్ని వంచించి సంహరించడానికి పంపుతున్నాడు. మనం ఇక్కడనుంచి త్వరగా వెళ్ళిపోవాలి.

అంటూ వారితో మరొక కొండశిఖరానికి వెళ్ళాడు. అక్కడా ఆగలేక మరొక కొండమీదికి వెళ్లాడు. వెళ్ళేదారిలో పెద్దపెద్ద చెట్లకొమ్మలు విరిచి దారికి అడ్డంగావేస్తూ కొండలన్నీ దాటుతున్నాడు.

## హ ను మ ం తు డు

ఒక కొండమీద ఆగినవేళ హనుమంతుడు :

ప్రభూ ! మనం బహుదూరం వచ్చాం. ఇప్పుడు మనకు వాలి భీతిలేదు. అసలు మీరింత భయపడవలసిన అవసరంలేదు. అస్థిరచిత్తంతో సామాన్య వానర స్వభావంతో వున్నారు మీరు. ప్రభువు ఇంత వికలచిత్తుడు కాకూడదు. స్థిరచిత్తంతో అనుచరులచేత సర్వకార్యాలూ చేయించుకోవలసిన ప్రభువు యిలా చపలచిత్తుడు కారాదు, అని ధైర్యవచనాలు పలుకుతూవుంటే, సుగ్రీవుడు :

హనుమా ! చూశావా వారిని, అజానుబాహులు, విశాలాక్షులు, శర, చాప, ఖడ్గధారులు. అటువంటి మహావీరులను చూసి మనస్సు వ్యాకులంకాకుండా వుండడం సంభవమా. వారిద్దరూ వాలిచేత అనుజ్ఞాతులయి వచ్చివుంటారని నా సందేహం. ప్రచ్ఛన్నశత్రువులపట్ల జాగరూకత అవసరం కాదంటావా ! శత్రువులను సంహరించడంలో మా అన్నయ్య చాలా సమర్థుడు.

నువ్వు వెళ్ళి వారిజాడను వారి మనస్సునూ తెలుసుకు రావాలి. వారితో మాట్లాడుతూ ఉన్నంతసేపూ నీముఖం నావైపే వుండాలి, వెళ్ళిరా, అన్నాడు.

సుగ్రీవుని ఆజ్ఞవింటూనే హనుమంతుడు రామలక్ష్మణులను సమీపించి :

ఓ సుందరమూర్తులారా ! తమరెవరు ? ఏకారణంగా ఈప్రాంతాలకు వచ్చారు. తమ ఆగమనంతో ఈ పవిత్రపంపాజలాలు మరింత పవిత్రములయాయి. నారచీరలుకట్టి, తపస్వివేషధారులై వున్నా మీబల, వీర్య, పరాక్రమాలు కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి సర్వశత్రుసంహారసామర్థ్యం మీలో కనిపిస్తున్నది.

దేవలోకంనుండి దిగివచ్చిన అశ్వనీదేవతలా ! భూలోక సంచారానికి వచ్చిన సూర్య చంద్రులా. సర్వభూమండల శాసనదక్షతకల మీరు వనసంచారం చెయ్యవలసిన అవసరం ఏం వచ్చింది. బుసలుకొడుతూన్న కోడెత్రాచుల్లావున్న ఆ బాణాలు ఈ ప్రపంచాన్ని భస్మీభూతం చేసేట్టున్నాయి? గోధుమత్రాచుల్లావున్న మీ ఖడ్గాలు ఎవరివైనా వేలకూలు స్తాయి. మీరెవరో చెప్పటానికి సంకోచిస్తున్నట్టున్నారు.

ఈ ప్రాంతంలో సుగ్రీవుడనే వానర రాజున్నాడు. ఆయన సత్య, ధర్మపరుడు. అటువంటివానిని అన్నగారు రాజ్యభ్రష్టుని చేశాడు, అన్యాయంగా.

నేను సుగ్రీవుని మంత్రిని. ఆయన మీతో స్నేహం కోరుతున్నాడు. కామ రూపశక్తి వుందికనుక నేను భిక్షుకరూపంతో వచ్చాను, అని అంజలి బద్ధుడైనిలబడ్డాడు.

అంతవరకూ మౌనంగా విన్న రాముడు :

వాక్యజ్ఞం మధురైర్వాక్యైః స్నేహయుక్తమరిందమమ్ ।
నానృగ్వేద వినీతస్య నా యజుర్వేద ధారిణః ।
నా సామవేద విదుషః శక్యమేవం విభాషితుమ్ ॥
నూనం వ్యాకరణం కృత్స్నం అనేన బహుధాశ్రుతం
బహువ్యాహరతానేన న కించిదపశబ్దితమ్ ।
అవిస్తర మసందిగ్ధం అవిలంబిత మవ్యథం
ఉరస్థం కంఠగం వాక్యం వర్తతే మధ్యమస్వరమ్ ॥
సంస్కారక్రమ సంపన్నాం అద్భుతామవిలంబితామ్ ।
ఉచ్చారయతి కళ్యాణీం వాచం హృదయహర్షిణీమ్ ॥

తమ్ముడూ ! మనం ఎవరిని కలుసుకోవా లనుకుంటున్నామో ఆ సుగ్రీవుడే తన మంత్రిని పంపాడు. ఈ మంత్రిమాటలు వింటూంటే వేదత్రయం అధ్యయనం చేసిన వాడులా వున్నాడు. ఒక్క అపశబ్దం జారకుండా యింతసేపు ప్రసంగించిన తీరు చూస్తే ఈయనకు వ్యాకరణం కరతలామలకం అనిపించడంలేదూ. కనులుకాని కనుబొమలుకాని,

లలాటంకాని, శిరస్సుకాని కదలించకుండా, అనవసరశబ్దం ప్రయోగించకుండా మాట్లాడే ఈ శాస్త్రవిశారదుడు, వర్ణోత్పత్తిస్థానాలయిన హృదయ, కంఠాలను ఆశ్రయించి మధ్యమ స్వరంలో ప్రత్యక్షరం పలికాడు. సునంస్కృత సంపన్నమై క్రమబద్ధంగా సాగించే ఈ సంభాషణ ఎటువంటివారి నయినా ఆకర్షించగలదు. ఇటువంటి శక్తిశాలిని మంత్రిగా పొందిన ప్రభువు సాధించలేనిది లేదు. అందుచేత నువ్వు ఈ సుగ్రీవసచివునితో అవసర ప్రసంగం సాగించు, అన్నాడు.

అప్పుడు లక్ష్మణుడు మధురస్వరంతో :

మహావిద్వాంసుడా! మీ సుగ్రీవప్రభువును గురించి మేం విన్నాం. ఆయన కోసమే మేం యిలా వచ్చాం. ఆయన మా స్నేహం కోరుతున్నాడు. మేము ఆయన సఖ్యం వాంఛిస్తున్నాం, అన్నాడు తమ పేరులు చెప్పి.

హనుమంతుని హృదయం ఆనందతరంగిత మయింది. తమ ప్రభువు వీరి సాహాయ్యంతో రాజ్యాధిపతి కాగలడని భావించాడు. అయితే వీరు తమ ప్రభువుతో ఏదో పనిమీద వచ్చారని గ్రహించాడు.

రామచంద్రా! సోదరసమేతం మీరు ఈ మహారణ్యానికి ఎందుకు వచ్చారు? అని మారుతి ప్రశ్నించగా, లక్ష్మణుడు :

నేను నీకు వివరాలన్నీ చెప్పలేదు. మేము దాశరథులము. మా తండ్రి ధర్మ ప్రభువు, వర్ణచతుష్టయాన్ని కన్నబిడ్డలవలె పాలిస్తూ, ఆశ్రమధర్మాలు నిర్వర్తింపజేసినారు. సర్వభూతశరణ్యుడయిన మా అన్నగారు పితృవాక్యపాలనకై అడవికి వస్తూంటే ఈయనను విడువలేక మా వదిన జానకీ నేనూ వచ్చాం. సర్వభూతహితుడయిన ఈయన వనవాసక్లేశం అనుభవిస్తూంటే, ఎవడో రాక్షసుడు మా వదినను అ ప హ రిం చా డు. ఆవిడకోసం అన్వేషించే సమయంలో కబంధుడనే వాడు మీ సుగ్రీవుని గురించి చెప్పి, యిలా పంపించాడు.

సర్వలోకనాథుడు కావలసిన ఈయన ఈనాడు మీ ప్రభుసాయం కోరివున్నాడు. సర్వరాజ్యలోకం తమ మణిరత్నభూషిత కిరీటాలతో మానాన్నగారి పాదాల మీదవ్రాలి నమస్కరించేవారు. ఆయన కుమారుడు - ఆ సింహాసనం అధివసించవలసినవాడు - ఈనాడు మీ ప్రభువు అనుగ్రహంకోసం వేచివున్నాడు, అని హనుమంతునివైపే చూస్తూ నిలబడ్డాడు.

జితేంద్రియులు, జితక్రోధులు, గుణసంపన్నులు అయిన మీవంటి మహనీయులను దర్శించే అదృష్టం కలిగినందుకు ఆనందంగా వుంది. మా ప్రభువు అన్నగారివల్ల రాజ్య

భ్రష్టు డయాడు. అంతేకాదు, ఆయన దారనుకూడా అన్నగారు హరించాడు. ఇక మీరు భావించినట్లు జానకీదేవి అన్వేషణ మాచేత జరిపించి మీ కాయన తోడువడగలడు, అన్నాడు హనుమంతుడు

అప్పుడు లక్ష్మణుడు రామునితో: అన్నా మనం వీరికి సాయపడి, వారి సాయం మనం పొందుదాం, అన్నాడు.

హనుమంతుడు భిక్షురూపం విడిచి, స్వస్వరూపం ధరించాడు. ఆయనవెంట రామ లక్ష్మణులు ఋశ్యమూకం చేరారు. వారిని అక్కడే ఉంచి హనుమంతుడు మలయగిరి మీద వున్న సుగ్రీవుని సమీపించి జరిగిన వృత్తాంతమంతా నివేదించాడు.

సుగ్రీవుని గుండె స్వస్థపడింది. మానుషరూపంతో రామలక్ష్మణులకు స్వాగత మర్యాదలు జరిపి రామచంద్రా! మా హనుమ చెప్పాడు. ఇదిగో నా స్నేహహస్తం అందిస్తున్నాను, అందుకోండి, అన్నాడు.

రాముడు తనచేతిని ముందుకు చాపాడు, ఉభయులూ గాఢాలింగనం చేసుకున్నారు. రెండు కాష్ఠాలుతెచ్చి ప్రజ్వలితవహ్నిలో వ్రేల్చి పూలతో అర్చించి ఉభయులూ ప్రదక్షిణం చేసి ఒకరినొకరు చూసుకుంటూ తన్మయులై నిలబడ్డారు.

ఇద్దరూ బాహ్యప్రపంచంలోకి వచ్చాక ;

సుగ్రీవా! ఇది మొదలుగా కష్టసుఖాలలో యిద్దరం భాగస్వాములం, అన్నాడు రాముడు.

ఉభయులూ ఒక వృక్షశాఖమీద కూర్చున్నారు.

రామభద్రా! మా అన్న వాలి నన్ను వధించడానికి అనేకానేక ప్రయత్నాలు చేస్తు న్నాడు. నువ్వు అభయ మిచ్చి నన్ను రక్షించు, అన్నాడు.

ఉపకారమే మిత్రత్వఫలం. అదిలేని మైత్రికి అర్థంలేదు. ఇదిగో సహస్ర కిరణ శోభామయుడైన భాస్కరునివలెనున్న నా బాణం. దీనితో వాలిని సంహరిస్తాను. దుర్వృ త్తికి ఒడిగట్టిన వాలిని ఈ బాణం క్షణంలో కడతేరుస్తుంది. నువ్వు నిశ్చింతగావుండు, అన్నాడు రాముడు.

ఇక్కడ రాముడు సుగ్రీవునితో మైత్రిప్రమాణం చేస్తున్న క్షణంలో అక్కడ లంకలో సీతాదేవి వామనేత్రం అదిరింది. అదేసమయంలో వాలికీ, రావణునికీకూడా వామనేత్రాలు అదిరాయి.

కొంతసేపయాక సుగ్రీవుడు: రామభద్రా! ఇప్పుడు నాకు స్ఫురణకు వస్తున్నది. ఒకనాడు ఈ పర్వతశిఖరంమీద మేమంతా వుండగా రావణుడు ఒక స్త్రీని అపహరించుకు వెడుతున్నాడు. ఆవిడ మీ జానకి అయివుండాలి. హా రామా! లక్ష్మణా! అని ఆక్రోశించడం మేం విన్నాం. మమ్మల్ని చూసినట్టుంది ఆవిడ, తన నగలన్నీ మూటగట్టి ఇక్కడ విడిచేసింది. అవి అలా దాచివుంచాము. ఆ మూట తెప్పించనా, అనగా, ఇంక ఎందుకు ఆలస్యం, అన్నాడు రాముడు.

క్షణంలో సుగ్రీవుడు వెళ్ళి కొండగుహలోవున్న నగలమూట తెచ్చి రాముని ముందుంచాడు.

మూట ముడి విప్పాడు రాముడు. విప్పినక్షణంలో ఆయన కన్నుల నీరునిండింది. మంచుతో కప్పిన చంద్రబింబం అయింది ఆయన వదనం.

హా ప్రియా! అంటూ నేలకూలాడు. కన్నీరు వర్షధార అయింది. మనస్సు స్వస్థం కావడంలేదు. కన్నీరు కట్టుబడలేదు. కొంతసేపు అలా దుఃఖించి:

తమ్ముడూ, మీ వదిన నగలేమో చూడవోయ్, అన్నాడు, లక్ష్మణుడు నగలు ఒక్కొక్కటే తీస్తూ:

నాహం జానామి కేయూరే
నాహం జానామి కుండలే ।
నూపురే త్వభి జానామి
నిత్యం పాదాభివందనాత్ ।

అని, జానకీదేవి కాలిఅందెలు చేతితో పుచ్చుకున్నాడు.

కొంతసేపటికి తేరుకొని రాముడు: చెలికాడా! నా ప్రాణసఖిని హరించిన వానిని సర్వనాశనం చేసితీరుతాను. వాడు ఏ దిశగా వెళ్ళాడు, ఎక్కడకు వెళ్ళాడు, అని ప్రశ్నించగా:

రామచంద్రా! వాడి వాసస్థానం, కులగోత్రాల వివరాలూ తెలియవు. అయినా నా దెవడయినా, ఎక్కడున్నా వెదకి వాణ్ని అనుచరసమేతం వధించి, నీ జానకిని నీకు అప్పగిస్తాను. ఈ హృదయ వైక్లబ్యం విడిచి స్థిరచిత్తంతో వుండు. నీ వంటి వీరుడు, విద్వాంసుడు కన్నీరు పెట్టకూడదు. వివేకులు విషాదవంచితులు కాకూడదు. ఈ స్నేహితుని మాటలు విశ్వసించు, అన్నాడు సుగ్రీవుడు.

రాముడు ఉత్తరీయంతో కన్నులూ ముఖం ఒత్తుకుని :

సుగ్రీవా! ఇప్పుడు నా మనస్సు నిర్మలంగా వుంది. ఇటువంటి క్లిష్టసమయంలో నీవంటి మిత్రుడు దొరకడం నా అదృష్టం. ఇప్పుడింక సీతాన్వేషణం ఆరంభించాలి. సు నేను నీకు చెయ్యవలసినదేమిటో స్పష్టంగా చెప్పు. తొలకరి జల్లులకు ముందు నాటిన విత్తనాలు సక్రమంగా ఫలించేటట్లు మన ప్రయత్నం నిర్విఘ్నంగా సాగుతుంది. నువ్వు నిర్భయంగా ఉండవచ్చు, అన్నాడు.

అలా కొంతసేపు వారుభయులూ మాట్లాడుకున్నారు. మిత్రులమధ్య సుఖ దుఃఖాలు, సంపద్దారిద్ర్యాలు సమంగా వుంటాయి, అనుకుంటూ వారు కొంతదూరం నడిచి ఒక సాలవృక్షశాఖమీద సుఖోపవిష్టు లయారు. అప్పుడు సుగ్రీవుడు :

రామచంద్రా! అగ్నిసాక్షిగా మైత్రిచేసుకున్న మనం ఇప్పుడు మన కష్టసుఖాలు మాట్లాడుకుందాం.

చాలా రోజులక్రితం మాట, మా అన్న వాలి నన్ను పదభ్రష్టునిచేసి రాజ్యంనుంచి వెడలనడిపి, నా మిత్రులను బంధించాడు. అంతతో తృప్తిపడక నన్ను సంహరించడానికి సర్వప్రయత్నాలూ చేస్తున్నాడు. ఎందరో మహాయోధులను పంపి నన్ను చంపడానికి ప్రయత్నించడం యింకా మానలేదు. అందుచేత ముందు మిమ్మల్ని చూస్తూనే ఆయన పంపిన దూతలేమో అని భయపడ్డాను. గుండెనిబ్బరంలేనివాడికి అన్నీ సందేహాలే.

అసలు విషయం, వానరరాజు వాలి ఉన్నాడే, ఆయన మహాబలిష్ఠుడు. వాడు జీవించివుండగా నాకు సుఖ శాంతులు లేవు. అంటూంటే రాముడు : మీ అన్నదమ్ముల కలహకారణం ఏమిటి? అని అడిగాడు.

సుగ్రీవ : ఈ కిష్కింధకు అధిపతి ఋక్షరజసుడు. ఆయనకు మే మిద్దరం బిడ్డలం. మా మధ్య ఎంతో సౌహార్దం ఉండేది. పెద్దవాడుగా వాలి సింహాసనం అధిష్ఠించాడు. నేను వినయ, సేవాభావంతో కొలిచేవాడిని. అలా కాలం సుఖంగా సాగుతున్న రోజులలో దుందుభి అనే రాక్షసుని కొడుకు మాయావి అనేవాడు బల, మద గర్వంతో ఒకనాటి అర్థరాత్రి మా కిష్కింధకువచ్చి గర్జించాడు. పిడుగులు పడుతున్నట్లు సాగుతున్న ఆ గర్జనలకు కిష్కింధ గజగజలాడింది. మా అన్నయ్యకూ వానికీ ఒకానొక స్త్రీవిషయమై ఏదో వైరంఉన్నట్లు విన్నాం. ఆక్రోధంతో వచ్చాడువాడు. వాడి గర్జనవిని సుఖనిద్రలో వున్న మా అన్నలేచి విషయం తెలుసుకొని, లేచినవాడులేచినట్లే రోషతామ్రాక్షుడై

బయలుదేరుతూంటే అర్థరాత్రి మాయావితో పోరు సాగించవద్దని వారించాం. ఆయన మా మాటలు వినేస్థితిలో లేడు. అడ్డువచ్చిన వారందరినీ పక్కకుతోసి ముందుకు సాగిపోయాడు. అన్నగారిని ఒంటరిగా విడువలేక నేను కూడా ఆయనవెంటబడ్డాను. నగరం సరిహద్దులలో మా యిద్దరినీ చూసి మాయావి భయంతో పరుగు లంకించుకున్నాడు. మా అన్న వాడివెంట పరుగుపెడుతూంటే నేనూ వెళ్ళాను.

పరుగెత్తి, పరుగెత్తి వాడొక బిలంలో దూరాడు. అది చూసి మా అన్నయ్య: తమ్ముడూ నువ్విక్కడే ఈ బిలద్వారం దగ్గర రక్షగా వుండు. నేను వాడిని కడతేర్చి వస్తాను, అని వెళ్ళాడు.

రోజులు గడుస్తున్నాయి. నేను నిద్రాహారాలు లేకుండా బిలద్వార రక్షకునిగా నిలచి, అన్నగారికోసం నిరీక్షిస్తున్నాను. ఆ మాయావి మా అన్నను ఏంచేశాడో అని భయపడుతూనే వున్నాను. అలావుండగా ఒకనాడు లోపలనుంచి రక్తం ప్రవాహంలా వచ్చింది. మాంసఖండాలుకూడా దొర్లివస్తున్నాయి. రాక్షసగర్జనలు వినిపిస్తూనే వున్నాయి. నా ఆశ నన్నగిల్లింది. ఆ మాయావి మా అన్నను చంపివుంటాడనుకున్నాను ఇంక వాడు వెలుపలకు రాకుండా పెద్దరాతిబండతో ఆ బిలద్వారం మూసేసి, వెనుదిరిగివచ్చి, విషయాలన్నీ మంత్రులకు నివేదించి ఆయనకు ఉదక క్రియలు నిర్వర్తించాను. మంత్రులందరూ నన్ను రాజ్యాధిపతిని చేశారు. రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు నేను సింహాసనంమీద కొలువుదీర్చి వుండగా మా అన్నవచ్చి, నన్ను చూస్తూనే, తీవ్రరోషంతో నానాదుర్భాషలు ఆడినా నేనేం మాట్లాడలేదు, ఆయనమీది గౌరవంతో.

సోదరప్రేమతో, గౌరవంతో ఆయన పాదాలకు నమస్కరించి విషయం వివరించడానికి విశ్వప్రయత్నం చేశాను. ఆయన రోష, ద్వేషహృదయంతో నామాటలు వినలేదు.

మా అదృష్టంవల్ల నువ్వు శత్రుసంహారంచేసి తిరిగివచ్చావు. రా! ఇదిగో ఈ రాజ్యలాంఛనాలన్నీ నీవి. ఈ సింహాసనం అధివసించు, నువ్వే ప్రభువుగా వుండాలి. నేను నీ దాసుడిని. క్రోధంవిడిచి ఈ తమ్ముడిని అనుగ్రహించు, అని పరిపరి విధాల అర్థించాను. ఆయన వినలేదు.

మంత్రులందరినీ ఉద్దేశించి: ఓ మంత్రులారా! ఆ రాత్రి మాయావిని వెంటాడుతూ వెళ్లాం. వాడొక మహాబిలంలో దూరాడు. నేను బిలద్వారరక్షణలో సుగ్రీవుని వుంచి

లోపలకు వెళ్ళాను. వాడు కనిపించలేదు. వెదకి, వెదకి పట్టుకున్నాను. వాడి అనుచరులుకూడా వున్నారు. అందరినీ సంహరించాను. ఆ రక్తమాంసాలు మహాప్రవాహం అయాయి. అంతా అయాక నేను మహోత్సాహంతో బిలద్వారం దగ్గరకు చేరేసరికి అది మూతపడివుంది.

అడ్డంగావున్న బండరాతిని అతిప్రయాసమీద తప్పించి యిక్కడకు వచ్చిచూద్దును గదా, ఇదీ వీడి కథ. రాజ్యకాంక్షతో వీడు ఆ బిలద్వారం మూసివచ్చాడు. నా రాజ్యంలో నీడికి స్థానంలేదు. అని నన్ను తరిమి నా భార్యను చెట్టపట్టాడు రామచంద్రా !

అదిమొదలుగా నేను భూమండలమంతా తిరుగుతూ ప్రాణరక్షణ చేసుకుంటున్నాను. ఎక్కడున్నా నన్ను సంహరించటానికి ప్రయత్నిస్తూంటే చివరకు ఈ ఋశ్యమూకం చేరాను. ఆర్యా, ఇప్పుడు మీరే చెప్పండి. ఇందులో నాదోషం ఏముంది, అన్నాడు సుగ్రీవుడు,

రామ : సుగ్రీవా! అర్థమయింది. అన్యాయానికి ఒడిగట్టిన వాలిని నా నిశిత శరాలతో కడతేరుస్తాను. నా బాణఘాతం తిననంతవరకే వాలి ఊపిరితో వుండేది త్వరలోనే ఆ హీనచరిత్రుడు కథావశిష్టుడు కాగలడు - సుగ్రీవునిగుండె సంతోష తరంగిణి అయి రామభద్రా! ఇప్పుడు నీకు వాలి బలశక్తులుకూడా చెప్పాలి. అది తెలిశాక నీ కర్తవ్యం నిర్ణయించు, అన్నాడు.

వాలి ప్రతిదినం అరుణోదయాత్పూర్వం చతుస్సముద్రాలనూ చుట్టివస్తాడు. మహాగిరి శృంగాలను విరిచి బంతు లాడుతూంటాడు. మహోత్తుంగవృక్షాలను విరిచి విసురు తూంటాడు. ఆయన కిది నిత్యవ్యాయామక్రీడ. మరొక్కమాట. దుందుభిఅనే దానవు డుండేవాడు. వాడు వెయ్యి ఏనుగుల బలంకలవాడు. దానికితోడు బ్రహ్మదేవు డిచ్చిన వరాలున్నాయి. ఆ బలమదంతో వాడికి యుద్ధకండూతిపుట్టి సముద్రుని యుద్ధానికి పిలిచాడట. సముద్రుడు వినయంగా చేతులు జోడించి : బాబూ! నాకు నీతో యుద్ధంచేసే శక్తిలేదు. నీకుతగిన ప్రత్యర్థి హిమవంతుడు. ఆయన దగ్గరకు వెళ్ళు. అనగా దుందుభి హిమవంతునిచేరి తొడగొట్టాడు.

హిమవంతుడు మరింతవినయంతో : ఓ మహాయోధుడా ! ముక్కుమూసుకు తపస్సు చేసుకునే సజ్జనులకు ఆశ్రయం ఇవ్వగల సామాన్యుడనయ్యా నేను. నావంటి వాడితో యుద్ధంచెయ్యాలనే కోరిక నీకెందుకు కలిగింది, అనగా దుందుభి :

అయితే నాతో యుద్ధం చెయ్యగలవాడెవడు ? అని గర్జించాడు.

ఓ మహావీరశిరోమణీ! అనన్యసామాన్య తేజో బలపరాక్రమోపేతుడు కిష్కింధాధిపతి [illegible]డని విన్నాను. బహుశః ఆయన ఒక్కడే నీకు ఎదురు నిలవగలవాడు నీ [illegible] సమానమయిన యోద్ధకావచ్చు అనగా, దుందుభి హుంకరిస్తూ మా కిష్కింధకు [illegible]. మహిషరూపుడై వచ్చిన ఆ దుందుభి మా వనంలోని మహావృక్షాలు పెల్లగిస్తూ, [illegible] ప్రారంభించాడు.

అంతఃపురంలో తన భార్యాసమూహంలో వున్న వాలి ఆ గర్జనలు విని, [illegible] ఏమయ్యా! ఎందుకింత అల్లరిచేస్తున్నావు. నీ గురించి నేనూ విన్నాను. [illegible]వంగా ఈ రాత్రిపూట ప్రాణా లెందుకు తీయించుకుంటావు, వెళ్ళి సుఖంగా [illegible] బ్రతుకు, అన్నాడు.

దుందుభికి ఆగ్రహంరెచ్చి: అనవసరంగా ఆర్భాటాలుపలకక నాతో యుద్ధంచెయ్యి. [illegible] ఈ రాత్రి నువ్వు భార్యా సమాజంతో సుఖ భోగాలు అనుభవించదలచుకుంటే [illegible] వదిలేస్తాను. నా రణకండూతి రేపు తీర్చుకుంటాను. రేపునువ్వు చేసుకోవలసినవన్నీ [illegible]పెట్టుకుని, యోగ్యుడయినవాణ్ని సింహాసనం ఎక్కించిరా....నాతో తలపడ్డవాడిలా [illegible] మొండెంమీద వుండదుకనుక నీ శ్రేయస్సుకోరి చెపుతున్నాను. ప్రమత్తులతో, [illegible] దేహులతో బలహీనులతో ఈదుందుభి యుద్ధంచెయ్యడు, అని అట్టహాసంచేశాడు.

వాలి వికటాట్టహాసంచేసి, పరిజనాన్ని లోపలకు పొమ్మని :

ఓ రాక్షసశ్రేష్ఠుడా! చాలా సంతోషం, నీ రణకండూతి యిప్పుడే తీరుస్తాను, [illegible] ఆ రెండుకొమ్ములూ పట్టి గిర్రునతిప్పి ఒక్క విసురు విసిరాడు. దుందుభి నవరంధ్రాలనుండి రక్తధారలు ఆరంభమయాయి. దానితో వాడు మరింత రోషావిలచిత్తుడై [illegible] తిరిగాడు. కొద్దిక్షణాలు వారిద్దరూ పోరు నడిపారు.

మా అన్న పొడిచిన మోకాటిపోట్లతో, పిడికిలిగుద్దులతో నీరసపడిపోయాడు వాడు, ఆఖరుశ్వాసవిడిచే సమయంలో వాడి కాళ్ళు మెలిపెట్టి మా అన్నయ్య విసిరిన విసురుకి ఆ మహాకాయం రెండుయోజనాలదూరంలో పడింది. ఆ విసురులో దుందుభి దేహం నుండి చెదరిన రక్తబిందువులు ఇక్కడ ప్రశాంతముగా తపస్సు చేసుకునే మతంగమహర్షి మీద పడ్డాయి. ఆయన అదిరిపడి కన్నులు విచ్చిచూశాడు. దుందుభి దీర్ఘకాయం కనిపించింది. ఇది వాలి పని, అనుకున్నా డాయన, అంతే!

ప్రశాంతపవిత్రమయిన నా ఆశ్రమాన్ని యిలా చేసినవాడెవడో వాడు ఈ ఆశ్రమానికి నాలుగుక్రోసుల దూరంలో ఎక్కడ అడుగుపెట్టినా ప్రాణాలు వదిలేస్తాడు, ,అని శపించాడు. అంతతో ఆయన క్రోధం చల్లారలేదు.

వాడేకాదు వాని ఆశ్రితులకుకూడా యిదే శాపం అన్నారు మతంగమహర్షి. ఆ శాపవాక్యం విన్నక్షణంలో ఈ పరిసరాలలోవున్న వానరులందరూ వాలిని సమీపించి ఆయనకు సంగతి నివేదించారు.

అదిమొదలు మాఅన్నయ్య యిటు కన్నెత్తిచూడరు. అందుచేత యిది నాకు శరణ్యం అయింది, అని చెయ్యెత్తి :

అదిగో! అది దుందుభి అస్థిపంజరం. తెల్లకొండలా ఎలావున్నదో చూశావా. ఆ పంజరానికి పరిసరాలలో విశాలశాఖలతో వున్న ఆ సాలవృక్షసప్తకం చూశావా. ఆచెట్టుని ఒకచేతితో వూపితే ఒక్క ఆకు మిగలదు. అది మా అన్నయ్య శక్తి అన్నాడు.

లక్ష్మణుడు నవ్వి : వానరేశ్వరా! ఇప్పుడు మా అన్నయ్య ఏంచేస్తే ఈయన పరాక్రమంమీద నీకు విశ్వాసం కలుగుతుందయ్యా అని అడిగాడు.

ఒక్క బాణంతో అందులో ఒక్కచెట్టుని కూల్చగలిగితే చాలు, ఈ దుందుభి అస్థి పంజరాన్ని పాదఘాతంతో బహుదూరం విసరగలిగితే చాలు. అయితే రామచంద్రా! నేను మా అన్న బలపరాక్రమ శక్తులెరిగిన వాడిని. నీ శక్తి సామర్థ్యాలను నేనెరుగను. కనుక యింత చెప్పవలసివచ్చింది. వాలిచేసిన అద్భుతసాహసాలు నేటికీ మా కిష్కింధ వాసులకు రోమాంచం కలిగిస్తాయి, అని వినయంగా కూర్చున్నాడు.

రాముడులేచి నాలుగడుగులువేసి కాలిబొటనవ్రేలితో దుందుభి అస్థిపంజరాన్ని కదిపాడు, అది పదిక్రోసుల ఆవలపడింది. మళ్ళీ తిరిగివచ్చి మామూలుగా కూర్చున్నాడు.

అప్పుడు సుగ్రీవుడు : రామభద్రా! ఇది రక్త మాంసాలతో నిండివున్నప్పుడు విసిరాడు మా అన్నయ్య. ఈనాడిది ఎండిపోయివుంది. అందుచేత...., చేతులు నలుపుతూంటే, రాముడు ; నీకు నమ్మకం కలగాలంటే ఏంచెయ్యాలి, అన్నాడు.

ఈ సాలసప్తకంలో ఒక్కదానిని ఒక్కబాణంతో పడగొడితే చాలు, అన్నాడు సుగ్రీవుడు.

రాముడు ధనుస్సునెత్తి, అనాయాసంగా బాణంసంధించి ఆకర్ణాంతంలాగి విడిచాడు. అది మరుక్షణంలో ఏడుమద్దిచెట్లనూ సమూలం పెళ్ళగించి, తిరిగివచ్చి రాముని బాణాసనంలో చేరింది.

రెప్పపాటు వ్యవధానంలో జరిగిన ఈ అద్భుతం సుగ్రీవునికి ఆనందాశ్చర్యాలు కలిగించగా, ఆ వానరేశ్వరుడు రాముని పాదాలమీదపడి : మహావీరుడా! తేజస్వంతులలో

సూర్యుడూ, మహోన్నతపర్వతాలలో హిమవంతుడూ, జంతుకోటిలో సింహమూవలె నువ్వు పురుషులలో శ్రేష్ఠుడవు. నీబాణధాటికి దేవతలుకూడా నిలవలేరు. ఇప్పుడింక నాకు విశ్వాసం కుదిరింది, అన్నాడు.

రాముడు సుగ్రీవుని ఆలింగనంచేసుకుని : ఇప్పుడే కిష్కింధకు వెళ్ళి మనకర్తవ్యం పూర్తిచేద్దాం, నడు నువ్వు ముందువెళ్ళి మీ అన్నయ్యను యుద్ధానికి పిలు. తరువాయి పని నేను చూసుకుంటాను, అన్నాడు.

అందరూ కిష్కింధ చేరి నగర పరిసరాలలో చెట్లమాటున నిలబడ్డారు. సుగ్రీవుడు ఉత్తరీయం నడుముకు చుట్టబెట్టి, నగరసింహద్వారం దగ్గర నిలబడి యుద్ధోత్సాహంతో సింహనాదం చేశాడు.

ఆ గర్జనవిన్న వాలి మండిపడ్డాడు. పడుతూనే ఒక్క ఉదుటున సుగ్రీవుని ఎదుటకు వచ్చి నిలబడ్డాడు. క్రోధోద్రిక్తులయి యిద్దరూ తొడలు చరిచారు.

అంతే! ఆ అన్నదమ్ముల ముష్టిఘాతాలతో ఆకాశం దద్దరిల్లుతున్నది. పిడుగులు పడుతున్న ధ్వనులు వెలువడుతున్నాయి. రాముడు బాణం సంధించి చూస్తున్నాడు.

బలశాలి వాలి పిడికిలిపోట్లతో సుగ్రీవుడు విరబూసిన మోదుగుచెట్టులా వున్నాడు. రాముడు సజ్జిత ధనువుతో ఎదురుచూస్తూనే వున్నాడు, వాలిని కొట్టడం కోసం.

వాలి పిడికిలిపోట్లు సహించలేక సుగ్రీవుడు పలాయనం ప్రారంభించాడు. వాలి తరిమి, తరిమి ఋశ్యమూకానికి ఈవల ఆగి వెనుదిరిగాడు.

కొంతసేపటికి రామ లక్ష్మణులు ఋశ్యమూకం చేరారు. సుగ్రీవుడు సిగ్గుతో తల వంచుకుని : రామచంద్రా! వాలిని వధించడం నీకిష్టంలేదని ముందే చెపితే నేనీ భంగపాటు పడేవాడినికాను. ఎందుకు నన్ను పంపించావు, అని విచారంతో అడిగాడు.

రామునిగుండె ద్రవించింది : సుగ్రీవా ! బాధపడకు. వాలిని వధించాలనే చూశాను. కాని అన్నదమ్ములిద్దరూ మీరు ఒకేరూపంలో వున్నారు. మీయిద్దరిలో ఎవరు ఎవరో తెలుసుకోలేకపోయాను. బాణం విడిచానో అది ప్రాణాలు తీసేస్తుంది. ఆ బాణం నీకు తగిలితే, అభయమిచ్చిన మిత్రుని సంహరించిన పాపం నన్నుచుట్టుకుంటుంది. ఇప్పుడు నువ్వు మళ్ళీ మీవాలిని యుద్ధానికి పిలు. ఇదిగో ఈ గజపుష్పమాలతో వెళ్ళు, ఈసారి ఇదే బాణంతో వాలి ప్రాణాలు అనంతంలో కలుస్తాయి, అని లక్ష్మణునివైపు తిరిగి :

తమ్ముడూ! ఈ పూలమాలను మన మిత్రుడి కంఠసీమలో అలంకరించు. ఇదే సుగ్రీవునికి విజయమాల, అన్నాడు.

కొంగలవరుసతో వున్న సంధ్యాకాలమేఘంలా సుగ్రీవుడు ముందు సాగుతూంటే రామ లక్ష్మణులు అనుసరించారు. ఆ వెనుక నలుడు, నీలుడు, హనుమంతుడు మిగిలిన సుగ్రీవ పరిజనులు వస్తున్నారు.

దారిలో ఫల, పుష్పభారంతో మహావృక్షాలు, వాటిని అల్లుకున్న లతలు, కొండలు కొండగుహలు, సరోవరాలు, ఆ తటాకాలలో రకరకాల జలపక్షులు, తెల్లనిదంతాలతోవున్న ఏనుగులు కదలని మెరుపులతోటి మేఘాలలా కనిపిస్తున్నాయి. అన్నిటినీ చూస్తూ రాముడు: సుగ్రీవా! ఏమిటి ఈ వనవిశేషం? అన్నాడు.

ఇక్కడ సప్తజననామంతో ఏడుగురు మహర్షులు వాయుభక్షణంతో గ్రీష్మాగ్నిమధ్యంలో తపస్సుచేసుకుంటూ వుండేవారు. తపోదీక్షకు విఘ్నం కలగకుండా ఈ పరిసరాలలోకి ఎవరూ రాకుండా కట్టడి చేసుకున్నారు. వారు సిద్ధిపొంది ఎంతోకాలమయినా ఆకట్టడి అలానే సాగుతున్నది, అన్నాడు సుగ్రీవుడు.

వారు కిష్కింధసింహద్వారం చేరారు. చేరగానే సింహనాదం చేశాడు సుగ్రీవుడు. పిడుగుపడ్డట్టు వినబడిందానాదం వాలికి. మరొకసారి గర్జించాడు సుగ్రీవుడు. విన్నాడు వాలి. మళ్ళీ మళ్ళీ నిర్విరామంగా గర్జిస్తూనే వున్నాడు.

నారీజనమధ్యంలో భోగవిలాసమత్తుడై వున్న వాలికి ఆ గర్జాధ్వనులు క్రోధకారణాల యాయి. నరాలు పొంగులువారాయి. హుంకరించాడు, శయ్యామందిరంవదిలి అడుగు బయట పెడుతున్నాడు. ఆ సమయంలో అతని పట్టమహిషి తార అడ్డుగావచ్చి:

ఓ వీరశిరోమణీ! సుఖ భోగాలతో నిద్రలేచిన పురుషుడు ఆరాత్రి ధరించిన పూల మాలను విడిచేసేటట్లు నువ్వు క్రోధాన్ని విడిచిపెట్టు. యుద్ధం చెయ్యాలనివుంటే రేపు వెళ్ళవచ్చు. శత్రువు నీకంటే బలవంతుడు కాకపోయినా అనాలోచితంగాచెయ్యి కలవడం ఉచితంకాదు. కొద్దిఘడియల క్రితం నీ చేతులలో చావుదెబ్బలుతిని వెళ్ళినవాడు యింతలో యిలా వచ్చాడంటే దీనివెనుక కారణం వుండకుండా వుండదు. సుగ్రీవుడు ధీశాలి, కార్యచతురుడు. అందువల్ల మళ్ళీ నీచేత దెబ్బలుతినడానికి రాడు.

పైగా, యిందాకనే అంగదుడు చెప్పాడు. ఇక్ష్వాకువంశీయుడయిన దశరథుని కుమారులు మహావీరులు రామ లక్ష్మణులు సుగ్రీవునితో అగ్నిసాక్షిగా మైత్రిచేసుకున్నారట.

వారిలో రాముడు ప్రళయాగ్నిసదృశుడై శత్రువనాన్ని దగ్ధం చేయగలడట. సాధుజన రక్షణలో అంతటివాడు లేడట. ఆయనతో వైరం మనకు శ్రేయస్కరంకాదు. మీ అన్న దమ్ములమధ్య వైరమే నాకు నచ్చలేదు. కనక ఇప్పుడు సుగ్రీవుని రావించి యువరాజుగా అభిషేకించు. అందువల్ల ఆ రాముడుకూడా మనకు మిత్రుడవుతాడు. మీకు నామీద ప్రేమవుంటే నామాట పాటించండి. సుగ్రీవునితో సంధి చేసుకోండి, అంది.

తార చెపుతూనే వున్నది. వాలి ఆమెను ఆపి:

తారా! యోధుడెవడూ శత్రుధిక్కారాన్ని సహించడు. అందులో పరాజయం ఎర గని నేను ఈ సింహగర్జనలు వింటూ నిద్రపోగలనా!

ఇక నువ్వుచెప్పినట్లు ధర్మవిదుడు, కార్యాకార్యవివేకి అయిన రఘువంశీయుడు అక్రమానికి సాహసిస్తాడని ఎలా అనుకున్నావు. నామీదప్రేమతో నువ్వింత భయపడి మాట్లాడుతున్నావు. నేను సుగ్రీవుని వధించబోవడంలేదు. వాడు మళ్ళీ ఈ గర్జనలు చెయ్యకుండా హింసించి వస్తాను. నువ్వు నీ పరిజనంతో లోపలకు వెళ్ళు. ఇక నువ్వు మాట్లాడితే నామీద ఒట్టు, అన్నాడు.

తార కన్నీరు వొత్తుకుంటూనే భర్తను ఆలింగనం చేసుకుని, అనంతరం మంగళ హారతి యిచ్చి, ప్రదక్షిణ నమస్కారాలు చేసింది.

## వా లి వ ధ

వాలి మహోత్సాహంతో సింహద్వారంచేరి కలయజూశాడు. బంగారుకాంతులీనే దేహంతో, మండుతూన్న అగ్నిశిఖవంటి ముఖంతో సుగ్రీవుడు కనిపించాడు. అంతే ఉత్తరీయం నడుముకు చుట్టుకుని, పిడికిలి బిగించి ముందుకు చూపాడు. సుగ్రీవుడు మరింతరోషంతో ముష్టి బంధించి ఎదురునిలువగా వాలి:

ఓరీ! ఇదిగో ఈ పిడిగుద్దుతో యమసదనం చేరుతావు, అనగా సుగ్రీవుడు: నా ముష్టిఘాతంతో నీతల వెయ్యిముక్కలు అవుతుంది, అని అరిచాడు. అంతలోనే వాలి సుగ్రీవుని తలమీద పిడికిలి వేశాడు. సుగ్రీవుడు రక్తం కక్కుకుని గైరికధాతు శోభితమయిన పర్వతంలా కనిపించాడు. ఉత్తర క్షణంలోనే సుగ్రీవుడు చేతికందుబాటులోవున్న మహావృక్షం లాగి విసిరాడు. సాగరమధ్యంలో తరంగ తాడితమైన మహానౌకలా ఊగిసలాడాడు వాలి.

భీమబలోపేతులయిన అన్నదమ్ములిద్దరూ మత్తేభాలవలె పోరుతున్నారు. పోరు పెరుగుతున్నవేళ వాలి బలం పెరుగుతూన్నది. సుగ్రీవుడు క్షీణబలు డవుతున్నాడు. వాలిని రామబాణానికి గురిచేసే సంకల్పంతో సుగ్రీవుడు శాయశక్తులా పోరుతూనేవున్నాడు. పిడికిలి పోట్లు, పాదతాడనాలు, జానుఘాతాలు అలా వారు సాగించేయుద్ధం దేవేంద్ర - వృత్రాసుర సంగ్రామాన్ని తలపుకు తెస్తున్నది. ఇద్దరి దేహాలూ రక్తవర్షం కురుస్తుంటే కాలమేఘాలు రక్తధారలతో భూమిని తడుపుతున్నట్లు నిపించింది.

చూశాడు రాముడు. ఇంక సుగ్రీవుడు నిలబడలేడని గ్రహించి కోడెత్రాచు వంటి బాణాన్ని అందుకుని నారి సంధిస్తూంటే, ఆ ధ్వనికి అక్కడి మృగపక్షిసంతతులు భయ కంపితాలయి చెల్లాచెదరయాయి. ఆ కర్ణాంతం నారిలాగి బాణం విడిచాడు. అగ్నిశిఖా కాంతులతో అది వాలి రొమ్మున నాటుకుంది. వాలి నేలకూలాడు. పెనుగాలిలో నేలకు ఒరిగే మహావృక్షంలా పడ్డాడు.

సూర్యరశ్మిసోకి అంచులు మెరిసే సంధ్యాకాల మేఘంలా వున్నాడు వాలి. క్షీణ పుణ్యుడయిన యయాతి స్వర్గంనుండి జారిపడినట్లు, ప్రళయవేళ దివాకరుడు భూపతితుడయి నట్లు, జ్వాలలు సన్నగిల్లిన అగ్నిహోత్రునట్లు గోచరించే వాలిని చూస్తూ రాముడు దగ్గ రగా వెడుతున్నాడు.

వచ్చే రామునిచూసి వాలి: ఓహో, తమరా! జగద్విఖ్యాతమయిన ఇక్ష్వాకు వంశీయులు! తమరేనా తేజో బలసంపన్నులని లోకమంతా చెప్పుకుంటున్నది, ప్రియ దర్శనులనీ తీవ్ర నియమనిష్ఠా పరాయణులనీ నేను విన్నది మిమ్ము గురించేనా!

ఉన్నతవంశసంజాతుడు, తేజోబలపరాక్రమ సంపన్నుడు సదాచారపరాయణుడు, కరుణాహృదయుడు అయిన వాడెవడయినా యుద్ధమగ్నులై వున్నవారిమీద బాణం విడు స్తారటయ్యా!

శమ దమ క్షమా ధర్మధైర్యవరులూ సత్యవ్రతపరాయణులూ అని విన్నాను మీ క్షత్రియులను గురించి.

ఆ నమ్మకంతోనే మా తార ఎంత మొత్తుకున్నా వినకుండా ఈ యుద్ధానికి వచ్చాను. నిన్ను నేను చూడలేదు. వచ్చిన సుగ్రీవునితో మల్లయుద్ధానికి దిగాను. ఆ మత్తులోవున్న నామీద బాణం ప్రయోగించిన ధర్మమూర్తీ! లోకప్రతారణకోసం ధర్మధ్వజం చేతపట్టావటయ్యా, లతా, తృణాచ్ఛాదితమయిన మహాకూపానివా నువ్వు. నివురుగప్పిన మహాగ్నివా.

నాకూ నీకూ ఏవైరం వున్నదని ఈ పనిచేశావు. అడవిలో పండూ, కాయా తిని బ్రతికే వానరాన్ని, నన్నెందుకు చంపాలయ్యా రాచబిడ్డా! క్షత్రియవీరుడవు, సర్వ శాస్త్రవిదుడవు, ధర్మా ధర్మాలు తెలిసినవాడివి. నువ్వు, ఇంతటి అధర్మానికి ఒడి గడతావనుకో లేదయ్యా.

ఇంత లోకనింద్యమయిన కర్మ ఎవడో అల్పుడు చెయ్యాలి కాని, నీవంటి వాడా ఈపని చెయ్యడం.

మేము వనచరమృగజాతివారం. పశుత్వం మాకు సహజం. నువ్వు మానవు డివి. మానవులలో నీ అంతటివివేకం కలవాడులేడని విన్నాను. మానవ సంఘంలో భూమికోసం, ధన, రత్న ధాన్యాది సంపదలకోసం వైరాలు పెరుగుతాయని ఎరుగుదును. ఈ అరణ్యంలో అటువంటివేమీ వుండవే. ఎందుకు నామీదనీకు ద్వేషం.

రాజనీతికికూడా హద్దులుంటాయికదా! దాన్ని తప్పి చరించలేదా నువ్వు. ఇంద్రియవశవర్తివై నామీద క్రోధంతెచ్చుకుని అన్యాయానికి పాల్పడ్డావు. ఈ అకార్యాన్ని గురించి మీ పెద్దలు నిలబెట్టి అడిగితే ఏం చెప్పుకుంటావు.

ఈ వానరుని చర్మంగాని, రోమంగాని మీరు వాడేవి కావే. మా మాంసం కూడా మీకు నిషిద్ధమే: పంచనఖాలు బ్రహ్మ క్షత్రియులు ముట్టరానివి. ఎందుకు నన్ను చంపినట్లు.

మా తారకు తెలిసింది నీసంగతి. అది చెప్పనే చెప్పింది. కాని నేనే వివ శతతో యిలా వచ్చాను. దశరథునివంటి ధర్మ వ్రతపరాయణుడికి నీవంటి ధూర్తుడు వంచకుడు, మిథ్యావాది ఎలా కలిగాడయ్యా. ధర్మాంకుశభీతిలేని నరమత్తేభా! నా ఎదుట నిలబడి యుద్ధానికి వచ్చివుంటే నిన్ను ఉత్తరక్షణంలో యమసదనం చేర్చేవాడిని.

సుగ్రీవుని సాయంకోరి ఈపని చేశానంటావా! అది నాతోచెపితే ఘడియల మీద నీ జానకిని నీ దగ్గరికి తెప్పించేవాడిని. ఆ రావణుడు సీతను ఎక్కడదాచినా నీదగ్గరికి రప్పించేవాడిని, అనాయాసంగా. అంతేకాదు. మా తమ్ముడికి నా తరువాయి సింహాసనం యిచ్చేవాడిని. ఇపుడు నేను నా మరణానికి బాధపడటంలేదు. పుట్టినప్రాణి గిట్టక తప్పదు, ఎప్పుడో ఒకప్పుడు. కాని, నువ్వుచేసిన ఈ అకార్యానికి లోకం నిన్ను వేలెత్తిచూపితే ఏం చెపుతావు. అదీ నా బాధ, అన్నాడు.

అంతవరకూ మౌనంగా విన్న రాముడు: వానరేంద్రా! ధర్మార్థకామాలనూ, లోక వ్యవహారాలన్నీ తెలియని పసివాడు పలకవలసిన పలుకు లివి. నువ్వెరుగుదువు నేను రాచ బిడ్డనని. పశు, పక్షి, మానవగణాలలో ఎవరినయినా నిగ్రహించడానికీ, అనుగ్రహించ డానికీ మాకు అధికారం వున్నదయ్యా. అది మరిచిపోయావా!

సత్య ధర్మపరాయణుడయిన ఋజువర్తనుడు మా భరతుడు ఈనాడు ఈధరణీ చక్రానికి ప్రభువు. ఆ ప్రభువు శాసనానికి రాజవంశీయులందరూ రక్షకులు. ధర్మ జ్ఞుడూ, సత్యనిష్ఠుడూ అయిన రాజసింహుడు భరతుడు అధర్మాన్ని సహించడు.

నువ్వు ధర్మభ్రష్టుడవయి, కామమే సర్వంగాభావిస్తూ రాజధర్మచ్యుతి జరిపినవాడివి. ఇంటి పెద్దకొడుకు తండ్రితో గురువుతో సమానుడు. కన్నకొడుకుతోపాటు, తోడబుట్టిన తమ్ముడూ, విద్యాభ్యాసంచేసిన శిష్యుడూకూడా పుత్రులే. ఇది ధర్మ రహస్యం. నీకు తెలిసినా తెలియకపోయినా నీ ఆత్మకు తెలుసునిది. అది ఎప్పటి కప్పుడు నిన్ను జాగృతం చేస్తూనే వుంటుంది.

సూక్ష్మః పరమదుర్జ్ఞేయః సతాం ధర్మః ప్లవంగమ।
హృదిస్థః సర్వభూతానాం ఆత్మా వేద శుభాఽశుభం॥

నువ్వు వానరుడివి. చపలచిత్తతతోవుండి, నీవంటి బుద్ధికల సచివులతో మంత్రాంగం సాగిస్తున్నావు. జాత్యంధుల వెంటబడిపోయే అంధుడికి గమ్యం దొరకదు, ధర్మమూ తెలియదు. కనక నేను చెప్పే ధర్మరహస్యం విను.

పుత్రసముడయిన తమ్ముని భార్యను హరించిన అధర్మదోషం నీలో వున్నది. నీ సోదరుడు జీవించిఉండగానే ఈ దుష్కార్యం చేసిన నీకిది శిక్ష. కామవాంఛ నీకళ్ళు మూసేసింది. కోడలితో సమానురాలయిన రుమతో భోగాలనుభవించిన అధర్మానికిది శిక్ష.

రుమాయాం వర్తసే కామాత్ స్నుషాయాం పాపకర్మకృత్।
తద్వ్యతీతస్య తే ధర్మాత్ కామవృత్తస్య వానర॥
భ్రాతృభార్యావమర్శేఽస్మిన్ దండోఽయం ప్రతిపాదితః।

నువ్వే చెప్పినట్లు ధర్మరక్షణ జీవితలక్ష్యంగాగల ఇక్ష్వాకువంశంలో పుట్టిన నేను నీ అధర్మాన్ని సహించలేను. తోబుట్టువును, సోదరునిభార్యను కామమోహితుడై అనుభ వించేవాడికి మరణమే దండన. ఇది స్మృతి. ధర్మనిరతుడెవడూ స్మృతిని ఉపేక్షించడు.

మర్యాదవిడిచి, అధర్మాన్ని ఆరాధించే నీతో మేము స్నేహానికి చెయ్యిజాపుతా మను కున్నావా ! నాకు లక్ష్మణుడెంతో సుగ్రీవుడూ అంతే! ఆ సోదరుడికి అభయమిచ్చి ప్రతిజ్ఞ చేశాను. ప్రతిజ్ఞానుసారం నిన్ను సంహరించాను.

పాపాచారులు రాజదండనతో పాపవిముక్తులై స్వర్గం చేరుతారనీ, పాపాచారులూ, చోరులూ స్వయంగా రాజసన్నిధికి వెళ్ళి తమనేరాలను ఒప్పుకుని దండితులయినా, క్షమా భిక్ష పొందినా వారికి పాపఫలంలేదనీ మనువు చెప్పాడు. అందువల్ల మేము మనుమార్గం అనుసరించి మా కర్తవ్యం నిర్వర్తించామే కాని అక్రమమూ, అధర్మమూ లేదిక్కడ.

ఇక చాటున నిలబడి కొట్టడం దేనికని నీ ప్రశ్న. దానికి కారణం విను.

రాజులు మృగయావినోదులు. ఆవేటలో వారు ఉచ్చులు పన్నుతారు. ఎరవేస్తారు. ఇంకా ఎన్నోవిధాల మాటుపెట్టి మృగాలను సంహరిస్తారని ఎరగవానువ్వు. మత్తులో వున్నా అప్రమత్తంగా వున్నా మృగాలవేట అధర్మంకాదు. అందుచేత మేము నిన్ను చెట్టు చాటునుండి కొట్టినా, వెనకనుండి కొట్టినా అధర్మ మనుకోకు.

తన ప్రజలకు, సుఖమయ జీవితాన్నీ, ధర్మపాలననూ అనుగ్రహించేవాడు ప్రభువు. క్రోధావేశంతో నువ్వు ధర్మంతెలియక నోటికి వచ్చినట్టు పరుషభాషలాడు తున్నావు. అయినా నేను ఆవేశపడవలసిన పనిలేదు. ధర్మమార్గం బోధపడిందా ! అన్నాడు.

అంతవరకూ సంశయమేఘగ్రస్తమయిన వాలి మనస్సు ధర్మవాయు ప్రసారంతో నిర్మలాకాశం అయింది. రెండు చేతులూ జోడించి :

నరోత్తమా ! మావంటి సామాన్యులకు నీవంటివానితో వాదించేశక్తి ఎక్కడిది. క్రోధంలో నేనేదో అన్నాను. అందుకు క్షమాభిక్ష వేడుతున్నాను. ప్రజాహిత తత్పరు డవు, ధర్మార్థతత్వజ్ఞుడవు, దండనీతి నెరిగినవాడవు. నీకు నేను చెప్పగలిగింది లేదు. మృత్యుముఖంలో వున్న నాకు నా గురించి బాధలేదు. తారను గురించీ ఆలోచించను. ఎవరిని గురించీ నాకు చింతలేదు. కాని, అని క్షణం ఆగి :

గుణవంతుడయిన నాబిడ్డ అంగదుణ్ణి గురించి బాధపడుతున్నాను. అల్లారు ముద్దుగా పెంచుకున్నాను, వాడొక్కడే నాకు బిడ్డ, వాడిప్పుడు తండ్రిలేని బిడ్డ. వాడికి రక్షణయిస్తానని వాగ్దానం చెయ్యి. సుగ్రీవుడితో సమానంగా వాడికి అభయ ప్రదానం యివ్వవయ్యా. మీ లక్ష్మణుని ఎలా చూసుకుంటున్నావో వీరినీ అలాచూడు. తారను

సుగ్రీవుడు హింసించకుండా కట్టడి చెయ్యి. వీరందరినీ అనుగ్రహించు. ఇంతే నేను కోరేది, అన్నాడు.

వానరేశ్వరా ! ధర్మవిచారణచేసి దండనీతిని అనుసరించినవాడికీ, దండితుడికీ కూడా ఉత్తమలోకాలే ప్రాప్తిస్తాయి. అందుచేత మోహ శోక రహితుడవై నిర్మల హృదయంతో వుండు.

నీబిడ్డ అంగదుడు, నిన్నుచూసినట్లే సుగ్రీవుని చూసుకుంటాడు. నీకు చింత అవసరంలేదు, అన్నాడు రాముడు.

వాలి నేలకూలినవార్త అంతఃపురం చేరిపక్షణంలో తార శోకసంతప్త హృదయంతో అంగదుని వెంటబెట్టుకుని అంతఃపురం విడిచి వస్తున్నది. వాలి అంగరక్షకులు భయత్రస్తులై ఆవిడకు ఎదురు రాగా !

ఓ మహావీరులారా ! రామబాణాలతో సుగ్రీవుడు అకార్యం చేయిస్తే మీరుభయపడి పారిపోయి వస్తున్నారా ! అని అడిగింది.

మహారాణీ ! మీరు ఈబిడ్డతో ఎక్కడికయినా వెళ్ళి వీణ్ని రక్షించుకోండి. రాముడనే యముడు మా మహారాజును తీసుకుపోతున్నాడు, మన వానరులందరూ భయంతో పలాయనం చేస్తున్నారు. ఇప్పుడింక నగరద్వారం బంధించి, అంగదుని అభిషిక్తునిచేస్తే వీరంతా ఈయన శాసనం పాలిస్తారు. లేకపోతే వానరసేనలన్నీ పర్వతగుహలలో తల దాచుకుందికి పోతాయి. సుగ్రీవుడికి మామీదవున్న ద్వేషంతో ఇప్పుడేం చేసినా చేస్తాడు, అని భయపడుతూన్న వారిని చూసి తార :

నా ఆత్మనాథుడు ఏ బాణంతో నేలకూలాడో అదే బాణంతో నేనూ ఈలోకం వదిలేస్తాను, అని గుండెలుబాదుకుంటూ, గోలు గోలున విలపిస్తూ పరుగు పరుగున యుద్ధ భూమికి వెళ్ళింది.

పులిపంజాదెబ్బ తిని నేలకూలిన సింహంలా వున్న భర్తను చూసింది. అక్కడే ధనుర్ధారులయివున్న రామలక్ష్మణులనూ సుగ్రీవునీ చూసి, భర్తదేహంమీదపడి విలపిస్తూంటే, సుగ్రీవుని గుండె చెమ్మగిల్లింది.

తార : మహాయోధులను అనాయాసంగా నేలకూల్చిన నీ పరాక్రమం ఏమయింది లేచినీ పరాక్రమం ప్రదర్శించవయ్యా.

నీవంటి ప్రభువు కటికనేలమీద, బండరాళ్ళమధ్య పరుండరాదయ్యా. లేచివచ్చి అంతఃపురంలో హంసతూలికాతల్పం మీద శయనించవయ్యా, అని మరింత సేపు గోలు గోలున ఏడ్చి :

నీకు నాకంటే ప్రియురాలు లేదనేవాడివి. ఇప్పుడీ ధారుణీదేవి నాకంటె ఇష్టురా లయింది. కంటబడితే గాఢాలింగనంతో ఆదరించేవాడివి. ఇంత దీనంగా మీదపడి ఏడుస్తున్నా దగ్గరగా తీసుకోవేమయ్యా.

పూలవానలతో, తుమ్మెదల ఝుంకారంతో హృదయాహ్లాదం కలిగించే వసంతంలో ఈ వనాలలో ఎంతహాయిగా, విలాసంగా విహరించేవారం. ఆ శోభ యింక నా ముఖాన లేదా. నా సుఖ, శాంతులూ సంతోషమూ అన్నీ నీతోనే వేలపాలయాయి. నీవంటి హృదయేశ్వరుని ఈదశలో చూసికూడా నాగుండె బద్దలు కావటంలేదంటే నే నెంత రాతిగుండె దానిని.

ఎప్పుడూ నీ హితవుకోరే నేను చెపుతున్నా వినకుండా వచ్చావు. నాకు తెలు సయ్యా ఏదో కీడుమూడనున్నదని. తోడబుట్టిన తమ్ముడిభార్యను హరించి, వాణ్ణి నిర్వా సితుని చేసిన ఫలం యిలా కట్టి కుడుపుతున్నది.

ఏం చేస్తాం. అన్నిటికంటె కాలం బలీయమయింది. అది నిన్ను సుగ్రీవ రూపంలో వంచించింది. నీకేమయ్యా, నీ ధర్మబలంతో నువ్వు స్వర్గంలో అప్సరోభామ లతో ఆనందంగా వుంటావు. నీ అండ వున్నంతకాలం ఏబాధా ఎరగని నేను వైధవ్యంతో శోకసాగరంలో మునగాలి. మనబిడ్డ ఈ ముద్దులపట్టి అంగదుడు ఏమవుతాడు. క్రోధావేశ హృదయంతో నీ తమ్ముడు వీణ్ని ఏం చేస్తాడో. ఒక్కసారి ఈబిడ్డను దగ్గరగా తీసుకుని ముద్దాడి, వాడికి ధైర్యం కలిగించవయ్యా. రా నాయనా! ఇలారా. కడసారి నీ కన్న తండ్రిని కన్నులారా చూడు బాబూ! ఇదిగోనయ్యా, నీ బిడ్డ. ఎలా ఏడుస్తున్నాడో, ఏనాడూ ఏడుపు ఎరగనివాడు. వీణ్ని దగ్గరగా తీసుకుని ముద్దులాడు. 'అని సుగ్రీవుని వైపుకు తిరిగి:

ఏమయ్యా! నీ కోరిక తీరిందా! నీ గుండె చల్లబడిందా! అన్నగారు వెళ్ళిపోయాడు కదా. ఇంక రాజ్యభోగాలు అనుభవించు, అని మళ్ళీ వాలిదేహంమీదపడి:

ఓ ప్రాణేశ్వరా! చూడవయ్యా, నాతోపాటు నీ నారీజనం అంతా ఎలా విలపిస్తు న్నారో! అని, హృదయ విదారకంగా విలపించి:

మా అందరినీ విడిచినా కొడుకును విడిచిపోవడం న్యాయమా. మేమేందోషం చేశామని ఈ శిక్ష మాకు. ఈ పసివాడు నిన్నేంచేశాడని వాడి కీ దుస్థితి. చెప్పవయ్యా చెప్పు, అని తలవాల్చి ఏడుస్తున్నది. మిగిలిన భార్యలందరూ అతని పాద సమీపంలో రోదిస్తున్నారు.

అక్కడజేరిన అందరూ వారి ఆర్తనాదాలకు కరగిన గుండెలతో దీనంగా నిలబడ్డారు. అప్పుడు హనుమంతుడు రెండడుగులు ముందుకువేసి తారను సమీపించి:

అమ్మా! ప్రతిప్రాణీ తన పుణ్య పాపకర్మల ఫలాన్ని అనుభవించకతప్పదు. ఇది నీకు తెలియనిదికాదు. కాకపోయినా అవివేకిలా ఎందు కీ విచారం. ఈ శరీరం నీటి బుడగ. క్షణికమయిన ఈ బుద్బుదజీవితంకోసం శోకిస్తూ కూర్చోవడం సామాన్యలక్షణం. ఇప్పుడింక గతాన్ని గురించి కాదు యోచించవలసింది. నీ బిడ్డ అంగదుని గూర్చి ఆలోచించు. నీ ప్రభువుకి పరలోకక్రియలు సాగించాలి. లక్షల, కోట్ల వానర వాహినిని కనుసన్నలలో కదలించిన మహావీరుడు కాలవశుడై నేలకూలాడు. అమ్మా! ఇప్పు డీ వానర రాజ్యమంతా నీ స్వాధీనంలో వుంది. నీ బిడ్డతోపాటు ఈ వానరసేన అంతా నీ ఆజ్ఞకోసం నిరీక్షిస్తున్నది. నువ్వు కన్నీరు తుడుచుకుని, భర్తకు పరలోకక్రియలు పూర్తి చేయించి, నీబిడ్డను రాజ్యాధిపతినిచేసి హాయిగా వుండాలి, అని ఉపశమనవాక్యాలు వలుకుతూంటే, తార తలపైకెత్తి :

హనుమా! వెయ్యిమంది అంగదులు కలిసినా ఒక్కవాలికి సరితూగుతారా! ఇప్పుడు నేను భర్తకూ అగ్నిసంస్కారమూ చేయలేను, కొడుకుని సింహాసనమూ ఎక్కించలేను. ఒక్కటి మరచిపోకు, ఏ బిడ్డకయినా తండ్రీ, తండ్రివంక బంధువులూ ఆప్తులయినట్లు తల్లి ఆప్తురాలు కాదు. అందుచేత వీని పట్టాభిషేకవిషయం నాతో చెప్పకు. ఈ మహాయోధుని సేవ తప్ప నాకు మరేమీ తెలియదు, అని విలపిస్తూంటే, వాలి అతి ప్రయాన మీద కన్ను తెరచి, ఎదురుగా తలవంచి నిలబడిన సుగ్రీవునీ, అంగదునీ చూసి :

తమ్ముడూ! విధి ప్రేరణతో, అవివేకినై నీకు ద్రోహం చేశాను. ఉన్న యిద్దరం సుఖంగా కలిసివుండే రాత మన ముఖానలేదురా. నేను వెడుతున్నాను. ఈ సర్వ వానరరాజ్యానికీ నువ్వే అధిపతివి. చివరిమాట ఒక్కటి చెప్పాలి నీకు. ఎంత కష్టమైనా దాన్ని త్రోసిపుచ్చకు, ఈ అన్నగారి శాంతికోసం

నా బిడ్డ వీడు. వీణ్ని ఎంతో అనురాగంతో పెంచుకున్నాను. ఇంక వీడికి తండ్రి వుండడు. నువ్వే సర్వమూ. వాడిని సర్వవిధాలా రక్షిస్తానని మాట యియ్యి.

పీడు పరాక్రమంలో నీ అంతటివాడు. తరుణవయస్కుడు. శత్రుసంహారంలో వెనకడుగు లేదు వీడికి.

సరే, నువ్వూ ఎరుగుదువు, మీ వదిన తార విశేషప్రజ్ఞావంతురాలు. క్లేశాలలో విపత్తులలో నిబ్బరంగావుండి మంచిచెడ్డలు విచారించి నిర్ణయాలు తీసుకోగలదు. ఆవిడ నిర్ణయం ఏనాడూ వ్యర్థంకాదు.

"నహి తారామతం కించి దన్యథా పరివర్తతే"

మరొక్కమాట, ఈ రఘువంశీయుడు నిన్నుకోరిన సాయం పూర్తిగాచేసిపెట్టు. లేదా ఆ బాణం నిన్నుకూడా బలిగొనగలదు. ఇదిగో ఈ హేమమాల తీసుకో. ఇది విజయ దామం, అని తన మెడనున్న సువర్ణహారం తీసి యిచ్చాడు. సుగ్రీవుడు తలవంచి అందు కుని మెడలో వేసుకున్నాడు. అప్పుడు వాలి అంగదుని చేరబిలిచి :

నాయనా! దేశ కాలాలను గుర్తుంచుకొని, ఇష్టానిష్టాలకు పొంగి, క్రుంగకుండా సుగ్రీవుని ఆజ్ఞానుసారం ప్రవర్తించు. యికముందు నువ్వు నీయిష్టంవచ్చినట్లు ప్రవర్తించ కూడదు. నువ్వేం చేసినా నేను తండ్రినికనక సహించాను. ఆ సహనం అందరికీ వుండదు. ప్రభుసేవ నీకర్తవ్యం. రాజశత్రువులతోకాని మిత్రులతోకాని మంత్రాంగాలు సాగిస్తే క్షమించరు. మరొక్కమాట, ఎవరితో అయినా అతిస్నేహమూ, తీవ్రవైరమూ క్షేమంకరాలుకావు. ఈ మాటలు నీమనసులో వుంచుకో, అంటూండగానే వాలిచేతులు జారిపోయాయి. పెదవులు కదలడం మానేశాయి. కనురెప్ప మూతపడలేదు. తెరచిన నోరు తెరిచినట్లే వుంది.

అందరూ గొల్లుమన్నారు. శోకధ్వనులతో కిష్కింధలో గాలి కంపించింది. వృషభ హీనమయిన గో గణంలా వుంది వానరసేన.

నేలకూలిన చెట్టునవున్న లతలా వాలిపోయింది తార. కొంతసేపు మాటలేని శోకంతోనే వుంది. రెండు చేతులతో ముఖం కప్పుకుని :

ప్రాణేశ్వరా ! మమ్మల్ని ఏంచేసి పోయావయ్యా ! ఈ సర్వవానర, భల్లూక సంఘాలను అనాథులనుచేసి వెళ్ళావా ! ఎవరేమయితేనేం ! నీకు నాకంటె భూదేవిమీదనే ప్రీతి అని తెలిసింది. కాకుంటే ఈ సమయంలో మావైపు చూడకుండా వుంటావా. ప్రపంచంలో పిల్లలమీద అనురాగంవున్న తండ్రి ఎవడూ తనబిడ్డను యుద్ధ ప్రీతికల వీరుడి కిచ్చి పెళ్ళిచెయ్యడు. కాని మానాన్న నన్ను నీ కిచ్చి అనాథను చేశాడు.

శూరాయ న ప్రదాతవ్యా కన్యా ఖలు విపశ్చితా।
శూరభార్యా హతాం పశ్య సద్యో మాం విధవాం కృతా॥

అని మరింత సేపు విలపించి :

నీవంటి భర్తను కోల్పోయికూడా నేను జీవించి వున్నానంటే నాగుండె వజ్రనిర్మిత మయివుంటుంది. ఎందరు బిడ్డలున్నా, ఎన్నిసంపదలున్నా భర్తృహీన అనాథయే, అని గుండెలు బద్దలయేలా ఏడుస్తున్నది.

వానరవీరుడు నీలుడు వాలిగుండెలో గుచ్చుకున్న బాణం లాగడంతో రక్తధారలు ప్రవహించి ఆ పరిసరమంతా అరుణారుణమయింది. కొండగుహనుండి బయటకువచ్చిన కాలసర్పంలా వుంది ఆ బాణం.

అప్పుడు తార అంగదుని దగ్గరగా తీసుకుని :

నాయనా ! చూశావా ! అకారణవైరంతో మీ నాన్న యింతకు తెచ్చాడు. కడ సారి ఆయనకు నమస్కరించు బాబూ, అనగానే అంగదుడు తండ్రి పాదాలమీదపడ్డాడు.

సంగ్రామయజ్ఞాంతాన రామప్రహార నదీజలాలలో భార్యలేకుండా అవభృథస్నానం చేయడం న్యాయమా ! అని తార మరింత దయనీయంగా విలపిస్తూంటే, సుగ్రీవుడు గుండె లదరగాకన్నులు ఒత్తుకుంటూ అనుచరసమేతం రాముని సమీపించాడు. ధనుష్పాణియై రామభద్రుడు నిశ్చలంగా చూస్తున్నాడు.

సుగ్రీవ: రామభద్రా ! నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నావు. కృతజ్ఞుణ్ణి. అయితే ఈ దృశ్యం చూస్తూంటే నా జీవితంమీద నాకే అసహ్యం కలుగుతున్నది. ఈ రాజ్యం రాజ్య భోగాలు యివన్నీ నా కనవసరం. నా మనస్సు కివన్నీ పరమనింద్యాలుగా వున్నాయి. అంతటి అన్న గారు రక్తసిక్తగాత్రుడై ఈ కటికనేలమీద పడివున్నాడు. పట్టమహిషి తారాదేవి శోకమూర్తిలా వుంది. అంగదుడు సరే సరి. ఈ దశలో నాకు రాజ్యమా !

ఆయన నాకుచేసిన అన్యాయం, జరిపిన అవమానాలూ కారణంగా నిన్ను యిందుకు అర్థించాను. ఇన్నాళ్ళూ వున్న ఆ ఋశ్యమూకంమీదనే ఏదో ఆకూఅలమూ తింటూ గడపాలని వుంది. ఈ రాజ్యంమీద నా మనసు పోవడంలేదు. అలనాడు ఆయన నన్ను ఒక్క పిడిగుద్దుతో యమసదనం చేర్చగలిగి వుండీ ;

పోరా, నాకంటబడకుండా ఎక్కడో ఓచోట దొరికిన తిండితిని బ్రతుకు, అని వదిలేశాడు. ఆయన అంత ఉదారుడు. మరి నేనో చేజేతులా అటువంటి అన్నగారిని చంపించుకున్నాను. నావంటి నీచుడు మరొక డుండడు.

ఈ రోజు మొదటిసారి యుద్ధానికి నేను పిలిచినప్పుడు కూడా ఆయన నన్ను చంప కుండా, చిన్న చెట్టుకొమ్మతో కొట్టి పోరా! ఇంక మళ్ళీ రాకు, అని అన్నగారు తమ్ముడిని మందలించినట్టే పంపాడు, ఆయన పెద్దతనం భ్రాతృత్వం ధర్మదృష్టి విడవకుండా వున్నా నేను కామ, క్రోధ వశీభూతహృదయంతో కపిప్రకృతిని విడవలేకపోయాను. అధర్మ భూయిష్ఠమూ, వంశనాశంకరమూ అయిన యింతటి దారుణం సాగించిన నేను ప్రజాపాలనకు యోగ్యుడను కాను.

ఈవానరసమాజానికి కీడు తలపెట్టిన మహాపాపిని నేను. అగ్నిజ్వాలాతప్తమయితేనే బంగారంలో మకిలి పోతుంది. ప్రాయశ్చిత్తంతో కాని నా పాపం నశించదు. పుత్రనంతానం పెద్ద క్లేశంకాదు. కాని అంగదునివంటి ఔరసుడు కలగడం అసంభవం. పితృశోకంతో ఈ అంగదుడు జీవిస్తాడనే నమ్మకంలేదు. వాడు కన్నుమూస్తే తారాదేవి జీవించదు ఇంక నే నెందుకు బ్రతకాలి. ఈ వానరులందరూ సీతాన్వేషణం చేసి నీకు తోడు పడతారు. ఈ అగ్నిలో నేను జీవయాత్ర చాలిస్తాను, అన్నాడు దుఃఖభరితహృదయంతో.

అప్పటికి తారను వాలినుండి పక్కకు తప్పించారు, వానరప్రముఖులు. ఆవిడ శోకసాగరం కట్టలు తెంచుకుంది. రాముని హృదయాన్ని విషాదం ఆవరించింది. మెమ్మదిగా వీరందరినీ అనునయించబోగా, తార కన్నులెత్తి, కోదండధరుడైవున్న రాముని చూచి :

ఓ రఘువంశీయుడా! ధర్మనిష్ఠాగరిష్ఠుడవనీ, జితేంద్రియుడవనీ, వివేకివనీ, నీ గురించి విన్నామయ్యా. సింహవిక్రమంతో శరచాపధారివై దివ్యంగా విరాజిల్లే నీకు యశోధరుడవనీ ధర్మాధర్మజ్ఞానం లేదని ఎలా అనుకోను.

భర్తకు ఆత్మ భార్య. ఇటువంటి ఆత్మనువదలి ఆయన ఒక్కడూ స్వర్గంలో ఎలా వుండగలడయ్యా. ఇంద్రలోకంలోని అప్సరసలుకూడా ఆయనను నానుండి వంచించలేరు. నేను లేనిదే ఆయనకు సుఖంలేదు. ఏబాణంతో ఆయన ప్రాణాలు తీశావో అదేబాణంతో నా గుండె చీల్చవయ్యా. అలా మా యిద్దరినీ కలిపి పుణ్యం కట్టుకోవయ్యా, జానకీ విరహదుఃఖం ఎరిగినవాడివి. తారావియోగశోకంలో ఆయన ఎలావుంటాడో గ్రహించ లేవా. ఆయన లేకుండా నేను క్షణం జీవించలేను. త్వరగా నన్ను నా భర్తతో చేర్చు, అని విలపిస్తూంటే రాముడు.

ఓ వీరపత్నీ! ఈ జగత్తు కాలచోదితమై, విధికివశమై సాగుతూంటుందని ఎరగని దానివా నువ్వు. నీవంటి వివేకంకల స్త్రీ ఇలా సామాన్యవలె శోకించడం ఉచితమా!

ఇప్పుడు నీసుఖానికి ఏమీలోటులేదు. నీకొడుకు అంగదుడే యువరాజు కాగలడు మహావీరుని పత్నివి. ఇలా గుండెలు బద్దలయేలా విచారిస్తావా! తప్పు, తప్పు, కన్నీరు ఒత్తుకో, అని అంగద, సుగ్రీవులను నమీపించి:

ఎంతసేపు ఏడ్చినా పోయిన ప్రాణి తిరిగిరాదు. ఇంక ఈ మహావీరుడికి ఉత్తరలోక క్రియలు సాగించాలి ఈ ప్రపంచం అంతా ఒకానొక నియమంమీద ఆధారపడి నడుస్తున్నది మన మందరం దానికి బద్ధులమై సాగుతాం. దాని ప్రేరణతోనే ఎవరయినా ఏమయినా చేస్తారు. దానికి రాగ ద్వేషాలూ, పక్షపాతాలూ లేవు కాలానికి బంధువులూ, శత్రువులూ వుండరు. ఇప్పుడు వాలి తన కర్మఫలానుసారం కాలవశుడయాడు శూర ధర్మానుష్ఠానంతో ప్రాణత్యాగం చేసిన ఆయన వీరస్వర్గం అలంకరిస్తాడు. ఆయనకు ఉత్తరక్రియలు జరపడం యిప్పుడు మన కర్తవ్యం అన్నాడు.

అప్పుడు లక్ష్మణుడు అంగదుని ఓదార్చి, వానరప్రముఖులను పంపి నగరం నుంచి శిబిక తెప్పించి, నేతికుండలూ, నూనెపాత్రలూ రప్పించాడు

శిబికమీద వాలి దేహం వుంచి పూలతో అలంకరించారు. దృఢకాయులు శిబికను బుజాలమీద కెత్తుకున్నారు.

మహావీరా! మహావీరా! అని నినాదాలుచేస్తూ నదీతీరంచేరి, ఇసుకతిన్నెమీద చితి పేర్చారు. వాలి దేహాన్ని కిందపెట్టగానే అందరూ దూరంగా నిలబడ్డారు. పట్ట మహిషి తార, ఆ దేహంమీద పడి గోలు గోలున విలపించింది, నెమ్మదిగా ఆమెను తప్పించి, సుగ్రీవుడు ఆ మృతదేహాన్ని చితిమీద పెట్టగా అంగదుడు నిప్పుముట్టించాడు.

విధ్యుక్తంగా అగ్నిసంస్కారం జరిపి, అనంతరక్రియలన్నీ చేయించాడు రాముడు. సర్వకర్మలూ ముగించి, తడిబట్టలతోనే సుగ్రీవుడు వచ్చాడు. వెంటవచ్చిన హనుమంతుడు రాముని నమీపించి:

ఆర్యా! ఇప్పుడింక మీరు నగరం ప్రవేశించి మా కర్తవ్యం బోధించండి, అన్నాడు.

మారుతీ! పదునాలుగేళ్ళు నగరంలో కాలుపెట్టకూడదయ్యా నేను. కనక మీరే అభిషేకం జరిపించండి, అని సుగ్రీవునిచూచి:

వానరేశ్వరా! నీతో సమమయిన బలపరాక్రమాలుకల అంగదుని యువరాజుగా అభిషేకించు. ఇక నాలుగుమాసాలు వర్షాకాలం. ఇప్పుడు మనం ఏప్రయత్నమూ చెయ్య లేము. నే నీ పర్వతగుహలోనే ఈ నాలుగునెలలూ గడుపుతాను. అనంతరం రావణవధ జరపాలి. నువ్వు నగరానికి వెళ్ళు. బంధుమిత్ర సమక్షంలో సింహాసనం అధివసించు, అన్నాడు.

# సుగ్రీవ పట్టాభిషేకం

రాముని ఆజ్ఞతో సుగ్రీవుడు కిష్కింధలో అడుగుపెట్టాడు. వానరప్రముఖులు ప్రధానులు తమ నూతనప్రభువుకు సముచితరీతిని స్వాగతం పలికారు. పాదాభివాదం చేసినవారందరినీ మర్యాదతో లేవనెత్తి గాఢాలింగనం చేసుకున్నాడు అనంతరం దేవగణాలు ఇంద్రుని అర్చించినట్లు వానరులు సుగ్రీవుని అభిషేకించారు.

స్వర్ణదండంమీద శ్వేతఛత్రం. హేమదండానికి కట్టిన చమరీవాలాలు. క్షీర పూర్ణములయిన వృక్షాంకురాలు, రత్నాలు, ఓషధులు, శ్వేతవస్త్రం, శ్వేతమాల్యాను లేపనాలు, వ్యాఘ్రచర్మం, తేనె, ఆవాలు, పెరుగు, గంధాక్షతలు, సూకరచర్మంతో కుట్టిన పాదరక్షలు, గోరోచనం, మణిశిల....ఇలా పట్టాభిషేకసామగ్రి క్షణాలలో సమకూర్చారు. రూప యౌవన సంపన్నులయిన షోడశకన్యకాజనం నిలబడింది.

ద్విజశ్రేష్ఠులు అగ్నిని ప్రజ్వలింపజేశారు. తూర్పుదిక్కుగా సింహాసనం ఉంచి, సువర్ణకలశాలలో సర్వనదీజలాలూ నింపి అభిషేకించారు. సర్వవానరులూ జయ జయ ధ్వానాలు చేశారు

అనంతరం సుగ్రీవుడు అంగదుని యౌవరాజ్య పీఠంమీద ఆసీనుని చేశాడు. కిష్కింధావాసులందరూ హర్షోల్లసిత హృదయులయారు.

అభిషేకకాండ పూర్తికాగానే సుగ్రీవుడు వెళ్ళి రామునికి వివరాలన్నీ నివేదించాడు. ఆయన ఆనందంతో సుగ్రీవునికి సెలవిచ్చాడు. వానరేశ్వరుడు అంతఃపురానికి వచ్చి రుమాద్వితీయుడై సాంసారిక సుఖభోగ మగ్నుడయాడు.

సుగ్రీవుడు రాజ్యాభిషిక్తుడయిన అనంతరం రామలక్ష్మణులు ప్రస్రవణగిరికి వచ్చారు ఆ కొండమీద ఒకగుహ వాసస్థానం చేసుకున్నారు ఆప్రాంతం రకరకాల వృక్షాలతో, వాటిమీద అల్లుకున్న లతలతో, సమీపంలోనే సరోవరంతో, పరిసరాలలో సెలయేళ్ళతో, కొండదిగువ నదితో అలరారుతోంది. ఆ కొండమీద సింహ, శార్దూల, భల్లూకాలు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి.

రామ లక్ష్మణులు వసించే కొండగుహ ఈశాన్యాన పల్లంగా, వెనుకభాగం ఎత్తుగా వుండడంవల్ల వానలుకాని తీవ్రమయిన గాలులుకాని భాధించేవికావు. తూర్పుదిక్కుగా ప్రవహిస్తున్న నది త్రికూటగిరి శిఖరంమీద గంగానదివలె వున్నది. ఆ నదికి యిరువంకలా

సాలుతీరి పెరిగినచెట్లు లతలు నదీమతల్లికి అలంకారాలుగా వున్నాయి. హంస, సారస, చక్రవాకాది జలపక్షుల కలస్వనాలు శ్రవణపేయంగా వినిపిస్తున్నాయి.

ఆ కొండగుహ ఎదుట శిలాఫలకంమీద కూర్చుంటే కిష్కింధ స్పష్టంగాకనిపిస్తూ, జనశ్రుతి కోలాహలం వినిపిస్తుంది.

ఇన్నాళ్ళకు సుగ్రీవుడు భార్యావిరహవిమోచనం పొందినందుకు రాముడు సంతుష్టాంతరంగుడయాడు.

ప్రస్రవణగిరిమీద ఏ సుందరవస్తువును చూచినా రాముని మనసులో సీత ఆకృతు స్ఫుట. లక్ష్మణుడు అన్నగారిని సాంత్వనవచనాలతో అనునయిస్తున్నాడు.

అన్నా ! ధర్మస్వభావుడు, నిరంతరయత్నశీలీ ఐన నీవంటివాడు శోకవశీభూతుడు కాకూడదు. ఈధరణీచక్రాన్ని తలక్రిందులు చేయగల శక్తిసంపన్నుడవు. నీకు రావణు డొకలెక్కా, ఈవానకాలం నాలుగుమాసాలూ గడవగానే రావణుడు వంశాంకురం లేకుండా నీ బాణాగ్నిలో భస్మమవుతాడు, అని తమ్ముడు ఉత్సాహం కల్పిస్తూంటే రామచంద్రుడు :

సౌమిత్రీ ! ఉత్సాహం సర్వసిద్ధులకూ మూలం, అప్రతిహత పరాక్రమప్రదర్శనకు ఉత్సాహమే ప్రధానం. మనవల్ల ఉపకారం పొందిన సుగ్రీవుడు ప్రత్యుపకారం చెయ్య కుండా ఉంటాడా. ఈ నాలుగుమాసాలలో నదీజలాలు కలకదేరి స్వాదువు లవుతాయి. అలానే సుగ్రీవుడు కూడా ప్రయత్నశీలి అవుతాడనుకుందాం, అన్నాడు. అంతలో వార్ష కాభ్రాలు ముసిరాయి. వానజల్లులముసుగులో ప్రస్రవణగిరి గుహలో వున్న రాముడు :

తమ్ముడూ ! సూర్యకిరణాలసాయంతో సముద్రజలాలు త్రాగిన ఆకాశం పూర్ణగర్భి ణిలా వుంది. మేఘసోపానాలమీదుగా పయనించే సూర్యునికి ఈపువ్వులన్నీ అలంకారాలుగా వున్నాయి అటుచూశావా, సంధ్యాకాలమేఘాలు రక్తశోభతో ఆకాశపు శరీరంమీద మందు గుడ్డల పట్టీలవలె వున్నాయి.

గ్రీష్మభానుతప్తమయిన ఈభూమి వానజల్లులతో తడిసిన దృశ్యాలు నాకు జానకి శోకనయనాలను స్మృతికి తెస్తున్నాయి. ఆ మేఘాల చల్లదనంతో మొగలి డొంకలమీదుగా వచ్చేగాలులు ఈ పర్వతాన్ని సుగంధంతో అభిషేకిస్తాయి. మేఘమే కృష్ణాజినంగా, వర్ష ధారలే యజ్ఞోపవీతంగా ఈపర్వతబ్రహ్మచారులు వాయుపూరిత గుహలతో అధ్యయన నాద దీక్షలో వున్నాయి.

అదిగో ! ఆ నల్లమబ్బులో మెరుపుచూశావా ! రాక్షసరావణుడు హరించిన సీత పెనుగులాటలా లేదూ. దిగంతాలకు వ్యాపించిన మేఘాలతో చిమ్మచీకట్లు క్రమ్మాయి. ఈ

గిరిమల్లికలు నవజలసేచనంతో హృదయానికి గిలిగింతలు పెడుతున్నాయి ఈ వానలతో దుమ్ము అణగిపోయింది గ్రీష్మకాలపు తాపబాధలు చల్లారినాయి. హంసలు మానస సరోవరానికి సాగుతున్నాయి చక్రవాకాలు తమ ప్రియులతో ఎలా సుఖిస్తున్నాయో వానకు తడిసిన బాటలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి

క్వచిత్ప్రకాశం క్వచిదప్రకాశం నభః ప్రకీర్ణాంబుధరం విభాతి।
క్వచిత్ క్వచిత్ పర్వత సన్నిరుద్ధం రూపం యథా శాంత
మహార్ణవస్య।

ఆకాశంలో ఒకచోట ఎండకాస్తున్నది, మరొకచోట వెలుగుకి అవకాశంలేదు అక్కడక్కడ పర్వతావరుద్ధమయి నిస్తరంగ సముద్రంలావుంది మేఘావృతాకాశం.

ఈ కొండవాగులు యిప్పుడిప్పుడే కురిసిన వాననీటితో, ఆ ప్రవాహంలో కొట్టుకు వచ్చే పూలరాసులతో, పర్వతంమీది ధాతురజంతో ఎంత శోభిస్తున్నాయో, ఆ వాగుల వెంబడే మయూరాల క్రేంకారాలు, మత్తుతోచేసే నాట్యాలు.

రసాకులం షట్పద సన్నికాశం
ప్రభుజ్య తం జంబుఫల ప్రకామం।
అనేకవర్ణం పవ నావధూతం
భూమౌ పత త్యామ్రఫలం విపక్వం।

వల్లని గండుతుమ్మెదలవలె కనిపించే రసభరితములైన నేరేళ్ళు, పక్వమైరంగుల కాంతులతో వున్న మామిడిపళ్ళు గాలితాకుడుకు టప టప రాలుతున్నాయి చూశావా.

కొంగలబారులే పూలమాలలుగా, విద్యుత్కాంతులే పతాకాలుగా గల పర్వత సన్నిభమేఘాలు యుద్ధభూమిలో మదపుటేనుగుల్లా వున్నాయి. మరీ జలభారంతోవున్న మబ్బులు కొండశిఖరాలమీద విశ్రాంతి తీసుకుంటున్నాయి వానచినుకుతోపుట్టే ఎర్రని ఆరుద్రపురుగులతో, పచ్చికబయళ్ళతో అరుణలతాలంకృతమయిన పీతవసనంతో వున్న నాయికలా వున్నది భూదేవి.

ఈకాలంలో నదులన్నీ తీవ్రవేగంతో సముద్రాన్ని చేరుతాయి. నిద్ర మహావిష్ణువును చేరుతుంది. కొంగల బారులన్నీ మేఘమండలాన్ని ఆశ్రయిస్తున్నాయి. కామిజనం తమ ప్రియా పరిష్వంగాభిలాషతో వెడుతుంది

మేఘగర్జనలు, నదీప్రవాహధ్వనులు, మత్తగజఘీంకారాలు, ఈ వర్షరాజుకు ఎంత ఘనంగా స్వాగతం పలుకుతున్నాయో. అలా ఆ వర్షాశోభను తిలకిస్తూ రామ లక్ష్మణులు రోజులు గడుపుతున్నారు.

సెలయేటి మర్మరధ్వనులతో, మొగలిపూల సౌరభాలతో మత్తెక్కిన గజయూథాలు వనమయూర క్రేంకారాలతో శ్రుతికలపడానికి ప్రయత్నిస్తున్నాయి. కడిమిచెట్టు కొమ్మల మీద పెట్టిన తేనెపట్టును చేరడానికి ప్రయత్నించే మధుపాలు వావజల్లుల తాకిడితో దూర దూరాలకు పోతున్నాయి. నిండారపండిన వేరేళ్లు గండుతుమ్మెదల్లా కనిపిస్తున్నాయి.

భ్రమరాల షడ్జమధ్యానగీతాలు, నెమళ్ళ నృత్యాలు, గంధగజేంద్రాల ఉన్మత్త విహారాలు, అర్జున కదంబవృక్షాల పూగుతుల పరిమళాలు, కొత్తనీటితో సెలయేళ్ళు ఇవన్నీ ఈ అరణ్యాన్ని పానశాలగా చూపుతున్నాయి.

మూర్ధాభిషిక్తుడయిన మహారాజులావుంది వానతో శిఖరాలు తడిసిన పర్వతం. ఆ ఉత్తుంగశిఖరాలనుండి జారిపడే జలధారలు, మహారాజు మెడలోని ముత్యాల హారాలవలె వున్నాయి.

పక్షులు గూళ్ళకు చేరుతూంటే, పద్మాలు ముకుళితాలవుతూంటే, మాలతీ లతలు వికసిస్తూంటే సూర్యాస్తమయం అవుతున్నదని తెలుస్తున్నది.

అక్కడ భరతుడు వ్యవసాయావసరకార్యాలు సాగించి, చాతుర్మాస్యదీక్షకు పూనుకుంటాడు. సరయూనది వరదలతో వుంటుంది.

సౌమిత్రీ! ఈ వర్షాకన్య అప్పుడే యౌవనదశకు చేరుకున్నది. సుగ్రీవుడు తన భార్య రుమతో సుఖభోగాలలో తేలియాడుతూంటాడు. ఆనందసాగరసంగమం అతనిది. నేనో! భార్యావియోగంతో ప్రవాహవేగానికి కోతపడే నదీతటంలా వున్నాను.

భార్యావియోగశోకం, నిరంతరధారావర్షం, రావణునివంటి క్రూరశత్రువు, ఈ మూడూ నన్ను పీడని బాధలు.

సుగ్రీవుడు మనలను వీడివెళ్ళేనాడు, వచ్చేది వానకాలమనీ, పైగా అప్పుడే అతను దుఃఖముక్తుడయి భార్యాసుఖానుభవానికి వెడుతున్నాడనీ మనం ఏవిషయమూ మాట్లాడలేదు. సమయం రాగానే ఆయనే వస్తాడని భావించాం. నేదులు కలకదేరగానే సుగ్రీవుడు మన యందు అభిమానంతో రావాలి, అన్నాడు.

రామభద్రా! సుగ్రీవుడు తప్పకుండా వస్తాడు. వర్షాకాలం పూర్తికాగానే మీ మనప్రయత్నాలు ఆరంభించవచ్చు, అన్నాడు, లక్ష్మణుడు.

క్రమంగా మేఘగర్జనలు సన్నగిల్లినవి. మెరుపుల నాట్యాలు దూరమయాయి. తెల్ల తెల్లగా వెన్నెల వ్యాపించి, సారస పక్షుల మధురగానాలు శ్రవణసుఖంగా సాగుతున్నాయి.

సుగ్రీవుడు రాజ్యభోగాలలో మునిగితేలుతున్నాడు. నిరంతరం కామమత్తుడై ప్రమదా జనమధ్యంలోనే వుండి, రాచకార్యాలన్నీ మంత్రులమీద వదిలేశాడు. దివారాత్రభేదం లేకుండా, అంతఃపురం వీడకుండా వున్న మహారాజును సమీపించి హనుమంతుడు:

ప్రభూ! తమకు రాజ్యలక్ష్మి కైవసమయింది, దానితో కీర్తికాంత మిమ్ము చేరింది. మనం చేసిన వాగ్దానానుసారం మిత్రకార్యం నెరవేర్చవలసిన అవసరం సన్నద్ధమయింది. ప్రభువయినవాడు కోశాగారాన్ని, సేనానివహాన్నీ, మిత్రకోటినీ ఆత్మసమంగా చూసుకుంటేనే అభ్యుదయం పొందుతాడు. మిత్రకార్యాలను విస్మరించినవాడికి అనర్థాలే ఎదురవుతాయి. రామచంద్రుని శక్తిసామర్థ్యాలు మనకుతెలును ఆయన ఏమాటా మళ్ళీ మళ్ళీ చెప్పడు. ఆయన చెప్పేవరకూ ఊరుకోవడమూ ఉచితంకాదు, మిత్రులకు మేలుచేయడమే పరమ ధర్మంగా భావించే మీరు, మీకింతటి ఉన్నతిని ప్రసాదించిన ఆ మహాపురుషుని విషయమై ఉదాసీనంగా ఉండరాదు.

జానకీదేవి ముల్లోకాలలో ఎక్కడవున్నా వెదకి రావడానికి మే మందరం సిద్ధంగా వున్నాం. మీ ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ, అన్నాడు.

సమయోచితమయిన హనుమంతుని ప్రబోధంవిని సుగ్రీవుడు వానిని ప్రశంసించి, సేనాపతిని రావించి ఎక్కడెక్కడున్న వానరులనూ రప్పించమన్నాడు. ఆయన నోట మాట రావడంతడవుగా వానరులు దిశాంతాలకు సుగ్రీవాజ్ఞ వినిపించారు.

పదిహేనురోజులలో కిష్కింధకు రాని వానరులకు శిరశ్ఛేదమే శిక్ష అనికూడా సుగ్రీవుడు ప్రకటించాడు. వానర ప్రముఖులను తీసుకురావడానికి అంగదుడూ, హనుమంతుడూ వెళ్ళాలని ఆదేశించాడు.

ఆకాశం నిర్మలమవుతున్నది. రాముని హృదయంలో సీతావియోగభారం ప్రవృద్ధ మవుతున్నది. రాత్రులలో కొండ కొమ్ముమీద చేరి సీతావియోగం అనుభవిస్తున్నాడు. ఏమూలనో సారసపక్షికూత వినవస్తుంది. అది చెవినిపడగానే సీతాదేవి కంఠస్వరం కాదు గదా అని ఉలికిపడతాడు. నిండుగా పూసిన లతలతో తరుశాఖలు గోచరిస్తాయి, సీత

లసి ఈ శోభ దేనికి అని నిట్టూరుస్తాడు రాజహంసల కలస్వనం సాగివస్తున్నది ఈ సంగీతం వింటూ లేచేది సీత. ఇప్పుడెటువంటి దశలోవున్నదో. చక్రవాకాలు కనిపిస్తే వాటితో కలిసినవ్వుతూ ఆడుకునే సీత యిప్పుడెలా బాధపడుతున్నదో

ఇప్పుడీ సరోవరాలు, సెలయేళ్ళు, నదులు, వనాలు, ఏపీ ఆయన మనస్సును ఆకర్షించడంలేదు. చిత్తశాంతి నివ్వడంలేదు. ఈ శారదవేళ ఆమెమనస్సు ఎంతగా మథనపడుతున్నదో అని కంట తడి పెడుతున్నాడు.

ఫలాలకోసం అడవిలోకి వెళ్ళివచ్చిన లక్ష్మణుడు అన్నగారి దగ్గరచేరి: నీ వంటి వాడు యిలా శోకవశీభూతుడయి చిత్తస్థైర్యాన్ని కోల్పోకూడదు. మనను నిబ్బరం చేసుకుని, ప్రసన్నచిత్తంతో వుండాలి. సుగ్రీవుని సాయంతో మనంకార్యోన్ముఖులం కావాలి. ప్రజ్వలితవహ్నిని ముట్టినవాడు సద్యఃకాలంలో ఆ అగ్నిశిఖలలో దహించుకు పోక తప్పదు. అలావే సీతను హరించినవాడున్నూ, అని ఓదారుస్తున్నంతసేపూ విచారరహితుడై రాముడు:

సౌమిత్రీ! ఇంద్రుడు వర్షధారలతో భూమిని సస్యశ్యామలంచేశాడు. కాలమేఘాలు పర్వతాలమీద, నగరాలలో, పంటభూములలో వర్షించి విశ్రాంతి తీసుకున్నాయి. తీవ్రంగా వీచేగాలులు మందగతిలో పడ్డాయి. ఏనుగుల ఘీంకారాలు, నెమళ్ళ కేకారవాలు, సెలయేళ్ల మర్మరధ్వనులు సన్నగిల్లాయి వర్షధారతో స్వచ్ఛములయిన కొండకొమ్ములమీద వెన్నెలలు ఎలామెరుస్తున్నాయో! నదీసికతాతలాలు శోభనాంగి ఊరువులవలె ఎలావున్నాయో, సూర్యకిరణశోభతో వికసించిన పద్మాలునిండిన సరోవరాలు, మానససరోవరం నుండి దిగి వచ్చిన హంసలతో ఎంతరమణీయంగా వున్నాయి. పాపం ఆ నెమళ్ళు చూశావా! మేఘరహితమయిన ఆకాశ దర్శనంతో ఆనందహీనములైన నేత్రాలతో ప్రియురాలివైపు ఎంత దీనంగా చూస్తున్నాయో!

మత్తగజాన్ని అనుసరించి ఆ ఆడుఏనుగులగుంపులు పుష్పగంధాస్వాదనంచేస్తూ ఎంతహాయిగా కామక్రీడకు సాగుతున్నాయో! శరత్కాలపు గాలులతో ఉత్సాహం రేగిన వృషభాలు ఆవులమందలలో ఎలా పోట్లాడుకుంటున్నాయో. వర్షధారలలో పుట్టలువీడిరాని విషసర్పాలు ఆకలితో ఎలా బుసలుకొడుతూ లేస్తున్నాయో!

చంచచ్చంద్రకరస్పర్శ హర్షోన్మీలిత తారకా।
అహో రాగవతీ సంధ్యా జహాతి స్వయమంబరం॥

చంద్రకిరణస్పర్శతో పులకించిన నక్షత్రాలతో నిండిన ఆకాశాన్ని అరుణరాగరంజిత అయిన సంధ్యారాగిణి తనంతతానై విడిచి వెడుతున్నది.

చంద్రుడు చూశావా, రజనీకాంతవదనంలా వున్నాడు. తారాతోరణాలు ఆమె సుందరనయనాలవలె వున్నాయి. ఈ వెన్నెల ఆవిడ కట్టిన మేలివలివంవలె వున్నది. ఆ కొంగల బారులు ఆకాశంలో ఎగిరే తెల్లని పూలమాలల్లా కనిపిస్తున్నాయి.

విరిసిన పూలదొన్నెలలో మకరందం తాగి మత్తెక్కిన భ్రమరాలు రెక్కలమీది పుప్పొడికాంతులతో ఎంత చిత్రంగా వున్నాయో!

అప్పుడే రాజవీరులు యుద్ధప్రయత్నాలు సాగిస్తూంటారు. ఈ వానకాలం నాలుగు మాసాలు నాలుగు శతాబ్దాలుగా గడిచాయి. అయినా సుగ్రీవుని కిదేమి పట్టినట్టులేదు. సీతా వియోగదుఃఖం నన్ను క్షణ క్షణం దహిస్తున్నది, రాజ్యంలేదు, భార్యను రావణు డెత్తుకుపోయాడు, శోకతప్తహృదయంతో వున్నాను. అందువల్లనే సుగ్రీవుడు ఉపేక్షిస్తు న్నాడు. వానలు వెనుకబడగానే సీతాన్వేషణకు ఉపక్రమిస్తానన్న వానరేశ్వరుడు ఉదా సీనంగా వున్నాడు. ఆయన కోరిక తీరింది కనక నిశ్చింతంగా అంతఃపురంలో కాలం గడుపుతున్నాడు. మన మింక ఆలస్యం చెయ్యకూడదు. నువ్వు కిష్కింధకు వెళ్ళి సుగ్రీవునితో యిలాచెప్పు :

ఓయీ, కార్యార్థులమై నిన్ను ఆశ్రయించాం. నీకిచ్చిన మాటప్రకారం నీ శత్రు వును సంహరించాం. నువ్వు మాకుచేసిన వాగ్దానాన్ని విస్మరించి నట్లున్నావు. ఆడినమాట తప్పినవాడు లోకంలో ప్రజానిందపాలవుతాడు. చేసిన ప్రతిజ్ఞ నిలుపుకోలేనివాడు అధముల శ్రేణిలో చేరుతాడు. ఉపకారంచేసిన స్నేహితులకు ప్రత్యుపకారం చేయనివాడి శవాన్ని కాకులుకూడ ముట్టవనిచెప్పు.

రామధనుష్టంకారం వినాలనే కోరిక వున్నదేమో అడుగు. ఆయన ఎంత కామోప భోగాలతో తేలియాడుతూ జ్ఞానశూన్యుడయి వున్నా ఈ ధనుష్టంకారం మరచివుండకూడదు. పైగా నీవంటి తమ్ముడు నావెంట వున్నాడని విస్మరించాడేమో తెలుసుకురా!

అగ్నిసాక్షిగా అతనితో ఎందుకు స్నేహంచేశానో, వాలివంటి మహావీరుని ఎందుకు వధించానో గుర్తుచెయ్యి. వానకాలం వెనకబడగానే సీతాన్వేషణం చేస్తానన్నవాడు బంధు మిత్రజనంతో మధుపానమత్తుడై, కామలీలలు సాగిస్తున్నట్టున్నాడు ఇన్నిమాటలు దేనికి. సౌమిత్రీ! నువ్వు సుగ్రీవుని సమీపిస్తూనే :

నచ సంకుచితః పంథా! యేన వాలీ హతో గతః।
సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలి పథమన్వగాః॥

ఏక ఏవ రణే వాలీ శరేణ నిహతో మయా ।
త్వాంతు సత్యాదతిక్రాంతం హనిష్యామి సబాంధవం ॥

వాలి వెళ్ళిన దారి యింకా అలావేవుంది. ఆడినమాట తప్పితే ఆ దారివే సువ్వూ వెళతావు. లేదా నీమాట నిలబెట్టుకో. అప్పుడు వాలినొక్కడినే సంహరించాను. ఇప్పుడు నువ్వు బంధుమిత్ర సమేతం వెళ్ళవలసివస్తుందనీ, అనవసరంగా మన ఆగ్రహానికి గురికాక త్వరగా కార్యసాధనకు ఉపక్రమించమనీ చెప్పు, అన్నాడు.

విన్న లక్ష్మణుడు: రామభద్రా! సుగ్రీవుడు వానరుడు. వారికి సజ్జనులతో వ్యవహారం తెలియదు. అగ్నిసాక్షిగా నీతో సఖ్యం లభించినందువల్లనే తనశత్రువు నిహతుడై రాజ్యభోగాలూ, భార్యా సుఖమూ లభించాయని మరచివుంటాడు. అదే నిజమయితే ఆ సింహాసనం మీద యింకెంతో కాలం వుండడు. ఇటువంటి కృతఘ్నుడికి తక్షణం శిక్షపడాలి. నాలో క్రోధం క్షణ క్షణం ప్రవృద్ధమవుతున్నది. ఇప్పుడే వెళ్ళి వానిని కడతేరుస్తాను. అప్పుడు అంగదుడు మనపని చేసిపెడతాడు, అంటూ ధనుష్పాణియై నిలబడగా రాముడు: సౌమిత్రీ! రఘువంశీయులు మిత్రవధకు పూనుకోరాదు. వివేకాన్ని విడిచి క్రోధాన్ని ఆశ్రయించకూడదు. నువ్వువెళ్ళి సౌమ్యంగా, మిత్రవచనాలే పలకాలి అని మెల్లగా అన్నాడు.

లక్ష్మణుడు కిష్కింధానగరద్వారం సమీపించాడు. కాలాగ్ని సన్నిభమూ, ఇంద్రచాపసదృశమూ అయిన ధనుస్సును చేబూని వచ్చే లక్ష్మణుని చూచిన సర్వవానర వాహినీ భయత్రస్తమయింది. కొందరు చెట్ల చివరికొమ్మలెక్కారు మరికొందరు పర్వత శిఖరాలకు లంఘించారు. వారిలో నలుగురు మాత్రం త్వరత్వరగా అంతఃపురంవైపు పడిచారు.

తారతో కామభోగాలలో తేలియాడే సుగ్రీవునికి ఈ కల్లోలాలేమీ వినిపించలేదు. అప్పటికి సేనానుల ఆజ్ఞానుసారం మహాబలులయిన వానరులు విశాలవృక్షశాఖలతో, మహా శిలాఖండాలతో కోటగోడలమీద నిలబడ్డారు. అదిచూసిన లక్ష్మణుడికి కోపం రేగింది కన్నులలో చింతనిప్పులు పుడుతున్నాయి. నిట్టూర్పులలో వేడిగాలులు లేస్తున్నాయి బాణాలు వాలుకలుగా, ధనుస్సు ఫణామండలంగా తేజస్సు కాలకూటంగా అయిదుతలలపాములా కనపడే సౌమిత్రిని చూచి గజగజలాడుతున్నది వానరసేన. అప్పుడు అంగదుడు కంపితగాత్రంతో లక్ష్మణుని సమీపించగా:

ఓయీ! నువ్వు తక్షణంవెళ్ళి రామానుజుడు ద్వారంలో నిలబడ్డాడని మా సుగ్రీవుడితో చెప్పు, నామాటలు వినాలనివుంటే తక్షణం రమ్మను, అనడం తడవుగా అంగదుడు అంతఃపురంచేరి, ఎదురుగావున్న పినతల్లి రుమకు, ఆ ప్రక్కనేవున్న సుగ్రీవునికి, అనంతరం తారకు పాదాభివాదంచేసి లక్ష్మణసందేశం వినిపించినా, సుగ్రీవునికి ఆ మాటలు వినపడలెదు.

ఈ సమయంలో యిక్కడి వానరులు లక్ష్మణుని క్రోధం తగ్గించడానికి కిలకిలారవాలు చేశారు. సహస్రాధికంగా వున్న ఆ వానరుల అట్టహాసధ్వానం సింహనాదంలా, పిడుగు పడ్డట్టుగా సుగ్రీవుని చెవిలోపడి అతనిమత్తు వదిలింది.

ప్లక్ష ప్రభావులనే సుగ్రీవమంత్రు లిద్దరు అప్పుడే అంతఃపురం చేరారు. సుగ్రీవుడు సాభిప్రాయంగా వారివైపు తిరిగాడు.

మహారాజా! తమకు రాజ్యం లభింపజేసిన రామచంద్రుని తమ్ముడు లక్ష్మణుడు ధనుర్ధారియై నగరద్వారంలో వున్నాడు. ఆయన క్రోధారుణరూపం చూడలేక భయంతో మన వానరగణాలు చేసిన కోలాహలం మీకు వినపడివుంటుంది ఆయన చూపులతోనే కిష్కింధను భస్మం చేసేలా వున్నాడు. తక్షణం మీరువెళ్ళి ఆయనకు పాదాభివాదంచేసి, ఆయన చెప్పిన మాటలు విని మనకర్తవ్యం ఏమిటో నిర్ణయించుకోవాలి, అన్నారు.

సుగ్రీవుడు శయ్యమీదినుండి లేచి, మంత్రులనూ అంగదునీ చూచి: నేను రామ లక్ష్మణుల విషయంలో అక్రమమయిన ఆలోచన చెయ్యలేదే. అటువంటిస్థితిలో లక్ష్మణ స్వామికి క్రోధం రావలసిన పనేమిటి? మన శత్రువులెవరో లేనిపోనిమాటలు చెప్పి వారి మనసు మార్చివుంటారు. అందుచేత యిపుడు మనం బాగా ఆలోచించి కర్తవ్యనిశ్చయం చేసుకోవాలి. మనస్సున్నదే యిది చంచలమయినది. దాన్ని నిగ్రహంలో వుంచి మైత్రీబంధాన్ని నిలబెట్టుకోవడానికి తగినకృషి చెయ్యాలి, అనగా హనుమంతుడు:

ప్రభూ! రాముడు చేసిన ఉపకారాన్ని విస్మరించక పోవడం మీ విశాల హృదయానికి నిదర్శనం. మరణభయం లేకుండా ఆయన ఇంద్రసమానుడయిన వాలిని సంహరించాడు. అంతచేసిన ఆయన విషయంలో మీరు ఉదాసీనంగా ఉంటే వారికి కోపంరాకుండా ఉంటుందా! అందుకే యిప్పుడు లక్ష్మణుని పంపివుంటారు. మీకు ప్రతిజ్ఞాపాలనజ్ఞానం లేదని నేననడంలేదు. కాని కామాసక్తులై దాన్ని విస్మరించారు. ఆకాశం నిర్మలమయింది, నదులలో, సరోవరాలలో నీరు స్వచ్ఛమయింది. మనం పెట్టిన గడువు దాటుతున్నా మనం కదలలేదు.

ఇప్పుడు మీరు లక్ష్మణుని పరుషభాషణాలు వినకతప్పదు, విని వారి అనుగ్రహం అర్థించండి. ప్రభువు హితాన్నికోరి సచివుడు మాట్లాడాలి కనుక యింతగా చెప్పవలసి వచ్చింది. రామచంద్రుడు కుపితుడై ధనుస్సు చేబూనినాడు ముల్లోకాలనూ భస్మంచేయగలడు. కనుక మీరు ఇప్పుడే వెళ్ళి లక్ష్మణుని పాదాలమీదపడి వేడుకోండి, అన్నాడు.

అనంతరం అంగదుడు వెళ్ళి లక్ష్మణునికి అభివాదంచేసి నగరంలోకి తీసుకు వచ్చాడు. పూలతోటలలో రత్నఖచిత కుడ్యాలతో అలరారే సౌధాలుకల రాజవీథిలో అడుగుపెట్టాడు. చందనాగరు ధూమావృతమై, పద్మ గంధవాసితమై అలరారే ఆ వీథులలో వానరులు మధు, మైరేయపాన పాత్రలతో హాయిగా తిరుగుతున్నారు

అంగద, మైంద, ద్వివిద, గజ, గవయ, గవాక్ష, శరభ, సూర్యాక్ష, విద్యున్మాలి, వీరబాహు, సుబాహు, నల, నీల, కుముద, సుషేణ, తార, దధివక్త్ర సుపాటల, సునేత్ర, జాంబవంతాదులు వసించే మహోన్నత ప్రాసాదాలన్నీ ఆ వీథినే ఉన్నాయి. తెల్లని మేఘాలవలె ఆమేడలనుండి అగరుధూపాలు వస్తున్నాయి. సాగుతున్నాడు లక్ష్మణుడు.

సాగి సాగి రాజ ప్రాసాదద్వారం సమీపించాడు. శుక్ల వర్ణ శిఖరాలతో అలరారే కోట గోడచుట్టూ, పరిఖ, దానిని దాటితే ఏడుకక్ష్యలు, అవి నడిచాక రాజసౌధంలోపల ఎన్నెన్నో ఉద్యానవనాలు. వనాలలో పువ్వు, ఫలభారావనమ్రములైన లతలు. .. చెట్లు....ప్రతిద్వారం దగ్గర శస్త్రాస్త్రపాణులయి రక్షకవీరులు.

క్రోధతామ్రాక్షుడయి వచ్చే లక్ష్మణుని ఒక్కరూ ఆపలేదు అందరూ తలలువంచి తప్పుకుంటున్నారు. రాజసౌధంలో ప్రవేశించే వేళకు గీత, వాద్య, నృత్యగోష్ఠి లక్ష్మణుని చెవులలో పడింది. రూప, యౌవన సుషమాసమన్వితలయిన సుందరనారీజనం అటూ ఇటూ తిరుగుతున్నారు. వారందరి కేశపాశాలలో రంగు రంగుల సువాసనల పూలగుత్తులు. వారి సర్వాంగాలూ గంధమాల్యానులేపనాలతో భాసిస్తున్నాయి సువర్ణాభరణాలు ఆ దేహకాంతులకు మెరుగులు పెడుతున్నాయి.

అంతఃపురస్త్రీల నూపురస్వనాలతో, కాంచనకంకణ, కాంచీనిస్వనాలతో లక్ష్మణుని మనస్సు మరింత క్రోధావిష్టమయింది. ఒక్కసారి ధనుష్టంకారంచేసి. ఆ గుణశీలి ఒక ద్వారంప్రక్క నిలబడ్డాడు.

ధనుష్టంకారధ్వని అంతఃపురంలోని సుగ్రీవునీ సర్వవానరకోటినీ అప్రమత్తం చేసింది, అప్పుడు సుగ్రీవుడు నెమ్మదిగా తారవైపు తిరిగి : తారా! వచ్చిన లక్ష్మణుడు కోమలహృదయుడు. ఆయన స్త్రీలను క్రోధదృష్టులతో చూడడు. కనక నువ్వువెళ్ళి ఆయనను ప్రసన్నుని చేసుకొని కోపకారణం తెలుసుకువస్తే నేనువెళ్ళి అనంతరం కర్తవ్యం నిర్వర్తిస్తాను, అన్నాడు.

సాప్రస్ఖలంతీ మదవిహ్వలాక్షీ
ప్రలంబ కాంచీగుణ హేమసూత్రా।
సలక్షణా లక్ష్మణ సన్నిధానం
జగామ తారా నమితాంగయష్టి॥

తార లేచింది. ఆమెకన్నులు మదవిహ్వలములై వున్నాయి. వడ్డాణం జారుతున్నది. మెడలో సువర్ణహారం అస్తవ్యస్తంగా వుంది. స్తనభారంతో, తడబడే అడుగులతో లక్ష్మణుని ఎదుటకు వచ్చింది. మధుపానంతో లజ్జావిహీనయైవున్న తారను చూచిన లక్ష్మణుని గుండె కోపాన్ని విడిచి శాంతమయింది. కన్నులు తిప్పుకుని తలవంచుకున్నాడు.

అప్పుడు తార ! ఓ రఘువంశరాజనందనా ! ఎవడయ్యా నీ కాగ్రహం కలిగించినవాడు ! ఎండిపోయిన అడవిలో నిప్పుపెట్టి అందులో వుండిపోయే మూర్ఖుడికంటె పరమ మూర్ఖుడు తప్ప నీకు క్రోధం తెప్పించడు. అంతటి అవివేకి ఎవడు? అని అడిగింది

మృదువుగావున్న తారమాటలతో లక్ష్మణుడు మరింత శాంతచిత్తుడై : తారా! ఇంకెవరికుంది ఆశక్తి. నీ సుగ్రీవుడు కామమదంతో పడివుంటే నువ్వుకూడా ఆయనకు గుర్తుచెయ్యలేని దశలో వున్నావు. ఆయనకు రాజకార్యాలే పట్టడంలేదు, మా విషయం సరేసరి, రాజ్యాన్ని మంత్రులకు వదిలి మధుపానలోలుడై మదవతీ వ్యామోహంలో వున్నాడు. మాకు చేసిన వాగ్దానానుసారం వానకాలం గడిచినా ఆయన మతులో ఈమాట మరిచిపోయాడు. అందువల్లనే ధర్మార్థసాధకులు మద్యానికి దూరంగా వుంటారు. చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చెయ్యకపోతే ధర్మనాశనం అవుతుంది. గుణవంతుడయిన మిత్రునితో వైరం సర్వనాశన హేతువు. మిత్రకార్య నిర్వహణధర్మం మరువరానిది. కార్యాకార్యవివేకం కల నువ్వు ఆలోచించు అనగా తార :

రాజపుత్రా ! స్వజనంమీద కోపం చూపడం ఉచితమా ! ఒకవేళ మీ మిత్రుడేదయినా పొరపాటుచేస్తే క్షమించి దారికి తిప్పుకోవాలేగాని యిలా క్రోధవశీభూతులు

కావడం న్యాయమా ! మీకు ఆత్మీయుడు సుగ్రీవుడు. ఆయనపై ఇంత ఆగ్రహమా! నిజమే, మీరుచేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయడం మావిధి.

మన్మథుని ప్రభావం మనసుమీద ఎంతఉంటుందో నేనెరుగుదును. దానికిలొంగిన వాడెంత వివశుడై వుంటాడో నువ్వెరగవయ్యా. వాడికి ధర్మార్థాల చింత వుండదు. లజ్జ, అభిమానం వుండవు. ఆ దశలో వున్న సుగ్రీవుని క్షమించమని అడుగుతున్నాను, సర్వధర్మపాలనంచేసే మహర్షులుకూడా కామవశీభూతచిత్తులయితే ధర్మార్థాలు మరిచి పోతారే, ఇక ఈ వానరేశ్వరు డొకలెక్కయా ! సహజంగా చపలచిత్తుడు దానికితోడు కొత్తగా సింహాసనం ఎక్కిన రాజు. ఇంక చెప్పాలా ! అయితే ఒక్కమాట, ఇంత కామా సక్తుడయివున్నా ఆయన మీ విషయం మరిచిపోలేదు. దిశాంతాలలోవున్న వానరవీరు లందరినీ రావలసిందని ఆజ్ఞలు పంపి చాలారోజులైంది. వారందరూ ఈపాటికి కిష్కింధకు చేరుతూవుంటారు. అందుచేత ఆయన పూర్తిగా మిత్రధర్మం మరిచిపోయాడనుకోకు, అని క్షణం ఆగి :

ఇక్ష్వాకువంశీయుడా ! అంతఃపురంలో అడుగుపెట్టని నీ శీలానికి తలవంచుతున్నాను. కాని నిష్కపటచిత్తంతో మిత్రుని భార్యలను చూడడం దోషంకాదుగా. అందుచేత మా అంతఃపురానికివచ్చి మా స్వాగతపరిచర్యలందుకో. అని తార ముందువడిచింది. లక్ష్మణుడు అడుగులువేసి అంతఃపురంలో అడుగుపెట్టాడు. ఎదురుగా హంసతూలికా తల్పం, రంగు రంగుల కాంతులీవే రత్నాలుపొదిగిన బంగారు నగలతో అలరారే రుమ. ఆ ప్రక్కనే సుగ్రీవుడు, సేవికాజనం. మధుపానవిహ్వల నేత్రాలతోవున్న సుగ్రీవుడు మత్తుగానే కన్నులెత్తి చూశాడు. లక్ష్మణుని మనస్సులో అగ్నిజ్వాలలురేగి కన్నులలో సెగలపొగలు జిమ్మినవి. ప్రస్రవణగిరిమీద భార్యా వియోగదుఃఖంతో అన్నగారు. ఇక్కడ మదిరాపానమత్తుడై మదవతీపరిరంభంలో సుగ్రీవుడు.

సౌమిత్రి కన్నులలో ఎర్రజీరలు సుగ్రీవుని మత్తువదిలించాయి. తక్షణం శయ్య దిగి చేతులు జోడించాడు. అప్పటికి జ్ఞాననాడి కదలిన రుమ హంసతూలికాతల్పం దిగింది.

అప్పుడు లక్ష్మణుడు: జితేంద్రియుడూ, దయాహృదయుడూ, కృతజ్ఞుడూ, సత్య వాదీ, సత్కులీనుడూ అయిన ప్రభువును లోకం పూజిస్తుంది. అయితే మిత్రునికిచ్చిన మాటను నిలబెట్టుకోలేని వానికంటె నీచుడుండడు. జంతువుల విషయమై ఆడిన అసత్యం వాలిని చంపిన పాపఫలాన్నే అనుభవింపజేస్తుంది. కాని మానవుడితో ఆడిన అబద్ధం

ఆత్మహత్యాపాపాన్ని యిస్తుంది. చేసినమేలు మరిచినవాడు కృతఘ్నుడు కృతఘ్నుడిని ఎవరయినా వధింపవచ్చు. దానివలన పాపం లేదు

బ్రహ్మఘ్నేచ సురాపేచ చోరే భగ్నవ్రతే తథా।
నిష్కృతి ర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః॥

అని సృష్టికర్త గీతావాక్యం. బ్రహ్మఘ్నుడికీ సురాపానం చేసినవాడికీ, చోరుడికీ, వ్రతభంగం అయినవారికీ ప్రాయశ్చిత్తం వున్నదికాని కృతఘ్నుడికి నిష్కృతిలేదు.

రాముడు నీకు చేసిన ఉపకారాన్ని విస్మరించి నువ్వు పరమ గ్రామ్యసుఖాలతో ఆనందిస్తున్నావు. నీవంటి కప్పను రామసర్పం క్షణాలలో గ్రసించగలదు. అయితే నీబుద్ధి తెలియక ఆయన నీకింత ఉపకారం చేశాడు. సరే. ఇప్పటికయినా మించిపోలేదు. నీమాట నువ్వు నిలబెట్టుకో లేదా వాలి వెళ్ళిన దారివుంది. ఆ దారినే నిన్నూ పంపవలసి వస్తుంది. రాముడు ధనుస్సు ఎక్కుపెట్టనంతవరకే ఈ భోగాలు, అని ఆగ్రహంతో పలుకుతూన్న లక్ష్మణుని చూసి తార:

ఓ రఘువంశీయుడా! ఎందుకింత కఠోరంగా పలుకుతావు ఆయన వానరేశ్వరుడు. ప్రభువును అంతంత మాటలనవచ్చునా? ఆయన కృతఘ్నుడూ, నీచుడూ, క్రూరుడూ కాదు. అసత్యభాషణం కపటవర్తనం ఆయన ఎరగడు. మీ రామచంద్రుని దయావిశేషం వల్లనే ఈయనకు ఈరాజ్యమూ, రుమా, నేనూ లభించిన విషయం ఆయన మరిచిపోడు. సంవత్సరాలుగా క్లేశాలు అనుభవించినవాడు కదా! ఇప్పుడిప్పుడే సుఖానుభవం అందుతున్నది. మేనకాసంయోగంతో విశ్వామిత్రమహర్షి కాలజ్ఞానం కోల్పోయినట్లు నువ్వు ఎరుగుదువు కదయ్యా. పాంచభౌతికమయిన దేహం....అది కామవాంఛతో నిండివున్నప్పుడు మరే విషయమూ మనసులో వుండదుకదా. పైగా సుగ్రీవుని అభిప్రాయం తెలుసుకోకుండా క్రోధవశీభూతుడవు కావడం ఉచితమా! సత్వగుణసంపన్నులని పేరుకదా ఇక్ష్వాకులకు. అటువంటి వంశంలో పుట్టిన నువ్వు పౌర్వాపర్యం విచారించకుండా క్రుద్ధుడ వవుతావని అనుకోను. అవసరమయితే ఈ సుగ్రీవుడు సర్వవానరరాజ్యాన్నీ రుమనూ నన్నూ కూడా వదలగలడు.

సీతాన్వేషణం చేసి, రామునికి ఆమెను అర్పిస్తాడు. రావణుని పరిజనంలో ఎందరో కామరూపులయిన రాక్షసులున్నారు వారిని సంహరించడానికి మీకు సాహాయ్యం అవసరం. రావణుని గురించిన సర్వవిషయాలూ వాలికి తెలుసు వాలి నా కవన్నీ చెపుతూండేవాడు.

నువ్వు చూడలేదేమో! అప్పుడే దిశాంతాలనుండి వానర సేనాపతులు వచ్చారు సుగ్రీవాజ్ఞతో. ఈ సాయంత్రానికి మిగిలిన వారందరూ కిష్కింధ చేరుతారు. వాలివధతో చెదరిన గుండెలింకా సర్దుకోలేదు మా అంతఃపురజనానికి. మళ్ళీ యిప్పుడు నువ్వు నీ కన్నులలో విస్ఫులింగాలు నింపి వారిని భయకంపితులను చేయకు, అని మధురంగా పలికింది. లక్ష్మణుడు శాంతించాడు ఆ కనులలో అరుణరోచులు సన్నగిల్లగా సుగ్రీవుని గుండె భయవిముక్తమయింది. మెడలో వ్రేలాడుతూన్న సువాసనాభరితమయిన పూలమాల త్రెంచి విసిరి, వినయంగా :

సౌమిత్రీ! రాజ్యహీనుణ్ణి భార్యావిరహంలో వున్నవాడిని. ఇంతకంటె క్లేశాలేం కావాలి. అటువంటి క్లేశాలనుంచి నన్ను రక్షించి సుఖశాంతులు అనుగ్రహించిన దైవ స్వరూపుడు మీ అగ్రజుడు, ఆ ధర్మమూర్తికి ఏంచేసినా ఋణంతీరదు. ఆయన తన అస్త్రప్రయోగంతో రావణుని యమసదనం చేరుస్తాడు. జానకిని పొందుతాడు. ఈ మహాకార్యంలో నేను సహాయభూతుణ్ని. సప్తసాలాలను ఒకే ఒక్కబాణంతో పడగొట్టి భూమిని బీటలువారజేసిన ఆయన పరాక్రమానికి మరొకరు తోడుకావాలా. ఆ కోదండధనుష్టంకారంతో సర్వ కానన కులగిరి సమేతం ధరణీచక్రం దద్దరిల్లుతుంది. నామీద ఆయనకున్న ప్రేమాభిమానాలు కారణంగా నేను చేసిన అపరాధం ఏమయినా వుంటే ముందు నువ్వు క్షమించవయ్యా! తెలిసీ తెలియక ఏదయినా పొరపాటు జరిగివుండవచ్చు. అయినా దానుడితప్పు దయతో చూడమని కోరుతున్నాను. అని అంజలిబంధంతో పలికే ఆ వానర చక్రవర్తి ప్రసంగం లక్ష్మణుని హృదయంలో జాలికి అవకాశమిచ్చింది.

వానరేశ్వరా! నీవంటి వినయశీలి స్నేహితుడుగా దొరకడం మా అన్నయ్య అదృష్టం. నీ సాధుస్వభావం, ఈ వినయం, పరిశుద్ధహృదయం చూస్తుంటే ఈ వానర రాజ్యానికి నువ్వే అధిపతిగా వుండాలికాని మరొకడికి ఆ అర్హతలేదు. నిస్సందేహంగా నీసాయంతో మా అన్నగారు రావణసంహారం చేసితీరతాడు. నీ వివేకం నాకు ఆనందం కలిగిస్తున్నది. సామర్థ్యంవుండీ విచక్షణతో దోషాల్ని అంగీకరించి తలవంచుతున్నావంటే నీకంటె ఉత్తము డెవడు! బల, పరాక్రమాలలో మా అన్నగారితో సముడవు. ఇప్పుడు నువ్వు నావెంటవచ్చి మా అన్నగారి మనస్సుకి ఆశ్వాసన కలిగించు. ఆవేశంలో నేనేమయినా పరుషంగా మాట్లాడితే అది మనస్సులో వుంచుకోకు, అనగా సుగ్రీవుడు హనుమంతునివైపు తిరిగి

మారుతీ! హిమాచల, మహేంద్రాచల, మందరాచల, వింధ్యాచల, ఉదయాచల, అస్తాచలాలమీదవుండే వానరవీరులతో, మేరు ధూమ్రగిరులలో మైరేయపానవివశులై

చరించే మహాబలులయిన కపిసేనాపతులందరూ ఇప్పటికే కిష్కింధ చేరి వుండాలి. ఇంకా రానివారుంటే దూతలను పంపు. కామాసక్తులయి, గర్వమూర్తులై పడివుండే వారుంటే-

అహోభిర్దశభి ర్యేహి నా గచ్ఛంతి మమాజ్ఞయా
హంతవ్యాస్తే దురాత్మానో రాజశాసన దూషకాః ॥

పదిరోజులలోగా యిక్కడకు రాకపోతే రాజశాసనోల్లంఘన నేరానికి మరణమే శరణ్యం అని చెప్పు, అన్నాడు. హనుమంతునినోట సుగ్రీవాజ్ఞ దిశాంతాలలో గిరిశిఖరాలకు చేరుతున్నది.

బంగారు రంగుదేహాంగల అస్తాచల వీరులు, సింహకేసరవర్ణులు కైలాసాచల వానరులు, వింధ్యాచలంమీది రక్తవర్ణులు, సముద్రతీరాలలో గిరిగుహలలోవుండే వీరవానరులు ఆవార్త వింటూనే శరవేగంతో వస్తున్నారు.

ఇక్కడ సుగ్రీవుడు లక్ష్మణునితో బయలుదేరాడు. ద్వారంలో పల్లకిసిద్ధంగావుంది. ముందుగా లక్ష్మణుని అధిరోహింపజేసి, అనంతరం సుగ్రీవుడు ఆసీనుడయాడు, క్షణాలలో అది రామ సన్నిధిని ఆగింది. వెంటవచ్చిన వానరులందరూ బారులుతీరి ప్రక్క ప్రక్కలకు పంగి నిలబడ్డారు.

సుగ్రీవుడు చేతులు జోడించి పాదాలమీద పడుతూంటే రాముడు ప్రసన్నవదనంతో గాఢాలింగనం చేసుకుని తన శిలావేదిమీద కూర్చుండబెట్టుకుని :

సుగ్రీవా ! ధర్మార్థ కామాలకు సమయా సమయాలు ఉన్నాయయ్యా ! ప్రభువయిన వాడికి ఆ సమయపరిజ్ఞానం ఉండాలి. అది మరచి ధర్మార్థరహితంగా కామోపసేవనం చేసేవాడు అవివేకి. చెట్టుకొమ్మమీద సుఖంగా నిద్రపోయేవాడు నేలమీద పడతాడు. అప్పుడుకాని వాడికి జ్ఞానంరాదు. కామాసక్తుడూ అంతే. మిత్రులను చేరదీసి శత్రువధకు ఉద్యోగించేవాడే ఉత్తమపాలకుడు. దీనికితోడు పురుషార్థాలను నియమితకాలంలో ఆచరిస్తూ సమర్థులయిన మంత్రులతో ఆలోచనలు సాగించాలి. సరే ఇప్పుడింక అన్వేషణ యత్నం సాగించాలి, అన్నాడు

సుగ్రీవుడు : రామభద్రా ! మీ అనుగ్రహంవల్ల నేను ఈ రాజ్యభోగాలు పొందగలిగాను. అందుకు సదా కృతజ్ఞుడిని. ఉపకారికి ప్రత్యుపకారం చేయనివాడు కృతఘ్నుడే. అప్పుడే వానరవీరులందరూ సర్వప్రాంతాలవారూ కిష్కింధ చేరారు. ఈ భూమండలమంతా వారికి కొట్టినపిండి. వారు కామరూపులు. వేలసంఖ్యలో వానర యూథపతు లున్నారు. వీరందరూ మీ జానకిని అన్వేషించి రావణుని వధించివస్తారు, అన్నాడు.

ఆ మాటలతో రాముని కన్నులు ప్రఫుల్లము లయాయి. సుగ్రీవుని గాఢంగా ఆలింగనం చేసుకొని : సుగ్రీవా ! ఇంద్రుడు వానలు అనుగ్రహించడం, సూర్యుడు వెలుగు నివ్వడం, చంద్రుడు చల్లనికాంతులు జిమ్మడం ఎంతసహజమో నీవంటి స్నేహితుడు మిత్రకార్యం నిర్వర్తించడమూ అంతే. నిస్సంశయంగా నేను శత్రుసంహారం చేయగలను, అన్నారు.

వారు అలా గోష్ఠి సాగిస్తూండగా పరిసరాలలో దుమ్మురేగి ఆకాశంనుండి సూర్య కాంతిని నిరోధించింది. పర్వతాలూ, మహావృక్షాలూ కంపించాయి. ఇదంతా ఏమిటా అని చూస్తే తీక్ష్ణదంష్ట్రలతో, మహోన్నతకాయాలతో వానర యూథపతులు అక్కడ ప్రత్యక్షమయారు. నదీతీరాలనుండి, సాగరప్రాంతాలనుండి, పర్వతప్రదేశాలనుండి వచ్చిన వారందరూ రంగు రంగుల దేహాలతో వున్నారు. కోట్ల వానరులతో శతబలి వచ్చాడు. మేరుపర్వతదేహుడు తార తండ్రి సుషేణుడు దిగాడు. హనుమంతుని జనకుడు కేసరి, గోలాంగూలపతి గవాక్షుడు, పర్వతసన్నిభులు, భల్లూకపతులు, ధూమ్ర, జాంబవంతుడు వల్లని కాటుకకొండవంటి నీలుడు, కాంచనకాంతివంతుడు గవయుడు, మైంద, ద్వివిద, గజ, గంధముఖ, నల, దధిముఖ, శరభ, కుముద, రుమణ్వంత, గంధవాహన, ఇంద్రజాను ప్రముఖులందరూ అంగదహనుమంత పురస్సరులై వచ్చి రామ సుగ్రీవులకు పాదాభివాదం చేసి వినయంగా నిలబడ్డారు.

అందరినీ వారి సేనాబలవివరాలతో తెలియజేసి సుగ్రీవుడు రామునితో ఓ రఘు వంశయోధుడా ! వీరందరూ మహాబలులు, అనేకయుద్ధాలలో ఆరితేరిన అరిభయంకరులు. ప్రభుకార్యనిర్వహణశీలులు, వీరందరూ నీ ఆజ్ఞాబద్ధులు. అనగా రాముడు :

మిత్రమా ! ధీశాలివి, సమయజ్ఞుడవు, పరాక్రమశీలివి నీకు నేను చెప్పాలా ! ముందు సీత జాడ తెలియాలి, అనంతరం రావణవధకు సన్నాహాలు జరగాలి. అందుకు అవసరమయిన ఆజ్ఞలు అందించు, అనగా సుగ్రీవుడు తన యూథపతులలో వినతునివైపు తిరిగి :

ఓ సేనాపతీ ! దేశాలు తెలిసిన, కాలజ్ఞానం ఎరిగిన, నీతివిదులయిన వానర సైనికులు లక్షమందిని వెంటబెట్టుకుని తూర్పుదిక్కుగా వెళ్ళు నదీ, నద, కానన, సాగర ప్రాంతాలలో అంగుళం విడవకుండా రావణుని జాడలు పసికట్టి అక్కడ సీత వున్నదేమో చూడాలి.

నువ్వు వెళ్ళేదారిలో సరయూ, భాగీరథీ, శోణభద్రా, సరస్వతీ, యమునా నదులు న్నాయి. కాశీ, కోసల, విదేహ, మగధ, పుండ్ర, వంగదేశాలున్నాయి. ఆయా నదీ

తీరాలలో, నగరవనాలలో అన్వేషించాలి మందరాచల సానువులలో ఎన్నో నగరాలు వెలిశాయి. అక్కడకూడా చూడాలి. ఆ ప్రాంతాలలో కొందరు చెవులులేనివారు, ముక్కులులేనివారు. పెదవులే చెవులుగా కలవారు, లోహముఖులు, మహాబలులు, పచ్చి చేపలే తినేవారు, నరభుక్కులు, బంగారుకాంతితో సొగసుగా వుండేవారు, జలచరాలవలె నిరంతరం నీటిలో వుండేవారు, పెద్దపులులవంటి వారున్నారు. ఇంకాపైకి వెడుతూంటే, రత్నసమృద్ధమయిన యవద్వీపం. దానినే సువర్ణద్వీపం అంటారు. అది దాటితే శిశిర పర్వతం. దాని శిఖరాలు ఆకాశాన్ని అంటుతాయి. అది దేవ, దానవ విహారభూమి. అక్కడి గిరిదుర్గాలలో, సెలయేటి తీరాలలో జానకిని దాచవచ్చు. ఆ పర్వతం దాటితే ఎర్రనీటితోనిండిన శోణనదం వున్నది. దాని కావల సిద్ధ, చారణ విహారభూము లున్నాయి. ఇంకాముందుకు సాగితే ప్రభంజన వేగానికి ఉత్తుంగ తరంగాలతో భయం కరంగా కనిపించే సముద్రంలో ద్వీపాలున్నాయి.

ఆ సముద్రంలో అతికాయులయిన అసురులున్నారు. ఆ సాగరంమీద విహరించే వారి నీడనుపట్టి క్రిందికిలాగుతారు వారు. అందుచేత ఆ ఛాయాగ్రాహుల విషయమై జాగ రూకులుగా వుండాలి. అది దాటితే అరుణవర్ణజలాలతో మరింత భయానక సముద్రం వుంది. ఆ లోహితసముద్ర ద్వీపంలో శాల్మలీవృక్షం. అక్కడే వైన తేయుని ఆవాసం. ఆ పరిసర పర్వత శిఖరాలపై మలదేహరాక్షసులు విహరిస్తూంటారు. ఉభయసంధ్యలలో విప్రశ్రేష్ఠులు సూర్యోపాసనవేళ విడిచే అర్ఘ్యజలతాడితులై వారు సముద్రంలో పడు తూంటారు. మళ్ళీ సూర్యాతపంతో పైకి లేస్తారు. అది దాటితే క్షీరోదసముద్రం. దాని మధ్య ఋషభపర్వతం. ఆ పర్వతం అంతా దివ్యగంధ పూరిత పుష్పసంభరిత వృక్షాల తో వుంటుంది. ఆ వృక్షసమూహ మధ్యంలో సుదర్శనసరోవరం, ఆ సరోవరంలో రాజ హంసల కలస్వనాలు. ఆ తీరాలలో యక్ష, కిన్నర, చారణుల విహారాలు. ఈ క్షీర సాగరం ఆవల మంచినీటి సముద్రం. దానిలోనే ఔర్వుని క్రోధంనుండి పుట్టిన బడబాగ్ని. ఆ అగ్నిజ్వాలలతో అక్కడి నీరు నిరంతరం కుత కుత లాడుతూంటుంది.

ఈ సముద్రానికి ఉత్తరాన పదమూడు యోజనాల విశాలమయిన జాతరూప శిలా పర్వతం. అక్కడ చంద్రకాంతులను వెదజల్లే పద్మదళవిశాల నేత్రాలుకల మహాసర్పం, వేయిపడగలుకల ఆ సర్పాన్ని అనంతుడుగా అర్చిస్తారు. అక్కడే సువర్ణతాళవృక్షం వున్నది. అది తూర్పుకు సరిహద్దు. అక్కడున్నది ఉదయాచలం. దాని శిఖరం నూరుయోజనాల నిడివితో ఆకాశాన్ని అంటుతూంటుంది. దానినిండా శాల, తాల, తమాల వృక్షాలు బారులుతీరి వుంటాయి. దానికి యోజనం వెడల్పు, పది

యోజనాలు నిడివికల శిఖరంవుంది. అది సౌమనసం. ప్రాచీనకాలంలో మహావిష్ణువు మేరువుపై ఒకపాదంవుంచి రెండవపాదం సౌమనసంమీద వుంచారని చెవుతారు. జంబూ ద్వీపానికి ఉత్తరంగా ప్రయాణించేసే సూర్యుడు ఈ శిఖరంమీద ప్రస్ఫుటంగా దర్శన మిస్తాడు. వాలఖిల్యాదు లిక్కడే తపోదీక్షలో వుంటారు. ఆ సమీపంలో సుదర్శన ద్వీపం ప్రజాపతి సృష్టిచేసినవాడు తూర్పుదిక్కుగవే మిగిలిన లోకాలతో భూమికి ద్వారం ఏర్పరిచాడు. అంతవరకూ వేవెరుగుదుమ. ఆవయికి మీరు పోలేరు. ఈ దూరమంతా తిరిగి ఒక్కనెలలో మీరు రావాలి. గడువుదాటితే మరణమే శరణ్యం. వెళ్ళరండి అని వారికి సెలవిచ్చి నీలునివైపు తిరిగి :

సేనానీ! మీరు దక్షిణదిశగా వెళ్ళాలి. నీవెంట గజ, గవయ, గవాక్ష, సుషేణ, వృషభ, మైంద, ద్వివిద, విజయ, గంధమాదన, ఉల్కాముఖ, అంగద, జాంబ వంత, హనుమంతులుంటారు. మీకు అంగదుడు నాయకుడు. మీరు సాగేదారిలో ముందుగా వెయ్యిశిఖరాలుకల వింధ్యాచలం, అది దాటుతూంటే నర్మదా, గోదావరీ, కృష్ణ వేణి, కావేరి, తామ్రవర్ణి నదులుంటాయి. మేఖల, ఉత్కల, దశార్ణ, విదర్భ, కళింగ దేశాలు. అవి వీడితే దండకారణ్యం. గోదావరీతీరాన నిశితంగా అన్వేషించాలి. దండ కాటవి దాటితే ఆంధ్ర, చోళ, పాండ్య, కేరళలు, వాటిపరిసరాలలో మహాపర్వతాలు. అదిదాటితే కావేరి. అక్కడకు దగ్గరలో మలయగిరి. అక్కడే అగస్త్యమహర్షి తపో దీక్షలో వుంటారు. ఆ మహర్షికి నమస్కరించకుండా వెళ్ళవద్దు. అక్కడ మహేంద్ర పర్వతం. దానిమీద యక్ష, సిద్ధ, చారణులు. ఇంద్రుడు పర్వదినాలలో సాగర స్నానానికి యిక్కడికే వస్తాడు. దాన్ని ఆనుకుని సముద్రం. ఆ సముద్రానికి శత యోజన దూరంలో ద్వీపం. అది రావణావాసం. అందులో అడుగు పెట్టడం అసాధ్యం. అక్కడకు వెళ్ళి మూలమూలల వెదకాలి. ఈ సముద్రంలో అంగారకమనే ఛాయాగ్రహం వుంది. మన నీడపడితే చాలు దీనిమీద, క్రిందికిలాగి కబళిస్తుంది.

లంకాద్వీపం దాటితే బంగారుకాంతులీనే శిఖరం, రజతవర్ణ శోభలీనే శిఖరం కని పిస్తాయి. వాటినిదాటితే సూర్యవంతదుర్గం, దానికావల వైద్యుతపర్వతం. దానిమీద ఎన్నో ఫలాలు, మధుర, మధురమయిన తేనెలు, వాటిని ఆరగించి ముందుకుసాగితే కుంజర పర్వతం. దీనిమీద అతివిశాలమయిన భవనం విశ్వకర్మ నిర్మించి అగస్త్యులవారి కిచ్చాడు. దాని సమీపంలో సర్వసర్పావాసం భోగవతి. అక్కడే సర్ప ప్రభువు వాసుకి వుంటాడు. భోగవతికి బహుదూరంలో వృషభగిరి వుంది. ఆ గిరిమీద రంధురంగుల మంచిగంధపు చెట్లున్నాయి. అక్కడే రక్తచందనవనం వుంది. దానిలో అడుగుపెట్టకండి.

అది గంధర్వవీర రక్షిత ప్రాంతం. దానితో భూభాగం అంతమవుతుంది. అక్కడ నుండి పితృలోకాలు. నెలరోజుల గడువులో మీరు తిరిగిరావాలి. సీతను చూచినవారు నాతో సమానభోగాలు అనుభవించగలరు, అని సుషేణునివైపు తిరిగి :

ఆర్యా ! మీరు అనుభవజ్ఞులు. మీ నాయకత్వంలో వారందరూ పశ్చిమదిక్కుగా వెళ్ళాలి. ముందుగా మీకు సౌరాష్ట్రం తగులుతుంది. బాహ్లీక, చంద్ర, చిత్రాది జన పదాలు సరపాన్నలతో దర్శనమిస్తాయి. దారిపొడవునా పశ్చిమవాహినీనదాలు కనిపిస్తాయి. క్రమంగా సముద్రతీరం చేరుతారు. తిమి, తిమింగిల, మకర, మహామత్స్యాది జల చరాలతో వుంటుంది. ఆ ప్రాంతంనిండా మొగలిడొంకలు, తమాలవృక్షాలు, కొబ్బరి తోటలు. తీరంవెంబడి ఎన్నోగ్రామాలు, నగరాలు,వనాలు. అక్కడ సింధు సాగర సంగమప్రాంతంలో హేమశిఖరం. ఆ శిఖరంమీద రెక్కల సింహాలు, అవి ఏనుగులవంటి జంతువులను వేటాడి భక్షిస్తాయి. అక్కడమాత్రం మీరు కామరూపంతో తిరగాలి. ఇది దాటిదే పారియాత్ర కులపర్వతం సముద్రమధ్యంలో వుంటుంది· దానిశిఖరం నూరు యోజనాల విశాలం. అక్కడ కోట్లసంఖ్యలో గంధర్వులు. వారు మహాబలిష్ఠులు, కనక వారిని కవ్వించకండి. అక్కడా సీత లేకపోతే వజ్రగిరిదాకా వెళ్ళండి. ఆ గుహలలో దాచవచ్చు రావణుడు. సముద్రతరంగాలను తాకుతూ చక్రవంతం. దానిమీద వేయి రేకుల చక్రం నిర్మించాడు విశ్వకర్మ. అదిదాటితే అరువది యోజనాల విశాలమయిన వరాహగిరి. దాని దగ్గరే ప్రాగ్జ్యోతిషం. ఆ నగరాన్ని అన్వేషించి ముందుకువెడితే క్రూరమృగ సంభరితమయిన పర్వతశ్రేణులు, అందులో మేఘవంతంమీద ఇంద్రుడు పట్టా భిషిక్తుడయాడు. దానికావల సువర్ణకాంతులీనే అరువదివేల పర్వతాలు కనబడతాయి. దాని మీద ప్రతివస్తువూ బంగారురంగుతోనే వుంటుంది. సూర్యుని అనుగ్రహవిశేషంవల్ల. అక్కడ దేవ, దానవ, గంధర్వులుకూడా హేమవర్ణులే. ఈ పర్వతశ్రేణిని సుమేరు వంటారు. ఇక్కడ దేవ, గంధర్వగణాలు సూర్యోపాసనచేస్తాయి. అక్కడే అస్తగిరి. ఈప్రాంతాన సూర్యుడు అర్ధముహూర్తవ్యవధిలో పదివేల యోజనాలు ప్రయాణంచేసి అస్తమిస్తాడు. అక్కడే విశ్వకర్మ నిర్మితమయిన మహాసౌధంలో వరుణుడు నివసిస్తూంటాడు. మేరువుకీ అస్తాచ లానికీ మధ్య సువర్ణవేదిక. దానిమీద పదిశాఖలుకల ఒక తాళవృక్షం. అక్కడే మేరుసావర్ణి మహర్షి వుంటాడు. ఆయనకూ పాదాభివాదంచేసి జానకీదేవిజాడ అడగండి. ఇక ముందుకు మనం వెళ్ళలేము. అంతవరకూ అన్వేషించి నెలలో తిరిగిరావాలి మీరు, అని మరొకదిక్కునవున్న శతబలివైపు తిరిగి :

మీరు ఉత్తరదిశగా వెళ్ళండి ముందుగా హిమవంతం. దాని పరిసరాలలో మ్లేచ్ఛ, కుళింద, శూరసేన, ప్రస్థల, భరత, కురు, మద్రక, కాంభోజ, యవన, శక, చీనా, పరమచీన, దరద, నీహార దేశాలు అదిదాటితే సోమాశ్రమం. తరువాత హేమగర్భం, సుదర్శనం, దేవసఖం. అవిదాటితే శతయోజనవిస్తీర్ణమయిన నిర్జనమైదానం. అక్కడ నది వుండదు. చెట్టు మొలవవు, జీవకోటి జాడ కనిపించదు. దానికావల కైలాసం. అక్కడ కుబేర భవనం. ఆ సమీపంలో సుందరకమలాలునిండిన సరోవరం. దాని కావల క్రౌంచగిరి. దీనిమీద చెట్టూ, చేమా వుండవు. ఉండకపోయినా వివిధ జాతుల పక్షులుంటాయి. ఆపైన మైనాకం. అక్కడ అశ్వముఖ స్త్రీలుంటారు. ఇంకా ముందుకువెడితే బంగారుపద్మాలతో వైఖానససరోవరం. ఇక్కడే కుబేరుని భద్రగజం సార్వభౌమం విహరిస్తూంటుంది తన కరిణీసంఘంతో. ఇంకాసాగితే ఆద్యంతరహిత మయిన గ్రహ, నక్షత్ర శూన్యమయిన ఆకాశం. సూర్యుడులేకపోయినా అక్కడ వెలుతురుంటుంది. సిద్ధులూ, దేవతలూ, అక్కడ తపోదీక్షలోవుంటారు. అది దాటివెళ్ళండి. శైతోద నది కనిపిస్తుంది. దాని కిరువంకలా వెదురువనాలు. అక్కడే ఉత్తరకురుభూములు. ఆ భూములలో లతావృక్షాలు సుగంధసంవాసితపుష్పాలతో వుంటాయి. అక్కడ విద్యాధరగణా లుంటాయి. ఈప్రాంతందాటితే ఉత్తరసముద్రం. దీనిలో సోమగిరి. ఇక్కడ సూర్యరశ్మి లేకున్నా ఆ పర్వతకాంతితో ఎప్పుడూ వెలుగేవుంటుంది. ఆ ఎగువన ఏకాదశ రుద్రభూములు, అనంతరం బ్రహ్మలోకం. అయితే ఉత్తర కురుభూములు దాటి మీరు వెళ్ళనవసరంలేదు. బయలుదేరండి. నెలరోజులలో తిరిగిరావాలి, అని అందరికీ సెలవిచ్చి హనుమంతుని దగ్గరగా పిలిచి :

అంజనీనందనా! నువ్వు ఎక్కడికయినా నిరాఘాటంగా వెళ్ళగలవాడివి. దేవ, గంధర్వ, యక్ష, రాక్షసావాస భూములన్నీ నీకు తెలిసినవే. నదీ, నద, సాగరాలను లంఘించడంలో నీ తండ్రి వాయువుతో సమానుడవు. దేశ, కాలజ్ఞానంవున్న నీతికోవిదుడవు నువ్వు. అందుచేత ఈ కార్యభారం నీమీద వున్నది, అని వెన్నుతట్టాడు.

అదిచూచిన రాముడు : హనుమా! ఇదిగో ఈ అంగుళీయకం, భద్రంగా నీదగ్గర వుంచు. నా నామాంకితమయిన ఈ ముద్రిక చూపితే జానకి నిన్ను విశ్వసిస్తుంది. నీ వల్లనే జానకి నాకు లభిస్తుంది, అన్నాడు.

సుగ్రీవుని ఆజ్ఞానుసారం వానరవీరులు నాలుగు దిక్కులకూ బయలుదేరారు. మిడతల దండులా సాగుతున్నారు. రావణుని వధించి జానకిని తెస్తాం. పర్వతాలు పిండిచేసి, మహావృక్షాలు ముక్కలు ముక్కలుచేసి, మూల మూలల వెదకి రావణుని హతమార్చి,

జానకిని తీసుకొస్తాం, అని నినాదాలు చేస్తూ మహెూత్సాహంతో దూకుతున్నారు. భూమండలం తలక్రిందులు చేస్తాం, పాతాళం పైకెత్తుతాం, సముద్రాన్ని చీలదీస్తాం- అంటూ సాగుతున్నారు

అందరూ వెళ్ళిన అనంతరం రాముడు :

వానరేశ్వరా! ఈ భూమండలం అంతా వర్ణించావే, ఇదంతా నువ్వెప్పుడుచూశావు! అనగా సుగ్రీవుడు: దుందుభితో పోరాటంలో మా అన్న మరణించాడని తిరిగివచ్చి నేను సింహాసనం అధివసించిన కొంతకాలానికి మా అన్నవచ్చినామీద పగబూని దేశభ్రష్టునిచేసి, అంతతో ఆగక నన్ను చంపడానికి వెంటతరిమాడు. ఆ రోజులలో నేను భూమండల మంతా అంచులుముట్టి చూచాను. ఈ గోళం అలాతచక్రం అయింది నాపాలిట. ఉద యాచలంనుంచి అస్తాచలానికి. దక్షిణాచలం నుండి ఉత్తరదిశాంతానికి యిలా తిరుగుతూన్న రోజుల్లో కొన్నాళ్ళకు హనుమంతునికి గుర్తుకొచ్చింది వాలి శాపవిషయం. అప్పుడు ఋశ్య మూకంమీద స్థిరపడ్డాం, ఇదీ నా లోకజ్ఞానకథ, అన్నాడు. రోజులు గడుస్తున్నాయి.

వెలతిరిగేసరికి తూర్పు, పశ్చిమ, ఉత్తరదిశలకు వెళ్ళినవారందరూ తిరిగివచ్చి: ప్రభూ! దక్షిణదిశగా వెళ్ళిన మహా పరాక్రమవంతుడు హనుమంతుడే జానకీదేవిని చూసి వస్తాడు, అన్నారు.

దక్షిణదిశగా వెళ్ళిన అంగదాదులు ముందుగా వింధ్యపర్వత గుహలలో, లోయలలో, నదీ పదప్రాంతాలలో వెదకి, ఎక్కడా సీతజాడ కనిపించక ముందుకు సాగుతూ ప్రతికావనం అన్వేషించి, నిర్జనప్రాంతం చేరారు. అదీ దాటి అనేక క్లేశాలు అనుభవిస్తూ దొరికిన ఆకో, అలమో తిని, అందిన నీరు త్రాగి, వెదుతున్నారు. కొంతదూరం వారికి దప్పికతీర్చే నీరుకూడా దొరకలేదు. పక్షుల అలికిడిలేదు, మృగాల జాడలేదు, ఏరులేదు, చెట్టూ, చేమా అనలే లేదు. అలా వెదుతుండగా సరోవరాలు, వాటితీరాలలో చెట్లు కనిపించాయి. విండుగా పూసిన ఆ చెట్లమీద ఒక్క తుమ్మెద కనిపించలేదు. అది కండుమహర్షి ఆశ్రమప్రాంతం. ఆయన కుమారుడు పదహారేళ్ళవాడు మరణించగా ఆ పుత్రశోకం భరించలేక ఆయన ఈ వనంలో ప్రాణికోటి వుండదు, అని శపించాడట.

ఆ వనంకూడా దాటి వెదుతుండగా ఒకచోట పర్వతాకారంతో ఒక రాక్షసుడు ఎదురుపడ్డాడు. వాడే రావణుడని అంగదుడు ఒక్క పిడిగుద్దుతో వాని రొమ్ము బద్దలు కొట్టాడు. వాడు నెత్తురు కక్కుకుంటూ నేలకూలాడు. ముందుకు సాగి సాగి ఒక గుహలోచేరి, అదంతా అన్వేషించి అక్కడకూడా సీతజాడ తెలియక ఒకచోట కూలబడ్డారు.

అందరు విపరీతమైన అలసటతో వున్నారు. అప్పుడు అంగదుడు: ఇంతవరకూ మనం ఈదిశలో వున్న కొండలు, అడవులు, లోయలు, నదీతీరాలు, గుహలు, అన్నీ చూశాం ఎక్కడా జానకి జాడ లేదు రావణుని ఛాయలూ లేవు. వానరేశ్వరుడు మనకిచ్చిన గడువు పూర్తి అవుతున్నది. ఇక మనం నిద్రాహారాలు మాని అన్వేషించాలి. నిరుత్సాహంతో నిస్పృహతో కూర్చోవడం కంటే కార్యశీలురమై మనం మన అన్వేషణకార్యం కొనసాగించాలి. ఉత్సాహవంతుడికి ఫలం సిద్ధిస్తుంది.

అవశ్యం క్రియమాణస్య
దృశ్యతే కర్మణః ఫలం।

అనగా గంధమాదనుడు నువ్వు చెప్పినట్లు మనం ఉత్సాహంతో ఈవనం అన్వేషిద్దాం, అన్నాడు.

తిరిగి ప్రారంభమయింది అన్వేషణ. తిరుగుతూ, తిరుగుతూ ఒక పర్వతశిఖరం ఎక్కి చూశారు. ప్రయోజనం లేకపోయింది. క్రిందికి దిగారు. దాహ శాంతికోసం సరోవరం కనిపిస్తుందేమోనని తిరుగుతూండగా ఋక్షబిలం ఎదురయింది. ఆ గుహాముఖం లతలతో, వృక్షాలతో ఆచ్ఛాదితమైవుంది. అందులోనుండి జలపక్షులు రావడం కనిపించింది. వాటి రెక్కలమీద కమలపరాగం గోచరించి, ఆ గుహలో జలాశయం వుండి వుంటుందని బిలద్వారం సమీపించి, అడుగుపెట్టడానికి వీలులేని దశలోవున్న ఆ గుహదగ్గర నిలిచిన సహచరులను చూచి, హనుమంతుడు: మనం పూర్తిగా అలసివున్నాం. ముందు ఆకలి దప్పులుతీర్చుకోవడానికి దీనిలో ప్రవేశించక తప్పదు, అనగా అందరూ అడుగులు వేశారు.

అందులో సింహాలూ, పెద్దపులులూ విశ్రాంతిగా నిద్రిస్తున్నాయి. కొంచెముందుకు వెళ్ళేసరికి కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. ఒకరిచెయ్యి ఒకరు పుచ్చుకుని ముందుకుసాగగా, అల్లంత వెలుగురేక, దాని సాయంతో వెళ్ళగా విశాలమైన మైదాన ప్రదేశం. తెల్లని వెలుగు, బంగారుకాంతుల కొమ్మలతో, ఆకులతో లతలు, చెట్లు స్వచ్ఛజల సరోవరం. కాంచనవర్ణంతో కమలాలు, సరోవరతీరంలో రత్న, వైడూర్యాలు పొదిగిన గోడలమేడలు, చందనాగురు ధూపవాసనలు, అంతా చూస్తూ మనిషిజాడకోసం వెదకు తూంటే కృష్ణాజినాంబరంతో ఓ వృద్ధ తపస్విని సూర్యతేజంతో సాక్షాత్కరించింది.

సహచరులతో హనుమంతుడు ఆమెను సమీపించి, వినయంగా అంజలి ఘటించి: అమ్మా! మీరెవరు? ఈ బిలంలో ఎలా వుంటున్నారు. దీని కథ ఏమిటి? ఇక్కడ

ఏ వస్తువును చూచినా బంగారుకాంతులు జిమ్ముతూ కనిపిస్తున్నాయి ఇది ఎవరి తపః ప్రభావంవల్ల నిర్మితమయింది, అని ప్రశ్నించగా:

నాయనా! మయుడనే దానవవృషభుని పేరు వినివుంటావు. ఆయన విశ్వకర్మ. ఎన్నో సంవత్సరాలు తపస్సుచేసి వరప్రభావంతో దీన్ని నిర్మించాడు. హేమ అనే అప్సరసమీద ఆయన మనసుపడ్డాడు. ఆమెతో సుఖభోగాలనుభవించే రోజులలో దేవేంద్రుడు కుపితుడై వజ్రాయుధంతో వానిని వధించాడు. అయితే ఈ మహాభోగాలన్నీ బ్రహ్మ అనుగ్రహంవల్ల హేమకు లభించాయి. నేను మేరుసావర్ణి మహర్షి పుత్రికను. నాపేరు స్వయంప్రభ. హేమ నా ప్రాణసఖి. నృత్య, గానకళా కోవిదురాలయిన హేమ అప్పుడప్పుడు విలాస విహారాలకు వెడుతూంటుంది. నేను ఈ వన, భవన, సరోవర రక్షణలో వుంటాను. ఇంతకూ మీరెవరు బాబూ! ఈదుర్గ మారణ్యంలో ఈ బిలంలోకి ఎలా వచ్చారు. మీరు బాగా అలిసినట్లున్నారు. ముందు ఈ ఫలాలు భుజించి స్వాదు జలాలు ఆస్వాదించండి, అంది.

ఆమె జరిపిన అతిథిసత్కారాలతో వారందరూ తృప్తిపొంది కొంత విశ్రాంతి తీసుకున్నాక హనుమంతుడు:

తల్లీ! దశరథరాజనందనుడు రాముడు పితృవాక్పాలనకై తమ్మునితో, భార్య జానకితో దండకారణ్యానికి రాగా, అక్కడ రావణుడు జానకిని అపహరించాడు. ఆమెను అన్వేషిస్తూ వారు మా ప్రభువయిన సుగ్రీవునితో స్నేహం చేసుకున్నారు.

మా చక్రవర్తి ఆజ్ఞానుసారం మేము సీతాన్వేషణం చేస్తూ యిలా వచ్చాం. ఆయన పెట్టిన గడువు దాటుతున్నది. మేము బిలంనుండి బయటపడే దారి చెప్పు. జానకి జాడ తెలిస్తే ఆ మార్గం కూడా చెప్పు తల్లీ! అన్నాడు.

నాయనా! ఇందులో అడుగుపెట్టినవారు ప్రాణాలతో బయటపడరు. అయినా ఒక మంచి పనికోసం మీరు తిరుగుతున్నారు. కనుక మిమ్మల్ని నేను ఉద్ధరిస్తాను. అందరూ కన్నులు మూసుకోండి, అంది. అంతే, వారు కళ్ళు తెరిచేసరికి సముద్రం ఒడ్డున వున్నారు.

భీకర ఘోష, ఉత్తుంగతరంగాలు, అంతులేని జలరాశి. చూచి ఆశ్చర్యపోతున్న వేళ అంగదుడు తన ఎదుటనున్న పెద్దలందరినీ చూస్తూ: సుగ్రీవుడు పెట్టిన గడువు గడచిపోయింది. ప్రభుహితంకోరే రాజనీతిజ్ఞులయిన మహా పరాక్రమ సంపన్నులు మీరు.

మీ అందరికీ సుగ్రీవాజ్ఞ ఎంత బలీయమైనదో తెలును. ఆయన సహజంగా తీవ్రస్వభావుడు. దానికితోడు ప్రభువుకూడా అయాడు. మనం జానకిజాడ తెలునుకోలేదు, ఆయన పెట్టిన గడువు దాటింది. ఇక మనకందరికీ ఆయన చేతులలో మరణమే శరణ్యం. ఈ స్థితిలో మనం కిష్కింధకు వెళ్ళి సుగ్రీవుని చేతులలో ప్రాణాలు విడవడంకంటే యిక్కడే నిరాహారులమై ప్రాయోపవేశదీక్షతో ప్రాణత్యాగం చేయడం పరమోత్తమం. మీరు మరో మాట అనవచ్చు. నన్ను యువరాజు పీఠం ఎక్కించాడు కనక నామీద ఆయనకు అభిమానం వుంటుందని, కాని చిన్ననాటినుంచీ నేనంటే గిట్టవే గిట్టదు. ఆ రఘువంశ వీరుని మాట కాదనలేక నన్నీ పదవిలో వుంచాడు. ఇప్పుడు నేను వాని ఆజ్ఞ పాలించనందుకు నన్ను చిత్రహింస చేసి తీరతాడు. హింస పడడంకంటే యిక్కడే ప్రాయోపవేశం చేయడం ఉచితం, అనగా మిగిలినవారు వాని అభిప్రాయంతో ఏకీభవించారు. కాని సేనాపతి తారుడు:

మనం మళ్ళీ ఆ స్వయంప్రభ గుహకు వెడదాం. అక్కడ మనకెవరి భీతీ లేదు. సుఖంగా ఆహార, విహారయోగ్యంగా వున్నదది, అన్నాడు. అందరూ అందుకు అంగీకరించారు. అంగదునికి వానర రాజ్యాధిపత్యం సిద్ధించినట్లు అవగతమయింది, హనుమంతునికి. ధీశాలి, పరాక్రమవంతుడు అయిన అంగదుడు యిప్పుడు ప్రభుకార్య నిర్వహణలో విఫలుడయినందున యీ స్థితిలో వున్నాడని గ్రహించి, వీరందరినీ ఒక దారికి తేవాలని హనుమంతుడు:

తారానుతా! యుద్ధభూమిలో తండ్రిని మించిన పరాక్రమం కల నువ్వు ఈ వానర రాజ్యానికి అభిషిక్తుడివయితే వాలిని మించిన పాలకుడవు కాగలవు. అయితే ఒక్కమాట మరచిపోతున్నావు, మనవారందరూ చపలచిత్తులు, చంచలస్వభావులు. వీరు తమ భార్యా బిడ్డలను కిష్కింధలో వదలి ఎంతకాలం నీ సేవలో వుంటారు. అదీకాక, ఈ మహావీరుడు జాంబవంతుడు, తత్సముడు నీలుడు, తత్సదృశుడు, సుహోత్రుడు, యింకా కొందరు సేనానులు, నేను....మమ్మల్ని సుగ్రీవసేననుంచి ఎవరూ మరలించలేరు.

మరొక్కమాట బాబూ! ప్రపంచంలో నీతిమంతుడైనవాడు తనకంటె దుర్బలుని జయించి ఆ రాజ్యం ఆక్రమించి సింహాసనం ఎక్కుతాడు. అంతేకాని తనకంటే బలవంతునితో వైరం తెచ్చుకుని ప్రాణహానికి సాహసించడు. మనం వచ్చిన పర్వతబిలం ఎవరికీ లొంగదనుకుంటున్నారు మీరు, కాని ఆ బిలాన్ని ఛిన్నాభిన్నం చెయ్యడం లక్ష్మణుడికి ఒక్క క్షణం పని. దేవేంద్రుడు ఒక్క రంధ్రం కొట్టాడు ఈ పర్వతానికి. కాని లక్ష్మణుని ఆయుధాలు దీనికి జల్లెడరూపం కల్పించగలవు. కాకపోయినా ఈ వానరులు

ఎంతోకాలం ఆ బిలంలో నీ సేవలో వుండరని ముందే చెప్పాను. మిత్ర, బంధుహీనుడవయి, హితవుకోరేవారికి దూరుడవయి గడ్డిపోచ బ్రతుకు బ్రతకాలి. అందుచేత ఈ ఆలోచనలకు స్వస్తిచెప్పి కర్తవ్యం ఆలోచించండి. మీ అమ్మ తారకు కష్టం కలిగేవని సుగ్రీవుడు చేస్తాడని ఎన్నడూ ఊహించకు, ఆయన అనంతరం ఈ రాజ్యం ఎలానూ నీకు లభిస్తుంది. ఆయనకు సంతానం లేనప్పుడు నీకుకాక మరెవరికి వస్తుంది, అని సామవాక్యాలు పలికి వారికి ధైర్యం కలిపించి, మనను మరలించే యత్నం చేయగా, అంగదుడు :

హనుమా! చిత్తశుద్ధి, పవిత్రాంతఃకరణలేనివాడు సుగ్రీవుడు. మహామహుడయిన అన్నగారు జీవించివుండగా ఆయన భార్యను అనుభవించినవాడు. అగ్నిసాక్షిగా రామునితో స్నేహంజరిపి, ఆయన చేసినమేలు మరచిన కృతఘ్నుడు. లక్ష్మణ ధనుష్టంకారం విని భయంతో మనలను అన్వేషణకు పంపాడేకాని ఆడినమాట నిలబెట్టుకోవాలనే ధర్మదృష్టితో కాదు.

ఇక యిప్పుడు నామనసులోని ఊహ బయటపడింది. ఇది ఆయన చెవినపడిందా నన్ను ప్రాణాలతో వదులుతాడా! ఈ దశలో అక్కడ నీచపుబ్రతుకు బ్రతకడం కంటె యిక్కడే ప్రాణత్యాగం చేస్తాను. మీరందరూ వెళ్ళి రామలక్ష్మణులకు నా అభివాదాలు అందించండి మా పినతల్లి రుమకు వందనాలు చెప్పండి. మా అమ్మ తార పుత్రశోకంతో బాధపడకుండా ఉపశమనం కలిగించండి. నేను కన్నుమూశానని వింటే ఆవిడ జీవిస్తుందనే ఆశ నాకులేదు, అంటూ వానరవృద్ధులకు నమస్కరించి, దర్భలువరిచి ప్రాయోపవేశ దీక్షవహించాడు.

అదిచూచి వానరులందరూ కన్నీరువిడుస్తూ, తమ యువరాజుతో ప్రాణత్యాగానికి సన్నద్ధులయారు. వారందరూ రాముని వనగమనకథ చెప్పుకుంటూండగా గృధ్రరాజు సంపాతి అక్కడి కొండగుహనుండి వెలుపలకువచ్చి వీరందరినీచూచి, వారి ప్రాయోపవేశ ప్రసంగం విని, ఏ ప్రాణి అయినా తన పూర్వ కర్మఫలం అనుభవించక తప్పదు. ఇంత కాలానికి నాకు నిశ్చింతగా అప్రయత్నంగా ఆహారం లభించింది. వీరందరినీ కొంతకాలం భుజించవచ్చు, అంటూండగా విన్నాడు అంగదుడు.

హనుమా! చూశావా, మనపాలిటి యముడు. అటు రామకార్యం నిర్వహించలేని విపత్తులోవున్న మనకు ఈ ఘోరవిపత్తు సన్నద్ధమయింది. సీతను రావణునినుండి రక్షించడానికి జటాయువు ప్రాణాలు కోల్పోయాడని విన్నాం. పశువులు, పక్షులు రామకార్యంకోసం అసువులు పీడుతున్నాయి. రాముని స్నేహపూరిత కరుణ హృదయం

యిందరిని ఆయనకు సహాయభూతులుగ చేస్తున్నది. ప్రాణాలు అరచేత పెట్టుకొని ఈక్షణం వరకూ మనం సీతాన్వేషణచేశాం. సుగ్రీవభీతిలేకుండా జటాయువు రావణునిచేతిలో మరణించి మోక్షపదం పొందాడు. ఇక్ష్వాకువంశీయుడు దశరథమహారాజు, గృధ్రరాజు జటాయువు, వానరేశ్వరుడువాలి, జనస్థానవాసులు ఖర, దూషణులు, యిందరుమరణించారు. సీతను రావణుడు ఎత్తుకుపోయాడు. ఇన్నిటికీ మూలకారణం కైకవరం, అని అంగదుడు అంటున్నప్పుడు జటాయువు పేరువినబడ్డ సంపాతి కన్నుల నీరు నింపుకుని. నా సోదరుడు జటాయువు మరణించాడని చెప్పి నాగుండెలో శూలం నాటిన వాడెవడయ్యా, జనస్థానంలో స్వేచ్ఛగావున్న మాతమ్ముడికి రాక్షసులతో వైరం ఎందుకొచ్చింది. ఒక్కసారి మీరు నన్ను ఈ పర్వతం మీదినుంచి కిందికిదించి మీ కథ వివరంగా చెప్పండి. సూర్యకిరణాల వేడికి నా రెక్కలు మాడిపోయి కదలలేకుండా ఉన్నాను, అనగా వారందరూ ఒకరిముఖాలు ఒకరు చూసుకుని, మీమాంసలోపడి, ప్రాయోపవేశ దీక్షతో కృశించి మరణించడంకంటె ఒక్కసారి ఈ పక్షినోట పడటం మంచిదనుకుని సంపాతిని క్రిందికి దించారు.

అంగదుడు తమ వృత్తాంతం, రామవనగమనం ఆదిగా గల కథ అంతాచెప్పి, రావణుడు అపహరించిన సీతను అన్వేషిస్తూ యిలా వచ్చామని చెప్పారు.

కన్నుల నీరుపిడుస్తూ సంపాతి : వానరులారా ! ఆ జటాయువు నా తమ్ముడు. రాక్షసరావణుడు నా సోదరుని చంపినాడని వినికూడా ఏమీ చెయ్యలేని దశలోవున్నాను. ఇంద్రుడు వృత్రాసురుని చంపిన నాటిమాట.... ఆ రోజులలో నేనూ, మా జటాయువూ విలాసంగా పోటీపడి సూర్యమండలానికి ఎగురుతున్నాం. రెండు జాముల ఎండవేడిసోకి మా తమ్ముడు సోలిపోతుంటే వాడికి రక్షగా నేను నా రెక్కలు అడ్డుపెట్టాను. ఆ సమయంలో నా రెక్కలు మాడిపోయి ఈ పర్వతంమీద పడ్డాను. అది మొదలు ఈ నాటివరకూ వాడి వార్త. తెలియలేదు నాకు అన్నాడు.

అంగదుడు : సంపాతీ ! అయితే సీతను అపహరించిన రావణుడు ఎక్కడుంటాడో చెప్పు ?

సంపాతి : నా రెక్కలు మాడిపోయాయి, నాబలం క్షీణించింది. ఎప్పటివాణ్ణినేను? దేవదానవులు క్షీరసాగరం మధించడం ఎరుగుదును. మహావిష్ణువు వామనుడై ముల్లోకాలూ ఆక్రమించడం చూశాను. అదంతా అలనాటిమాట. మొన్నమొన్ననే రావణుడు ఒకా నొక అతిలోక సౌందర్యవతి అయిన స్త్రీని అపహరించుకు పోతూండగా చూశాను. ఆమె తన ఆభరణాలు విసరిపారేస్తూ, గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నది. ఇప్పుడు గుర్తు

కొన్తున్నది, ఆమె, రామా! రామా! అని ఆక్రోశిస్తున్నది. అంతే! ఆవిడ సీత కావచ్చు.

ఆ రావణుడున్నాడే వాడు విశ్రవసుని కుమారుడు. వైశ్రవణుని సోదరుడు. ఆ కనిపించే సముద్రంలో వందయోజనాల ఆవల విశ్వకర్మ నిర్మించిన మహానగరంవుంది. అది లంకాద్వీపం. ఆ నగరం చుట్టూవిశాలప్రాకారం, అందులోవున్నది సీత. నేను పక్షిని గనుక అంతదూరం చూడగలిగాను. కాయధాన్యాలు తినేపక్షులు ఒకజాతివి, వృక్షఫలాలు తినేపక్షులు మరొకవర్గం, బలిభోజనం తినే కాకి మూడవశ్రేణి, డేగచతుర్థ శ్రేణి, గృధ్రాలు ఐదవ తరగతివి. రూప, వీరత్వాలున్న హంసలు ఆరవ శ్రేణివి వీటికి ఆహారాన్ని బట్టి శక్తివుంది. ఇన్నిరకాల పక్షులలో గృధ్రరాజు గరుత్మంతుడు అత్యంత తీవ్రవేగంతో వెళ్ళగలవాడు గమనంలోనే కాదు, మా చూపుకూడా సుదూరాలను అందుకోగలదు. వైనతేయుల వంశీయులమైన మా అందరికీ ఆశక్తి సిద్ధించింది నాలో ఏ మాత్రం శక్తివున్నా ఈ లవణ సముద్రం లంఘించి రావణుని సంహరించి ప్రతీకారం తీర్చుకుందును. కాని యిలా వున్నాను. మీరు ప్రయత్నించి ఈ సాగరం లంఘించి జానకిని చూచి రండి మీకుశుభమగుగాక.

నన్ను సముద్రజలాలవరకూ తీసుకువెళ్ళండి. నాసోదరునికి ఉదక ప్రదానం చేసుకుంటాను, అన్నాడు.

వానరులు సంపాతి మాట పాటించారు ఆయన తమ్ముడికి ఉదక ప్రదానం చేశారు.

మళ్ళీ అంగదాదులు సంపాతిచుట్టూ చేరి రావణుని గురించి వివరాలడుగుతున్నారు. అడిగినవే అడుగుతున్నారు. ఆ ముసలిపక్షి విసుగులేకుండా సమాధానాలిస్తూ:

నాకు సుపార్శ్వుడనే బిడ్డవున్నాడు. వాడు నిత్యం ఏదో జంతువును తెచ్చి నాకు ఆహారంగా పెడతాడు. ఒకనాడు రిక్తహస్తాలతో వచ్చాడు. పక్షిజాతికి ఆకలెక్కువ. ఎప్పుడూ ఏదోఒకటి నోట్లోపడుతుండాలి. అందులో నేను వార్ధక్యంలో వున్నానేమో మరి ఆకలిగావున్నాను. వాడు శూన్యహస్తాలతో రావడంతో కోపంగా నానా దుర్భాషలూ ఆడాను. అప్పుడు వాడు: తండ్రీ! నేను మహేంద్రగిరి మీద నీ ఆహారం కోసం అన్వేషిస్తూండగా కాటుకగుమ్మరించిన కొండవంటి దేహంతో ఒకడు మెరుపుతీగలా ప్రకాశించే ఒక స్త్రీని ఎత్తుకుపోతున్నాడు. వారిద్దరినీ నీకు ఆహారంగా యిద్దామనుకుని అడ్డునిలిచాను వాడు నన్ను ప్రార్థించాడు.

అభయమిచ్చి వదిలేశాను. కాని, వాడువెళ్ళాక అక్కడి ప్రాణులన్నీ—బాబూ!

నీ అదృష్టం వల్ల వాడితో పోరుసాగించకుండా బ్రతికి బయటపడ్డావని అభినందించారు. అప్పటికి కాని నాకు తెలియలేదు, వాడు రావణుడు, ఆవిడ జానకి, అనీ, ఈ కథంతా వాడు చెప్పాడు.

ఇప్పుడింక మీ ధీశక్తితో కార్యసాధనకు సంకల్పించండి. సుగ్రీవుడు బుద్ధిశాలి కనకనే మీవంటి బల, వీర, ధీసంపన్నులను యీ దిక్కుగా పంపాడు. మీరింక కాల హరణం చేయక సముద్ర లంఘనానికి ప్రయత్నించండి, అన్నాడు

వానరులందరూ సంపాతిని ఆయన కథ అంతా చెప్పమని కోరగా అగృధ్రరాజు :

ప్రచండ సూర్యకిరణ జ్వాలలకు నారెక్కలు మాడిపడిపోయానని చెప్పానుకదా. ఆ తరువాయి ఆరురోజులకు స్మృతి వచ్చింది. ఎక్కడవడ్డానో, ఏ దశలో వున్నానో తెలియక కొంతసేపు అటూ ఇటూ చూశాక దక్షిణసముద్రతీరంలో ఈ పర్వతం ఉన్నట్టు తెలిసింది. దీనికి దగ్గరలోనే నిశాకరుడనే తపస్వి వుండేవారు. ఆయన గతించి ఎనిమిది వేల సంవత్సరాలయినది. ఆ రోజులలో నేమూ, మా జటాయువూ ఈ మహర్షిని ఎన్నో మారులు దర్శించిన విషయం గుర్తుకొచ్చి, నెమ్మదిగా పర్వతశిఖరం దిగి ఆయన ఆశ్రమా నికి వస్తూంటే, మహర్షి స్నానంచేసి, ఆశ్రమం చేరుతూ నన్ను చూశాడు.

మహాదాతను ఎందరో యాచకులు పరివేష్టించి వున్నట్టు మహర్షి చుట్టూ సింహ వ్యాఘ్రమ, భల్లూకా లున్నాయి. ఆయన ఆశ్రమంలో అడుగుపెట్టగానే అవి తమ ఆవా సాలకు వెళ్ళాయి.

ఆశ్రమం నుంచి ఈవలకువచ్చి ఆయన నన్ను గుర్తుపట్టలేక ఏం పనిమీద వచ్చావు, అని అడిగి, అప్పటికి నేనెవరినో గ్రహించి: సంపాతీ! ఇలా అయావేం? ఎవరయినా శపించారా? వ్యాధిగ్రస్తుడ వయావా? అని అడిగారు.

మహర్షీ! కైలాసం మీద విహరించేవేళ మా తమ్ముడూ, నేనూ పందెంవేనుకు ఎగరటం మొదలుపెట్టాం. అంతరిక్షంలో ఎగురుతుంటే మాకు మహావృక్షాలు ఆకుపచ్చని పువ్వుల్లా, అరణ్యాలు చిన్ని చిన్ని పొదలవలె, పర్వతాలు మరీ చిన్న రాళ్ళవలె కనిపిం చాయి. ఇంకా ఎగిరాం. ముచ్చెమటలు పోశాయ్, భయం కలిగింది, దిక్కులు కనపడలేదు.

యుగాంతవేళ ప్రళయాగ్నిలా సూర్యబింబం కన్నులు మూసుకుపోయాయ్. సూర్యుడు భూగోళం అంత కనిపించాడు. మా జటాయువు స్పృహతప్పి పడిపోవటం చూశాను. నా రెక్కలు అడ్డుపుంచి వాడితో దిగడానికి ప్రయత్నించాను అంతే నా రెక్కలు మాడి పడిపోయాను. పడుతూంతగావే చూచాను, తమ్ముడేమయాడో అని. వాడు జనస్థానానికి వాలుతున్నాడు. నే నిక్కడ పడ్డాను. భ్రాతృహీమణ్ణి, విక్రమరహితుణ్ణి, ఇంక జీవితాశలేదు, అంటూ దుఃఖిస్తూండగా ఆయన నన్ను ఓదార్చి, క్షణకాలం కన్నులు మూసి:

సంపాతీ! విచారించకు. నీకు మళ్ళీ రెక్కలు వస్తాయి. ఉత్సాహ, పరాక్ర మాలతో విహరించగలవు. దశరథుని గర్భాన పుట్టిన రాముడు భార్యా సమేతం వనవా సానికి వచ్చినప్పుడు, రావణుడు జానకిని అపహరించి తనను వివాహమాడ మంటాడు. ఆవిడ అంగీకరించదు. రాక్షసావాసంలో ఆవిడ అన్నాహారాలు ముట్టదు, దేవేంద్రుడు పాయసం పంపుతూంటాడు ఆవిడకు ఆహారంగా. ఆవిడ ఆ పాయసంలో కొంతభాగం రామలక్ష్మణులకు నివేదనచేసి, మిగిలినదానితో జీవిస్తూంటుంది రాముడు సుగ్రీవునితో మైత్రి చేసుకుని వానరులను దూతలుగా పంపుతాడు. వారికినువ్వు జానకి జాడచెప్పాలి. అంతవరకూ యిక్కడేవుండు.

నా తపశ్శక్తితో నీకు నేను రెక్కలివ్వగలను. కాని నువ్వు వానరులు వచ్చేవేళకు ఎక్కడుంటావో? అందుచేత కదలకుండా లోక కల్యాణకరుడయిన రాముని సహాయార్థం యిక్కడే వుండు. నాకుకూడా రామలక్ష్మణులను దర్శించాలనివుంది. కాని ఈ శరీరం అంతవరకూ ఆగదు. ఆగినా ఈదేహాన్ని అంతవరకూ ఉంచాలనిలేదు, అన్నాడు.

మహర్షి మాటప్రకారం నేను ఆ గుహలోవుంటూ మీ రాకకోసం ఎదురుచూస్తు న్నాను, అని సంపాతి చెపుతూండగానే అతనికి రెక్కలు వచ్చాయి. రావడంతో పరమా నందం పొంది : ఓ వానరులారా! చూశారా! ఆ మహర్షి మాట యథార్థం మీరు, తప్పక జానకిని చూడగలరు. కార్యోద్యుక్తులుకండు, అని గగన వీథికి ఎగిరాడు సంపాతి.

మహోత్సాహంతో వానరవీరులు సముద్రతీరాన విడిదిచేశారు. సముద్రంలో ఉత్తుంగతరంగాల మధ్య భయంకర జలజంతువుల క్రీడలు వారికి గోచరిస్తున్నాయి మకర, మహామత్స్య, తిమి, తిమింగిలాది జంతుసంతానంతో, ఆకాశాన్నిముట్టే తరంగాలతో, భీకరఘోషతో అంతు కనిపించని సముద్రం వానరుల ఉత్సాహాన్ని మింగి వారి గుండెలలో

అప్పుడు జాంబవంతుడు; నాయనా! నీశక్తి నాకు తెలును. నువ్వు వెళ్ళగలవు, తిరిగి రానూగలవు. నూరు కాదు, వెయ్యి యోజనాలు దాటేశక్తి వుంది నీకు.

కాని, నువ్వు ప్రభువువు. మాకు ఆజ్ఞాపించి పని చేయించుకోవలసినవాడివే కాని నువ్వే కార్యరంగంలో దిగవలసినవాడివికావు. సేవకు ప్రభువు కళత్రస్థానీయుడు. కళత్ర రక్షణ సర్వదా భర్తృకార్యం. అలావే సేన ఎప్పుడూ ప్రభువును రక్షించుకోవాలి వృక్షమూలాన్ని రక్షించుకుంటే అది మళ్ళీ చివురుతొడిగి పువ్వులూ, పళ్ళూ యిస్తుంది. ఈ జ్ఞానం లేక మూలచ్ఛేదం చేసుకుంటే శూన్యమే మిగులుతుంది. మే మిందరం వుండగా నువ్వు వెళ్ళకూడదయ్యా, అన్నాడు.

అయితే మనకు ప్రాయోపవేశమే కర్తవ్యం. మీరెవరూ వెళ్ళలేరు, నన్ను వెళ్ళ నివ్వరు. అంతేకదా, అన్నాడు అంగదుడు.

అప్పుడు జాంబవంతుడు : ఈ మహత్కార్యాన్ని సాధించగలవాడు మనలోనే వున్నాడు. అతనిని ఉత్సాహపరుస్తాను చూడు, అని దూరంగా అమాయకంగా కూర్చుని ఉన్న హనుమంతుని సమీపించి : సర్వశాస్త్రవిశారదుడవయిన మహావీరుడా! ఏమిటిది? ఈ సమయంలో ఏకాంతంగా మాటా మంతీ లేకుండా కూర్చున్నావు. బలంలో, తేజస్సులో నువ్వు సుగ్రీవసముడివి : రామలక్ష్మణ సదృశుడివి. అపారపారావారాలలో తన ఆహారంగావున్న మహాసర్పాల కోసం అంతరిక్షంలో నిర్విరామంగా అనాయాసంగా విహరించే వైనతేయుని ఎన్నోమారులుచూశాను. ఆ మహనీయునిరెక్కలలోని శక్తి నీకున్నది. అంతేనా! ధీశక్తితో సమ్మిళితమయిన బలంకల ప్రాణి నిన్ను మించినది మరొకటి ఈ భూమండలంలో లేదు.

అప్సరోశిరోభూషణం పుంజికస్థల, శాపవశాన ఆవిడ అంజనిగా జన్మించి కేసరికి భార్య అయింది. ఆవిడకు కామరూపశక్తి వుండేది, దానితో ఆవిడ అతిలోకసుందరిగా భాసించేది, ఒకనాడావిడ వివిధవర్ణాలతో శోభించే చీనాంశుకాలు ధరించి, సువర్ణాభరణ భూషితాంగియై సువాసనలీనే పూలుతురిమిన జుట్టుముడితో చల్లగాలిలో ఒక పర్వత శిఖరం మీద విహరిస్తున్నది. ఆవిడ ధరించిన ఎర్రంచు చిలకాకుపచ్చ పట్టుచీర ఆ గాలికి పైదొలగింది. సమున్నతవక్షోజాలు, మృదుల మాంసలాలయిన ఊరువులు, సువిశాలనితంబములు, సన్నని నడుము.... ఈ పరమ సౌందర్యరాశి వాయువును సమ్మోహపరచింది అంతే! అంతటివాడు సామాన్యకాముకుడై ఆవిడను గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. ఆవిడ భయకంపిత హృదయంతో : ఎవడురా నా పాతివ్రత్యాన్ని భంగంచేస్తున్నవాడు? అని అరిచింది.

అప్పుడు జాంబవంతుడు; నాయనా! నీశక్తి నాకు తెలుసు. నువ్వు వెళ్ళగలవు, తిరిగి రాగాగలవు. నూరు కాదు, వెయ్యి యోజనాలు దాటేశక్తి వుంది నీకు.

కాని, నువ్వు ప్రభువువు. మాకు ఆజ్ఞాపించి పని చేయించుకోవలసినవాడివే కాని నువ్వే కార్యరంగంలో దిగవలసినవాడివికావు. సేనకు ప్రభువు కళత్రస్థానీయుడు. కళత్ర రక్షణ సర్వదా భర్తృకార్యం. అలావే సేన ఎప్పుడూ ప్రభువును రక్షించుకోవాలి వృక్షమూలాన్ని రక్షించుకుంటే అది మళ్ళీ చివురుతొడిగి పువ్వులూ, పళ్ళూ యిస్తుంది. ఈ జ్ఞానం లేక మూలచ్ఛేదం చేసుకుంటే శూన్యమే మిగులుతుంది. మేమిందరం వుండగా నువ్వు వెళ్ళకూడదయ్యా, అన్నాడు.

అయితే మనకు ప్రాయోపవేశమే కర్తవ్యం. మీరెవరూ వెళ్ళలేరు, నన్ను వెళ్ళ నివ్వరు. అంతేకదా, అన్నాడు అంగదుడు.

అప్పుడు జాంబవంతుడు : ఈ మహత్కార్యాన్ని సాధించగలవాడు మనలోనే వున్నాడు. అతనిని ఉత్సాహపరుస్తాను చూడు, అని దూరంగా అమాయకంగా కూర్చుని ఉన్న హనుమంతుని సమీపించి : సర్వశాస్త్రవిశారదుడవయిన మహావీరుడా ! ఏమిటిది ? ఈ సమయంలో ఏకాంతంగా మాటా మంతీ లేకుండా కూర్చున్నావు. బలంలో, తేజస్సులో నువ్వు సుగ్రీవసముడివి : రామలక్ష్మణ సదృశుడివి. అపారపారావారాలలో తన ఆహారంగావున్న మహాసర్పాల కోసం అంతరిక్షంలో నిర్విరామంగా అనాయాసంగా విహరించే వైనతేయుని ఎన్నోమారులుచూశాను. ఆ మహనీయునిరెక్కలలోని శక్తి నీకున్నది. అంతేనా! ధీశక్తితో సమ్మిశితమయిన బలంకల ప్రాణి నిన్ను మించినది మరొకటి ఈ భూమండలంలో లేదు.

అప్సరోశిరోభూషణం పుంజికస్థల, శాపవశాన ఆవిడ అంజనిగా జన్మించి కేసరికి భార్య అయింది. ఆవిడకు కామరూపశక్తి వుండేది, దానితో ఆవిడ అతిలోకసుందరిగా భాసించేది, ఒకనాడావిడ వివిధవర్ణాలతో శోభించే చీనాంశుకాలు ధరించి, సువర్ణాభరణ భూషితాంగియై సువాసనలీనే పూలుతురిమిన జుట్టుముడితో చల్లగాలిలో ఒక పర్వత శిఖరం మీద విహరిస్తున్నది. ఆవిడ ధరించిన ఎర్రంచు చిలకాకుపచ్చ పట్టుచీర ఆ గాలికి వైదొలగింది. సమున్నతవక్షోజాలు, మృదుల మాంసలాలయిన ఊరువులు, సువిశాలనితంబములు, సన్నని నడుము.... ఈ పరమ సౌందర్యరాశి వాయువును సమ్మోహపరచింది అంతే! అంతటివాడు సామాన్యకాముకుడై ఆవిడను గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. ఆవిడ భయకంపిత హృదయంతో : ఎవడురా నా పాతివ్రత్యాన్ని భంగంచేస్తున్నవాడు? అని అరిచింది.

సుశ్రోణీ! భయపడకు! నేను వాయువును. నేను కేవలం నిన్ను నా గాఢాలింగనంలోకి తీసుకున్నాను, అంతే, అయితే నీకు బలపరాక్రమ తేజస్సంపన్నుడయిన ధీమంతుడు పుత్రుడుగా జన్మిస్తాడు. వాడు అంతరిక్షంలో అవలీలగా విహరించగలడు. మహాసాగరాలు లంఘించగలడు, అని అదృశ్యుడయాడు.

ఆ మాటలకు అంజనీదేవి అమితానందం పొందింది. అనంతరం ఆ గిరిగుహలోనే నిన్ను కన్నది. నువ్వు పెరుగుతున్నావు. ఆ రోజులలో ఒకనాడు ఆకలితో నువ్వు సూర్యగోళాన్ని పక్వఫలంగా భావించి, దాన్ని ఆరగిద్దామని ఎగిరావు. సూర్యుని తీక్షమయిన ప్రచండాగ్నికూడా నిన్ను చలింపజెయ్యలేదు. అదిచూసి దేవేంద్రుడు తన వజ్రాయుధంతో నిన్నుకొట్టాడు. నువ్వు స్పృహతప్పి పర్వతశిఖరం మీద పడ్డావు. అప్పుడు నీ ఎడమబుగ్గ సొట్టపడింది. అది తెలిసి వాయువు క్రోధంతో స్తంభించాడు. లోకాలు తల్లడిల్లుతున్నాయి. అందరూ వాయువును ప్రార్థించారు. అప్పుడు ప్రజాపతి వచ్చి: ఓ వాయుదేవుడా! నీ బిడ్డకు ఏ అస్త్రం చేతనూ మరణంలేని వరం అనుగ్రహిస్తున్నానన్నాడు. దేవేంద్రుడు స్వచ్ఛందమరణం ప్రసాదించాడు.

అంతటి శక్తిశాలివయిన నువ్వు ఈ విపత్సమయంలో యిలా కూర్చుంటేఎలా! వామనావతారకాలంలో నేను ఈ నదీ, నద, సాగర, గిరి, కానన సమావృతమయిన భూమండలమంతా ఎన్నోసార్లు ప్రదక్షిణం చేశాను. క్షీరసాగరమథనవేళ దేవతలు కోరగా భూగోళంలోని ఓషధులన్నిటినీ అందులో పోశాను. ఇవన్నీ వయసునాటి పాతకథలు, ఇప్పుడు వార్థక్యం. అవి తలుచుకోవడానికే గాని ఆ శక్తిలేదు. ఇప్పుడింక నువ్వే మన వానరవాహినిని రక్షించాలి, లే!

ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవం।
పరా హి సర్వభూతానాం హనుమన్యా గతిస్తవ॥

లేవయ్యా! హరిశార్దూలా, లేచి విజృంభించు. వీరందరినీ విషాదసాగరం నుండి ఉద్ధరించడానికి ఉపక్రమించి లంఘించవయ్యా. త్రివిక్రముడవు కావాలి, అని ప్రోత్సాహవాక్యాలు పలుకుతున్నాడు జాంబవంతుడు.

పలుకు పలుకుకీ గుండెలో సంతోషతరంగాలు పొంగులు వారుతూంటే ఆ మహాధీమంతుని శరీరం అంతంత, అంతంతగా పెరగసాగింది. తాలోత్తాలదేహంతో హనుమంతుడు వానరులందరికీ ఆశ్చర్యానందాలు కలిగించాడు, సర్వ వానరులూ ఆంజనేయ ప్రశంసచేస్తుంటే ఆయన మరింత, మరింత పెరుగుతున్నాడు.

ఆదివారాయణుడు త్రివిక్రమావతారం ధరించినప్పుడు సర్వలోకాలూ విస్మయ చకితములయినట్లు ఆంజనేయుని విజృంభణం సర్వవానరవాహినినీ చకితంచేసింది. వానర వృద్ధుల ప్రశంసలతో ఆ మహామహుని దేహం మరింత పెరిగింది. పర్వత గుహనుండి వెలుపలకు వచ్చిన మృగరాజు జూలువిదలించి, దేహాన్ని జృంభింపజేసినట్లు ఆంజనేయుడు తన దేహాన్ని పెంచుతున్నాడు. ఆయన ముఖం ధూమరహితమయిన అగ్నిగోళములా గోచరిస్తున్నది. అప్పుడు వృద్ధనాయకు లందరికీ అభివాదం చేసి :

ఓ మహావీరులారా, పర్వతశిఖరాలను కంపింపజేయగల బలిష్ఠుడయిన శీఘ్రగామి వాయువు నా జనకుడు. ఆయన అగ్నికి ప్రియసఖుడు. ఈ రోదసిలో ఆయనవలె ఎగుర గల శక్తితో మేరువువరకు ఎన్నిసార్లయినా వెళ్ళిరాగలను, నా బాహువేగంతో పుట్టిన వాయువు సముద్రాన్ని కల్లోలితం చేయగలదు. వైనతేయుని అతిక్రమించే వేగంతో పోగలను. ఉదయాచలం మీద సూర్యునితో బయలుదేరి ఆయనకంటె ముందు అస్తాచలం చేరగలను.

నేను లంఘించేవేళ మహావృక్షాలు పుష్పిత లతలతో నన్ను వెన్నంటివస్తూంటే స్వాతికార్తెలో నక్షత్రశోభితమయిన ఆకాశంలా వుంటుంది నా గమనమార్గం. మెరుపు వలె ఎగురుతూన్న నాతో సమానంగా వైనతేయుడో, వాయువో రాగలరు.

నాబుద్ధీ, మనస్సు వైదేహీదర్శనోత్కంఠతో వున్నాయి. నేను బయలుదేరు తున్నాను. తిరిగి వచ్చేవరకూ మీరు నిశ్చింతగా వుండండి. లంకాద్వీపాన్ని పాతు కదలించి తెచ్చి మీముందు పెడతాను, అంటూంటే వానరుల ఉత్సాహం సముద్రతరంగాలను పరిహసించింది. అప్పుడు జాంబవంతుడు :

వాయునందనా! నీ బాంధవులందరి శోకాంధకారాన్నీ పటాపంచలుచేసి సంతోష సూర్యుని దర్శింపజేశావు. నీ శ్రేయస్సాధనకై మన వృద్ధులందరూ ఆశీస్సూక్తాలు పలుకు తున్నారు.

మహర్షుల, గురువుల వంశవృద్ధుల ఆశీర్వాదాలతో సముద్ర లంఘనానికి ఉపక్రమించు. నువ్వు తిరిగి వచ్చేవరకూ మేమిక్కడ నిరీక్షిస్తూంటాము. ఇందరి ఆశలు నీ మీద వున్నాయి. బయలుదేరు, కార్యసాధకుడవై తిరిగిరా! అన్నాడు.

అప్పుడు హనుమ : లంఘనవేళ నా పాదాల ఊనికకు ఈనేల నిలబడదు. కఠినశిలామయమయిన ఈ పర్వతం మీది నుంచి లంఘిస్తాను, అని మహేంద్రగిరి

అధిరోహించాడు. అందరూ ఆయనను అనుసరించారు. ఉత్సాహంగా కొంతసేపు ఆ పర్వతంమీద విలాసవిహారంచేసి, ఒకచోట నిలబడి, గట్టిగా కాలూని కదలించేసరికి పర్వతం అక్కడక్కడ పగుళ్ళిచ్చి కొత్త సెలయేళ్ళు పుట్టాయి.

ఆ పర్వతంమీది సింహ, వ్యాఘ్ర, మత్తేభాలు తలలు తిరిగి భయంతో రోదన ధ్వానాలు చేశాయి.

అక్కడ విహారానికివచ్చే గంధర్వ, విద్యాధరగణాలు ఆకాశవీధి చేరాయి. పర్వతసానువులలో నివసించే మహాసర్పాలు అతితీవ్రవేగంతో బయటకువచ్చి బుసలు కొడుతూంటే మహేంద్రగిరి వివిధవర్ణశోభిత పతాకాలతో అలంకృతమయినట్లు కనిపించింది.

శత్రునాశన సమర్థుడు, అత్యంతవేగగామి, మహామనస్వి అయిన హనుమంతుడు లంకాభిముఖంగా నిలిచాడు.

సవేగవాన్ వేగ సమాహితాత్మా
హరిప్రవీరః పరవీర హంతా ।
మనఃసమాధాయ మహానుభావో
జగామ లంకాం మనసా మనస్వీ ॥

కిష్కింధాకాండ సమాప్తం.

# సుందరకాండ

తతో రావణ నీతాయాః
సీతాయా శ్శత్రు కర్శన ః
ఇయేష పద మన్వేష్టుం
చారణా చరితే పథిః

## సాగరతరణం

శత్రువినాశన సమర్థుడయిన హనుమంతుడు రావణాపహృత అయిన సీతాన్వేషణ సంకల్పదీక్షితుడై చారణ సంచార మార్గాన ప్రయాణానికి ఉద్యుక్తుడయాడు. ఒక్కసారి శిరసు పైకెత్తిచూసి, స్వచ్ఛందసంచరణశీలి యయిన మృగరాజులా మహేంద్రగిరిపై విహరించి, ఉత్సాహంతో పాదఘట్టనం చేస్తూంటే మృగ, పక్షిసంఘాలన్నీ భయకంపితాలయాయి. దిక్కులుతోచక పరుగులుపెట్టాయి. మహావృక్షాలు వేళ్ళతో కదలి కూలుతున్నాయి. వివిధ ధాతు రజశ్శోభితమయిన వస్త్రాలుధరించిన కామరూపులైన కిన్నర, యక్ష. గంధర్వగణాలతో, మత్తేభయూథాలతో విరాజిల్లే మహేంద్రగిరిపై హనుమంతుడు సరోవరంలో గంధగజంలా శోభిస్తున్నాడు.

తూర్పుగా తిరిగి సూర్యునికీ, ఇంద్రునికీ, ప్రజాపతికీ, సర్వభూతాలకూ అంజలించి, తనజన్మకు కారణభూతుడయిన వాయుదేవునికి అభివాదంచేసి, ఒక్కసారి ఒళ్ళువిరిచి, దేహాన్ని సాగదీసి, ఉప్పొంగుతూ, బాహువులు అప్పళించి, పాదద్వంద్వం వేలమోపి అదిమిపట్టాడు.

ఆ ఒత్తిడిని సహించలేక పర్వతం ఊగిసలాడింది. ఆ గిరిమీది చెట్లన్నీ పూలవాన కురిశాయి. ఆ పూలజల్లుతో హనుమంతుడు సుగంధపూరిత పుష్పగిరిలా కనిపిస్తున్నాడు. పర్వతాంతర్భాగంలోని జలధారలు పైకుబికి ఏనుగులు తొండాలతో విరజిమ్ముతూన్నట్లున్నాయి. లోలోపలి సువర్ణ, రజత ఖనిజాలు బైటపడి బంగారు, వెండి సెలయేళ్ళలా కనిపించాయి. వాటిమధ్య మణిశిలలు అగ్నిజ్వాలారోచు లీనుతున్నాయి.

ప్రాణికోటి రోదనధ్వని చేసింది భయకంపితమై. విషసర్పాలు మహాఫణాలువిప్పతంచేసి కాకోల విషాగ్నులు కక్కుతూ గండశిలలను కాటువేస్తున్నాయి. త్రాచుపాము

కాటు సోకిన రాళ్లు అగ్నిజ్వాలలు చిమ్ముతున్నాయి. పర్వతంమీది ఓషధులేవీ ఈ విష జ్వాలలను చల్లార్చలేకపోతున్నాయి. ఈ విషాగ్నిజ్వాలాతప్తమయి మహేంద్రగిరి బ్రద్దలు వుతుందనే భయంతో విద్యాధర దంపతులు గగనవీధి చేరుకున్నారు. అంతవరకూ ఆ గిరిమీద పానశాలలో సుఖంగా త్రాగుతూన్నవారు పానపాత్రలు విడిచేసి, రుచికరమయిన మాంసఖండాలను వినరేసి, రత్నఖచిత సువర్ణపాత్రలు చెయ్యిజారిపోగా దిక్కు తెలియక పరుగులు పెడుతున్నారు. పద్మాక్షులు, పుష్కరనేత్రలు అయిన విద్యాధరకాంతలు హార నూపురాలు జారిపోతున్నా లక్ష్య పెట్టకుండా గగనవీధికి పోయి, పర్వతంమీద యింత సంచలనానికి హేతువేమిటా అని చూస్తున్నారు.

పర్వతాకారుడు, వాయునందనుడు రామకార్యార్థియై సాగరలంఘనం చెయ్య బోతు న్నాడు. అత్యంత దుష్కరమయిన సాగరతరణానికి సన్నద్ధుడవుతున్నాడు-అనే మాటలు మహర్షుల నోట విద్యాధరకాంతల చెవులపడగా వారు పరమానందంతో హనుమంతుని అద్భుతాకారాన్ని దర్శించారు.

ఏషపర్వత సంకాశో హనుమాన్ మారుతాత్మజః।
తితీర్షతి మహావేగః సముద్రం వరుణాలయం॥

హనుమంతుడు ఆపాదమస్తకం విదలించాడు. రోమ రోమం నిక్కబొడిచి అగ్ని శిఖల్లా గోచరించాయి. ఆషాఢమేఘంలా గర్జించాడు. సొగసుగా వంపుతిరిగిన వాలాన్ని కదిలించాడు. మహాసర్పాన్ని కాలిగోళ్ళమధ్య యిరికించి వెడుతూన్న గరుత్మంతునివలె వున్నాడప్పుడు. మహాపరిఘసన్నిభములయిన బాహువులను బిగబట్టి అరచేతులు బిగించాడు. రెండు భుజాలూ మెడకు ఒరుసుకుంటున్నాయి. పాదాలురెండూ దగ్గరగా చేర్చాడు. సర్వతేజశ్శక్తినీ కేంద్రీకరించుకున్నాడు. శిరస్సుకొద్దిగా పైకెత్తాడు. చూపు దూరంగా సారించాడు. చెవులు నిక్కించాడు. లంఘనోద్యుక్తుడవుతూ :

మిత్రులారా! రాఘవధనుర్విముక్త బాణం ఎంతవేగంగా వెడుతుందో అంత తీవ్ర వేగంతో లంకలో ప్రవేశిస్తాను. అక్కడ జానకి లేకపోతే దేవలోకం వెడతాను. అక్కడా కనిపించకపోతే రావణాసురునే బంధించి తెస్తాను. లేదా లంకానగరాన్ని పెకలించి తీసుకు వస్తాను, అంటూ పైకెగిరాడు. ఆ వేగానికి పర్వతంమీది వృక్షాలు అతనితో సాగి దూరదేశం వెళ్ళేవానిని సాగనంపుతూన్న బంధువుల్లా కనిపించాయి.

ముందుకు సాగుతున్నాడు మహా ప్రభంజన వేగంతో. వృక్షాలన్నీ సముద్రంలో పడ్డాయి. పాడవాటి బాహువులు బారసాచి వున్నాడు. అవి పర్వతాగ్రంమీద పడగ

విప్పిన పాముల్లా వున్నాయి. ఆయన నేత్రాలు మెరపుల్లా వెలుగుతూ అగ్ని గోళాల్లా కని పిస్తున్నాయి. ఎర్రనిముక్కుతోడి తామ్రవర్ణవదనం సంధ్యాసూర్యునివలె ఉన్నది. లాంగూలం యింద్రచాపమయింది. ఆ లాంగూల చక్రమధ్యంలోవున్న మారుతి పరివేష మధ్యగత సూర్యసదృశంగా వున్నాడు. అతితామ్రవర్ణంతోడి జంఘలు గైరికధాతుపూరి తము లయిన మహాగిరులలా వున్నాయి.

వాయుమండలంలో దూసుకుపోతూంటే అది మేఘగర్జనలు చేస్తున్నది. ఉత్తర దిశ నుండి అత్యంత తీవ్రవేగంతో వచ్చే ఉల్కలా వున్నాడు. సముద్రంమీద పడిన ఆయన నీడ గాలివాటుకు పోతూన్న నౌకలా వుంది. ఆ గాలికి సముద్రం కల్లోలమయి ఉత్తుంగ తరంగాలతో లేస్తున్నది. తనమీదికి వచ్చే తరంగాలను వక్షస్థలంతో క్రిందికి నెట్టుతూ సాగుతున్నాడు. మేరు, మందరసదృశంగా లేచే తరంగాలు, వాటిని వెనుకకు గెంటుతూ హనుమంతుడు. ఆ తరంగాలలో పైకి వచ్చిన మత్స్య, మకర, తిమి, తిమింగలాలు హనుమంతుని గమనంలో పుట్టిన గాలికి ఎగిరి ఆకాశంలో వలుచని వస్త్రాలవలె గోచరిస్తు న్నాయి..

సముద్రంలోని భుజంగాలు హనుమంతునిచూచి గరుత్మంతుడే వస్తున్నాడని కంపి స్తున్నాయి. ఆయన నీడ పదియోజనాల వెడల్పూ, ముప్పది యోజనాల పొడవూ వున్నది. రెక్కల పర్వతంలా సాగుతున్నాడు

మేఘమండలం దాటి వాయుమండలంలో సాగే హనుమంతునికి సముద్రం చిన్న దొన్నెలా కనిపిస్తున్నది. వాయువు చల్లగా వీస్తున్నది. దేవ, గంధర్వ, మహర్షి గణాలు ఆశీర్వాదాలతో పూలవానలు కురిపించాయి. రామకార్యార్థియై సాగే హను మంతునికి సహాయం చేయాలనే తలంపుతో సాగరుడు, తనలో దాగివున్న మైనాకునితో; ఓ గిరిశేఖరా! దేవేంద్రుని ఆజ్ఞానుసారం పాతాళబిలవాసులు పైకి రాకుండా యిక్కడ నిర్వి రామ జగత్కల్యాణ దీక్షలో వున్నావు. ఇప్పుడొక్క మహత్కార్యం చెయ్యాలి.

ఇక్ష్వాకువంశీయుడయిన రామునిదూత లంకకు వెడుతున్నాడు. ఆయనకు కొంత విశ్రాంతి యిచ్చి అతిథిసత్కారం జరపాలి. నీకు యథేచ్ఛగా పెరిగే శక్తి వుంది. కనక ఒక్కమారు పైకిపెరిగి నీశిఖరం మీద నిలిచే అవకాశం అతనికి కల్పించు, అన్నాడు.

మైనాకుడు, ఆకాశవీథికి తన శిఖరం పొడిగించాడు. అల్లిబిల్లిగా లతలల్లుకున్న చెట్లతో పరమరమణీయంగా సువర్ణశోభతో మేఘమండలంలో సూర్యబింబంలా కనిపించే ఆ గిరిశిఖరం తనకు అడ్డు వస్తున్నదని భావించి విశాల వక్షంతో దానిని తాడించాడు. ఆ ఆఘాతశక్తికి ఆశ్చర్యపడి మైనాకుడు సంతోషంతో గిరిశిఖరంమీద తనరూపంతో నిలిచి:

వానరోత్తమా! నమస్కారం. నీకు నేను ఆతిథ్యం యిచ్చి నీ శ్రమ తగ్గించ డానికి వచ్చిన మైనాకుణ్ణి. రాఘవుల పూర్వులు సగరులు యీ సాగరుని యింత చేశారు. కనుక ఆ అభిమానంతో ఆయన నన్ను పంపాడు. ఉపకారులకు ప్రత్యుపకారం చేయడం వివేకుల లక్షణంకదా, అందుచేత నువ్వు సాగరుని తృప్తికోసం ఈ శిఖరంమీద ముహూర్త కాలం ఆగి మా ఆతిథ్యం స్వీకరించు, ఇందులో సాగరుని ప్రమేయంతో నా ఉత్కంఠ కూడా వున్నది. కృతయుగంలో పర్వతాలకు రెక్కలుండేవని విని వుంటావు. అవి ఆకాశంలో ఎగురుతూండేవి. ఏ సమయంలో ఎక్కడ వాలి అవి ప్రాణికోటిని పీండి చేస్తాయో అని భీతివుండేది. అప్పుడు సర్వ దేవ, మానవ, ఋషిగణాలు ప్రార్థించగా ఇంద్రుడు పర్వతాల రెక్కలు నరికేశాడు. ఆ సమయంలో నీ జనకుడు వాయువు సాయంతో నేనీ లవణసముద్రంలో సురక్షితంగా పడ్డాను. ఆయన నాకు చేసిన ఉపకారా నికి ప్రత్యుపకారం చేసే అవకాశం యింతవరకూ కలగలేదు. నువ్వు మా ఉభయులకూ ఆనందం కలిగించి వెళ్ళు, అనగా హనుమంతుడు :

గిరిశ్రేష్ఠుడా! నీ మాటలేచాలు, నువ్వు చెయ్యదలచిన సత్కార్యం అంతా మాకు అందినట్లే. నాకు చాలా పనివుంది. ఈ పగలు గడవకుండా వెళ్ళాలి నేను. మరోలా అనుకోక నన్ను వెళ్ళనియ్యి అని వాణితలంతో గిరిశిఖరం స్పృశించి ముందుకు సాగు తూంటే అతని సంకల్పదీక్షను మహర్షి దేవతాగణాలు ప్రశంసించాయి.

హనుమంతుడు ముందుకు సాగుతున్నాడు. ప్రభంజన వేగంతో సముద్రాన్ని దాటుతున్నాడు.

అప్పుడు గంధర్వ సిద్ధ దేవతాగణాలు నాగమాత సురసనుచేరి : అమ్మా! వాతా త్మజుడు రామకార్యంకోసం సముద్రం లంఘిస్తున్నాడు. అతని శక్తిసామర్థ్యాలు పరీ క్షించాలి నువ్వు. విశాలదేహంతో అతని గగనమార్గం నిరోధించు. నిన్ను జయించి వెళ్ళగలిగాడా సరేసరి, లేదా విషాదసాగరంలో పడతాడు, అన్నారు.

ఉత్తరక్షణంలో సురస కామరూపం దరించి భీకరవదనం తెరచి ఘోర రాక్షసిలా హనుమంతునికి ఎదురువెళ్ళి : ఓ వానరుడా! ఈ రోజు నిన్ను నాకు ఆహారంగా యిచ్చారు దేవతలు. కనక నువ్వు మర్యాదగా ఈ వదనగహ్వరంలో ప్రవేశించు, అని పర్వత గుహలాంటి నోరు తెరిచింది.

అప్పుడు హనుమంతుడు; అమ్మా! నేను దాశరథియైన రాముని పనిమీద వెడు తున్నాను. ఆయన భార్యను రావణుడు హరించాడు. ఆమెను ఎక్కడ దాచిపెట్టాడో చూసివచ్చి నీకు ఆహారం అవుతాను. ఆ మాత్రం అవకాశం యిప్పించు అన్నాడు.

ఓ వానరుడా! కదలకు. ముందు ఈ వదనంలో ప్రవేశించు, అనగా హనుమంతుడు తన దేహాన్ని పెంచుతూ, 'నా శరీరానికి సరిపడేలా నీ నోరు తెరు' అన్నాడు.

సురస నోరు విశాలమవుతున్నది, హనుమంతుని దేహం పెరుగుతున్నది. పెరిగి పెరిగి మూరుయోజనాల మేర ఆవరించాయి. ఆయన దేహమూ, ఆవిడ వదనమూ, అంతే: ధీమంతుడు హనుమంతుడు లిప్తలో అంగుష్ఠదేహుడయి ఆమె ఉదరంలోకి వెళ్ళి, అంతలో ఈవలకు వచ్చి:

అమ్మా! నమస్కారం. నీ వాంఛ తీరింది కనుక నేను వెళ్ళిరానా! అన్నాడు.

రాహుగ్రహముక్తుడయిన సూర్యునివలే వున్న హనుమంతుని చూచి సురస: నాయనా! నీకు కార్యసిద్ధి అవుతుంది. సీతారాములను మళ్ళీ కలుపుతావు, అని ఆశీర్వదించి అదృశ్యమయింది.

హనుమంతుడు ముందుకు సాగుతున్నాడు.

వైనతేయ మార్గంలో ఆ సాగరం తరిస్తున్నాడు.

నిరాలంబ వాయుపథంలో రెక్కలపర్వతంలా వెడుతున్నాడు.

సముద్రంలోవున్న ఛాయాగ్రాహిణి సింహిక ఆ మహావీరుని రాక చూచి తనకు చిరకాలానికి కడుపునిండా తిండి దొరకుతున్నదన్న ఆనందంతో నోరుతెరిచి నీడనుపట్టి హనుమంతుని క్రిందికి లాగడం మొదలుపెట్టింది. తనవేగాన్ని నిరోధించి దిగలాగుతున్న ప్రాణి ఎక్కడవున్నదీ కనిపించక హనుమంతుడు ఆశ్చర్యంతో అన్నిదిక్కులూ చూసి క్రిందికి దృష్టిసారించాడు. జలమధ్యంలో మహాకాయం కనిపించింది. దక్షిణ సముద్రంలో ఛాయాగ్రాహిణి వున్నదని సుగ్రీవుడు చెప్పినమాట గుర్తుకొచ్చింది. ఉత్తర క్షణంలో తన శరీరాన్ని విశాలంగా పెంచుతూంటే, ఆ ఛాయాగ్రాహిణి దాని నోరు మరింతవిశాలం చేస్తున్నది. మహాగుహాబిలంలా తెరచిన దాని నోట్లోంచి మర్మస్థానాలు చూస్తూ, సూక్ష్మదేహుడై తీవ్రమయిన వేగంతో లోపలకు పోయి తన వాడిగోళ్ళతో దాని మర్మాలు ఛేదించి, బైటకువచ్చి గగనతలాన ప్రయాణం ప్రారంభించాడు.

ఎన్నో ప్రాణుల నీడలను పట్టిలాగి, ప్రాణికోటిని ఆరగించే సింహిక కళేబరం నీటిమీద తేలుతూంటే సిద్ధ చారణగణాలు అపరిమిత సంతోషం పొందాయి.

ఈ విధంగా ధైర్యం, విశాలదృష్టి, బుద్ధి చాకచక్యం, సాహసం ప్రదర్శించిన హనుమంతునికి అసాధ్యం లేదని భావించారు దేవతలూ, మహర్షులూ.

అంతలో సముద్రం అవ్వల దక్షిణతీరంలో పర్వతపంక్తులు హనుమంతునికి కను చూపులో కనిపించాయి. నెమ్మదిగా తన శరీరాన్ని సంక్షేపించే హనుమంతుడు — త్రివిక్రమరూపాన్ని వామనంచేసే మహావిష్ణువును తలపింపజేశాడు. లంకానగరంలో పర్వతం మీద దిగి సంధ్యా సమయంకోసం నిరీక్షిస్తున్నాడు ఆ మహాధీశాలి.

నూరుయోజనాలు దాటివచ్చినా శ్రమకానీ, ఆయాసంకానీ ఈషణ్మాత్రం కలగలేదు. కలగకపోగా యింకో యిన్ని వందల యోజనాలయినా యింత అవలీలగా లంఘించగల శక్తిశాలివలే వున్నాడు. తాను దిగిన త్రికూటగిరి శిఖరంమీద చల్లగాలిలో పూలవాసనలను ఆస్వాదిస్తూ, ఆ గాలికి శరీరమంతా పూలతో నిండగా పుష్పదేహిగా ఆ గిరి శిఖరాలమీద లంఘిస్తూ కాలం గడుపుతున్నాడు. తిరుగుతూనే లంకానగరాన్ని తిలకించాడు. ఆ నగరంలోని క్రీడావనాలు, ఖర్జూర, కర్ణికార, కుటజ, సరళ, ప్రియాళు, ప్రియంగు, కరవీర, కోవిదార, నీప వృక్షచ్ఛదాలు పరమ రమణీయంగా వున్నాయి. స్వచ్ఛ జలభరిత సరోవరాలు, వాటినిండా హంస, సారస, కారండవాది జలపక్షుల కలస్వనాలు, వాటిపై మండలాకృతిలో తుమ్మెదలు ఝుంకారంతో నృత్యం చేస్తున్నాయి. ఈ వనసరోవర వాతావరణం హృదయాహ్లాదం కలిగిస్తున్నది. వాటిమధ్యగా ఏడు ప్రాకారాలతో కోట. కోటలో పర్వతాలంతంత మహాభవనాలు, పతాకాలతో అట్టాలికలతో, కాంచనతోరణ శోభిత ద్వారాలతో అమరావతిని పరిహసిస్తున్నది.

చతుర్ముఖ ప్రజాపతి ఆజ్ఞానుసారం నగరంలోని భవనాలన్నీ విశ్వకర్మ నిర్మించాడు. ప్రజాపతి అనుగ్రహంతో కుబేరుడు ఆ నగరానికి అధిపతి అయాడు. కుబేరుని పరాజితుని చేసి రావణుడు దానిని ఆక్రమించాడు. అదిమొదలుగా శూల, పట్టిసపాణులూ, క్రూర దంష్ట్రులూ అయిన రాక్షసవీరులు దాని రక్షణభారంలో వున్నారు. ప్రాకారంచుట్టూ శూలాలూ, శతఘ్నులూ నగరంచుట్టూ సముద్రం నిసర్గ కందకంలా వుంది. ముల్లోకాలనూ పాలించే రావణుడు దాని ఏలిక. సీతాపహరణానంతరం లంకలో రక్షణవ్యవస్థ మరింత పటిష్ఠంగావుంది. నగరంనిండా ధనుర్విద్యావిదులు అప్రమత్తంగా కావుదలలో వున్నారు.

అంతా చూసిన హనుమంతునికి లంకానగరాన్ని స్వాధీనం చేసుకోవడం అసాధ్యమే అనీ, సామ, దాన, భేదోపాయాలుకూడా యిక్కడ పనికిరావనీ అనిపించింది. అంతేనా! అంగద, సుగ్రీవ, నీలాదులు ముగ్గురు నలుగురుకంటే మిగిలినవానరులు ఈ నగరంలో అడుగుపెట లేరు.

సరే, యిప్పుడింక జానకి జీవించివున్నదో, లేదో తెలుసుకుని ఆమెను చూడాలి. అయితే యింత విశాలకాయంతో నగరప్రవేశం చేయాలంటే రాక్షస రక్షణ బలాన్ని సంహరించాలి. అంతకంటే యితరుల కంటపడని చిన్నదేహంతో ప్రవేశించడం తెలివయిన పని. రావణుని కంటపడకుండా సీతను చూడాలి.

ఏమాత్రం పొరపాటు జరిగినా ఈ శ్రమ అంతా వ్యర్థం. అయితే యిప్పుడు రాక్షసరూపంతో నగరంలో అడుగుపెట్టినా! గాలికూడా రావణుని అనుమతిలేనిదే నగరంలో ప్రవేశించలేదనిపిస్తున్నది. ఇక ఈ వానరరూపంతోనే బహుచిన్నదేహంతో రాత్రివేళ నగరంలోకి వెళ్ళి అన్వేషణ సాగిస్తాను, అని నిశ్చయించు కున్నాడు.

సూర్యుడు అస్తాద్రికి చేరుకున్నాడు. చీకట్లు వ్యాపిస్తున్నాయి. చిన్నపిల్లిలా నగరంలో ప్రవేశించడానికి ఉద్యుక్తుడయ్యాడు. సర్పాలు యథేచ్ఛగా సంచరించే అగడ్త, దానికావల కాంచనప్రాకారం, మనోజ్ఞతోరణాలతో ఉత్తరద్వారం, కింకిణీ స్వనాలతో పతాకాలు, ఎటుచూచినా బంగారు జాలరులే. మణినిర్మిత వేదికలే. వజ్ర, స్ఫటిక ముక్తామణిశోభిత కుట్టిమాలు, తప్తహాటక నిర్మితములు, రజత శోభామయములు, వైడూర్య సమాయుత సోపాన పంక్తులతో సరోవరాలు, క్రౌంచ, మయూర, రాజహంసాది సుందర పక్షిసంతతుల సరస సల్లాపధ్వనులు. వీటన్నిటినీ అధఃకరిస్తూ సంధ్యానమయ సూచక తూర్యధ్వానాలు.

నగరం సమీపిస్తూంటే దానిని జయించడం వానరులకు సాధ్యమా అనేశంక హనుమంతునికి కలుగుతున్నది. రామలక్ష్మణుల పరాక్రమం స్ఫురణకు రాగా ఆశ్వాసన లభించింది.

రత్నకాంతులే చీనాంబరంగా, గోష్ఠాగారాలు కర్ణాభరణాలుగా, యంత్రశాలలు స్తనాలుగా, శోభించే లంకానగర నారీశిరోమణిని చూచి అడుగు ముందుకువేశాడు. వేయడం తడవుగా – ఎవడవురా నువ్వు ! అంటూ భీకరగర్జన హనుమంతుని చెవులలోపడింది. సావధానుడై నలువైపులా తిలకించేసరికి, ఎదురుగానే వికృతాకారంతో, భయానక నేత్రాలతో, భయంకర దేహం కనిపించింది.

ఎవడవు నువ్వు, వానరింలా వున్నావు. నా కన్నుకప్పి లంకలో అడుగు పెట్ట గలవా నువ్వు ! నీ శరీరం నుంచి ప్రాణాలు కదలకముందే నీ కథ చెప్పుకో, అంది ఆ పర్వతదేహం.

నీప్రశ్నలన్నిటికీ సమాధానం చెపుతాను. కానీ ఇంతకూ మనమెవరం ? నీకథ చెప్పు. ఈద్వారం అంతా నిండినదేహంతో చాలా వికారంగా వున్నావు, అన్నాడు హనుమంతుడు.

నేనీ లంకానగరాధిదేవతను. రావణుని ఆజ్ఞానుసారం ఈనగర రక్షణ చేస్తూంటాను. ఇంతకూ నీకు ప్రాణాలమీద ఆశ వున్నదా. ఇప్పుడు చెప్పు నువ్వెవరవు అంది.

హనుమంతుడు ఆమెతో చెయ్యికలపడానికి మనస్సులో సంకల్పించి, పైకి అతి మృదువుగా:

నువ్వు అన్నట్టు నేను వానరుణ్ని. ఈనగర సౌందర్యదర్శన వ్యామోహంతో వచ్చాను. అంతకుమించి ఏమీలేదు. అనగా, ఓరి దుర్బుద్ధీ ! రావణ పాలితమయిన లంకలో నా అనుమతి లేకుండా ప్రవేశిస్తావా ! తిరిగివెళ్ళు ప్రాణాలమీద తీపివుంటే అంటూండగా, హనుమంతుడు :

అమ్మాయీ ! ఈనగరం చూడకుండా వెళ్ళను, అనగా తీవ్రక్రోధంతో అరచేతితో ఒక్కచరుపు చరిచింది

అంతే ! హనుమంతుడు కుడిచేయి పిడికిలి బిగించి చెయ్యి పైకెత్తి ఒక్కగుద్దుగుద్దాడు. అయితే ఆడదానిని చంపరాదని భావించి మర్మఘాతం చెయ్యలేదు. అయినా ఆ ముష్టి ఘాతానికే ఆగలేక చాపచుట్టుగా నేలకూలింది. అది చూచి హనుమంతుడు జాలిగా ఆమెను లేవనెత్తగా, ఆ రాక్షసి పూర్వస్మృతితో :

ఓ వానరోత్తమా ! మహాత్ములు ప్రసన్న హృదయంతో దీనులను చూస్తారు. నీ పరాక్రమంతో నన్ను జయించావు. ఇప్పుడు నాకు ప్రజాపతి బ్రహ్మచెప్పినమాట గుర్తుకు వస్తున్నది. నన్నెవడు జయిస్తాడో వానివల్లనే లంక నాశనమవుతుందని అన్నాడాయన. సీతాపహరణ ఫలంగా రావణు డిప్పుడు సర్వనాశన మవుతాడు. నీకీనగరంలో ఎదురులేదు. స్వేచ్ఛగా నగరంలోకి వెళ్ళి జానకిని అన్వేషించు-అంది.

హనుమంతుడు ముందుకు సాగుతున్నాడు. ద్వారంగుండా వెళ్ళడం యిష్టంలేక ప్రాకారందాటి శత్రువు శిరస్సుమీద పెట్టినట్టు ఎడమకాలు లోపలపెట్టాడు. రాజవీథిని సాగుతూంటే రాక్షసవీరుల కోలాహలం, వీథులలో జల్లిన గంధజల వాసనలు, పుష్పసౌరభం.

స్ఫటికప్రకాశమయిన కుడ్యాలతో కట్టిన సౌధగవాక్షాలన్నీ రత్నఖచితములు. ఆకాశాన్ని చుంబించే భవన పంక్తులు. సాగుతున్నాడు హనుమంతుడు. చీకట్లు ముదురుతున్నాయి. రాత్రిలో అన్ని భవనాలలో దీపాలు వెలిగి రాజవీధి పట్టపగలులా వుంది.

రంగు రంగుల పూల మాలలతో, వివిధవిధాలంకరణ సామగ్రితో, అప్సరఃకాంత లను తలపించే రాక్షసనారీమణుల మదపరవశీభూత నయన కాంతులతో, త్రిస్థానస్వర సంయుత గీతవాద్య గోష్ఠులతో, నృత్యంచేసే మదవతుల కాంచీ, కంకణస్వనాలతో, నయన శ్రవణ తర్పణంగా వున్న భవనాలలో రాక్షస వీరుల సంతోషగర్జనలూ, భుజాస్ఫోటిత శబ్దాలూ వింటూ మారుతి అన్వేషణ సాగిస్తున్నాడు.

ఉదాత్తానుదాత్త స్వరితాలతో అధ్యయనం చేసేవారు కొందరు, విర్విరామరావణ స్తోత్ర పాఠకులు మరికొందరు. వీరందరినీ చూస్తూ, సీతకోసం మూలమూలల వెదకుతూ రావణాంతఃపురద్వారం చేరాడు. జటాధారులు, ముండిత శిరస్కులు, స్వాధ్యాయదీక్షి తులు, అజినాంబరులు, అగ్నికుండాయధులు, ముష్టిప్రహరణశీలురు, ఏ కా క్షు లు, అనేకాక్షులు, లంబోదరులు, వికటముఖులు, వామన దేహులు, ఖడ్గ, ధనుర్ధారిణులు, విచిత్ర కవచ భూషితులు, స్థూలదేహులు, హ్రస్వగాత్రాలు, గౌరవర్ణులు, కృష్ణవర్ణులు.... అందరినీచూస్తూ వెడుతున్నాడు హనుమంతుడు.

లంకానగర రాత్రిరక్షకగణం అప్రమత్తంగా వున్నది. అంతఃపురం చుట్టూ శ్వేతపద్మమయమైన సరోవరం. అంతఃపురం లోపలనుండి మధుర మంజుల గానం. శరత్కాల మేఘాలవలె వున్న వెల్ల ఏనుగులు నిండిన గజశాలలు. నిరంతరం హేషారవం వినిపించే హయశాలలు. రథపంక్తులు. అన్నిటినీ అతిక్రమించి మహాధీమంతుడు హను మంతుడు అంతఃపురంలో కాలుపెట్టాడు.

కాలు పెడుతున్నాడు అంతఃపురంలో హనుమంతుడు. చంద్రుడు వెన్నెల పందిరి వేశాడు భూమిమీద. లోకపు పాపాలను నశింపజేసే చంద్రుడు ఆకాశ మధ్యానికి వస్తూనే సముద్రాన్ని కలవరపరిచాడు. సర్వవస్తుజాలాన్నీ ప్రకాశవంతం చేసే జ్యోత్స్నా కరుడు ఆవులమందలో వృషభరాజులా వున్నాడు. మందరపర్వతంపై లక్ష్మిలా, వెండి పంజరంలో హంసలా, మందరగిరి గుహలో సింహం వలె, మత్తగజం మీద మహావీరుని వలె వున్నాడు

శృంగద్వయంతో శశాంకుడు వాడికొమ్ముల ఆబోతులా, పైకెత్తిన శిఖరాల పర్వతంలా, బంగారు తొడుగుల దంతాలు కల గజేంద్ర సన్నిభంగా వున్నాడు. మంచుబాధ లేని వసంతం, ఇతర గ్రహాగ్రహణ భీతిలేదు. వినిర్మలంగా లక్ష్మికి ఆశ్రయుడుగా వున్నాడు. వెన్నెల తరంగాలు వెదజల్లుతున్నాడు.

పర్వత సానువులో మృగేంద్రం, యుద్ధభూమిలో గజేంద్రం, రాజ్యాధిపత్యం పొందిన నరేంద్రుడు, వీరందరితో సమంగా ఉత్సాహం ప్రదర్శిస్తున్నాడు శీతకిరణుడు.

రాత్రిదోషాలు వైదొలగి కాంతి పవిత్రత వెల్లివిరిసింది. లంకానగరమంతా కామ వివశమైవుంది. శ్రవఃపేయంగా తంత్రీవాద్యాలు సాగుతున్నాయి. మగలు మదవతుల ప్రక్కల చేరుతున్నారు. రౌద్రప్రవృత్తి కల నిశాచరులు యధేచ్ఛగా చరిస్తున్నారు. అశ్వ, గజ, పదాతిదళాలు ప్రమత్తంగా వున్నాయి. వీరవరులు పరస్పరం అధిక్షేపించుకుంటూ, బలిసిన భుజాలు చరుచుకుంటూ మనసులు తప్పివున్నారు.

నగర సంచారం ముగించి తమతమ భవనాలు చేరిన రాక్షసవీరులు ధనుస్సులు విడిచి, రొమ్ము విరిచి నారీజనం మీద చేరుతున్నారు. ఉభయులూ గాఢాలింగనాలతో మైమరచి నిద్రలోపడ్డారు. వచ్చిన భర్తకు స్వాగతమిచ్చి దరహాసంతో లోపలకు కొనిపోయే కాంతలు కొందరు. నిట్టూర్పులతో ఎదురుచూస్తున్నవారు మరికొందరు. బుద్ధికుశలలు, రూపసంపన్నలు అయిన వారితోపాటు వికృతాకారాలతో వికటనామాలతోవున్న వారినికూడా చూశాడు, హనుమంతుడు.

సుగుణసంపదతో రూప సంపన్నలయిన వారీమణులు తమ భర్తలతో అన్యోన్యంగా వుండడమూ చూశాడు, పాన గోష్ఠిలో ప్రియులతో వికార చేష్టలు సాగించేవారినీ చూశాడు.

అంతరిక్షంలో నక్షత్రాలవలె స్వచ్ఛశీలంతో లజ్జావతులై ప్రియాపరిష్వంగంలో కొందరు, పతుల అంకతలం మీద కొందరు. కొందరు బంగారుబొమ్మలు, మరికొందరు రజతకాంతలు. కొందరు చంద్రకాంతితోవుంటే, ఇంకొందరు ఆ చంద్రునిలోని మచ్చవలె వున్నారు.

నగర వారీమణులు కొందరు తమకు నచ్చిన పురుషులతో క్రీడలు సాగించడానికి ఉద్యుక్తులవుతున్నారు. చంద్రుని చల్లదనాన్ని పరిహసించే చిరునవ్వుల వదనాలే పర్వ భవనాలలో. ఓరచూపుల కన్నుల పూల మాలలే. అందరిలో సనాతనధర్మ సాధుచరిత్ర జానకి జాడ కనిపించలేదు. హనుమంతుని మనస్సు శోకవశమయింది.

ప్రాకారాలన్నీ దాటి, ప్రాకారాలలో భవనాలన్నీ వెదకి అంతఃపుర ప్రధానమందిరంలో అడుగుపెట్టాడు. బహురత్న సమాకీర్ణమై, అమూల్య శయనాసన సమృద్ధమై, రాక్షసవీర రక్షితమై, నిశాచరనారీ పరివేష్ఠితమైవున్నది. ఆ ప్రాకారంలోవున్న రాక్షసేశ్వరుని సోదరులయిన విభీషణ, కుంభకర్ణుల సౌధాలూ, సేనానులయిన ప్రహస్త, మహోదర, మహాపార్శ్వ, విరూపాక్ష, విద్యుజ్జిహ్వ, విద్యున్మాలి, శుక, సారణ, వజ్రదంష్ట్రులతో జంబుమాలి, సుమాలి, రశ్మికేతు, సూర్యశత్రు, వజ్రకాయ, ధూమ్రాక్ష, ద్విజిహ్వ, కరాళ, హస్తిముఖ, శోణితాక్ష, హ్రస్వకర్ణ, ధ్వజగ్రీవ, పిశాచాదుల భవనాలన్నీ అన్వేషించి రావణుని ప్రాసాదంలో అడుగు పెట్టాడు. ఆ ప్రాసాదం మహావీరుల రక్షణలో వుంది. అందరూ ఆయుధపాణులై అప్రమత్తంగా వున్నారు.

బంగారుకాంతులీనే తెరలలో తరుణాదిత్య శోభతో పల్లకీలు, వివిధ వర్ణరచితములయిన చిత్రశాలలు, క్రీడాగృహాలు, కామగృహాలు, దివామందిరాలు. ఆ ప్రాసాదం ఒక్కటే మేరుగిరిని పరిహసించే ఎత్తులోవుంది. అగ్రభాగాన మరింత ఎత్తుగా జయపతాకలు. భూమండలం లోని నిధినిక్షేపాలన్నీ అక్కడే సమాయత్త మయినట్లున్నాయి. భవనం గోడలలో పొదిగిన రత్నకాంతులతో భవనం అంతా పట్టపగటి సూర్యకాంతితో వెలుగుతున్నది. శయన, ఆసన, పాత్రలన్నీ బంగారుశోభ లీనుతున్నాయి. మధు, ఆసవ పానానికి మణిఖచితపాత్రలు. కుబేరుని సంపద అంతా రావణ భవనంలోనే ఉన్నట్టనిపించింది. మృదంగ ధ్వనికి అనుగుణంగా కాంచీ, నూపుర, కంకణ స్వనాలు నిరంతరాయంగా వినవస్తున్నాయి.

ఆ సువిశాల ప్రాసాదాన్ని పరివేష్టించి మరెన్నో భవనాలు. వాటిలో శంఖ, చాప, ఖడ్గ, ఆయుధశాలలు, ధన, కనక, వస్తువాహనాలకు వేరే భవనాలు ప్రక్కగా చంద్రశాలలు. వాస్తు శాస్త్రమర్యాద తప్పకుండా మంగళప్రదంగా గోచరిస్తున్నవి. నిత్య పూజలతో వెలిగే దేవతాయతనాలు. దానవ మహాశిల్పి మయుడు నిర్మించిన మందిరాలే అన్నీ. ఈ సర్వ మణి, రత్న, కాంచనశ్రీ అంతా రావణ భుజబలార్జితమే.

ఇన్నిటినీ శోధించి ముందుకుసాగిన హనుమంతునికి పుష్పకవిమానం కనిపించింది. అది భూమికి దిగిన స్వర్గం అనిపించింది. వికసిత సుమాలతో లతలు అల్లుకున్న తరువులు, తరువుల నిండా పక్వఫలాలు. ఫలాలు మధురస భరితాలు.

అతిలోకసుందరి శరీర లావణ్యం వలె, అంభోధరంలోని సౌదామిని వలెవున్నదది. రాజహంసలు వహించే పాలకీవలెవున్నది. బహువిధ ధాతు ద్రవశోభితమయిన పర్వత శిఖరంలా, గ్రహ, నక్షత్ర, చంద్రయుతమయిన గగనవీధి వలె అత్యంత కుశలంగా చిత్రించిన మేఘమండల సదృశంగా వున్నదది.

ఆ పుష్పక పార్శ్వభిత్తికలమీద భూగోళాన్ని పర్వత పంక్తులతో పర్వత శ్రేణిని మహావృక్ష సమూహాలతో, వృక్ష సమూహాలను నవవికసిత సుమాలతో, వికసిత సుమాలను కేసరాలతో చిత్రించాడు దానవశిల్పి, పరమ రమణీయంగా.

మహీకృతా పర్వతరాజి పూర్ణా
శైలా కృతాః వృక్ష వితాన పూర్ణాః।
వృక్షాః కృతా పుష్ప వితాన పూర్ణాః
పుష్పం కృతం కేసర పత్ర పూర్ణం॥

ఆ విమానంలో ఎన్నో అంతస్థులు, అన్నిటిలో చిత్రశాలలు, రత్న, వైడూర్య, ప్రవాళ, సువర్ణాలతో ఎన్నో విహంగాలు.

అవన్నీ మన్మథుని రెక్కలవలె వున్నాయి. ఆ విమానంలో ఒక సరోవరం, సరోవరంలో కలువలు, కమలాలు. వాటిని తొండంతో పైకెత్తి స్నానంచేస్తూన్నమత్తగజం లక్ష్మీశోభతో గోచరిస్తున్నది. అది గగనవీధిని వాయువేగంతో సాగగలదు. తీవ్రతపస్సుతో కుబేరుడు సాధించిన దీనిని రావణుడు తన పరాక్రమంతో తెచ్చుకున్నాడు.

సుందర మనోజ్ఞమయిన ఆ శిల్పశోభ మనస్సును హరించినా హనుమంతుడు అచంచల చిత్తుడై జానకిని అన్వేషిస్తూనే వున్నాడు.

వసంతంలో వికసించిన పూలకంటె రమణీయంగా, వసంతమాసం కంటె శోభామయంగావున్న పుష్పకంలో తిరుగుతున్నాడు ధీశాలి మారుతి. అన్వేషిస్తున్నాడు జానకీదేవిని.

లంకేశ్వరుని ప్రాసాదంలో ఆయన రాణులుండే భవనాలన్నీ అన్వేషించాడు. ముల్లోకాలనుండీ బలాత్కరించి తెచ్చి భార్యలుగా చేసుకున్న రావణపత్నుల సౌధాలన్నీ తిరిగాడు. ఆయన బలవీర్య పరాక్రమాలకు వ్యామోహితలయి వానిని సేవించే స్త్రీల మందిరాలూ చూశాడు. స్నానమందిరాలు, మహాసనశాలలు, రత్నభాండాగారాలు చూశాడు. అంతటా సుగంధం వ్యాపించివుంది. మణినిర్మిత సోపానాలు, బంగారుతెరల కిటికీలు, వజ్రాలతో, ముత్యాలతో గోడలు, స్ఫటిక శోభిత భూతలం, సుందర వస్తుజాల వేష్టితం అయిన పుష్పకం అంతా చూశాడు.

ఆ విమాన మధ్యం లోని విశాల మందిరాంతర్భాగంలో అర్ధరాత్రం వరకూ నృత్యగాన గోష్ఠులతో అలసిన జనం నిద్రిస్తున్నది. రత్నదీప కాంతులలో నారీ జనం అత్యంత మందరంగా వున్నారు. స్వర్ణమయ రత్నభూషణాలు, రంగురంగుల మేలిమి చీరలు. పద్మగంధ శోభితవదనాలతో ఉదయం వికసించి రాత్రి ముకుళించుకునే అరుణకమలాలు నిండిన సరోవరంలా వుంది.

ఆ ముఖాంబుజాల మీద పిల్లగాలికి ఎగిరే ముంగురులు తుమ్మెదలను తలపించాయి. నక్షత్ర శోభితమయిన గగనవీధిలా వున్నది, తారావదనాలతో ఆ మందిరం. వారిమధ్య రాక్షసేశ్వరుడు శరచ్చంద్రునివలె వున్నాడు. బాగా మద్యం సేవించి, నృత్యగానాలతో అలసిపోయారేమో, గాఢనిద్రలో వున్నవారికి నుదుటి తిలకం అడ్డంగా జారింది, కొందరి నూపురాలు ఎగుడుదిగుడుగా వున్నాయి, కంఠహారాలు అస్తవ్యస్తంగా వున్నాయి, వక్షోజాలపై ఆచ్ఛాదనలేదు, ముత్యాలహారాలే వాటిపై చీనాంశుకాలు. కొందరి కర్ణాభరణాలు క్రింద పడిపోయాయి. చంద్రకాంతులు జల్లే హారాలమధ్య స్తనమండలాలు రాయంచలను తలపింపజేస్తున్నాయి, చక్రవాకాలకు, కారండవ భ్రమ కలిగిస్తున్నాయి. ఇసుక తిన్నెల వలె జఘనాలు, పద్మసదృశ కింకిణులు, వారంతా నదీ దేవతలవలె వున్నారు.

కొందరి కుచమధ్యంలో మృదంగా లున్నాయి. కొందరు నిద్రలో విడిచే నిట్టూర్పులకు చీర చెరగులు పతాకాలవలె ఎగురుతున్నాయి. వారి వదనాలనుండి వెలువడే సుగంధం మత్తెక్కిస్తున్నది.

ఆ విభ్రమత్తులో ఒక వారిమణి తన ప్రక్కగా నిద్రించే సవతినే రాక్షసేశ్వరుడుగా భావించి ఆమె ముఖాన్ని ముద్దులాడుతున్నది. కొందరు తమ సఖీజనం భుజాలనే తలగడలుగా వుంచుకున్నారు. కొందరివస్త్రాలు అడ్డదిడ్డంగాపడివున్నాయి. ఆ అర్ధనగ్న దేహాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటున్నారు. ఆ అన్యోన్యశ్లేషంలో ఆనందం అనుభవిస్తున్నారు. ఒకరి భుజం ఒకరు కలుపుకుని పరునగా కొందరు పరున్నారు. బాహుసూత్ర గ్రథితమయిన నారీహారంగా వున్నదది.

నల్లత్రాచుల వంటి కేశపాశాలు, నవవికసిత సమ సదృశంగా వదనాలు, పూగుత్తుల బోలు వక్షోజాలు, తరుశాఖలవలె భుజాలు — వీటితో వసంత శ్రీవనంలా వున్నది ఆ సన్నివేశం.

ఇందరు సుందరీమణులున్నా రావణుడు సీతాపహరణం చేశాడంటే ఆవిడ ఈ జనాన్ని తలదన్నే సౌందర్యవతి కావాలి, అనుకున్నాడు హనుమంతుడు. ఆ మందిరంలో

ముందుకుసాగాడు. స్ఫటిక, మణి, రత్న, దంత, కాంచన నిర్మితమయిన శయనం గోచరించింది. దివ్యమాలలతో చంద్రకాంతు లీనే ఛత్రం దానికలంకారంగావుంది. సూర్యకాంతుల పాదపీఠం దాని ప్రక్కనేవుంది. ఆ తల్పాని కిరువంకలా సుందరవనిత లిరువురు చమరీ వాలాలతో రావణునికి గాలి వీస్తున్నారు. సుగంధసౌరభం మత్తుగా వస్తున్నది.

ఆ గంధ ధూపం నాసా తర్పణంగా వుంది.

రత్న కుండలాలంకృత కర్ణాలతో, పుష్పమాలా బంధిత భుజాలతో, స్వచ్ఛ ధవళ వస్త్రాలతో, రత్న చందనానులేపన దేహంతో, దివ్యాభరణాలతో మందర పర్వత సమంగా శయనించే లంకేశ్వరుడు హనుమంతునికి కనిపించాడు. సుష్ఠుగా మద్యం సేవించి, కామినీ జన గోష్ఠిలో అలసి హాయిగా నిద్రిస్తున్న రావణుని చూడడానికి హనుమంతుడు తానున్నచోటునుండి మరొక ఉన్నత స్తంభం అధిరోహించాడు. మత్తేభాలున్న ప్రస్రవణ గిరిలావుంది ఆ తల్పం

మినుములు రాసిపోసినట్టు నల్లటి దేహం, ఆ శరీరానికి అటూ ఇటూ ఐరావత దంతఘాత వ్రణచిహ్న శోభిత బాహుద్వయం. చక్కగా రూపొందించిన పరిఘాయుధాల వలె, మదించిన ఏనుగుతొండాలవలె వున్నవి ఆయన హస్తాలు. మణి, రత్న ఖచిత సువర్ణాంగుళీయకాలతో ఆయన హస్తాంగుళులు రత్నకాంతులీనే సర్పాలవలె వున్నాయి.

అయిదు పడగల పాములా వుంది ఆ చెయ్యి.

ఆ నిద్రలో రావణుడు విడిచేగాలితో భవనం అంతా నిండుతున్నది. తెల్లని శయనం మీద నల్లని రావణుడు, నిర్మల గంగాజలంలో మత్తకుంజరంలా కనిపించాడు. కాలమేఘంలో మెరుపులా ఆయన దేహంమీద మణి, రత్న భూషణకాంతులు.

ఆ మహాకాయుని వదనసన్నిధానంలో నిద్రించే ఒక ప్రియురాలు వీణనే ప్రియుడుగా భావించి కౌగిలించుకుంటున్నది. ఇంకొక రత్నాంగి మృదంగ పరిష్వంగంతో వున్నది. డిండిమ, పణవాది వాద్యాలను తమ బాహుబంధంలో వుంచుకుని వారంతా తన్మయులై నిద్రిస్తున్నారు. కొందరు తమ సవతులనే రావణ భ్రమతో కౌగిలింతలలో వున్నారు.

రావణుని ప్రక్కనే బంగారు కాంతులతో అతిలోక సౌందర్యంతో నిద్రిస్తున్న మండోదరి కనిపించింది, అంతే ! ఒక్కసారి ఒళ్లువిరిచి, తోక ముద్దు పెట్టుకుని, క్రిందికి దూకి, గంతులేస్తూ వానరప్రకృతిని ప్రదర్శించాడు, ఆవిడ జానకీదేవి అనుకుని.

ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
ననంద చిక్రీడ జగౌ జగామ ।
స్తంభా నరోహ న్నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం ॥

ఇదంతా ఒక్కక్షణం. ఉత్తర క్షణంలో సిగ్గుతో కుంచించుకుపోయాడు. భ్రమ తొలగింది. రాముని భార్య సురేశ్వరుని కూడా కన్నెత్తిచూడదు. ఇంక ఈ అసురేశ్వరుని శయనం మీద చేరుతుందా! ఈవిడ రావణపత్నులలో ఒకతె అయివుంటుంది. అనుకుంటూ మరో ప్రదేశానికి, యింకో ప్రాంతానికి అలా తిరుగుతున్నాడు. ఒళ్ళు తెలియకుండా త్రాగి. రతి క్రీడలతో అలసి, ఆచ్ఛాదనారహిత దేహంతో నిద్రించే వారెందరోవున్నారు.

పానశాలల సమీపంలో భోజనశాలలు. వాటిలో లేళ్లు, దున్నలు, వనవరాహాలు, మేకలు, కోళ్లు, నెమళ్ళు, ఇంకా ఎన్నెన్నో పక్షులను, మృగాలను ముక్కలు ముక్కలుగా నరికి కూరలు, వేపడాలు, పులుసులు చేసున్నారు. కొన్నిటి మీద కత్తినాటు లేకుండా యధాతథం కాలుస్తున్నారు.

పానశాలలలో పాత్రలలో రక రకాల మద్యాలు, ప్రక్కగా నంజుళ్ళకు వేడి వేడి మాంసభక్ష్యాలు, భోజనశాలలో చక్కని ఆసనాలు, ఎదురుగా భోజనపాత్రలు, అందులో కొన్ని సగం తినివిడిచినవి, సగం తాగి వదిలినవి. అన్నిటినీచూస్తూ మిగిలిన ప్రాంతాల వైపు వెళ్లాడు. నగ్నంగా అర్థనగ్నంగా వివశలై నిద్రించే నారీ సమూహం.

హనుమంతుని మనస్సు చివుక్కుమంది. పరస్త్రీని చూడటమే పాపం కాగా, ఈ నారీమణులను నగ్నంగా వున్నప్పుడు చూడడం మరెంత దోషం అనుకుని, మరుక్షణం లోనే ఆశ్వాసనగా —

నహి మే పరదారాణాం దృష్టి ర్విషయవర్తి నీ ।
అయం చాత్ర మయాదృష్టః పరదార పరిగ్రహః ॥

ఇందరిలో సీత కనిపిస్తుందేమో అని చూశానేతప్ప, నా మనస్సులో మరే వికారమూ లేనప్పుడు నేను బాధపడ నవసరంలేదు. సర్వపుణ్యపాపాలకూ శుభాశుభాలకూ మనస్సు ప్రధానం. నా మనస్సు ఇందరు స్త్రీలను చూసినా నిశ్చలంగా నిర్మలంగానే వుంది. పైగా సీతాదేవి స్త్రీ జనమధ్యంలో కాక మరెక్కడ దొరుకుతుంది, అనుకుంటూ ఆ భవన మంతా మరోసారి శోధించి వెలుపలకు వచ్చి, లతా గృహాలు, చిత్ర మండపాలు, నిశా మందిరాలు అన్నీ గాలించినా సీతజాడ లేదు.

ఆ మహామహుని మనస్సు దుఃఖభరిత మయింది.

రావణుని దుర్బుద్ధికి భయపడి శీల రక్షణార్థం ప్రాణత్యాగం చెయ్యలేదుకదా! ఈ భయానక వికృత రాక్షస గణాన్ని చూచి గుండెలు బద్దలుచేసుకోలేదుగదా. ఈ స్థితిలో నేను ఏ ముఖంతో కిష్కింధకు వెళ్ళగలను, ముందు సముద్రం ఒడ్డున వున్న అంగదాదులకు ఏం చెప్పను.

ఏ మయినా సరే సీతను చూడకుండా లంక వదలను. అసలీ విచారం ఏమిటి. అన్ని అనర్థాలకూ మూలం నిర్వేదం. దాన్ని వదిలి ఉత్సాహంతో మళ్ళీ అన్వేషిస్తాను. అని రావణాంతఃపురం అంతా మళ్ళీ తిరిగి, విచారగ్రస్తుడై:

జానకీదేవి లంకలో లేదు. బహుశః రావణుడు రామబాణ సముద్రంలో వదలి వుంటాడు. కాకపోతే సీత స్వయంగా సాగరంలో దూకివుండాలి లేదా, ఈ క్రూర రావణుడు ఆవిడను ఆరగించాడా! కాక ఈ రావణపత్నులే భుజించారో సీతను.

నిరంతరం రామలక్ష్మణులను స్మరించుకుంటూ ప్రాణత్యాగం చేసి వుండదుకదా. పంజరంలోని చిలకను పీక పిసికి చంపినట్లు వీరు ఆమెను చంపివుండాలి.

అయితే ఈ వార్త రామునికి చెప్పడం ఎలా:

జానకీదేవిని చూడకుండా వెళ్ళడం ఎలా:

వెళ్ళినా లంకలో రాక్షసులందరినీ చూశానని చెపితే వానరులందరూ ఎంత పరిహసిస్తారు!

పైగా సీత కనిపించలేదు, అని నేననగానే రాముని ప్రాణాలు పైకిపోతాయి, మరు క్షణంలో లక్ష్మణుడు ప్రాణత్యాగం చేస్తాడు. ఈ వార్త తెలిసి అయోధ్యలో భరత శత్రుఘ్నులు, వారి తల్లులు ప్రాణాలు వదులుతారు. ప్రాణమిత్రుడయిన రాముడు తనువు చాలిస్తే సుగ్రీవుడు బ్రతుకుతాడా! ఆయనతో రుమ, తార, అంగదుడు అందరూ దేహ యాత్ర ముగిస్తారు. మా సేనాధిపతులు కొండలమీదనుండి దొర్లిపడి ప్రాణాలు వదులు తారు. ఇంతమంది ప్రాణాలను తీసేందుకా నేనింత శ్రమపడ్డది. ఇక్ష్వాకువంశం, వానరగణం నశించడం కోసమా-నేను సాగరలంఘనం చేసినది.

ఒక్కటే మాట, సీత కనిపించకపోతే వేము లంకనుండి కదలను. వారంతా నా రాకకోసం ఎదురుచూస్తూ ఎంతకాలమైనా జీవిస్తారు. నేనీ సముద్రం ఒడ్డున వానప్రస్థ జీవితం గడుపుతాను, లేదా చితిపేర్చుకుని మరణిస్తాను. అని యింతసేపు దుఃఖించి ఇదేంకాదు. నా బలపరాక్రమాలతో రావణుని వధిస్తాను, కాదంటే ఆ రాక్షసుని బంధించి పశువును పట్టుకుపోయినట్లు తీసుకువెళ్ళి రాముని పాదాలమీద పడవేస్తాను, అనుకుంటూ అంతవరకూ చూడని అశోకవనంలో ప్రవేశించాడు. అక్కడ సీత కనిపిస్తుందనే ఆశ అంకురించింది.

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మ జాయై ।
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రాగ్ని మరుద్గణేభ్యః॥

## అ శో క ం

సాల, చూత, నాగ, అశోక తరు పంక్తులు. అన్నీ ఫల, పుష్ప భరితములై నయన నాపాతర్పణం చేస్తూంటే, ఆ చెట్ల కొమ్మలపై రంగు రంగుల పక్షులు గూళ్ళలో కలతనిద్రలో కలస్వనాలతో కర్ణపర్వం చేస్తున్నాయి. హనుమంతుడు ఆ వనంలో ఒక కొమ్మ మీదనుండి ఒక కొమ్మమీదకి, ఒక చెట్టుమీదనుండి మరొక చెట్టుమీదికి లంఘిస్తూంటే, ఆ అలజడికి కొన్ని పక్షులు గాఢనిద్రలోంచి మేలుకొని కలవరస్వనాలు చేశాయి. ఆ చెట్లమీది పువ్వులు శరీరం నిండగా హనుమంతుడు వసంతునివలె వున్నాడు. ఆకులూ, పువ్వులూ రాల్చిన వృక్షాలు దిగంబరిగా నిలచిన ధూర్తస్త్రీవలె వున్నాయి.

ఆ వనంలోని చెట్ల గుంపుల నడుమ, లతానికుంజాలలో, దిగుడు బావులదగ్గర, తటాకాల సమీపాన, క్రీడాపర్వత గుహలలో, శిఖరాగ్రాలపై, సెలయేటి తిన్నెలమీద అంతటా అన్వేషించి, వనమధ్యంలో వున్న మహోన్నత శింశుపావృక్షం అధిరోహించాడు. అప్పటికి చంద్రుడు పడమటి కొండకు చేరుతున్నాడు. ఆ వెన్నెల వెల్లువలో అశోకవనం మరింత రమణీయంగా వుంది.

రామవియోగ దుఃఖంతో వున్న సీతాదేవి లంకలో వుండి వుంటే ఈ సమయంలో నదీస్నానానికి వచ్చి యిక్కడే సంధ్యను ఉపాసించాలి, అనుకుంటూ నందన వనంలా,

చైత్రరథ వనంలా వున్న ఆ ఉద్యానవనాన్ని తిలకిస్తున్నాడు. వనస్థలి అంతా రంగు రంగుల పూలతో నక్షత్రశోభిత గగనతలం వలె వుంది. ఆ శింశుపావృక్షానికి అల్లంత దూరంలో కైలాసగిరివలె తెల్లగా, పగడాలు పొదిగిన బంగారుమెట్లతో మహాప్రాసాదం కని పించింది ఆ సౌధ సమీపంలో వృక్షం క్రింద ఒక స్త్రీమూర్తి ఉపవాస కృశీభూత దేహంతో శుక్లపక్ష ప్రారంభవేళ చంద్ర రేఖవలె, దీనవదనంతో, మాసిన వసనం అవగుంఠనంగా, చిరిగిన పీతవసనం ధరించి పంకంలో వున్న పద్మంలావున్న నారీమణి కని పించింది. దుఃఖసాగరంలో వున్న ఆ నారీరత్నాన్ని పరివేష్టించి రాక్షసగణం వున్నది. జడ గట్టిన వేణి ముందుకున్నవాలి నల్ల త్రాచువలె కనిపిస్తున్నది. ఆ కృశీభూతగాత్రను చూచిన హనుమంతునికి, కొంతకాలం క్రితం రావణుడు గగనవీధిని కొనిపోతున్న స్త్రీ మూర్తి స్ఫురణకు వచ్చి ఈ సాధ్వీమణి సీతాదేవి అయివుండాలి, అనుకున్నాడు.

నియమ వ్రతపరాయణమైన తపస్వినిలావుంది. భయంతో గాలివిడిచే భుజంగ వధువులా నిట్టూర్పులు విడుస్తూ శోక ధూమావృతమైన అగ్నిలా వుంది. భ్రష్టసిద్ధిలా, కలుషిత బుద్ధివలే, మిధ్యాపవాద దూషితకీర్తిలా వున్న ఆమె చుట్టూ భీకర రాక్షస స్త్రీ గణం, శరీరమంతా దుమ్ముకొట్టుకుని, అలంకార రహితంగా వున్న ఆ నారీమణి కాల మేఘాచ్ఛాదిత మైన చంద్రబింబంలా కనిపించింది.

ఆమ్నాయ సంయోగం లేక శిథిలమైన విద్యవలె, అనర్థ ద్యోతకంగా సంస్కార శూన్యమైన వాక్కువలె వున్నది.

చూస్తున్నాడు హనుమంతుడు తదేక దీక్షతో.

రామచంద్రుడు సీతా స్వరూపాన్ని వర్ణించినతీరు అంతా కనిపిస్తున్నది. ఆయన ఆభరణాలున్నవని చెప్పిన చోట్లలో ఆయా అలంకారాల గుర్తులున్నాయి. ఋశ్యమూకం మీద తాను చూచినప్పటి పచ్చని పట్టు ఉత్తరీయం మాసివున్నది. అలానే ఆమె కట్టిన చీర దుమ్ముకొట్టుకుని వున్నది. శరీరం ధూళి ధూసరితమైనా సువర్ణకాంతు లీనుతూనే వుంది, ఇంతటి దీనదశలో వున్నా మనస్సు స్థిరంగానే ఉన్నట్లుంది. సందేహంలేదు ఈవిడ రాఘవుని ధర్మపత్ని.

ఇయం కనక వర్ణాంగీ రామస్య మహిషీప్రియా ।
ప్రణష్టాపి సతీయస్య మనసో న ప్రణశ్యతి ॥

ఈ ఇల్లాలు యింతటిది కనుకనే ఆయన అంతగా దుఃఖ వివశుడవుతున్నాడు. దయా, శోక, కారుణ్యాలతో మన్మథవాంఛ అంత బలీయంగా ఆయనను ఎందుకు

వేధిస్తున్నదో యిప్పుడు తెలుస్తున్నది. క్రూరరాక్షస హస్తాలలో సాధుశీల పడినందుకు కరుణ, తన ధర్మపత్ని కంత దురవస్థ కలిగిందని శోకం, ఆవిడకు సరైన ఆశ్రయం లేదే అని దయ, హృదయాహ్లాదం కలిగించే ప్రియురాలు కనక మదనతాపం.

రూపం, దానికి తగిన అంగసౌష్ఠవం, తోడు మనోదార్ఢ్యం యివన్నీ ఆ ఉభయులనూ అన్యోన్యానురాగం గల దంపతులుగా చేశాయి. ఇటువంటి యిల్లాలు దగ్గర లేకుండా ఆయన ఇంతకాలం ఎలా బ్రతకగలిగాడు. ఈ దుఃఖాన్ని భరించ గలుగుతున్నాడంటే రామచంద్రుడు ఎంతటివాడై వుండాలి, అని తనలో తనే తర్కించుకుంటున్నాడు.

రూప, గుణ, శీలాలలో సాదృశ్యంకల భార్యాభర్తలుండడం అరుదు. అయినా కాలం ఎంత బలీయమయినది. వినీతుడయిన లక్ష్మణునివంటి మరిది, రాముని వంటి భర్త వున్న సీతకు ఇటువంటి కష్టాలు రావలసినదేనా!

ఈ ఇల్లాలుకోసమే రాముడు అసాధ్యాలను సాధించాడు. కబంధుడు, వాలివంటి మహాబలులు నిహతులు కావడం ఊహించగలమా! విరాధుడు చస్తాడని ఎవరనుకున్నారు! జనస్థానవాసులు ఖర, దూషణులు తమ పదునాలుగువేల భీకర నిశాచరగణంతో ఒక్క వీరుని చేతులలో నేల కూలుతారని ఎవరనుకున్నారు! వాలిపదచ్యుతుడై సుగ్రీవుడు పట్టాభిషిక్తుడవుతాడని కలగన్నామా! నేను ఈ నూరుయోజనాల సముద్రాన్ని తరించగలనని ఎవరూహించారు! రెప్పవెయ్యకుండా నగర రక్షణచేసే రాక్షసగణం కన్నుగప్పి లంక అంతా నేను తిరగ గలిగానంటే, వీటన్నిటికీ ఈ ధర్మశీల కారణం.

సీతా శీల సౌందర్యం యిన్నిటికంటె మహత్తమ మయినది. నదీ, నగ సాగర పరివృతమయిన భూమండలాన్ని రాముడు తల్లక్రిందులు చేసినా ఆశ్చర్యంలేదు, ఈవిడ కోసం. ఈ జానకీ శీలసౌందర్యంతో త్రైలోక్యసామ్రాజ్యాధిపత్యం కూడా తూగదు.

విదేహాధీశుని అనుంగుపుత్రి, దశరథుని పెద్దకోడలు, రామచంద్రుని ఇల్లాలు. ఈవిడకే యిటువంటి అవస్థ ప్రాప్తించిందంటే కాలం ఎంత వంచనాశీలం కలది. సర్వరాజ్యభోగాలూ విడిచి భర్తృసేవకోసం మహారణ్యాలకు వచ్చిన సీత ఈ క్రూరరాక్షసీ గణమధ్యంలో ఎంతటి బాధలు పడుతున్నది. అయినా రామునే ధ్యానిస్తూ ఈ భీకరనారీ జనాన్ని కాని, పుష్పితాశోకాన్ని కాని చూడడంలేదు. ఈ దశలో ఈ యిల్లాలిని చూస్తుంటే నా మనస్సే శోక సంతప్తమవుతున్నది, అనుకుంటూ అటే చూస్తూవున్నాడు హనుమంతుడు.

తెల్ల కలువవలె నిర్మలంగా చంద్రుడు నీలసరోవరాకాశంలో ముందుకు సాగుతూ పడమటికొండకు చేరుతున్నాడు క్రిందికి వాలిన చంద్రునికిరణాలు వృక్షమూలాలలో ప్రసరిస్తున్నాయి. అప్పుడు చూశాడు హనుమంతుడు అక్కడి రాక్షసగణాన్ని.

ఏకాక్షి, ఏకకర్ణ, శంకుకర్ణ, కర్ణశూన్య, ధ్వస్తకేశి, శూన్యకేశ, కేశకంబళ, దీర్ఘలలాటకర్ణ, లంబోష్ఠ, లంబాస్య, లంబజానుక, కుబ్జ, వామన, కరాళ, పింగాక్ష అలా వారి వారి వికృతాకారాలకు సరిపడే నామాలతో కొందరు. ఏనుగు పెదవులు, గుర్రపుపాదాలు, గాడిదచెవులు, కోతిచెవులు, ఆవుచెవులు, అడ్డం తిరిగిన ముక్కులు, పొడుగుసాగిన ముక్కులు, తొండపుముక్కులు, ముక్కులే లేనివారు, పొడవైన మెడలు, మెడలేనితలలు, కుంభసదృశ ఉదరాలు కొన్ని, కనిపించని పొట్టలు కొన్ని, అతి విశాలముఖాలు కొన్ని, పెద్దపెద్దకళ్ళతో భయంకరముఖాలు కొన్ని, బాగా పొడవుగా సాగిన నాలుకలతో కొందరు, కొన్ని గొర్రె ముఖాలు, మరికొన్ని గాడిదముఖాలు, కొందరిజుట్టు దుమ్మురంగుతో ఉంది.

అందరిచేతులలో శూలాలూ, ముద్గరాలూ వున్నాయి. మరొకచేతిలో పానపాత్రలు. ఎదురుగా మాంసభోజనాలు. రక్తం నంజుకుంటూ మాంసఖండాలు ఆరగించే ఆ రాక్షసస్త్రీజన దర్శనంతో హనుమంతునిగుండె జలదరించింది. ఈ రాక్షస మధ్యంలో జానకి, కాంతి హీనమయిన నక్షత్రం భూమిపై పడినట్లుంది. మందనుండి తప్పిపోయి సింహం ఎదుట పెడ్డ గజవధువులా వుంది. శరన్మేఘంలోవున్న చంద్రరేఖలా వున్నదామె, మూరీభవించిన శోకంలా, ఉత్తాలంగా లేచిన దుఃఖతరంగంలా వున్నది.

జానకి దర్శనంతో హనుమంతుని కన్నులు అశ్రుపూరితా లయాయి. రామ లక్ష్మణులకు మనసా నమస్కరించాడు.

తెల తెలవార నున్నది. తూర్పుదిక్కులో ఉషోరాగాలకు అంకురార్పణ అయింది. ఆ సమయంలో రావణాంతఃపురంనుండి వేదధ్వని వినవచ్చింది. షడంగ వేదవిదులయిన బ్రహ్మరాక్షసుల వేదఘోషతో మంగళవాద్యాలు సాగుతున్నాయి.

అది రాక్షసేశ్వరునికి మేలుకొలుపు.

షడంగ వేదవిదుషాం క్రతుప్రవరయాజినాం ।
శుశ్రావ బ్రహ్మఘోషాంశ్చ విరాత్రే బ్రహ్మరక్షసాం ॥

లంకేశ్వరుడు కన్నులు తెరిచాడు. మనసులో జానకి కదలింది. మన్మథతాపం ప్రారంభమయింది. దాన్ని నిగ్రహించుకోవడం అతికష్టమయింది, శయ్యాగృహం వదులుతూ తారహారాలు సవరించుకుంటూ, అశోకవనంవైపు సాగుతూన్న ఆయనవెంట నారీజనం బయలుదేరింది. వారితో దాసీజనం సువర్ణదీపాలతో, ఛత్రచామరాలతో, మంగళజలకలశాలతో నడుస్తున్నారు. దర్భాస్తరణంతో ఒకతె, రత్నఖచితపానపాత్రతో ఒకతె వెంటనంటి రాగా అశోకవనంలో అడుగుపెట్టాడు.

నిద్రమత్తు అప్పుడప్పుడే వదులుతూన్న నారీమణులు తమ ఆభరణాలూ, వస్త్రాలూ సరిజేసుకుంటున్నారు. వారి కంకణ, కాంచీ, నూపురస్వనాలు హనుమంతుని కర్ణాలలో ప్రతిధ్వనించాయి ఆ ధ్వని విని కనులు విప్పారించి చూచిన హనుమంతునికి దీపకాంతులు కనిపించాయి. అంతలో మంచిగంధపు వాసనలు, అమృత మథనవేళ క్షీరసాగరంలో పుట్టిన నురుగువంటి చీనాంబరంతో, అరుణారుణకాంతి ద్యుతులీనే నేత్రాలతో వచ్చే లంకేశ్వరుని చూచి ఆశ్చర్యచకితుడై ఆకులమధ్యకు తప్పుకున్నాడు.

రాక్షసప్రభువుని చూచినసీత ఝుంఝూమారుతంలో అరటిమొవ్వులా కంపించింది. కాళ్ళుముడుచుకుని వుదరాన్ని, బాహుద్వయంతో ఉరఃస్థలాన్నీ అచ్ఛాదించుకుని కన్నీరు విడుస్తున్నది. ఆమె శరీరం అక్కడున్నదేకాని మనస్సు సంకల్ప హయాలమీద రాముని తోనే వున్నది.

అప్పుడు రావణుడు :

ఓ సీతా ! ఎందుకలా భయపడతావు. శరీరసౌందర్యాన్ని అలా అచ్ఛాదించు కుంటావు దేనికి !

ఓ మోహనాంగీ ! నామీద దయచూపవే ! విశాలాక్షీ ! నన్ను ప్రేమతోచూడవే! ఇక్కడ నీకేంభయం లేదు. నీకు ధర్మభీతి చాలావున్నట్టుంది. మేం కూడా ధర్మనిరతులం సుమీ. పరస్త్రీగమనమూ, పరదారాపహరణమూ రాక్షసవంశానికి పరమోత్తమధర్మాలు. ఆ ధర్మనిర్వహణలో మే మెప్పుడూ అప్రమత్తంగానే వుంటాం. అయితే నిన్ను బలాత్కరించి పొందడం నాకు ఇష్టంలేదు. నీలంతట నువ్వే నన్ను ఆహ్వానించే రోజుకోసం ఎదురుచూస్తున్నాను.

ఇలా ఏకవేణితో, మలినవస్త్రాలతో, ఉపవాసాలతో అధశ్శయనంతో ఎంతకాలం కృశిస్తావు. సువాసనలీనే చందనాగరు ధూపాలతో, దివ్యవస్త్రాభరణాలంకృతవై, మణి రత్నఖచిత హంసతూలికా తల్పాలపై శయనించు. ఎప్పటికప్పుడు కొత్తరుచులూరించే భోజనం ఆరగించు. నాతో కలిసి మా లంకానగరంలో గీత, నృత్తగోష్ఠులను కన్నులార తిలకించు. లంకేశ్వరుడు రావణుడు యాచన ఎరుగడు. అటువంటి త్రిలోకవిజేత నీ ముందు చేతులు దోయిలించి నిలబడ్డాడు.

ఓ మనోహరాంగీ ! యౌవనం, సౌందర్యం, లావణ్యం ఇవిశాశ్వతంగా వుండవే. సాగరాభిముఖంగా సాగే ప్రవాహజలం వెనుదిరిగి నదిలోకి వస్తుందా ! అంతే ఈ సౌందర్య

లావణ్యాలు. ఓ వైదేహీ ! శీతాంశుసదృశాననా ! నిన్ను సృష్టించిన అనంతరం చతుర్ముఖ ప్రజాపతి యింతకంటే సౌందర్యనుపమ వుండరాదని నిశ్చయించుకున్నాడు. ఓ సువిశాల నితంబినీ, పృథుశ్రోణీ ! నీ లావణ్యశోభామయగాత్ర సౌందర్యం నన్ను వివశుని చేస్తున్నది. ప్రత్యంగుళం నా కన్నును ఆకట్టుకుంటున్నది.

ఇప్పటికయినా నీ అవివేకాన్ని విడిచి నన్ను భర్తగా స్వీకరించు. ఈనారీజనాన్ని చూడు. వీరందరికీ నువ్వు పట్టమహిషివి కావాలి. ముల్లోకాలనూ జయించి తెచ్చిన సర్వమణి, రత్న, కాంచన రాసులతో నా సర్వ సామ్రాజ్యం నీ పాదాలముందు అర్పిస్తాను. ఈ భూమండలం నీ తండ్రికి ధారవోస్తాను.

ఒక్కమాట! ఈ గోళంలో నాముందు నిలబడగల మొనగాడు లేడు. రణరంగంలో రావణుడు నిలిస్తే ఎదురు రా రెవరూ.

నేహ పశ్యామి లోకేన్యం యో మే ప్రతిబలం భవేత్ ।
పశ్య మే సుమహద్వీర్యం అప్రతిద్వంద్వ మాహవే ॥

రావణుడు రణరంగంలో అడుగుపెట్టాడో, వాలిన పతాకాలతో విరిగిన రథాలు, నేలకూలిన మహాయోధుల మృతకళేబరాలు, అంతే ! మరేమీ వుండదు. సురాసురు లెవరూ మనముందు నిలిచి ఊపిరి పీల్చుకోరు, అంతటి మహావీరుడు నిన్ను ప్రార్థిస్తు న్నాడు. మనను మార్చుకుని నన్ను ప్రేమించు. కరుణతో నన్ను అనుగ్రహించు. మధు మైరేయాలు సేవించి హాయిగా నాతో సుఖించు. నువ్వు కనికరించిన క్షణంనుంచి ఈ సర్వలంకాభోగాలు నీవి. నీ చిత్తంవచ్చిన వారికి వీటిని దానం చేసుకోవచ్చు. నీ మాట రాజశాసనం, నువ్వు ఆజ్ఞాపిస్తే మీ బంధువు లందరికీ ఈ సంపదలు ధారవోస్తాను.

ఓ సర్వాంగ సుందరీ! రాజ్యభ్రష్టుడూ, కాననవాసీ, వల్కలధారీ, అధశ్శయన నియమవ్రతుడూ అయిన రాముడు నీకెందుకే ! అస లా మనిషింకా బ్రతికి వున్నాడో లేదో, ఉన్నా నీ కంటబడేమాట కల్ల. మేఘాచ్ఛాదితమయిన చంద్రకాంతులు బలాక పక్షులకు అందుతాయా ! అలానే నువ్వూ రాముడికి దొరకవు. ఇంద్రుని కీర్తి హిరణ్యకశి పుడు అందుకోగలడా !

ఓ సుహాసినీ! గరుత్మంతుడు మహాసర్పాలను పట్టేటట్లు నువ్వు నామనస్సును లాగు తున్నావే. మాసిన చీరతో, అలంకారరహిత దేహంతో, సంస్కారంలేని వేణితో వున్నా నిన్నే నా మనస్సు వాంఛిస్తున్నది. నా అంతఃపురంలోని ఏ సుందరీరత్నం నన్ను

అలరించలేకపోతున్నది. ఈ దశలో. గుణ రూప సౌందర్యవతులయిన నా నవహ్నస వారీజనం నీ కనుసన్నలలో కదులుతుంది.

తేజస్సు, తపస్సు, సంపదలు ఎందులోనూ రాముడు నాతో తూగడు. సుఖంగా నన్నుపొంది నీ బంధుబాంధవులకు ధనధాన్యాలు పంచిపెడుతూ ఆనందించు. వనాలలో, నదీతీరాలలో, భ్రమరగీతాలు వింటూ నాతో భోగాలు పొందు, అన్నాడు.

పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్
ధననిచయం ప్రదిశామి మేదినీంచ ।
మయిలల లలనే యథాసుఖం త్వం
త్వయిచ సమేత్య లలంతు బాంధవాస్తే ॥

రౌద్రావతారుతయిన రావణుని మాటలు వింటున్న సీత మనస్సు దుఃఖంతో గజగజ లాడి కొంతసేపటికి చిక్కబట్టుకుని, రాముని ధ్యానిస్తూ ఒక గడ్డిపరకను ముందుగా వుంచి:

రావణా! నీ మనస్సు నీ నారీజనంమీదనే లగ్నంచేసుకో. పాపబుద్ధులు పుణ్య సిద్ధులు పొందలేరని ఎరుగుదువుగా. అలానే నీకు నేను అందను. ఉత్తమ వంశసంజాతను, పాతివ్రత్య ధర్మచిత్తను. నేను నీ ప్రార్థనను మన్నించలేను. అంటూ తన ముఖం వానికి చూపించడం యిష్టంలేక వెనుదిరిగి:

పతివ్రతను, పరుని భార్యను, నేను నిన్ను వరించలేను. నువ్వు చాలాధీశాలివని విన్నాను. ఆ శక్తితో ధర్మాచరణకు పూనుకో. నువ్వు రాజువి. నీ భార్యలను రక్షించుకున్నట్లే యితరుల స్త్రీలకు కూడా ఏ ప్రమాదమూ రాకుండా చూడాలి. ఆత్మదారలయందే అనురాగంతో వుండాలి.

అలాకాక పరదారలయందు మనసు పడితే వారు అవమానిస్తారు. చపలుడు, చలితేంద్రియుడు, ప్రజ్ఞాహీనుడు అయినవాడే యిటువంటి భ్రష్టబుద్ధితో వుంటాడు. నువ్వు కాకపోతే నీ రాజ్యంలో అయినా సదాచార సంపన్నులు లేరా. వారిని చూచి నేర్చుకో, తీవ్ర గర్వంతో నువ్వు ముందు చూపులేకుండా వున్నావు. ఈనాడు నువ్వు చేసిన ఈ అకార్యం సర్వ రాక్షసగణాన్నీ నశింపజేస్తుంది. ఆత్మావబోధ లేకుండా నీతిమార్గం విడిచి చరించేవాని సర్వసంపదలూ నశిస్తాయి, దూరదృష్టి లేకుండా చిత్తం వచ్చినట్లు సాగితే నాశనమే సన్నద్ధం అవుతుంది. ఇప్పుడు నువ్వుచేసే దుష్కర్మల ఫలంగా తరతరాల ప్రజలు నిన్ను నిందిస్తూనే వుంటారు.

నీ సంపదలన్నీ చూపించి నన్ను ప్రలోభపెడదామనుకుంటున్నావు. కాని, సూర్యుని విడిచి ప్రభ వుండదు. అంతే నేనూను. రాముడుకాక మరొకని నీడ చేరను. ఆ లోకనాథుని భుజదండం ఉపధానంగా నిద్రించే నేను మరొక భుజదండాన్ని కన్నెత్తి చూడను. వ్రతస్నాతుడయిన విప్రశ్రేష్ఠునికి ఉత్తమవిద్యవలె రామునికి నేను తగినదానను.

రావణా! ఒక్కమాట! నీకు వివేకం యింకామిగిలివుంటే నన్ను తీసుకువెళ్ళి ఆ రాఘవునికి సమర్పించుకో. ఆయన శరణాగత వత్సలుడు. ధర్మజ్ఞుడు. ఎవరెంత దోషం చేసినా శరణువేడితే క్షమించగల ఉదారుడు. నీకు పదికాలాలు జీవించాలని ఉంటే నా మాట విను. లేదా, ఘోరవిపత్తులు నీ నెత్తిమీద పడతాయి. వజ్రాయుధ ఘాతం తప్పించుకోవచ్చు, యమధర్మరాజు చేతులనుంచి బయటపడవచ్చు, కాని రాఘవులు ధనుష్టంకారం చేశారో యింక ఆ ప్రాణి కన్నుతెరవదు. విషజ్వాలలు క్రక్కే బాణాలు రామధనుర్విముక్తాలు కాకముందే నువ్వు రాముని పాదాలపైపడి క్షమాభిక్ష వేడుకో. రాముడనే గరుత్మంతుడు రాక్షససర్పాలను బాణనఖాలతో చీలుస్తాడు. ఆ నాడు వా రుభయులూ ఆశ్రమంలో లేనివేళ వచ్చావు గనుక బ్రతికిపోయావు. లేకుంటే అప్పుడే నీ జీవితం చల్లారేది. పెద్దపులి ఎదుటపడ్డ నక్కవయేవాడివి. ఇప్పుడయినా నీకా అవస్థ తప్పదు. ఉత్తరదిశలో కుబేరుని శరణువేడినా, పశ్చిమంలో వరుణవానంలో దాగినా పిడుగుపడ్డ చెట్టులా మాడిపోకతప్పదు. ఆలోచించుకుని యిప్పుడయినా నువ్వు దాశరథుల పాదాలు ఆశ్రయించు, అంది.

పరమ కటువుగావున్న జానకి మాటలువిన్న రావణుడు: స్త్రీలమీద మనసుపడి, దానివెంటబడి ప్రణయప్రార్థన చేసే మగవాడికి అవమానమే ఎదురవుతుంది. యథేచ్ఛగా పరుగులుపెట్టే గుర్రాన్ని సమర్థుడయిన సారథి వేర్పుగా లొంగదీసేటట్లు నాలోని కామం నా క్రోధ విజృంభణాన్ని అరికడుతోంది. జానకీ! కామం చాలాచెడ్డది, అది దయా స్నేహాలకు ఆధారభూమి. అందుచేతనే, ఓ విశాలనితంబినీ! నీ మెట్టవేదాంతం వింటూ కూడా దయార్ద్రహృదయంతో నిన్ను నాకత్తివాదరకు ఎరచేయకుండా వదులుతున్నాను. సరే! ఈ అధికప్రసంగాలు దేనికి. నీ కిచ్చిన గడువు యింక రెండుమాసాలు. ఈ వ్యవధిలో నీ మనసు మారిందా త్రైలోక్యసామ్రాజ్యం నీ పాదాలముందు ఉంటుంది. లేదా నిన్ను మా పాకశాలాధికారులు ఉదయపు ఫలహారంగా వండి వంపుతారు నాకు; అని రావణుడు మాట్లాడుతూంటే, ఆ చక్రవర్తి వెనుకనున్న దేవ, గంధర్వకాంతలు వారి నేత్ర హస్త సంజ్ఞలతో సీతను భయపడవద్దని సూచిస్తున్నారు

వారి సంజ్ఞలతో ధైర్యం తెచ్చుకున్న జానకి :

రావణా! నీ నగరంలో ఒక్కడూ నీ శ్రేయఃకామి లేడనుకుంటాను. లేకపోతే ఎవడో ఒకడు హితబోధ చేసి వుండేవాడు. దేవేంద్రుని విడిచి శచీదేవి వుండలేనట్లే ధర్మాత్ముడయిన రాముని విడిచి నే మండనని ఎరుగజెప్పరా నీకు. ఓ రాక్షసాధమా! నీ నీచ ప్రలాపాలకు ఫలితం అనుభవించకపోవు. మహారణ్యమధ్యంలో మత్తేభంతో వైరం తెచ్చుకునే చిన్న కుందేలువు నువ్వు ముందువెనుకలు తెలియకుండా నువ్వు రాఘవులను నిందిస్తున్నావు ఆయన కంటబడేవరకే నీ ఆయువు. ఇంతటి దుష్టబుద్ధితో నన్ను చూసే నీ కళ్ళింకా బ్రద్దలయి నేలపడవేం! దశరథరాజేంద్రుని కోడలిని, ధర్మాత్ముడయిన రాముని ప్రియపత్నిని, ఇంత నీచంగా భావించి నాతో మాట్లాడే నీ నాలుక ఊడిపడదేం!

నా భర్త ఆజ్ఞ లేకపోవడంవల్ల, నా పాతివ్రత్యతపస్సు భంగమవుతుందని యింత కాలం ఆగానేకాని ఏనాడో నిన్ను బూడిదచేసి ఉండేదానిని. నన్ను అపహరించాలనే తలంపు పుట్టిన క్షణంలోనే మృత్యువు నీ వెన్నుమీదవాలింది. అదేకాకపోతే సర్వరాక్షస రాజ్యాధిపతివి, కుబేరుని సోదరుడివి, నీకు రాముని మోసగించి ఆయన భార్యను అపహరించాలనే బుద్ధి ఎందుకు పుడుతుంది, అంటూంటే రావణుడు కన్నులెరుపెక్కగా, నీలజీమూతసన్నిభ దేహం పొంగగా, భూమి కంపించేటట్లు పాదతాడనంచేసి, అగ్నిశిఖాసదృశమయిన జిహ్వ బైటికి జాపి :

ఓసి మూర్ఖురాలా! నోటికివచ్చినట్లు మాట్లాడుతున్నావు ఈ క్షణంలో సంహరించగలను, అని క్రుద్ధభుజంగంవలె నిట్టూరుస్తూ: ఓసి ఏకాక్షీ, హస్తికర్ణీ సింహముఖీ అని అందరినీ పేరు పేరునా పిలిచి :

మీరంతా నయానా, భయానా ఈమె మనసు మార్చడానికి ప్రయత్నించండి, అంటూ క్రోధతామ్రాక్షులు సీతవైపు ప్రసరించాడు

అది చూచి రావణుని పత్నులలో ఒకతె ధాన్యమాలి :

మహారాజా! ఈ దీనురాలు రూపహీన, సామాన్యమానవ స్త్రీ అయిన జానకి, నీకెందుకయ్యా. నీయందు పరమానురాగంతోవున్న నాతో క్రీడించు, ఈ మానవికి నీ దివ్యభోగాలు అనుభవించే అదృష్టంలేదు. నీమీద వాంఛలేనిదానితో నీకు సుఖం వుండదు, పైగా తాపం మిగులుతుంది. నీయందు మనసుపడిన స్త్రీతో నీ మనసు కలువకుంటే నీ శరీరానికి సుఖమూ, మనసుకి తృప్తి కలుగుతాయి.

అకామాం కామయానస్య శరీర ముపతప్యతే ।
ఇచ్ఛంతీం కామయానస్య ప్రీతిర్భవతి శోభనా ॥

అంటూ రావణుని భుజంమీద చెయ్యివేసి వెనుకకు త్రిప్పింది. వికటాట్టహాసంచేసి రావణుడు వెనుదిరిగాడు. నారీజనం ఆయనను అనుసరించారు.

మిగిలిన రాక్షసీగణం : ఓ జానకీ! మా లంకేశ్వరునికి ఏం తక్కువయిందని తిరస్కరిస్తున్నావు. అసలాయన ఎవరనుకుంటున్నావు? బ్రహ్మమానస పుత్రులయిన ప్రజాపతులు ఆరుగురు. వారిలో నాల్గవవాడు పులస్త్య ప్రజాపతి. ఆయన కుమారుడు విశ్రవసువు. వీరి పుత్రుడు మా రావణ ప్రభువు. ఇటువంటి భర్తదొరకడం ఎంత అదృష్టమో తెలియడం లేదు నీకు, అని ఏకజట అనగా, హరిజట తన పిల్లి కళ్ళను వికృతంగా త్రిప్పుతూ : మా ప్రభువంటే నీకు తెలీదు. త్రింశత్కోటి దేవతలూ ఆయన చేతులలో ఓడినవారే. రణ రంగంలో ముందుచూపేగాని వెన్నుత్రిప్పడం ఎరగడాయన. మా ప్రభువుల అంతఃపురంలో అతిలోకసుందరీమణులు వేలాదిగా పడివున్నారు. అయినా వారందరినీ కాదని ఆయన నిన్ను ప్రేమిస్తుంటే నువ్వింత తెలివితక్కువగా ఆయన అభిమానాన్ని వదులుకుంటున్నావు అన్నది

వికట : దేవతలేకాదు, నాగ, గంధర్వ, దానవగణాలు మా ప్రభువు పాదాలముందు తలలు వాల్చారు. అటువంటి మహావీరుని కాదనగల ధైర్యం ఎక్కడిదే నీకు!

దుర్ముఖి : మా ప్రభువు పేరువింటే వాయువు స్తంభించిపోతాడు. గ్రీష్మభానుడు చల్లగా వెలుగుతాడు. చూశావా, ఈ మా వనంలో లతలు, చెట్లు, ఋతునిమిత్తం లేకుండా పూలు పూసి ఫలాలనిస్తాయి మేఘాలు వర్షిస్తాయి. సెలయేళ్ళు నిర్విరామంగా ప్రవహిస్తుంటాయి. అటువంటి మహామహుని తిరస్కరించడం కంటే మూర్ఖత్వం లేదు.

ఇలా అందరూ అనేకవిధాల బోధించినా సీత మాట్లాడక పోవడంతో

జానకీ! నువ్వు త్రిలోకసుందరివని మా ప్రభువు నిన్ను కామిస్తే నువ్వు మూర్ఖంగా తిరస్కరిస్తూనే వున్నావు. నువ్వు నీమనుష్య స్వభావం వదులుకోలేకపోతున్నావు. సామాన్యుడయిన రాముడే మహామహు డనుకుంటున్నావు. రాజ్యహీనుడు, విపత్సాగరిమగ్నుడు, శ్రీశూన్యుడు అటువంటి భర్తతో ఏం సుఖపడతావు అంటూంటే సీత కన్నీరు ఒత్తుకుని :

ఔను, నేను మనుష్యస్త్రీని. నాకు రాక్షసపత్నిగావుండే అవసరంలేదు. మీరెంత బోధించినా నేను వినను. ఎందుకీ అనవ్వ. హాయిగా నన్ను తినేయండి

సూర్యునితో ప్రభ. ఇంద్రునితో శచి, చంద్రునితో రోహిణి, అగస్త్యునితో లోపాముద్ర, చ్యవనునివెంట సుకన్య, సావిత్రీసత్యవంతులు, అరుంధతీవశిష్ఠులు, నలదమయంతులు అలానే రామునితో సీత. నాభర్త రాజ్యహీనుడు, శ్రీహీనుడు మరేమయినా కానివ్వు. ఆయనే నాగురువు, దైవం, భర్త అనగా విని వారు కన్నులెర్రజేసి, కరాళ వదనాలు మరింత వికృతం చేసి, ఎర్రని నాలుకలు ఆడిస్తూ, శూల, ముద్గరాది ఆయుధాలను ఊపుతూ మీది మీదికి వస్తూంటే సీత భయంతో అటూ ఇటూ తిరిగి హనుమంతుడు అధివసించిన శింశుపావృక్షం క్రిందికి వచ్చింది, రాక్షసీగణం అక్కడికే చేరింది.

ఒకతె : ఇంక నీ పతిభక్తిచాలు. ఇప్పటికయినా మా ప్రభువునువరించు. అలా చెయ్యవో యిప్పుడే నిన్ను తినేస్తాం.

ఇంకొకతె : వినిపించిందా దాని మాట సీతా. త్వరగా తేల్చుకో. హాయిగా రాణివాసంలో సుఖపడతావా ! నీ గుండెలు చీల్చి తివెయ్యనా :

మరొకతె : ఎందుకే యింకా దీనితో మాటలు. దీని అందమయిన కన్నులు, అదురుతూన్న పయోధరాలు, కదలియాడే జఘనం, ఒక్కొక్క అవయవం ఎంతెంత రుచిగా వుంటాయో, బాగా నమిలి మింగి చూడాలి.

ప్రఘస : బావుంది. హాయిగా విరుచుకు తినేసి ఇదే ప్రాణాలు వదిలిందని చెపుదాం.

అజాముఖి : చంపి సమంగా పంచిపెట్టండి. మంచి మద్యం తెప్పించండి. పూలమాలలు కూడా కావాలి.

శూర్పణఖ : ఈరోజు మనకు పండగ, కల్లుకుండలు తెప్పించండి. సర్వశోకనాశని అయిన సురాపానం చేసి, మనిషి మాంసం తిని నికుంభిలా దేవిదగ్గర ఆనందనృత్యంచేద్దాం.

అలా ఎవరికి తోచినట్లు వారు క్రూరంగా, పరుషంగా మాట్లాడుతూంటే, జానకి భయకంపంతో ముడుచుకుపోయి కూర్చుంది. గాలివానలో లేత అరటి మొక్కలా కంపించి నేలకుజారింది, హా రామా! లక్ష్మణా! కౌసల్యా! సుమిత్రా! అంటూ కొంతసేపు విలపించి:

కాలం సమీపిస్తేకాని ప్రాణికి మృత్యువు రాదనేమాట నిజమే. కాకుంటే రాఘవుడు కనిపించకుండా ఘడియ గడపలేని నేను ఇంతకాలం ఎలా జీవించగలిగాను. ఏ జన్మలోచేసిన పాపఫలమో ఇప్పుడు అనుభవిస్తున్నాను. విధి ఎంత బలీయమయినది,

ఇంక ఈజీవితం వ్యర్థం. రాముడులేని ఈ సంపదలన్నీ ఎందుకు? ఈ నిశాచరుణ్ణి నా ఎడమకాలుతోనయినా తాకను. నీచుడు, క్రూరుడు, నా వెంటబడి ఈ రాక్షసాధముడు తన నాశనం తనే కొనితెచ్చుకున్నాడు. కాకుంటే లోకవిఖ్యాతినందిన దయాహృదయునితో వైరం కల్పించుకుంటాడా. జనస్థానంలోని పదునాల్గు వేలమందిని ఏకైక వీరుడుగా నిలిచి సంహరించినవాడు నాభర్త. ఆయన ఎందుకు ఉపేక్షిస్తున్నాడో. ఈ దశగ్రీవ సంహారానికి ఆయనకు ఒక్కక్షణం చాలు.

ఈ సముద్రం అడ్డంకాదు. అయితే ఆ మహామహితాత్ముడికి నేనిక్కడ వున్నట్టు తెలిసివుండదు. తెలిసినక్షణంలో ఆయన ముల్లోకాలలోని రాక్షస వంశీయులనూ సంహరించి తీరతాడు. సముద్రాన్ని బూడిదచేసి లంకానగరాన్ని సర్వరాక్షసగణంతో భస్మం చేస్తాడు. చితాగ్నిజ్వాలలు రేగుతుంటే, కాకులూ గ్రద్దలూ యధేచ్ఛగా విహరిస్తుంటే, నిశాచరస్త్రీలు అనాథలై రోదిస్తూంటే, మీ రావణచక్రవర్తి రూపుమాసిపోతాడు. మీరంతా మీ ఆప్తులకు పరలోకక్రియలు జరుపుకోవడమే మిగులుతుంది. మీ అధముడు పెట్టిన గడువు దాటుతున్నది. అరుణాబ్జాయతలోచనుడు నా రాముడు ఈ వార్తవినాలి, అదే మీ రావణుడికి ఆఖరుఘడియ

మీకు అంతఃకరణలేదు, దయా, ధర్మం తెలియవు, మీరు గడువుదాటగానే నన్ను చంపి తినేస్తారు. నా ప్రాణేశ్వరుని దర్శనభాగ్యం కూడా ఉండదేమో. ఇంతకీ ఆయన జీవించివున్నాడో, పరలోకగతుడయాడో. ఆయనకు నా అవసరం లేకుండా పోయిందేమో! దగ్గరవున్నప్పుడుండే ప్రేమాభిమానాలు మనుష్యులు దూరదేశంలోవుంటే వుండవనేమాట నిజమేనేమో, అయితే అది కృతఘ్నుల విషయంలో నిజం కావచ్చుకాని, రాముని వంటి కృతజ్ఞుడు అలావుండడు.

ఈ దుఃఖాన్ని భరించలేను, చావడానికి అవకాశంలేదు. ప్రియాప్రియాలకూ, సుఖ దుఃఖాలకూ లొంగని మనస్సు కలవారు ధన్యులు, అని విలపిస్తున్నది.

వారిలో కొందరు సీతమాటలు తమ ప్రభువుకి నివేదించడానికి వెళ్ళి తిరిగివచ్చి:

ఓ సీతా! నిన్ను ముక్కలు ముక్కలుచేసి తినేస్తాం, మా మాటలు వినకపోతే, అని మళ్ళీ భయపెడుతున్నారు.

ఆపండి మీ ప్రేలాపనలు, అంటూ అప్పుడే నిద్రలేచి త్రిజట వారందరినీవారించి:

మీరు తినేది సీతనుకాదు, మిమ్మల్నే మీరు తింటారు. ఇప్పుడే నాకొక కల వచ్చింది. అందులో రాక్షసనాశనం, రామవిజయం కనిపించాయి, అంది.

వారందరూ భయకంపితలయి ఆమె కల వివరంగా చెప్పమనగా, త్రిజట: ఈ జానకీదేవి భర్త రామచంద్రుడు గజదంత నిర్మితమయిన పాలకీలో హాయిగా తనభార్య సీతతో తమ్ముడు లక్ష్మణునితో విహరిస్తున్నాడు. అందరూ స్వచ్ఛశ్వేత వస్త్రాలతో వున్నారు. మరి కొంత సేపటికి చతుర్దంతగజవాహనారూఢులై సీతారాములు కనిపించారు. అంతలో శ్వేతపర్వతశిఖరం మీద రాముని ఒడిలో సీత వున్నది. మరికొన్ని క్షణాలలో సీతారామలక్ష్మణులు అధివసించిన భద్రగజం లంకా గగనవీధిలో వుంది. ఇక్కడనుంచి వారు పుష్పకం మీద ఉత్తరదిశగా వెళ్ళారు. రాముని ఎదుట దేవాసురులు నిలబడలేరు. పాపులు స్వర్గానికెంతదూరంలో వుంటారో రాక్షసులు రామభద్రునికి అంతదూరంలో వుండాలి. ఆ కలలో మరో కల-

మన లంకేశ్వరుడు ముండితశిరసుతో తైలదేహంతో ఎర్ర బట్టలు కట్టి, అతిగా మద్యం సేవించి పుష్పకం నుండి క్రిందపడ్డాడు. మానె త్రాగుతూ దక్షిణదిశగా పరుగెత్తుతున్నాడు. అంతలో గాడిద మీద పూరేగుతూ క్రిందపడ్డాడు. భయార్తుడై, మత్తప్రలాపాలతో, దుర్గంధభూయిష్టమయిన నరక నమకూపంలోపడ్డాడు. నల్లని స్త్రీ ఒకతె ఒంటి నిండా బాడిద పూసుకుని మన ప్రభువు మెడలో తాడువేసి లాగుతున్నది. కుంభకర్ణుడూ అదేదశలో వున్నాడు. రాకుమారులందరూ గొరిగిన తలలతో, నూనెకారే దేహాలతో వున్నారు, వరాహం మీద రావణుడు, శింశుమారంపై ఇంద్రజిత్తు, ఒంటెనెక్కి కుంభకర్ణుడు దక్షిణ దిశగా పోతున్నారు.

విభీషణుడుమాత్రం శ్వేతవస్త్రమాల్యానులేపనంతో శంఖ, దుందుభిధ్వానాలు వింటూ నాలుగుదంతాల భద్రగజంమీద తన మంత్రులు వెన్నంటిరాగా ఊరేగుతున్నాడు. ఈ లంకానగరం భగ్నగోపురమయి సముద్రంలో మునుగుతూ కనిపించింది, బలిష్ఠుడయిన వానరుడొకడు దీన్ని దగ్ధం చేస్తున్నాడు. కుంభకర్ణాదులు ఎర్రగుడ్డలతో గోమయకూపంలో దూకుతున్నారు.

ఈ స్వప్నాలన్నీ లంకానాశనాన్ని సూచిస్తున్నాయి. ఇప్పటికయినా మీరు బుద్ధి తెచ్చుకుని సీతను బాధించడం ఆపండి. మీ ప్రాణాలు రక్షించుకోండి. జానకీదేవి పాదాలమీద పడండి. ఆవిడ క్షమాభిక్ష వేడండి. అని చెపుతున్నది. వారంతా భయభీతలై వింటున్నారు.

సింహం ఎదుటపడ్డ ఆడు ఏనుగులా సీత భయంతో మృత్యువును ఆహ్వానిస్తూ, భర్తృవియోగంలో ఇంతకాలం జీవించినందుకు దుఃఖిస్తూ, తన వజ్రకఠిన హృదయాన్ని

నిందించుకుంటూ, ఈ రెండునెలలు గడవగానే రావణుడు నన్ను చంపించి తీరతాడు. పట్టుబడిన దొంగను ఉదయమే వధ్యశిల ఎక్కించినట్లు నన్ను ఈ రెండునెలల అనంతరం సంహరించక తప్పరు. మాయావి మారీచుడు ఇప్పటికే రామలక్ష్మణులను ఆరగించి వుంటాడు.

పతినే దైవంగా భావించి, అధశ్శయనంతో, క్షమాశీలంతో, వున్న నన్ను విధి ఎందుకింత వంచించాడు. ఏకపత్నీత్వం పాతివ్రత్యం, ధర్మం అన్నీ నిరర్థకాలే పితృ వాక్పాలన అనంతరం రామభద్రుడు అయోధ్యచేరి అక్కడి పద్మాక్షులతో సుఖిస్తాడా! ఏమ యినా నేను రామునే స్మరిస్తూ కృశించి మరణిస్తాను. ఈ బ్రతుకు మరింత దుర్భరం అవుతున్నది. విషంత్రాగి, కత్తితో పొడుచుకుని చావాలనివుంది. కాని ఆరెండూ నాకు అందుబాటులో లేవు. ఇంక ఒక్కటేశరణ్యం, అనుకుని తన దీర్ఘ కేశపాశం త్రాడుగాచుట్టి కంఠానికి బిగించుకుంటూ ఆత్మహత్యకు సన్నద్ధ అయింది. ఆ సమయంలో ఆమె విశాల వామనేత్రం అదిరింది, వామభుజం, వామఊరువు అదిరాయి. రాముడు తన ఎదుట నిలబడినట్లే అవి కంపించాయి. కొద్దిగా దుమ్ముకొట్టిన బంగారురంగు చీరచెంగు రవంత జారింది. ఇన్ని శుభసూచనలు గోచరించడంతో సీత మనస్సు ఎండకు వాడిన విత్తనం వర్షాధారంతో పునరుజ్జీవం పొందినట్లు అయింది. శోకం సన్నగిల్లి, గుండెలో సంతోషరేఖ కదలింది. శరీరానికి శక్తి ప్రాప్తించినట్లనిపించి, వికసించిన వదనం రాహుగ్రహవిముక్త చంద్రబింబం అయింది.

అంతాచూస్తూ, వింటున్న మారుతి :

సర్వలోక శోభవదాయిని అయిన సీతను చూడగలిగాను. జన్మప్రభృతివిచారం ఎరుగని జనకరాజపుత్రి ఈనాడు మూర్తీభవించిన శోకదేవతలావుంది. ఇప్పుడు నేను ఈవి డకు ఆశ్వాసన కలిగించకుండా తిరిగి వెడితే ఈ దుఃఖభారంతో ప్రాణత్యాగం చేయవచ్చు. కాని, ఈ రాక్షసీగణం వుండగా మాట్లాడడం ఎలా! రాత్రికూడా గతిస్తున్నది. సీతా సందేశరహితంగా వెడితే దాశరథి నన్ను తనచూపులతోనే బూడిద చేస్తాడు. కాక, ఇక్కడ సీత ఈ రాక్షసులబాధలు పడలేక ప్రాణత్యాగం చేశాక రామ లక్ష్మణ సుగ్రీవాదులు వచ్చి ప్రయోజనమేమిటి?

సరే, నేనిప్పు డీవిడతో ఏ భాషలో మాట్లాడాలి. సంస్కృతంలో మాట్లాడుదునా, అది ద్విజుడయిన రావణుని వాక్కుగా, వాడే కామరూపుడుగా వచ్చాడని సీత శంకించ కుండా వుంటుందా! శంకించినా, నేను మరేభాష మాట్లాడినా ఈవిడ మరీ భయపడుతుందే. ఆ భయంతో మరీగట్టిగా రోదిస్తే రాక్షసస్త్రీలు ఆయుధాలతో రావచ్చు. నేను తప్పించు

కోపడానికి ప్రయత్నిస్తే వారు యుద్ధానికి దిగుతారు. అప్పుడు దాని పరిణామం ఎలా ఉంటుందో తెలీదు. వారు నన్ను బంధించినా వధించినా నా శ్రమ పూర్తిగా వ్యర్థం. ఈ వార్త అక్కడకు అందించే వారుండరు. అందుచేతనే దూతలు సమయోచితంగా ప్రవర్తించకపోతే సర్వమూ నాశనమే అవుతుందని ఆర్యు లంటారు.

ఇప్పుడింక మాట్లాడక తప్పదు. అయితే ఈవిడ రామచింతలో వున్నది. కనక ఆ రామవుని గుణగణాలే కీర్తిస్తూ నా ప్రసంగం ప్రారంభిస్తే జానకీదేవి ఉత్సాహంతో విన వచ్చు, అని బాగా యోచించి:

రాజా దశరథోనామ రథకుంజర వాజిమాన్

దశరథుడనే మహారాజు అయోధ్యనగరానికి ఏలిక. చతురంగ బల సమన్వితు డయిన ఆ మహారాజు ధర్మపరుడు. వారి జ్యేష్ఠపుత్రుడు రాముడు. ఆయన సదాచార పరాయణుడు, సర్వజీవలోక రక్షణ దీక్షితుడు, స్వజనరక్షణతత్పరుడు, సత్యసంధుడు. ఆ రామచంద్రుడు పితృవాక్పాలనకై దండకాటవికి వచ్చాడు. అక్కడ జనస్థానంలో ఖర దూషణులను వధించాడు. అదివిని రావణుడు రాముని భార్యను హరించాడు, మాయ లేడి ద్వారా ఆయనను వంచించి, భార్యాన్వేషణలో ఆయన కిష్కింధకువచ్చి వానరరాజు సుగ్రీవునితో స్నేహం చేసుకుని, వాని అన్న వాలిని వధించాడు. అనంతరం సుగ్రీవుని ఆజ్ఞానుసారం లక్షలవానరులు సీతాన్వేషణకు దశదిశలకూ బయలుదేరారు. దక్షిణ దిశగా వచ్చిన వానరులు సంపాతి సాయంతో సీత లంకలోవున్నట్టు తెలుసుకున్నారు. వారిలో వాయునందనుడను నేను ఈ సముద్రం దాటి వచ్చాను, అని కథాగానం చేశాడు.

అంతా వింటున్న సీతకు ఆశ్చర్యం కలిగింది.

చిందరవందరగా జుట్టుపడిన ముఖం పైకెత్తి కన్నులు విచ్చి చూసింది. ఉదయాద్రి మీద భానుబింబంలా హనుమంతుడు కనిపించాడు. కపిదర్శనం అశుభంగా భావించి కన్నులు మూసుకుంది. కలగంటున్నానా! జాగ్రదవస్థలో వున్నానా! అని విచారిస్తూ కన్నులు తెరిచి మళ్ళీచూసింది. గంటువడిన విశాల వక్త్రంతో కపిశ్రేష్ఠుడే కనిపించాడు. తెల్లవారు ఝామున యిటువంటి పాడుకల వచ్చింది. దీనిఫలం ఏమయివుంటుంది. రామలక్ష్మణులకు శుభమగుగాక. నాతండ్రి జనకమహారాజుకు మంగళ మగుగాక! అనుకుని మళ్ళీ తర్కించు కొని నాకు నిద్రరావడం లేదే. ఇక కల ఎలావస్తుంది. అయితే పదిమాసాలుగా ఈ లంకలో కోతిఉన్నట్టు చూడలేదే. ఇది ఎలావచ్చింది అని చర్చించుకుంటూ రామా రామా అని విలపించసాగింది.

ఈ లంక చేరింది మొదలు నాకు రామనామస్మరణమే తప్ప మరోధ్యాసలేదే. కనులు మూసినా, తెరచినా ఆ రాఘవుడే కనిపిస్తున్నాడు. నా సర్వేంద్రియాలూ, ఆయన వశంలోనే వున్నాయి. ఆ కారణంవల్లనే నేను విన్న కథఅంతా నా మనస్సులోనే కదిలి వుంటుంది కాని అలా అనిపించదే. ఈ చెట్టుమీదనుండి వినిపించినట్లే అనుకున్నాను. దేవేంద్రునికీ, బృహస్పతికీ, అగ్నిహోత్రునికీ, స్వయంభువుకు నమోవాకా లర్పిస్తున్నాను. ఈ వానరుడు ఆడినమాటలు యథార్థాలే అవాలి, అనుకుంటూండగా, హనుమంతుడు చెట్టుదిగి, వినయంగా అంజలి ఘటించి సీత ఎదుట నిలిచి :

అమ్మా! ఈ చెట్టుకొమ్మను ఆనుకుని నిలబడ్డ నీ వెవరివమ్మా. విశాలనయనాలలో కన్నీరు నింపుతూవున్న నువ్వు అమరకాంతవా! నాగ, గంధర్వ, కిన్నెర, యక్షజాతులలో ఏ జాతి సుందరీమణివి. నీ దివ్యస్వరూపం దేవగణకాంతలను తలపింపజేస్తున్నది. చంద్రునిపై కోపగించి భూమికిదిగిన రోహిణీతారవా! మంగళస్వరూపిణి అరుంధతి అలుకవూని వశిష్ఠుల వారిని విడిచిరాలేదుకదా! మీ జననీజనకులెవరు? ఎందుకిలా శోకిస్తున్నావు. నీ శరీర లక్షణాలు చూస్తుంటే భూపాలుని పట్టమహిషిలా వున్నావు. జనస్థానంలో రావణుడు అపహరించితెచ్చిన జానకీదేవివి కావుగదా! నీ తపస్వినీ వేషం ఈ దీనస్థితి చూస్తుంటే నువ్వు రామధర్మపత్నిలా కనిపిస్తున్నావమ్మా! అంటూంటే, రామనామం చెవిని పడగానే హర్షంతో :

ఈ భూమండలంలోని రాజన్యులలో శ్రేష్ఠుడయిన దశరథ మహారాజుగారి యింటి కోడలిని. విదేహాధీశుడయిన జనకరాజర్షి అనుగుపుత్రికను. రాముని యిల్లాలిని. నాపేరు సీత. వివాహానంతరం అయోధ్యలో నాభర్తతో పన్నెండుసంవత్సరాలు రాజభోగాలు అనుభవించాము. పదమూడవ ఏట నా భర్తను పట్టాభిషిక్తుని చేయడానికి మా మావగారు సంకల్పించారు. అది విన్న మా పిన్నత్తగారు కైకేయి - ఈ పట్టాభిషేకం జరిగితే ప్రాణాలు వదులు తాననీ, రాముడు అరణ్యానికి పోవాలనీ పట్టుపట్టింది. ఇతరులకు ఇవ్వడమేగాని ఒకరినుండి తీసుకోవడం ఎరగని రామభద్రుడు తన రాజలాంఛనాలన్నీ వదిలి, వల్కలాలు ధరించి బయలుదేరుతూ నన్ను తమతల్లి కౌసల్యాదేవికి అప్పగించబోయారు. ఆయనలేని స్వర్గంకూడా నాకవసరం లేదు. అప్పటికే మా మరిది లక్ష్మణుడు జటావల్కలాలతో ముందడుగువేశాడు. అలా మేము ముగ్గురమూ దండకారణ్యానికివచ్చి ఉంటూండగా రావణుడు నన్ను అపహరించాడు. ఇక రెండునెలలు దాటితే నాకు మరణమే శరణ్యం, అంది.

అంతావినిన హనుమంతుడు : అమ్మా! నేను రాముని సందేశం తెచ్చినదూతను. వేదవేదాంగవిదుడయిన ఆ రామచంద్రుడు నీ క్షేమం అడిగి రమ్మన్నాడమ్మా! నిరంతరం రామ సేవలోవుండే లక్ష్మణస్వామి నీ పాదాలకు అభివాదాలు చెప్పుకున్నాడమ్మా, అన్నాడు.

జానకి హృదయం సంతోషంతో నిండి :

రామలక్ష్మణులతో మాట్లాడుతున్నంత ఆనందంగావుంది నాకు అంటూండగా, హనుమంతుడు మెల్ల మెల్లగా ఆమెదగ్గరకు అడుగులు వేస్తున్నారు. అంతలో సీతకు ఈ వానరుడు రావణుడవే అనుమానం కలిగింది. అంతే, చెయ్యిజారి చెట్టుకొమ్మవదిలి నేలకు జారింది కొద్దిక్షణాలకు తేరుకుని : మాయారూపంతోవచ్చిన రావణుడవు కాదుగదా! ఇది వరకు జనస్థానానికి యిలావే మాయావేషంతో వచ్చావు. ఓరి నిశాచరుడా! నిద్రాహారాలు లేక కృశించే నన్ను ఎందుకు బాధిస్తావు, అని మళ్ళీ వితర్కంలోపడి : నువ్వు రామదూతవే అయితే నీకు శుభమగుగాక, నీ సౌమ్యరూపం నాకు కొంత నమ్మకం కలిగిస్తున్నది. కాని నువ్వు రాముని గుణగణాలు పూర్తిగా వివరిస్తే నేను విశ్వసిస్తాను, అని మళ్ళీ సందేహంలో పడి మౌనం వహించింది.

జానకికి తనమీద నమ్మకం కలగలేదని గ్రహించాడు హనుమంతుడు అమ్మా! రాముడు సూర్యసమ తేజస్వి. చంద్రునివలె సర్వప్రాణికోటికీ ఆహ్లాదం కలిగించేవాడు, విష్ణువవలె విక్రమగుణసమన్వితుడు. బృహస్పతి వలె సత్య, మధురవాక్కుగలవాడు. రూప, సౌభాగ్యవంతుడయిన ఆ మహావీరుడు ఆశ్రమంలో లేనప్పుడు రావణుడు నిన్ను తెచ్చాడు. ఇంక కొద్దిరోజులలోనే ఆయన బాణాగ్నిజ్వాలలు రావణునివధిస్తాయి. నీ వియోగదుఃఖంతో వున్న ఆయన నిరంతరం నీగురించే చింతిస్తున్నాడు. ఆయన తమ్ముడు లక్ష్మణుడూ, మిత్రుడు సుగ్రీవుడూ అందరూ నీకు అభివాదాలు తెలుపుతున్నారు. అచిర కాలంలోనే వారందరినీ నువ్వు చూడబోతున్నావు, నేను వానరరాజయిన సుగ్రీవుని మంత్రిని. నా పేరు హనుమంతుడు. నా పరాక్రమంతో సముద్రం లంఘించి నిన్ను చూడడానికి వచ్చాను. నేను మాయావినికాదు. నన్ను విశ్వసించు తల్లీ, అన్నాడు.

సీత : నువ్వు రామలక్ష్మణులను ఎలాకలిశావు, నర - వానరసమాగమం ఎలాజరిగింది. అయితే రామలక్ష్మణుల శరీర, స్వరూప స్వభావాలు వివరించు.

హనుమ : అమ్మా! రాముడు కమలదళాక్షుడు, పూర్ణచంద్రవదనుడు దాక్షిణ్యశీలి, సూర్య సదృశ కాంతిమంతుడు. బుద్ధిలో బృహస్పతి. కీర్తికి దేవేంద్రుడు, తన చరిత్రనూ కులాన్నీ రక్షించుకోవడంలో అప్రమత్తుడు. లోక మర్యాదా రక్షకుడు. అగ్నిహోత్ర, బ్రహ్మచర్యదీక్షితుడు.

రక్షితా జీవలోకస్య స్వజనస్యచ రక్షితా ।
రక్షితా స్వ స్య వృత్తస్య ధర్మస్యచ పరంతప॥

మహాబాహువు, విపులభుజుడు, కంబుగ్రీవుడు, గూఢజత్రువు, తామ్రాక్షుడు, దుందుభిధ్వానగళుడు, సర్వావయవాలూ సమంగా విభక్తములయివుంటాయి. సువిశాల ఓష్ఠం, దీర్ఘంగాసాగి కొనదేరిన నాసిక, అని సాముద్రిక శాస్త్రానుసారంగా సర్వాంగాలు శుభలక్షణ లక్షితాలైవున్నాయని వర్ణించి:

తల్లీ! ఆయన తమ్ముడు సౌమిత్రి అన్నివిధాల అన్నగారినే పోలివుంటాడు. అయితే రామభద్రుడు శ్యామవర్ణుడు, సౌమిత్రి హేమకాంతిద్యుతియుతుడు, అని చెప్పి రామ లక్ష్మణులకు వానరరాజుతో స్నేహం ఎలా కలిసినదీ వివరించి,

అమ్మా! అగ్నిగర్భమైన పర్వతం లోలోపల ఎలా మండుతూంటుందో అలానే నీ వియోగాగ్నితో దుఃఖిసున్నా డాయన. భూకంపవేళ పర్వతాలు గజగజలాడినట్లు ఆయన హృదయం విలవిల లాడుతున్నది. సెలయేళ్ళు, నదీప్రవాహాలు, సుందరవనాలు యిన్ని వున్నా కమ్మకందలో ఆయన మనస్సు అటు మళ్ళడమే లేదు. ఇంకేం చెప్పనుతల్లీ! కామ రూపంతో లంక అంతా తిరిగి యిక్కడ నిన్నుచూశాను నేను తిరిగివెళ్ళగానే కోట్లవానర సేనతో రామలక్ష్మణులు వచ్చి సర్వలంకా నాశనంచేసి రావణుని సంహరిస్తారు, అన్నాడు.

అప్పటికి సీతకు నమ్మకం కలిగింది. ఆ కథాశ్రవణంతో సీతావదనం రాహు గ్రహాముక్తమయిన చంద్రబింబమయింది.

అమ్మా ఇదిగో! రామ నామాంకితమయిన అంగుళీయకం. నీకు నమ్మకం కలగడం కోసం యిచ్చాడాయన. ఈ క్లేశాలన్నీ పోయి సుఖంగావుండే రోజులు త్వరలోనే వస్తాయి, అంటూ రాముని ఉంగరం సీతచేతిలో ఉంచాడు. ఉంగరాన్ని చూచిన సీతకు ఆ క్షణంలో రామచంద్రుడే ఎట్టఎదుట వున్నట్టు అనిపించింది. ఆనందంతో ఆవిడ ముఖపద్మం వికసించింది.

వానరశ్రేష్ఠా! ఒంటరిగా నువ్వు ఈ రాక్షసనగరం అంతా తిరిగావంటే నీ విక్రమ శక్తి ఆశ్చర్యం కలిగిస్తున్నది నూరు యోజనాల సముద్రాన్ని గోష్పదంగా దాటేశావు. నువ్వు సామాన్యుడవు కావు. నిన్ను, నీ శక్తిని గ్రహించగల ధీశక్తి రామభద్రునికే వుంది. రామలక్ష్మణులు క్షేమంగావున్నారా. దేవగణాలను లక్ష్యంచేయని రామ లక్ష్మణులు నన్ను స్మరిస్తున్నారా! ఎందుకింత ఉపేక్షచేస్తున్నారు.

హనుమా! ఆయన మోహవిభ్రాంతులలోపడి శోకసంతప్తుడు కావడం లేదుగదా! శత్రునాశనోపాయాలు అన్వేషిస్తూ సమర్థులయినవారితో మైత్రి చేసుకుంటున్నారా! అయోధ్యలో మా అతల, మరదుల క్షేమవార్తలేమయినా తెలుస్తున్నాయా! మీ సుగ్రీవుడు

ఈ క్షణంలో నిన్ను ప్రస్రవణగిరిమీద రామునిదగ్గర దింపుతాను. సర్వరాక్షసగణంతో ఈ లంకను పెల్లగించగలను. నిస్సంకోచంగా నాతో రావచ్చునమ్మా, అన్నాడు

అప్పుడు జానకి: హనుమా! ఏమిటి నువ్వుమాట్లేడేది అంగుష్ఠమంతలేవు, నువ్వు నన్ను సముద్రం దాటించి తీసుకువెడతావా! అంది.

హనుమంతుడు ఆ పరాభవం సహించలేక, శత్రుసంహార సమర్థమయిన తన అద్భుతాకారం ప్రదర్శించాడు. అంతవరకూ పిల్లిపిల్లలా వున్నవాడు దివ్యప్రభలు జిమ్మే మేరువులా అయాడు. మండుతున్న అగ్నివంటి ముఖం, వజ్రసమమయిన దంష్ట్రలు, నఖాలు. ఆ రూపంతో: అమ్మా! ఇప్పుడు నమ్మకం కలిగిందా, నేను ఈ సర్వలంకాద్వీపాన్ని కదిలించగలనని, అనగా జానకి:

హనుమా! అగ్నిసదృశ తేజస్వివయిన నువ్వు వాయుసమవేగంతో సాగగలవాడివని నాకు తెలుసునయ్యా. నీ శక్తిసామర్థ్యాలలో నాకు సందేహంలేదు. కాని, అంత తీవ్ర వేగంతో నువ్వు వెడుతూంటే నేను సముద్రంలో జారిపడవచ్చు అప్పుడు నన్ను భీకర జలచరాలు కబళించాయనుకో, నీ ప్రయత్నం వ్యర్థమేకదా! కాక, నీ మీదికి రావణుడు రాక్షససేనను పంపితే వారితో పోరాడుతూ నన్ను రక్షించడం మాటలుకాదు. అప్పుడు వారిలో కొందరు నన్ను బంధించి లంకకు తెచ్చారో, తక్షణం నన్ను సంహరిస్తారు. అందు చేత ఆయనే తన మిత్రులతో యిక్కడకు రావడం మంచిది.

ఇంతకంటె మరొక్క బలమయిన కారణంవుంది. నా భర్తను తప్ప మరొక పురుష దేహాన్ని నేను స్పృశించను. మరి రావణుడు నన్ను తెచ్చినప్పుడేం చేశానంటావు. అప్పుడు వాడు బలాత్కారంగా తెచ్చాడు. నేను వివశురాలనై వున్నాను. అందుచేత రామచంద్రుడు స్వయంగా వచ్చి యీ రాక్షసులను సంహరించి నన్ను తీసుకువెళ్ళడమే శ్రేయస్కరం.

> భర్తృభక్తిం పురస్కృత్య రామా దన్యస్య వానర।
> నాహం స్ప్రష్టుం స్వతోగాత్రం ఇచ్ఛేయం వానరోత్తమ॥
> యదహం గాత్ర సంస్పర్శం రావణస్యగతా బలాత్।
> అనీశా కింకరిష్యామి వినాథా వివశాసతీ॥

దేవేంద్ర సమపరాక్రముడయిన నా భర్త ధనుష్పాణియై, లక్ష్మణసహితుడై నిలబడితే వారికింక ఎదురులేదు. అందుచేత వారినే యిక్కడకు తీసుకురా! అంది.

ఈ క్షణంలో నిన్ను ప్రస్రవణగిరిమీద రామునిదగ్గర దింపుతాను. సర్వరాక్షసగణంతో ఈ లంకను పెల్లగించగలను. నిస్సంకోచంగా నాతో రావచ్చునమ్మా, అన్నాడు

అప్పుడు జానకి: హనుమా! ఏమిటి నువ్వుమాట్లేడేది అంగుష్ఠమంతలేవు, నువ్వు నన్ను సముద్రం దాటించి తీసుకువెడతావా! అంది.

హనుమంతుడు ఆ పరాభవం సహించలేక, శత్రుసంహార సమర్థమయిన తన అద్భుతాకారం ప్రదర్శించాడు. అంతవరకూ పిల్లిపిల్లలా వున్నవాడు దివ్యప్రభలు జిమ్మే మేరువులా అయాడు. మండుతున్న అగ్నివంటి ముఖం, వజ్రసమమయిన దంష్ట్రలు, నఖాలు. ఆ రూపంతో: అమ్మా! ఇప్పుడు నమ్మకం కలిగిందా, నేను ఈ సర్వలంకాద్వీపాన్ని కదిలించగలనని, అనగా జానకి:

హనుమా! అగ్నిసదృశ తేజస్వివయిన నువ్వు వాయుసమవేగంతో పోగలవాడివని నాకు తెలుసునయ్యా. నీ శక్తిసామర్థ్యాలలో నాకు సందేహంలేదు. కాని, అంత తీవ్ర వేగంతో నువ్వు వెడుతూంటే నేను సముద్రంలో జారిపడవచ్చు అప్పుడు నన్ను భీకర జలచరాలు కబళించాయనుకో, నీ ప్రయత్నం వ్యర్థమేకదా! కాక, నీ మీదికి రావణుడు రాక్షససేనను పంపితే వారితో పోరాడుతూ నన్ను రక్షించడం మాటలుకాదు. అప్పుడు వారిలో కొందరు నన్ను బంధించి లంకకు తెచ్చారో, తక్షణం నన్ను సంహరిస్తారు. అందుచేత ఆయనే తన మిత్రులతో యిక్కడకు రావడం మంచిది.

ఇంతకంటె మరొక్క బలమయిన కారణంవుంది. నా భర్తను తప్ప మరొక పురుషుని దేహాన్ని నేను స్పృశించను. మరి రావణుడు నన్ను తెచ్చినప్పుడేం చేశానంటావు. అప్పుడు వాడు బలాత్కారంగా తెచ్చాడు. నేను వివశురాలనై వున్నాను. అందుచేత రామచంద్రుడు స్వయంగా వచ్చి యీ రాక్షసులను సంహరించి నన్ను తీసుకువెళ్ళడమే శ్రేయస్కరం.

భర్తృభక్తిం పురస్కృత్య రామా దన్యస్య వానర ।
నాహం స్ప్రష్టుం స్వతోగాత్రం ఇచ్ఛేయం వానరోత్తమ ॥
యదహం గాత్ర సంస్పర్శం రావణస్యగతా బలాత్ ।
అనీశా కింకరిష్యామి వినాథా వివశాసతీ ॥

దేవేంద్ర సమపరాక్రముడయిన నా భర్త ధనుష్పాణియై, లక్ష్మణసహితుడై నిలబడితే వారికింక ఎదురులేదు. అందుచేత వారినే యిక్కడకు తీసుకురా! అంది.

హనుమంతుడు అత్యంతానందంతో :

తల్లీ! ఈ మాటలు నీవంటి సాధ్వీమణికే తగును. అయితే రాక్షసులు నన్నేదో చేస్తారన్నావే అది స్త్రీ సహజమయిన మాట. రామచంద్రుని తప్ప మరొకని శరీరం ముట్టనన్నావే, అది రాఘవ ధర్మపత్ని మాత్రమే అనగల మాట. నేను రామచంద్రునికి తృప్తికలిగించాలనే వూహతో ఈ సూచన చేశానేతప్ప మరేంకాదు. సరే, ఆయనకు గుర్తుగా ఏమయినా నా చేతికిస్తావా! అన్నాడు

జానకి: నీకో విషయం చెబుతాను. అది మా యిద్దరికే తెలుసు. చిత్రకూటం మీద మేము ఉండే రోజులలో, ఒకనాడు వనవిహారం చేసివచ్చాం. ఏటిఒడ్డున విశ్రాంతిగా నా తొడమీద ఆయన శిరసుంచి పరున్న సమయంలో ఒక కాకి మాంసభక్షణ ప్రీతితో నన్ను పొడిచింది. నేను చిన్నబెడ్డతో కొట్టాను. అది కదలలేదు. నన్ను పొడవడానికి ప్రయత్నిస్తూనే ఉంది. నా నడుముకుకట్టిన పట్టెడతో దాన్ని కొడదామని లాగుతూండగా నాచీర జారింది. అదిచూసి ఆయన నవ్వారు. నాకు సిగ్గూ కోపమూ వచ్చాయి.

నన్ను ఓదార్చి, ఆయన నిద్రలోపడ్డారు. నేనూ కొంచెం మాగన్నులోపడ్డాను. ఆ కాకి మళ్ళీవచ్చి నా వక్షోజాలమధ్య పొడుస్తున్నది అప్పుడు కారిన రక్తబిందువులకు ఆయనకు మెలకువవచ్చి కన్నెత్తి చూశారు. నా ఉరఃస్థలం నుండి రక్తం జారుతూన్నది. ఆయన కన్నులెర్రజేసి: అయిదు తలల పాముతో చెలగాటాలాడుతున్న అవివేకి ఎవడు, అంటూండగా కాకి ఆయన కంటబడింది. అది ఇంద్రుని సంతానమట. ఆ కాకిని చూడ గానే ఆయన దర్భపుల్ల తీసి అభిమంత్రించి విడిచారు. అది బ్రహ్మాస్త్రం.

భయంతో అది ముల్లోకాలూ తిరిగింది. ఎవరి రక్షణాలేక రామునే శరణువేడింది. బ్రహ్మాస్త్రం వ్యర్థం కా రా దనగా ఆకాకి తన కుడికన్ను అర్పించి వెళ్ళిపోయింది. అలా కాకిమీద బ్రహ్మాస్త్రం విడిచిన ఆయన ఇంతకాలం ఎందుకు ఉదాసీనంగా ఉన్నాడో! ఆయన ఆజ్ఞతో సౌమిత్రి రావచ్చునే. ఇంతకూ నా పాపఫలం యిది, అని మళ్ళీ దుఃఖిస్తూండగా :

అమ్మా! ఇంకా నీకు విచారం అనవసరం. త్వరలోనే శుభపరంపరలు రానున్నాయి. రామలక్ష్మణులిద్దరూ వచ్చి ఈ రాక్షసులను సంహరించి నిన్ను తీసుకు వెడతారు. నేనింక బయలుదేరుతాను. వారికేమయినా సందేశం యిస్తావా తల్లీ: అన్నాడు.

జానకి : ఇదిగో ఈ చూడామణి ఆయనకియ్యి. దీన్ని చూడగానే ఆయనకు మా అత్త గారూ, నేను, దశరథమహారాజూ స్మరణకు వస్తారు. ఆయనను త్వరగా రాక్షస సంహారానికి తీసుకురా. నువ్వే అందుకు సమర్థుడవు. అక్కడ ఆయన మిత్రులందరి క్షేమమూ అడిగానని చెప్పు.

హనుమ: అమ్మా! వానర, భల్లూక సేనలతో ఆయన త్వరలోనే వచ్చి, యీ సర్వ రాక్షసులనూ సంహారిస్తాడు. నీ కోసం చతుస్సముద్రవలయితమయిన భూమండలాన్ని కూడా తలక్రిందులు చేయగలడు.

జానకి : నాయనా! సాగరలంఘనంతో బాగా అలసినట్లున్నావు. ఈ రోజు యిక్కడే ఎక్కడయినా రహస్యంగా దాగివుండి విశ్రాంతి తీసుకుని రేపు వెడుదువుగాని. నా భర్త క్షేమసమాచారాలు తెలిపిన నిన్ను చూసినా నాకు కొంత దుఃఖశాంతి. మరొక్కమాట, మీ భల్లూక వానరసేనలు ఈ విశాలసాగరం దాటి రాగలవంటావా! నే నెరిగినంతవరకు గరుత్మంతుడూ, నువ్వూ, వాయుదేవుడూ తప్ప యీ దూరందాటి రాగలవారులేరు. రామ లక్ష్మణులెలా రాగలరు. నువ్వు నీ శక్తితో నన్ను ఉద్ధరించగలవు. కాని అది వారి కీర్తికి మచ్చకాదా!

హనుమ: అమ్మా! మా ప్రభువు సుగ్రీవుడు చెయ్యలేని సాహసం లేదు. ఆయన కృతనిశ్చయుడయి వున్నాడు. మనోవేగంతో సాగగల వానర, భల్లూకసేనలు ఆయన కనుసన్నతో కదలివస్తాయి. నదీ, నద, పర్వత, సాగరపరివృతమయిన ఈ భూమండలమంతా వారు ఎన్నోమారులు ప్రదక్షిణంచేసి వచ్చారు. అక్కడ యూథపతులు నన్ను మించినవారు, నాతో సమానులు ఉన్నారు. వారంతా వచ్చి, ఈ లంకనూ, రాక్షసగణాన్నీ సర్వనాశనం చేస్తారు. అత్యల్పకాలంలో నువ్వు రామచంద్రుని చూడగలవమ్మా. ఈ జగత్తులో రామలక్ష్మణులతో సమానులయినవారులేరు. అనల, అనిలులవలె వారిద్దరూ విజృంభిస్తే ప్రపంచం గజగజలాడుతుంది. కొద్దిరోజులమ్మా యింక ఈ దురవస్థ నీకు.

జానకి : హనుమా! పెరుగుతూన్న వంటచేనుకి వానజల్లులా నా మనస్సు నీ మాటలతో ఆనందభరితమయింది. కాకిమీద బ్రహ్మాస్త్రం ప్రయోగించిన ఆయన ఇంత కాలం ఎందుకు ఉపేక్షించారా అని బాధపడుతున్నాను. మరొక్కమాట ఆయనకు గుర్తుచెయ్యి. అప్పుడు మేము చిత్రకూటం మీద వున్నాం. ఆ రోజులలో ఒక సమయాన నా నుదుట తిలకం జారింది. అప్పుడాయన మణిశిలతో తిలకం దిద్దారు. ఈ విషయం నేను మరచిపోలేదని చెప్పు.

అనంతరం హనుమంతుడు సీతకు ధైర్యవచనాలు చెపుతూ పాదాభివాదంచేసి బయలు దేరి ఉత్తరదిశగా సాగుతూ .

నేను వచ్చినపని చాలావరకూ అయింది. ఇక కొద్ది మిగిలివుంది. ఈ రాక్షసులు సామ, దాన భేదాలతో లొంగరు. సామం గుణవంతుల దగ్గరే పనిచేస్తుంది, దానం ధనమత్తుల దగ్గర వ్యర్థం, భేదం బలదర్పితులను వంచించదు.

అందుచేత దండనీతికి దిగబోయేముందు ఈ రాక్షసుల బలాబలాలూ, వీరి రహస్య స్థావరాలూ తెలుసుకు వెళ్ళడం అవసరం. ఒక కార్యనిర్వహణకు వచ్చినపుడు వచ్చిన పనితో దానికి అనుబంధించిన మిగిలిన పనులుకూడా ముగించుకు వెళ్లాలి. అయితే మూలకార్యాఘాతం కాకుండా చూసుకోవాలి. ఇప్పుడింక వీరి రణకౌశలం, దుర్గరహస్యం చూడాలి. ఒక్కమాటు ఈ లంకేశ్వరునీ, ఆయన మంత్రి మండలినీ, చూచి వారి ఆలోచనావ్యవస్థకూడా గ్రహించివెడతాను.

దానికి ప్రాతిపదికగా నందనవనంలావున్న ఈ అశోకవనం ధ్వంసంచేస్తాను. అప్పుడువారు యుద్ధానికి వస్తారు. అనుకుంటూ వనంలోని చెట్లు విరగకొడుతూ, నికుంజాలు పెల్లగిస్తూ, కొమ్మలువిరుస్తూ, క్రీడాపర్వతాలు భగ్నంచేస్తూ క్రమంగా ఉద్యానవన ద్వార తోరణం అధివసించాడు.

ఆ అలజడికి చెట్ల మీద పక్షులు కలతపడి కలవరధ్వని చేయగా రాక్షసీగణం మేలుకొని :

ఓ జానకీ! వాడెవడు! ఎందుకు వచ్చాడు. నీతో ఏమిటి మాట్లాడినాడు, అని ప్రశ్నించారు.

జానకి : నాకేం తెలుసు. పాము గమనమార్గం పాముకే తెలుస్తుంది. కామరూపులయిన మీకె కామరూపుల రహస్యాలు తెలుస్తాయి. మీ మాయలు చూస్తూంటే నాకు మరీ భయంగా వుంది. వాడెవడో రాక్షసుడు, మీకే తెలియాలి.

జానకి అలా అనడంతో కొందరు హుటాహుటి రావణుని దగ్గరకువెళ్ళి : ప్రభూ! వికృతాకారుడయిన వానరుడొకడు భయంకరరూపంతో అశోకవనానికివచ్చి సీతతో మాట్లాడాడు. ఆ వానరుడెవడని సీతని ఎంతగా అడిగినా సమాధానం లేదు. ఇంద్రుడో కుబేరుడో, కాక రాముడో పంపినదూత అయివుండాలి. జానకితో మాట్లాడి అశోకవనం అంతా ధ్వంసం చేశాడు. సీత కూర్చున్న శింశుపావృక్షం తప్ప అన్ని చెట్లూ

ధ్వంసమయాయి మీరు వాని దండనకు ఆజ్ఞయివ్వాలి. మీరు మనను వద్ద సీతతో మాట్లాడటానికి ఎన్ని గుండెలు వానికి, అని వారు చెపుతూంటే రావణుని గుండెలో క్రోధాగ్ని రేగి కన్నులు చితాగ్ని కుండాలయాయి. మహావీరులయిన రాక్షసులను వానర సంహారార్థం పంపించాడు

మహోదరులు, దీర్ఘదంష్ట్రులు, అతిబలిష్ఠులు అయిన రాక్షసయోధులు బయలు దేరారు. పరిఘ, పట్టిస, శూల, తోమర ఖడ్గధారులై వారు హనుమంతుని చుట్టుముట్టారు.

హనుమంతుడు తన దీర్ఘవాలం ఒక్కసారి నేలమీద కొట్టి, శరీరాన్ని పెంచి, తోకను ఆడించడం మొదలుపెట్టాడు. ఆ వాలవిక్షేపధ్వని లంకానగర మంతా ప్రతి ధ్వనించింది. గొంతెత్తి :

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ।
దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః ।
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః ॥

అని గర్జిస్తూ బండరాళ్ళు విసురుతూ, పాదతాడనంతో రాక్షసహింస ప్రారంభించాడు. గగనవీధిలో ఎగురుతూన్న వాయునందనుడు కాలమేఘంలా వున్నాడు. దేవేంద్రుడు వజ్రాయుధంతో అసురసంహారం చేసినట్లు హనుమంతుడు తన పాదతాడనంతో, ముష్టి ప్రహారంతో వారందరినీ సంహారించి ద్వారతోరణం మీద విశ్రాంతిగా కూర్చున్నాడు.

ఈ వార్త విని రావణుడు ప్రహస్త పుత్రుడైన జంబుమాలిని పంపించాడు. వన ధ్వంసంచేసిన హనుమంతుడు ఎదురుగా కనిపించే చైత్యప్రాసాద విధ్వంసన కుతూహలంతో దానిమీదికి వెళ్ళాడు. ఆ చైత్యపాలకులు వానిని చుట్టుముట్టగా, ఆ ప్రాసాద స్తంభం లాగి గిరగిర త్రిప్పుతూంటే అగ్నిజ్వాలలు రేగాయి. అదే స్తంభంతో ఆ రాక్షసులను సంహరిస్తూ : నాకంటే బలిష్ఠులయిన వానరులు వేల సంఖ్యలో వున్నారు. పది ఏనుగుల వంద మత్తేభాల, సహస్ర గజేంద్రాల బలంకలవారున్నారు. శతసహస్రాధిక సంఖ్యలో వానరవీరులు సుగ్రీవుని నాయకత్వాన లంకమీద దాడికి వస్తున్నారు.

ఇక్ష్వాకువంశీయుడయిన రామభద్రునితో వైరం తెచ్చుకున్న మీకూ, మీ లంకానగ రానికీ కాలంపూర్తి అయింది, అంటూ రామలక్ష్మణులకు జయం, సుగ్రీవునికి జయం, అని ఘోషిస్తూండగా పళ్ళు పటపట లాడిస్తూ, ఎర్రని కన్నులలో అగ్నిశిఖలు జిమ్ముతూ జంబుమాలి

ఇంద్రధనుస్సువంటి విల్లు ఎక్కుపెట్టి వచ్చాడు, వస్తూనే ధనుష్టంకారం చేశాడు. హనుమంతుడు సింహనాదం చేశాడు. జంబుమాలి బాణవర్షం కురిపించాడు. బాణఘాతాలతో హనుమంతుని ముఖం ఉదయ సూర్య బింబంలా ఎర్రవారింది దగ్గరలో వున్న బండరాయి తీసి విసరగా, జంబుమాలి పది బాణాలతో దానిని చూర్ణం చేశాడు. మారుతి సాలవృక్షం విసరగా దానినీ దారిలోనే ముక్కలు చేశాడు రాక్షసవీరుడు

జంబుమాలి శస్త్రవర్షం నడుపుతూంటే హనుమంతుడు కుపితుడై, ఆ రాక్షసుడు పడిలిన పరిఘాయుధం అందుకొని తీవ్రవేగంతో జంబూమాలిమీద విసిరాడు, అంతే! రాక్షసుని స్వరూపంలేదు, రథంలేదు, దానికి కట్టిన ఖరాలులేవు. అన్నీ పిండిపిండి అయాయని రావణునికివార్తచేరగానే లంకేశ్వరుడు తన మంత్రి పుత్రులను హనుమంతుని మీదికి పంపించాడు.

వారు రథాలు ఎక్కుతున్నప్పుడే వారి తల్లులు కంటతడి పెట్టారు. వారు వస్తూనే శస్త్రాలు విసురుతూంటే మారుతి అల్పదేహం ధరించాడు. ఆ శస్త్రాలన్నీ గాలిపాలయాయి. మరు క్షణంలో భయానక దేహంతో వారందరినీ నేలకూల్చాడు ఆ వార్తవిన్న రావణునికి వచ్చిన వానరుడు సామాన్యుడుకాడని తెలిసి, విరూపాక్ష, యూపాక్ష, దుర్ధర, ప్రఘస, భాసకర్ణాది దేవాసుర సంగ్రామాలలో ఆరితేరిన సేనానులను పిలిపించి: మీరువెళ్ళి మెలకువలో ఈ వానరుని సంహరించండి, అన్నాడు.

మనం వాలి, సుగ్రీవ, నీల, జాంబవంతులను ఎరుగుదుము. వీడు వారందరినీ మించినట్టున్నాడు. వానరరూపంలో వచ్చిన మహాభూతంలా వున్నాడు వీడు. అందుచేత అప్రమత్తంగా వెళ్ళండి, అన్నాడు.

సేనాపతులవెంట వారి సేనలు వచ్చాయి. బాణవర్షం ఆరంభమయింది. హనుమంతుడు భీకరగర్జనలు చేస్తూ దేహాన్ని ప్రవృద్ధంచేసి దుర్ధరుని రథంమీద పిడుగులా పడిన క్షణంలో రథం ముక్కలయింది, గుర్రాల అంగసంధులు విడిపోయాయి. అదిచూచి విరూపాక్ష, యూపాక్షులు పై కెగిరి తమ ముద్గరాయుధాలతో హనుమంతుని రొమ్ముమీద బాడించారు. మారుతి ఒక సాలవృక్షం విసరి వారిని యమసదనం చేర్చాడు. ప్రఘస, భాసకర్ణులు శూల, పట్టిసాయుధాలతో పొడువగా హనుమదేహం నుండి రక్తం ధారలుగా వచ్చింది. రక్తదేహంతో బాలసూర్యునివలె వెలుగుతూ ఒక పర్వతశిఖరం అందుకుని విసరగా వా రిరువురూ దుమ్ములో కలిశారు. ప్రళయకాల రుద్రునివలె తక్కుంగల సైనికులను సంహరిస్తున్నాడని చెప్పారు హతశేషులు రావణునితో.

అదివిన్న రావణుడు ఎదురుగావున్న అక్షకుమారినివైపు కన్నులు నడిపాడు. అంతే!

అక్షకుమారుడు తన రథం అధిరోహించి వచ్చాడు. హనుమంతుని చూస్తూనే కొంచెం జంకి అంతలో ధైర్యం తెచ్చుకుని మూడు నిశితశరాలు విడిచాడు హనుమంతుని నుదుట రక్తధారలుచిమ్మాయి. ఎదురుతిరిగాడు మారుతి ఆ యుద్ధవేళభూమి గజగజలాడింది. గాలి కదలడం మానివేసింది. సాగరాలు కల్లోలమైపర్వతాలు ఊగినలాడాయి.

హనుమత్పర్వతంమీద అక్షకుమారుడు బాణశిలావర్షం కురిపించాడు. వాని యుద్ధ కౌశలాన్ని మనసులోనే అభినందిస్తూ గగన వీధికి లేచి దూకుతూ అరచేతితో ఆ రథాన్ని తాడించాడు. అంతే! గుర్రాలు నేలకూలాయి రథం ముక్కలు ముక్కలయింది అక్షకుమారుడు ఆకాశవీథికి సాగి గరుత్మంతుని కాలిగోళ్ళలో చిక్కిన సర్పమయినాడు. అక్కడే వానిని పట్టి గిరగిర తిప్పి నేలకు విసిరాడు.

అక్షకుమారుడు నిహతుడయిన వార్తవిన్న రావణుడు మనస్సును సమాధాన పరచుకొని, ఇంద్రజిత్తువైపు తిరిగి :

నాయనా ! ఇక నీమీదే నాకు విశ్వాసం ఉంది. ఈ వానరుడు సామాన్యుడు కాడు. వెళ్ళి వాని అంతం చూసిరా, అన్నాడు. ఇంద్రజిత్తు తండ్రికి ప్రదక్షిణ నమ స్కారంచేసి రథం కదలించాడు. వస్తూన్న ఇంద్రజిత్తును చూసి హనుమంతుడు శరీరాన్ని మరింత పెంచి ఉత్సాహంతో ఎదురునిలిచాడు. ఇంద్రజిత్తు బాణవర్షం సాగిస్తుంటే హనుమంతుడు అవలీలగా వాని గురికి అందకుండా తప్పించుకుంటూ గగనవీథికి ఎగిరాడు. ఇంక అస్త్రకీడ ప్రయోజనంలేదని ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. హనుమంతుడు ఆ అస్త్రానికి కట్టుబడి, యిప్పుడింక వీరితోవెళ్ళి రావణునితో మాట్లాడడం మంచిదనుకొని నిశ్చేష్టుడై వుండగా. రాక్షససైనికులు వానిని బంధించారు.

తన అనుచరులు చేసిన అవివేకకార్యానికి చింతించి, ఇంద్రజిత్తు "బ్రహ్మాస్త్ర బంధితుని మరి దేనితో బంధించినా ఆ అస్త్రశక్తి పోతుందని ఎరుగరు వీరు. ఈస్థితి చూస్తూంటే రాక్షసవంశానికి కీడు రానున్నదనిపిస్తున్నది." అనుకున్నాడు

హనుమంతునితో ఇంద్రజిత్తు రావణునిముందుకు వచ్చాడు. అనుచరులు విషయా లన్నీ వివరించారు.

రాక్షస సభాభవనమధ్యంలో స్వర్ణసింహాసనంమీద రావణుని శిరస్సుపై ముత్యాల పేరులతో, మణులతో కిరీటం వెలుగుతున్నది. శరీరంనిండా వున్న సువర్ణ, రత్నభూష

డాలు మనసుతో నిర్మించినట్లున్నాయేకాని స్వర్ణకారుని హస్తస్పర్శసోకిన ఛాయలులేవు. పీతాంబరం రక్తచందనఅలేపనం. ఆలేపనమధ్యంలో విచిత్రరేఖలు. అంజనాద్రి సానువుల వలె వక్షఃస్థలం. దివ్యకాంతితో వదనమండలం. ఇరువంకలా రమణీయరమణీమణులు మందహాసశోభితవదనాలతో వింజామరలు వీస్తున్నారు, అటూ, ఇటూ ఉచితాసనాలపై మంత్రాంగకోవిదులయిన సచివులు నలుగురు, మహోన్నతాసనంమీది రావణుడు మేరుగిరి మీద కాలమేఘంలా వున్నాడు. హనుమంతునికి ఆశ్చర్యం తలమునక లయింది.

అహో రూప మహోధైర్యం అహో సత్వ మహోద్యుతి ।
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా॥

అని మనసా ప్రశంసించి, ఇన్ని గుణాలున్న ఈ లంకేశ్వరునిలో ఈ ఒక్క అధర్మం లేకపోతే ఇంద్రపదవిని అధిష్ఠించగలిగేవాడు, అనుకుంటున్నాడు.

హనుమంతుని చూస్తున్న రావణుడు, మొదటిచూపులో చకితుడై:
కిమేష భగవా న్నందీ భవేత్ సాక్షా దిహాగతః ॥

ఏమిది? సాక్షాత్తూ శంకరకింకరుడయిన నందీశ్వరభగవానుడిలా దిగివచ్చాడు! అలనాడు కైలాసంమీద పరిహసించినందుకు నన్ను శపించిన వా డీయనేనా, కాక బాణా సురుడు వానరరూపంలో వచ్చాడా! అని వితర్కించుకుంటూ మంత్రి ప్రహస్తునితో:

కనుక్కోండి ఈ వానరుని వ్యవహారం, అన్నాడు

ప్రహస్తుడు: ఓ వానరా! నువ్వు నిర్భయంగా నిజంచెప్పితే నీకేభయంలేదు. ఎవరు పంపారునిన్ను? దేవేంద్రుడా! వరుణుడా! కుబేరుడా! యముడా! విజయ వాంఛతో విష్ణువు పంపించాడా! కంటికి వానరరూపంలోవున్నా నీశక్తి, తేజస్సు వానర సహజంగా లేవు. నిజం చెప్పు, నిన్ను విడిచిపెడతాం.

హనుమ: మీ ఊహాలేవీ సత్యంకాదు. నేను వానరుణ్ని. మీ లంకేశ్వరుని చూడాలనే కోరికతో వచ్చాను. అందుకే అశోకవనం ధ్వంసంచేస్తుంటే మీఅనుచరులు నన్ను హింసించడానికిరాగా ఆత్మరక్షణార్థం వారిని చంపక తప్పలేదు. ఏ అస్త్రమూ నన్ను బంధించలేదు. అయినా బంధితుడి నయితేకాని మీప్రభువు దర్శనం కాదని యిలా వచ్చాను. అసలు మాట వినండి. నేను రామదూతను. ఆయనపంపున మీరాజుకు హితవుబోధించడానికి వచ్చాను, అని రావణునివైపు తిరిగి:

ఓ లంకేశ్వరా! మీకు సోదరతుల్యుడయిన సుగ్రీవుడు నన్ను పంపుతూ, మీ యోగక్షేమాలు అడగమన్నాడు.

ఇక్ష్వాకువంశీయుడయిన ధర్మప్రభువు దశరథుడు. ఆయన కుమారుడు రాముడు, పితృవాక్పాలనదీక్షతో దండకాటవికి వచ్చాడు భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో. అక్కడ సీతను ఎవరో అపహరించగా, ఆమెకోసం అన్వేషిస్తూ ఆ సోదరులు కిష్కింధకు వచ్చి సుగ్రీవునితో సఖ్యం చేసుకున్నారు.

త్వయా విజ్ఞాతపూర్వశ్చ వాలీ వానర పుంగవః।
స తేన నిహతస్సంఖ్యే శరేణైకేన వానరః॥

రాక్షసేశ్వరా! నువ్వు బాగాఎరుగుదువు వాలిని, ఆ వాలి రామబాణంతో నేల కూలాడు ఒకేఒక్క బాణంతో. ఇప్పుడు మా రాజు సుగ్రీవుడు మహాబలిష్ఠులయిన వానర భల్లూకసేనలను సీతాన్వేషణకు పంపాడు. అందులో నేను ఈ సాగరందాటి యిక్కడ మీ నగరమంతా శోధించి జానకీదేవిని దర్శించి ధన్యుణ్ణయ్యాను.

ఇక-నువ్వు తపస్వివి, ప్రాజ్ఞుడివి, ధర్మతత్వవిదుడవు. నీకు పరదారమీద మనసుండడం తగనిపని. నీవంటి వివేకి ధర్మవిరుద్ధంగా నడిచి వంశనాశనం చేసుకుంటా డనుకోను. రాముని కోపం, లక్ష్మణుని చాపం వీటికి లక్ష్యభూతులయినవారికి యమసద నమే శరణ్యం.

త్రికాలబాధ్యమూ, త్రిలోకహితంకరమూ అయిన ధర్మం చెపుతున్నాను విను. ఇప్పుడే నువ్వు ఆయన భార్యను ఆయనకు సమర్పించు. కాదంటావా నేను తిరిగి వెళ్ళడం తడవు రామచంద్రుడు మిగిలినపనిని తమ వామహస్తంతో పూర్తిచేస్తాడు. విషాన్నం అర గించుకోగల ప్రాణిలేనట్లే జానకిని వరుడెవడూ పొందలేడు. చిరకాలతపఃఫలం నాశనం చేసుకోకు. దేవ, దానవగణాలచేత అవధ్యుడవన్నమాట నిజమేకాని నర, వానరు లున్నారునుమా! ధర్మాధర్మాలు రెండూ శుభా శుభ ఫలాలిచ్చి తీరతాయి.

నేనే ఈమీ సర్వ రాక్షసకులాన్నీ నాశనం చెయ్యగలను. కాని శత్రుసంహారం చేస్తానని రామభద్రుడు భల్లూక, వానరసేనాపతుల సమక్షంలో శపథం చేశాడు. ఇక నువ్వు అపహరించితెచ్చిన సీతాదేవి నీపాలిటి కాళరాత్రి. నీ మెడకు చుట్టుకున్న కాల పాశం నా మాట విని ఆ కాలపాశం వదల్చుకో. రామకోప ప్రదీపితమై సీతాతేజోగ్ని నీ లంకను భస్మం చేస్తున్నట్లు గోచరమవుతున్నది. నేను రామదూతను. వానరాన్ని, నన్ను నమ్ము. రాముడంటే—

సర్వా న్లోకాన్ సుసంహృత్య స భూతాన్ స చరాచరాన్ ।
పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశాః ॥

విష్ణుసమపరాక్రమంకల రామునితో సంగ్రామంలో నిలబడగలవాడు లేడు. అటు వంటివానితో వైరం నీకు క్షేమంకాదని చెపుతున్నాను.

బ్రహ్మా స్వయంభూః చతురాననో వా
రుద్రః త్రినేత్ర స్త్రిపురాంతకో వా ।
ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా
త్రాతుం నశక్తా యుధి రామవధ్యం ॥

హనుమంతుని ప్రసంగం వింటున్న రావణుని కన్నులు ఎర్రవారాయి. ఆవేశంతో బుసకొట్టే కోడెత్రాచులా ఊపిరివిడుస్తూ: ఈ వానరాన్ని నరికిపారేయండి అన్నారు.

అదివిన్న విభీషణుడు రాక్షసేశ్వరా! రోషంవిడిచి శాంతం వహించి ఆలోచించు. ప్రాజ్ఞతకల ప్రభువు దూతను వధించడు. శాస్త్రంకూడా దూతవధను నిషేధించింది. తన ప్రభువు చెప్పిన మాటలు పల్కించే దూత దోషికాడు. అందుచేత, దూతకు శిరోముండనమో, కశాఘాతమో, అంగవైరూప్యమో, అంగచ్ఛేదమో విధించారు శాస్త్రవిధులు.

మరొక్కమాట : ఈ దూతను కడతేరిస్తే అక్కడ రామునికి వర్తమానం అందదు. అందకపోతే ఆయన యుద్ధానికి రాలేడు. యుద్ధకండూతికల నీకు తృప్తి కలగాలంటే ఈ వానరాన్ని విడవడం మంచిది, అనగా రావణుడు :

వానరాలకు తోక అలంకారం. ఆ వాలానికి నిప్పుముట్టించి నగరవీధులన్నీతిప్పి వదలండి, అన్నాడు.

## లంకా దహనం

ఉత్తరక్షణంలో రాక్షసులు పాతగుడ్డలు మూటలుగా తెచ్చి నూనెలోముంచిచుట్టడం మొదలుపెట్టారు. మారుతి తన శరీరాన్ని, వాలాన్నీ పెంచడం ఆరంభించాడు. వారు నిప్పుపెట్టారు. లంకానగరంలో బాల, స్త్రీ, వృద్ధజనం అందరూ హర్షధ్వానాలు చేశారు. ఆలోచించాడు హనుమంతుడు. రాత్రి చీకటిలో ఈ దుర్గరహస్యాలు చూచే అవకాశం కలగలేదు. ఇప్పుడు వీరు నగరమంతాతిప్పి ఆలోటు తీరుస్తారు, అనుకుంటూ బయలు దేరాడు. లంకానగర పౌరులు నానారకాల హింసలతో నగరమంతా తిప్పారు.

ఆ సమయంలో కొందరుస్త్రీలు అశోకవనానికివెళ్ళి ఈవార్త సీతకుచెప్పారు. విన్న సీతకు విచారం ముంచుకొచ్చింది. తక్షణం తూర్పుగా తిరిగి :

పతి శుశ్రూషయే నేను పరమధర్మంగా భావించేదాని నయితే, పాతివ్రత్యమే నా పరమలక్ష్యమయితే, రాముడు నన్ను ఉద్ధరించడం వాస్తవమయితే, సుగ్రీవుడు సత్య సంగర ప్రియుడైతే ఓ అగ్నిహోత్రుడా ! నువ్వు చల్లగా వుండు. మా హనుమంతునిపై నీ వేడి ప్రసరించకు, అని ప్రార్థించింది. అంతే ! హనుమశరీరానికి అగ్ని చల్లగా అయాడు. ఆశ్చర్యచకితుడై, ఇది రాముని ప్రభావమే అయివుంటుంది. నాతండ్రి వాయువుకి స్నేహితుడుకనక చల్లబడ్డాడా అగ్ని అనుకుంటూ తనకుకట్టిన త్రాళ్ళు త్రెంచు కుని ఒక్కదూకులో పురద్వారానికి ఎగిరాడు. అక్కడున్న పరిఘ అందుకున్నాడు అందిన రాక్షసునితల ముక్కలుచేస్తూ విజృంభిస్తున్నాడు. లంకలో కోలాహలం మొదలయింది.

సీతను దర్శించాను. వనం నాశనం చేశాను. ఇక దుర్గవినాశనం జరిగిందంటే నేను వచ్చినపని పూర్తిఅయినట్టే, అనుకుని పురద్వారం వదిలి భవనాలమీదికి నడిచాడు. ప్రహస్త, మహాపార్శ్వ, వజ్రదంష్ట్ర, రశ్మికేతు, సూర్యశత్రు, హ్రస్వకర్ణ, హస్తిముఖి, కరాళ, కుంభకర్ణ, శోణితాక్ష, మకరాక్ష, ఇంద్రజిత్తు ఆదిగాగల మహామహుల భవనా లన్నీ మండడం మొదలుపెట్టాయి. ఆ మంట సోకని భవనం విభీషణు డొక్కడిదే.

నానారత్నభూషితమూ, మేరుమందరసదృశమూ అయిన రాజప్రాసాదం మీదికి వచ్చాడు. అంటుకున్నదది. గోడలకుతాపిన రత్నాలు మంటలవేడికి ఫెటఫెటధ్వనులతో పేలుతున్నాయి. ప్రాణరక్షణకోసం అందరూ వీధులలోపడి రోదనధ్వనులు మొదలు పెట్టారు. భవనాలలోని వెండి, బంగారు ఆభరణాలు కరిగి ప్రవహిస్తున్నాయి. రుద్ర భగవానుడు త్రిపురదహనం చేస్తున్నట్టుంది ఆ దృశ్యం. ఆక్రందనధ్వనులు, మృత్యు రోదనలు, లంకనిండా మంటలు.

దేవ, గంధర్వ, మహర్షిగణాలు ఆశ్చర్యానందాలతో హనుమంతునికి స్వస్తి పలికాయి.

అప్పటికి హనుమంతునికి సీతాదేవి స్మరణవచ్చి, విచారంతో కుంచించుకు పోయాడు. ఆగ్రహంలో మనిషి చెయ్యలేని పాడుపనిలేదంటారిందుకే. గురువుమచంపు తాడు, సజ్జనులను హింసిస్తాడు. క్రోధావిష్టహృదయుడు చెయ్యలేనిపని లేదు. నేను చేసిన ఈ దహనంలో సీతాదేవి ఏమయివుంటుందో, ఈ మంటలలో ఆవిడకూడా పడివుంటే నేను సముద్రంలో పడి ప్రాణత్యాగం చేయడం తప్ప గత్యంతరంలేదు.

కాని తేజోరూపిణి, రామపత్ని అయిన జానకిని అగ్ని స్పృశించగలడా, అసంభవం. నన్నే చల్లగాచూసిన అగ్ని జానకీదేవిని దహిస్తాడా! అనుకుంటూండగా గగనవీథినుండి మహర్షులు :

హనుమంతుడు ఎంతటి అద్భుతం చేశాడు నర్వలంకానగరం భస్మమయినా జానకివైపు అగ్ని ప్రసరించలేదు- అనుకోవడం విని, పరమానందంతో అశోకవనంచేరి, నిశ్చింతగావున్న జానకీదేవికి అభివాదాలు అర్పించి సెలవుతీసుకుని సముద్రం ఒడ్డునవున్న ప్రస్రవణ పర్వతశిఖరం మీదికివచ్చి, ఒక్కఊపు ఊపి పైకిలేచాడు.

హనుమంతుడు పైకిలేచాడోలేదో ముప్పది యోజనాలపర్వతం భూమట్టానికిచేరింది.

గగనవీథిలో హనుమత్పర్వతం రెక్కలు విదలించి సాగుతున్నది. మేఘమండలం దాటి, వియద్వీథికి సాగి, మార్గంలో మైనాకాన్ని పలకరించి, మహేంద్రగిరి కనుచూపు మేరలోఉండగా చేసిన సింహగర్జనవిని జాంబవంతుడు :

విన్నారా, ఆ సింహగర్జన! అది కార్యసాధకుని కంఠధ్వని. ఇంక మీరు నిర్భయంగా వుండండి. హనుమంతుడు సఫలప్రయత్నుడై వస్తున్నాడు, అనడంతో అందరూ తమకందుబాటులోవున్న గిరిశిఖరాలకు, ఉన్నతవృక్షాగ్రాలకు ఎగిరి దక్షిణదిశగా చూడడం మొదలుపెట్టారు.

మహాప్రభంజనం అతి తీవ్రవేగంతో గిరిగుహాంతరాలలోకి పోయి మళ్ళు తిరుగుతూన్నప్పుడు పుట్టిన ఈలల ధ్వని వచ్చింది. వచ్చిన ధ్వనివెంట ఒక పర్వతంలా హనుమంతుడు మందరాద్రిమీద కాలుమోపినాడు. అంతే మహోత్సాహనాదాలతో చెట్ల కొమ్మలు ఊపుతూ, దూకుతూ రసవత్ఫలాలుతెచ్చి హనుమంతునికి కానుకలుపోసి మహేంద్ర గిరిమీద రమణీయప్రాంతంలో సుఖాసీనుని చేయగా—

చూశాను సీతను అశోకవనంలో. రామదర్శనకాంక్ష కనులలో వుంది, దుమ్ము నేలమీద ఏకవేణితో కూర్చున్న ఆవిడచుట్టూ రాక్షసస్త్రీ లున్నారు, అన్నాడు. వింటున్న వానరులందరి చెవులలో అమృతధారలయాయి ఆ మాటలు.

పరమ సంతోషంతో వారు ఎగిరి గంతులువేసి, తోకలు గిరగిర త్రిప్పుతూ, హనుమంతుని స్పృశించి:

మా అందరికీ ప్రాణదానంచేసి, నీ పరాక్రమసాహసాలతో స్వామిభక్తిని ప్రదర్శించి, రామచంద్రునికి పత్నీవియోగదుఃఖం దూరంచేశావు, అన్నారు.

ఆ కల్లోలం సద్దుమణిగించి. అప్పుడు జాంబవంతుడు: హనుమా! నువ్వు ఈ మహేంద్రగిరి విడిచిందిమొదలు ఈ క్షణంవరకూ జరిగినకథ అంతా సవిస్తరం వివరించ వయ్యా, ఆ విశేషాలన్నీ వినాలని మాకు కుతూహలంగాఉంది- అన్నాడు.

హనుమంతుడు అంగదుని ప్రక్కనే కూర్చుని తన ప్రయాణ కథ అంతా విస్తరం వినిపించి, యిక్కడికి ఈ అన్వేషణ పూర్తి అయింది. జానకీదేవి తన తపశ్శక్తితో ముల్లో కాలమూ ఉద్ధరించగలదు. భస్మం చేయగలదు, అటువంటి మహాయిల్లాలు రావణుని దగ్ధం చెయ్యకుండా యింతకాలం విడిచిపెట్టిందంటే అది ఆ లంకేశ్వరుని అదృష్టం. నిజా నికి సీతాదేవిని వెంటబెట్టుకుని మనం రామదర్శనానికి వెళ్ళవలసింది. కాని మనకు ఆజ్ఞ లేదు. లంకను నేనే సర్వనాశనం చెయ్యగలను. కాని జాంబవంతుడు, అంగదుడు, నీలుడు, మైందద్వివిదులు మీరందరూ ఆ లంకనే కాదు వందలంకలు నేలమట్టం చేయ గలరు.

నేను లంకా నగరవీథులలో తిరుగుతూ-

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥
దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః ।
నిహంతా శత్రుసైన్యానాం హనుమా న్మారుతాత్మజః ॥

అంటూ ఘోషించాను. జానకిని అపహరించిననాడే రావణుడు మృతుడు. ఈనాడు రావణ సంహారానికి రామచంద్రుడు నిమిత్తమాత్రుడు. పాఠ్యమినాడు అధ్య యనం చేసేవాని వేదవిద్యవలె, మేఘపరివృత్తమయిన చంద్రబింబం వలె ఉన్నది జానకి, అని గుక్క తిప్పకుండా చెప్పాడు హనుమంతుడు.

అంగదుడు : సంతోషం హనుమా! ప్రజాపతి వరప్రభావం కల మన మైంద ద్వివి దులు చాలు, లంకను ధ్వంసం చెయ్యడానికి. కాదంటే నేనున్నాను. మనవారందరూ అందుకు సమర్థులే. నువ్వు చెప్పినట్లు జానకీదేవితో రామదర్శనం చెయడం మంచిది. మనం లంకకుపోయి సర్వనాశనం చేసి జానకిని తీసుకువద్దాం.

జాంబవంతుడు : యువరాజా! మనకు అన్వేషణకార్యమే సుగ్రీవాజ్ఞ. అదీకాక మాన ధనుడయిన రామభద్రుడు తన ప్రతిజ్ఞను నిలుపుకోవాలనే పట్టుదల గలవాడు. మన ప్రభువుకూడా రావణుని పరాజితుని చేస్తానని మాట యిచ్చాడు. ఇన్ని కారణాల వల్ల మనం యిప్పుడు కిష్కిం ధకు వెళ్ళి విషయాలన్నీ నివేదించాలి, అంతే, అన్నాడు.

## మధువనం

అందరూ ఆ భల్లూకపతి మాటకు తలవంచి—

కిష్కింధాభిముఖంగా ప్రయాణం ప్రారంభించారు. తమ చూపులతోనే హను మంతుని అభినందిస్తూ అనాయాసంగా కిష్కింధహద్దులలో మధువనంలో ప్రవేశించారు.

అందులో దిగగానే అందరికీ మధుపాన కాంక్ష రేగి వారు అంగదునికి విన్నవించారు. ఆయన అంగీకరించారు. ముందుగా మధురఫలాలు భక్షించారు. అనంతరం చిరకాల వంచితములయిన మధుపాత్రలు అందుకుని త్రాగడం మొదలుపెట్టారు.

ఆ మత్తులో కొందరు నేలమీద పడి దొర్లుతున్నారు. కొందరు పిచ్చిగా ప్రేలు తున్నారు, నవ్వుతున్నారు. అట్టహాసాలతో, రోదనాలతో, పరిహాసాలతో, పరస్పర తాడనాలతో, వనవిధ్వంసనతో వారు పానక్రీడలో పడ్డారు.

వనపాలకుడు- సుగ్రీవుని మేనమామ దధిముఖుడు- వారిని వారించబోయి భంగ పడ్డాడు అప్పుడు హనుమంతుడు: మీరంతా నిర్భయంగా త్రాగండి, అన్నాడు. అంగదుడు: మీకేం భయంలేదు, నేనువ్నాను, అన్నాడు. వానరులు దొన్నెలతో మధు పానం చేస్తూ, నగం త్రాగి ప్రక్కవారికి అందిస్తూ, ఒలకబోస్తూ, చెట్ల మొదళ్ళలో దొర్లుతూ, గీరుకుంటూ, ఇకిలించుకుంటూ, తూలుతూ, ఒకరిమీద ఒకరు తడుతూ కిల కిలా రావాలతో ఉండగా దధిముఖుడు తన అనుచరులతో వచ్చి దండించడం మొదలు పెట్టాడు. వారు వానినీ, అనుచరులనూ చితకబొడవగా వారు పరుగు పరుగునపోయి సుగ్రీవుని పాదాలమీద పడ్డారు. సుగ్రీవుడు కారణం అడుగగా వారు విషయం నివేదనం చేశారు.

ఋక్షరజనుడు, వాలి ముట్టని మధువనం ధ్వంసమయింది, అని దధిముఖుడు విచారంతో నిలబడ్డాడు. అప్పటి కక్కడకుచేరిన లక్ష్మణునికి సుగ్రీవుడు: సౌమిత్రీ! హనుమంతుడు సీతనుచూశాడు. అందుకే అంగదాదులు మా మధువనంలో నిర్భయంగా పానమత్తులైవున్నారు. కార్యసాధనకు అవసరమయిన బుద్ధికుశలత, సాహసమువున్న హనుమంతుడే మనకార్యం చక్కబెట్టి వుండాలి. జాంబవంతుడు, అంగదుడు నాయకులుగా హనుమంతుడు అధిష్ఠాతగా వున్నప్పుడు ఆపనికి ఎదురుండదయ్యా, అని దధిముఖుని వైపు తిరిగి:

నువ్వువెళ్ళి వారికోసం రామలక్ష్మణ సహితుడై సుగ్రీవుడు చూస్తున్నాడని చెప్పు, అన్నాడు.

దధిముఖుడు తిరిగివచ్చి: మీరు నిర్భయంగా త్రాగండి. సుగ్రీవులవారు మీకు అనుమతి యిచ్చారు, అన్నాడు.

అయితే రామలక్ష్మణులకు కూడా తమరాక తెలిసిఉంటుందనుకుని వానరసేనను రాజదర్శనానికి నడిపాడు అంగదుడు. అల్లంతదూరంలో వారిని చూసిన సుగ్రీవుడు:

రామభద్రా! వారు జానకీదేవిని చూసి వస్తానన్నారు. కాకుంటే గడువుదాటినాక నా ముందుకు రాగలగుండె ఈ కిష్కింధలో లేదు. పయిగా వారందరి ముఖాలలో ఆనందం చూశావుగా. అదన్నీకాక తరతరాలుగా మావంశీయులెవ్వరూ ముట్టని మధు వనంలో యథేచ్ఛావిహారం చేశారంటే అప్పుడే తెలిసింది. ఇక నువ్వు ధైర్యంగావుండు, అంటూండగానే వానరవీరులు వచ్చి, రామలక్ష్మణ సుగ్రీవులకు పాదాభివాదం చేశారు. వస్తూనే హనుమంతుడు "దృష్టాదేవీ" అన్నాడు. లక్ష్మణుడు సుగ్రీవునివైపు చూశాడు. రాముని ఆనందం హనుమంతుని పొంగించింది.

ఎలావుంది జానకి, నామీద ఏ అభిప్రాయంతో వుంది, అని రాముడడిగాడు. హనుమంతుడు దక్షిణ దిక్కుగా తిరిగి మనసా జానకీదేవికి నమస్కరించి, తన సాగరలంఘ నాది విషయాలు క్లుప్తంగా చెప్పి: రామభద్రా! శీతాకాలంలో పద్మంవలె వున్నది. రావణుని పరిచారికలు ఆమెను పరిపరివిధాల హింసిస్తూంటే ఆ బాధలు పడలేక ఆత్మ హత్యకు ఉద్యుక్తురాలయిన సమయంలో నే నా యిల్లాలిని చూసి మీ సమాచారం చెప్పి. మీరిచ్చిన అంగుళీయకం యిచ్చాను. ఆవిడ ఈ చూడామణి యిచ్చి, చిత్రకూటంమీద కాకాసురుని కథ చెప్పింది. ఇంక ఒక్క మాసంలో రావణుడు తనను చిత్రహింస చేస్తా డనీ, యీలోపులోనే రావణసంహారం జరగాలనీ, అందుకోసం మీ రాకకై ఎదురుచూస్తున్నా ననీ చెప్పింది. అంటూ చూడామణి యిచ్చాడు. అందుకుంటూ రాముడు తమ్మునివైపు తిరిగి కన్నీరు మున్నీరు చేసుకున్నాడు. కొంతసేపటికి తేరుకొని: హనుమా నన్ను తక్ష ణం తీసుకువెళ్ళి సీతను చూపించు, ఇంకా ఆవిడ ఏమన్నదో చెప్పు, అని గుచ్చిగుచ్చి అడిగాడు. హనుమంతుడు తన వీపుమీద జానకిని తీసుకువస్తానన్నప్పుడు ఆవిడన్న మాటలు నొక్కినొక్కి చెప్పి, ఆవిడకు కావలసినంత ధైర్యం కలిపించి వచ్చానని రామునికి ఆశ్వాసన కలిగించాడు.

తతో మయా వాగ్భి రదీనభాషిణీ
శివాభి రిష్టాభి రభిప్రసాదితా ।
ఉవాచ శాంతిం మమ మైథిలాత్మజా
తవాతి శోకేన తథాపి పీడితా ॥

సుందరకాండ సమాప్తం.

# యుద్ధకాండ

రామచంద్రుడు హనుమంతుని గాఢంగా ఆలింగనం చేసుకుని ఇంతటి క్లేశమయిన కార్యాన్ని మారుతివంటి స్వామిసేవాపరాయణుడు తప్ప సాధించలేడు. వాయువో, వైనతేయుడో తప్ప సముద్రం అవ్వలితీరం చేరడం మరెవరికీ ఊహకందనిది. పైగా అప్రధృష్యమయిన లంకానగరం అంతా తిరిగిరావడం ఎవ్వరూ చెయ్యలేనిపని. ప్రభువు ఆజ్ఞను సమయోచితంగా నిర్వర్తించి తృప్తి కలిగించే సేవకుడు ఉత్తముడు, చెప్పినదానిని చెప్పినట్లే చేసేవాడు మధ్యముడు. చెప్పినమేరకు చెయ్యలేనివాడు అధముడు. మన హనుమ ఉత్తమశ్రేణికి చెందినవాడు. అన్వేషణలో సఫలుడై వచ్చి మా రఘువంశాన్ని నిలబెట్టాడు. ఈ సమయంలో గాఢాలింగనం కంటే ఈ దూతకు నేను బహూకరించగలిగింది లేదు, అని క్షణం ఆగి సుగ్రీవునివైపు తిరిగి :

అయితే శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి లంకలో ఈ వానరులందరూ ఎలా ప్రవేశిస్తారు, అన్నాడు. సుగ్రీవుడు : రామభద్రా ! ఇది నీవంటివాడు శంకించ వలసినది కాదు. జానకి జాడ తెలిసింది, ఇక నిర్విచారంగా వుండు శాస్త్రవిదుడవయిన మహా వీరుడివి. నువ్వు చింతాభరహృదయుడివి కాకూడదు. సాగరాన్ని మేము అవలీలగా దాటగలం. శోకశీలి కార్యసాధకుడు కాలేడు. ఒక్కమారు నా సేనలనూ, సేనాపతులనూ చూడు. వారంతా మహోత్సాహంతో ఏ సాహసానికయినా సన్నద్ధులయి వున్నారు. సముద్రానికి సేతువుకడదాం. దక్షిణతీరాన త్రికూటగిరిమీద లంక చేరి రావణసంహారం సాగిద్దాం, నువ్వు ధనుస్సు చేపట్టి నిలబడితే ఎదురెవరు ? అచిరకాలంలో నువ్వు జానకీదేవితో కలుస్తావు. ప్రయత్నహీనుడయిన క్షత్రియుని అందరూ చులకనగా చూస్తారు. క్రోధోద్రిక్తుడికి అందరూ తలవంచుతారు. సాగరతరణంకదా నీ శంక దానికి తగిన ఉపాయం ఆలోచిద్దాం. నామనస్సు శుభసూచనలతోనే పులకిస్తున్నది ఇక అనంతర కర్తవ్యం ఆలోచించాలి, అన్నాడు.

రామునికి ధైర్యం వచ్చింది. నా తపశ్శక్తితో సేతునిర్మాణం చేస్తాను, లేదా సాగరజలాలు ఎండబెడతాను. అయితే మారుతీ ! లంకానగరదుర్గ నిర్మాణవిశేషాలేమిటయ్యా అని ప్రశ్నించాడు.

హనుమ: రామభద్రా ! లంకానగరానికి నాలుగు దిక్కులా నాలుగు ద్వారాలు. ఇనుముతో నిర్మించిన మహాపరిఘలు. ఆ ద్వారాలకు అటూ యిటూ గోడలమీద బండ రాళ్ళను విసిరేయంత్రాలు.కోటగోడలమీద శతఘ్నులు. శతఘ్నుల చుట్టూ వాటి

ప్రయోగం తెలిసిన రాక్షసవీరులు. కోటగోడను ఆనుకుని అగడ్త. అగడ్తల మీద సంక్రాంతాలున్నాయి. ఈ వంతెనలకు యిరువైపులావున్న గృహాలలో యంత్రాలు వీటిని నియమిస్తూవుంటాయి. శత్రుభీతి శంకించారో వంతెనలు ఎత్తుతారు. సరే! నిసర్గంగా జలదుర్గం వనదుర్గం వున్నాయి, శూలహస్తులూ, ఖడ్గపాణులూ అప్రమత్తులై నగర రక్షణలో వుంటారు. నాలుగుద్వారాలలో భీకరాకారులు వేలసంఖ్యలో రక్షణకార్యంలో వుంటారు.

నేను అగడ్తలమీద సంక్రాంతాలు ధ్వంసంచేసి, పరిఘలు నేలకూల్చి, ప్రాకారాలు పడగొట్టి, వారి సేనలో ఒక భాగాన్ని యమపురి చేర్చి వచ్చాను. ఆలోచించగా మన సేనాపతులు మైంద, ద్వివిద, నల, నీల, పనస, జాంబవదంగదులు చాలు లంకానగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి, నీ ఆజ్ఞ కావాలిమాకు. అంతే! విజయ యాత్ర ప్రారంభమౌ తుంది. అన్నాడు.

రామ : వానరేశ్వరా! దివాకరుడు ఆకాశమధ్యానికి చేరుతున్నాడు, విజయ ముహూర్తం యిది. యాత్రకు ఇది సుముహూర్తం. సేనలకు ఆజ్ఞలియ్యి. నా దక్షిణనేత్ర స్పందన విజయసూచన చేస్తున్నది.

ఇదిగో, మీ సేనాని నీలుడు శతసహస్రసేనతో అగ్రభాగాన వుంటాడు. వారు మనకు బాటను సుగమం చేస్తారు. శీతలజలాలు, స్వాదుఫలాలు దొరికే వనాలమీదుగా మనయాత్ర వారు ఏర్పాటుచేస్తారు. శత్రువు మనబాటకు అంతరాయం కలిగించకుండా ముందు ముందు సాగి మహావృక్షాగ్రాలు ఎక్కిచూచి మనకు సంజ్ఞచేస్తారు.

ఇక గజ, గవయ, గవాక్షులు వేలసేనతో ఆ వెనుక వుంటారు. వారి వెనుక ఋషభ, గంధమాదన, దుర్ధర్షులుంటారు. సేనామధ్యంలో హనుమంతుడు, అక్కడ నేను, ఆవెనుక అంగద, లక్ష్మణులు, భల్లూకాధిపతి జాంబవంతుడు, వేగదర్శి, సుషేణుడు ఈ సేనాకాయానికి కుక్షిస్థానంలో వుంటారు అన్నాడు. రామునిమాటలు సుగ్రీవునినోట ఆజ్ఞ లయ్యాయి. ఉత్తరక్షణంలో గిరిశృంగాలమీద, వృక్షాగ్రాలమీద వానరులందరూ ప్రయాణసన్నద్ధులయ్యారు. లక్ష్మణ, సుగ్రీవులు దారి చూపగా రాముడు విజయయాత్రకు అడుగువేశాడు. వానర, భల్లూక సేనల హర్షధ్వానాలతో ఆకాశం దద్దరిల్లింది.

నీలుడూ, కుముదుడూ మార్గశోధనతో ముందు సాగుతున్నారు. గజ, గవయ, గవాక్ష, కేసరి ప్రముఖులు పార్శ్వరక్షణలో అప్రమత్తులయి ఉన్నారు.

సేనామధ్యంలో రామలక్ష్మణులు గగనమధ్యాన సూర్యచంద్రులవలే ఉన్నారు. ప్రయాణం సాగుతూండగా:

లక్ష్మణుడు: అగ్రజా! వాయువు చల్లగా సేన వెనుక వీస్తున్నది మృగపక్షి సంతతులు మనకు శుభసూచనగా ధ్వనులు చేస్తున్నాయి. దిశలన్నీ ప్రసన్నంగా వున్నాయి దివాకరుడు నిర్మలంగా వెలుగుతున్నాడు. సప్తర్షిమండలం దివ్యకాంతులతో వుంది, శుక్రనక్షత్రం రోచిర్మయమై వుంది

మన పితామహుడు త్రిశంకువు స్వచ్ఛకాంతితో సాగుతున్నాడు. ప్రకాశ భరితంగా వుంది విశాఖా నక్షత్రం. మూలానక్షత్రం నైఋతిదిశలో ధూమకేతువుతో ఆచ్ఛాదితమై శత్రునాశనం తెలుపుతున్నది. మనసేన తారామండలంవలే ఉత్సాహదీప్తితో ఉంది. ఇంక రావణసంహారం, సీతాసమాగమం, అయోధ్యాప్రవేశం. నీ పట్టాభిషేకం అత్యల్ప కాలంలో జరుగుతాయి, అని ప్రోత్సాహవచనాలు పలికాడు.

వేల ఈనినట్లు వానరసేన సాగుతున్నది. వారి పాద తాడనానికి ఎగసిన దుమ్ములో గగనతలం నిండి మేఘమండలం కనిపించకుండా పోయింది. వానర వీరులం దరూ తమ తమ బల, వీర, శక్తులు ప్రదర్శిస్తూ లంఘనాలతో, కిలకిలారావాలతో భుజ స్ఫాలనలతో తీవ్రవేగంతో వెడుతున్నారు. రామ శాసనానుసారం వారు జనపదాలలో అడుగు పెట్టకుండావనాలలో నడుస్తూ సహ్యగిరి చేరారు. వందల శిఖరాలు, సరోవరాలు, ఫల, పుష్పభరిత వృక్షాలు, లతలు, వివిధ వర్ణధాతువుల ప్రవాహాలు. ఆ గిరిమీద వానరులు హాయిగా తేనెలుత్రాగి, ఫలాలు భక్షించి, మళ్ళీ యాత్రసాగించి మహేంద్రగిరి చేరారు. రామ, లక్ష్మణ, సుగ్రీవులు ఆ గిరిశిఖరం ఎక్కి, క్రిందికిదిగి సముద్రతటం చేరారు.

అప్పుడు రాముడు: వానరేశ్వరా! చూశావా. ఈ సాగరానికి ఆవలిఒడ్డు వున్న ట్టులేదు. దీన్ని దాటడం ఎలా. ముందు నీ సేనకు విశ్రాంతి యియ్యి. తిరువాయి ఆలోచిద్దాం, అన్నాడు.

ఒడ్డున విడిసిన కపిసేన పాండురవర్ణ సముద్రంలా వుంది. అయితే తిమి, తిమిం గిల, మహామకర సంఛరితమూ, ఉత్తాల తరంగభరితమూ, అపారమూ అయిన సముద్రం కపిసేనకు భయం కలిగించింది. బహుదూరాన ఆకాశంతో సముద్రం కలిసినట్లై కనిపించింది

నీలుడు మైంద ద్వివిదులను రక్షణ స్థానాలలో వుంచాడు.

రాముడు తమ్మునితో ఏకాంతంలో కూర్చుని:

సౌమిత్రీ! సాధారణంగా కాలం శోకాన్ని శాంతింపజేస్తుంది. కాని ఈ కాంతా వియోగదుఃఖం కాలంతోపాటు నాకు ప్రవృద్ధమవుతున్నది. సీతావియోగం కంటె ఆమెకు

వయసు మీదపడుతున్నదనే బాధ మరింత వేధిస్తున్నది. చూశావా! ఈ గాలి. లంకలో సీతనుంచి వస్తున్నట్టుంది, మరింతగా క్లేశ పెడుతున్నది. ఈబాధ దుస్సహమవుతున్నది. ఈ సముద్రజలాలలో హాయిగా నిద్రిస్తే కొంత ఉపశమనం కలుగుతుందేమో. ఇంతవిరహాగ్ని దహిస్తున్నా నేనింకా జీవించివున్నానంటే జానకి కాలుమోపిన భూమిమీద వుండగలిగినందు వల్లనే, నీటిచుక్క లేక ఎండిన సస్యం జలస్పర్శతో పునరుజ్జీవిత మయినట్లు జానకీ నందే శంతో నా ఊపిరి నిలిచింది.

మల్లె మొగ్గలదంతపంక్తి, దొండపండువంటి అధరం, పద్మముఖం....ఎప్పటి కయినా నా మునివేళ్ళతో ఆ వదనం స్పృశించి పైకెత్తి చూడగలనా! ఆమెను ఆలింగనం చేసుకునే అదృష్టం నాకున్నదా. జనకుని ముద్దుబిడ్డ దశరథేశుల కోడలు నా ధర్మపత్ని, రాక్షసీగణ మధ్యంలో ఎంత కృశించి వుంటుందో. జానకీ సమాగమంతో ఈ అశ్రువులు ఆనందధార లవుతాయి, అని పరిపరి విధాల శోకించాడు. లక్ష్మణుడు ఉచితరీతిని అన్న గారిని సాంత్వన వచనాలతో శాంతింప జేస్తున్నాడు.

## యు ద్ధ ప రి ష త్తు

రాక్షసేశ్వరుడు నిండుకొలువులో లజ్జాభరవదనుడై : ఎవడూ కన్నెత్తిచూడ లేదను కున్న లంకానగరం ఒక వానరుడికి క్రీడారంగం అయింది. వాడు మనచైత్య ప్రాసాదాలు ధ్వంసం చేశాడు. మహాయోధులను సంహరించాడు. నగరమంతా అల్ల కల్లోలంగా వుంది. ఇప్పుడు మనకర్తవ్యం ఏమిటో ఆలోచించండి.

సమర్థులైన మంత్రులతో, మిత్ర బాంధవగణంతో యోచించి కార్యరంగంలో ప్రవే శించేవాడు ఉత్తముడనీ, తనకు తానే ధర్మాధర్మ నిర్ణయం చేసుకునేవాడు మధ్యముడనీ, గుణదోషపరిశీలనలేక, దైవాన్ని గణుతింపక, ఉపేక్షతో ఉండేవాడు అధముడనీ ప్రాజ్ఞు లంటారు. శాస్త్రవిదులయిన మంత్రులు ఏకాభిప్రాయం ప్రకటిస్తే అది ఉత్తమపథం. సచివ మండలి బహుమార్గాలు ప్రకటించి చివరకు ఏకాభిప్రాయానికివస్తే అది మధ్యమం, వారు బహు ముఖాలుగా సాగితే అది అధమం. కనక మీరందరూ మనకు కల్యాణప్రదమైన ఉత్తమ మార్గం చెప్పండి. రాముడు సోదర సహితుడై వానరసేనతో నిస్సందేహంగా సముద్రం దాటి వస్తాడు. లంకను ముట్టడిస్తాడు. దానికి ప్రతిక్రియగా మనం ఏంచెయ్యాలో ఆలో చించండి, అన్నాడు.

అది విన్నవారిలో బుద్ధిహీనులూ, నీతి బాహ్యులూ అయిన రాక్షసవీరులు లేచి: ప్రభూ! మన సేన, ఆయుధసంపద చెక్కుచెదరకుండా ఉండగానే మీరెందుకు చింతాకులహృదయు లవుతున్నారో మాకు తెలియడంలేదు. భోగవతిని స్వాధీనం చేసు కున్నాం, కుబేరుని తలవంచాం, దానవేంద్రుడు మయుడు చేతులు జోడించి తన కుమార్తె నిచ్చి తమతో వియ్యం పొందాడు. కుంభీనసీవల్లభుడు మధురాక్షసుడు మీముందు తల యెత్తలేక పోయాడు. శక్తియుతులు, వరగర్వితులు అయిన దానవసేనలు సంవత్సరం పోరాడి మీ పాదాల వ్రాలినవి.

మృత్యుదండమనే మహామకరంతో, శాల్మలీ ద్రుమభరితమై, కాలపాశమనే ఉత్తుంగ తరంగాలతో, కింకర సర్పాలతో యమలోక సాగరాధీశుడైన యమునితో పోరాడి సర్వప్రపంచానికీ సంతోషం కలిగించిన మీకు, భూమండలంలోని నిఖిలరాజలోకాన్నీ నిర్జించిన వాడవు, నీకు ఈ రాముడు లెక్కయా!

అంతదేనికి, మన యువరాజు ఇంద్రజిత్తు ఒక్కడుచాలు. పరమశివుని సంతుష్టుని చేసి వరాలు పొందినవాడు. దేవేంద్రునంతటి వానిని బంధించి పితామహుని కోరికమీద ఆ ఇంద్రుని విడిచినవాడు ఈయన చాలు శత్రుమర్దనానికి, అన్నారు.

కాలజీమూత సన్నిభదేహుడు సేనాపతి ప్రహస్తుడు: దేవ దానవ, పన్నగ, గంధర్వ గణాలన్నీ కలిసివచ్చినా మన రాక్షసవాహిని ముందు నిలబడలేవు. ఇక ఈ నరు లొకలెక్కయా, అయితే ఆ వానరుడు వచ్చినప్పుడు మనం అజాగ్రత్తలోవున్నాం కనక వాడు అంతపని వెళ్ళాడు కాని, లేకుంటే ఊపిరితో కదిలేవాడేనా. నీ ఆజ్ఞతో నేను సర్వలంకా రక్షణభారం వహిస్తాను, అన్నాడు.

దుర్ముఖుడు: ఆ వానరుడు మనకు చేసినదానికి ప్రతీకారంగా నేను వెళ్ళి సర్వ వానరాలనూ నాశనంచేసి వస్తాను.

వజ్రదంష్ట్రుడు: హనుమంతునితో మనకేంపని. రామ, లక్ష్మణ, సుగ్రీవులు మనశత్రువులు. ఆ ముగ్గురినీ ఈ పరిఘాయుధానికి బలియిస్తాను. అదీకాక మనవారిలో కొందరు కామరూపులు మానవరూపాలతో వెళ్ళి భరతుడు, తమను పంపించాడనీ, ఆయన రానున్నాడనీ నమ్మబలుకుతూ వారితో ఉంటారు. ఆ సమయంలో మేము ఆకాశమార్గాన దాడిచేస్తాము. పైనమేము, కింద మనవారు. నిశ్శేషం కపిసేన, అని అట్టహాసం చేశాడు.

అప్పుడు కుంభకర్ణుని కొడుకు నికుంభుడు తన కొక్కడికే ఆపని అప్పగించమనగా, వజ్రహస్తుడు నేను చాలనా, వారందరినీ హాయిగా ఆరగించి వస్తానన్నాడు. మహ యోధులు ఒక్కొక్కరేలేచి తమ తమ శక్తి ప్రకటించారు.

విభీషణుడు : మీరంతా ప్రశాంతముగా వుండండి. సామ, దాన, భేదాలు విఫల మయితేనే దండనీతి చేపట్టాలి. ప్రమత్తులూ, దైవోపహతులూ, అంతర్విరోధాలుకలవారూ పరాజయం పొందుతారు. ఇప్పుడు మన శత్రువు విషయంలో ఈ మూడూలేవు. ఆయన బలవర్ధితుడు, జితరోషుడు, విజిగీషువు, హనుమంతుడు ఇంతచెయ్యగలడని మనం అను కున్నామా. ముఖ్యాంశం, మన మహారాజు జనస్థానానికి వెళ్ళి ఆయన భార్యను అప హరించి తెచ్చాడు. ఖరదూషణ సంహారం చేశాడు కనక ప్రతీకారంగా ఈయన ఈ పని చేశాడనవచ్చు మీరు. కాని మనవారు కావాలని కాలుదువ్వి వెళ్ళారు. ప్రాణరక్షణ అనేది ప్రతిప్రాణికీ ధర్మం. దాన్ని అనుసరించి ఆత్మరక్షణార్థం ఆపని చేశాడాయన. ఇప్పుడింక జానకి కారణంగా మనం వంశనాశనం చేసుకోకుండా ఆవిడను వారికి అప్పగిం చడం ఉచితం. క్రోధ ద్వేషాలను విడిచి ధర్మదృష్టితో శాంతచిత్తంతో ఆయనకు జానకిని అప్పగిస్తే మనమంతా సుఖంగా వుండగలం. ఇది నా ప్రార్థన అన్నాడు.

రావణుడు మాట్లాడకుండా సభ విడిచి అంతఃపురం చేరుకున్నాడు.

రాత్రి దాటింది.

ఉషశ్శ్రీరేఖలు ఉదయాచలాన నడయాడుతున్నాయి. పర్వతశ్రేణిలా సంఘటిత మయి, ఉన్నతగిరిశృంగసదృశమయి, సువిభక్త కక్ష్యలతో, ప్రభుసేవా పరాయణులయిన ధీమంతులగు మంత్రులతో, శంఖతూర్యాది మంగళ వాద్యాలతో అలరారుతూ హేమ భూషణ భూషితాంగులయిన అంగనల హాసలాస్యాలతో అలరారే రావణ భవనానికి వచ్చాడు విభీషణుడు.

సుస్వర సంపన్నులయిన విప్రశ్రేష్ఠులు వేదగానంచేస్తూ, దధిసర్పి పాత్రలతో బంగారు కాంతులీనే అక్షతలు చేతబట్టి రావణునికి స్వస్తిపలుకుతున్నారు. వచ్చిన విభీషణు నికి స్వాగతం పలికి లోపలకు తీసుకు వెళ్ళారు అనుచరులు. స్వర్ణసింహాసనంమీద వున్న లంకేశ్వరుని అనుమతితో ఉచితాసనం అలంకరించి :

అగ్రజా ! జానకి మన నగరానికి వచ్చిన నాటినుండీ యిక్కడ అగ్ని అరుణద్యుతు లను వీడి నల్లని పొగలు కక్కుతున్నాడు. అగ్నిహోత్రగృహాలలో సర్పాలు హాయిగా తిరుగుతున్నాయి. ఆవులు పాలివ్వడంలేదు. హోమద్రవ్యాలలో చీమలు చేరుతున్నాయి.

మత్తేభాల గండస్థలాలనుండి మద్రదవధారలు లేవు, పచ్చికబీళ్ళ ఎదుట ఉత్తమాశ్వాలు దీన హేషారవాలు చేస్తున్నాయి. ఒంటెల, గాడిదల, కంచర గాడిదల శరీరాలనుండి రోమాలు వేల రాలుతున్నాయి. కాకులు గుంపులు గుంపులుగాచేరి అరుస్తున్నాయి. నగర గగనవీధిని గ్రద్దలు విహరిస్తున్నాయి. ఉభయ సంధ్యలలో అమంగళ ధ్వనులు వినపిస్తు న్నాయి. నగర ద్వారాలవద్ద క్రూరమృగాలు చేరుతున్నాయి. ఇవన్నీ అశుభ సూచ నలు. వీటిని నీ మంత్రులు నీకు చెప్పడానికి జంకుతున్నారు. ఇదంతా లంకానగరవాసుల దోషఫలంలావుంది. ఇప్పుడు నువ్వు జానకిని రామునికి అర్పిస్తే ఈదోషం వైదొలగవచ్చు. నా ధర్మదృష్టికి తోచిన ఈమాటలు బాగా పరిశీలించు. న్యాయమార్గాన నడవడానికి ప్రయత్నించు, అన్నాడు.

రావణుడు : విభీషణా! నువ్వు భావిస్తున్నభయం కారణరహితం. జానకిని రాముడికి అప్ప గించడం కల్ల. దేవేంద్రుడు తోడువచ్చినా రాముడు నాముందు నిలబడలేడు. నువ్వు వెళ్ళు అన్నాడు.

విభీషణుడు వెళ్ళాడు. రావణుని మనసు సీతమీది వాంఛతో కొంతసేపు బాధ పడింది. తరువాయి సభాభవనానికి వెళ్ళాడు. ఆయన వెంట అనుచర వర్గం సాగింది. రాజమార్గంవెంట పౌరులందరూ తలలువంచి జయజయధ్వానాలు చేశారు. మంగళవాద్యా లతో, స్వాగతగీతాలతో రావణుడు వైడూర్యసింహాసనం అధివసించి, మంత్రి దండనాథు లకు కబురుపంపాడు. అందరూ వచ్చారు. విభీషణుడు కూడా వచ్చాడు. సేనాపతి ప్రహస్తుడు లంకేశ్వరుని నగర రక్షణ వ్యవస్థను అప్రమత్తంచేసి వచ్చాడు.

అప్పుడు రావణుడు: ధర్మ, కామ, అర్థవిషయాలలో చిక్కులు కలిగినప్పుడు, ప్రియా ప్రియాలు జరుగుతున్నప్పుడు కష్టసుఖాలు మీముందుంచటం అవసరం. ఇంత వరకూ మీతో ఆలోచించకుండా ఏపనీ చెయ్యలేదు. అలా అన్ని పనులూ ఫలవంతం చేసుకువచ్చాం. ఈనాడు కుంభకర్ణుడు కూడా నిద్రలేచి సభాభవనానికి రావడం విశేషం.

సరే, ప్రస్తుతానికి వస్తే.... కొన్నాళ్ళ క్రిందట దండకారణ్యం నుండి నేను రాముని భార్యను అపహరించితెచ్చాను. అయితే ఆ జానకి ఈనాటికీ నామీద మనసుపడడం లేదు. ముల్లోకాలలో అంతటి అందగత్తెలేదు. హెూమాగ్ని సదృశకాంతితో వెలిగే ఆ సుందరి నన్ను నిరంతరం మదనజ్వరపీడితుని చేస్తున్నది. నాకు హర్షక్రోధాలు సమంగా కలుగుతున్నాయి.

తన భర్తరాకకోసం ఒకసంవత్సరం గడువు కోరింది. అప్పటికి ఆయన రాకపోతె నన్ను చేపడతానంది. విశాల సాగరాన్ని వారు దాటి రాలేరని నే నంగీకరించాను. కాని వ్యవహారం మనం అనుకున్నట్లులేదు. మొన్నమొన్ననే ఒకవానరం వచ్చివెళ్ళింది. మనకు మానవులవల్ల, పెద్దబాధలేమీలేవు. మీసాయంతో దేవాసురులను ఓడించాను. ఇప్పుడుకూడా మీరంతా ఆలోచించండి. రాముడు వానరసేనతో సముద్రం అవ్వలి ఒడ్డున దిగాడని విన్నాను. ఇక వారు సముద్రం దాటి రావచ్చు. జానకిని విడిచి పెట్టడం అనేది జరిగే పనికాదు. ఇక శత్రుసంహారానికి మార్గాలు చెప్పండి, అన్నాడు.

తక్షణం కుంభకర్ణుడు లేచి:

అన్నయ్యా! నువ్వు ముందే పొరపాటుచేసావు. దండకారణ్యములో వార్నిద్దరినీ కడతేర్చి జానకిని తెచ్చివుంటే ఆవిడకు నీ శక్తి ఎంతటిదో తెలిసేది. అప్పుడు తనకుతానై నిన్ను వరించేది. ఇక, ఈపని చెయ్యబొయ్యేముందు మాతో సంప్రదించి ఉండవలసింది. రాజనీతిని అనుసరించి కార్యరంగంలోదిగితే తరువాయి పశ్చాత్తాప పడనవసరంలేదుగా. ఉపాయాలు తెలియకుండా, నిశ్చితమార్గం ఎరగకుండా పనికి దిగితే దుష్పరిణామాలు తప్పవు. ఏది ఎప్పుడు ఎలా చెయ్యాలి అనేది తెలియనివాడు రాజనీతిజ్ఞుడు కాడు. చపల చిత్తుడైన శత్రువును ఎదుటివాడు సునాయాసంగా ఓడిస్తాడు. అనాలోచితంగా నువ్వు ఈ పనిచేసినందుకు నిన్ను రాముడు ఎప్పుడో కడతేర్చిఉండవలసింది, నీ అదృష్టం బాగుండి ఇన్నాళ్ళు వదిలాడు.

సరే ఇక గతాన్ని తవ్వి తలకెత్తి లాభంలేదు. ఇంద్రసూర్యులు, అగ్నివాయువులు, కుబేరవరుణులు ఎవరువచ్చినా పరిఘాయుధంతో ఎదురుపోయి వారిని యమునికి అతిథులుగా పంపివస్తాను. నేను రణభూమిలో కాలుపెడితే దేవేంద్రుడే వెమదిరగాలి. ఇక ఈ మానవుడా! నేను వారి రక్తంతాగి వస్తాను. నువ్వు నిశ్చింతగా మధుపానమత్తుడవై వుండు. రాముడు వేలకూలినట్లువిని సీతవచ్చి నీ పాదాలమీద పడ్తుంది, అన్నాడు.

అనంతరం మహాపార్శ్వుడు లేచి:

ప్రభూ! మీరే ఈ జగత్తుకు ఈశ్వరులు కదా. హాయిగా రాముని నెత్తిమీద కాలుపెట్టి సీతతో కుక్కుటబంధనాల భోగవాంఛ తీర్చుకు ఉండవలసింది. సరే, ఇప్పుడు వారు దాడిచేసివస్తే కుంభకర్ణుల వారున్నారు. యువరాజు ఇంద్రజిత్తు వున్నాడు. వారి నాయకత్వాన మేము శత్రుసంహారం చేస్తాం, మీరు నిశ్చింతగా ఉండండి. మీరు ఇప్పుడే వెళ్ళి ఆవిడతో సుఖించండి, అన్నాడు.

రావణుడు : మహామంత్రీ! నీ యోచన మంచిదే. కాని చాలాకాలం క్రితం మాట. పితామహుని భవనంలో నాట్యానికి వెడుతూన్నది పుంజికస్థల. దివ్యభూష ణాంబరాంగరాగాలతో గగనవీధిని వెడుతూన్న ఆమెనుచూచిన నామనను వశంతప్పింది. బలాత్కరించి వివస్త్రను చేసి సుఖించి పంపేశాను. అలానే అది బ్రహ్మగారి కొలువుకు వెళ్ళింది. ఆయనకు విషయం తెలిసి : ఇది మొదలుగా పరస్త్రీని బలాత్కరించి భోగిస్తే రావణుని శిరసు శతధాభిన్నమవుతుంది అని శపించాడు. అందువల్ల ఇంతకాలం ఆగాను.

సరే, నా శక్తిసామర్థ్యాలు తెలియక రాముడు వస్తున్నాడు. గిరిగుహలో పొంచి వున్న సింహమృత్యువుమ వేసని తెలియనివాడు. నా ధనుస్సునుండి వెలువడే బాణాలు రెండు నాలుకల కోడెనాగులని ఎరగడువాడు. కుబేరుని కాలదన్ని లంకను స్వాధీనం చేసుకున్న రావణుని పరాక్రమం తెలియక వస్తున్నాడు దాశరథి, అని అట్టహాసం చేశాడు. ఆ ముగ్గురి మాటలూ విన్న విభీషణుడు :

రాక్షసేశ్వరా ! జానకి కాలసర్ప పరిష్వంగంలో నీకు ముందు వెనుకలు తెలియడం లేదు. పర్వతాకారులయిన వానరులు లంకలో దిగకముందే సీతను అప్పగించిరా! రాముడు ధనుస్సుకి అల్లెత్రాడు బిగించకుండానే నా మాటలువిని ఆయన భార్యను ఆయనకు అర్పించు. మనమహాయోధులు అతికాయ, మహాకాయ, కుంభ, నికుంభులేకాదు ఇంద్రజిత్తు, కుంభ కర్ణుడు వీరెవరూ ఆ ధనుర్విముక్త శరాలధాటికి నిలబడగలవారు కారు. నువ్వుకూడా ....

అంటూండగా ప్రహస్తుడు వికటాట్టహాసంచేసి :

దేవదానవ గంధర్వ పతగ పన్నగజాతులను పరాజితులను చేసిన మనం మానవు లకు భయపడడమా ! అన్నాడు.

విభీషణుడు : ప్రహస్తా! నీవంటి సచివమిత్రుల మంత్రాంగంతో సర్వలంకా నాశనం కాబోతున్నది. వేయిపడగల పాము ఈయన తలను చుట్టుకున్నది. మీరందరూ ఆసర్ప విషంనుండి రక్షించండి మహారాజును. రామధనుర్విముక్త బాణాగ్నికి రాక్షసవంశాన్ని ఆహుతి చెయ్యకండి.

ఇంద్రజిత్తు : మీ రెందుకింత భయపడుతున్నారో తెలియడంలేదు. రాక్షస వంశంలో యింతటి భీరువు, శక్తిహీనుడు పుడతాడనుకోలేదు. పైగా ఆయన మా పినతండ్రి అవుతాడని ఊహించలేదు. దేవేంద్రుని బంధించిన నాకు ఈ మానవుడొక లెక్కయా.

విభీషణుడు : నాయనా ! నువ్వు బాలుడవు. మంత్రాంగం నీ కందే విషయం కాదు. నీ బుద్ధి వివేచనలో పక్వంకాలేదు. ఈ సభలో రాజనీతి తెలిసి, రాజ్యరక్షణ భారం వహించగలవారే మాట్లాడాలి. నిజానికి నిన్నూ, నిన్ను ఇక్కడకు రానిచ్చిన వారినీ వధ్యశిలకు పంపాలి వినయహీనుడూ, వాచాలుడూ సభకు రాకూడదు. అందునా అల్పవయస్కులకు అసలు అర్హతలేదు. బ్రహ్మదండసదృశంగా రామబాణాలు లంకలో విహరిస్తున్నప్పుడుగాని నా మాటల అర్థం నీకు తెలియదు. ఈలోపునే రాముడికి సీతను అర్పించడం ఉచితం

రావణుడు : విభీషణా ! ఇంక చాలు, కుపిత శత్రువుతో వుండగలం. కాకోల విషభరిత సర్పంవున్న యింట కాపరం చెయ్యగలం. కాని మిత్రరూపంలోవున్న శత్రువుతో కలిసిఉండటం దుర్భరం. అసలు జ్ఞాతిస్వభావమే యింత. వారికి తమవారిని పరాభవించడమే ప్రవృత్తి. అదే ఆనందం. అదను చూసి కష్టసమయంలో తిరగబడతారు. హస్తిగీతలని చెపుతారు. అంటే తెలుసా, ఏనుగులు అగ్నికి, శస్త్రానికి భయపడవు ఇరుగు పొరుగు ఏనుగులే మానవులకు సాయంచేసి మత్తేభాలను పట్టిస్తాయి. కాకుంటే దాన్ని వశంచేసుకోవడం అసాధ్యం. బ్రాహ్మణుడికి తపస్సు, స్త్రీకి చాపల్యమూ, జ్ఞాతికి శత్రుత్వం సహజ లక్షణాలు.

పువ్వులో మధువు తాగిన అరక్షణం అక్కడ వుండదు తుమ్మెద. శరన్మేఘం ఎంత గర్జించినా అది కురిసేవాన అరక్షణం నిలబడదు. మత్తగజం సరోవరంలో పరిపభ్రంగా స్నానంచేసి గట్టుకి చేరగానే శరీరంనిండా దుమ్ము పోసుకుంటుంది. అలావుంది నీ వ్యవహారం. నువ్వుకాక మరెవడు ఈ మాటలు ఆడినా తలతీయించేవాడినే, అన్నాడు.

రావణుని కోపంచూచి విభీషణుడు గదాపాణియై గగనవీథికివెళ్ళి : లంకేశ్వరా! నువ్వు నాకు అన్నవు. పితృసముడివి. ధర్మమార్గచ్యుతుడి వయావు కనక నీ హితవు కోరి అంతా చెప్పాను. కాలం నీ నెత్తిమీద ఉంది. నా మాటలు నీ చెవికెక్కలేదు రాముని తూణీరంనుండి నిశిత శరాలు నీ శరీరంలోకి వస్తున్నప్పుడు తెలుస్తుంది నా మాటల ఆంతర్యం. చాలు, నేను వెడుతున్నాను. ఈ లంకానగరాన్ని, నీ మిత్ర, మంత్రి బాంధవజనాన్నీ రక్షించుకో. నీకు మేలుకలగాలని భావిస్తున్నా. నాకు సెలవు, అని విక్రమించాడు.

## శ ర ణా గ తి

మేఘ సమానదేహుడు, వజ్రసదృశ గదాపాణి, రత్నాభరణ భూషితుడు విభీషణుడు సాగరం దాటివచ్చి రాముని చేరబోతున్నాడు. ఆయనవెంట మంత్రులు నలుగురూ వస్తున్నారు. చూచిన సుగ్రీవుడు : వీడెవడో రాక్షస యోధుడు అనుచర చతుష్టయంతో వస్తున్నాడు, మనను సంహరించడానికి కాబోలు, అన్నాడు.

మహాయోధులయిన వానరులు సాలవృక్షాలు పెరికి ; మాకు అనుజ్ఞయిస్తే వారిని నేలకూలుస్తాం, అన్నారు. అంతలో ఆ సమీపానకు చేరిన విభీషణుడు గగనవీథినే నిలిచి : దురాచార రతుడయిన రాక్షసేశ్వరుడు రావణుడు. ఆయన సోదరుడను నేను. విభీషణు డంటారు నన్ను. మాఅన్న జనస్థానంలో జటాయువును చంపి జానకిని అపహరించి తెచ్చాడు. ఆమెను రామునికి అప్పగించి రమ్మని హితవుచెప్పాను. ఆయన వినలేదు. నన్ను దుర్భావలతో అవమానించాడు. ఆయననూ నా దారానుతులను విడిచి రాముని శరణు వేడడానికి వచ్చాను. నా రాకను రామునికి చెప్పండి, అన్నాడు.

సుగ్రీవుడు విని, రామలక్ష్మణులను సమీపించి :

మనకు లంకలోని రాక్షసులందరూ శత్రువులే, వీడూ అక్కడివాడే కనక మనం విడిచిపెట్టకూడదు. చేరదీసే ఉలూకం కాకులను భక్షించినట్లు వీడు మనలను కడతేరుస్తాడు. మంత్ర, వ్యూహ, చారగణ, నయమార్గాలు భద్రంగా వుంచుకోవడం ప్రభువుకు అవశ్యం, రాక్షసులు మహాశూరులయిన కామరూపులు కనక వారిని విశ్వసించలేము. వీడు రావణదూత అయివుంటాడు. మిత్రబలం, మూలభృత్యబలం, ఈ రెండూ నిజమయిన బలాలు. శత్రుబలం సర్వథా పరిత్యాజ్యం. వీడు రాక్షసుడు. పైగా రావణసోదరుడు. అంటే మన శత్రువే మనదగ్గరకు చేరినట్టు. వీనిని విశ్వసించడం రాజనీతికాదు. అందుచేత వీనిని బంధించి, శిక్షించడం యుక్తం, అన్నాడు.

అప్పుడు రాముడు హనుమదాదులందరినీ చూస్తూ :

మీరు కూడా మీ అభిప్రాయాలు చెప్పండి, అన్నాడు. అప్పుడు వారందరూ : మీరు త్రికాలజ్ఞులు. త్రిలోకజ్ఞులు, సత్య, ధర్మనిష్ఠకల మహాశూరులు. మీకు చెప్పగల వారమా, అన్నారు. అనంతరం అంగదుడు : శత్రుపక్షంనుండి వచ్చిన వానిని నమ్మడం ఉచితరీతికాదు, దుష్టులు తమ మనస్సును దాచి అదనుకోసం వేచి పగతీర్చుకుంటారు, అర్థానర్థాలు పరిశీలించి విభీషణుని జేర్చుకోవాలి, అన్నాడు.

శరభుడు : ఆర్యా! సూక్ష్మబుద్ధికల చారుని నియోగించి పరీక్షించి ఆశ్రయ మివ్వాలి.

జాంబవంతుడు : బద్ధవైరంకల రావణుని పక్షంనుండి ఈ సమయంలో వచ్చిన వానిని స్వీకరించడానికి నా మనస్సు విముఖంగా ఉంది.

మైందుడు : మధుర భాషలతో వానితో ప్రసంగిస్తూ వాని మనస్సు పట్టిమనం నిశ్చయించుకోవాలి.

హనుమంతుడు : ధీశక్తిలో, ధీరతలో, వాక్చాతుర్యంలో మీ అంతటివారులేరు. పైగా ఒకరి అభిప్రాయాలతో వివాదానికి దిగడం నా అభిమతంకాదు. అర్థానర్థాలను మనసచివులు సహేతుకంగా ప్రతిపాదించారు. అయితే విభీషణునికి మనం ఏదోఒక పని అప్పగించి పరీక్షించాలి. అందుకిప్పుడు అవకాశం చాలదు. స్పష్టంగా రావణుని సోదరుడనని చెప్పిన వానిమీద గూఢచారుల ప్రయోగం అవశ్యంకాదు. ఇక దేశకాలాలు ఇవి ఉత్తముల విషయంలో పరిశీలించవలసినవి కావు. రావణుని దుష్టత్వాన్ని నీ సత్య పరాక్రమాన్ని ఎరిగినవాడని ఆయన మాటలవల్ల తెలుస్తున్నది. అయితే నిన్ను శరణు వేడటానికి యిది ఉచితమయిన సమయమని గ్రహించి ఉంటాడు.

అన్నీ అలావుంచి, ఇప్పుడు మనమేవో ప్రశ్నలువేసి వాని అంతరంగం తెలుసు కుందాం అంటే, ఈ మీమాంసవల్ల ఆ మనస్సులో లేనిపోని శంకలు రేగుతాయి మైత్రి కోరి వచ్చినవాని మనస్సు నొప్పించినట్లే అవుతుంది. అప్పుడాయన తన యింగితాన్ని గుప్తంగానే ఉంచుకోగలుగుతాడు పర్యవసానంగా విభీషణుని విషయంలో శంకలేమీ అవసరంలేదు. ఆయన మాటలలో దుష్టత్వంలేదు. ఆకారం ప్రసన్నంగా వుంది. దుష్టబుద్ధి యింత స్వస్థచిత్తంతో నిశ్శంకగా ఈ సమయంలో మన దగ్గరకు రాలేడు. మన స్సును ఎంత దాచినా కనులలో ఆ మాలిన్యం కనిపించి తీరుతుంది. అటువంటిదేమీ ఆయన నయనాలలో గోచరించడంలేదు. నీ శక్తిసామర్థ్యాలు, ప్రయత్నాలు విన్నాడు. రావణుని దుర్వ్యవసాయ పరిణామం గ్రహించాడు. నీ చేతులలో వాలి నిహతుడయాడనీ నువ్వే సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేశావనీ ఎరిగినవాడు, కనకనే రాజ్యాభిలాషతో నీ శరణు వేడుతున్నాడు. కనక వానిని చేరదీయడం మనకూ ప్రయోజనకరమే. ఆ పైన తమ చిత్తం, అన్నాడు.

మారుతి మాటలతో సంతుష్టుడై రాముడు:

మీ అందరి మాటలు బాగానే వున్నాయి. నా మాటకూడా వినండి. విభీష ణుని మనసులో దుష్టభావం వున్నా మైత్రీబంధం కోసం చాపిన చేతిని తిరగగొట్టరాదని అనుకుంటున్నారు. అనగా, విని సుగ్రీవుడు:

వీడు దుష్టుడు కాదా అనే మీమాంసతో పనిలేదు. విపత్కాలంలో సోదరుని విడిచి వచ్చినవానికి మనమీద మమకారం ఉంటుందా, అన్నాడు.

రాముడు మరొక్కమారు వానర సచివులందరినీ చూచి, లక్ష్మణుని వైపు తిరిగి చిరునవ్వుతో :

శాస్త్రజ్ఞానము, శాస్త్రవిధులయిన పెద్దలసేవ చెయ్యనివాడు సుగ్రీవునివలె ఆలోచించ లేడు. ఇక్కడ మరొక్క సూక్ష్మాంశం కనిపిస్తున్నది నా మనస్సుకు. చక్రవర్తికి ఆత్మ వంశీయులూ, సన్నిహిత రాజ్యపాలకులూ ప్రధాన శత్రువులు. విపత్కాలంలో దెబ్బతీసే వారు వీరే. వీరి బుద్ధి ఎటువంటిదయినా చక్రవర్తి ఎప్పుడూ వీరిని విశ్వసించడు. అయితే మనం వారి వంశీయులముకాము కనుకనూ ఆ రాజ్యంమీద కాంక్షలేదు. ఈయన మనలను మోసగించ దలుకుంటున్నాను, పైగా వీరికి ఆశ్రయమిస్తే శత్రుపక్షంలో విబేధాలు న్నట్లు స్పష్టమై, మనబలం పెరుగుతుంది.

అంతఃకలహాలు సర్వదా నాశనకరాలే కదా. అందుచేత మనం విభీషణుని చేర దీయడం అనుచితం కాదు.

న సర్వే భ్రాతరస్తాత
భవంతి భరతోపమాః ।
మద్విధా వా పితుః పుత్రాః
సుహృదో వా భవద్విధాః ॥

ప్రపంచంలో తమ్ముళ్ళందరూ భరతులు కారు, కొడుకులందరూ దశరథనందనులు కారు. అలానే స్నేహితులందరూ సుగ్రీవులు కాలేరు. ఇప్పుడు ఆలోచించు, అన్నాడు.

రామచంద్రా! నేను విశ్వసించలేను. వీడు విశ్వాసంతో మనలో ఎవరిని ఏం చేస్తాడో, అనగా రాముడు:

వానరేశ్వరా! నీ భయానికి ఆధారం లేదు. నేను ఈ సర్వదానవ, యక్ష, రాక్షసగణాలనూ కడతేర్చగలనని విభీషణుడికి తెలుసు. మరొక్కమాట. శరణు వేడిన వారికి అభయమివ్వడం నా వ్రతం. వాడు ఆర్తుడయినా, అహంభావయుతుడయినా, సరే,

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే।
అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతంమమ॥

ఇప్పుడు రావణుడు స్వయంగావచ్చి వేడితే వానికీ అభయప్రదానం చేస్తాను, అన్నాడు.

రామభద్రా! నిన్నేమని పొగడగలను ఇప్పుడు నా మనస్సు విభీషణుని స్వీకరించడానికే సుముఖంగా వుంది. ఈ క్షణంనుంచీ ఆయనకూడా మన మిత్రుడే, అంటూ ఆకాశానికి ఎగిరి, రాముని అభయం తెలిపాడు. విభీషణుడు అనుచర సహితుడై రాముని ముందు దోయిలించి నిలిచి : దాశరథీ! నేను సర్వరాజభోగాలనూ విడిచి నిన్ను ఆశ్రయిస్తున్నాను, అన్నాడు.

రాముడు దయా, స్నేహపూర్ణ దృష్టులతో:

విభీషణా! లంకానగర విశేషాలు చెప్పవయ్యా, అన్నాడు.

విభీషణుడు : రాజనందనా ! మా అన్న రావణుడు సర్వ భూతభయంకరుడు. అవధ్యుడు. ఆయన తమ్ముడు కుంభకర్ణుడున్నాడు. ఆయన యుద్ధానికి దిగితే దేవేంద్రుడు నిలవలేడు. వారి సేనాపతి ప్రహస్తుడు కూడా అంతటివాడే రావణుని పెద్దకొడుకు ఇంద్రజిత్తు వాడు అవధ్య కవచుడు. అదృశ్యదేహంతో సంగ్రామం సాగించగలవాడు వీరుగాక మహోదర, మహాపార్శ్వ, అకంపనాది సేనానులున్నారు. కామరూపులు కోట్ల సంఖ్యలో రాక్షసయోధులున్నారు వీరందరితో వెళ్ళి మా అన్న దిక్పాలకులను జయించివచ్చాడు.

రాముడు : ఈ విషయాలు చాలాభాగం యిదివరకు విన్నవే.

సరే, నీకు అభయమిస్తున్నాను రావణ సంహారానంతరం నిన్ను లంకారాజ్యానికి అభిషిక్తుని చేస్తాను. నా ముగ్గురు తమ్ముళ్ళపై ఒట్టుపెట్టి చెపుతున్నాను, మీఅన్నను యమపురికి పంపకుండా అయోధ్యకు వెళ్ళను.

విభీషణుడు : ఆర్యా! లంకానగర విజయయాత్రలో సర్వసహాయం నేను చేస్తాను.

రాముడు : లక్ష్మణా! సాగరజలాలు తెచ్చి యీయనను ఇప్పుడే లంకానగరాధిపతిగా అభిషేకించు. మూర్ధాభిషిక్తుడయిన విభీషణుని చూడాలనివుంది. అన్న నోట మాటరావడం ఆలస్యంగా సౌమిత్రి సాగరజలాలతో అభిషేకించాడు. భల్లూక. వానర సేనలు జయ జయ ధ్వానాలుచేశాయి.

అప్పుడు సుగ్రీవాదులు సముద్రతరణానికి మార్గం చెప్పమని విభీషణుని కోరగా, ఈసాగరుడు ఇక్ష్వాకు వంశవర్ధితుడే కనక ఆయన ప్రత్యుపకారం చేస్తాడన్నాడు, విభీషణుడు ఆమాటలు రాముడు చెవిని వడ్డాయి. సేతునిర్మాణ సంకల్పంతో సాగరతటాన కుశాసనంపై ఉపావసకు కూర్చున్నాడు రాముడు.

ఇక్కడ యిలావుండగా రావణుని గూఢచారి శార్దూలుడు తన ప్రభువుకు సమాచారం అందించగా, రావణుడు శుకుడనే గూఢచారిని పిలిచి :

నువ్వువెళ్ళి సుగ్రీవునితో యిలా చెప్పు :

వానరేశ్వరుడయిన ఋక్షరజసుని కుమారుడవు. కిష్కింధాధిపతివి. నేను రాముని భార్యను అపహరించడం వల్ల నీకుచేసిన కీడులేదు. కనక నువ్వు నిశ్చింతగా కిష్కింధకు వెళ్ళు. కాదంటావా, నీ వానరులు లంకను స్వాధీనం చేసుకోగల రనేమాట కల్ల, అన్నాడు.

శుకుడు ఈవలి ఒడ్డుకువచ్చి, గగనవీథిపై నిలిచి, సుగ్రీవునికి రావణ సందేశం వినిపించగా, కొందరు వానరులు వానిని బంధించి, రెక్కలు విరిచి చంపబోగా :

రామభద్రా! నేను దూతను. రాయబారిని చంపడం న్యాయం కాదు, అని అరిచాడు. రామాజ్ఞానుసారం విముక్తుడయిన శుకుడు సుగ్రీవుని సమాధానం కోసం ఆగగా:

మీ రాజు నాకు మిత్రుడు కాడు. పయిగా నా మిత్రుని శత్రువు. కనక వధార్హుడు. లంకానగరాన్ని ధ్వంసం చేసి. రావణుని సంహరించితీరతాను. రామ బాణాలకు ఎదురులేదని చెప్పు. రామలక్ష్మణులు లేనప్పుడు సీతాపహరణం చేశావు కాని ఉండగా వచ్చివుంటే యింతకాలం బ్రతికేవాడివి కాదు, అని సుగ్రీవుడు అంటూండగా,

అంగదుడు : ప్రభూ! వీడు దూతమాత్రుడు కాడు.

చూశావా! నీమాటలు వింటూనే వాడు మనసేనను పరిశీలిస్తున్నాడు గూఢచారిని విడువరాదు, అనగా సుగ్రీవాజ్ఞతో వానరులు వానిని బంధించితెచ్చారు. చంపవద్దనీ, బంధనలో ఉంచమనీ ఆజ్ఞాపించాడు రాముడు.

రాముడు సాగరతీరాన దర్భలుపరిచి, పూర్వదిశాముఖంగా తిరిగి ప్రణామంచేశాడు.

మూడు రాత్రులు గడిచాయి. సాగరతరణమార్గం గోచరించలేదు. రాముడు కుపితుడయాడు.

లక్ష్మణా! ఈ సముద్రుడు మన ప్రార్థనలతో లొంగిరాడు, క్షమాగుణం, ఆర్జవం, ప్రియావాదిత్వం గుణహీనుల విషయంలో ఎందుకూ కొరగావు. లోకాన్ని పీడించేవారికీ, దండనీతినే అనుసరించేవారికీ, దుష్టులకే సత్కారాలు జరిగినట్టు పామ మార్గాన పోయేవారికి సాగవు, కనక, నా కోదండం అందుకో. ఈ సముద్రం జలరహితం చేస్తాను. నా ఓరిమిని అశక్తతగా భావించేవాడికి శిక్షతప్పదు. హాలాహలం క్రక్కే కోరల కోడెనాగుల్లా, బ్రహ్మదండ సదృశాలుగా నా నిశితశరాలు కదిలితే కాని సముద్రం శుష్కించదు, అంటూ బాణాలు విడవడం మొదలుపెట్టాడు. సముద్రంలో మహామకర, తిమి, తిమింగలాల శరీరాలు ముక్కలుముక్కలుగా తేలుతున్నాయి, బాణాగ్నిజ్వాలలకు సాగరజలం కుతుకుత ఉడుకుతున్నది లోకాలు కంపిస్తున్నాయి.

అప్పుడు లక్ష్మణుడు: రాఘవా! ఇంక క్రోధాగ్ని ఉపసంహరించు. సాగరుడు నీ దర్శనానికి వస్తాడు. సాధుజనానికి ఆగ్రహం తగదు, అన్నాడు.

సౌమిత్రీ! దానవనిలయమైన ఈ సముద్రం పూర్తిగా ఎండిపోవాలి. అప్పుడు మనసేనలు సుఖంగా సముద్రం దాటుతాయి. ఈ సముద్రుడికి మనశక్తి తెలుస్తుంది. అని ఆకర్ణాంతం నారిలాగి వదిలాడు. ఆ ధనుష్టంకార శబ్దానికి భూనభోంతరాలు దద్దరిల్లాయి. పర్వతాలు కంపించాయి. నదీనదాలు కలవరపడ్డాయి. ఆకాశంలో ఒకప్రక్కనే సూర్యకాంతి నిలిచింది. భీకరధ్వానాలతో పిడుగులు, ఉల్కలు జారాయి. ప్రచండ ప్రభంజనం రేగింది భూతకోటి భయసంభ్రాంతమయి ఆక్రందించింది.

అప్పటికి సముద్రుని జడత్వం వదలింది. అత్యంత తీవ్రవేగంతో ఒక యోజనం వెనుకకు వెళ్ళింది సముద్ర జలం. అదిచూచి రాముడు ఆగాడు. అంతలో సాగరుడు జలమధ్యం నుండి దీప్త సూర్యుని వలె లేచాడు. కాంతులు జిమ్మేకాలనాగాలు ఆయనను పరివేష్టించి వున్నాయి. రక్తమాల్యాంబరుడై, పద్మదళ నయనుడై, రత్నభూషిత దేహుడై పైకిలేచే సాగరునిచుట్టూ గంగా, సింధునదీ పత్నులున్నారు. చకచక వచ్చి రాముని పాదాలకు అభివాదం చేసి: రామభద్రా! పృథివ్యాపస్తేజోవాయురాకాశాలు నియమితగతిలో సాగకపోతే ప్రళయం సన్నద్ధమవుతుంది. అగాధత్వ, జడత్వాలు నా లక్షణాలు. అవి

విడిస్తే వాలోని ప్రాణికోటి విల, విల లాడుతుంది. కామ, క్రోధ. భయ, లోభాలకు లొంగి నేను శిక్షించడం ఉచితం కాదు. అయితే మీరు లంక చేరడానికి దారిచెప్పాలి, అంటూండగా రాముడు : ఓయి సముద్రుడా! ఈ బాణానికి లక్ష్యం చూపించు, అన్నాడు.

సాగరుడు : ఇక్కడకు ఉత్తరంగా ద్రుమకుల్యతీర్థంలో ఉగ్రప్రభావులయిన దస్యులున్నారు. వారు వారి పీడ తొలిగించు, అనగానే బాణం విడిచాడు రాముడు. దస్యునాశనంచేసి అది భూమిలో మహారంధ్రం చేసింది. దానిలోనుండి ఉబికిన జలం మరొక సాగరమయింది. మరుభూమిగా ఉండే ఆ ప్రాంతం జలమయమయింది. అదే మరు కాంతార మయింది.

అనంతరం సముద్రుడు : రాఘవా! మీ వానరవీరులలో నలుడు విశ్వకర్మ కుమారుడు. సర్వనిర్మాణ నిపుణుడీయన. వీని తండ్రి యిచ్చిన వరప్రభావంతో సేతు నిర్మాణం చేయగల డీయన, అని నిష్క్రమించాడు.

నలుడు : ఇంతవరకూ మీరెవరూ నా ప్రస్తావన చెయ్యనందు వల్ల నేను మౌనంగా ఉన్నాను. నా తండ్రి నన్ను తనంతవాడుగా అనుగ్రహించాడు. మీరు ఆజ్ఞ యిస్తే సేతువు నిర్మిస్తాను, అన్నాడు.

రాముడు ఆజ్ఞాపించిన మరుక్షణంలో వానరులు దశదిశలకూ కదిలి మహావృక్షాలు, గిరిశిఖరాలు, బండరాళ్ళు తేవడం మొదలుపెట్టారు. గగనవీధిలో అల్లంత ఎత్తునుండి అవి పడుతూంటే సముద్ర జలాలు ఉవ్వెత్తుగా లేచి పడుతున్నాయి. అక్కడి జలచరాలు బహుదూరాలకు పలాయనం చేస్తున్నాయి. మొదటిరోజు ప్రొద్దు గ్రుంకుతున్నవేళకు పదునాలుగు యోజనాల సేతువు నిర్మాణమయింది. సూత్రాలు కొందరు పడుతున్నారు. దండంపట్టి ఎత్తువల్లాలు కొందరు సమం చేస్తున్నారు. పెద్ద పెద్ద దూలాలు తాళ్ళతో కడుతున్నారు. మరికొందరు మహోత్సాహంతో రెండవనాడు ఇరువది యోజనాలు, మూడవనాడు ఇరవైఒకటి, నాలుగవనాడు ఇరువది రెండు, అయిదవనాడు ఇరువదిమూడు యోజనాలు నిర్మించారు.

అంబరవీధిని స్వాతిపథంలా సాగరంలో సేతువు శోభిస్తున్నది. పంద యోజనాల పొడవున, పదియోజనాల వెడల్పుతో, గదాపాణియై విభీషణుడు రక్షకుడుగా సాగుతూ వానర, భల్లూకసేనలను సముద్రం దాటించాడు. హనుమంతుని భుజసీమపై రాముడు, అంగదుని మూపుపై లక్ష్మణుడు అవ్వలి ఒడ్డు చేరారు. అక్కడి సువేలాద్రిమీద దిగుతూనే రాముడు :

తమ్ముడూ ! ఈ వనాలన్నీ మధురఫలాలతో వున్నాయి. ఇక్కడ జలం స్వాదువుగా వుంది. సేనల విడిదికి యిది యోగ్యస్థావరం అయితే యిప్పుడు కనిపించే కొన్ని నిమిత్తాలు ఉపద్రవాన్ని సూచిస్తున్నాయి. గాలి కలుషంగా వుంది. భూమి కంపిస్తున్నది. గిరిశిఖరాలు ఊగిసలాడుతున్నాయి. చెట్లు గాలిదెబ్బ తగులకుండానే నేలకూలుతున్నాయి మేఘ గర్జన క్రూరమృగధ్వానంలా వుంది. సంధ్య రక్తచందన కాంతితోఉంది. సూర్యగోళంమండి అగ్నిగుండాలు వెలువడుతున్నాయి. చంద్ర మండలం చుట్టూ నల్లని, ఎర్రని వలయాలు కనిపిస్తున్నాయి. సూర్యుని చుట్టూ పరివేషం అమంగళంగా వుంది. మృగ, పక్షిసంతతులు రోదనధ్వానాలు చేస్తున్నాయి. ఇవన్నీ భూమి రక్తదాహ సూచకాలే. అంటేదారుణ సంగ్రామం తప్పదన్నమాట. మన సేనలను వక్రమవ్యూహంలో నడిపించాలి, అన్నాడు.

లంకానగరానికీ మహాసాగరానికీ మధ్య వానరసేన మరొక సముద్రంలా వుంది. లంకలో యుద్ధవాద్యాలు మ్రోగుతూంటే వానరసేన మహెూత్సాహంతో గర్జించింది. అది లంకాపురివాసుల కర్ణరంధ్రాలను ఛేదించింది.

చిత్రాతిచిత్ర ధ్వజపతాక శోభితమయిన లంకాపట్టణ దర్శనంతో రామునికి సీత పడుతూన్న బాధలు స్మరణకువచ్చి : లక్ష్మణా ! అని వేడి నిట్టూర్పులు విడిచాడు. కొంతదూరం సాగాక ఆ నగరశోభనూ, దానిని నిర్మించిన విశ్వకర్మనూ కొనియాడాడు. అనంతరం వ్యూహనిర్మాణానికి ఆజ్ఞ యిస్తూ :

అంగదుడూ, నీలుడూ ఈసేనాకాయానికి ఉరఃస్థల రక్షకులుగా ఉంటారు. ఋషభ, గంధమాదనులు తమ బలాలతో పూర్వపశ్చిమపార్శ్వరక్షకులుగావుంటారు. లక్ష్మణుడు నాతో శీర్షస్థానాన ఉంటాడు. సుషేణుడు, వేగదర్శి, జాంబవంతుడు కుక్షిరక్షణలో ఉంటారు. సుగ్రీవుడు జఘనభాగాన ఉండాలి, అన్నాడు.

అంతే ఆయన మాట వినడం తడవుగా సేనలు తమ తమ స్థానాలలో మహెూత్సాహంతో రాక్షస సంహారం కోసం ఉవ్విళ్ళూరుతూ నిలబడ్డారు.

అంతవరకూ బంధించివుంచిన గూఢచారిశుకుణ్ణి విడిచిపెట్టమన్నాడు రాముడు. శుకుడు రావణుని మ్రోలవాలి :

ప్రభూ ! నేనువెళ్ళి మీ సందేశం వినిపించడానికి ఉద్యుక్తుడి నయానో లేదో ఆ వానరులు నన్ను నానా హింసలూపెట్టి, నారెక్కలు విరిచారు, వారు పరమ క్రోధ స్వభావులు, మూర్ఖులు, వారికి మాటలతో పనిలేదు, చేతలే. నన్ను రాముని దగ్గరకు

రావణుడు మరింత రోషంతో మీరు వానరులచేత దెబ్బలుతిని వచ్చారు కనక ఈ సలహా యిచ్చారు. యుద్ధభూమిలో రావణుని జయించగలవాడు లేడని ఎరుగరా. జానకిని వారికి అప్పగించడం అసంభవం, అంటూ తన ప్రాసాద శిఖరానికి నడిచాడు. చారులు ఆయనవెనుక పోగారు. రావణుడు ప్రాకారానికి ఆవల వున్న వానరులనుచూస్తూ: ఆ సేనలో ఎవడు ఎవడో, ఎవడిబలం ఏమిటో చెప్పండి, అన్నాడు.

సారణుడు: ప్రభూ! అడుగో మన నగరద్వారం చూస్తూ నాట్యం చేస్తున్న వాడు వారి సేనాని నీలుడు. వేలాది వానరయోధులకు అధిపతులు ఆయన వెంట ఉంటారు. అంతకంటె క్రోధంతో ఆయన ప్రక్కనే నిలిచిన గిరిశృంగదేహుడు వారి యువరాజు అంగదుడు. తామరపుప్పొడి కాంతుల రోమాలతో ఎలా వున్నాడో చూడండి. ఆయన వెనుక నలుడు, విశ్వకర్మ సుతుడు, తండ్రితో సముడు. వాడే సేతునిర్మాత. ఆ వెనుక రజతగిరిలావున్నవాడు శ్వేతుడు. ఆయన చందన వనవాసులయిన వానరులకు ప్రభువు.

అటు చూడండి, సుగ్రీవునితో మాట్లాడి వెడుతున్నాడు, ఆయన కుముదుడు, ఆ ఎర్రని, పచ్చని, నల్లని దేహాలవారందరూ ఆయన అనుచరులు. ఆయనే లంకా నాశన సమర్థుడుగా భావిస్తున్నారు. ఆ జూలు, సింహకేసరాలను తలపిస్తున్నదే, ఆయన రంభుడు. ఆ కన్నులనే అగ్నిగోళాలతో లంకను దగ్ధం చేస్తానంటున్నాడు. వింధ్యకు ఈవల కృష్ణగిరి, సహ్యాద్రి ఆయన ఏలిబడి లోనివి.

మాటిమాటికీ చెవులు నిక్కించి ఆడిస్తూ, ఆవలిస్తూ, తోక అటూ ఇటూ త్రిప్పు తున్న ప్రచండ క్రోధుడున్నాడే, ఆయన శరభుడు. అదిగో కారునల్లని దేహంతో వున్న వాడు పారియాత్ర గిరీశుడు పనసుడు. వేణ్ణానదితీర వానరపతి వినతు డా ప్రక్కగా వున్నాడు. ఇటు విశాల సేనాసాగరమధ్యంలో ఉన్న ఈయన క్రోధనుడు.

ఇక ఆ నీలమేఘ శరీరులు భల్లూకపతులు. వారి అధిపతి ధూమ్రుడు. నర్మద ఒడ్డున ఋక్షవంతం ఆయన వాసస్థానం. ఆయనకు కుడివైపున వున్న యోధుడు. జాంబవంతుడు ఆయన తమ్ముడే. అంత ప్రశాంత వినయశీలంకలవాడుండడు. కాని రణరంగంలో కాలానల సన్నిభుడు. దేవదానవ సంగ్రామాలలో దేవతలకు తోడుపడ్డవాడు. ఆయన అనుచరులందరూ క్షణాలలో గిరిశిఖరాలకు ఎగబ్రాకి బండ రాళ్లు దొర్లిస్తూ శత్రు సంహారం చేస్తారు. ఆకారంలో పిశాచాలవలె వుంటారు. బలంలో రాక్షసులు వారు.

అడుగో ఆయన దంభుడు, ఆ ప్రక్కనే సన్నాదనుడు, వాని కీ వంక క్రథనుడు. అటు ప్రమాథి, యిటు గవాక్షుడు. ఈయన వెనుక గోలాంగూల వానరగణాలుంటాయి.

రావణుడు మరింత రోషంతో మీరు వానరులచేత దెబ్బలుతిని వచ్చారు కనక ఈ సలహా యిచ్చారు. యుద్ధభూమిలో రావణుని జయించగలవాడు లేడని ఎరుగరా. జానకిని వారికి అప్పగించడం అసంభవం, అంటూ తన ప్రాసాద శిఖరానికి నడిచాడు. చారులు ఆయనవెనుక పొగారు. రావణుడు ప్రాకారానికి ఆవల వున్న వానరులనుచూస్తూ: ఆ సేనలో ఎవడు ఎవడో, ఎవడిబలం ఏమిటో చెప్పండి, అన్నాడు.

సారణుడు: ప్రభూ! అడుగో మన నగరద్వారం చూస్తూ నాట్యం చేస్తున్న వాడు వారి సేనాని నీలుడు. వేలాది వానరయోధులకు అధిపతులు ఆయన వెంట ఉంటారు. అంతకంటె క్రోధంతో ఆయన ప్రక్కనే నిలిచిన గిరిశృంగదేహుడు వారి యువరాజు అంగదుడు. తామరపువ్వాడి కాంతుల రోమాలతో ఎలా వున్నాడో చూడండి. ఆయన వెనుక నలుడు, విశ్వకర్మ సుతుడు, తండ్రితో సముడు. వాడే సేతునిర్మాత. ఆ వెనుక రజతగిరిలావున్నవాడు శ్వేతుడు. ఆయన చందన వనవాసులయిన వానరులకు ప్రభువు.

అటు చూడండి, సుగ్రీవునితో మాట్లాడి వెడుతున్నాడు, ఆయన కుముదుడు, ఆ ఎర్రని, పచ్చని, నల్లని దేహాలవారందరూ ఆయన అనుచరులు. ఆయనే లంకా నాశన సమర్థుడుగా భావిస్తున్నారు. ఆ జూలు, సింహకేసరాలను తలపిస్తున్నదే, ఆయన రంభుడు. ఆ కన్నులనే అగ్నిగోళాలతో లంకను దగ్ధం చేస్తానంటున్నాడు. వింధ్యకు ఈవల కృష్ణగిరి, సహ్యాద్రి ఆయన ఏలిబడి లోనివి.

మాటిమాటికీ చెవులు నిక్కించి ఆడిస్తూ, ఆవలిస్తూ, తోక అటూ ఇటూ త్రిప్పు తున్న ప్రచండ క్రోధుడున్నాడే, ఆయన శరభుడు. అదిగో కారునల్లని దేహంతో వున్న వాడు పారియాత్ర గిరీశుడు పనసుడు. వేణ్ణానదీతీర వానరపతి వినతు డా ప్రక్కగా వున్నాడు. ఇటు విశాల సేనాసాగరమధ్యంలో ఉన్న ఈయన క్రోధనుడు.

ఇక ఆ నీలమేఘ శరీరులు భల్లూకపతులు. వారి అధిపతి ధూమ్రుడు. నర్మద ఒడ్డున ఋక్షవంతం ఆయన వాసస్థానం. ఆయనకు కుడివైపున వున్న యోధుడు. జాంబవంతుడు ఆయన తమ్ముడే. అంత ప్రశాంత వినయశీలంకలవాడుండడు. కాని రణరంగంలో కాలానల సన్నిభుడు. దేవదానవ సంగ్రామాలలో దేవతలకు తోడువడ్డవాడు. ఆయన అనుచరులందరూ క్షణాలలో గిరిశిఖరాలకు ఎగబ్రాకి బండ రాళ్లు దొర్లిస్తూ శత్రు సంహారం చేస్తారు. ఆకారంలో పిశాచాలవలె వుంటారు. బలంలో రాక్షసులు వారు.

అడుగో ఆయన దంభుడు, ఆ ప్రక్కనే సన్నాదనుడు, వాని కీ వంక క్రథనుడు. అటు ప్రమాథి, యిటు గవాక్షుడు. ఈయన వెనుక గోలాంగూల వానరగణాలుంటాయి.

కాంచనపర్వతవాసి కేసరి ఆవంక. కాంచనగిరి చుట్టూ అరువది పర్వతాల వలయంలోని వానరులందరూ ఈయన కనుసన్నలో నడుస్తారు. వారు సింహ పరాక్రములు, వ్యాఘ్ర స్వభావం వారిది. అదిగో ఆయన శతబలి. ఇంకా ఎందరో వున్నారు. వీరంతా రామ కార్యార్థం ప్రాణత్యాగసన్నద్ధులై వున్నారు, అన్నాడు.

అప్పుడు శుకుడు. ప్రభూ! గంగాతీరాన పెరిగే మర్రిచెట్లవలె, హిమగిరి మీది సాలవృక్షాలవలె కనిపించే వారు కిష్కింధలోనివారు. సుగ్రీవ సేవలో అందరూ ప్రాణాలు విడిచేవారే. కామరూపులు, దైత్య, దానవసములు. మధ్యగా మహాతేజస్వంతులు మైంద ద్వివిదులు. అదిగో అక్కడ మత్తకుంజరంలా వున్నవాడు మీ రెరిగిన హనుమంతుడు లంకానగరానికి ధూమకేతువులావచ్చి వెళ్ళినవాడు. ఆయన సమీపంలో వున్న పద్మపత్ర నేత్రుడు లక్ష్మణుడు, వేదవేత్త ధర్మపరుడు. ఆయన దగ్గరే వున్నవాడు రాముడు. ఆయన కన్నులెర్రజేస్తే మృత్యువు బయలుదేరినట్లే. ఆయన దక్షిణభాగాన తామ్రాక్షుడు. రాముని ఎదుటనే మీ తమ్ముడు విభీషణుడు. ఆయనను లంకకు అధిపతిగా అభిషేకించాడు రాముడు. విభీషణుని పార్శ్వాన వున్నాడే ఆయన సుగ్రీవుడు. ఆయన మెడలోని కాంచనమాల లక్ష్మీస్థానం, అన్నాడు,

రావణుడు క్షణకాలం చలించాడు. ఉత్తరక్షణంలో తేరుకొని వారిని మంద లించబోగా :

ప్రభూ! మీ పోషణలో వున్న మేము మీకు వాస్తవం నివేదించి హితవు చెప్పక తప్పదు, అనగా రావణుడు :

ఓరి! అవివేకులారా! ప్రభుసమక్షంలో శత్రుప్రశంస చేసే మీవంటి సచివుల మధ్య మనుగడ సాగిస్తున్నానంటే అది దైవకృప. ఇంక మీ ముఖం చూపించకండి, అనగానే వారు తలలు వంచి వెళ్ళారు.

అప్పుడు మహోదరుడు తన గూఢచారులను రప్పించగా, వారిని వానర స్కంధా వారానికి చారచర్యకు పంపించాడు. వస్తూండగానే వారిని పసిగట్టి విభీషణుడు రాముని ముందు నిలబెట్టాడు. ఆయన వారిని నిశ్చింతగా తిరిగి పొమ్మన్నాడు.

వారు రావణుని పాదాలమీద వ్రాలి :

లంకేశ్వరా! అక్కడ గూఢచారకృత్యం అసాధ్యం. ఆ వ్యూహద్వారాలన్నీ పర్వత దేహులయిన వానరుల రక్షణలో ఉన్నాయి. మేము వెళ్ళినదే తడవుగా పసిగట్టి బంధిం

చారు. బంధించిన క్షణంనుంచీ వారు పిడిగుద్దులతో, మోకాటిపోట్లతో మమ్మ హింసించారు. మా కళ్ళకు గంతలుకట్టి రామచంద్రుని పాదాలమీద పడద్రోశారు. ఆయన అనుగ్రహించి విడిచిపెట్టాడు. మాఊహాప్రకారం మనం జానకిని వారికి అప్పగించడం ఉచితం. రాముడు గరుడవ్యూహంలో మన నగరంమీదికి వస్తున్నాడు. ఇప్పుడే మీరు సంధికిసమ్మతించడమో, యుద్ధానికి సిద్ధంకావడమో తేల్చాలి అన్నాడు.

జానకిని విడవడం మాట ఎత్తకండి. మీరు చూసిన యోధులు బలవిశేషాలేవి టన్నాడు, రావణుడు.

అయ్యా! ఋక్షరజుని కుమారుడు సుగ్రీవుడు దుర్జయుడు. భల్లూకరాజుగదుడు మనకు పరిచితుడే. ఆయన కొడుకు జాంబవంతుడు. సుషేణ, దధిముఖ, దుర్ముఖ, వేగదర్శి అనేవారు రణరంగంలో మృత్యుస్వరూపులే. వారిసేనాపతి నీలుడు. అనిల నందనుడు హనుమంతుడు తనశక్తి నిన్న మొన్న చూపి వెళ్ళినవాడు. తండ్రినిమించినవాడు కాకపోవచ్చునేమోకాని అంతటివాడు వాలిసుతుడు అంగదుడు. ఇంకా గజ, గవయ, గవాక్ష, శరభ, గంధమాదన, మైంద, ద్వివిదులున్నారు. మహాయోధులు. ఇక వీరం దరినీ ఏకముఖాన నడిపే రాముడు నడివయసులో వున్నాడు. జనస్థానంలోని మన రక్షో గణాన్ని ఏకైకవీరుడుగా నిలిచి ధ్వంసం చేశాడు గదా. ఆయన సింహసదృశుడు. వారి తమ్ముడు లక్ష్మణుడు మత్తేభమే. వీరందరికీ తోడు లంకానగరం రహస్యాలన్నీ తెలిసిన వారు మీ సోదరులు విభీషణులు అక్కడే వున్నారు, అని వారు సెలవుతీసుకున్నారు.

## మంత్రాంగం

రావణుడు మంత్రివర్గానికి కబురుచేశాడు. ఈలోపునే మాయాతంత్ర నిపుణుడయిన విద్యుజ్జిహ్వుని రావించి: నువ్వు రాముని శిరస్సు, ధనుర్బాణాలు తీసుకురా, అన్నాడు. ఉత్తరక్షణంలో విద్యుజ్జిహ్వుడు వాటిని రావణుని ముందుంచాడు. ఆయన ఆనందంతో ఆ అనుచరుని సువర్ణభూషణాలతో సత్కరించి, హుటాహుటి అశోకవనం చేరి:

ఓ జానకీ! ఇకనయినా నీమూర్ఖత్వం విడిచిపెట్టు. నీ భర్త లంకలో కాలుపెట్టగానే మా ప్రహస్తుడు రాక్షససేవతో వెళ్ళి సర్వవానరసేననూ సంహరించి, అప్పటికింకా సుఖనిద్ర లోవున్న నీ భర్త శిరస్సు ఖండించి తెచ్చాడు. నీ భర్తను ఆశ్రయించబోయిన నా తమ్ముడు మళ్ళీ మావారి శరణువేడాడు. లక్ష్మణుడు కొందరు వానరులతో అడవులపాలయాడు. అంగదుడు రక్తంకక్కుకున్నాడు. హనుమంతుని చెక్కిళ్ళు జారిపోయాయి. సుగ్రీవుడి గ్రీవం

మట్టిలోవుంది. భల్లూక సేనలు వానరాలవలె చెట్లెక్కి ప్రాణరక్షణ చేసుకుంటున్నాయి. నీ కింకా నమ్మకం కుదరకపోతే అదిగో మా విద్యుజ్జిహ్వుడు నీ భర్త శిరసునూ, ధనుర్బాణాలనూ తెస్తున్నాడు, అనగానే వాటితో వాడువచ్చి నిలువగా, ఆ శిరసు పట్టుకుని : సీతా! ఇదిగో నీ భర్త శిరసు అని అట్టహాసంచేసి, ఆ శిరసు నేలమీదకు విసిరాడు. సీత ఆ శిరసును చూస్తూనే మూర్ఛిల్లి, తేరుకుని పరిపరి విధాల విలపించి : రావణా! నన్నుకూడా నీ కత్తికి బలిచెయ్యి, అంది.

నోటిమాట లేకుండా విలపిస్తూనే ఉంది జానకి.

రావణుడు అట్టహాసంతో ఆవిడ మనసు మార్చే ప్రయత్నంలో ఉండగా పరిచారకుడు వచ్చి :

ప్రభూ ! జయము, జయము, సేనాపతి ప్రహస్తులవారు మంత్రిబృందంతో సభా భవనంలో తమకోసం వేచివున్నారు, అన్నాడు.

రావణుడు ఉత్తరక్షణంలో వెనుతిరిగి వెళ్ళాడు. అక్కడ అందరూ గౌరవ పురస్సరంగా స్వాగతం పలికి, ఎవరు సేకరించిన సమాచారాన్ని వారు అందజేయగా రావణుడు: లంకలోని సైనికులందరూ యుద్ధసన్నద్ధులుకావాలి, అని ఆజ్ఞాపించాడు.

ఇక్కడ సీత దుఃఖసాగరంలో ఉంది. రావణుడు వెనుదిరగగానే అక్కడ రాముని శిరసు, బాణాలు అదృశ్యమయాయి. అదిచూచి సరమ అనే రాక్షసస్త్రీ సీతను ఊరడిస్తూ:

ఎందుకమ్మా! అంత శోకిస్తున్నావు. చూశావుకదా ఆయన ఎంత తొందరగా వెళ్ళిపోయాడో. అంటే నీ భర్త మరణించలేదన్నమాటే. ధర్మపరుడు, సత్యవ్రత పరాయణుడు, మహాపరాక్రమోపేతుడు, శత్రుసంహార సమర్థుడు అయిన నీ భర్తను సంహరించడం ఎవరికీ సాధ్యంకాదు. మహావీరులయిన వానరయోధులతో మీ ఆయన విడిసి వున్నాడు, అని చెబుతూండగా రణభేరి వినిపించింది.

అదిగో విన్నావుగా. యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. అంటే రాముడు బ్రతికివున్నట్లేకదా. రాముడు రావణ సంహారంచేసి నీకు సుఖశాంతులు అనుగ్రహించే రోజులు దగ్గరపడ్డాయి. చక్కని వానలతో భూమి సస్యశ్యామలమయినట్లు రాముని ప్రేమామృతవర్షంతో నీ వదనం దరహాస శోభామయ మవుతుంది. నే నిప్పుడే గగన మార్గాన రామునిచేరి నీ వార్తలు చెప్పివస్తాను, అంది.

అప్పుడు సీత : సరమా! నీ మాటలతో నా మనస్సు స్వస్థమవుతున్నది ఇప్పుడు నువ్వు రాముని దగ్గరకు వెళ్ళడం కంటె రావణుని ప్రయత్నాలేమిటో తెలుసుకురావడం ఉచితం అనగా సరమ హుటాహుటి రావణభవనంచేరి విశేషాలు గ్రహించి వచ్చి :

అమ్మా! రావణుడు యుద్ధసన్నాహంలో ఉన్నాడు. ఆయన తల్లిమాత్రం : నాయనా! ఎందుకీ వంశనాశనకార్యాలు సీతను రామునికిచ్చి ప్రశాంతంగా జీవించు, అని చెప్పింది. వృద్ధులయిన మంత్రులూ ఆ మాటనే చెప్పారు. కాని ఆయన విని పించుకోలేదు. యుద్ధభేరీలు మ్రోగిస్తున్నారు. ఆవల వానరులు సింహగర్జనలు చేస్తున్నారు. ఆ గర్జనలకు రాక్షసవీరులు కలవరపడుతున్నారు. అదిచూచి రావణుడు :

మీరంతా మహాయోధులు. అచంచల పరాక్రములు. మనం నిశ్శంకగా రాముని నేలకూల్చగలం, అన్నాడు.

ఆ మాటలువిన్న రావణుని మాతామహుడు మాల్యవంతుడు,

రాక్షసేశ్వరా! విద్యవల్ల లభించిన వినయశీలంతో దేశకాలాలు ఎరిగి సంధి విగ్రహాలు నడుపుకొనేవాడు వివేకి. మనకంటె బలవంతులతో వైరం అవివేకం. రాముని బల పరాక్రమాలు తెలిశాక మనం ఆయన భార్యను ఆయనకు అప్పగించి సంధిచేసుకోవడం ఉచితం. సృష్టి ప్రారంభవేళ ధర్మాధర్మాలను దేవదానవులను ఆశ్రయించారు. కృత యుగంలో ధర్మమే అధర్మాన్ని నాశనంచేసేది. ఈ త్రేతాయుగంలో అది తల్లక్రిందులు కావడంవల్ల ధర్మంమీద నువ్వు విజయం సాధించావు. మహర్షులను హింసించి, యజ్ఞ విధ్వంసనంచేసి, వేదవేత్తలను క్లేశాలపాలుచేశావు. మహామహుల యజ్ఞకుండాలనుండి ఆవిర్భవించిన హోమధూమాగ్ని లంకానగరం అంతా క్రమ్ముకున్నది. నీకు దేవ, దానవ, గంధర్వాదుల చేతులలో మరణం లేదుకాని నర, వానర, భల్లూకాలు నీకు అజేయాలుకావు.

అన్నిటికంటె యిటీవల లంకానగరంలో ఎన్నో ఉత్పాతాలు పుడుతున్నాయి. గృహ ప్రాంగణాలలో వేసిన బలులు కుక్కలపాలవుతున్నాయి. నగరవాసుల స్వప్నాలలో తెల్లని దంతాలతో కాళీస్వరూపం కనిపిస్తున్నది. గోగణం గాడిదలను ప్రసవిస్తున్నది. ముంగిస ఎలుకపిల్లలను కంటున్నది. ఏనుగకడుపున పిల్లి పుడుతున్నది. మన భవనాల లోని చిలుకలు అమంగళధ్వనులు చేస్తున్నాయి. ముండిత శిరస్కుడు, కృష్ణపింగళ వర్ణుడు, వికటవదనుడు, కరాళవక్త్రుడు అయిన కాల పురుషుడు ప్రతి గృహద్వారంలోనూ తొంగి తొంగి చూస్తున్నాడు.

ఇదీకాక నాకు రాముడు మహావిష్ణువేమో అనిపిస్తున్నాడు. ఏమయిన ఆయన గురించి విన్న విషయాలను బట్టి ఆయన మానవ మాత్రుడనిపించడంలేదు. అందుచేత రామునితో సంధి శ్రేయస్కరం, అంటూంటే రావణుని కనులు ఎరుపెక్కి కనుబొమలు ముడివడ్డాయి.

మాల్యవంతా! మీరంతా హితోపదేశం పేరిట శత్రుసంకీర్తనం చేస్తున్నారు. ఏమిటి మీ ఊహ. తండ్రిచే అడవులకు పంపబడి, వానరుల సాయంతో దీనుడయినవాడా మహామహుడు, పయిగా నా కొలువులో యిటువంటి ప్రస్తావన చేస్తున్నారంటే శత్రుపక్ష పాతం మీలో వుండివుండాలి. దండకాటవినుండి సీతను తెచ్చినది ఆయనకు అప్పగించ డానికా! రామ, లక్ష్మణ, సుగ్రీవులు నాచేతులలో నేలకూలడం మీ కళ్ళతో మీరు చూస్తారు తలవంచేపని రావణుడు చెయ్యడు.

రాముడు సేతునిర్మాణం చేశాడని భయపడాలా. ఒక్కొక్కప్పుడు అతి సామాన్య మానవుడు మహాఘనకార్యం సాధిస్తాడు. ఇప్పుడు చెపుతున్నాను. రాముడు వానిర సేన అంతతో నేలకూలుతాడు. ఇది తథ్యం, అని కొలువువీడి అంతిపురికి చేరాడు.

ఇక్కడ రాముడు తన మిత్రులందరితో సమాలోచనలు ఆరంభించాడు. అప్పటికి విభీషణుని మంత్రులు లంకానగరానికి పోయి తిరిగివచ్చి విషయాలన్నీ నివేదించారు. ఆ వివరాలను చెపుతూ :

లంకాపట్టణ ప్రాగ్ద్వారాన్ని ప్రహస్తుడు, దక్షిణ ద్వారాన్ని మహాపార్శ్వ, మహెూ దరులు, మేఘనాథుడు పశ్చిమద్వారాన్ని రక్షిస్తూంటారు. రావణుడు స్వయంగా ఉత్తర ద్వారంలో మనకు ఎదురువస్తాడు. విరూపాక్షుడు నగర గర్భరక్షకుడు. ఇక వారి సేనా బలం కోట్లసంఖ్యలో ఉంటుంది. వారిలో ఎవరికీ ప్రాణభీతిలేదు. యక్ష, దానవ, దేవ గణాలను మట్టికరిపించినవారు. అందుచేత మనం వారి నెదుర్కొనడానికి మన వ్యూహాన్ని బలిష్ఠంగా రూపొందించాలి, అన్నాడు.

విన్న రాముడు : లంకాపట్టణ పూర్వద్వారాన్ని మనసేనాని నీలుడు ఆక్రమించాలి. ప్రహస్తునికి ప్రతియోధుడు ఆయనే. మహెూదర, మహాపార్శ్వులను అంగదుడు చూసు కుంటాడు. పశ్చిమ ద్వార భేదనం మన మారుతి పని. ఇక రావణుడు నావంతు. నావెంట లక్ష్మణుడుంటాడు. సుగ్రీవ, విభీషణ, జాంబవంతులు నాభిస్థానంలో ఉంటారు. మనవారు వానరులు వానర రూపంలోనే, భల్లూకసేనలు భల్లూక రూపంలోనే యుద్ధం చెయ్యాలి. నేనూ, లక్ష్మణుడు, మంత్రి సమేతం విభీషణుడూ మేమూ మానవయుద్ధం సాగిస్తాం, అన్నాడు.

అనంతరం సుగ్రీవ, విభీషణ, లక్ష్మణులతో ప్రసంగిస్తూ : ఈ సంధ్యా కాలంలో సువేలాద్రిని అధిరోహించి రావణపాలిత లంకా నగరం అంతా చూడాలి. ఆ రావణ చక్రవర్తి పరదారాపహరణ పాపకార్యంతో తన వంశనాశనం చేసుకుంటున్నాడు. ఒక్కని పాపఫలం యిందరు అనుభవించాలి; అంటూ సువేలాద్రివయిపు నడిచారు. ఆయన వెంట సుగ్రీవ, విభీషణ, లక్ష్మణ, అంగద, జాంబవంత, నల, నీల, గజ, గవయ, గవాక్ష, గంధమాదన, శరభాదులు హనుమత్స మేతులయి నడిచారు.

లంకానగరాన్ని చూస్తున్న రాముడికి నగర ప్రాకారం చుట్టూ మరొక నల్లని ప్రాకారం కనిపించింది. నిశితంగా చూశాడు. అది రాక్షససేన. త్రికూటగిరి శిఖరం మీద ఆ నగరమధ్యంలో మహోన్నతంగా రావణుని రాజప్రాసాదం అత్యంత శోభా మయంగా వుంది. సంధ్యారుణ కిరణాలలో అది మరింత రమణీయంగా ఉంది. దాని చుట్టూరక్షణవ్యవస్థ. ఆయుధహస్తుడు కాని సైనికుడు కనిపించలేదు. చూచిన వానర వీరులు సింహ గర్జనలు చేశారు. ప్రొద్దు గ్రుంకింది. అందరూ క్రిందికి దిగారు.

సుగ్రీవ, విభీషణాది ప్రముఖులతో రామలక్ష్మణులు ఆ రాత్రి సువేలాద్రి మీదనే శయనించారు.

## అంగద రాయబారం

ఇక్కడ వీరు సువేలాద్రి మీద నిలబడి రావణ ప్రాసాదం చూస్తున్నవేళ, ఆ ప్రాసాదశిఖరం మీద రావణుడు వీరిని తిలకిస్తున్నాడు. రావణుని చూచిన సుగ్రీవుని ఆవేశం అంతరిక్షానికి లేచింది. క్షణాలవ్యవధిలో రావణ ప్రాసాదశిఖరానికి ఎగిరివచ్చి, ధగధగలీనే లంకేశ్వరుని మణికిరీటం నేలకు రాల్చాడు. కుపితుడై రావణుడు సుగ్రీవుని పడగొట్టాడు. పడుతూనే పైకెగిరి వానరేశ్వరుడు పదితలల రావణుని పడగొట్టాడు. ఉభయులూ మల్లయుద్ధం ఆరంభించారు. ఒకరి బాహుబంధంలో ఒకరు నలిగిపోతున్నారు. ఒకరినొకరు కుమ్ముకుంటూ ముష్టిఘాతాలతో సింహశార్దూల సంగ్రామం సాగించారు. రావణుడు మాయాబలంతో సుగ్రీవుని బంధించే ప్రయత్నంలోవుండగా సుగ్రీవుడు ఒక్కఊపున సువేలాద్రి మీద వాలాడు.

వాలిన సుగ్రీవునితో రాముడు : మిత్రమా ! ప్రభుపు సచివులతో సంప్రదించకుండా చేసే సాహసం విపరిణామాలకు దారితీయవచ్చు. ఈ కొద్దిక్షణాలు మేము ఎంత సందిగ్ధంలో పడ్డాం. అక్కడ నీకే అపాయం జరిగినా నాకు సీతకాని, నా తమ్ముళ్ళు కాని

అవసరం లేదు అలా జరిగితే ఇక్కడ రావణసంహారం చేసి ఈ విభీషణునికి లంక అప్పగించి అయోధ్యలో భరతునికి సర్వాధికారాలూ వదలి ప్రాణత్యాగం చేద్దామనుకున్నాను, అన్నారు.

సుగ్రీ : రామభద్రా! జానకిని అపహరించిన క్రూర రావణుని చూడగానే నాకు ఆవేశం ఆగలేదు. తక్షణం వానిని చంపాలనుకున్నాను, అన్నాడు.

రాత్రి గడిచింది. తెల్లవారుతూండగా వానరవీరులు లంకానగర ద్వారాలను చుట్టుముట్టి నిలబడ్డారు. అందరూ కోటచుట్టూఉన్న అగడ్తలు దాటి రాక్షస సంహారం కోసం ఉగ్రూత లూగుతున్నారు. పర్వత దేహులయిన వానరుల చేతులలో గిరిశృంగాలు, మహావృక్షాలు ఉన్నాయి.

అంతా సన్నద్ధమయాక రాముడు తన మిత్రసచివులయిన సుగ్రీవ విభీషణాదులతో ఆలోచించి చివరి ప్రయత్నంగా రావణుని దగ్గరకు అంగదుని రాయబారిగా పంపడానికి నిశ్చయించి : అంగదా! నువ్వు రావణుని దగ్గరకు వెళుతూనే నా మాటలుగా యిలా చెప్పు:

ఓ నిశాచరా! నీ భోగభాగ్యయుతమయిన జీవితానికి చివరిరోజులు వచ్చాయి. మృత్యువు నీకోసం ఎదురుచూస్తున్నది. జీవితం మీద ఆశవుంటే జానకిని మాకు అప్ప గించి, ప్రశాంతంగా వుండు. లేదా రాక్షసవంశనాశనం తప్పదు. విభీషణుడు సింహాసనం ఎక్కుతాడు. నీ చుట్టూ ఉండేవారు స్తోత్రపాఠాలు చేస్తూంటే అవన్నీనిజమని భావించకు. మహామహులను హింసించిన పాపఫలం ఊరకపోదు. నువ్వుయుద్ధానికి రాదలచుకుంటే ఒక్కమారు నీ ఆప్తులందరినీ కన్నులారా చూచుకురా, పరలోక కర్మలు కూడా సమాప్తం చేసుకురావడం మంచిది, అన్నాడు.

అంగదుడు రావణుని కొలువుకూటంలో అడుగుపెడుతూనే రామభద్రుని సందేశం యథాక్షరం వినిపించి :

నేను వాలిపుత్రుడను, అంగదుడంటారు నన్ను. విన్నావుకదా రామసందేశం. ఇప్పటికయినా మించిపోయిందిలేదు. జానకిని అప్పగించి, విభీషణునికి లంకధారపోసి ప్రాణరక్షణ చేసుకో, అనగా రాక్షసేశ్వరుడు తామ్రాక్షుడై :

వీడ్ని వెంటనే సంహరించండి, అనగానే నలుగురు రాక్షసవీరులు అంగదుని గట్టిగా పట్టుకున్నారు. ఒక్కక్షణం వారికి పట్టుబడినట్టువుండి ఆ నలుగురిలో యిద్దరిని యీ చంకలో యిద్దరిని ఆ చంకలోబంధించి గగనవీథికెగిరి అక్కడనుండి వారిని కిందికి వదిలాడు

వారు రావణుని పాదాలమీద పడుతున్న వేళకు అంగదుడు ఒక్క కాలితాపుతో రావణ ప్రాసాదశిఖరం నేలకు పడగొట్టి, సింహనాదంచేసి తన బలగంలో ప్రవేశించాడు.

వానరులు హర్షధ్వానాలు చేస్తున్నారు. రాక్షసులు భయకంపితులయారు. వానర సేన ముందడుగువేసింది రామాజ్ఞతో, విన్న రావణుడు ప్రాసాదం మీదినుండిచూచాడు. వానరులందరి ముఖాలలో ప్రసన్నత, సంతోషం పొంగి ప్రవహిస్తున్నాయి.

## జయత్యతిబలో రామో

వానర సేన ముక్త కంఠంతో సింహనాదం చేసి

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజాజయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః ।

అంటూ కోటగోడలకు ఎగబ్రాకుతున్నది.

లంకలో నిర్విరామంగా రణభేరి మ్రోగుతున్నది. కాలాభ్రాలవంటి రాక్షసయోధులు శ్వేతశంఖాలు పూరిస్తూంటే కొంగలబారులు నిండిన మేఘమండలంలాఉంది. మత్తేగ ఘీంకృతులు, జాత్యశ్వ హేషారవాలు రథ నేమి ధ్వానాలు యోధగర్జలు భూనభోంతరాలు దద్దరిల్లుతున్నాయి.

గదా, శక్తి, శూల, పరశు, పట్టిసాయుధాలు లంకలోనుండి వస్తుంటే ఈవలనుండి బండరాళ్ళు, వృక్షశాఖలు గిరిశృంగాలు, మహావృక్షాలు వాటికి ఎదురు నడుస్తున్నాయి. రాజాజయతి సుగ్రీవః అనే శబ్దం మార్మోగుతున్నది. కోటగోడల కెగబ్రాకే వానరులను రాక్షసులు కిందికి తోస్తుంటే, వారు గగనవీధి కెగిరి రాక్షస సేనమీద వ్రాలిమర్దిస్తున్నారు.

నగరద్వార కవాటాలు తెరుచుకుని రాక్షసవీరులు వానరులతో తలపడ్డారు. పోరు ఘోరంగా సాగుతున్నది. క్షణాలవ్యవధిలో మహాయోధులు ఒకరి నొకరు ఎదుర్కొన్నారు. అంగదుని కెదురుగా వచ్చే ఇంద్రజిత్తు వజ్రాయుధసదృశమయిన తన గదాదండం విసిరాడు. ఒడుపుగా ఆ గద పట్టుకుని దానితోనే అంగదుడు ప్రతిపక్షి రథాన్ని అశ్వాలనూ చూర్ణంచేశాడు.

ప్రఘసుడు సుగ్రీవునికి ఎదురురాగా సప్తపర్ణవృక్షం విసరి నేలకూల్చాడు. లక్ష్మణుడు విరూపాక్షుని పరాజితునిచేశాడు. అగ్నికేతు, రశ్మికేతు, సుప్తఘ్న, యజ్ఞకోపులు రాముని ఎదుర్కొన్నారు.

మైందుని పిడికిలిపోటుకి వజ్రముష్టి యమపురి చేరాడు. నీలుడు నికుంభుని కెదురేగి వాని రథసారథికి శిరశ్ఛేదం చేశాడు.

సంకులసమరం సాగుతున్నది. వానరులు ఎదురులేకుండా సాగుతున్నారు. సంధ్యాకాలం సమీపించి చీకట్లు మునురుతూవున్నా యుద్ధం సాగుతూవే ఉంది. చీకటి ముదిరింది. వానరుల చేతులలోని పర్వతాలమీది ఓషధులకాంతులు కొంత వెలుగు నిస్తున్నాయి. రాక్షసవీరుల రథధ్వజ దండాల సువర్ణకాంతులు శత్రువును గుర్తుపట్టడానికి సహాకరిస్తున్నాయి.

అలా సాగుతూండగా సముద్రఘోషను మించే ధ్వనితో మహోదర, మహాపార్శ్వ వజ్రదంష్ట్ర యజ్ఞశత్రులు రామునిమీదికి రాగా ఆయన నిశిత శరాలతో వారిని వెనుకకు పంపాడు. శారద రాత్రులలో మిణుగురులవలె వున్నాయి రామబాణాలు. అంగదుడొక వంక అనుచరసహితుడై రాక్షససంహారం చేస్తూ తీవ్రక్రోధంతో ఇంద్రజిత్తు అధివసించిన రథాన్ని ముక్కలుచేయగా ఆ రావణపుత్రుడు మాయాయుద్ధం ఆరంభించి మనిషి కనిపించ కుండా బాణవర్షం కురిపిస్తున్నాడు. అంతలో ఇంద్రజిత్తు విడిచిన నాగాస్త్రం రామ లక్ష్మణులనుకూడా వివశులనుచేయగా వాడు సింహనాదం చేస్తూ : అదృశ్యంగా సాగించే యుద్ధంలో నన్నువట్టడం దేవగణాలకే సాధ్యంకాదు, అంటూ మరికొన్ని బాణాలతో రామ లక్ష్మణుల శరీరాలు తూట్లువడేలా కొట్టాడు, వారి దేహాలు నిండుగాపూసిన కింశుక వృక్షాలవలెఉన్నాయి. రక్తధారలు స్రవిస్తున్నాయి.

రాముని పిడికిలినుండి బాణంజారింది. అదిచూచిన లక్ష్మణుని స్మృతితప్పింది. వానరయోధులు శోకసాగరంలో మునిగారు. అప్పుడు ఇంద్రజిత్తు అట్టహాసంతో : ఇంక లంకానగరానికి భయంలేదు. ఖర దూషణులను వధించిన వారిని నేలకూల్చాను. మా తండ్రికి పీరిభయం లేదు. ఈ వానరులు తోక ముడవాలి, అంటూ పదిబాణాలతో వానరసేనాపతి నీలునీ మరొక నిశితశరంతో జాంబవంతునీ మూడేసి బాణాలతో మైంద ద్వివిదులనూ రెండేసి బాణాలతో గవాక్ష శరభులనూ అంగదునీ వేధించాడు.

రాక్షసులు హర్షధ్వానాలుచేశారు. ఇంద్రజిత్తు నగరంలోకి వెళ్ళాడు. కొడుకు చేసిన అద్భుతకార్యానికి సంతోషంతో రావణుడు సింహాసనం దిగివచ్చి గాఢాలింగనం చేసుకొన్నాడు. యుద్ధక్రమం వినిపించగా రావణుడు రామజ్వరంనుండి విముక్తుడయాడు. తక్షణం అశోకవనంలో సీత చుట్టూవున్న త్రిజటాది రాక్షసస్త్రీలను పిలిచి: ఇంద్రజిత్తు చేతిలో రాముడు నేలకూలాడు. పుష్పకంమీద సీతను తీసుకువెళ్ళి చూపించండి.

ఆ రామధ్యానం విడిచి నన్ను చేరుతుంది, అని లంకానగరంఅంతా రామ లక్ష్మణ మరణవార్త చాటింపించారు.

పుష్పకంమీద సీతను ఎక్కించి త్రిజట రణరంగానికి వెళ్ళింది. రక్తధారలతో ధరాతలంమీద పడివున్న రామలక్ష్మణులు వారిచుట్టూ శోకవదనాలతో వానరులు, సీతకంట బడ్డారు. సీతకు కన్నీరు మున్నీరయింది. ఆమె శోకిస్తూ:

ఎంత దురదృష్టవంతురాలిని. మా నాన్నగారి ఆస్థానంలోని జ్యోతిశ్శాస్త్రవిదుల మాటలన్నీ వ్యర్థమయ్యాయి. నేను వీరపత్ని నవుతానని, నాభర్త సత్రయాగంచేస్తాడనీ, ఉత్తమపుత్రులకు తల్లినవుతాననీ, పట్టాభిషిక్తుడయే భర్తతో నాకుకూడా మూర్ధాభిషేక యోగం ఉన్నదని అన్నారు. అతిసూక్ష్మంగా, నీలంగాఉండే నా కనుబొమలు, రోమ రహితములయిన జంఘలు అవిరళములయిన దంతాలు, అరుణనఖాలు, సుడితిరిగిన నాభి, మణిద్యుతులీనే ఈ శరీరం మెత్తని కురులు ఇవన్నీ పట్టమహిషి లక్షణాలుగా పేర్కొన్నారు. అన్నీ వ్యర్థములే.

మహాసాగరాన్ని గోష్పదంగా దాటిన మహాయోధులు ఈ మాయావుల యుద్ధంలో నేలకూలారా ! వీరి కంటబడితే వాడు బ్రతికేవాడా. కాలం బలీయమనీ, కృతాంతుడు అజేయుడనీ యిందుకే కాబోలు అంటారు. పదునాలుగేండ్లు అడవిలో క్లేశాలుపడి తిరిగి వస్తాడని కన్నుల వత్తులుంచుకొని ఎదురుచూచే మా అత్తగారిస్థితి తలుచుకుంటే నా గుండె జారిపోతున్నది, అని పరిపరి విధాల విలపించే సీతమచూచి త్రిజట :

అమ్మా ! నువ్వు విచారించ నవసరంలేదు. కన్నీరు ఒత్తుకుచూడు. వారు మరణించలేదు. సరిగాచూడు వారి ముఖాలలో క్రోధఛాయలు తగ్గలేదు. ఆవానరయోధులను చూస్తున్నావా. వారి ముఖాలలో క్రోధం ఉత్సాహం పసివాడలేదు. ప్రభువు మరణిస్తే పరిజనం ముఖాలలో క్రోధాదు లుండవు. అన్నట్టు మరొక్క మాట ! భర్తృహీన ఈ పుష్పకం అధివసించలేదు. ఇంతకంటె ప్రబలనిదర్శనం ఏంకావాలి.

పైగా వారంతా రామలక్ష్మణుల చుట్టూ రక్షకవలయంగా ఉన్నారు. ఇన్నిటి కంటె ఇంత శోకించే నీముఖంలో కాంతి తగ్గలేదు. నా నమ్మకం ఒకటి ఉంది. వీరిని దేవతలుకూడా జయించలేరు. వీరు మూర్ఛలో మునిగిఉన్నారంతే. కొద్దిక్షణాలలో లేచి విజృంభిస్తారు, అంది.

త్రిజటమాటలు జానకికి విశ్వాసం కలిగించాయి. అంతలో పుష్పకం వెనుదిరిగింది. అశోకవనం చేరింది పుష్పకం.

రామ లక్ష్మణులు మూర్ఛితులయినవార్త వింటూవే సుగ్రీవ, విభీషణ, హనుమదా దులు అక్కడకు చేరారు. సుగ్రీవుడు అత్యంత విచారంతో కూలబడగా విభీషణుడు :

ఏమయ్యా ! ఎందుకింత కలవరం. ప్రభువు నిర్వీర్యుడయితే అనుచరసైనికు లేమవుతారు. ఇంతకీ వీరి ముఖాలు పరిశీలించి చూశావా. మృత్యులక్షణా లున్నాయా. ముఖాలలో కాంతి తగ్గలేదే. నువ్వు నిశ్చింతగా వుండి వీరి రక్షణభారం వహించు. నేను మన సేనలకు ధైర్యంకల్పించి వస్తాను, అని బయలుదేరగా వానరులు కొందరు వస్తున్న వాడు ఇంద్రజిత్తు అనుకుని భయపడి పిక్కబలం చూపబోగా, అంగదుడు వారందరినీ ఆపి, వస్తున్నవాడు విభీషణుడని చెప్పి వారికి ధైర్యం కలిపించాడు.

ఇక్కడ కొంత సేపటికి రామునికి స్పృతివచ్చి, లేస్తూ తమ్ముని స్థితిచూసి : నాబహిః ప్రాణమయిన సోదరుడు లేని జీవితం వ్యర్థం, నా కిక సీత ఎందుకు ! నేను జీవించను

శక్యా సీతాసమా నారీ
మర్త్యలోకే విచిన్వతా ।
న లక్ష్మణసమో భ్రాతా
సచివః సాంపరాయికః ॥

మానవజగత్తులో సీత దొరకవచ్చు, కాని సౌమిత్రివంటి సోదరుడు దొరుకుతాడా! వీడులేకుండా ఏ ముఖంతో అయోధ్యకు వెళ్ళను. అక్కడ వీడికోసం ఎదురుచూసే మా పిన్ని సుమిత్రకు ఏంచెప్పను. భరత, శత్రుఘ్నులకు ఏం సమాధానం చెప్పను.

నేను అడవికి వస్తూంటే సోదరప్రేమతో వెంటవచ్చి నాకు ఉపశమనం కలిగించిన వీడు శరతల్పంమీద ఉంటే నేను వీనితో వెళ్ళలేకపోయాను. ఒక్కసారి అయిదువందల బాణాలు విడిచే కార్తవీర్యార్జునితో సమమయిన ధనుర్వేదవిదుడు వీడు లేలకూలాక నేను రావణునితో పోరాడడం అసంభవం. సుగ్రీవా ! నువ్వు నీ యోధులతో తిరిగి వెళ్ళిపో. అదే శ్రేయస్కరం, అన్నాడు. రామునిశోకం చూస్తూన్న సుగ్రీవుని గుండె జారింది. గోలుగోలున విలపించడం మొదలుపెట్టాడు. అదివిన్న అంగదాదులు తీవ్రవ్యధతో రోదన ధ్వానా లారంభించారు.

అప్పటికక్కడకు చేరిన విభీషణుడు వేదనతో :

సుగ్రీవా ! ఈ రామలక్ష్మణులు ఎంతటి దుస్థితిపాలయారు. మాయావి ఇంద్రజిత్తు ఎంత ఘోరం చేశాడు. నా ఆశ అడియాస అయింది, అంటూ విలపిస్తూంటే సుగ్రీవుడు :

విభీషణా ! ఎందుకు శోకిస్తున్నావు. కొద్దిక్షణాలలో వారు మేలుకొంటారు. రావణుని వధిస్తారు. అని తనమామ సుషేణుని పిలిచి : నువ్వు రామలక్ష్మణులను కిష్కింధకు తీసుకువెళ్ళు. నేను రావణసంహారం చేసివస్తాను, అన్నాడు.

అప్పుడు సుషేణుడు : సుగ్రీవా ! దేవాసురసంగ్రామ సమయాలలో రాక్షసుల హస్తాలలో నిహతులయే దేవతలను పునర్జీవితులను చెయ్యడానికి బృహస్పతి మంత్రాలనూ, ఓషధులనూ వినియోగించేవాడు. ఆ ఓషధులు క్షీరసముద్రం దగ్గర ద్రోణపర్వతంమీద, చంద్రగిరిమీద ఉన్నాయి. మన హనుమ తీవ్రవేగంతో వెళ్ళి వాటిని కొనిరాగలడు, అంటూండగా మహాప్రభంజనం రేగింది

ఆకాశంలో మేఘాలు మెరుపులతో పరువులుతీశాయి. సముద్రం ఉప్పొంగి నట్లయింది : పర్వతాలు కంపించి, మహావృక్షాలు నేలకూలాయి. ఆ వాయుప్రకంపనానికి రామ లక్ష్మణులను చుట్టివున్న సర్పబాణాలు కదలియాడసాగాయి. క్షణాల వ్యవధిలో అవి సముద్రాభిముఖంగా వెళ్ళాయి. అంతలో గరుత్మంతుడు అక్కడకు వచ్చి, తనహస్తాలతో రామ లక్ష్మణుల శరీరాలు స్పృశించి, వారిని లేవనెత్తాడు. అంతే. వారి శరీరాల మీది గాయాలు మటుమాయమయాయి. రాముడు కన్నులువిప్పి :

ఎవరవయ్యా నువ్వు! ఆ ఇంద్రజిత్తు మాయను ధ్వంసంచేశావు, నిన్ను చూస్తుంటే మా తండ్రిగారు గుర్తు వస్తున్నారు, అనగా గరుత్మంతుడు :

నేను మీ ప్రాణసఖుడను. గరుత్మంతుడను. మాయావి ఇంద్రజిత్తు విడిచిన ఈ బాణాలను దేవ గంధర్వగణాలు ఛేదించలేవు. నా ఒక్కడికే వీటిని ఛేదించగల శక్తి ఉంది. మన మైత్రికారణంగా నేను సాయపడవచ్చాను. మీరు వీరితో అప్రమత్తంగా పోరు సాగించాలి. వీరు మహామాయావులు. ఇప్పుడింక నాగురించిన వివరాలు అడగవద్దు. త్వరలో మీరు శత్రునాశనంచేసి, సీతాదేవిని కలుస్తారు, అని సెలవుతీసుకున్నాడు. రామ లక్ష్మణులు లేచి నిలబడ్డారు, వారిని చూచిన వానరులు హర్షధ్వానాలు చేశారు, ఆ ధ్వనికి లంకా నగరం భయత్రస్తమయింది.

## ధూ మ్రా క్షు డు

వానరుల హర్ష ధ్వానాలు విన్న రావణుడు :

ఏమిదీ ! రామలక్ష్మణులు నేలకూలగా వీరు సింహగర్జనలు చేస్తున్నారంటే అక్కడ ఏదో విశేషం జరిగివుండాలి, మీరువెళ్ళి చూసిరండి, అని అనుచరులను పంపాడు, వారు తిరిగివచ్చి వివరాలు తెలుపగా రావణుడు క్షణం తలవంచి :

ఇంద్రజిత్తు విడిచిన బాణాలు కూడా వ్యర్థమయాయంటే నాకు సంశయం కలుగుతున్నది. సరే, ధూమ్రాక్షా! నువ్వువెళ్ళి వానర సేననూ రామునీ వధించి రా! అన్నాడు.

ధూమ్రాక్షుడు ప్రభుపాదాలకు నమస్కరించి, సభాభవనం వీడి, సేనలను సన్నద్ధం చేసుకొని బయలుదేరాడు. నగరపశ్చిమద్వారం దాటింది రథం. అపశకున పరంపరలు ఎదురైనా లక్ష్యపెట్టలేదు ధూమ్రాక్షుడు:

శూల, ముద్గర, ఖడ్గ, గదాపాణులయిన రాక్షస సేనలను వానరులు శిలలతో, తరుశాఖలతో ఎదుర్కొన్నారు. వానరవీరుల ధాటికి ఆగలేక రాక్షససేన ధూమ్రాక్షుని వెనుకకు పడిచింది. క్రుద్ధుడై ధూమ్రాక్షుడు విశితశరాలు నడిపించాడు. వాని తాకిడికి నిలువలేక వానరులు హనుమంతుని చాటుకు చేరారు.

హనుమంతుడు వారికి ధైర్యం కలిగించి, శిలాఖండాలు అందుకొని విసరగా, ధూమ్రాక్షుడు తన గదాదండంతో రథం దిగేశాడు. రథం వాహనాలతో చూర్ణమయింది. ధూమ్రాక్షుని గదాదండం హనుమంతుని తలపై పడినా చెక్కుచెదరక నిలిచి, దగ్గరవున్న గిరిశిఖరం అందుకొని ధూమ్రాక్షుని శిరసుపై విసిరాడు మారుతి. అంతే! ధూమ్రాక్షుని తల వ్రక్కలయింది. రాక్షససేన పలాయనం పఠించింది. వానరులు జయజయధ్వానాలు చేశారు.

వార్తవిన్న రావణుడు వజ్రదంష్ట్రుని పంపాడు. ఉభయసేనలూ మహోత్సాహంతో మళ్ళీ యుద్ధం ఆరంభించాయి. రణరంగం అంతా రక్తమాంసాలతో నిండిపోయింది. కాకులూ గ్రద్దలూ విందు చేసుకుంటున్నాయి. వానరులు పరమ సంతోషంతో శత్రుసంహారం చేస్తుంటే వజ్రదంష్ట్రుడు తన బాణపరంపరతో వారిని చిందర వందర చేయబోగా అంగదుడు వాని బాణఘాతాలను లెక్కచెయ్యకుండా బండరాళ్లువిసిరాడు. ప్రతిపక్షి రథం దిగి ప్రాణ రక్షణ చేసుకోక తప్పలేదు. మరొక శిలాఖండం వచ్చిపడి వజ్రదంష్ట్రుడు క్షణకాలం మూర్ఛిల్లి ముష్టియుద్ధానికి లేచాడు. ఇద్దరిదేహాలూ రక్తధారలతో నిండుతున్నాయి. దగ్గరలో వున్న ఒకరాక్షసుని చేతిలోని ఖడ్గం లాగి అంగదుడు వజ్రదంష్ట్రుని శిరసు గాలిలోకి తేలించాడు. రాక్షససేన మళ్ళీ పలాయనం చేసింది.

## అ క ం ప ను డు

రావణుడు అకంపనుని వయివు తిరిగాడు. అకంపనుడు సేనతో యుద్ధభూమికి వచ్చాడు. అటూ ఇటూ వేలాది సైనికులు మరణించారు. అకంపనుడు అమితోత్సా

హంతో అట్టహాసం చేస్తుంటే వానిమీదికి నల, కుముద, మైంద, ద్వివిదులు వచ్చారు. కాని వానిధాటికి ఆగలేక గిజాటుపడుతూంటే హనుమంతుడు వచ్చాడు. అకంపనుని శర వర్షంలో తడుస్తూ హనుమంతుడు చేతికందినరాళ్ళను చెట్ల కొమ్మలనూ విసురుతున్నాడు. అకంపనుని చతురంగబలాలూ హనుమంతుని కెదురురాగా చేతికందిన సైనికుని పట్టి విసరి పదాతులనూ, అశ్వంతో అశ్వబలాన్నీ, ఏనుగులతో గజబలాన్నీ చూర్ణం చేస్తున్నాడు. క్షణకాలవ్యవధిలో అకంపనుడు ఏకాకి అయాడు. ప్రక్కవేవున్న సాలవృక్షం పెకలించి విసరడం తడవుగా అకంపనుడు నేలకూలి మన్నుకరిచాడు.

## ప్ర హ స్తు డు

విన్న రావణుని ముఖం క్షణకాలం వివర్ణమయింది. అంతలోలేచి ప్రహస్తుని చూస్తూ అడుగువేశాడు. అనుసరించాడు ప్రహస్తుడు. ఉభయులు లంకానగరం అంతా తిరిగి రక్షణవ్యవస్థను పరిశీలించివచ్చారు.

సూర్యుడు నడినెత్తికి చేరాడు. అప్పటికి నగరంతిరిగి వచ్చిన రావణుడు : సేనాపీ శత్రుసంహారం చెయ్యగలవారు నలుగు రయిదుగురున్నారు. నేను, కుంభకర్ణుడు, నువ్వు, ఇంద్రజిత్తు, నికుంభుడు, అంతే! అందుచేత యిప్పుడు నువ్వు బయలుదేరివెళ్ళి వారిని నేల కూల్చిరావాలి. కాక ఉపాయాంతరం ఏదైనా కనిపిస్తేచెప్పు, అన్నాడు.

లంకేశ్వరా! ఇప్పుడు మరోమార్గం అనవసరం. మంత్రివర్గంతో సమాలోచించి యుద్ధం నిశ్చయించాం. మీదయవల్ల యింతకాలం ఈవదవిలోవుండి ఈనాడు వెనుదీస్తానా నేను వెడుతున్నాను, అన్నాడు ప్రహస్తుడు.

సేనలు సన్నద్ధమవుతున్నాయి. ప్రహస్తుడు తన భవనంచేరి, అగ్నిపూజచేసి, విప్రులకు నమస్కరించి ఆశీర్వాదాలు పొంది, కవచధారియై రాజసభకు వచ్చాడు. రావ ణుడు సంతోషంతో సాగనంపాడు. సర్వధ్వజశోభితమయిన రథం వివిధాయుధాలతో సిద్ధంగావుంది. అధిరోహించాడు, వీరుల సింహనాదాలు నడుస్తున్నాయి. రథం పూర్వ ద్వారం దాటింది. వానివెంట నరాంతకుడు, కుంభహనుడు, మహానాదుడు, సమున్న తుడు వున్నారు. అందరికీ అనేక దుశ్శకునాలు కనిపించినా నిర్లక్ష్యంగా వారు ముందుకు సాగారు.

ఇక్కడ రాముడు : విభీషణా ! నగరపూర్వద్వారం నుండి వస్తున్న మహాయోధు డెవరయ్యా. విశాల సేనాసాగరంతో వచ్చే వాని బలపరాక్రమ విశేషాలేమిటి? అనగా విభీషణుడు రామభద్రా ! ఈయన సర్వసేనాని ప్రహస్తుడు. లంకానగరంలోని మూడు వంతుల సేన ఆయనవెంట వున్నది. బాహుబలానికి తోడు శస్త్రాస్త్రకోవిదుడీయన. మా అన్నగారి ఆశలకు మూలస్తంభాలయిన నలుగురిలో ఈయన ఒకడు, అంటూండగానే వానర రాక్షస సేనలమధ్య పోరు ప్రారంభమయింది.

అటు ప్రహస్తుడు, ఇటు నీలుడు తమ సేనలకు ఉత్సాహం కల్పిస్తున్నారు. అప్పుడు సాగిన యుద్ధంలో భూదేవి కడవలతో రక్తం త్రాగింది. విరిగిన చేతులు, తెగిన కాళ్ళు, ఊడిపడ్డ శిరసులు, విలవిలలాడే మొండెములు మృత్యుదేవత విలయ తాండవం చేస్తున్నది.

ద్వివిదుడు నరాంతకునితో, తారుడు కుంభహనునితో, దుర్ముఖుడు సమున్నతునితో జాంబవంతుడు మహానాదునితో తలపడ్డారు. క్షణాలవ్యవధిలో ఆ రాక్షసయోధులు వీ( చేతులలో ఊపిరివిడిచిన వార్త విన్న ప్రహస్తుడు తీవ్ర క్రోధంతో వానర మారణం అర( భించాడు. రక్తప్రవాహంలో మాంసపుబురదలో సైనికులకు అడుగువేయడం కష్టంగావుంది.

అంతలో నీలుడు గగనవీథికిలేచి కాలమేఘంలా తనమీద పడుతూంటే ప్రహస్తుడు తన బాణాలవాయువుతో వానిని తరిమికొట్టగా, వానరసేనాని తరుశాఖలతో ప్రహస్తుని చీకాకు పరుస్తున్నాడు. బాణాలతో ప్రహస్తుడు వాటిని ఖండిస్తున్నాడు. అంతలో రాక్షస సేనాని చేతిలోని విల్లువిరిచాడు నీలుడు. ఆ సేనాని ముసలం చేతబట్టి రథం దిగాడు. ద్వంద్వయుద్ధం ఆరంభమయింది.

రక్తసిక్త దేహాలతో ఆ సేనానులు నిండుగా విరిసిన కింశుక వృక్షాలవలె ఉన్నారు. అప్పుడు ప్రహస్తుడు విడిచిన ముసలం నీలుని నుదుట రక్తం ద్రవింపజేసింది. అదే అదునులో వానిని కడతేర్చవచ్చే ప్రహస్తుని శిరస్సుపై పెద్ద తరు శాఖతో నీలుడు మోదగా వాడు మొదలు నరికిన చెట్టులా నేలకూలాడు. వానరులు సింహనాదాలు చేశారు. రాక్ష సులు ఆర్తస్వరాలతో లంకలోకి వెళ్ళిపోయారు. రామలక్ష్మణ సుగ్రీవులు తమ సేనానిని బహుధా ప్రశంసించారు.

## రావణసేన

తనవారి ఆర్తనాదాలూ శత్రువుల హర్షధ్వానాలూ విన్న రావణుడు విషణ్ణవదనుడై: దేవసేనలను చెండాడిన మన సేనాపతి యింత యిదిగా నేలకూలాడు అంటే శత్రువు అంతంతలో లొంగేవాడుకాడు. నేనే స్వయంగావెళ్ళి ఈ బాణాగ్నితో వానరసేనారణ్యాన్ని భస్మం చేస్తాను, అన్నాడు

భీషణభేరీభాంకారాలతో, శంఖధ్వానాలతో లంక మార్మోగింది. మహావీరు లందరూ యుద్ధకల్యాణానికి కవచధారులయి, ఆయుధపాణులయి, ఉత్సాహనాదాలతో బయలుదేరారు. అగ్నికాంతులీనే దివ్యరథం అధివసించాడు లంకేశ్వరుడు. ఉత్తర ద్వారానవస్తున్న రాక్షసేశ్వరుని చూచి రాముడు :

విభీషణా ! భూతగణపరివృతుడయిన రుద్రునివలె వస్తున్న ఈ మహావీరుడెవడు? ఆయనవెంట వచ్చే యోధులెవరు?

విభీ : రామభద్రా ! అదిగో ఆ గంధగజం మీద ఉదయకాల భాస్కరునివలె వున్న నాగభూషణాలంకృతుడు రావణనందనుడు కంపనుడు. ఆప్రక్క సింహ పతాకాలంకృత మయిన రథంమీది ఉగ్రగజ దంష్ట్రుడు ఇంద్రజిత్తు, వీడు వరప్రభావసంపన్నుడు. వాని ప్రక్కనే అతివిశాల రథాధిరోహణంచేసి వస్తున్న వింధ్యపర్వతకాయుడు అతికాయుడు, వీడు కూడా మా అన్నగారి కొడుకే. విశాల ఘంటానాదమేదురధ్వానంతో గార్దభస్వరగర్జనత్ తామ్రనేత్రాలతో వస్తున్నవాడు మహోదరుడు మాపినతల్లికొడుకు. ఆ సైంధవాశ్వంమీద ఉన్నాడే పశ్చిమగిరిశిఖరాన కాలమేఘంలా — వాడు మహోదరసహోదరుడు పిశాచుడు.

అదిగో విద్యుత్కాంతులను జిమ్ముతూన్న శూలాన్ని గాలిలో ఆడిస్తూవచ్చే వృషభ వాహనుడు త్రిశిరుడు మా అన్నగారి మరోకొడుకు

ఈవంక సజల జలదదేహుడు, వజ్రకఠోరవక్షుడు ఉరగకేతనుడు కుంభుడు, వీడు మా కుంభకర్ణసుతుడు. వాడి ప్రక్కగా వజ్రసువర్ణకాంతులీనే పరిఘతో వచ్చేడి వాడు నికుంభుడు, కుంభసోదరుడు.

అగ్నిశిఖాకేతనుడు వాడు నరాంతకుడు రావణనందనుడు.

శార్దూల, అశ్వ, ఉష్ట్రముఖాలతోడి భూతగణపరివేష్టితుడు, స్వచ్ఛశ్వేతఛత్రధారి, సూర్యద్యుతియుతుడు, వింధ్యాచలసమానధీరకాయుడు, కిరీట, కుండలశోభితుడు, సర్వ దేవతాగణగర్వాపహారి ఆయన రావణుడు. నిన్ను స్వయంగా ఎదుర్కొన వస్తున్నాడాయన.

రాముడు: విభీషణా! దేవ, దానవ గణాలలో ఇటువంటి ప్రభాపూర్ణదేహం కనిపించదు. ఏమిదీప్తి. ఏమి తేజస్సు. దుర్నిరీక్ష్యుడయిన సూర్యునివలె ఉన్నాడు.

అహోదీప్త మహాతేజా । రావణో రాక్షసేశ్వరః ॥
ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యో । రశ్మిభిర్భాతి రావణః ॥

వాని వెంటవచ్చే అనుచరులుకూడా అంతశక్తిమంతులుగానూ ఉన్నారు, అని క్షణకాలం అలావేచూచి, క్రోధతామ్రాక్షుడై:

ఎంతవాడయినా యింతకాలంగా చేసిన పాపఫలం యిప్పుడు పండుతున్నది. సీతాపహరణం కారణంగా వాలోమండుతున్న క్రోధాగ్నిజ్వాలాశిఖల ప్రభావం చూస్తాడు. అంటూ, ధనుస్సు అందుకున్నాడు.

ఇక్కడ రావణుడు ద్వారం దాటుతూ:

మహావీరులారా! మీరు నగరరక్షణలో ఉండండి. వీరగణం అంతా ఈవలకు వస్తే శత్రువు నగరం ప్రవేశించి దానిని ఆక్రమిస్తాడు, అని ఇంద్రజిదాదులను వెనుకకు పంపి సేనతో ముందుకు వచ్చాడు. చూశాడు సుగ్రీవుడు. చూస్తూనే బహు పుష్ప విరాజితమయిన మహావృక్షపూర్ణ గిరిశిఖరం పెకలించి విసిరాడు. దారిలోనే రావణుని బాణాలు దానిని పిండిచేశాయి. ఉత్తరక్షణంలో రావణుడు విడిచిన నిశితశరం సుగ్రీవుని మూర్ఛితుని చేసింది.

అదిచూచిన గవయ, గవాక్ష, సుషేణులు, నల, వృషభ, జ్యోతిర్ముఖులతో కలసి గిరిశిఖరాలందుకుని విసిరారు! రావణుని బాణాలు వాటిని దారిలోనే చూర్ణంచేశాయి. రావణుని వీరవిహారంలో వానరసేనలు తల్లడిల్లి రాముని వెనుకకుచేరాయి. రాముడు యుద్ధసన్నద్ధుడై ధనుస్సు చేబూనగా లక్ష్మణుడు అన్నగారిని ఆపి తనకు అనుజ్ఞ యిమ్మన్నాడు.

రాముడు: లక్ష్మణా! రావణుడు సంగ్రామవిద్యలో సమర్థుడు. వాని లోపాలు కనిపెట్టి మనం ముందుకుసాగాలి: ముల్లోకాలమా చకితంచేసిన ఆ యోధునితో జాగ్రత్తగా నడపాలి యుద్ధం, అని ఆశీర్వదించి పంపించాడు.

అప్పటికే హనుమంతుడు రావణునికి ఎదురుపడిచి: ఓ రావణా! నువ్వుదేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షసగణాలకు అవధ్యుడవు. కాని నర, వానరులచేతిలో

నువ్వు అంతిమశ్వాస విడుస్తావు. ఇదిగో చూస్తున్నావా, అయిదుకొమ్మల వృక్షంలావున్న ఈ దక్షిణ హస్తఘాతంతో నీ పంచప్రాణాలూ కడతేరుతాయి, అన్నాడు.

విన్నరావణుడు కన్నులెర్రజేసి : చూడనియ్యి నీశక్తి ఎంతటిదో, అప్పుడు నీప్రాణాలుతీస్తాను, అనగా హనుమంతుడు : రావణా ! నీ అనుగుబిడ్డ అక్షకుమారుడు ఈ పిడికిలిపోటుకే అంతిపురి చేరాడు మర్చిపోయావా. అనగా రావణుడు మండిపడి తన అరచేతితో హనుమంతుని రొమ్ముమీద చరిచాడు. క్షణకాలం మారుతి కంపించి, తేరుకొని తనపిడికిలితో రావణుని రొమ్ముమీద తాడించాడు. అంతే. రాక్షసేశ్వరుడు మూర్ఛిల్లినాడు, వానరులు హర్షధ్వానాలు చేశారు.

కొంతసేపటికి తేరుకొన్న రావణుడు : మారుతీ నాకు చాలా సంతోషం కలిగించింది నీ పరాక్రమం, అంటూండగా హనుమంతుడు :

ఛస్ ! ఇంకా నువ్వు బ్రతికి మాట్లాడుతున్నావే, ఇదీ పరాక్రమమేనా. సరే నీ ముష్టిఘాతం రానియ్యి. అది చూసి నిన్ను యమపురికి పంపుతాను, అన్నాడు.

రావణునిదెబ్బకు హనుమ మూర్ఛపోయాడు. రావణుడు తన రథాన్ని వానర సేనానికి ఎదురునడిపి క్రూరసర్పాలవంటి బాణాలు విడుస్తూంటే నీలుడు తనవిద్యతో అల్ప దేహుడై రావణరథధ్వజంమీద ధనుఃకోటిమీద కొంతసేపు ఆడుతూ చికాకుపరిచాడు. తమసేనాని సాగించే విచిత్రవిద్యాప్రదర్శనంచూచి సుగ్రీవ, రామ, లక్ష్మణ హనుమంతులు ప్రశంసించారు.

రావణుడు క్రోధోద్రిక్తుడై విడిచిన ఆగ్నేయబాణం నీలుని మూర్ఛిల్లజేసింది.

అదిచూసి లక్ష్మణుడు ధనుష్టంకారంతో ఎదురువచ్చి : రావణా ! ఎంతసేపు వానరులతో యుద్ధం చేస్తావు. ఇటుతిరుగు, అనగా రావణుడు : రా ! ఇప్పటికి నా అదృష్టం ఫలించింది. వినాశకాలం దాపురించింది నీకు. నా బాణఘాతంతో యమపురి చేరుతావు, అన్నాడు.

లక్ష్మణుడు నవ్వుతూ : రావణా ! శక్తిసామర్థ్యాలు కలవాడు ఇలాప్రేలడు. నీ బలపరాక్రమాలు నే నెరుగనివికావు. ధనుష్పాణియై నిలిచిన లక్ష్మణునిముందు నిలవగలవాడు లేడు, అంటూ రావణుడు విడిచిన ఏడుబాణాలనూ దారిలోనే ఖండించాడు. ఉభయులూ తమ ధనుర్విద్య ప్రదర్శిస్తున్నారు.

రావణుడు శక్తి ప్రయోగించాడు. లక్ష్మణుని లలాటం గాయపడి, క్షణకాలం స్మృతితప్పింది. అంతలో తేరుకొని రావణుని ధనుస్సును రెండుముక్కలుచేసి, విడిచిన బాణాలతో లంకేశ్వరుడు కొద్దిసేపు మూర్ఛపోయిలేచి, బ్రహ్మదత్తమయిన ఉగ్రశక్తిప్రయోగించాడు. అది ధూమావృతమయిన అగ్నిశిఖలా వస్తూంటే వానరులు, భయపడ్డారు. లక్ష్మణుడు దానిని ఖండించడానికి యత్నించాడు. కాని అది సరాసరి వచ్చి లక్ష్మణుని భుజసీమలో గుచ్చుకున్నది. లక్ష్మణుడు మూర్ఛిల్లినాడు. వానిని రెండుచేతులతో ఎత్తడానికి రావణుడు ప్రయత్నిస్తుండగా హనుమంతుడు రెప్పపాటులో అక్కడవాలి, తన రెండుచేతులూ బిగించి రావణుని వక్షంమీద తాడించగా రక్తం కక్కుకుని రాక్షసేశ్వరుడు రథంమీద కూలబడ్డాడు. రావణుడు మరణించాడనే అనుకున్నారు వానరులు. హనుమంతుడు లక్ష్మణుని తన భుజంమీదికి ఎత్తుకుని రామునిదగ్గరకు వెళ్ళాడు.

## రావణపరాభవం

లక్ష్మణుని చూసిన రాముని కన్నులు రోషారుణములై రావణుని వైపు నడిచాయి. ధనుర్బాణా లందుకున్నాడు. అడుగువేస్తున్నాడు. అప్పుడు హనుమ : రామభద్రా! నామూపుపై అధివసించండి, అనగా రాముడు అంగీకరించాడు.

రథాధిరూఢుడయివున్న రావణునికి ఎదురుగా హనుమద్వాహనంమీద రాముడు వచ్చి ధనుష్టంకారంచేసి : రావణా! నిలబడు రుద్ర, ప్రజాపతి, ఇంద్రాది దేవతాగణాలువచ్చినా నిన్ను రక్షించలేవు. నా ప్రాణసముడయిన తమ్మునికి యింత దురవస్థ కలిగించిన నిన్ను ప్రాణాలతో వదలను. పుత్ర, మిత్ర, బాంధవసమేతం సంహరించి తీరతాను. జనస్థానంలో ఖరదూషణులను ఆరగించిన ఈ నిశితశరాలకు ఇంకా ఆకలి తీరలేదు, అంటూండగా లంకేశ్వరుడు ప్రళయాగ్నిద్యుతులీవే బాణాలుసంధించి వదిలాడు, హనుమంతుని మర్మసంధుల మీదికి

హనుమ నిర్లక్ష్యంగా ముందుకు సాగుతూవే వున్నాడు. రాముడు విడిచే బాణాలు రావణుని ధ్వజ, పతాకాలను, అశ్వాలను, సారథిని, ఖడ్గాన్ని ముక్కలు చేశాయి. అనంతరం విడిచినబాణం రావణుని భుజమధ్యంలో చేరింది. ఇంద్రుని వజ్రఘాతానికి చలించని మహానగసన్నిభదేహుడు రావణుడు రామ బాణంతో విచలితుడైనాడు. ధనుస్సు చేజారింది. ఆక్షణంలో వచ్చిన మరొకబాణం రావణుని కిరీటాన్ని నేలమీద పెట్టింది.

ప్రకాశహీనుడయిన సూర్యునివలె, జ్వాలలు తగ్గినఅగ్నిహోత్రునివలె, విష హీన్స్ మయిన త్రాచువలె వున్నాడప్పుడు రావణుడు.

రామ: రాక్షసేశ్వరా! ఇంతవరకూ ఎందరో మహాయోధులతో యుద్ధంచేసి బాగా అలసివున్నావు. రథ, ఖడ్గ, చాపాలు ముక్కలయ్యాయి. ఇప్పుడింక నీతో యుద్ధం చెయ్యడం నాకు ఉచితంకాదు. ఇంటికివెళ్ళి విశ్రాంతి తీసుకుని సర్వ సంభారాలతో రేపు రావడం మంచిది. అని వెనుదిరిగాడు.

రావణుడు కిరీటహీనశిరంతో నగరాభిముఖంగా సాగాడు, సింహపుపంజా దెబ్బతిన్న మత్తేభంలా, గరుడుని కాలిగోళ్ళ తాకిడికి నలిగిన భుజంగంలా కొలువునూటానికి వచ్చి: మంత్రులారా! నా తపశ్శక్తి అంతా వ్యర్థమయింది. దేవ, దానవ, యక్ష, రాక్షస గణాలను ఉగ్రూతలూగించిన నేను దాశరథి చేతులలో ఈ స్థితికి వచ్చాను. ఇక్ష్వాకు వంశీయుడైన అనరణ్యుడు ఒకమాటు అన్నాడు, తన వంశీయుడు నన్ను సంహరిస్తాడని ఉమాదేవి, నందీశ్వరుడు, రంభ, ఎందరో మహర్షులు ఇచ్చిన శాపాలు రామరూపంలో పనున్నట్టువ్వాయి. మీరంతా ప్రాకారాలను, కోటకీలక స్థానాలనూ అప్రమత్తులయి రక్షించాలి, అని క్షణం ఆగి సభ అంతమా కలియజూసి:

ఇప్పుడు కుంభకర్ణుని మేల్కొలపడం అవసరం. యుద్ధపరిషత్తు జరిగిననాడున్నాడు. మళ్ళీ నిద్రలోపడ్డాడు, ఇప్పుడు జరుగుతున్నది వానికి తెలియదు. నిరంతరం నిద్రలోనే ఉంటే ఈ జాతికి ఆ యోధుని ప్రయోజనం లేదు. వానర సేనతో, దాశరథులను కడ తేర్చగల శక్తి వాడికే ఉంది, అన్నాడు.

## కు ం భ క ర్ణు డు

ప్రభువు ఆజ్ఞను పాటించడానికి రాక్షసులు బయలుదేరారు. సువిశాల పర్వత గుహలో నిద్రిస్తూన్న కుంభకర్ణునికి నిద్రలేవగానే ఆహారంగా వేలాదిరంకభాండాలు, మాంసపు బానలు, జీవజంతువులు వెంటబెట్టుకు వస్తున్నారు. కుంభకర్ణుని ఉచ్ఛ్వాస నిశ్వాసలతో ఆగుహాప్రాంతప్రవేశానికి అవకాశంలేకుండా ఉంది. ఆ యోధుడు దీర్ఘంగా నిట్టూరుస్తుంటే ఆ వాయుమార్గంలో నిలబడడం కష్టమవుతున్నది.

పాతాళగహ్వర సదృశమయిన నోరు, కొండగుహలవంటి ముక్కుపుటాలు; మేదస్సు, రక్తం అట్టలుకట్టి వాసనలీనే తాళవృక్ష సమానదేహం; బంగరు భుజకీరుల

బాహుదండాలు సూర్యకాంతులీనే కిరీటం ఆ మహానగసన్నిభదేహుని మేల్కొలపడానికి భేరీలు మ్రోగిస్తూ, రాక్షసయోధులు ఆయన చెవులలో సింహనాదాలు, శంఖధ్వానాలు చేస్తూ, గదాఘాతాలతో తాడించారు. రెప్ప విడలేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసలు యథాతథం సాగుతున్నాయి.

ఆ దేహంమీదుగా గాడిదలు, గుర్రాలు, ఏనుగులు నడుస్తున్నాయి. రాక్షస గర్జనలతో ఆయుధప్రహారం సాగుతూనే వుంది. ఆయుధాలు ముక్కలయాయి. అరచి, అరచి రాక్షసులు అలసిపోయారు. అయినా రెప్ప విప్పలేదు. ఊపిరి ప్రభంజనంలా వస్తూ పోతూవున్నది. ఆయన అవయవాలన్నీ పట్టుకు పీకుతూ, సీసం కరగించి చెవులలో పోశారు. అప్పటికి కొంత కదలిక పుట్టింది. ఆపట్టులో మరోసారి మత్తేభాలను నడిపిస్తూ ముసలాద్యాయుధాలతో మోదగా, మోదగా కనురెప్పలు విప్పుతూనే ఆకలితో రెండు చేతులూ జాపాడు. అగ్నికాంతులీనే నాలుక బైటపెట్టాడు.

రక్తభాండాలు చేతి కందించారు. కడవలు పూర్తి అవుతుండగానే వరాహ, మహిషాది జంతువులను అందుకుని కబళించాడు. త్రేనుస్తూ, కళ్ళు నులుముకునే వేళకు రావణ మంత్రులు ఎదుట నిలువగా:

మహారాజు కుశలమేకద! నన్ను అకాలంలో నిద్రలేపవలసిన ప్రమాదం ఏమిటి? అకారణంగా నన్ను మేల్కొలుపరే! దేవేంద్రుడయినా మనముందు నిలబడలేడు. విశేషం చెప్పండి, అనగా యూపాక్షుడు చేతులు జోడించి:

మనకు దేవతాభీతి లేదు. నర, వానరులు దండెత్తి వచ్చారు. సీతాపహరణ కారణంగా ఈ విపత్తు వచ్చినట్టు మీకు గుర్తుండాలి. ఈనాడు మన ప్రభువుకు రాముడు ప్రాణభిక్ష పెట్టాడు. అంతకంటె ఏం జరగాలి, అన్నారు.

కుంభకర్ణుడు గర్జిస్తూలేచి: ఇప్పుడే రణరంగానికి వెళ్ళి రామలక్ష్మణుల రక్తం త్రాగి ప్రభుదర్శనానికి వస్తాను, అన్నాడు.

అప్పుడు మహోదరుడు ముందుకువచ్చి:

మహారాజుతో మాట్లాడి ఆయన ఆజ్ఞవిని వెళ్ళడం ఉచితం, అనగా అంగీకరించి, మందిరాభ్యంతరానికి వెళ్ళి స్నానాదులు ముగించి, అలంకృతుడై, అనుచరులందించే రక్తభాండాలు గడగడ త్రాగి, త్రేనుస్తూ రాజప్రాసాదానికి వచ్చాడు.

రాజవీథిలో వెడుతూంటే చూచిన వానరులకు పెద్దపర్వతం వడుస్తున్నట్లనిపించి వాళ్ళు పిక్కబలం చూపగా రాముడు: సుగ్రీవా! ముల్లోకాలనూ ఆక్రమించే ఈ విశాలదేహు డెవడు? ఇటువంటి ప్రాణి భూలోకంలొ వుంటుందని వినలేదు, అనగా ప్రక్కనున్న విభీష ణుడు: ఆయన మాఅన్న కుంభకర్ణుడు, యముడూ, ఇంద్రుడూ కూడా వీనిముందు నిలబడ లేరు. రాక్షసానీకంలో వీనిని మించినవాడులేడు. ఆ భీకరాగ్నిగోళాలవంటి కన్నులతో, శూలపాణియై రణరంగానికి వస్తే మృత్యువు తాండవిస్తుంది. వీవిశక్తి సహజంగా వచ్చినదే తప్ప ఏ వరప్రభావమూకాదు. వీడు నేలమీదపడి కన్ను తెరచింది మొదలు ప్రాణికోటిని భక్షిస్తూనే ఉన్నాడు. సర్వప్రాణిగణం దేవేంద్రుని శరణువేడింది. ఆయన వజ్రా యుధంతో ప్రహరించినప్పుడు ఈయన పొలికేక పెట్టగా చతుర్దశభువనాలూ దద్దరిల్లినవి.

వజ్రఘాతంతిన్న క్రోధంతో ఐరావతదంతం లాగి ఇంద్రుని బాధించాడు. దేవేం ద్రుడు బ్రహ్మను శరణువేడాడు. బ్రహ్మ కుంభకర్ణుని పిలిపించాడు. వచ్చిన వీని ఆకారంచూసి చకితుడై బ్రహ్మంతవాడు: ఓరీ నిమ్ను పులస్త్యుడు లోకనాశవానికి పుట్టించి వుంటాడు, ఈ రోజు మొదలు నువ్వుచచ్చినవాడిలా పడివుండు, అని శపించాడు. అంతే! ఈయన అక్కడే నిద్రలోపడ్డ వార్తవిని లంకేశ్వరుడు వెళ్ళి: తాతా! మనుమనిమీద అంత క్రోధమా! ఫలించే సమయంలో వృక్షానికి మూలచ్ఛేదం చేస్తామా! నీ శాపానికి తిరు గులేదు. అయితే వీడికి అన్నపానాదులు తీసుకునే అవకాశం అనుగ్రహించు, అని ప్రార్థించగా, ఆయన: రావణా! వీడు ఆరుమాసాల కొకమారు నిద్రలేచి ప్రాణికోటిని భక్షించి మళ్ళీ నిద్రలో ఉంటాడు, అని అనుగ్రహించాడు.

వీ డిప్పుడు లేవవలసినవాడు కాదు, అయినా తన పరాభవం కారణంగా ఆయన నిద్రలేపించాడు. అయితే ఈ కుంభకర్ణుడు ప్రాణి కాదనీ, యంత్రమనీ మన సేనలకు ధైర్యం కలిపించి నిలబెట్టాలి. లేకుంటే వానరసేన నిలబడదు అన్నాడు.

రాముడు తన సేనాపతి నీలుని పిలిచి లంకానగర ద్వారాలన్నీ సేవలతో బంధించ మన్నాడు. గజ, గవయ, గవాక్ష, హనుమంతులు ద్వారనిరోధక సన్నాహాలు చేశారు.

రాజమార్గాన వడిచే కుంభకర్ణుని పూలవానతో ముంచెత్తుతున్నారు రాక్షస నారీ గణాలు. యోధులందరూ జయ జయ ధ్వానాలతో ఆయన వెంట వస్తున్నారు.

సభాభవనానికివచ్చే కుంభకర్ణునికి ఎదురువెళ్ళి రావణుడు సంతోషంతో గాఢాలింగనం చేసుకున్నాడు. కుంభకర్ణుడు అన్నగారి పాదాలకు అభివాదంచేసి, ఆయన చూపిన ఆసనం అలంకరించి :

లంకేశ్వరా! అకాలంలో నన్ను లేపవలసినంత చికాకు నీకు కలిగించిన దురాత్ము డెవడు. వాణ్ణి యిప్పుడే పేలకూల్చి వస్తానన్నాడు.

రావణుడు: తమ్ముడూ! యుద్ధపరిషత్తు జరిగిననాడు నువ్వున్నావు. అప్పటికి రాముడు సముద్రానికి ఆవలి ఒడ్డున ఉన్నాడు ఇప్పుడు సాగరానికి వారధికట్టి వానరసేనతో దిగి సర్వనాశనం చేస్తున్నాడు. మన కోశాగారం శూన్యమయింది. ప్రహస్తాదులు కన్ను మూశారు. ఇప్పుడు నువ్వుతప్ప ఈ విపత్తునుండి కాపాడేవారులేరు. దేవ – దానవులను గడ్డిపోచలుగా భావించే నువ్వు శత్రునాశనం చేసిరా అన్నాడు.

కుంభకర్ణుడు: అప్పుడు మంత్రిపరిషత్తులో నేను చెప్పవలసిన మాటలు చెప్పాను మంత్రులతో ఆలోచించకుండా చేసే దుస్సాహసం తెచ్చిపెట్టిన ముప్పయిది దేశకాల విరుద్ధకర్మలు వాటి ఫలితా లివ్వకుండాపోవు. ధర్మార్థకామాలను సమయానుసారం సేవించని ప్రభువు కాలవంచితుడవుతాడు. సామ దాన భేదదండాలను సక్రమంగా అనుసరించని వాడు అధఃపతనం చెందక తప్పదు. ప్రియంగా ప్రగల్భాలు పలికే మంత్రులకంటె శత్రువు ఉండడు. ఇంతసేపూ నేను మాట్లాడు తున్నానంటే అదంతా నీమీది ప్రేమతోనే. ఇప్పుడు చెప్పు. నువ్వేం చెయ్యమంటావో, అన్నాడు.

రావణుడు: కుంభకర్ణా! ఏమిటీ ఉపదేశం! నాకు గురువువా, ఆచార్యుడివా! నేను చెప్పినది చేయడం నీకర్తవ్యం, గతాన్ని తవ్వకు. నామీద నీకు గౌరవం ప్రేమ ఉంటే తక్షణం వెళ్ళి వారిని సంహరించిరా

కుంభ: మహారాజా! నేను నీ మాట కాదనలేదు. యుద్ధం చెయ్యననీ అనలేదు సోదరస్నేహంతో యింత మాట్లాడాను. ఈనాడే రామ లక్ష్మణులు నా చేతులలో మరణి స్తారు. వానరసేనలు పలాయనం చేస్తాయి. రాముని శిరసు నీ పాదాలమీద పడతుంది. అప్పుడు సీత నిన్నే వరిస్తుంది ఒక్కటిమాత్రం నిజం. ఈ కుంభకర్ణుడు జీవించి ఉండగా రాముడు నీవైపు కన్నెత్తిచూడలేడు. ఈ త్రిశూలంతో నిలిచిన నా ఎదుట యమ, వరుణ, కుబేర, ఇంద్రులు నిలబడలేరు, ఈ శూలంకూడా అనవసరం. సముద్రాలు త్రాగగలను. పర్వతాలు పిండిచెయ్యగలను. వెడుతున్నాను, వానరుల రక్త మాంసాలతో ఈ కడుపు నిండుతుం దీవేళ. నువ్వు హాయిగా వారుణీ మధుపానంచేసి సుఖంగా ఉండు.

మహోదరుడు: కుంభకర్ణా! నిరంతరం నిద్రలోవుండే నువ్వు రాజనీతి బోధించగల సమర్థుడవా! దేశకాలాలను నువ్వు వివరించవలసిన స్థితి యిప్పటికిలేదు. పురుషార్థాలు అనుభ వించడానికి సమయా సమయా లంటున్నావు. అసలు వాటిని నిర్ణయించే సాధనంలేదే.

ఒక్కటి మరచిపోకు. సర్వపాపకర్మలూ శ్రేయః ఫలమే యిస్తాయి. అందులో కామకర్మ ఇహపరాలు రెండూ యిస్తుంది. ధర్మార్థాలు నిశ్రేయాన్ని మాత్రమే యివ్వగలవు. ఇది మన ప్రభువు భావం.

నువ్వు ఏకాకిగా వెడతానంటున్నావు. ఎంత అవివేకివి, జనస్థానంలో ఖర, దూషణాదు లందరూ ఒక్కరాముని చేతిలో వాలిపోయారు తెలుసా. అటువంటి వారితో పోరుసాగించడానికి వెడతానంటే ప్రాణాలమీద ఆశలేనివాడు చెయ్యవలసిన పని, అని రావణుని వైపు తిరిగి :

ప్రభూ ! వాదొక్క మనవి. ద్విజిహ్వ, సంహ్రాది, వితర్దవ, కుంభకర్ణులతో నేను రామసంహారానికి వెడతాను. మా అయిదుగురి చేతిలో ఆయన కన్నుమూశాడా నిశ్చింత. కాదా రామబాణఘాత రక్తసిక్తగాత్రులమైవచ్చి : మేము రామునిభక్షించాం అని చెపుతాము. మమ్ము ఘనంగా సత్కరించి ఏనుగులమీద ఊరేగిస్తారు. రాముడు మరణించాడని నగర మంతా ఉత్సవం జరుపుకుంటుంది. ఆ వార్తవిని సీత శోకసాగరంలో మునుగుతుంది.

అప్పుడు నువ్వు విచారంతోవెళ్ళి ఆమెను ఓదారుస్తావు. దానితో సీత మనను మార్చుకుని నిన్ను వరిస్తుంది. రాజభోగాల రుచితెలిసిన ఆడది భర్త మరణించాడని విన్నాక తప్పనిసరిగా లంకానగరభోగాలకు ఆశపడుతుంది. అందువల్ల యుద్ధమూ తప్పుతుంది.

కుంభకర్ణుడు : ప్రభూ ! వర్షామేఘాలు అధికంగా గర్జించవు. నేను వెడుతున్నాను రాముని కడతేర్చడానికి. ఈ మహోదరుని ఊహ నాకు రుచిగాలేదు. అధికప్రసంగం అనవసరం. నేనేం చేస్తానో క్షణాలలో వింటావు. అని తిరిగి : మహోదరా ! నీవంటి మూర్ఖులవల్ల నే ప్రభువులు నాశనపథంలో పడతారు మీరు మిత్రరూప శత్రువులయి లంకానగర కోశాగారం, సేనాబలం ధ్వంసంచేసి రాజమాత్రావశేషం చేశారు. మీరు చేసిన ఈ కార్యాలను నేను చక్కబరచాలి, అన్నాడు.

రావణుడు : తమ్ముడూ ! ఈ మహోదరుడు రాముడికి భయపడి యింత మాట్లాడాడు. ఇప్పుడు నీకంటె నాకు ఆప్తుడూ, శ్రేయోభిలాషీ లేడు. వెళ్ళు వార రక్తం త్రాగిరా. నిన్ను చూస్తూనే వానరులు పారిపోతారు. అయినా ఒంటరిగా వెళ్ళకు.

కుంభకర్ణుడు శూలం చేతబట్టాడు. రావణుడు పరమసంతోషంతో వీరకంకణం కట్టి తన రత్నహారం వానిమెడలోవేసి, అంగుళీయకం తొడిగి నడుముకు శ్రోణీసూత్ర బంధించాడు, మందరగిరికి మహాభుజంగం చుట్టుకున్నట్లుంది.

త్రిపురాసురసంహారానికి వెళ్ళే రుద్రునివలె, ముల్లోకాలూ ఆక్రమించే త్రివిక్రముని వలె వెలుగుతూ కుంభకర్ణుడు అన్నగారిని గాఢంగా కౌగలించుకుని, ప్రదక్షిణంచేసి, ఆశీర్వాదంపొంది బయలుదేరాడు. వెంట చతురంగబలాలూ వస్తున్నాయి. ఎన్నో దుశ్శకునాలు గోచరించినా లక్ష్యపెట్టక రాజవీథులుదాటి ద్వారంగుండా వెళ్ళక కోటగోడ అవలీలగాదాటి సింహనాదం చేశాడు.

ఆరువందల ధనువుల పొడవు, వందధనువుల కైవారంగల దేహంతో నడుస్తూన్న పర్వతంలావచ్చే కుంభకర్ణుని సింహగర్జనకు వానరసేన చెల్లాచెదరయి, ప్రాణరక్షణకై పలాయనం సాగిస్తూంటే అంగదుడు వారందరినీ పేరు పేరునా పిలిచి ఉత్సాహం కల్పించి యుద్ధసన్నద్ధులను చేశాడు. నల, నీల, గవాక్ష, కుముదాదులు బండరాళ్ళు, మహా వృక్షాలు విసిరారు. అవి కుంభకర్ణుని దేహానికి తగిలి చూర్ణమవుతూంటే వీరిధైర్యం జారి పోయింది. కొందరు కొండగుహలలో చేరారు, కొందరు చెట్లకొమ్మల సందులలో దూరారు, కొందరు అక్కడే కూలబడ్డారు. మరికొందరు సేతువుదాటి పోవడానికి ప్రయత్నిస్తున్నారు. అప్పుడు అంగదుడు :

ఓ మహావీరులారా : ఏమిటీదైన్యం. ఈ జీవితం ఎప్పుడో కడతేరేదే, ఈ దుష్టరాక్షసులతో పోరాడి మరణిస్తే బ్రహ్మలోకాలు లభిస్తాయి. జయించామా శాశ్వతకీర్తి మనది. ఈ రాక్షసుడు రాముని కంటపడేవరకే బ్రతికివుంటాడు, మరుక్షణంలో అగ్నిలో పడ్డ మిడత వీడు. అటువంటి వీడొక్కడిని చూచి యింతమంది భయంతో పారిపోవడమా! అని ఉత్సాహవాక్యాలు పలకగా వారంతా తిరిగి యుద్ధసన్నద్ధులయారు.

వానర రాక్షససేనలమధ్య పోరు ప్రారంభమయింది. పదులు, పాతికలు, వందలు వానరులు కుంభకర్ణుని పిడికిలిలో చిక్కి పర్వతగుహవంటి వదనబిలంలో పడుతున్నారు. ఆ యోధుని ఘోరదంష్ట్రలమధ్య పటపట ధ్వనులతో లోపలకుపోతున్నారు. అది చూచిన వానరయూథపతి ద్వివిదుడు కాలమేఘంవంటి పర్వతం విడిచాడు. అది కుంభకర్ణుని ఎడమచేతి విసురుకు అడ్డుతిరిగి రాక్షససేనమీదపడి వారిని పిప్పిచేసింది. అటునుండి హనుమంతుడు బండరాళ్ళు, మహావృక్షాలు వానలా కుంభకర్ణునిమీద కురిపిస్తున్నాడు. అన్నీ కుంభకర్ణుని శూలానికి ఆహుతి అవుతుంటే కుపితుడై మారుతి గిరిశిఖరం వదిలాడు. అప్పటికి కుంభకర్ణుని ఆవేశం శూలాన్ని కదలించి హనుమంతుని భుజమధ్యానికి నడిపించింది.

భుజంమీద కండరాలు కదలి రక్తధారలు ప్రవహించగా హనుమ భరించలేని బాధతో గర్జించాడు. ఆ ఆరనాదానికి వానరులు కుంచించుకుపోగా రాక్షసులు మహోత్సాహభరితు

లయారు. అప్పుడు సేనాపతి నీలుడు విసరిన గిరిశిఖరం కుంభకర్ణుని పిడికిలికి తగిలి పిండి అయింది. ఋషభ, శరభ, గవాక్ష, గంధమాధనులు చేతికందిన చెట్లు, రాతి బండలు విసురుతూంటే చంటిపిల్లలు చిన్నిచేతులతో ఆడుకుంటున్నట్టుంది, ఆ యోధుడికి.

కుంభకర్ణుడు విలాసంగా ఋషభుణ్ణి ఆలింగనంచేసుకు విడిచాడు. ఆ ప్రేమకు వాడు మూర్ఛపోయాడు. పిడికిలి విసిరాడు కుంభకర్ణుడు. శరభుడికి అవయవాల పట్టు తప్పాయి. మోకాలు ఆడించాడు కుంభకర్ణుడు. నీలుడు నిట్టూర్చి పడ్డాడు అరచేతి తాకిడికి గవాక్షుడు. పాదతాడనానికి గంధమాదనుడు స్మృతితప్పి పడ్డారు.

వానరసేన సమూహాలుగా వచ్చి కాళ్ళమీద, వీపుమీద, భుజసీమమీద, శిరసు మీద ఎక్కిరక్కుతూ, గుద్దుతూ, దంతాలతో కరుస్తూంటే విశ్చలంగా నిలబడి, చేతికందిన గుంపులను కరకరనమలి మింగుతున్నాడు. మహోన్నతగిరిమీద చిన్నచెట్టుగాలికి కదలుతున్నట్టుంది ఆ సన్నివేశం. పాతాళంవంటి అతని ఉదరంలోని వానరులు మళ్ళీ నాసారంధ్రాలనుంచి చెవులనుంచి బైటపడుతున్నారు

ఎండవేడికి మాడిన అడవిని గ్రీష్మాగ్ని దగ్ధంచేసినట్లు కుంభకర్ణుడు వానరసేనను నాశనంచేస్తున్నాడు. వజ్రధరుడయిన ఇంద్రునివలె, పాశహస్తుడయిన యమునివలె విజృంభిస్తుంటే వానరసేన భయకంపితమై రాముని శరణువేడింది.

అదిచూచి అంగదుడు సువిశాల గిరిశిఖరం ఎత్తిపట్టి తీవ్రవేగంతో కుంభకర్ణుని శిరసు మీదకి విసిరాడు. ఆ దెబ్బకు తీవ్రక్రోధంతో తనశూలం విడువగా వానరవీరుడు నేర్పుగా తప్పుకొన్నాడు. తప్పుకుంటూనే వెళ్ళి రాక్షసవీరుని గుండెపై అశనిఘాతంలా అరచేతితో చరిచాడు. క్షణకాలం రావణసోదరుడు అదరిపడి కోలుకొని పిడికిలిపోటుతో వాలిసుతుని మూర్ఛితునిచేసి శూలపాణియై ముందుకు సాగాడు

వచ్చేరాక్షసునిపై వానరేశ్వరుడు సుగ్రీవుడు గిరిశిఖరం విసురుతూ: ఓరాక్షసుడా! నువ్వు మా యూథపతులపై సాగించిన యుద్ధం నాకు ఆనందం కలిగించింది. ఇదిగో మనమిద్దరం బలాబలాలు చూసుకుందాం, అన్నాడు. అతని రొమ్ము మీద పడ్డ మహాగిరి శిఖరం పిండిపిండి అయి నేల రాలింది

కుంభకర్ణుడు సుగ్రీవుని అభినందిస్తూ తన వేయిమణుగులశూలం విసిరాడు. వస్తూన్న శూలాన్ని మార్గమధ్యంలోనే పట్టి మోకాలికి తాటించి, రెండు ముక్కలుగా విరిచాడు హనుమంతుడు. వానరులు హర్షధ్వానాలు చేశారు అంతలో కుంభకర్ణుడు విసిరిన

గదాఘాతపు దెబ్బకు సుగ్రీవుడు మూర్ఛపోయాడు. తక్షణం రాక్షసవీరుడు వానరేశ్వరుని రెండుచేతులతో ఎత్తిపట్టి: ఈ కపిప్రభువును పట్టుకుపోతే వానరులు పలాయనం వరిస్తారు. దానితో రాముడు విన్నబోయి డవుతాడు లంకకు పీడ వదలుతుంది, అనుకుంటూ నగరాభిముఖుడయాడు. రాక్షసులు హర్షధ్వానాలుచేశారు

ఆగిపోయిన హనుమ: ఇప్పుడు నేనువెళ్ళి ప్రభువును విడిపించగలను. కాని అది ఆయనకు అవమానం. మూర్ఛ తేరుకోగానే ఆయన బయటపడలేకపోతేకదా ఆలోచించ వలసింది, అనుకున్నాడు

నగరంలో సాగుతూంటే రాక్షసవీరులు జయ జయ ధ్వానాలతో, నారీమణులు పూలజల్లులతో పన్నీటివర్షంతో స్వాగతం పలికారు. గంధభరితమయిన పూలవాన, చల్లని పన్నీటిజల్లు- వీటితో సుగ్రీవుడు తేరుకుని, క్షణం ఆలోచించి, ఒక్కఊపుతో ఆ బంధం నుండి తప్పించుకుని తనచేతి వాడిగోళ్ళతో కుంభకర్ణుని ముక్కూ, చెవులూ ముక్కలు చేశాడు. కర్ణనాసికా ఛేదంతో రక్తం ధారలుకట్టగా సహించలేని బాధతో చేతిలోవున్న సుగ్రీవుని నేలకు విసిరాడు. వానరాధీశుడు బంతిలా పై కెగిరి గగనమార్గాన తన సేనా మధ్యానికి వచ్చాడు. వానర సేన హర్షధ్వానాలతో జయనాదం చేసింది.

కుంభకర్ణుడు తీవ్రక్రోధంతో రణస్థలికివచ్చాడు. వస్తూనే వానరభల్లూకాలను భక్షిస్తూ ప్రళయకాల యమునివలె ఉన్నాడు. వానరవీరులు రాముని వెనుకకు చేరుకున్నారు. లక్ష్మణుడు తీవ్రక్రోధంతో బాణవర్షం కురిపించి రాక్షసుని కవచం ఛేదించే ప్రయత్నంలో ఉండగా:

సౌమిత్రీ! ఇంద్రుని వజ్రాయుధం వంగింది ఈ రొమ్ముకు తగిలి. నువ్వు బాలుడివి. నీ సాహసం సంతోషం కలిగిస్తున్నది. నేను మీ అన్నను కడతేర్చి తరువాయి నీ విషయం చూస్తాను, అన్నాడు.

ఓ మహాయోధుడా! నీ పరాక్రమం చూస్తున్నాను. అడుగో రామభద్రుడు. అక్కడికే వెళ్ళు, అన్నాడు.

వస్తున్న కుంభకర్ణుని విశాలవక్షం మీదకి రాముని రౌద్రాస్త్రం వచ్చింది. కుంభకర్ణుడు భీకరంగా గర్జించాడు. రాముని బాణవర్షధాటికి ఆగలేక కంపించే వాని చేతినుండి గదాదండం జారింది. అయినా ఆగకుండా సాగే ఆ యోధుని నిలబెట్టింది రాముని బాణవర్షం. కుంభకర్ణుని జ్ఞానవాడి ఆగింది. చేతికందిన వానరులనేకాదు, రాక్షసులనుమా

భక్షిస్తున్నాడు అప్పటికి చేతికందిన గిరిశృంగం రాముని మీదికి విసురగా దాశరథి దానిని దారిలోనే ఖండఖండాలు చేశాడు. ఆ ముక్కలు ఎగిరి వెళ్ళి రెండువందల మందిని మన్నుకరిపించాయి.

స్థితిగతులు గమనిస్తూన్న లక్ష్మణుడు :

వానరవీరులారా! కుంభకర్ణుని కదలనివ్వకండి, అనగా సహస్రాధిక సంఖ్యలో వానరులు ఆ యోధుని అవయవాలమీదికి ఎగబ్రాకారు. రావణసోదరుడు ఒక విసురుతో వారిని వదిలించుకుని క్రోధరూపుడయాడు. చూసిన రాముడు ధనుష్టంకారం చేశాడు. రాక్షసవీరుడు తన ముఖం మీది రక్తం చప్పరిస్తూ గదాదండం తిప్పుతున్నాడు.

రాముడు : కుంభకర్ణా! సర్వరాక్షస సంహారదీక్షలో ఉన్నాను. సావధానంగా నిలబడు.

కుంభ : దాశరథీ! విరాధ, కబంధ, ఖర వాలి, మారీచులు, అల్పులు. దేవ దానవులను పరాజితులను చేసిన ఈ గదాదండం చూశావా! ముక్కూ, చెవులూ లేని వీడు ఏం చేస్తాడనుకుంటున్నావేమో! నీ శక్తి చూపించు, నా ప్రతాపం రుచి చూద్దువుగాని, నా నాలుక నీ రక్తం తాగుతున్నప్పుడు.

వాలిని వధించిన బాణం వదిలాడు రాముడు. చలించలేదు రావణ సోదరుడు. బాణవర్షంతో వాని శరీరం రక్తం వర్షించింది. చలించకుండా తన గదాదండం పైకెత్తాడు. రాముడు విడిచిన వాయవ్యాస్త్రం వాని భుజాన్ని ఖండించింది. అదిపడిన తాకిడికి వేల వానర రాక్షసులు అసువులు విడిచారు. రెండవచేతితోకుంభకర్ణుడు మహా వృక్షం అందుకుంటూండగా రాముడు విడిచిన 'ఇంద్రాస్త్రం దాన్ని విడగొట్టింది. అయినా వాడు వస్తూండగా రెండు అర్ధచంద్ర బాణాలతో వాని ఊరువులు ఛేదించాడు! సూర్య కిరణద్యుతులీనే ఇంద్రాస్త్రం మళ్ళీ సంధించి విడిచాడు.

అంతే! అర్ధరాత్రి ఉదయించిన సూర్యుని మధ్యభాగాన చంద్రునివలె స్వర్ణ కుండలాలంకృతశీర్షం లంకానగర ప్రాకారపు గోడలను ఛేదించి లోపలపడింది. మిగిలిన కాయం సముద్రంలో పడింది. దానితో సాగరంలోని మహామకర, మత్స్య, తిమింగలాలు నలిగి నశించాయి. మునిగణాలతో దేవతాకోటి రాముని అభినందించింది. రాక్షసులు ఎక్కడి వారక్కడే నిలబడిపోయారు అచేతనులై. వానర సేనా మధ్యంలో సూర్యసదృశంగా వెలుగుతున్నాడు రామభద్రుడు.

# రా వ ణ ని ర్వే దం

హతశేషులు తిరిగివచ్చి :

లంకేశ్వరా! వేల వానరులను భక్షించి, సర్వవానరులకు యమసముడుగా గోచరించి అద్భుత సంగ్రామం సాగించిన తమ సోదరులు రామబాణంతో నేలకూలారు. ఆయన కళేబరం సముద్రంలో పడింది. శిరసు మన నగరద్వారానికి అడ్డంగావుంది, అనగా విన్న రావణుడు విషాదంతో మూర్ఛిల్లినాడు.

దేవాంతక, నరాంతక, త్రిశిర, అతికాయులు తమ పినతండ్రి మరణ వార్తవింటూ కంట తడిపెట్టారు. వారితోపాటు మత్త ఉన్మత్తులు శోకసంతప్తులయారు.

కొంతసేపటికి తేరుకున్న రావణుడు :

ఓ మహావీరుడా! నువ్వుకూడా నన్ను విడిచివెళ్ళావా! దైవం నిన్నుకూడా యమసదనం చేర్చిందా! నాకు కలిగిన విపత్తునుండి విముక్తి కలుగకుండానే కన్నుమూశావా! సోదరుడంటే దక్షిణబాహువుతో సమానం. ఆ కుడిచెయ్యి తెగిపోయింది నాకు. దేవదానవగణాలను ఉర్రూతలూగించిన నువ్వు, వజ్రాయుధాన్ని తృణప్రాయంగా భావించిన నువ్వు రామబాణాగ్నికి లొంగిపోయావా!

నీవంటి సోదరుడు లేనప్పుడు నాకీ రాజ్యం దేనికి, సీత ఎందుకు? అసలు నా ప్రాణాలే అనవసరం. నిన్ను సంహరించిన ఆ రాముణ్ణి రణరంగంలో నేలకూల్చే వరకూ విశ్రమించను. అదిగో ఇంతకాలం నా చేతులలో పరాభూతులయిన దేవతలందరూ నన్ను చూసి నవ్వుతున్నారు.

ఆనాడు విభీషణుడు చెప్పిన మాటలు నిజమే అనిపిస్తున్నాయి, వాడి మాటలు వినక దేశభ్రష్టుని చేసిన ఫలం అనుభవానికి వస్తున్నది, అని కన్నీరు మున్నీరుగా శోకించాడు.

అప్పుడు త్రిశిరుడు : ప్రభూ! వీరమరణం చెందినవారి కోసం కంటతడి పెట్టడం మీవంటి యోధులకు ఉచితమా! బ్రహ్మదత్తములయిన శక్తి, చాప, బాణ, కవచాలున్నవి. సహస్రఖర రథవాహనం మీద దేవదానవులను ఎన్నోమారులు మన్నుకరిపించిన వీర శిరోమణి! వీశక్తికి రామలక్ష్మణులు ఊపిరి విడిచేస్తారు. అందాకా రాదు. మేమున్నాము, నలుగురు సోదరులం. గరుడుడు పన్నగులను పట్టినట్లు రామునులను పట్టి నీ పాదాల

ముందుంచుతాం. ఇంద్రుడు శంబరాసురుని వధించినట్లు వేవే రాముని కూలుస్తాను అంటూంటే రావణునికి ధైర్యం కలిగింది.

రావణపుత్రులు దేవాంతక, నరాంతక, అతికాయ, త్రిశిరులు ఆయనకు ప్రదక్షిణం చేసి ఆశీర్వాదం పొంది సాగుతూంటే వారివెంట మత్తుడు ఉన్మత్తుడు అనె రావణ సోదరులు తోడువెళ్ళారు, లంకేశ్వరుని ఆజ్ఞతో.

ఐరావత వంశానికి చెందిన గంధగజం మీద నీలజీమూతదేహుడు మత్తుడువెళ్ళాడు. ఆయుధసంపన్నమయిన రథం మీద త్రిశిరుడు, అతి విశాల రథం మీద చాపకళానిపుణుడు, మేరుపర్వతదేహుడు, అతికాయుడు శ్వేతాభ్రసదృశ అశ్వం మీద నరాంతకుడు ప్రాసాయుధధారియై రాగా దేవాంతకుడు పరిఘ, ఉన్మత్తుడు గద ధరించివచ్చారు.

## రా వ ణ న ం ద ను లు

వానర రాక్షస సేనల మధ్యపోరు ప్రారంభమయింది. వానరులు అందిన మేరకు రాళ్ళూ, చెట్లూ విసిరి, దగ్గరగావున్న రాక్షసయోధుల ఆయుధాలే ఊడబెరికి శత్రుసంహారం చేస్తున్నారు క్షణాలలో ఆ ప్రాంతమంతా రాక్షస రక్తవాహినిగా మారింది; మాంస పంకంతో నిండింది. అదిచూచి నరాంతకుడు తన ప్రాసాయుధంతో వానర మారణ హెూమం సాగిస్తున్నాడు. అంతక్రితం కుంభకర్ణునిచేత దెబ్బలుతిని అలసినవీరులు నరాంతకుని ధాటికి ఆగలేక సుగ్రీవుని వెనుకకు చేరారు. సుగ్రీవుని ఆజ్ఞానుసారం అంగదుడు ఎదురువచ్చి, ఓ రాక్షసయోధుడా! ఆ అల్ప బలులతో దేనికి! నీ ప్రాసాయుధంతో నా వక్షస్థలం మీద కొట్టిచూడు, అనగా నరాంతకుడు వేడి నిట్టూర్పువిడిచి, మునిపంటపై పెదవి కొరికి ప్రాసాయుధం విడువగా అది ముక్కలైపడింది.

ఆ వేడిలో అంగదుని అరచేతిదెబ్బకు ప్రతిపక్షి గుర్రం తల పగిలింది. దానితో వాడు పిడికిలి బిగించి అంగదుని తలమీద మోదాడు. నెత్తురు కక్కుతూ, కళ్లు తిరిగి క్షణకాలం నిశ్చేష్టుడై అంగదుడు తన ముష్టిఘాతంతో ఆ నరాంతకుని గుండె బ్రద్దలుచేసి నేలకూల్చాడు, వానరులు హర్షధ్వానాలుచేశారు. రాముడు అభినందించాడు.

## మ త్తు డు

నరాంతకుని మరణం కలిగించిన క్రోధంతో మత్తుడు తన గంధగజంతో అంగదునికి ఎదురువచ్చాడు. వాని వెంట దేవాంతకుడు ఇటునుంచి త్రిశిరుడు వాలాడు. నిశ్చలంగా

అంగదుడు శాలవృక్షం అందుకుని విసరగా త్రిశిరుని బాణాలు దాన్ని ఖండించాయి. అంగదుని శిలావర్షాన్ని ఆ యోధులు అణగారుస్తుంటే మత్తుడు తన పరిఘాయుధంతో వాలిసుతుని రొమ్ముపై ప్రహరించాడు. అంతే! అంగదుడు ఒక్క పూపులో వెళ్ళి మత్తుని గంధగజ కుంభస్థలం బ్రద్దలుకొట్టి, దాని దంతం లాగి దేవాంతకుని నోట రక్తం కక్కించాడు. దేవాంతకుడు తేరుకుని చేసిన ప్రహారానికి అంగదుడు మూర్ఛపోవడం చూచి హనుమంతుడు దేవాంతకునికీ నీలుడు త్రిశిరునికీ ఎదురు వచ్చారు.

హనుమంతుని పిడికిలిపోటుకి దేవాంతకుని కళ్ళుపేలి, నాలుక బైటపడి, శిరసు చెక్కలయింది. త్రిశిరుడు మరింతకోపంతో నీలుని వేధిస్తుండగా, మత్తుడు మరో మత్తేభం మీద వచ్చి నీలుని నిలువరించాడు. మత్తుని ఆఘాతానికి క్షణకాలం స్మృతితప్పినా నీలుడు కోలుకొని గిరిశిఖరం విసిరాడు. మత్తునిశిరసు ముక్కలయి, దీర్ఘకాయం ముద్దగా మారింది.

త్రిశిరుడు ధనుసును మండలాకారంలోవుంచి హనుమంతుని వేధిస్తున్నాడు. మారుతి విసిరిన గిరిశిఖరం రాక్షసబాణానికి పిండిగా రాలింది. హనుమ త్రిశిరుని అశ్వాన్ని నేలకూల్చేవేళ ఆ రాక్షసవీరుడు శక్తి విసిరాడు. హనుమంతుని చేతులలో అది రెండు ముక్కలుగా విరిగింది. అంతలోనే హనుమ తన అరచేతితో వాని తలపై మోది, వాని ఖడ్గంతోనే మూడుతలలూ ఖండించగా వానర సేన జయ జయ ధ్వానాలు చేసింది.

హనుమంతుని మీదికివచ్చే గదాధారి ఉన్మత్తుడు ఋషభుని ముష్టిఘాతానికి నెత్తురుకక్కుతూ పడ్డాడు ఉన్మత్తుని గదాదండంతోనే వాని తల పగులగొట్టాడు వానర యూథపతి.

## అ తి కా యు డు

యుద్ధక్రమం చూస్తున్న అతికాయునికి ఆవేశం హెచ్చింది. సహస్ర సూర్య ప్రభలతో వున్న వాని రథం కదిలింది రత్నకిరీట కాంతులతో, మణికుండల దీప్తులతో, అరుణలోచనాలతో అతికాయుడు తన పేరు ప్రకటిస్తూ వస్తుంటే వానరులు కుంభకర్ణుడు బ్రతికివస్తున్నాడని భయపడ్డారు. రాముని చాటుకు పారిపోయారు. అప్పుడు రాముడు:

ఈ కాలమేఘ విశాలదేహుడెవరు? అని ఆశ్చర్యంతో, వెయ్యి గుర్రాలు, రథం నిండా వివిధఆయుధాలు, ఇంద్రధనుసువలె చాపం, తేజస్వంతమయిన వదనం ఎవరయ్యా ఈ యోధుడు, అన్నాడు.

విభీషణుడు : రామభద్రా! వాడు రావణునికి ధాన్యమాలివల్ల కలిగినవాడు వేద విదుడు. ధనుర్విద్యలో రావణునంతటివాడు. ఖడ్గచాలనంలో నిపుణుడు. రాజనీతి కోవిదుడు. ఇతని బాహుబలం లంకకు పెట్టనికోట. ధర్మపరుడు తపోదీక్షతో బ్రహ్మను మెప్పించి వరాలుపొంది అస్త్రాలు గ్రహించినవాడు. వీని కవచ, రథాలు, అచ్ఛేద్యాలు. వీని విషయంలో జాగ్రత్త అవసరం, అన్నాడు.

అతికాయుడు వానరసేనను చెల్లాచెదురు చేస్తుంటే నీల, మైంద, ద్వివిద, కుముదులు శరభసహితులై వృక్షాలు, గిరిశిఖరాలు విసరగా వాటిని బాణాలతో ఖండించి ముందుకుపోగి రాముని ఎదుటకు వెడుతూ :

ప్రాకృతులతో యుద్ధం చేయడు ఈ అతికాయుడు. శక్తిమంతులు వచ్చి నాముందు యుద్ధానికి నిలబడవచ్చు. అనగా సౌమిత్రి తీవ్ర క్రోధంతో బాణం చేబూని, అట్టహాసంతో ఎదరకువచ్చి ధనుష్టంకారం చేయగా, అతికాయుడు వారి పారించి బాణం తొడిగి :

లక్ష్మణా! నువ్వు బాలుడవు. హిమవంతుడుకూడా నాబాణ ధాటికి నిలువలేడు. నీకు సంగ్రామానుభవం లేదు. విశ్రాంతిలో ఉన్న కోడెనాగును కదపడంవంటిది. నాతో యుద్ధం, అనవసరంగా ఎందుకు ప్రాణాలు పోగొట్టుకుంటావు. నువ్వు తగ్గి మీ అన్నయ్యను పంపు, నా మాటలు నీ చెవికెక్కకపోతే, నా నిశితశరాలు నీ రక్తం త్రాగుతాయి, అన్నాడు.

లక్ష్మ : రాక్షసవీరుడా! ఆత్మ ప్రశంస సత్పురుష లక్షణంకాదు. మాటలు కట్టిపెట్టి నీశక్తి ప్రదర్శించు. పండిన తాటిపండులా నీ తల నేలరాల్చడానికి నా బాణాలు తొందరపడుతున్నాయి. నేను బాలుడనో, వృద్ధుడనో, ఎవరినయినా నీ పాలిట అంతకుడను.

విన్న అతికాయుడు క్రుద్ధుడై బాణం విడువగా అది లక్ష్మణుని అర్ధచంద్ర బాణంతో విరిగింది. అతికాయుడు అయిదు బాణాలు విడిచాడు. అవీ అదేస్థితి పొందాయి. అనంతరం లక్ష్మణుడు విడిచిన వాడిబాణం అతికాయుని నుదుట రక్తం ధారలుకట్టి రుద్రశరఘాతం తిన్న త్రిపురగోపురంలా ఉంది ఆ లలాటం. ఉభయులూ ధనుర్విద్య చూపుతున్నారు.

లక్ష్మణుని రొమ్మున బాణం నాటుకుంది. ఎడమచేతితో దానిని పీకి పారవైచి ఆగ్నేయాస్త్రం సంధించాడు లక్ష్మణుడు, అతికాయుడు రౌద్రాస్త్రం వదిలాడు. రెండూ గగనంలో భీషణంగా పోరాడి భూమిమీద పడ్డాయి. అతికాయుని ఐషీకం లక్ష్మణుని ఐంద్రాస్త్రంతో చల్లబడింది. వాని యామ్యాస్త్రం లక్ష్మణుని వాయవ్యాస్త్రంతోకూలింది.

అతికాయుని కవచం ఛేదించడానికి ప్రయత్నిస్తూ, వాని బాణఘాతంతో మూర్ఛిల్లి, క్షణాలలో తేరుకొని వాని రథాశ్వాలనూ, సారథినీ వేధించాడు. ఆ సమయంలో వాయువు లక్ష్మణుని చెవిలో: వీడు వరసంపన్నుడు బ్రహ్మాస్త్రమే శరణ్యం, అనగా సౌమిత్రి బ్రహ్మాస్త్రం సంధిస్తూంటే చంద్ర సూర్యాదిగ్రహాలు కంపించాయి. దిక్కులు దద్దరిల్లుతూం డగా బ్రహ్మాస్త్రం బయలుదేరింది. అతికాయుడు తన సర్వ శస్త్రాస్త్రాలూ వదిలాడు. ప్రయోజనం లేకపోయింది, అతికాయుని శిరసు ఊడిపడింది. వానర వీరులు హర్ష ధ్వానాలు చేశారు. రాక్షసులు దీన వదనులయి లంకకుచేరారు. లక్ష్మణుడు అన్నగారి పాదాలకు నమస్కరించాడు.

తిరిగివచ్చిన రాక్షసయోధులనోట యుద్ధవార్తవిన్న రావణుడు నిర్విణ్ణుడయాడు. అకంపన, ధూమ్రాక్ష, మత్త, కుంభకర్ణ, ఉన్మత్త ప్రహస్తులతో అతికాయుడుకూడా నేలకూలినాడంటే ఈ రాముడు - నారాయణుడే అయివుండాలి, అనుకొని రక్షోగణానికి రక్షణభారంలో అప్రమత్తత బోధించాడు. వార్తవిన్న ఇంద్రజిత్తు హుటాహుటి వచ్చి: ప్రభూ! నే నుండగా మీకు విచారం అనవసరం. నాకు ఆజ్ఞ యివ్వండి. వారిని అంతకపురి కంపిస్తాను. బలిచక్రవర్తి యజ్ఞశాలలో త్రివిక్రమునివలె రణరంగంలో నేను విహరించి శత్రుసంహారం చేసి వస్తాను, అనగా అంగీకరించాడు లంకాధిపతి.

## ఇంద్రజిత్తు — బ్రహ్మాస్త్రం

రథాధిరూఢుడయిన ఇంద్రజిత్తువెంట చతురంగ బలాలు సాగుతున్నాయి. దారిలో రాక్షససేనను వలయాకారంగా ఉంచి, అక్కడే అగ్నిని ప్రజ్వలింపజేసి మంత్రంతో ఆహుతు లిస్తున్నారు. ఎర్రని వస్త్రాలతో ఉన్నాడు, నల్లని ఉక్కుతో చేసిన స్రువంతో ఆహుతు లర్పిస్తూ నల్ల మేకను బలి యిచ్చాడు. అగ్ని ప్రత్యక్షమై బ్రహ్మాస్త్రం అర్పిం చాడు. రాక్షససేన ఇంద్రజిత్తును కీర్తిస్తూ సాగుతున్నది. రథం కదలిస్తూ అడ్డువచ్చిన వానరానీకంపై బాణాలు గుప్పుతుంటే వారు ఆర్తనాదాలతో నేలకూలుతుండగా, యూథ పతులు బండరాళ్ళతో, మహాతరుశాఖలతో ఇంద్రజిత్తును నిరోధించడానికి యత్నించారు. మైంద, ద్వివిద, గంధమాదన, నీల, అంగద, జాంబవంతులతో సుగ్రీవుడుకూడా మూర్ఛిల్లినాడు.

కొందరు కన్నులూడి, మరికొందరు ముక్కులూడి, చెవులుతెగి కొందరు, కాళ్ళువిరిగి మరికొందరు, చేతులు లేని వారెందరో.... ఇంద్రజిత్తు బాణం సోకని

సైనికుడులేడు. వాని బ్రహ్మాస్త్ర ప్రయోగవేళ రామ లక్ష్మణ హనుమంతులు సైతం ఆ బ్రహ్మాస్త్రాన్ని మన్నించక తప్పలేదు. లక్ష్మణుని ఆవేశం చూస్తూ రాముడు:

తమ్ముడూ! ఈ దేవవిరోధి బ్రహ్మదత్త వరగర్వంతో మహాస్త్రం ప్రయోగించి, సర్వ వానరసేనను మూర్ఛలో ఉంచాడు. ఈనాడు మనం వీనివి ఎదుర్కొని ప్రయోజనం లేదు, రోషద్వేషాలు విడిచి ప్రశాంతంగా మూర్ఛితులం కావాలి. అప్పు డీ యోధుడు విజయగర్వంతో వెనుదిరుగుతాడు, అన్నాడు.

శత్రువులందరూ మూర్ఛపోగా సింహనాదంతో మేఘనాథుడు రావణుని సమీపించి తన విజయగాథ వినిపించాడు.

ఆ అస్త్రప్రభావం సోకని విభీషణుడు మెల్లిదిగా వానరయోధులందరిదగ్గరకువెళ్ళి, వారి చెవులలో ధైర్యవచనాలు పలుకుతూంటే, మారుతి కూడా లేచి తనవారికి ఉత్సాహం కల్పించే ప్రయత్నం ఆరంభించాడు. అందరికీ ధైర్యంకలిపిస్తూ తిరుగుతూండగా భల్లూకపతి జాంబవంతుడు కనిపించాడు. అప్పుడు విభీషణుడు:

తాతా! ఈ క్రూరుని తీక్ష్ణబాణాలు నీ ప్రాణాలు తియ్యలేదు కదా! అనగా జాంబవంతుడు : ఈ బాణతీవ్రతకు నా కనులు విడడంలేదు. కంఠస్వరాన్ని బట్టి నువ్వు విభీషణుడవనుకుంటున్నాను. మా హనుమ వాయునందనుడు సజీవంగా ఉన్నాడా, అన్నాడు

విభీ : తాతా! రామలక్ష్మణులు అంగద సుగ్రీవులు ఏమయినారని అడగకుండా ఒక్క వాయునందనుని విషయమే ఎందుకడుగుతున్నావు? ఏమిటింత మమకారం మారుతిపై.

జాంబ : నాయనా! వాడొక్కడు జీవించివుంటే అందరూ బ్రతుకుతారు మారుత తుల్యవేగుడు, వైశ్వానరసమతేజుడు అయిన అంజనానందనుడు మన జీవితాలకు ఏడుగడ.

హనుమంతుడు : తాతా! నేను కుశలం, అనడంతో జాంబవంతుడు సంతోషంతో హనుమంతుని గాఢాలింగనం చేసుకుని: నాయనా! బ్రహ్మాస్త్ర ప్రయోగంతో వెలువడిన నిశిత బాణపీడనుండి మనవారినీ, రామలక్ష్మణులనూ నువ్వే రక్షించాలి. తక్షణం ఉత్తరదిశగా హిమవంతం దాటి, కైలాసగిరి మధ్యలో కాంతులీనే ఓషధులున్నచోటికివెళ్ళి విశల్యకరణి, సంధానకరణి, సువర్ణకరణి, సంజీవని వుంటాయి. వాటినితెచ్చి వీరికి ప్రాణదానం చెయ్యాలి అన్నాడు.

మారుతి ఆ మాట వింటూనే సమీప గిరిశిఖరానికి ఎగిరి, ఒక్క ఊపుతో ఉత్తర దిశగా లేచాడు. భూమి కంపించి పర్వతం కూరుకుపోయింది. సముద్రాన్నిదాటి ఎదీనద పర్వత కాననాల మీదుగా హిమగిరి అతిక్రమించి, కైలాసంమీద అగ్నికాంతు లిపె ఓషధులలో, జాంబవంతుడుచెప్పిన వాలుగింటికోసం చూస్తూండగా తమను హరించ డానికెవరో వచ్చారని అని కాంతిహీనము లయాయి.

హనుమకు రోషం వచ్చింది. ఓషధులున్న గిరిశిఖరం పెకలించి వైనతేయ మార్గంలో లంకలో దిగుతూంటే వజ్రహస్తుడయిన దేవేంద్రుని వలె, చక్రధారియైన విష్ణువవలె కనిపించాడు. ఆ మూర్తి ని చూడగానే వానరుల బాధలు పటాపంచలయి వారంతా హనుమన్నామ సంకీర్తనం ఆరంభించారు. ఆ ఓషధుల గాలిసోకి రణస్థలిలో ఉన్న సర్వవానరులు మాతనోత్తేజంతో లేచి యుద్ధసన్నద్ధులయారు యుద్ధంలో నేలకూలిన రాక్షసులను ఎప్పటికప్పుడు సముద్రంలోకి లాగిపారేయమని రావణుని ఆజ్ఞ. అందువల్ల నిహతులయిన రాక్షసులకు పునర్జీవ నావకాశం లేకపోయింది.

తనవారందరూ లేవడంతో హనుమ మళ్ళీ ఆ గిరిని యథాస్థానంలో ఉంచివచ్చాడు.

అనంతరం సుగ్రీవుడు: కుంభకర్ణుడు పోయాడు. కొడుకులు కన్నుమూశారు. ఈస్థితిలో రావణుడు యుద్ధానికి సిద్ధంగావుండడు. కనక, వానరయోధులందరూ ఈ రాత్రి లంకకు నిప్పుపెట్టాలి, అన్నాడు.

సూర్యాస్తమయం కావడంతో కపిప్రవరులు గుంపులు గుంపులుగా కోట గోడలమీద, భవన, గోపుర, చైత్యప్రాసాదాల మీద జ్వాలలు రేపారు. రజతగిరి వంటి గోపురాలు ఫెళఫెళ ధ్వానాలతో నేలకూలుతున్నాయి. సువర్ణమణిభూషణాలతో వివిధవస్త్రాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఆయుధశాలలు మండుతున్నాయి. అశ్వ గజశాలల్లో కల్లోలం పుట్టింది.

మత్తుగా త్రాగి మదవతులతో సుఖంగా వున్నవారు మంటలు సోకి ఎలావున్నవారు అలానే వీధులలో పడ్డారు. సౌధాలమీద, ప్రాసాదోపరిభాగాలవున్న నారీమణులు మంటలో మాడిపోతున్నారు. నగరమంతా మండుతుంటే పర్వతమంత మోదుగుచెట్టు నిండుగా పూసినట్టయింది. ఆ జ్వాలా రోచులతో సముద్రతరంగాలు రక్తకాంతు లీనుతున్నాయి. నగర ప్రాకారద్వార సమీపాన రామలక్ష్మణులు ధనుష్టంకారం చేస్తున్నారు.

రాముడు విడిచిన బాణం కైలాస శృంగం వంటి నగర గోపురాన్ని నేలకూల్చింది వానరులు కంటబడిన రాక్షసుని సంహరిస్తున్నారు. అప్పటికి వార్త చేరిన రావణుడు కుంభ

సకుంభులనూ, కంపన, ప్రజంఘ, యూపాక్ష, శోణితాక్షులనూ పంపారు. ఉభయ సేనలూ మహోత్సాహంతో పోరుతున్నాయి.

కంపనుడు విసిరిన గద అంగదుని ప్రకంపింపజేసింది. క్షణకాలం విశ్చలంగా ఉండి అందిన గిరిశిఖరంతో రాక్షసయోధుని బలిగొన్నాడు అంగదుడు. ఎదురుగా వచ్చిన శోణితాక్షుని ధనుస్సు విరిగింది. రథం భగ్నమయింది. వాడు విసిరిన ఖడ్గం అందుకుని అంగదుడు పరాక్రమించగా యూపాక్ష ప్రజంఘులు అడ్డురాగా చూచిన మైందద్వివిదులు అటువచ్చారు. అంగదుని పిడికిలిపోటుకు ప్రజంఘుడు యమపురి చేరాడు. మైందుని చేతులలో యూపాక్షుడు, ద్వివిదుని హస్తాలలో శోణితాక్షుడు వీరస్వర్గం అలంకరించారు.

రాక్షససేన భయంతో కుంభుని చాటుకి చేరింది. ధనుర్విద్యలో రావణు నంత వాడు కుంభుడు. వాడు విడిచిన బంగారురెక్కల నిశితశరం ద్వివిదుని మూర్ఛితుని చేసింది. మైందుడు ఎదురువచ్చి అదే అవస్థ పాలయ్యాడు. వారి మేనల్లుడు అంగదుడు వచ్చి కొంతసేపు విరోధించి కుంభుని వాడిబాణాలు కనుబొమల మధ్య నాటుకుని చూపు తప్పినా, సాలవృక్షాన్ని లాగి విసిరాడు. అది తునియలయింది. మరొక వాడిబాణం అంగదుని మూర్ఛిల్లజేసింది. విన్న రాముని చూపు సుషేణ, జాంబవంత, వేగదర్శుల మీద పడగా వారు కుంభునికి ఎదురువెళ్ళారు. ఆ యోధునిధాటికి వారూ నిలవలేక పోవడం చూసి సుగ్రీవుడు తీవ్రవేగంతో వాని రథం మీదికిసాగి ధనుస్సువిరచి.

భేష్, నీ ధనుర్విద్య రావణుని తలపిస్తున్నది. ఇంద్ర, బలి, కుబేర, వరుణులు నీతో తూగుతారు. ఇక నీ దేహం సాక్షాత్తూ కుంభకర్ణునిముక్కులోంచి ఊడిపడినట్లుంది ఇంతవరకూ నీశక్తి చూపించావు, ఇప్పుడు నాశక్తి చూడు. నిజానికి యిన్నిమాటలు అవసరం లేదు. కాని యింతవరకూ యుద్ధంలో నువ్వు అలసివున్నావు. నే నిప్పుడే వచ్చాను. అలిసినవానితో యుద్ధం వానరవీరుల లక్షణం కాదు. ఈ అవకాశం నీకు విశ్రాంతి నిచ్చి వుంటుంది అన్నాడు.

ఆజ్యధార అందిన అగ్నివలె కుంభుడు ముందుకు దూకినాడు. వారి మల్ల యుద్ధంలో భూమి కంపించింది. క్షణాల వ్యవధిలో సుగ్రీవుడు రెండు చేతులతో కుంభుని పైకెత్తి గిరగిర త్రిప్పుతూ సముద్రంలోకి విసిరాడు. వాడు మరింత తీవ్రవేగంతోవచ్చి సుగ్రీవుని రొమ్ముమీద తాడించగా ఉక్కిరిబిక్కిరయి ఊపిరి సలుపుకొని కుంభుని వక్షఃస్థలం మీద పిడికిలితో పొడిచాడు. అంతే ఆ రాక్షసవీరుడు రక్తప్రవాహంతో నేలకూలాడు

నికుంభుడు నిప్పులుకక్కుతూ యమదండం వంటి పరిఘాయుధంతోవచ్చాడు. కాలమేఘం మధ్య విద్యుల్లతలావున్న ఆ ఆయుధాన్ని చూచి వానరులు కంపించగా ఆంజనేయుడు ముందుకువచ్చి రొమ్మువిరిచి నిలబడ్డాడు. నికుంభుని ఆయుధం వాని రొమ్మునుతాకి ముక్క ముక్కలయింది. ఆ కోపంతో హనుమంతుడు నికుంభుని ఉరఃస్థలం మీద ముష్టిఘాతం చేశాడు. వాడు గిజగిజలాడి తేరుకుని రాబోగా హనుమంతుడు వాని శిరసుపట్టి గిరగిర తిప్పి మొండెం నుండి వేరుచేశాడు. ఆ చిత్రహింస వానరులకు ఆనందం కలిగించింది.

## మ క రా క్షు డు

మహాయోధుల మరణం లంకేశ్వరుని శోక, క్రోధాలను రెచ్చగొట్టగా : మకరాక్షా! ఇంక నువ్వే వున్నావు, అన్నాడు.

సర్వం సన్నద్ధం అయింది. అప్పుడు రాక్షసవీరుడు తన సేనలను చూసి : మీరంతా వానరయోధులతోతలపడండి. నేను ఏకాయెకి వెళ్ళి రామలక్ష్మణుల విషయం చూసుకుంటాను, ఈనాటితో వానరసేన అనే గడ్డిమేటి మన రాక్షసాగ్నితో మండి పోవాలన్నాడు.

యుద్ధం ప్రజ్వలించింది. అటూఇటూ ఊగిసలాడుతున్నది జయశ్రీ అప్పుడు మకరాక్షుడు :

రామా! నాడు దండకారణ్యంలో నేను లేకపోవడంవల్ల నా తండ్రి ఖరుడు నీచేతిలో పడ్డాడు. అదిమొదలుగా ప్రతీకారాగ్ని నాలో రేగుతూనే ఉంది. ఇప్పుడు దానికి శాంతి కావాలి. నీచేతులతో సాగనంపినవారివెంట నువ్వూ వెడతావు. ఇంతకీ నీకు మల్లయుద్ధమా! గదాయుద్ధమా! అస్త్రచాలనమా! ఏది హితవయితే అదే చూపుతాను. అనగా రాముడు నవ్వి : ఇంతకూ నువ్వు వాగ్యుద్ధకుశలుడవా! నాడు నీ తండ్రితో పదునాలుగువేలమందిని విందుగా ఆరగించి కాకులూ గ్రద్దలూ తృప్తిపడ్డాయి. ఇప్పుడు నీవంతు, అన్నాడు. యుద్ధం ఆరంభమయింది.

సర్వలోకాలూ వారియుద్ధాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నాయి. ఆకాశం బాణమేఘా లతో నిండింది. మకరాక్షుని ధనుస్సు విరిగింది. మకరాక్షుడు విడిచిన భీకరశూలం మార్గంలోనే ముక్కలయింది. మల్లయుద్ధానికి రానున్న మకరాక్షుడు రామపావకాస్త్రంతో భస్మమయాడు.

## ఇంద్రజిత్తు

రావణుడు వళ్ళు పటపటలాడించి, ఆలోచించి : నాయనా ! ఇంద్రజిత్తూ నువ్వు వెళ్ళి నీ పర్వాక్రమంతో వారిని నేలకూల్చి రావాలి, అన్నాడు.

ఇంద్రజిత్తు రణరంగానికి వస్తూ అగ్నిని వ్రేల్చి, వల్లమేకను బలియిచ్చి బ్రహ్మాస్త్రం గ్రహించివచ్చి, గగనవీథిలో అదృశ్యంగా నిలిచాడు. బాణవర్షం ఆరంభమయింది. బాణమార్గంలో రామలక్ష్మణులు బాణాలు వదుపుతున్నారు. ఇంద్రజిత్తు చిక్కలేదు. రావణి బాణాలతో రామలక్ష్మణుల దేహాలు కింశుకవృక్షాలయాయి. లక్ష్మణుడు బ్రహ్మాస్త్రం సంధించబోగా రాముడు వారించి :

తమ్ముడూ ! ఒక్కడికోసం లోకనాశనం చెయ్యకూడదు. నువ్వు శాంతంగా వుండు. విషభరితసర్పబాణాలతో వానిని నేలకూలుస్తాను, అన్నారు.

ఆమాట విన్న ఇంద్రజిత్తు నగరంలోకివెళ్ళి తనరథంమీద మాయాసీతను ఉంచి పశ్చిమద్వారాన వచ్చాడు. అక్కడవున్న వానరవీరులతో హనుమంతుడు ఎదురువెళ్ళి రథంమీది జానకిని చూచి ఆశ్చర్యపడుతూండగా ఇంద్రజిత్తు ఆమెజుట్టుపట్టిలాగి తన్నుతూ పిడికిలితో పొడుస్తూంటే హనుమ :

ఓరీ నీచుడా ! నీకు వినాశకాలం దాపురించింది. ఆడుదానిని హింసించేనువ్వా వీరుడివేనా. నీ మరణం నువ్వే కొనితెచ్చుకున్నావు, అని లంఘించబోగా, ఇంద్రజిత్తు యొక్క మాయలెరిగిన వానరులు హనుమను నిరోధించారు

అప్పుడా రావణి : అంజనీనందనా ! మీరంతా వచ్చింది ఈ ప్రాణికోసం కదా ! దీన్ని సంహరిస్తే చాలు, మీరంతా నేలకూలుతారు. స్త్రీని చంపరాదంటు న్నావు. శత్రువు మనసును పీడించడం ప్రధానం, అని సింహాగర్జన చేశాడు. వానరులు భయభీతులయి పారిపోతుంటే మారుతి వారికి ఉత్సాహం కలిగించి ఇంద్రజిత్తువైపు పాగు తూంటే ఆ రాక్షసుడు తనరథాన్ని వెనకకు నడిపించాడు. అప్పుడు హనుమంతుడు విసి రిన గిరిశిఖరం భూమిలో దిగి మహాబిలం ఏర్పడింది. వానర రాక్షస సంహారం జరుగు తున్నది. ఇంద్రజిత్తు విజృంభణం వానర సేనలను చెల్లాచెదురు చేస్తున్నది.

అప్పుడు కొందరు వానరులు : మారుతీ ! మనం ఇంత శ్రమపడుతున్నాం జానకీ దేవిని ఇంద్రజిత్తు సంహరించాడు. ముందు ఈవార్త రామునికి తెలియాలికదా ! అనగా

అందరూ వెమదిరిగారు. మారుతి వెళ్ళడంచూసి ఇంద్రజిత్తు నికుంభిలా చైత్యంవైపు హోమకార్యానికి సాగినాడు. రాక్షసయోధుల వలయమధ్యంలో మంత్రహోమం ఆరంభించారు. అగ్నిజ్వాలలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

పశ్చిమద్వారంలో భీకరసంగ్రామం జరుగుతూవున్నట్లు గ్రహించి రాముడు జాంబవంతుని వంపగా మధ్యలోనే ఎదురయిన హనుమ కన్నీరు ఒత్తుకుంటూ: తాతా! అయిపోయింది. క్రూరుడు ఇంద్రజిత్తు జానకిని సంహరించేశాడు, అన్నాడు. వారుభయులూ రాముని సమీపించి, ఈవార్త వినిపించగా, రాముడు మొదలునరికిన చెట్టులా పడ్డాడు. కపివీరులు చల్లనినీరు ఆయనముఖంపై చల్లుతున్నారు: లక్ష్మణుడు గుండె చిక్కబట్టుకుని, అన్నగారి చెయ్యి చేతిలోకి తీసుకుని :

ఈ లోకంలో ధర్మంకంటె నిరర్థకమయినదిలేదు. దానికోసం యిన్నికష్టాలు పడినవానికి యిదా ప్రతిఫలం. శాస్త్రవచనం నిజమయితే రావణుడు నానా అవస్థలూపడాలి కాని అవి మా పాలబడ్డాయి ధర్మపరులు అధర్మపరాయణుల చేతులలో క్లేశాలు పడుతున్నారు.

అక్రమాలు చేసేవారు ఐశ్వర్యసంపన్ను లవుతున్నారు. పరలోకంలో ఈ ధర్మం ఏదో సుఖం యిస్తుందంటారు. ఎలా నమ్మడం. ధర్మంకంటె దేహబలప్రదర్శనం శ్రేష్ఠమనిపిస్తున్నది. అంతే! లేకపోతే బలవంతుడు ధర్మపరులను హింసించడం సాధ్యంకాదు. మానవుడు తన అవకాశానుసారం ఏవో కర్మలుచేసి వాటికి ధర్మాధర్మాలని పేరు పెడుతున్నాడు. బలవంతుడు చేసినదే ధర్మం.

రామచంద్రా! రాజ్యత్యాగంచేసి నువ్వు సాధించింది ఏమిటి? అర్థహీనుడు సాధించే దేమిటి! అర్థవంతుడే సర్వవిశారదుడు. వాడే పురుషుడు. అది లేనివానికి బంధుమిత్రపరివారా లుండవు. ధర్మకామాలు దానినే ఆశ్రయించి ఉంటాయి. తండ్రిమాటకోసం రాజ్యం విడిచివచ్చి ఏం సాధించావు? నీభార్యను రావణుడు హరించగా వాడి కొడుకు ఇప్పుడీపని చేశాడు. ఇంక ఈ శోకంవిడిచి నీ బలంతో కర్తవ్యదీక్ష వహించు, అంటున్నాడు.

వానర సేనలను కీలకస్థావరాలలోఉంచి అప్పటికి అక్కడకు చేరిన విభీషణునికి ఈ సన్నివేశం అవగాహనకాక చూస్తూ నిలబడగా లక్ష్మణుడు జరిగినకథ చెప్పాడు. విన్న విభీషణుడు :

ఇది అసంభవం. లంకేశ్వరుని స్వభావం నాకు తెలుసు. ఆయన ప్రాణాలుండగా జానకిని సంహరించనివ్వడు. మరొక్కమాట. జానకీదేవి ఉన్న ప్రాంతానికి వెళ్ళలేదు, ఇంద్రజిత్తు వాడు మాయావి. ఏదో మోసంచేసి నికుంభిలకు వెళ్ళి అగ్నిని తృప్తిని చేసి అజేయుడయి వస్తాడు. అది జరగకుండా మనం వెళ్ళాలి, లక్ష్మణా! వానర యోధులతో నావెంట బయలుదేరు

రామభద్రా! శోకంవిడిచి స్వస్థచిత్తంతో ఉండు ఇంద్రుడు వజ్రాయుధం విడిచినట్లు నువ్వు లక్ష్మణుని పంపు, అన్నాడు.

రాముడు కొంతతేరుకుని విభీషణునితో:

ఏమిటయ్యా అంటున్నావు! నాకు విశ్వాసంకలగడంలేదు. అనగా ఆయన ఇంద్ర జిత్తు మాయ అంతా చెప్పి, ఇప్పుడు వెళ్ళి వాని ప్రయత్నం ధ్వంసం చెయ్యకపోతే వాడు బ్రహ్మశిరోనామకాస్త్రం సాధించి వస్తాడు. అప్పుడింక మనం చెయ్యగలది లేదు. ఈ నికుంభిలాయజ్ఞ విఘ్నం చేసినవాడే యింద్రజిత్తును వధిస్తాడని బ్రహ్మవాక్కు. వీడు కన్ను మూసిన క్షణంలో రావణుడు సర్వశక్తిశూన్యుడయినట్లే అన్నాడు.

రామ: లక్ష్మణా! బయలుదేరు. నీ వెంట మన హనుమ, మహాయూథపతులూ, రాక్షసమాయలెరిగిన విభీషణుడు ఉంటారు. శస్త్రాస్త్రవిదుడేకాక మాయావివాడు. జాగ్ర త్తగా ఉండాలి సుమా, అన్నాడు.

లక్ష్మణుడు ధనుర్బాణాలందుకుని, కవచంతొడిగి, ఖడ్గపాణియై, అన్నకు నమస్క రించి: నాబాణాగ్ని ఈనాడు ఇంద్రజిత్తును బూడిదచేస్తుంది, అన్నాడు రాముడు ఆశీర్వ దించాడు

## నికుంభిల

జాంబవంతుడు, హనుమంతుడు, మరికొందరు ప్రముఖులు వెంటరాగా లక్ష్మణునితో నికుంభిలాచైత్యం చేరిన విభీషణుడు: అదిగో! కారుమేఘం కనిపిస్తున్నదే అది రాక్షస సేనాసమూహం. వారిని మనవారు సంహరించాలి. అప్పుడుగాని ఇంద్రజిత్తు మనకు అందడు, అనడంతో లక్ష్మణుడు వారి సారించాడు. వానర భల్లూక యోధులు రాక్షస సంహారం ఆరంభించారు. దానితో ఇంద్రజిత్తు తన హోమకార్యం ఆపి రథంమీద ప్రళయస్వరూపంతో వస్తున్నాడు. రాక్షససేన హనుమంతుని చుట్టుముట్టింది. వారి ఆయుధాల ప్రాకారంలోవున్న తనమీదికే వస్తున్న ఇంద్రజిత్తును చూసి హనుమంతుడు.

రావణనందనా! నువ్వు వీరుడవయితే స్థిరంగా నిలబడు. ద్వంద్వయుద్ధంలో నిన్ను మట్టి కరిపిస్తాను, అన్నారు.

విభీ: లక్ష్మణా! చూశావా! ఇంద్రజిత్తు హనుమను వేధిస్తున్నాడు, అనడంతో సౌమిత్రి అటుతిరిగాడు. తిరిగి సాగుతూండగా: రామానుజా! చూశావా! ఆ జీమూత సమూహవర్ణశన్యగ్రోధం. ఆ మర్రిచెట్టుదగ్గరే భూతబలు లిచ్చి రావణి యుద్ధానికి వస్తాడు. వాడు అటువెళ్ళకుండా ఆపాలి, అన్నాడు.

వచ్చే విభీషణుని చూసి రావణసుతుడు:

ఓ దుర్మతీ! ఎంత దారుణానికి దిగావు, మా తండ్రి ప్రాపకంలో పెరిగి పెద్దవాడవయి, మా మీదికే శత్రువును పురికొల్పుతున్నావు. సాధుజన నిందాపాత్రుడా! గుణహీనులయినా స్వజనులను విడువరాదని ఎరగవా! స్వజనాన్ని విడిచి శత్రువును చేరినవాడు వారిచేతులలో మరణించక తప్పదని వినలేదా! అయినా జ్ఞాతిలక్షణాలు నిన్ను వదలలేదు, అంటూంటే విభీషణుడు:

ఎందుకయ్యా! నోరు పాడుచేసుకుంటావు. నన్నూ నాస్వభావాన్నీ ఎరగవా. పుట్టింది రాక్షసవంశమయినా నా స్వభావం దానికి విరుద్ధం. మీ తండ్రికీ నాకూ ఎప్పుడూ ధర్మ విషయమై ఏకాభిప్రాయం లేదు. పాపబుద్ధికలవాడు సోదరుడయినాసరే, చేతిని చుట్టుకో బోయే కోడెత్రాచులా భావించి విదలించుకోవాలని ధర్మవిదులు చెపుతున్నారు. పరదారా ధనాలను హరించడం, మిత్రులను శంకించడం అనే మూడు పాపాలతో తృప్తిపడక మీ నాన్న సాధువులయిన మహర్షులను హింసించాడు. అహంకారం, వైరం వాడి జీవలక్షణాలయాయి. ఆయనలో సద్గుణాలు కొన్ని ఉన్నా ఈ దుర్గుణాలముందు అవి లెక్కలోకిరావు. సరే, బాలుడివి. మీ నాన్నపాటి అహంకారమూ ఉంది, నే నేం చెప్పినా తలకెక్కదు. ఇంక ఈ లక్ష్మణుని బాణాగ్నిలో నీతో ఈ లంక నాశనం కాబోతున్నది. నీ అస్త్రవిద్య చూపి ఆయనతో పోరుసాగించు అన్నాడు.

అప్పటికే హనుమంతుని భుజసీమ మీదవున్న లక్ష్మణుని చూచి, వానర వీరులందరినీ తిలకించి, సింహనాదం చేసి బాణాలు విడిచాడు. ఆ బాణాలకు గాయపడిన శరీరంతో లక్ష్మణుడు పొగలేని అగ్నిజ్వాలలా కనిపించాడు. ఆ కోపంతో విడిచిన అయిదు బాణాలకు ఎదురుగా రావణనందనుడు మూడు బాణాలు వదిలాడు.

రెండు గ్రహాలు ఢీకొన్నట్లు, సింహద్వయం పోరాడుతున్నట్లుంది. అటూ ఇటూ అమ్ములవాన సాగుతున్నది. ఆ సమయంలో లక్ష్మణుని ధనుష్టంకారానికి ఇంద్రజిత్తు వివర్ణవదనుడు కాగా విభీషణుడు:

సౌమిత్రీ! వానికి అంతిమ ఘడియలు దాపురించాయి, నడిపించు బాణాలు, అన్నాడు.

ఆ బాణధాటికి ఇంద్రజిత్తు మూర్ఛిల్లి తేరుకుని:

లక్ష్మణా! నువ్వు మరచినట్లున్నావు నా శక్తి. మొదటిరోజున మీ సోదరు లిద్దరూ మూర్ఛితులయారు, గుర్తులేదా. సావధానంగా ఉండు, అని నిశిత శరాలతో గాయపరిచి, హనుమంతుని వేధించి, విభీషణుని కూడా హింసించాడు. లక్ష్మణ బాణ ధాటికి రాక్షసవీరుని కవచం ఊడింది. రక్తసిక్త గాత్రంతో ఉదయసూర్యునివలె ఉన్నాడు రావణసుతుడు.

యుద్ధం సాగుతూనే ఉంది. ఉభయులూ అలసట లేకుండా ధనుర్విద్య ప్రదర్శి-స్తున్నారు. విభీషణుడు తన అనుచరులతో రాక్షస సంహారం సాగిస్తున్నాడు.

విభీ: ఓవానర యోధులారా! మీరంతా అప్రమత్తంగా రాక్షససేనా సంహార కార్యంలో ఉండాలి. లంకేశ్వరునికి వీడొక్కడే మిగిలాడు. నా అన్నకొడుకు వీడు, అయినా ధర్మాత్ముడయిన రాముని కోసం బంధుప్రేమను విడిచి, పుత్రవాత్సల్యాన్ని విసర్జించి, వీని మరణం కోసం ఎదురుచూస్తున్నాను. ఈ రోజు వీనిని లక్ష్మణుడు తన చేతులతో కడతేరుస్తాడు, అన్నాడు.

ఉత్సాహంతో వానర, భల్లూక వీరగణం విజృంభించింది. రాక్షస సంహారం సాగుతున్నది.

సారథి మరణించగా ఇంద్రజిత్తు తనే సారథ్యం వహించి నడుపుతూ బాణ వర్షం కురిపిస్తున్నాడు. శరభ గంధమాదనులు ప్రమాథి రభసులతో ఎగిరి వాని అశ్వాలను హతమార్చారు. అయినా పోరు మానలేదు. సంధ్యాకాలం సమీపించింది. అప్పుడు ఇంద్రజిత్తు తన అనుచరులను పిలిచి: మీరంతా అప్రమత్తంగా ఉండండి. నేను మరొక రథం తీసుకువస్తాను. అనివెళ్ళి క్షణాలవ్యవధిలో తిరిగివచ్చి వానర సంహారం ఆరంభించగా లక్ష్మణుడు వాని ధనుస్సు ఖండించాడు. వాడు మరొక ధనుస్సు అందుకునే వ్యవధిలో సౌమిత్రి విడిచిన బాణపంచకం వాని రొమ్మున రక్తధారలు నింపాయి. అయినా చలించక ఆ వీరుడు రామానుజుని లలాటంమీద మూడు బాణాలు నాటాడు. ఈ యోధుడు అయిదు బాణాలు గుచ్చాడు. విభీషణుని గదా ఘాతానికి ఇంద్రజిత్తు గుర్రాలు నేల కూలాయి. కోపంతో వాడు విడిచిన శక్తిని లక్ష్మణుడు మార్గమధ్యంలో ఖండించి, మరి కొన్ని వాడి బాణాలు నడిపాడు.

ఉభయులూ అస్త్రాలు వదిలారు. అవి గగనవీధిలో క్రౌంచపక్షుల వలె ధ్వని చేస్తూ మండిపడ్డాయి. లక్ష్మణుని వారుణాస్త్రానికి ఇంద్రజిత్తు రౌద్రం ఎదురయింది. ఇంద్రజిత్తు ఆగ్నేయం విడువగా సౌమిత్రి సౌరాస్త్రం వదిలారు. రావణనందనుడు ఆసురం వదిలాడు. అప్పుడు దశరథనందనుడు ఐంద్రాస్త్రం సంధించి :

ధర్మాత్మా సత్య సంధశ్చ
రామో దాశరథిర్యది।
పౌరుషే చా ప్రతిద్వంద్వః
శరైనం జహి రావణిమ్॥

రాముడు ధర్మపరుడూ, సత్యసంధుడూ, అప్రతిద్వంద్వ పౌరుషయుతుడూ అయితే దీనితో ఇంద్రజిత్తు నేలకూలుతాడు, అంటూ ఆకర్ణాంతం లాగి విడిచాడు.

అది అత్యంత తీవ్రవేగంతో వచ్చి మణికుండల భాసితమయిన ఇంద్రజిత్తు శిరస్సును క్రిందపడవేసింది. వాని మొండెం భూమిలో విలవిల లాడుతున్నది. వానరసేన జయ జయ ధ్వానాలు చేసింది. రాక్షససేన కకావిక లయింది.

అన్నగారి పాదాలకు నమస్కరించి నిలిచాడు లక్ష్మణుడు. రణ క్రమాన్ని విభీషణుడు వివరించగా రాముడు గాఢాలింగనం చేసుకున్నారు. అనంతరం సుషేణుని పిలిచి :

మూడు రోజులుగా మనవారందరూ నిర్విరామ రణ దీక్షలో శరఘాతాల పాల య్యారు, వారికి సుఖం కలిగించు, అన్నాడు.

ఆయన ఓషధులతో వారందరికీ శ్రమ తగ్గించి సంతోషం కలిగించాడు.

ఇంద్రజిత్తు మరణవార్త విన్న రావణునిగుండె విషాదభరమయి-ఇంక దేవ, గంధర్వ గణాలు నిశ్చింతంగా తిరుగుతాయి. మహర్షి సంఘాలు నిర్విఘ్నంగా తపస్సు చేసుకుంటాయి. కానీ నా జీవితం శూన్యం. మందరగిరి శృంగాలను ముక్కలు చేయగల, ఇంద్ర, యమ వరుణులను గజగజలాడించిన ఇంద్రజిత్తు సామాన్య మానవుడి చేతులలో కూలిపోయాడా! అని విలపిస్తుండగా అంతఃపురం నుండి రోదన ధ్వనులు వినవచ్చాయి. లంకేశ్వరుని గుండె మరింత నీరసపడి :

నాయనా! రామ, లక్ష్మణ, సుగ్రీవులు ఊపిరి పీలుస్తుండగానే నువ్వు కన్నుమూశావా. నాకు అంత్యక్రియలు నీ చేతిమీదుగా జరగవలసింది పోయి నేను నీకు ప్రేతకార్యం చెయ్య

వలసిన గతిపట్టిందా. కన్నతల్లినీ, కట్టుకున్న భార్యలనూ విడిచి వెళ్ళిపోయావా, అని కొంత సేపు విలపించాడు.

క్షణాల వ్యవధిలో శోకం చల్లారి క్రోధం రేగింది. గ్రీష్మవేళ మధ్యాహ్న సూర్యునివలె వెలిగిందాయన వదనం. ఆవేశంతో ఆసనం దిగి అరచేతులు బిగించి, అంతలో ఖడ్గం అందుకుని, పెటపెటపండ్లు గీటుచును, భీకరుడై కనుగ్రేవ నిప్పుకల్ పొట పొట రాల. అశోకవనంవైపు దృష్టిసారించి·

బ్రహ్మదత్తమయిన కవచం, అస్త్రం, రథం ఉండగా నన్ను జయించగలవాడులేడు. ఇంద్రజిత్తు మాయాసీతనే వధించాడు. నేను నిజంగానే ఆమెను సంహరిస్తాను. దానితో సర్వపీడలు వదులుతాయి, అని తీవ్ర వేగంతో సాగుతూన్న రాక్షసేశ్వరునివెంట మంత్రులూ, రావణపత్నులూ అనుసరించారు.

రాక్షసులందరూ నేటితో రాముని పీడవదులుతుందని హర్షధ్వానాలు చేశారు. కాలాంతకునివలె ఖడ్గధారియై వచ్చే రావణుని చూచి, కంపిత హృదయంతో జానకి:

వీడు పుత్రశోకంతో నన్ను చంపడానికి వస్తున్నాడు. రామలక్ష్మణులను కడతేర్చి రావడం లేదుకదా. అనాడు హనుమంతునిమాట విని అతనితో వెళ్ళిఉంటే ఈ విపత్తులు తప్పేవి. రాముడు లేకపోతే కౌసల్యాదేవి జీవిస్తుందా, అని విలపిస్తున్నది. చంద్రునికి దూరమయి ఇతర గ్రహవేధలోవున్న రోహిణివలె ఉన్నదా యిల్లాలు.

అశోకవనంలో అడుగుపెట్టిన అనంతరం రావణుని మంత్రి సుపార్శ్వుడు సాహసించి ఎదురుగా నిలిచి: ప్రభూ! వైశ్రవణ సోదరులయిన మీరు క్రోధావేశంలో ధర్మమార్గం విడిచి అబలను సంహరించడం ఉచితంకాదు. ఈ ఆవేశంతో మీరు రణరంగానికి వెళ్ళి దాశరథులను నేలకూల్చి జానకిని చేపట్టండి. నేడు కృష్ణ చతుర్దశి. రేపు అమావాస్య. రణయాత్రకు చక్కని ముహూర్తం, అని ప్రబోధించగా రావణుడు వెనుదిరిగి సభాభవనం చేరి కుపిత సింహంవలె నిట్టూరుస్తూ సేనానులారా! సర్వసేనతో రాముని చుట్టు ముట్టండి. వాడు నేడు నేలకూలాలి, అన్నాడు

పదివేల రథబలం, పదునాలుగువేల అశ్వదళం, పదునెనిమిదివేల గజ సేన, రెండు లక్షల కాల్బలం కదలింది.

పోరు ప్రారంభమయింది. ఉభయుల పదఘట్టనాలతో రేగిన ధూళి క్షణాల వ్యవధిలో రక్తధారలతో అణగారింది. రాక్షసుల ఆయుధాలు వానరుల శిలాఖండాలతో

వృక్షశాఖలతో నుగ్గు నుగ్గయాయి. కొంతసేపటికి వానరసేన నిలవలేక రాముని వెనుకకు చేరింది రాముడు ధనుస్సు చేబూనగా అది రాక్షసనేనా సాగరానికి చెలియలికట్ట అయింది. రాముని చూపులు సూర్యసమంగా వెలుగుతున్నాయి.

బాణాలు సాగుతున్నాయి. విరిగిన రథాలు, తొండాలు తెగిన ఏనుగులు, కాళ్ళు ఊడిన గుర్రాలు, గంధర్వాస్త్రం విడిచాడు. - అంతే రాక్షసులందరికీ తన ఎదుటివారు రాముడుగా కనిపించి వారినివారే సంహరించుకున్నారు. రాముని చేతిలో ధనుస్సు కాలచక్రమయింది వారి పాలిట. రావణుని మూలబలం ధ్వంసమయింది. అది చూచి అందరూ ఆశ్చర్య చకితులవుతుంటే రాముడు: ఈ అస్త్రవిద్య త్ర్యంబకు డెరుగును, నే నెరుగుదును, అన్నాడు.

లంకేశ్వరుని మూలబలం సర్వనాశనమయిన వార్తవిన్న రాక్షస స్త్రీలు తమ భర్తల కోసం, తనయులకోసం, బంధువులకోసం రోదిస్తూ! ఇంతకీ ముసలి శూర్పణఖ పండినముగ్గుబుట్ట తలతో, ముడతలబడ్డ మొహంతో అది రాముని ప్రేమించి యింతకు తెచ్చింది. విరాధుడు, ఖరదూషణులు ఇందరు చచ్చింది సీతకోసం; వాలి, కబంధులు నేలకూలారు. కొండలమీద ఏడిచే సుగ్రీవుడు వానర రాజయాడంటే, హనుమంతుడు సముద్రం దాటాడంటే సీత కాదూ కారణం. ఆనాడు విభీషణుని మాట వినిఉంటే అతికాయ, కుంభకర్ణాది యోధులు మరణించేవారా!

రాముడు రుద్రుడో, మహావిష్ణువో, మన పాలిట యముడో కావాలి. మన ప్రభువుకు వరాలిచ్చిన ప్రజాపతి నరులచేతిలో చావు లేదనలేదే! అందుచేత ఈ మానవరూపంలో మృత్యువు వచ్చి ఉంటుంది. రావణపీడ వదలేని దేవతల మొరవిని మహాదేవుడు వీని నాశనార్థం స్త్రీని సృష్టిస్తానన్నాడు. ఆ స్త్రీ సీత కావాలి. రానున్న విపత్తు గుర్తించి ముందుగానే విభీషణుడు వారి శరణు వేడాడు, అని గోలు గోలున విలపిస్తూంటే ఆ రోదన ధ్వనులు రావణుని చెవినపడ్డాయి. ఎదుట నున్న మహోదర, మహాపార్శ్వ, విరూపాక్షులను చూచి: మీ సేనలను సన్నద్ధం చేయండి, అన్నాడు.

క్షణాలలో యుద్ధ సన్నాహాలు అయాయి. వారందరినీ చూచి రావణుడు:

నా శరపరంపర ఉత్తుంగ తరంగాలుగా, ధనుస్సు సముద్రంగా వానరులను ముంచెత్తుతాను. మరణించిన వానరుల వదనాలు పద్మాలుగా, వర్చస్సు కేసరాలుగా ఉండే ఆ సేనాతటాకంలో మత్తేభంలా విహరిస్తాను, అన్నాడు.

సింహనాదాలు లేచాయి. ఎనిమిది గుర్రాలను పూన్చిన రథంమీద లంకేశ్వరుడు బయలుదేరే వేళ భేరీభాంకారాలు భువనభోంతరాలను దద్దరిల్లజేశాయి. ఎన్నో దుశ్శకునాలు ఎదురయినా లెక్కచేయక వస్తున్నాడు. గ్రీష్మభానునివలె వున్న ఆ మహావీరుని చూడగానే వానరసేన కంపించిపోగా సేనానులు ధైర్యం కలిపించారు.

యుద్ధం ప్రారంభమయింది. రావణుని బంగారు రెక్కల బాణాలు వారి తలలు తరుగుతూ, కాళ్ళు ఖండిస్తూ, చేతులు రాలుస్తూంటే హాహారవాలు ఆరంభమయాయి. ఆ బాణాగ్నిలో వానర బలం మిడతలదండు అయింది, సుగ్రీవుడు ఎదురు వచ్చాడు. సేనానులందరూ శిలావర్షం ఆరంభించగా రాక్షససేవ వేల కూలుతూంటే విరూపాక్షుడు మత్తేభంమీద వచ్చిబాణవర్షం ఆరంభించగా సుగ్రీవుడు వృక్షశాఖతో ఆ గంధగజాన్ని తాడించాడు. అది ఒక ధనువుదూరం వెనుకకు పోయింది. డాలు, కత్తులతో ఎదురువచ్చే రాక్షససేవానిమీదకి సుగ్రీవుడు శిలాఖండం విసిరాడు. వాడు తప్పించుకుని కత్తి విసిరాడు. ఆ దెబ్బకు సుగ్రీవుడు మూర్ఛిల్లి తేరుకుని ఒక్క ఊపులో వెళ్ళి పిడికిలితో పొడిచి, పాదతాడనం చేశాడు. వాడు రక్తం కక్కుతూ కళ్ళు తేలవేశాడు. వానరసేన జయ జయ ధ్వానాలతో ముందుకు వచ్చింది. మందు టెండలో చెరువయింది రాక్షససేవ.

చూశాడు రావణుడు. ప్రక్కకుతిరిగి: మహోదరా! నువ్వు తప్ప మనవారికి రక్షలేదు, అన్నాడు. మహోదరుడు విజృంభించి వానరానీకాన్ని హింసిస్తుంటే సుగ్రీవుడు పర్వతమంత బండరాయి విసిరాడు. దాన్ని మహోదరుని బాణం పిండిచేసేవేళకు సాలవృక్షం వచ్చిపడి అది ముక్కలుకాగా, ఒక పరిఘాయుధం అందుకున్నాడు. అదీ విరిగింది. ముసలం విసిరాడు వానరరాజు. మహోదరుడు గదవదిలాడు. రెండూ విరిగిపోయాయి. ఉభయులూ మల్లయుద్ధం ఆరంభించారు. పిడుగులు పడుతున్న ధ్వనులు లేచాయి. అలసి, అలసి, సుగ్రీవుడు రణరంగంలో కత్తిఅందుకున్నాడు. రాక్షసయోధుడున్నూ ఖడ్గపాణి అయాడు. వానరుల జయ జయ ధ్వానాలలో మహోదరుని శిరస్సు సుగ్రీవుని కత్తివేటుకి నేలరాలింది. ఆవల మహాపార్శ్వుడు వానరులను చెండాడుతూంటే అంగదుడు ఎదుర్కొన్నాడు. గవాక్ష, జాంబవతులూ అటేవచ్చారు. అంగదుడు విసరిన పరిఘ వాని శిరస్త్రాణం ముక్కలుచేసింది. ఆ ఊపులోనే అంగదుడు మహాపార్శ్వుని కర్ణయుగళం మీద అరచేతులతో తాడించగా, వాడు పరశువుతో అంగదుని భుజసీమను గాయపరిచాడు. వాలినందనుడు పిడికిలిపోటుతో మహాపార్శ్వుని గుండె బ్రద్దలుచేశాడు. చూచిన రావణుని కన్నులు అగ్నిగోళాలయాయి, వానరసేన హర్ష ధ్వానాలు ఆకాశం నిండాయి.

రావణరథం ముందుకువచ్చింది. ఆ ఘోషకు భూతకోటి దద్దరిల్లింది. తామసాస్త్రం విడిచాడు రావణుడు. వానరసేనకు పలాయనం శరణ్యమయింది. చూచాడు రాముడు. వారి సారించాడు. వెనుకనే లక్ష్మణుడు ధనుస్సు సంధించాడు. సూర్య చంద్రుల ఎదుట రాహువువలె ఉన్నాడు రావణుడు.

బాణవర్షం ఆరంభమయింది. ఆకాశం బాణాచ్ఛాదితమయింది. భూమ్యాకాశాల మధ్య బాణగవాక్షం సృష్టించారు వారు. అంతలో ఆ బాణాలు పందిరిలా అయాయి. సూర్యరశ్మి రావంత దట్టమయింది. బాణాలే కారుమేఘాలవలె అయాయి. ధనుర్వేదపారగులయిన రామ – రావణులు శరతరంగాలు సృష్టించారు.

రావణుడు విడిచిన బాణత్రయం రాముని నీలివదనం పై రక్తకమలాన్ని వికసింప జేసింది. రాముడు వదలిన మూడు బాణాలూ రావణ లలాటాన్ని చీల్చుకుంటూ భూమిలోకి వెళ్ళాయి. రావణుడు ఆసురాస్త్రం వదిలాడు. రాముడు పావకాస్త్రంతో నిరోధించాడు, లంకేశ్వరుడు మరొక అస్త్రం విడిచాడు. అదిగదా, శూల, పరశు, పట్టిసాది ఆయుధ పరంపరను జిమ్ముతూ వస్తున్నది. రాముని గాంధర్వం దానిని భిన్నం చేసింది. లక్ష్మణుడు తన నిశితశరంతో వాని రథధ్వజం నేలకూల్చి, సారథి శిరము ఖండించాడు. లక్ష్మణుని నిశితాయుధం రావణధనుస్సును విరిచేవేళ విభీషణుడు ఆ రథాశ్వాలను నేలకూల్చినాడు.

భగ భగ మండుతూన్న శక్తి విడిచాడు రావణుడు. అది విభీషణాభిముఖంగా వస్తున్నది. అది ప్రళయవేళ కాలమేఘం నుండ వచ్చే పిడుగులావచ్చి అడ్డునిలచిన లక్ష్మణుని వక్షఃస్థలం మీదపడి రక్తం చిమ్మించింది. మూర్ఛపోయాడు సౌమిత్రి. చూచిన రామునికి కన్నీరాగలేదు. క్షణకాలం నిశ్చలంగావుండి ఎదుటనున్న రావణునితో తీవ్రసంగ్రామం ఆరంభించాడు. ఒకకంట తమ్ముని చూస్తూనే వున్నాడు. ఇక్కడ సుగ్రీవాదులు లక్ష్మణుని గుండెలో నాటుకున్న శక్తిని లాగటానికి యత్నిస్తున్నారు. రావణుడు వారిపైకూడ బాణాలు నడుపుతున్నాడు. రాముడే స్వయంగా తన రెండు చేతులతో ఆ శక్తిని పైకిలాగి రెండుముక్కలుచేసి విసరి :

వానరేశ్వరా! మీరు సౌమిత్రి రక్షణలో అప్రమత్తంగా ఉండండి. నేను రావణ సంహారం చేసివస్తాను, అని విజృంభించి :

అరావణ మరామం వా ।
జగత్ ద్రక్ష్యథ వానరాః ॥

రాముడో రావణుడో మిగలాలి, అంతే. ఓ వానర యోధులారా! మీరంతా గిరిశృంగాల మీద నిలబడి చూడండి. నేటితో రావణుడు సరి. రాముడంటే ఏమిటో చూపిస్తాను.

అద్య పశ్యంతు రామస్య
రామత్వం మమ సంయుగే ॥

## రామ రావణ యుద్ధం

ఉభయులూ స్థిరచిత్తులై బాణప్రయోగం ఆరంభించారు. ఉభయులు విడిచే అస్త్రాలూ అంబరవీథిలో ప్రళయయుద్ధం చేసి నేల రాలుతున్నాయి వారి ధనుష్టంకారాలు సర్వలోక భయంకరంగా ఉన్నాయి. ఆ సమయంలో రామబాణ దాటికి ఆగలేక ప్రచండ వాయువులో పలాయనం చేసే మేఘ మయాడు రావణుడు.

అప్పుడు రాముడు తన తమ్ముని చేరి శోకంతో :

సుషేణా! చూశావా వీడు ఎంత బాధపడుతున్నాడో. రక్తసిక్తగాత్రంతో వీడు పడే వేదన నన్ను క్రుంగదీస్తున్నది. దెబ్బతిన్న పాములా విలవిలలాడుతున్న సోదరుని స్థితిచూస్తే నాకు యుద్ధం మీద మనసు పోవడంలేదు ధనుస్సు చెయ్యిజారుతున్నది. బాణాలు చేతిలో నిలవడంలేదు. మనస్సు వ్యాకులమవుతున్నది, అని శోకిస్తూ :

వీడు రాజభోగాలు విడిచి నాతోవచ్చాడు. నేను వీనితో పరలోకం పోతాను. ప్రపంచంలో ఎక్కడయినా భార్య దొరుకుతుంది, బంధువులు సమకూడుతారు కాని, సహోదరుడు – తోడబుట్టిన తమ్ముడు – దొరికేదేశం ఉండదు

దేశే దేశే కళత్రాణి
దేశే దేశే చ బాంధవాః ।
తంతు దేశం న పశ్యామి
యత్ర భ్రాతా సహోదరః ॥

అయోధ్యకువెళ్ళి వారందరికీ ఏం చెప్పను. నా ముఖం ఎలా చూపించను. ఏ జన్మలోచేసిన పాపమో యిది. తమ్ముడూ! సౌమిత్రీ! ఒక్కమాటు నన్నుచూచి నాతో మాటాడు బాబూ, అని విలపిస్తుండగా సుషేణుడు!

ఓ నరశార్దూలా! ఏమిటీ వైక్లబ్యం. ఇలాచూడు. ఈయన మరణించలేదు. అరచేతుల అరుణిమ తగ్గలేదు. ఊపిరి వస్తున్నది. గుండె ఆడుతున్నది, అని హనుమంతుని వైపు తిరిగి :

నాయనా! నువ్వు మళ్ళీ శ్రమపడాలి.

ఆ గిరిశృంగానికి వెళ్ళి దాని దక్షిణశిఖరాన విశల్యకరణి, సావర్ణకరణి, సంధాన కరణి, సంజీవకరణి ఉన్నాయి, వెంటనే తీసుకురా, అన్నాడు.

హనుమంతుడు వెళ్ళాడు. వాటికోసం అన్వేషించే అవకాశంలేక ఆ శిఖరమే మోసుకొని వచ్చాడు. సుషేణుడు ఓషధులుతీసి లక్ష్మణునికి వాసన చూపించాడు.

ఆ గాలిపీల్చిన లక్ష్మణుడు మెల్లిగా శరీరం కదిలించి, లేచి నిలబడ్డాడు. వానరులు హర్షధ్వానాలు చేశారు.

రామ : తమ్ముడూ! చాలు, నీకంటే నాకు ఎవరూ అవసరంలేదు, అని ఆలింగనం చేసుకున్నాడు.

సౌమిత్రి : రామభద్రా! ఏమిటిది! నీముందు రావణుడెంత? నీ పరాక్రమంతో వానిని నేలకూల్చి నీ ప్రతిజ్ఞ నిలుపుకోవాలి. నిశితనఖాల పంజాతో సింహం మత్తేభాన్ని చీల్చినట్లు నువ్వు ఆ అసురుని సంహరించాలి. నువ్వు రాజవంశవీరుడవు. లే! ఈ సాయంసంధ్యలో రావణుడు కడతేరాలి.

తీవ్రక్రోధంతో రాముడు ముందుకు నడిచాడు. రావణుడు రథం మీద ఎదురు వచ్చాడు. రామపర్వతం రావణ బాణవర్షంతో, రావణగిరి రామ శరపరంపరతో వెలుగు తున్నాయి. సర్వలోకాలూ ఆశ్చర్యంతో చూస్తున్నవేళ, రావణుడు రథంమీద రాముడు భూమి మీద నిలబడి చేసే యుద్ధం అసమ సంగ్రామం అని దేవగణాలు అనుకుంటూంటే విన్న దేవేంద్రుడు మాతలిని రథంతో వెళ్ళమన్నాడు.

బాలసూర్యశోభతో ఇంద్రరథం రాముని చేరింది.

మాతలి : రామభద్రా! దేవేంద్రుడు నీ కోసం పంపిన ఈరథం అధిరోహించు. దీనిమీద దివ్యచాపమూ, బాణ,కవచ, తూణీర, శక్తి ఆయుధాలున్నాయి, వీటితో శత్రు సంహారం సాగించు, అన్నాడు.

రాముడు ఆ రథానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి రథం అధిరోహించి నారిసారిం చాడు. భయంకర సంగ్రామం ప్రారంభమయింది. చూపరులకు రోమహర్షణంగా ఉంది.

రావణుని గాంధర్వాస్త్రం రాముని గాంధర్వంతో చల్లబడగా, లంకేశ్వరుడు రాక్షసాస్త్రంతో విషజ్వాలలు క్రక్కే సర్పాలు చుట్టుముట్టగా గరుడాస్త్రంతో రాముడు నిరోధించారు. తిరిగి బాణవర్షం సాగుతున్నది. రావణునిబాణాలు మాతలిని గాయపరిచాయి. రథకేతనాన్ని నేలకూల్చి, గుర్రాలను వేధించాయి.

సూర్యుడు మందరశ్మిలో వడ్డాడు. సముద్రం కల్లోలమయింది. బుధుడు రోహిణిని ఆక్రమించాడు. ఇంద్రాగ్నులు అధిష్ఠానములయిన కోనల నక్షత్రము ధూమకేతువుతో శిరోరహిత మయింది. కుజగ్రహం విశాఖను ఆక్రమించుకుంది.

వింశతిబాహువుల దశకంఠుడు మేరుగిరిలా వున్నాడు. రాముడు క్షణకాలం స్తబ్ధుడై తేరుకొని బొమముడి బిగించి కన్ను లెర్రజేసి అగ్నివలె వెలుగుతూంటే భూమి కంపించింది. సముద్రం కలవరపడింది. ఆకాశం మేఘగర్జనలతో నిండింది. భూతకోటి గజగజలాడింది. రావణుని గుండెలో భీతి పుట్టింది.

మూడు శిఖరాలుకల మహాశూలం అందుకున్నాడు రావణుడు. రాక్షసులు హర్ష ధ్వానాలు చేశారు. రావణుడు సింహగర్జన చేసి : దాశరథీ ! ఇదిగో దీనితో నీ రక్తం నా రాక్షసవీరులకు తర్పణాలుగా యిస్తున్నాను. అని విసిరివాడు. రాముని బాణాలు దానిని అడ్డలేకపోతూంటే, రథం మీది శక్తిని అందుకొని విసరగా దాని ధాటికి రావణశూలం ముక్కచెక్కలయింది. అప్పుడు తగిలిన రాముని బాణాలకు రావణదేహం నిండుగా పూసిన కింశుకవృక్షమయింది.

రామ : రావణా ! నేను లేని సమయంలో నువ్వు సీతను హరించినప్పుడే తెలిసింది నీ పరాక్రమం. అదిచాలక సిగ్గులేక యుద్ధానికి వచ్చావా ! కుబేరుని సోదరుడవే. ఇటువంటి నీచపుపనులు చేస్తావా ! అనుభవించు నీ పాపఫలం. అని బాణపరంపర నడుపుతున్నాడు. రావణుని ఉత్సాహం సన్నగిల్లింది. అది గ్రహించి రథాన్ని రణరంగానికి దూరం చేశాడు రావణసారథి.

అక్కడ రావణుడు తన సారథిచేసిన అవివేకాన్ని నిందించగా వాడు ; ప్రభూ ! గ్రీష్మకాలంలో గో సమూహాలవలె మన అశ్వాలు దెబ్బతిన్నాయి. మీరుకూడా చిత్తవికలులయి కనిపించారు. ఆ సమయంలో వివేకంకల సారథిచేసే పనిచేశాను, అనగా లంకేశ్వరుడు వానిని తన ముంజేతి కంకణంతో అలంకరించి రథాన్ని రణరంగానికి నడపమన్నాడు.

యుద్ధపరిశ్రాంతుడై ఉన్న రాముని సమీపించి అగస్త్యుడు : రామభద్రా ! శత్రు నాశన సమర్థమయిన సనాతనమంత్రం నీకు ఉపదేశిస్తున్నాను. దీన్ని ఆదిత్య హృదయం

అంటారు. పెంగి ప్రదక్షిణ చేసిన దినిని ముమ్మారు పఠించి నువ్వు ధర్మధారివై నిలిస్తే నీకు ఎదిరులేదు, అన్నారు.

మహర్షి మాటను యథాక్షరం పాలించి నారిసారించే వేళకు రావణుడు ఎదురు వచ్చాడు. క్షణాల వ్యవధిలో తుములసంగ్రామం ఆరంభమయింది. రావణుని రథాశ్వాలు కన్నీరు విడుస్తున్నాయి. మేఘాలులేకుండా పిడుగులు పడుతున్నాయి. లంకానగరం జపా పుష్పభరితగిరిలా ఎర్రగా కనిపిస్తున్నది. సర్వశక్తులనూ కేంద్రీకరించి రామ రావణులు పోరుతున్నారు. రామబాణం రావణ రథధ్వజాన్ని ఖండించింది. రావణుని శరవర్షాన్ని రాముడు చిరునవ్వుతో ఎదుర్కొంటున్నాడు.

సారథులిద్దరూ అతికౌశలంతో నడుపుతూ రథాలు దగ్గరగాచేర్చారు. గుర్రాలు ముట్టెలు సోకునంత సమీపానికివచ్చాయి. లోకభయంకరంగా సాగుతున్నది యుద్ధం.

స్వస్తి గో బ్రాహ్మణేభ్యోఽస్తు లోకా స్తిష్ఠంతు శాశ్వతాః ।
జయతాం రాఘవః సంఖ్యే రావణం రాక్షసేశ్వరమ్ ॥

అని దేవగణాలు ఘోషిస్తున్నాయి.

గగనం గగనాకారం సాగరం సాగరోపమః ।
రామ రావణయో ర్యుద్ధం రామ రావణ యోరివ ॥

అంతలో రావణుని శిరసొకటి నేలపై పడింది. కాని ఖండితశిరస్సుస్థానే మరొక శీర్షం కనిపించింది. రాముని నిశితశరాలు మారుమారులు రావణుని శిరసులు నేలరాల్చినా అవి తిరిగిపుడుతూనే వున్నాయి. అదిచూచి మాతలి:

దాశరథీ! ఈ రాక్షసుడు బ్రహ్మాస్త్రానికితప్ప నేలవాలడు, అనగానే రాముడు అస్త్రం సంధించాడు. మేరుమందరా లంత భారంకల, ఆకాశమంత రూపంకల, మంటలు క్రక్కే కోడెనాగువలె అది కదలూతూంటే చరాచర జీవకోటి గజగజలాడింది. అది తీవ్ర వేగంతోవచ్చి రావణుని గుండెలో చేరి చీల్చుకుని వెన్నునుండి దాటి తిరిగివచ్చి రాముని అమ్ములపొదిలో చేరింది. అంతే వజ్రఘాతం తిన్న వృత్రాసురునివలె లంకేశ్వరుడు నేల కొరిగాడు. వానరుల జయజయధ్వానాలు మిన్నుముట్టాయి, సర్వభూతకోటి సాధువాదాలతో ఆనందసూక్తాలు పలించింది.

హంసతూలికాతల్పంమీద సుందరవారిజన సేవలందుతూ సుగంధధూప శోభిత మందిరంలో సుఖంగా శయనించవలసిన మహావీరుడు రాక్షసేశ్వరుడు, అగ్రజుడు రక్తసిక్త

యింత చేసుకున్నావు నా తండ్రి దానవప్రభువనీ, నా భర్త రాక్షసేశ్వరుడనీ సంతోషించె వాను ఈ స్థితి కల్పించావు ముల్లోకాలనూ జయించిన నువ్వు ఈ నాడొక సామాన్యుని చేతిలో నేలకూలి నా సౌభాగ్యం మట్టిలోకలిపావు.

ఒక్కమాట మాట్లాడవయ్యా. పట్టమహిషిని మేలిముసుగు లేకుండా వడివీథిని నడిచి వచ్చావని కోపంగా ఉన్నదా! దండకారణ్యంలో రామలక్ష్మణులను వంచించి సీతను తేవలసిన పిరికితనం నీ కెందుకు వచ్చింది. ఇంద్రియాలను జయించిన తపస్వివి నువ్వే కామాసికిలొంగి ఈ దశకు వచ్చావు. చూడవయ్యా సూర్యుడు ఎంత తీక్షణంగా లంక మీద తన వాడి కిరణాలు ప్రసరిస్తున్నాడో. ఇంతకాలం నన్నే అమరాగంతో చూస్తున్నా ననుకున్నాను. కాని, ఇప్పుడు తెలుస్తున్నది, నీకు వసుంధరమీదనే అధికమయిన అను రాగం ఉన్నదని, అలా విలపించే పట్టమహిషి వక్షఃస్థలం కన్నీటిధారలతో నిండింది. కొంతసేపయాక రాముడు: విభీషణా! వీరందరినీ నగరంలోకి పంపి అంత్యక్రియలు సాగించు, అన్నాడు.

విభీషణుడు: రావణుని వంటి సాధుహింసకునికి అంత్యక్రియలు అవసరమా, అనగా రాముడు: రాక్షసేశ్వరా! ఎంతటి వైరమయినా మరణంతోపోవాలి. పైగా మీ అన్నగారు ఎంతటి మహాయోధుడు. దేవేంద్రాదులను జయించినవాడు. రణరంగంలో వెన్నుచూపని పరాక్రమం కలవాడు. ఆయనకు దహనక్రియలు జరగాలి, అన్నాడు.

మరణాంతాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనం।
క్రియతా మస్య సంస్కారో మమాప్యేష యథాతవ॥

విభీషణుడు లంకలో ప్రవేశించి చందనకాష్ఠాలు తెప్పించి, వేదవిదులను రప్పించి, మణులు ముత్యాలు జల్లిస్తూ, బంగారువల్లకి మీద రావణుని దేహం శ్మశానానికి తెప్పించి చితిముట్టించాడు. అగ్నిసంస్కారం పూర్తికాగానే అందరినీ విభీషణుడు నగరంలోకి పంపి రామదర్శనానికిరాగా, రాముడు లక్ష్మణునితో: తమ్ముడూ నువ్వు వెళ్ళి ఈయనను సింహా సనంమీద అభిషేకించి రా, అన్నాడు.

అన్నగారి ఆజ్ఞానుసారం సౌమిత్రి పట్టాభిషేకం నిర్వర్తించిన అనంతరం విభీషణుడు తన అనుచరులతో రాముని సన్నిధికి వచ్చి మంగళద్రవ్యాలు ఆయన ముందుంచగా, ఆయన స్పృశించి, హనుమంతునివైపు తిరిగి:

మారుతీ! నువ్వు విభీషణ ప్రభువుల అనుమతి తీసుకునివెళ్ళి విదేహరాజనందన క్షేమం తెలుసుకురావాలి. అనగా హనుమ అశోకవనానికివెళ్ళి రాముని కుశలవార్తచెప్పి:

యింత చేసుకున్నావు నా తండ్రి దానవప్రభువనీ, నా భర్త రాక్షసేశ్వరుడనీ సంతోషించే నాకు ఈ స్థితి కల్పించావు ముల్లోకాలనూ జయించిన నువ్వు ఈ నాడొక సామాన్యుని చేతిలో నేలకూలి నా సౌభాగ్యం మట్టిలోకలిపావు.

ఒక్కమాట మాట్లాడవయ్యా. పట్టమహిషిని మేలిముసుగు లేకుండా నడివీథిని నడిచి వచ్చావని కోపంగా ఉన్నదా! దండకారణ్యంలో రామలక్ష్మణులను వంచించి సీతను తేవలసిన పిరికితనం నీ కెందుకు వచ్చింది. ఇంద్రియాలను జయించిన తపస్వివి నువ్వే కామానికిలొంగి ఈ దశకు వచ్చావు. చూడవయ్యా సూర్యుడు ఎంత తీక్ష్ణంగా లంక మీద తన వాడి కిరణాలు ప్రసరిస్తున్నాడో. ఇంతకాలం నన్నే అమరాగంతో చూస్తున్నా వనుకున్నాను. కాని, ఇప్పుడు తెలుస్తున్నది, నీకు వసుంధరమీదనే అధికమయిన అను రాగం ఉన్నదని, అలా విలపించే పట్టమహిషి వక్షఃస్థలం కన్నీటిధారలతో నిండింది. కొంతసేపయాక రాముడు: విభీషణా! వీరందరినీ నగరంలోకి పంపి అంత్యక్రియలు సాగించు, అన్నాడు.

విభీషణుడు: రావణుని వంటి సాధుహింసకునికి అంత్యక్రియలు అవసరమా, అనగా రాముడు: రాక్షసేశ్వరా! ఎంతటి వైరమయినా మరణంతోపోవాలి. పైగా మీ అన్నగారు ఎంతటి మహాయోధుడు. దేవేంద్రాదులను జయించినవాడు. రణరంగంలో వెన్నుచూపని పరాక్రమం కలవాడు. ఆయనకు దహనక్రియలు జరగాలి, అన్నాడు.

మరణాంతాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనం।
క్రియతా మస్య సంస్కారో మమాప్యేష యథాతవ॥

విభీషణుడు లంకలో ప్రవేశించి చందనకాష్ఠాలు తెప్పించి, వేదవిదులను రప్పించి, మణులు ముత్యాలు జల్లిస్తూ, బంగారువల్లకి మీద రావణుని దేహం శ్మశానానికి తెప్పించి చితిముట్టించాడు. అగ్నిసంస్కారం పూర్తికాగానే అందరినీ విభీషణుడు నగరంలోకి పంపి రామదర్శనానికిరాగా, రాముడు లక్ష్మణునితో: తమ్ముడూ నువ్వు వెళ్ళి ఈయనను సింహా సనంమీద అభిషేకించి రా, అన్నాడు.

అన్నగారి ఆజ్ఞానుసారం సౌమిత్రి పట్టాభిషేకం నిర్వర్తించిన అనంతరం విభీషణుడు తన అనుచరులతో రాముని సన్నిధికి వచ్చి మంగళద్రవ్యాలు ఆయన ముందుంచగా, ఆయన స్పృశించి, హనుమంతునివైపు తిరిగి:

మారుతీ! నువ్వు విభీషణ ప్రభువుల అనుమతి తీసుకునివెళ్ళి విదేహరాజనందన క్షేమం తెలుసుకురావాలి. అనగా హనుమ అశోకవనానికివెళ్ళి రాముని కుశలవార్తచెప్పి:

అమ్మా! ఇప్పుడు నువ్వు స్వగృహంలో ఉన్నట్లే భావించు. విభీషణులు నిన్ను చూడ డానికి వస్తారన్నారు.

సీత : ఇంతటి సంతోషకరవార్త తెచ్చిన నిన్ను ఏమని ప్రశంసించాలో బోధపడటం లేదు.

హనుమ : మీకు సంతోషం కలిగించడంకంటె నేను కోరేది లేదమ్మా. అనుమతిస్తే ఈ రాక్షస స్త్రీలను క్లేశాలపాలు చేస్తాను.

సీత : మారుతీ ! వీరంతా ప్రభుసేవాపరాయణులు. వారిదోషం లేదు. అందుచేత వారిని శిక్షించడం అనుచితం. నువ్వువెళ్ళి నేను రామభద్రుని చూడగోరుతున్నానని చెప్పు, అంది.

తిరిగివచ్చి హనుమంతుడు సీతాసందేశం వినిపించగా రాముడు క్షణకాలం కనులు మూసుకున్నారు. అనంతరం ఆయన అర్ధ్రనయనాలతో : విభీషణా ! జానకినిస్నానం చేయించి దివ్యాంబరాభరణాలంకృతంగా తీసుకురావాలి, అన్నారు.

విభీషణుడు రాముని ఆజ్ఞ అక్షరాల పాటించి, రాక్షసయోధుల రక్షణలో రత్నాల పల్లకిమీద తీసుకువస్తున్నారు, పెద్దతలపాగలవారు, పొన్నుబెత్తాలవారు, తప్పెటవాద్యాల వారు దారిలో వున్న వానర భల్లూకవీరులను, పక్కలకు నెట్టుతున్న కలవరం విన్నారు రాముడు. తీవ్రప్రభంజనంలో సాగరతరంగఘోషలా వారికల్లోలం చెవినపడగానే : విభీషణా ! ఏమిటిది. నాకు స్వజనం వీరందరూ. ఎందుకు వారిని వేధిస్తున్నావు.

నారీజనానికి శీలం, ప్రవర్తన అనే ఆవరణలు ఎప్పుడూ ఉంటాయి. అంతే ! ప్రాకారాలు, పరదాలు వారిని రక్షించవు. కష్టాలలో, యుద్ధ సమయంలో, స్వయంవర వేళలో, శుభకార్యాలలో స్త్రీలను అందరూ చూడవచ్చు. ఇప్పుడావిడ మహావిపత్తుల నుండి బయటపడింది. వీరంతా ఆమెను చూడాలనుకుంటున్నారు పల్లకిదిగిరమ్మను, అన్నారు.

అంతే, విభీషణుడు రామాజ్ఞ పాటించాడు, లక్ష్మణ, సుగ్రీవ, హనుమంతులకు రాముని మాటలు బాధ కలిగించాయి. జానకి ముడుచుకుపోయి విభీషణుని వెనకనే రామునిదగ్గరకు వచ్చింది.

రామ దర్శనంతో ఆమె ముఖం చంద్రోదయవేళ చంద్రకాంతశిలవలె కాంతిమయ మయింది.

రాముడు: భద్రే! రావణుడుచేసిన అవమానానికి ప్రతీకారం చేశాను, నా పౌరుషం లోకవిఖ్యాత మయింది. హనుమంతుని శ్రమ ఫలించింది. సుగ్రీవుని మంత్రాంగం ఫలించింది. విభీషణుని కష్టం సఫలం చేశాను, అంటూంటే సీత కన్నులు తడిశాయి. రాముని మనసులో ప్రజాపవాదశంక ప్రవేశించి :

జానకీ! మహాతపస్వి అగస్త్యులవారు దక్షిణదిక్కును జయించినట్లు నేను రావణుని జయించాను. అయితే యిదంతా నీకోసం చేశాననుకోకు. నా వంశగౌరవంకోసం చేశానంతే. ఇప్పుడు నీ శీలాన్ని విశ్వసించలేను రోగగ్రస్త నేత్రాలకు దీపం ఎలా ఉంటుందో అలా వున్నావు నువ్వు నాకు, నీయిష్టంవచ్చిన చోటికి వెళ్ళు.

పరగృహం - అందునా రావణునివంటి వానియింట వున్న నిన్ను, ఆ కామాంధుని ఒడిలో కూర్చుని వచ్చిన నిన్ను గ్రహిస్తే నా వంశగౌరవం ఏమవుతుంది. ఇదిగో లక్ష్మణుడున్నాడు. కాదంటే భరత శత్రుఘ్ను లున్నారు. వానరేశ్వరుడు సుగ్రీవుడున్నాడు. లంకాధిపతి విభీషణు డున్నాడు. వీరిలో నీ మనసు ఎవరిమీద ఉంటే వారితో వెళ్ళు అన్నాడు.

ఆ మాటవిన్న జానకి కన్నీరు మున్నీరయింది. మత్తేభం తన కుండాలతో చుట్టబెట్టి విదరిన లతలా అయింది. సిగ్గుతో తలదించుకుంది. గుండె అదరుతున్నది. కొంతసేపటికి తేరుకొని కన్నీరు ఒత్తుకుంటూ :

ఓ మహావీరుడా! పరమసామాన్యుడు మాట్లాడినట్లు పలుకుల ములుకులతో ఎందుకు వేధిస్తావు.

ఎవరో కొందరు స్త్రీలను ఆధారం చేసుకొని శంకించకు. నా శీలంమీదఒట్టుపెట్టి చెపుతున్నాను. నా శరీరం పరపురుషస్పర్శకు లోనయిననాడు నాదేహం నా వశంలోలేదు. నా అధీనంలోవున్న హృదయం మాత్రం నిన్నే ఆరాధిస్తున్నది. నీతో కలిసి అంతకాలం కాపురం చేశాను. అయినా నా హృదయం గ్రహించలేదా. నువ్వు హనుమంతుని పంపిననాడు ఈ సందేశం పంపితే నాడే నేను ప్రాణాలు వదిలేదానిని. ఈ యుద్ధమే అవసరమయేదికాదు, అంటూ కన్నీరు కారుస్తూనే లక్ష్మణుని వయిపు తిరిగి:

సౌమిత్రీ! ఈ రోగానికి ఒకటే చికిత్స. చితి పేర్చు. ఈ మిథ్యాపవాదంతో నేను బ్రతకలేను. అగ్నిప్రవేశమే నాకు శరణ్యం, అనగా లక్ష్మణుడు అన్నగారిముఖం చూచి చితిపేర్చి నిలబడ్డాడు. జానకి రామునికి ప్రదక్షిణంచేసి, దేవ, విప్రగణాలకు నమస్కరించి, అగ్నిహోత్రునికి చేతులు జోడించి :

నా మనస్సు రామునియందే లగ్నమయివుంటే, నా త్రికరణములూ రామునివశంలో వుండివుంటే ఈ అగ్ని నన్ను దహించదు, అంటూ జ్వాలామాలల మధ్యంలోకి ప్రవేశించింది. అందరూ తెల్లబోయి చూస్తున్నారే తప్ప ఒక్కరూ రాముని ఎదుటకు వెళ్ళి మాట్లాడేవారే లేకపోయారు. రాక్షస, వానరవీరులు, స్త్రీలు హాహారవాలు చేస్తూంటే, రాముని కన్నులు బాష్పపూర్ణము లయాయి.

దిక్పాలకులు, త్రినేత్రుడు, ప్రజాపతి అందరూ దిగివచ్చి రామవా! సర్వలోక కారణభూతుడవు, జ్ఞానివి, జానకి అగ్నిప్రవేశం చేస్తూంటే ఉపేక్షిస్తున్నావా. సత్యస్వరూపా! ఆది మధ్యాంత రహితా! రుద్రరూపా! సర్వేశ్వరా! నువ్వే యిలా ప్రవర్తిస్తావా! అనగా రాముడు:

ఆత్మానం మానుషం మన్యే
రామం దశర థాత్మజం।

నేను దశరథరాజ నందుడను మానవుడను. మీరంతా అనే దేమిటో నాకు తెలియడంలేదు, అనగా చతుర్ముఖుడు:

సత్యపరాక్రమా! నువ్వు లక్ష్మీవల్లభుడవు. నారాయణుడవు, హృషీకేశుడవు, పురుషోత్తముడవు. జగత్కారణుడవు, జగద్రూపుడవు, రావణవధకోసం ఈ రూపంధరించావు. ముల్లోకాలకూ శాంతి చేకూర్చావు, అన్నాడు.

అప్పుడు అగ్నిహోత్రుడు రెండుచేతులతో జానకిని తీసుకొని ఈవలకు వచ్చాడు. తప్తకాంచనభూషణాంగి జానకీదేవి తరుణసూర్య కాంతితో వసివాడకుండావున్నది. ఆమెను రాముని ముందుంచి అగ్ని:

రామభద్రా! ఈమె త్రికరణశుద్ధిగా నిన్నే ఆరాధిస్తున్నది. ఈ మనసులో మరెవరూ లేరు. సర్వలోకాలనూ పవిత్రం చెయ్యగల శీలవతి, విశుద్ధ చరిత్రకల ఈమెను స్వీకరించు, అనగా రాముని కన్నులు ఆనందబాష్ప పూర్ణములయాయి.

స్వాహావధూవల్లభా! ఈ విదేహరాజనందన నిష్కళంకశీల అనీ, నన్నే త్రికరణ శుద్ధిగా ఆరాధిస్తున్నదనీ, దుష్టచిత్తుడయిన రావణుని నిరోధించగల పాతివ్రత్య తేజస్విని అనీ నే నెరుగుదును. కాని లోకం ఉన్నదే అది విశ్వసించాలి. దీర్ఘకాలం రావణాంతఃపురంలో ఉన్న స్త్రీని దాశరథిచేపట్టాడని వేలెత్తి చూపకుండా ఉంటారా. అందుకే యింత పరుషంగా ప్రవర్తించాను, నాకు తెలుసు, జానకి పాతివ్రత్య జ్వాలారూపిణి అని, ఇప్పుడింక ముల్లోకాలూ ఈమె తేజశ్శీలాలను కీర్తిస్తాయి, అన్నాడు.

ప్రసన్నవదనంమీద శుచిస్మితంతో నిలచిన రామభద్రుని చూచి చర్మాంబరధారి పరమశివుడు:

జగదేకవీరా! ధర్మభృతాంవరా! లోకాలను ఆవరించిన రావణాంధకారాన్ని ఆ క్రూరాత్ముని విషజ్వాలలను పటాపంచలుచేసి చతుర్దశభువనాలలో ఉషశ్శ్రీరోచులు వెల యింపజేశావు.

రామభద్రా! రాక్షసవిషవృక్షం సమూలం నేలకూలి భస్మమయింది. నీ దయా వీరకల్పవృక్షఛాయలలో నిఖిలలోకాలూ ఆనందామృతం అందుకున్నాయి. ఇప్పుడింక బయలుదేరి నీ రాకకోసం ఎదురుచూసే భరతునీ, మిగిలిన బాంధవులనూ కలసి వారికి ఆశ్వాసన యివ్వాలి, అన్నారు.

అనంతరం మహేంద్రుడు: రాఘవా! లోకాలకు కంటకుడయిన రావణుని పీడా విషం ఉపశమింపజేసిన నీ వీరకృత్యానికి సత్కారం జరపాలనుకుంటున్నాం, అనగా:

దేవేంద్రా! ఈ భల్లూక, వానరయోధులు రాక్షసపీడా నివారణకు నాకు సహకరించారు. వారందరికీ ప్రాణదానం జరగాలి, అనగా ఇంద్రుడు రామునికోరిక నెరవేర్చి సెలవు తీసుకున్నాడు.

సాయంసంధ్యారోచులు సన్నగిల్లి చల్లగాలులతో యామినీదేవి సీతారాములకు సుఖనిద్ర అనుగ్రహించింది.

ఉదయాద్రిమీద ఉషశ్శ్రీలు వెల్లివిరిసేవేళ విభీషణుడు వచ్చి: రామభద్రా! వెలుగురేకులు విచ్చుతూ సూర్యపద్మం విరుస్తున్నది. ఉదయసంధ్యాకాంత అరుణ హేమాం బరాలతో ప్రాణికోటికి ఆశ్వాసన పలుకుతూ మేలుకొలుపులు పాడుతున్నది. మంగళ కలశాలలో పవిత్రజలాలు నీ స్నానార్థం సిద్ధంచేసి లంకానగర సుందరీమణులు నిన్ను జలకా లాడించడానికి వేచివున్నారు.

అనగా రాముడు నవ్వుతూ: నెచ్చెలీ! అయోధ్య చేరి భరతుని చూచేవరకూ నా కీ రాజలాంఛనాలేమీ అవసరంలేదు. ఈ సుగ్రీవాదు లందరినీ ఉచితరీతిని సత్కరించు. అయోధ్య ఎలా చేరడమా అన్నదే యిప్పుడు నా ఆలోచన.

విభీషణుడు: రామభద్రా: ఆ పని క్షణాలలో అవుతుంది. మా పుష్పకంమీద వెళ్ళవచ్చు. కాని స్నేహలాంఛనంగా నాతో కొన్నాళ్ళు గడపాలి, యిది మిత్రవాంఛ.

రాముడు: విభీషణా! నీ సౌహార్దం నే నెరుగుదును. అయితే నా మనస్సంతా అయోధ్యా పౌరులమీద ఉన్నది. మా అమ్మ కౌసల్య, మా పిన్ని కైకేయి మా సుమిత్ర, నా సోదరులు....వీరందరినీ చూడాలనే ఉత్కంఠ అధికమౌతున్నది

విభీషణుడు మారుమాటాడక వానర భల్లూక వీరులందరికి ఉచితరీతిని మర్యాదలు నడిపి, మణిభూషణాలు కానుకలుగా యిచ్చి తృప్తులనుచేసి పుష్పకాన్నిరప్పించాడు.

# ప ట్టా భి షే క ం

రామభద్రుడు జానకీ పాణిగ్రహణంచేసి పుష్పకం ఎక్కించాడు. వెనుకనే ధనుర్ధారి లక్ష్మణుడు వచ్చాడు.

రాముడు : సుగ్రీవా నీ మిత్రధర్మం నువ్వు నిర్వర్తించావు. ఇంక సుఖంగా కిష్కింధ ఏలుకో. విభీషణా ! ఈ లంకారాజ్యాన్ని శాంతంగా పాలించు, అన్నాడు.

అప్పుడు వారుభయులూ తమకుకూడా అయోధ్యను దర్శించాలనే కోరిక ఉన్నదనగా రాముడు చిరునవ్వుతో అంగీకరించాడు. వానర, భల్లూక, రాక్షసవీరులందరూ పుష్పకం అధిరోహించారు. పుష్పకం హంసలా లేచింది. ఆకాశవీథిని అయోధ్యాభిముఖంగా సాగుతున్నది. అప్పుడు రాముడు :

జనకరాజపుత్రీ! చూస్తున్నావా! త్రికూటగిరిమీద వ్యాపించిన లంకానగరం, దీనిని దేవశిల్పి విశ్వకర్మ నిర్మించాడు. ఇదిగో ఇది రణరంగం. మహాయోధుల రక్త మాంసాలతో భూదేవి తృప్తిపడింది. అదిగో అక్కడ రావణుడు నాచేతులలో నేలకూలాడు. కుంభకర్ణుడు ఆ ఎగువన కూలాడు. మన సౌమిత్రి చేతులలో ఇంద్రజిత్తు పడిన చోటు ఇది. అకంపన ధూమ్రాక్షులు మన హనుమ పిడికిలి పోట్లతో ఇక్కడ మరణించారు. మకరాక్షుని యిక్కడ వధించాను. అరుగో కుంభ, నికుంభ, అతికాయ, మహాకాయాది రాక్షసవీరులు.

అప్పుడే మనం సాగరం దాటుతున్నాం. ఇది సేతువు. అది హిరణ్యనాభగిరి, మన హనుమకు సత్కారాలు జరిపిన వాడాయన. మనం సముద్రం దాటివచ్చాం. ఈ ఇసుక తిన్నెలమీద మూడు అహోరాత్రులు దర్భశయనం మీద సాగరతరణం దీక్షలో ఉన్నాను. ఇక్కడే విభీషణుడు శరణువేడినాడు. అదిగో కిష్కింధ చేరుతున్నాం. సుగ్రీవునితో సఖ్యంచేసిన ప్రదేశమిది. అక్కడ వాలిని నేలకూల్చాను, అనగానే జానకీ దేవి : మనం తారాదేవితో యితర వానరవీరుల పత్నులనుకూడా అయోధ్యకు తీసుకువెళదాం అనగానే సుగ్రీవాజ్ఞతో తార తన వారందరినీ క్షణాలలో విమానం ఎక్కించింది. పుష్పకం సాగుతున్నది.

రాముడు : జానకీ! ఇది ఋష్యమూకం. ఆ ఎగువన హనుమ ముందుగా నన్ను కలిశాడు. అదిగో పంపాతీరం. అది మతంగ మహర్షి ఆశ్రమం. ధర్మశీల శబరి యిక్కడే మాకు ఆతిథ్య మిచ్చింది. అదిగో కబంధుని వధించిన ప్రాంతం. తాత జటాయువు నీకోసం రావణుని చేతులలో ప్రాణాలు విడిచిన ప్రదేశమిది. అదిగో! పవిత్ర గోదావరి నదీమ తల్లి. మనం పంచవటి దాటుతున్నాం. అగస్త్య మహర్షి ఆశ్రమం అదే! సుతీక్ష్ణాశ్రమం ప్రవేశిస్తున్నాం. శరభంగులను చూచిన పవిత్రసలం దాటి అత్రి

మహర్షి ఆశ్రమం చేరుతున్నాం. ఇక్కడే వృద్ధతపస్విని అనసూయాదేవిని నువ్వు సేవించావు. చిత్రకూటం వస్తున్నది. మా తమ్ముడు భరతుడు యిక్కడకే వచ్చాడప్పుడు. దూరంగా కనబడుతున్నది మహాముని భరద్వాజుల ఆశ్రమం. గంగాతరంగిణిని చూడు. అదిగో ఆ తీరాన శృంగిబేరపురం. నా బాల్యమిత్రుడు గుహుడు అక్కడే ఉంటాడు, అంటూ భరద్వాజాశ్రమం దగ్గర పుష్పకం దింపి రాముడు మహర్షిని దర్శించి అభివాదాలర్పించి: స్వామీ! అయోధ్యలో మా సోదరుడు కుశలమా. కోసలదేశవాసులు శాంతి సౌఖ్యాలతో వున్నారా, అనగా మహర్షి దరహాసంతో:

రాఘవా! మీతమ్ముడు నీ ఆజ్ఞానుసారం సాగుతున్నాడు. జటావల్కలాలు ధరించి పాదుకలను ముందుంచుకొని నీ రాకకోసం ఎదురుచూస్తున్నాడు ఆనాడు నువ్వు సర్వ రాజభోగాలువిడచి వనవాసానికి వెడుతూంటే నా మనసు బాధపడింది. ఇప్పుడు శత్రుసంహారం చేసి మిత్రులతో వచ్చావు. చాలా సంతోషంగా ఉంది మహర్షుల ప్రార్థనపై రాక్షస సంహారదీక్ష వహించావని విని ఎంతో ఆనందించాను. ఈపూట నా ఆతిథ్యం తీసుకుని రేపు వెళ్ళవచ్చు. మానవాళికి రాక్షసపీడ తొలగించిన నీకు వరమివ్వాలనివుంది, అనగా రాముడు: మహర్షీ! కోసలదేశంలోని లతావృక్షాలు నిరంతరం పుష్పఫల సమృద్ధితో ఉండే వరం అనుగ్రహించండి, అన్నాడు. భరద్వాజుల చల్లని చూపులతో రాముని కోరిక నెరవేరింది. వానరులందరూ ఆ ఫలాలను ఆరగిస్తూండగా రాముడు: మారుతీ! నువ్వు ఈ క్షణమే బయలుదేరి శృంగిబేరపురంలో గుహుని కలిసి నా క్షేమవార్త చెప్పి అయోధ్యచేరి నా కుశలం నివేదించి, సీతాపహరణం మొదలుగా రావణ సంహారంవరకూ జరిగిన విషయాలన్నీ భరతునికి నివేదిస్తూ, ఆ సమయంలో భరతుని మనసు ఎలావున్నదో అతని ఆకారాన్ని బట్టిగ్రహించి రావాలి.

చతురంగబల సమన్వితమూ, సర్వ సస్యసమృద్ధమూ అయిన రాజ్యం ఎటువంటి వాని మనసునయినా వంచించవచ్చు. ఆ కాంక్ష వానికివుంటే మనం అయోధ్యకు వెళ్ళవసరంలేదు. మేమిక్కడనుంచి కదలకుండా మనకు వాని ఇంగితం తెలియాలి, అన్నాడు.

హనుమంతుడు గగనానికిలేచి శృంగిబేరపురం చేరి గుహునికి వార్తచెప్పి, కోసల జనపదాలు చూస్తూ గోమతీ నదివిదాటి నందిగ్రామం చేరాడు. అయోధ్యకు క్రోసెడు దూరంలో నందనవనంలా వున్నచోట భరతుని ఆశ్రమం చేరాడు.

కృష్ణాజినధారియై, ఉపవాసకృశీభూతదేహుడైవున్న భరతుని చూడగానే హనుమంతునికి ఆయన హృదయం అర్థమయింది. ఆయనతోపాటు చతురంగబలాల అధిపతులున్నూ, కాషాయాంబరాలతోనే వున్నారు. మనోహర ప్రశాంతావరణంలో ధర్మస్వరూపం వలె ఉన్న భరతుని సమీపించి:

వెన్ను నిమిరాడు. విభీషణ, సుగ్రీవులు ఆనందాశ్రువులు రాల్చారు. రామాజ్ఞతో పుష్పక విమానం కుబేరుని దగ్గరకు చేరింది. అందరూ భరతుని ఆశ్రమం చేరారు. భరతుడు చేతులు జోడించి :

రామభద్రా! మా అమ్మమీద గౌరవంతో నాకిచ్చిన ఈ రాజ్యభారాన్ని నేను వహించలేను. అశ్వగమనం గార్దభానికి రాదు. హంసవేగాన్ని వాయసం అందుకోలేదు. మనిద్దరి మధ్య ఇంతభేదం ఉంది అన్నాడు. శత్రుఘ్నుని ఆజ్ఞానుసారం రామునికి శ్మశ్రుముండనం జరిగింది. పరిశుభ్రంగా స్నానం చేయించారు. చిత్రమాల్యాను లేపనాలతో అలంకరించారు. లక్ష్మణునికి కూడా ఇవన్నీ జరిపారు. కౌసల్యాదేవి స్వయంగా సీతను స్నానంచేయించి అలంకరించింది. సూర్యతేజస్సుతో వెలిగే రథాన్ని సుమంత్రుడు కొనివచ్చాడు. రాముడు అధిరోహించాడు. సుగ్రీవ, విభీషణ, హనుమంత, జాంబవదాదులు నూతనాలంకారాలతో శోభిస్తూ వస్తున్నారు. వానర నారీజనం సీతవెంట బయలుదేరింది. పురోహితులు స్వస్తి వాక్యాలతో రామభద్రుని అయోధ్యకు కొనివచ్చారు. భరతుడే సారథిగా ఉన్నాడు. శత్రుఘ్నుడు శ్వేతచ్ఛత్రం పట్టాడు. లక్ష్మణ విభీషణులు వింజామరలు పుచ్చుకున్నారు. శత్రుంజయ భద్రగజం మీద సుగ్రీవుడు ముందు సాగుతున్నాడు. వానరులందరూ మానవరూపాలతో ఏనుగుల మీద బయలుదేరారు.

పట్టాభిషేక ముహూర్తం నిశ్చయమయింది. శత్రుఘ్నుని మాటమీద సుగ్రీవ, జాంబవంత, హనుమంత, ఋషభులు సువర్ణ ఘటాలతో నదీ నద సాగరజలాలను కొని వచ్చారు. తెలతెలవారుతూండగా వశిష్ఠమహర్షి విప్రశేష్ఠులతో వచ్చి సీతారాములను రత్నమయపీఠం మీద కూర్చుండబెట్టారు. పవిత్ర జలాలతో అందరూ అభిషేకిస్తున్నారు.

వేదవేత్తలు మంత్రపాఠం సాగిస్తున్నారు. బ్రహ్మ నిర్మితమైన మనువు ధరించిన రత్నకిరీటాన్ని వశిష్ఠులవారు రాముని శిరస్సుపై ఉంచారు. ఋత్విక్కులందరూ ఇతర రాజభూషణాలతో రాముని అలంకరించారు. శత్రుఘ్నుడు వెల్లగొడుగు పట్టగా సుగ్రీవ విభీషణులు శ్వేత చామరాలు అందుకున్నారు. గంధర్వగానం, అప్సరోనృత్యం ఆరంభమయ్యాయి.

భూదేవి సస్యశ్యామలమయింది, వృక్షాలన్నీ ఫలభారంతో వంగాయి. రాముడు గో వృషభ అశ్వదానాలతో మణి రత్న సువర్ణ దానాలు చేశాడు.

సూర్యకిరణ కాంతితో ఉండే మణిమాలను సుగ్రీవునికి, వైడూర్యఖచితమైన హారాన్ని అంగదునికి ఇచ్చాడు రాముడు. చంద్రకాంతులీనే మణిహారాన్ని రాముడు సీత మెడలో వేయగా, ఆమె ఆ హారాన్ని పైకితీసి రామునివైపు తదేకంగా చూసింది.

అది గ్రహించి రాముడు నీకు ఎవరిమీద ఎక్కువ అభిమానం వుందో వారికి ఇయ్యి అన్నాడు. ఉత్తరక్షణంలో సీత హనుమంతునికి బహూకరించింది. అనంతరం విభీషణ,

వెన్ను నిమిరాడు. విభీషణ, సుగ్రీవులు ఆనందాశ్రువులు రాల్చారు. రామాజ్ఞతో పుష్పక విమానం కుబేరుని దగ్గరకు చేరింది అందరూ భరతుని ఆశ్రమం చేరారు. భరతుడు చేతులు జోడించి:

రామభద్రా! మా అమ్మమీద గౌరవంతో నాకిచ్చిన ఈ రాజ్యభారాన్ని నేను వహించలేను. అశ్వగమనం గార్దభానికి రాదు. హంసవేగాన్ని వాయసం అందుకోలేదు. మనిద్దరి మధ్య ఇంతభేదం ఉంది అన్నాడు. శత్రుఘ్నుని ఆజ్ఞానుసారం రామునికి శ్మశ్రుముండనం జరిగింది. పరిశుభ్రంగా స్నానం చేయించారు. చిత్రమాల్యాను లేపనాలతో అలంకరించారు. లక్ష్మణునికి కూడా ఇవన్నీ జరిపారు. కౌసల్యాదేవి స్వయంగా సీతను స్నానంచేయించి అలంకరించింది. సూర్యతేజస్సుతో వెలిగే రథాన్ని సుమంత్రుడు కొనివచ్చారు. రాముడు అధిరోహించారు. సుగ్రీవ, విభీషణ, హనుమంత, జాంబవదాదులు నూతనాలంకారాలతో శోభిస్తూ వస్తున్నారు. వానర నారీజనం సీతవెంట బయలుదేరింది. పురోహితులు స్వస్తి వాక్యాలతో రామభద్రుని అయోధ్యకు కొనివచ్చారు. భరతుడే సారథిగా ఉన్నాడు. శత్రుఘ్నుడు శ్వేతచ్ఛత్రం పట్టాడు. లక్ష్మణ విభీషణులు వింజామరలు వుచ్చుకున్నారు. శత్రుంజయ భద్రగజం మీద సుగ్రీవుడు ముందు సాగుతున్నాడు. వానరులందరూ మానవరూపాలతో ఏనుగుల మీద బయలుదేరారు.

పట్టాభిషేక ముహూర్తం నిశ్చయమయింది. శత్రుఘ్నుని మాటమీద సుగ్రీవ, జాంబవంత, హనుమంత, ఋషభులు సువర్ణ ఘటాలతో నదీ నద సాగరజలాలను కొనివచ్చారు. తెలతెలవారుతూండగా వశిష్ఠమహర్షి విప్రశేష్ఠులతో వచ్చి సీతారాములను రత్నమయపీఠం మీద కూర్చుండబెట్టారు. పవిత్ర జలాలతో అందరూ అభిషేకిస్తున్నారు.

వేదవేత్తలు మంత్రపాఠం సాగిస్తున్నారు. బ్రహ్మ నిర్మితమైన మనువు ధరించిన రత్నకిరీటాన్ని వశిష్ఠులవారు రాముని శిరస్సుపై ఉంచారు. ఋత్విక్కులందరూ ఇతర రాజభూషణాలతో రాముని అలంకరించారు. శత్రుఘ్నుడు వెల్లగొడుగు పట్టగా సుగ్రీవ విభీషణులు శ్వేత చామరాలు అందుకున్నారు. గంధర్వగానం, అప్సరోనృత్యం ఆరంభమయ్యాయి.

భూదేవి సస్యశ్యామలమయింది, వృక్షాలన్నీ ఫలభారంతో వంగాయి. రాముడు గో వృషభ అశ్వదానాలతో మణి రత్న సువర్ణ దానాలు చేశాడు.

సూర్యకిరణ కాంతితో ఉండే మణిమాలను సుగ్రీవునికి, వైడూర్యఖచితమైన హారాన్ని అంగదునికి ఇచ్చాడు రాముడు. చంద్రకాంతులీనే మణిహారాన్ని రాముడు సీత మెడలో వేయగా, ఆమె ఆ హారాన్ని పైకితీసి రామునివైపు తదేకంగా చూసింది.

అది గ్రహించి రాముడు నీకు ఎవరిమీద ఎక్కువ అభిమానం వుందో వారికి ఇయ్యి అన్నాడు. ఉత్తరక్షణంలో సీత హనుమంతునికి బహూకరించింది. అనంతరం విభీషణ,

జాంబవంతాదు లందరికీ సువర్ణ, రత్నాభరణాలు బహూకరించాడు రాముడు. ఉత్సవం పూర్తి అయింది. సుగ్రీవ విభీషణాదులు సెలవుతీసుకుని తమ తమ నగరాలకు వెళ్ళారు.

యువరాజపీఠం అలంకరించమని రాముడు లక్ష్మణుని బ్రతిమాలాడు. అంగీకరించకపోవటంతో భరతుణ్ణి మారు మాటాడనివ్వక ఆ పీఠం మీద అభిషేకించారు.

ప్రజాక్షేమం ప్రధానదృష్టిగా రాముడు పౌండరీక, వాజపేయ, అశ్వమేధయాగాలతో దేవతాతృప్తి కలిగించాడు. రామరాజ్యంలో అనాథలు లేరు. చోర, సర్ప భీతిలేదు. వృద్ధులు తమ బిడ్డలకు ప్రేతకార్యం చేసే ప్రసక్తి లేదు.

అందరూ ధర్మపరులే. సత్యవాక్పాలకులే.
లోభ వివర్జితులే. దాన పరాయణులే.
అలా రాముడు ఆదర్శపాలకు డయ్యాడు.

కుటుంబవృద్ధిం ధనధాన్య వృద్ధిం
స్త్రియశ్చ ముఖ్యాః సుఖ ముత్తమం చ।
శ్రుత్వా శుభం కావ్య మిదం మహార్థం
ప్రాప్నోతి సర్వాం భువి చార్థ సిద్ధిమ్ ॥

ఆయుష్య మారోగ్యకరం యశస్యం
సౌభ్రాతృకం బుద్ధికరం శుభం చ।
శ్రోతవ్య మేత న్నియమేన సద్భిః
ఆఖ్యాన మోజస్కర మృద్ధి కామైః ॥

స్వస్తి

ఓం శాంతిః శాంతిః శాంతిః

# రామాయణం చదవకండి!

సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నంతకాలం రామకథను వింటూనే ఉంటారు. మానవప్రాణి గాలి పీలుస్తున్నంతకాలం రామ నామస్మరణ తప్పదు.

అయితే కొందరు భక్తితో చేస్తే, మరికొందరు ద్వేషంతో సాగిస్తారు. ఎవరికయినా రాముడే ధ్యేయం. అలావే రామ కథను పాడుకుంటున్నారు, దేశ దేశాల ప్రజలు తమ భాషలలో. గతితార్కికభౌతికవాదులు కూడా సీతారాముల కథను నృత్యరూపకంగా దర్శించి పులకిస్తున్నారు.

అయినా కొందరు —

రావణుని ఐశ్వర్య సౌందర్యాలకు లొంగని సీతను చూచి భయపడి,

కోసలరాజ్య సంపదను వీడి అడవులకు ఆనందంగా వచ్చిన రాముని చూచి సహించలేక,

ఈ మహాకావ్యంమీద మసి పుయ్యడానికి ప్రయత్నిస్తున్నారు, వెలుతురును చూడలేని గుడ్లగూబలు సృష్టిలోనే వున్నాయి. ఉషః కాంతులకు పులకించి కలస్వనాలు చేసే శుక, పిక, సంతతులూ వున్నాయి. అంతే భేదం!

రామాయణ సాగరంలో మునిగి మణులూ, రత్నాలూ తెచ్చుకోగలవారూ వున్నారు. ఒడ్డున నిలిచి వత్తగుల్లలే ఏరుకుంటా మనే వారికి దూరంగా నిలిచి నమస్కారం!

అద్భుత ఫల ప్రదాయకమైన

# శ్రీరామ రక్షా స్తోత్రమ్.

ఓం అస్య శ్రీరామ రక్షాస్తోత్ర మంత్రస్య బుధకౌశిక ఋషిః శ్రీ సీతారామచంద్రో దేవతా అనుష్టుప్ ఛందః సీతా శక్తిః శ్రీమాన్ హనుమాన్ కీలకం శ్రీరామచంద్ర ప్రీత్యర్థే రామరక్షా స్తోత్ర జపే వినియోగః.

## * ధ్యానమ్ *

ధ్యాయే దాజానుబాహుం ధృతశర ధనుషం బద్ధ పద్మాసనస్థం
పీతం వాసోవసానం నవకమలదళస్పర్ధి నేత్రం ప్రసన్నమ్
వామాంకారూఢ సీతాముఖకమల మిలల్లోచనం నీరదాభం
నానాలంకార దీప్తం దధత మురుజటామండలం రామచంద్రమ్.

## * స్తోత్రమ్ *

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్. 1
ధ్యాత్వా నీలోత్పలశ్యామం రామం రాజీవలోచనమ్
జానకీ లక్ష్మణోపేతం జటామకుట మండితమ్. 2
సాఽసితూణ ధనుర్బాణపాణిం నక్తంచరాంతకమ్
స్వలీలయా జగత్త్రాతు మావిర్భూతమజం విభుమ్. 3
రామరక్షాం పఠేత్ప్రాజ్ఞః పాపఘ్నీం సర్వకామదామ్
శిరో మే రాఘవః పాతు ఫాలం దశరథాత్మజః. 4
కౌసల్యేయో దృశౌపాతు విశ్వామిత్రః ప్రియః శ్రుతీ
ఘ్రాణం పాతు మఖత్రాతా ముఖం సౌమిత్రివత్సలః. 5
జిహ్వాం విద్యానిధిః పాతు కంఠం భరత వందితః
స్కంధౌ దివ్యాయుధః పాతు భుజౌ భగ్నేశ కార్ముకః. 6
కరౌ సీతాపతిః పాతు హృదయం జామదగ్న్యజిత్
మధ్యం పాతు ఖరధ్వంసీ నాభిం జాంబవదాశ్రయః.

సుగ్రీవేశః కటీపాతు సక్థినీ హనుమత్ప్రభుః
ఊరూ రఘూత్తమః పాతు రక్షఃకుల వినాశకృత్. 8
జానునీ సేతుకృత్ పాతు జంఘే దశముఖాంతకః
పాదౌ విభీషణ శ్రీదః పాతు రామోఽఖిలం వపుః 9
ఏతాం రామబలోపేతాం రక్షాం యస్సుకృతీపఠేత్
స చిరాయుః సుఖీ పుత్రీ విజయీ వినయీ భవేత్. 10
పాతాళ భూతల వ్యోమ చారిణశ్ఛద్మ చారిణః
న ద్రష్టుమపి శక్తాస్తే రక్షితం రామనామభిః 11
రామేతి రామభద్రేతి రామచంద్రేతి వా స్మరన్
నరో న లిప్యతేపాపై ర్భుక్తిం ముక్తిం చ విందతి. 12
జగజ్జైత్రైక మంత్రేణ రామనామ్నాభి రక్షితమ్
యః కంఠే ధారయే త్తస్య కరస్థాః సర్వసిద్ధయః. 13
వజ్రపంజర నామేదం యో రామకవచం స్మరేత్
అవ్యాహతాజ్ఞః సర్వత్ర లభతే జయమంగళం. 14
ఆదిష్టవాన్ యథాస్వప్నే రామరక్షా మిమాం హరః
తథా లిఖితవాన్ ప్రాతః ప్రబుద్ధో బుధకౌశికః 15
ఆరామః కల్పవృక్షాణాం విరామ స్సకలాపదామ్
అభిరామ స్త్రీ లోకానాం రామః శ్రీమాన్సనః ప్రభుః. 16
తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ
పుండరీక విశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ. 17
ఫలమూలాశినౌ దాంతౌ తాపసౌ బ్రహ్మచారిణౌ
పుత్రౌ దశరథస్యైతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. 18
శరణ్యౌ సర్వసత్త్వానాం శ్రేష్ఠౌ సర్వధనుష్మతాం
రక్షః కుల నిహంతారౌ త్రాయేతాం నో రఘూత్తమౌ. 19
ఆత్తసజ్యధనుషా విషుస్పృశా వక్షయాశుగ నిషంగసంగినౌ
రక్షణాయ మమ రామలక్ష్మణావగ్రతః పథి సదైవ గచ్ఛతాం. 20

సన్నద్ధః కవచీ ఖడ్గీచాపబాణధరో యువా
గచ్ఛన్ మనోరథాన్నశ్చ రామః పాతు స లక్ష్మణః. 21
రామో దాశరథిశ్శూరో లక్ష్మణానుచరో బలీ
కాకుత్స్థః పురుషః పూర్ణః కౌసల్యేయో రఘూత్తమః. 22
వేదాంత వేద్యో యజ్ఞేశః పురాణ పురుషోత్తమః
జానకీవల్లభః శ్రీమా నప్రమేయ పరాక్రమః. 23
ఇత్యేతాని జపేన్నిత్యం మద్భక్తః శ్రద్ధయాన్వితః
అశ్వమేధాధికం పుణ్యం సంప్రాప్నోతి న సంశయః. 24
రామం దూర్వాదళశ్యామం పద్మాక్షం పీతవాససం
స్తువంతి నామభిర్దివ్యైర్నతే సంసారిణో నరాః. 25
రామం లక్ష్మణ పూర్వజం రఘువరం సీతాపతిం సుందరం
కాకుత్స్థం కరుణార్ణవం గుణనిధిం విప్రప్రియం ధార్మికం
రాజేంద్రం సత్యసంధం దశరథతనయం శ్యామలం శాంతమూర్తిం
వందే లోకాభిరామం రఘుకుల తిలకం రాఘవం రావణారిం. 26

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః. 27
శ్రీరామ రామ రఘునందన రామ రామ
శ్రీరామ రామ భరతాగ్రజ రామ రామ
శ్రీరామ రామ రణకర్కశ రామ రామ
శ్రీరామ రామ శరణం భవ రామ రామ. 28
శ్రీరామచంద్ర చరణౌ మనసా స్మరామి
శ్రీరామచంద్ర చరణౌ వచసా గృణామి
శ్రీరామచంద్ర చరణౌ శిరసా నమామి.
శ్రీరామచంద్ర చరణౌ శరణం ప్రపద్యే. 29
మాతా రామో మత్పితా రామచంద్రః
స్వామీ రామో మత్సఖా రామచంద్రః

సర్వస్వం మే రామచంద్రో దయాళు
ర్నాన్యం జానే నైవ జానే న జానే. 30
దక్షిణే లక్ష్మణో యస్య వామే చ జనకాత్మజా
పురతో మారుతిర్యస్య తం వందే రఘునందనం. 31
లోకాభిరామం రణరంగధీరం
రాజీవనేత్రం రఘువంశ నాథం
కారుణ్యరూపం కరుణాకరం తం
శ్రీరామచంద్రం శరణం ప్రపద్యే. 32
మనోజవం మారుత తుల్య వేగం
జితేంద్రియం బుద్ధి మతాం వరిష్ఠం
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శరణం ప్రపద్యే. 33
కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం
ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలం. 34
ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహం 35
భర్జనం భవబీజానామర్జనం సుఖసంపదాం
తర్జనం యమదూతానాం రామ రామేతి గర్జనం, 36
రామోరాజమణిః సదా విజయతే రామం రమేశం భజే
రామేణాభిహతా నిశాచరచమూ రామాయ తస్మై నమః
రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్య దాసోఽస్మ్యహం
రామే చిత్తలయః సదాభవతు మే భో రామ మా ముద్ధర. 37
శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే. 38

ఇతి శ్రీ బుధకౌశికముని విరచితం శ్రీరామ రక్షా స్తోత్రం సంపూర్ణం.

T.T.D. Religious Publications Series No. 15
Price Rs. 35/-

ధర్మాన్ని కాపాడండి. ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు

Published by K.V. Ramanachary, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and
Printed at Students Offset, Tirupati on behalf of T.T.D.

మహర్షుల ప్రభావం, వారి లోకకల్యాణకామన, శబరి గురుపూజానిష్ఠ, వీటిని గురించే కొంతసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు రాముడు.

అనంతరం నప్తసాగరతీర్థంతో వారుభయులూ స్నానాలుచేసి, పితృదేవతలకు తర్పణాలు విడిచారు.

సౌమిత్రీ! ఇప్పుడు నా మనస్సు ప్రశాంతంగా వున్నది. మనకు చెడ్డరోజులు దాటినట్లే అనిపిస్తుంది. అద్యతనభావిలో శుభం కలగబోతున్నదని నా గుండె చెపుతున్నది. ఇక మనం పంపాసరోవరం వెంబడి నడిచి ఋశ్యమూక ప్రాంతానికి వెళ్ళాలి. అక్కడే కదా సుగ్రీవుడు మంత్రిమండలితో వున్నాడని కబంధుడు చెప్పాడు. అనగానే లక్ష్మణుడు ముందడుగు వేశాడు. రాముడు వెనువెంట సాగాడు.

సాగుతూ మార్గంలోని తీర్థాలలో స్నానంచేసి, పితృదేవతలను తృప్తిపరుస్తూ ఫల పుష్పభారావనత తరుశోభనూ, ఆ గాలిలో తిరిగే పక్షిసంతతుల కలస్వనాలనూ వింటూ సాగుతున్నారు. అల్లంతదూరంలో ఋశ్యమూకం దృగ్గోచరమయింది.

ప్రణష్ట మశుభం యన్మః
కల్యాణం సముపస్థితమ్ ।
తేన హ్యేతత్ ప్రహృష్టం మే
మనో లక్ష్మణ సంప్రతి ॥
హృదయే మే నరవ్యాఘ్ర
శుభ మావిర్భవిష్యతి ॥

అరణ్యకాండ సమాప్తం.